# “ జ్ఞాన సంజీవిని ”



ప్రజాపిత బ్రహ్మాకుమారీస్ ఈశ్వరీయ
విశ్వ విద్యాలయము

పాండవ భవనము, ఆబూ పర్వతము, రాజస్థాన్

తెలుగు అనువాదము : చామరాజపేట, బెంగళూరు.

ప్రకాశకులు :
తెలుగు అనువాద సాహిత్య విభాగము,
ప్రజాపిత బ్రహ్మాకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయము

తెలుగు అనువాదము :
చామరాజపేట, బెంగళూరు.

ద్వితీయ ముద్రణ :
మార్చి 2018


ముద్రణ :
ధనలక్ష్మీ ప్రింటర్స్,
రాజాజీ నగర్, బెంగళూరు.

కాపీ రైట్ :
ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము
పాండవ భవనము, ఆబూ పర్వతము, రాజస్థాన్.

పుస్తకములు లభించు స్థలము :
నెం.77, II మెయిన్, III క్రాస్,
చామరాజపేట, బెంగళూరు - 560018
Ph: 080-26603355, 6360041577.
E-Mail : bkbangalorecity@gmail.com

# రెండు శబ్దాలు

చంద్రమణి దాదీ నాకు బాల్యము నుండే తెలుసు. వారి బుద్ధి చాలా చురుకైనది. కర్మలు ఆచరించడంలో చాలా దక్షురాలు. 13 సంవత్సరాల వయస్సులోనే వారు కరాచీలో యోగ భట్టీ చేయించేవారు. హాస్టలులో ఉండే పిల్లలను చదివించేవారు. దాదీగారి లౌకిక కుటుంబము సింధ్‌లో చాలా ప్రసిద్ధి చెందిన ఉన్నతమైన కుటుంబము. ఇంత ఉన్నతమైన కుటుంబానికి చెందిన వారైనా వారిలో అభిమానపు అంశము కూడా ఉండేది కాదు. వారు అనంతమైన త్యాగమూర్తులుగా, నమ్రతకు ప్రతిరూపముగా ఉండేవారు. చాలా సహనశీలవతిగా, శక్తి రూపులుగా, నిర్భయులుగా ఉండేవారు. జ్ఞానము ఎలా వినిపించేవారంటే వినేవారి హృదయము పరివర్తనైపోయేది. చాలామంది బాబా పిల్లలను సమర్పణ చేయించేందుకు వారు నిమిత్తమయ్యారు. ప్రజలు వారంతకు వారే తయారవుతారు, కానీ మనము వారసులను తయారు చేయాలి అని అనేవారు.



మేము కరాచీలో ఉన్నప్పుడు వారు మా దాదీగా ఉండినారు. జానకీ నా అసిస్టెంటుగా ఉండాలని మమ్మా-బాబాలను అడిగారు. నేను దాదీలందరి నుండి చాలా నేర్చుకున్నాను. చంద్రమణి దాదీ నుండి కూడా చాలా నేర్చుకున్నాను. నా పై వారికి గుప్తమైన ప్రేమ చాలా ఉండేది. పంజాబులో మేము కలిసి సేవ చేస్తున్నంతవరకు సదా నన్ను ముందుంచారు. ఎప్పుడూ పెద్దరికాన్ని (సింహాసనము) స్వీకరించలేదు. నేను పెద్దగా ఉండాలనే కోరిక వారు ఎప్పుడూ ఉంచుకోలేదు. శివబాబా నుండి నేరుగా శక్తి తీసుకున్నారు. ఎప్పుడూ ఎవ్వరి



పైనా అసూయ పడలేదు. అందరితోనూ న్యారా, ప్యారా(భిన్నముగా, ప్రియము)గా ఉండేవారు. స్నేహముతో, మాతృత్వముతో, స్వంత జ్ఞానముతో చాలామందిని బాబాకు సమీపంగా తీసుకొచ్చారు. స్వయం ఎవరు ఎలా ఉంటారో, వారు అలాంటి విద్యార్థులనే తయారు చేస్తారని మమ్మా అనేవారు. చంద్రమణి దాది ఎవరినైతే పాలన చేశారో, వారిలో కూడా వారి లాంటి సంస్కారాలే ప్రత్యక్షముగా కనిపిస్తున్నాయి. సంఘటనను శక్తివంతముగా ఉంచుటలో, ఏకతా సూత్రములో బంధించుటలో వారు చాలా కుశలురు. ఒక్క కరతాళ ధ్వని చేస్తే పంజాబులోని వారంతా కలిసి వచ్చేటట్లు ఒక్కటిగా చేసి చూపించారు. బాబా పిల్లలందరినీ వారి విశేషతల ఆధారంగా ముందుకు నడిపించారు. కన్యలకు చాలా స్నేహము, శక్తులు నిండిన పాలననిచ్చారు. నిర్భయులై విపరీత పరిస్థితులలో కూడా సేవాకేంద్రాలను స్థాపించి సమస్యలను సమాధానములోకి పరివర్తన చేశారు. “నాదేమీ లేదు” అను మంత్రమును సదా పక్కాగా ఉంచుకున్నారు. తమ సర్వస్వము సఫలము చేసుకున్నారు. స్టేజి పైకి వెళ్లాలనే ఆలోచన కూడా ఉంచుకోలేదు కానీ ఉన్నతమైన స్థితిని తయారు చేసుకొని సేవ చేశారు. కనుక అంతిమ సమయములో కూడా తమ దేహము వదిలి వతనానికి వచ్చేశారన్న సంగతి కూడా తెలియనంతటి శ్రేష్ఠ గతి దాదీకి లభించింది. వారు ముందు కూడా వతనములో కూర్చుని ఉండినారు. దేహము వదలిన తర్వాత వతనాన్నే అనుభవం చేస్తూ చిరునవ్వుతో ఉండినారు. ముందు కూడా బాబాలో ఇమిడిపోయే ఉండినారు, దేహము వదిలిన తర్వాత కూడా బాబాలోనే ఇమిడిపోయారు. ఇటువంటి మధురమైన ప్రియమైన శక్తి రూపిణి, యజ్ఞానికి ఆధారమూర్తి, బాబాకు మరియు దాదీకి సదా ఆజ్ఞాకారులైన చంద్రమణి దాది ఉచ్ఛరించిన శక్తిశాలి మహావాక్యాల సంకలనము, జ్ఞాన సంజీవిని అను పుస్తకము పేరుతో మీ చేతులలో ఉంది. నిజంగా ఈ మహావాక్యాలు మూర్ఛితులను జాగృతము చేసి ఎగిరేకళలోకి తీసుకెళ్లేవి. వీటిని అధ్యయనము చేసి మీరు కూడా “పంజాబు సింహము” (షేర్-ఎ-పంజాబ్) అయిన చంద్రమణి దాది వలె శక్తిస్వరూపులుగా అవ్వాలి. ఇటువంటి శుభ కామనలతో,.....

బి.కె.జానకి

[illegible]



[illegible]

ఉంటాయి. ఒక స్టేట్(రాష్ట్రము)కు మాత్రమే రాజుగా అవ్వరాదు. విశ్వానికి రాజుగా అవ్వాలి. పంజాబుకు మాత్రమే రాజుగా అవ్వరాదు. అది నిమిత్తముగా ఉన్న కర్తవ్యము మాత్రమే. కర్తవ్యముగా భావించి నిభాయిస్తారు. మధువన నివాసిగా కమ్మని ఆజ్ఞాపిస్తే పంజాబు ఏమవుతుందో అని ఆలోచిస్తారా? లేదు. ఎంతవరకు ఎక్కడ డ్యూటీ(కర్తవ్యము) ఉందో, అక్కడ చాలా మంచిగా నిభాయించే తీరాలి.



## చక్రవర్తి రాజులలో మీ పేరు పక్కా అయిపోయింది కదా!

వీరు కూడా అన్ని వైపులా తిరిగి వచ్చారు. చక్రవర్తి రాజులలో పేరు పక్కా అయిపోయింది కదా! చాలా మంచిది. సేవ భవిష్యత్తును ప్రత్యక్షము చేస్తూ ఉంది. ఫలానా ఫలానా వారు అని పేర్లు అయితే చెప్పము కదా కాని సేవ స్వయమే ప్రత్యక్షం చేస్తూ ఉంది. ఎంతమంది చక్రవర్తి రాజులుగా తయారవుతున్నారు? ఒక చక్రములో అనేక ఆత్మలు తృప్తి చెందితే ఆ చక్రములో చక్రవర్తి రాజుగా అయ్యే వరదానము ఉంటుంది. ఎంతమంది ఆత్మలు సంతుష్టంగా అవుతారు? చాలా ఆత్మలు అవుతారు. ఆయువు ఎంత పెరుగుతూ ఉంటుందో, అంత ఎక్కువగా అన్ని వైపులా తిరుగుతూ ఉంటారు.



## అన్ని వైపులా తిరుగుతూ ఉండండి, ఆనందంగా ఉండండి

మీకు మంచి సీటు లభించింది. అన్ని వైపులా తిరుగుతూ ఉండండి, ఆనందంగా ఉండండి, ఇతులను కూడా ఆనందపరుస్తూ ఉండండి.



## విషయ సూచిక


రెండు శబ్దాలు ........................................................................ iii

చంద్రమణి దాదీ పట్ల అవ్యక్త బాప్‌దాదా మహావాక్యాలు ............................ V

తపస్సు చేయండి, ఫరిస్తాలుగా అవ్వండి ................................................ 01

ధారణ చేయువారే ధనవంతులు ................................................ 19

ఓ కుమారులారా, మేల్కొండి మరియు మేల్కొల్పండి ............................ 34

ఓ మాతలారా, లేవండి, అందరినీ ఉద్ధరించండి .................................. 54

కర్మల గుహ్య గతిని తెలుసుకొని కర్మాతీతులు కండి ............................ 81

మాయాజీతులే జగత్‌జీతులు .................................................. 95

సమర్పిత జీవితము ............................................................ 116

అవ్యక్త స్థితి ................................................................. 128

అంతర్ముఖతా శక్తి ............................................................ 143

సత్యమైన బ్రాహ్మణులు ........................................................ 150

సత్యమైన ప్రేమ ................................................................ 164

నాకు పంజాబు సింహమనే టైటిల్ లభించింది ........................................ 178

వతనము వైపు .................................................................. 202

దివ్య సందేశము ................................................................ 207

పుష్పాంజలి ..................................................................... 210


# తపస్సు చేయండి, ఫరిస్తాలుగా అవ్వండి

తపస్సు మనుష్యులకు చాలా సూక్ష్మ శక్తులను ఇస్తుంది. వాటిని ఆధ్యాత్మిక శక్తులు అని కూడా అంటారు. మనుష్యులకు ఎంత భౌతిక సుఖము లభించినా, ఆ సుఖాల ద్వారా వారు సంతోషించరు. ఎందుకంటే ఆ సుఖాలు అల్పకాలము మాత్రమే ఉంటాయి. ఈ ప్రపంచములో నేను సుఖంగా లేను, దు:ఖములో ఉన్నానని వారు అనుభవము చేస్తారు. ఇప్పుడిప్పుడే సుఖము, ఇప్పుడిప్పుడే దు:ఖము అనుభవిస్తారు. సంతుష్టముగా(తృప్తిగా) ఉండరు, అశాంతిగా ఉంటారు. ఎప్పుడైతే కలియుగ అంతిమములో మనుష్యులందరూ చాలా దు:ఖితులుగా అవుతారో అప్పుడు మన అందరి తండ్రి అయిన శివబాబా మన జీవితములో సుఖ-శాంతుల ఆశను పూర్తి చేసేందుకు వస్తారు. మన జీవితాలు ఆసురీ వృత్తుల ద్వారా పతితంగా అయిపోయాయి. పతితపావనులు మనందరి తండ్రి అయిన పరమాత్మ మాత్రమే. ఈ పతిత సృష్టిలో వచ్చేందుకు, అవినాశి జ్ఞాన యజ్ఞాన్ని రచించేందుకు వారి జతలో బ్రాహ్మణులు కూడా కావాలి. బ్రహ్మాబాబా జతలో బ్రాహ్మణులు కూడా యజ్ఞాన్ని రచిస్తారు. యజ్ఞము రచించుట వలన ఆసురీ వృత్తులు సమాప్తమైపోతాయి. ప్రపంచములో అనేక ప్రకారాల విఘ్నాలు వస్తాయి. వాటి ద్వారా మనుష్యులు వ్యాకులపడతారు. అవన్నీ బాబా రచించే యజ్ఞము ద్వారా సమాప్తమైపోతాయి. అందరి ఆశలు పూర్తి అవుతాయి. ఎప్పుడైతే కలియుగ అంధకార రాత్రిలో మనుష్యులందరూ దెబ్బలు తింటూ ఉంటారో, అందరి మనసులు ఏడుస్తూ ఉంటాయో, అప్పుడు దయా హృదయుడైన తండ్రి తన పిల్లల దు:ఖాన్ని చూసి సహించలేరు. అందువలన రాత్రిలో, అంధకార సమయములో ఆసురీ పతిత ప్రపంచములో స్వయం శివబాబా సాధారణ తనవులో వచ్చారు. శివబాబాకు అతిగుప్తమైన పుత్రుడు బ్రహ్మాబాబా. ఆది నుండి అంత్యము వరకు పూర్తి 84 జన్మలు తీసుకొని అంతిమ జన్మలోకి వచ్చినప్పుడు బ్రహ్మాబాబాను వారితో పాటు పిల్లలైన మనందరినీ శివబాబా దత్తత చేసుకొని యజ్ఞము రచించారు. శివబాబాతో పాటు బ్రహ్మాబాబా మరియు పిల్లలైన మనందరి అలౌకిక కజన్మ జరిగింది. కాని శివబాబా మనలను, బ్రహ్మాబాబాను తనవారిగా ఎలా చేసుకున్నారు? నిరాకారులు, జ్ఞాన సాగరులు, ప్రేమ సాగరులు, ఆనంద సాగరులైన సుప్రీమ్ తండ్రి ఎలా ప్రవేశమయ్యారు, బ్రహ్మాబాబాకు ఏ విధంగా అనుభవము చేయించారు, మనందరికీ కూడా ఏ

విధంగా అనుభవము చేయించారు - ఇదే యజ్ఞ ఇతిహాసము మరియు తపస్సు.

## తపస్సుకు ఆధారము వైరాగ్యము, ఏకాంతప్రియత

బ్రహ్మాబాబాగారి లౌకిక పేరు దాదా లేఖ్‌రాజ్. వారు వజ్ర వైడూర్యాల నగల వ్యాపారము చేసేవారు. పక్కా పూజారిగా, చాలా భక్తునిగా ఉండి అనేకమంది గురువులను కూడా ఆశ్రయించారు. వారికి " నా బుద్ధి అన్ని వైపులా తిరుగుతూ వెతుకుతున్నది," కనుక తపస్సు చేయాలనే ఆలోచన కలిగింది. వ్యాపారమనే అసత్య కార్యంలో ఎందుకు చిక్కుకోవాలి? అని వారికి ఆంతరికములో అనంతమైన వైరాగ్యము జన్మించింది. ప్రారంభంలో ఏకాంతములో ఏకాగ్రచిత్తులుగా అయ్యేందుకు బనారస్‌లో ఉన్న ఒక స్నేహితుని వద్దకు 6 మాసాల కొరకు వెళ్లారు. అక్కడ ఉండి వారు తపస్సు చేశారు. మొట్టమొదట వారు తన మనసును ఒక చిన్న బిడ్డ రూపంలో చూస్తూ తన మనసుకు అర్థం చేయించారు. ఈ మనసు అప్పుడప్పుడు హోదాలలో, అప్పుడప్పుడు సంబంధాలలో, అప్పుడప్పుడు ప్రపంచంలోని అనేక రకాలైన వైభవాల వైపు మాటిమాటికి పరుగెడుతూ ఉందని భావించారు. వారు ప్రారంభము నుండే తమ మనసుకు అర్థము చేయించేందుకు ప్రయత్నించారు. " ఓ మనసా! నీవెక్కడకు వెళ్తున్నావు? " అని మనసుతో ఆత్మిక సంభాషణ చేశారు. స్వయం యజమానిగా అయ్యి - ఓ నా మనసా! నీవెక్కడెక్కడ తిరుగుతున్నావు? దేహములోకి వెళ్తున్నావా? ఈ దేహము నీకు సుఖమివ్వడం లేదు, దు:ఖమిస్తోంది. దేహ ధర్మాలు దు:ఖమిచ్చేవి. ప్రారంభంలో బాబా ఏకాంతములో కూర్చుని ఇలా అనేక విధాలుగా మనసుతో మాట్లాడడం ప్రారంభించారు. బనారస్(కాశి)లో ఒక పెద్ద వృక్షముండేది. దాని క్రింద కూర్చుని వారు ఏకాంతములో తపస్సు చేశారు. పరివర్తన చెందే సమయము వచ్చినప్పుడు పరివర్తన చెందే సంకల్పాలే వస్తాయి. శివబాబా కూడా భూమిని బాగు చేయాల్సి వచ్చింది. ఎందుకంటే వారు పతిత శరీరములోకి రావాలి, వారి ఆసురీ భావాలను(వృత్తులను) పరివర్తన చేసి సతోగుణీ వృత్తిగా తయారుచేయాలి. అందుకొరకు మనసుతో ఆత్మిక సంభాషణ ద్వారా పరివర్తన ప్రారంభమయ్యింది.



శివబాబా తమ కొరకు బుద్ధి మరియు స్మృతి శక్తుల ద్వారా భూమిని తయారుచేశారు. బుద్ధి మరియు స్మృతి ఎక్కడెక్కడకు పోతున్నాయో నోట్ చేసుకున్నారు. ఎక్కడెక్కడ సంబంధాలున్నాయో అక్కడక్కడకు నా బుద్ధి, స్మృతులు వెళ్లినందున ఆసురీ వృత్తులు తయారయ్యాయని వారు గమనించారు. ఇక నేను పరివర్తనవ్వాలని బాబా అనుభవం(ఫీల్) చేశారు. ఇలాంటి లోతైన ఆలోచనలలో వారు కూర్చునేవారు. శివబాబా వారికి సాక్షాత్కారాల లిఫ్ట్ ఇచ్చారు. వాటి ద్వారా నీవు నా ఒకే ఒక అపురూపమైన కుమారునివి, నీవే ఈ ఆసురీ వృత్తి గల ప్రపంచాన్ని పరివర్తన చేయవలసి ఉంటుందని, నేను నీ తోడుగా ఉన్నానని చూపించారు. అలా పరివర్తన చేసేందుకు ప్రారంభములోనే బాబా(బ్రహ్మా)కు ఇప్పుడెటువంటి సమయము గడుస్తూ ఉందో, ఏమి చేయాలో, ఏమి చేయరాదో, సాక్షాత్కారము ద్వారా చూపించారు. ఈ పురాతన ప్రపంచము ఎలా వినాశనము అవ్వనున్నదో ఆ దృశ్యాన్ని కూడా బ్రహ్మాబాబా సాక్షాత్కారము ద్వారా చూశారు. అంతేకాక నూతన విశ్వము ఎలా స్థాపన కానున్నదో, నూతన విశ్వమంటే ఏమిటో మొదలైన విషయాలను బాబా సాక్షాత్కారంలో చూశారు. అంతేకాక యాదవులు తమ బుద్ధి ద్వారా ముసలాలు(మిసైల్స్) కనుగొని, వాటి ద్వారా తమ నాశనమును తామే ఎలా చేసుకుంటున్నారో, భారతదేశములో ఎలా ప్రకృతి ఆపదలు, గృహ యుద్ధాల ద్వారా పాత ప్రపంచమెలా సమాప్తమైపోతుందో కూడా సాక్షాత్కారములో చూశారు. ఇది ప్రాక్టికల్‌గా జరుగబోతుందని, ఈ ప్రపంచము పాతదైపోయింది, పాపం పెరిగిపోయింది, ప్రపంచము పతితమైపోయింది కనుక పతితులను పావనంగా చేయాలి, పూర్తి విశ్వాన్ని పరివర్తన చేయాలని, నేను మారితే విశ్వము మారిపోతుందని బాబా అర్థం చేసుకున్నారు. "నేను ఆత్మను, శరీరమును కాదు" నేను ఎంతో తేలికగా ఉన్నాను! అని అనుభవం చేశారు అంతేకాక " నేను తేలికైన ఆత్మను, పైకి వెళ్తున్నాను" అని కూడా అనుభవం చేశారు.

## తపస్సుకు ఆధారము – ఆత్మానుభూతి

శివబాబా మొట్టమొదట తపస్సుకు పునాది వేశారు. బ్రహ్మాబాబా తపస్సు ద్వారా నేను భారీగా లేను, నేను శరీరము కాదు, నేను జ్యోతిర్బిందువును అని అనుభవం చేశారు. లైటు(ప్రకాశము)ను, మైటు(శక్తి)ను. ఆ లైటు, మైటు పైకి

వెళ్తూ ఉంది. నా లైటు ఎలా పైకి వెళ్తూ ఉందని బాబా గమనించసాగారు. నెమ్మది నెమ్మదిగా వారికి ఆత్మానుభూతి జరిగినప్పుడు వారు తమ బంధు-మిత్రులకు ఉత్తరాలు వ్రాయడం ప్రారంభించారు. ధర్మపత్ని, కోడలు మొదలైన వారికి ఉత్తరాలు వ్రాశారు. ఓ యశోదా! నీవు ఆత్మవు, ఓ రాధికా! నీవు ఆత్మవు, నీవు ఎవరో నిన్ను నీవు తెలుసుకో అని వ్రాశారు. ఇంతకుమించి ఇంకేమీ వ్రాయలేదు. ఉత్తరాలలో వారు దేహ విషయాలు వ్రాయడమే మానేశారు. వారు - నేను ఆత్మను, నా మాదిరే వారు కూడా ఆత్మలే అని అర్థం చేసుకున్నారు. ఆ ఉత్తరము(జాబు)లో శక్తి ఉండేది. లౌకిక ఉత్తరాలలో దేహ సంబంధాలైన విషయాలు నిండి ఉంటాయి, దేహ భావాలే ఉంటాయి. కాని సాకార బాబా ప్రారంభం చేసిన ఉత్తరాలలో దేహ సంబంధాలుండేవి కావు, శక్తి ఉండేది. ధర్మము ఇంటి నుండే ప్రారంభమవుతుంది అనే(చారిటి బిగిన్స్ అట్ హోమ్/Charity Begins At Home) నాయనం అనుసారంగా వారు ఇంటి నుండే సేవ ప్రారంభించారు. మొట్టమొదట వారి నుండి ఇంటి వారికే శక్తి లభించింది. చేసి చేయించే(కరన్ కరావన్‌హార్) శివబాబా వారి ద్వారా చేయించారు. ఇంటివారు ఆ ఉత్తరాలు చూసినప్పుడు బాబాకు ఏమయ్యింది అని అనుకున్నారు. సంబంధాల గురించి, ప్రేమ గురించి ఏ ఉత్తరమూ వ్రాయలేదు! కేవలం నీవు ఆత్మవు అని మాత్రమే వ్రాశారు. మాతో గల సంబంధము, మా పై గల ప్రేమ ఏమైపోయింది! అని ఆలోచిస్తూ వారి కనులు ప్రేమ బాష్పాలతో నిండాయి. పతి పట్ల ప్రేమ అయితే ఉండనే ఉంటుంది కదా. జన్మ-జన్మాంతరాల నుండి సంబంధాల ప్రేమ ఉంటుంది. కాని ఇప్పుడు కర్మ బంధనాలు తెగిపోయే సమయము వచ్చింది. నిరాకారులైన శివబాబా సాకారమును తనవారిగా చేసుకొను సమయము వచ్చింది. వారి బుద్ధిని శుద్ధపరచి దివ్య బుద్ధినిచ్చు పని శివబాబాదే. బ్రహ్మాబాబా ఇంటికి వచ్చినప్పుడు వారి పత్నికి పతి తన ముందు నిల్చొని ఉన్నా ఆమెకు వారు పతిగా కనిపించలేదు. కోడలికి మామగారిగా కనిపించలేదు. ఇరువురి అంతరికము నుండి బాబా, బాబా అను శబ్దాలు వెలువడినాయి. ఎదుట ఎవరున్నారు? వీరైతే మా బాబా(తండ్రి) అని అనుకున్నారు. వారు ఆశ్చర్యంగా బాబాను చూడనారంభించారు. మా ఎదుట ఒక దివ్యమూర్తి నిలబడి ఉన్నారనే భావము వారికి కలిగింది. వీరు ఆ దాదా కాదు.



మీకు ఈ విషయము తెలిసి ఉంటుంది - బాబా సత్సంగంలో కూర్చుని ఉన్నప్పుడు వారి గురువు ఇంటికి వచ్చాడు. వారికి గురువుల పట్ల చాలా శ్రద్ధా భక్తులుండేవి. సభ నుండి లేచి ఒక చిన్న గదిలోకి వెళ్లి ఏకాంతములో కూర్చుండిపోయారు. ఆ క్షణంలో వారిలో శివబాబా ప్రవేశమైయ్యారు. బాబా ప్రవేశించు సమయము వస్తూనే, ఇంటిలో సత్సంగములో కూర్చుని ఉన్న నిమిత్తులైన పిల్లలకు ఎవరి ద్వారా యజ్ఞము ప్రారంభము కావలసి ఉండినదో వారికి కరెంటు లభించింది. మేము ఎవరి భక్తి చేస్తూ ఉండినామో, శ్రీకృష్ణుని భక్తి గాని, దేవతల భక్తి గాని ఆ రూపంలో బాబా నుండి మా వరకు అకస్మాత్తుగా కరెంటు ప్రవహించింది. బాబా కొంతమందికి సాక్షాత్కారము చేయించారు, కొంతమందికి కరెంటునిచ్చారు. పరోక్షంగా, అపరోక్షంగా రెండు విధాలుగా నేను వచ్చానని పిల్లలకు అనుభూతి చేయించారు. ఏ పిల్లలకైతే బాబా అనుభవము చేయించారో వారందరమూ బాబా ఇంట్లో కలుస్తూ వచ్చాము. ఆ సమయంలో ఒక చిన్న గదిలో బాబా గీతా జ్ఞానమునిచ్చేవారు. చాచా మూల్‌చంద్ గారితో కలిసి బాబా చాలా దానధర్మాలు చేసేవారు. బాబాకు దానీ-మహాదానీల సంస్కారముండేది. భూమి అయితే ముందే తయారైపోయింది. ఎప్పుడైతే శివబాబా ప్రవేశము జరిగిందో అప్పుడు మేమందరమూ బాబా వద్దకు వచ్చేశాము.

## తపస్సుకు ఆధారము సమర్పణ

మీకిది తెలిసే ఉంటుంది - నా లౌకిక సోదరి పతి శరీరము విడిచారు. ఆమెను తీసుకొని మేము బాబా వద్దకు వెళ్లాము. ఆ సమయంలో అక్కడ మాతేశ్వరిగారు, దాదీగారు కూడా ఉన్నారు. మా అందరి జ్ఞాన ఆయువు ఇంచుమించు సమానమే. చాలా కొద్ది సమయము తేడా మాత్రమే ఉంది. రెండు మూడు మాసాలలోనే మేమందరము బాబా వద్దకు ఆ చిన్న గదిలోకి వచ్చేశాము. ఆ సమయంలో కేవలం సోదరీలు మాత్రమే ఉండేవారు, సోదరులెవ్వరూ జ్ఞానములోకి రాలేదు. ప్రారంభంలో గమనించినా, శివబాబా కన్యలు, మాతల ద్వారా స్వర్గ మహాద్వారము తెరవవలసి ఉండినది. కనుక ఎవరి స్మృతి చిహ్నము యజ్ఞములో ఉందో, వారు మాత్రమే వచ్చి చేరుకున్నారు.

ఎక్కడ విఘ్నాలు వచ్చినా యజ్ఞము రచిస్తారు. ఈ సమయంలో మొత్తం విశ్వమంతటా విఘ్నాలు ఉన్నాయి. ఎక్కడ చూచినా అపవిత్రత ఉంది. జనులందరూ దు:ఖితులుగా ఉన్నారు. యజ్ఞములో స్వాహా చేయబడుతుంది. పిల్లలైన మాకు బాబా ఎటువంటి కరెంటునిచ్చారంటే మేము సెకెండులో సమర్పణైపోయాము. ఆ కరెంటుతోనే మేము బాబావారిగా అయ్యాము, బాబా మా వారిగా అయిపోయారు. ఆ అనుభవము మాకు ఈనాటి వరకు ఉండనే ఉంది. మొదటి అనుభవమేమిటని మీరు అడుగుతారు. అది మేము చేసిన తపస్సుకు ఫలము, భక్తికి ఫలము. భగవంతుడు వచ్చారని, క్రొత్త - క్రొత్త విషయాలు వినిపిస్తున్నారనే ఫీలింగ్ మాకు కలిగింది. జ్ఞానమంతా నూతనమైనది. అది గురువులు వినిపించిన జ్ఞానము కాదు. బాబా బ్రహ్మతో పాటు మమ్ములను కూడా ఒక్క క్షణంలో తమవారిగా చేసుకున్నారు. సాకార బాబా - నేను వారికి మురిపాల కుమారుడినే కాక వారి స్త్రీని కూడా అని అంటారు కదా. బాబా, బ్రహ్మ ద్వారా మమ్ములను కూడా గాఢంగా ఆకర్షించారు. మొదట బ్రహ్మబాబా నూతన జ్ఞానము ద్వారా వారిని గుర్తించి జ్ఞాన స్వరూపులుగా అయ్యారు. శివబాబాతో ఆజ్ఞాకారిగా, విశ్వాసపాత్రునిగా, నమ్మకస్థునిగా, సుపుత్రుని సంబంధము ప్రాక్టికల్‌గా జోడించి తపస్సు చేశారు. వారిని చూసి మేము కూడా తపస్సు ప్రారంభించాము. మేము ప్రారంభము నుండే బాబాను కంబైండు(సంయుక్త) స్వరూపంగా చూశాము. మాతా-పితల సంబంధంలో సంయుక్తంగా చూశాము. చివర్లో బాబా, బాప్‌దాదా అనడం నేర్పించారు. కాని ఆ సమయంలో శివుని గురించి గాని, బ్రహ్మ పేరు గాని తెలియదు. కాని వీరు మాతా-పితలని, మా పెద్దవారని, భగవంతుడని అనుభవమయ్యేది. మాతా-పితల సంబంధాన్ని బాబా అనుభవం చేయించారు. ఎందుకంటే వారు రచనను రచించవలసి ఉండినది, మమ్ములను కూడా సమర్పితము చేయించాల్సి ఉండినది. మొదట మాకు కూడా బాబా మాతా-పితల సంబంధాన్ని సాక్షాత్కారము చేయించారు. కేవలం సాక్షాత్కారమే కాదు, ప్రత్యక్షంగా కూడా (ఎదురెదురుగా) చూపించారు. ఆ మాతా-పితలకు మేము పిల్లలమని అనుభవం చేయించారు. కనుక మొట్టమొదట ఏ పిల్లలైతే వచ్చారో ఒక్క క్షణంలో బ్రహ్మబాబా, శివబాబావారిగా అయ్యారు. ఒక్క సెకెండులో బాబావారిగా



అయిపోయారు. ఆ సమయంలో మాకేమీ తెలియదు, స్పష్టమైన జ్ఞానము కూడా లేదు అయినా మేము సమర్పితమైపోయాము. ఇతడు ఎవరు? అని బాబా అనుభవం చేయించారు. ఎప్పుడైతే అనుభవమయ్యిందో పరివారము పరివారమంతా సమర్పితమైపోయారు. ఎలాగైతే బాబా పరివారమంతా సమర్పితమైపోయారో, అలా మా లౌకిక పరివారంలో కూడా అందరము సమర్పితమైపోయాము.

నూతన విశ్వ స్థాపనకై మొదట సమర్పిత జీవితము అవసరము. ఎంతవరకు మనకు సమర్పిత జీవితముండదో, అంతవరకు సత్యమైన తపస్సు జరగజాలదు. అంతవరకు నాది - నాది అను కర్మ బంధనాల సంకెళ్ళు వేయబడే ఉంటాయి. అందులో చిక్కుకొని పడి ఉన్నారు. వాటి నుండి విడుదల కోరుకుంటారు. భగవంతుని పై వారికి ప్రేమ ఉంది కాని కర్మబంధనాల సంకెళ్ళు, కర్మల లెక్కాచారాలు, ఆసురీ వృత్తులు వారిని లాగుతాయి. కనుక శివబాబా అన్నారు - పిల్లలూ, కేవలము శరీరముతో సమర్పితమవ్వడం కాదు కాని మనసు, బుద్ధి ద్వారా కూడా సమర్పితమవ్వాలి. ఈ శక్తులు అందరి వద్ద ఉన్నాయి. మీ వద్ద కూడా ఉన్నాయి. ఆ మనసును, ఆ శక్తిని నాకిచ్చేయండి. నేను ఎవరిని, ఎక్కడ నుండి వచ్చాను, ఎక్కడకు వెళ్లాలి, ఏమి చేయాలి అను స్మృతి స్వరూపులుగా అవ్వండి. మీ అంతకు మీరే ఆలోచించండి. మీ మనసును కూడా నాకు సమర్పితము చేస్తే, స్మృతి స్వరూపంగా అవుతారు. అప్పుడు మీ కర్మ బంధనాలు సమాప్తమైపోతాయి. స్వయం మీరూ ఎగురుతారు, ఇతరులను కూడా ఎగిరిస్తారు. ఈ తాళ్ల నుండి, బంధనాల నుండి తేలికైపోతారు ఎందుకంటే మీరు ఆత్మలు. అత్యంత తేలికైన జ్యోతిర్బిందు స్వరూపులు. శరీరము వేరు, ఆత్మలైన మీరు వేరు. నడుస్తూ - తిరుగుతూ మీకు మీరు - నేను ఎవరిని? అని ప్రశ్నించుకోండి. మీకు మీరే జవాబు పొందుకోండి.

## తపస్సుకు ఆధారము – అలౌకికత

బాబా సత్సంగము చేయునప్పుడు ఓం ధ్వనిచేస్తూ ఉండేవారు. మా అందరి పేర్లు చెప్పేటప్పుడు, జాబులు వ్రాయునప్పుడు మా పేర్లకు ముందు ఓం అని జోడించేవారు. ఉదాహరణానికి ఓం రాధ, ఓం బాబా ఇత్యాది. ఉత్తరాలు

వ్రాయునప్పుడు కూడా నా పిన్నిగారు, నా వదినగారు అని వ్రాయకండి అని కూడా చెప్పేవారు. నూతన ప్రపంచ స్థాపనలో ఎలాంటి దేహ సంబంధము ఉండదని, కనుక నిజ ఆత్మా......... అని వ్రాయమనేవారు. మీరు కూడా ఒరిజినల్(వాస్తవికము, మూలము)గా ఆత్మలు, పరమాత్ముని పిల్లలు, సర్వాత్మల తండ్రిని నేనే. అందువలన నిజ ఆత్మను చూడమని చెప్పాను. మొదట ఆత్మను చూడండి, శరీరాన్ని చూడకండి - ఈ అభ్యాసము చేయండి. చివర్లో మమ్ములను కూర్చోబెట్టి బాబా ఓం ధ్వని చేయునప్పుడు, ఈ శరీరము వేరైపోయినట్లు మాకు అనుభవమయ్యేది. లైటు - మైటు ఆత్మలైన మేము మా లైటులో కూర్చుని ఉన్నామనిపించేది. మేము లేచేవారము కాదు, లేవాలని అనుకున్నా లేవలేకపోయేవారము. ఆంతరికంలో లోతైన శాంతిలోకి వెళ్లిపోయేవారము. దీని వలన మా కోమలమైన మనసు లోలోపలే పరివర్తన చెందుతూ వచ్చింది. నిజంగా నేను పవిత్రమైన ఆత్మను అనే ఫీలింగ్(భావము) కలిగేది. బాబా మా ముందు కూర్చునేవారు. ఆత్మలమైన మేము లైటు - మైటులతో స్నానము చేస్తున్నామని అనుభవమయ్యేది. ఆత్మ కడిగి వేయబడుతూ ఉంది, ఆసురీ వృత్తులు పరివర్తనవుతూ ఉన్నాయని అనుభవమయ్యేది. ప్రారంభము నుండి ఇప్పటి వరకు బాబా మాకు కరెంటు ఇచ్చారన్న ఫీలింగు అవుతూనే ఉంది. మా ద్వారా ఇంత పెద్ద విశ్వమంతటికి ఎలా సేవ చేయిస్తున్నారు! మేము చదువుకున్నవారము కూడా కాదు. సత్సంగములోకి వెళ్తూనే బాబాలో మైటు(శక్తి) చూశాము. బాబాను చూచిన తర్వాత మా వద్దకు లౌకికత రానే లేదు. లౌకిక సంబంధీకులంతా జ్ఞానములోకి వచ్చారు కానీ మాకు పరస్పర లౌకిక సంబంధాల స్మృతి రానే లేదు, లేనే లేదు. లౌకికములో మా ఇంటిలోని పురుషులు బ్రాంది తాగేవారు, మాంసము తినేవారు, సినిమాలు చూచేవారు, సిగరేట్ త్రాగుట మొదలైనవన్నీ చేసేవారు. అవి వదిలేసేందుకు వారికి ఎక్కువ సమయము పట్టలేదు. ఈ రోజులలో చెడు అలవాట్లను వదిలేందుకు మనుష్యులకు సమయము పడ్తుంది. ఆ సమయంలో ఎలాగైతే బ్రహ్మాబాబా ఒక్క క్షణంలో మారిపోయారో, మనస్సు-బుద్ధి ద్వారా సమర్పితమైపోయారో అలా మేము కూడా ఆంతరికములో మనసు - బుద్ధి ద్వారా మారిపోయాము. భలే మేమందరము ఇంటి నుండి వచ్చేవారము, కానీ మా మనసు బాబా



జతలో ఉండేది. భోజనము కూడా బాబా కంటే ముందు తినేవారము కాదు. బాబా తిన్న తర్వాతనే మేమంతా తినేవారము! లేస్తున్నా - కూర్చుంటున్నా ఏ పని చేస్తున్నా మా మనసు బాబా పైననే లగ్నమై ఉండేది. తర్వాత యజ్ఞ స్థాపనా కార్యంలో మేమందరము పూర్తి పవిత్రంగా ఉండినాము. ప్రపంచము ఈ విషయాలు అర్థము చేసుకోలేదని మీకు తెలుసు. పవిత్రంగా ఉండడం క్రొత్త విషయముగా ఉండేది. సమాజములో ఆధ్యాత్మిక సేవ చేసేందుకు సోదరీలు ముందుకు వచ్చారు, పవిత్ర జీవితాన్ని అవలంభించారు - ఇది అంతకు ముందెప్పుడూ జరగలేదు. దీనిని ఆచరణలో చూచి సింధ్‌లోని వారు ఆశ్చర్యచకితులేమో అయ్యారు. కానీ పోను పోను పవిత్రత కొరకు విరోధము, వ్యతిరేకత కూడా ప్రారంభమయ్యింది. బాబాను మేము సదా యోగయుక్తంగా, అచంచలంగా, స్థిరంగా చిరునవ్వుతో ఉన్న రూపంలోనే చూశాము. సదా గుప్త తపస్సు చేయు రూపంలో చూశాము. పిల్లలూ! నేను కొద్ది రోజులు కరాచికి పోయి వస్తాను అని అనేవారు. ముఖ్యంగా ఏకాంతము కొరకు బాబా రాత్రికి రాత్రే కరాచీకి వెళ్లేవారు. మాకు తెలిసేదే కాదు.

## తపస్సుకు ఆధారము – ఏకాగ్రత

బాబా మాకు తపస్సు చేయమని చెప్పేవారు కాదు. కానీ ఏకాంతములో కూర్చుని తపస్సు చేసేవారము. ఏకాంతములో కూర్చుని తపస్సు చేయడం వలన ఏకాగ్రత వస్తుంది. ఎంతవరకు ఏకాంతముగా ఉండమో అంతవరకు మనసు ఏకాగ్రము కాజాలదు. బాబాలో ఈ అభ్యాసము ప్రారంభము నుండే ఉండడం మేము చూశాము. పని చేస్తున్నప్పుడు కూడా బాబా తమ మనసును చాలా ఏకాగ్రము చేసేవారు. ఇది కూడా మేము చూశాము. ఎలాగైతే బ్రహ్మాబాబా "నేను శివభోళానాథుని చూశాను, పొందుకున్నాను" అని అన్నారో అలా మేము కూడా శివభోళా భండారీ సాకార బ్రహ్మాలో ప్రవేశించి వారిని మా కొరకు స్యాంపుల్‌గా చేయడం మేము చూశాము, మేము పొందాము. జ్ఞానమేమో శివబాబాది, కానీ ఆ జ్ఞానము ద్వారా స్యాంపుల్‌గా తయారయ్యింది బ్రహ్మాబాబా. అప్పట్లో బ్రహ్మా అను పేరు లేదు. తర్వాత శివబాబా బ్రహ్మా అని పేరు పెట్టారు. మొదట మేము వారిని 'ఓం బాబా' అని పిలిచేవారము. ఆ సమయంలో

బాబా వద్ద ఏ పిల్లలైతే ఉండేవారో, వారిని మొదట ఓం అన్న తర్వాత వారి పేర్లతో పిలిచేవారము. ఎందుకు? ఎందుకంటే మొదట వారి దేహము గుర్తు రాకుండా ఓం అనగా, 'నేను శుద్ధ స్వరూప ఆత్మను, అనాది కాలము నుండి నేను జ్ఞాన స్వరూపాన్ని, ప్రేమ స్వరూపాన్ని, ఆనంద స్వరూప ఆత్మను' అని గుర్తు వచ్చేందుకు అలా పిలిచేవారము. బాబా అందరికీ ఆత్మల అసలు స్వరూపము యొక్క జ్ఞానమునిచ్చారు. ఆత్మయే పుణ్యాత్మగా, అదే పాపాత్మగా ఎలా అవుతుందో తెలిపారు. ఆత్మ యోగము, తపస్సుల ద్వారానే పుణ్యాత్మగా అవుతుంది. యోగీ ఆత్మ పవిత్రమైపోతుంది, శుద్ధమైపోతుంది. ఫరిస్తా(సూక్ష్మ దేవత)గా కూడా అయిపోతుంది. అందువలన ప్రారంభము నుండే బాబా తమ పిల్లలైన మాకందరికీ ఇది నేర్పించి తపస్సు చేయించారు. ఎలా మాట్లాడాలో, ఎలా చూడాలో మొదలైనవన్నీ నేర్పించారు అనగా ఆత్మగా తయారై ఆత్మను ఎలా చూడాలో, ఆత్మతో ఎలా మాట్లాడాలో నాకు నేర్పించారు. ఒకే ఒక పాఠము 'నిజ ఆత్మ'(నిశ్చయముగా నేను ఆత్మను), అందువలన మేము ఎవ్వరి అవగుణాలను చూడనే లేదు. మాకు ఈ 'నిజ ఆత్మ' అనేది అభ్యాసమైపోయింది. తపస్సు వలన మేము ఎవ్వరి అవగుణాలనే మురికిని మాలో నింపుకోలేదు, ఆ మురికి మాలోకి రాలేదు. ఇది తపస్సు వలన మాకు కలిగిన చాలా గొప్ప లాభము. అందువలన మాకు అందరి పై ప్రేమ ఉండేది. బాబా తనదే కాక తన పరివారములోని వారందరి తనువు-మనసు-ధనము-జనము సర్వస్వమూ సేవలో వినియోగించారు. తమ పరివార సర్వస్వమును, అంతేకాక మా సర్వస్వమును కూడా సేవలో ఉపయోగింపజేశారు. మా అందరి స్యాంపుల్ బ్రహ్మాబాబా.

## తపస్సుకు ఆధారము మనసు - బుద్ధి ద్వారా సేవ చేయడం

శివబాబా బ్రహ్మా అని నామకరణము చేసినప్పుడు, ఈ బ్రహ్మా నా పుత్రుడు, ఇతని ద్వారా నేను కన్యలు, మాతలైన మిమ్ములను రచించాను అని చెప్పారు. స్వర్గ ద్వారాన్ని కన్యలు, మాతలైన మీరు తెరవాలి. నూతన ప్రపంచ స్థాపనను మాతలు, కన్యలైన మీ ద్వారా చేయించాలి అని చెప్పారు. అందువలన పవిత్రంగా ఉండుటలో ప్రపంచము నుండి ఎన్ని పరీక్షలు - పరిస్థితులు వచ్చినా,



మేము దృఢ నిశ్చయ బుద్ధితో, అచలంగా, స్థిరంగా ఉండినాము. నిశ్చయ బుద్ధి విజయంతి. బాబాలో దృఢ నిశ్చయముండేది. భూమి బ్రద్దలైనా ధర్మాన్ని వదలరాదు(ధరత్ పరియే, ధర్మ్ నా ఛోడియే). ధారణలు వదలరాదు - ఇది మాలో పక్కాగా ఉండేది. మేము బ్రహ్మాబాబా తపస్సు చేస్తూ ఉండడం చూచినప్పుడు మేము లోపల కూర్చొని కూడా తపస్సు చేశాము, సేవ చేస్తూ కూడా తపస్సు చేశాము. మనస్సు-బుద్ధి ద్వారా సేవ చేయడం, ఇతరులను బాబావారిగా తయారు చేయడం, దయ కలిగి ఉండడం, సహనం చేయడం ఈ గుణాలన్నీ సేవతో పాటు నింపుకుంటూ పోయాము. బాబా మమ్ములను దత్తత తీసుకొని చదివించారు. చదివిస్తూ చదివిస్తూ సేవ చేయించారు. శ్రేష్ఠ కర్మలు నేర్పించారు. ప్రాక్టికల్‌గా మనసు, మాట, కర్మ మూడింటిని పవిత్రంగా చేశారు. బాబా మాతో రాత్రింబవళ్ళు సేవ చేయించారు. ఒకసారి సాహిత్యము తయారు చేయు సేవ, కల్ప వృక్షము, త్రిమూర్తి చిత్రాలను తయారు చేయు సేవ, మరోసారి వాటిని ఇతర చోట్లకు పంపు సేవ ఈ విధంగా బాబా పిల్లలతో రాత్రింబవళ్లు సేవ చేయించారు. రాజకీయ నాయకులు, ధర్మనేతలు, గణనీయ వ్యక్తులు మొదలైన వారికి సందేశము పంపు సేవ బాబా చేయించారు. మహాత్మా గాంధీ, ఎలిజిబెత్ మహారాణి వంటి గొప్ప గొప్ప వారికి బ్రహ్మాబాబా, శివబాబాగారి సందేశాన్ని పంపించారు. సందేశములో బాబా "ఇప్పుడు లేకుంటే మరెప్పుడూ లేదు, వినాశ ఘడియలు అతిసమీపంలో ఉన్నాయి" అని వ్రాసేవారు. పిల్లలైన మాతో బాబా సేవ చేయించారు. ఇందువలన మా సంకల్పాలలో కూడా పరివర్తన త్వరగా వచ్చేసింది.


## తపస్సుకు ఆధారము - తక్కువ నిద్ర, తేలిక భోజనము

సేవతో సంకల్పాలు పరివర్తనౌతాయి. సేవతో పాటు బాబా తపస్సు కూడా అభ్యాసము చేయించారు. దీని వలన 50-60 మంది సందేశ పుత్రికలు తయారయ్యారు. వీరికి ధ్యానములో వెళ్లే పాత్ర, సాక్షాత్కారము చేసుకునే పాత్ర లభించింది. వారిలో నుండి 5-6 మంది మాకు తపస్సును గురించిన సందేశాన్ని తీసుకొచ్చేవారు. తపస్సు ఎలా చేయాలో మాకు సందేశము లభించేది. సందేశములో - మీరు 3 సార్లు తింటారు, శరీరము భారమైపోతుంది కనుక

తేలికగా ఎలా ఉంటారు? ఒక్కసారి మాత్రమే తినండి, అప్పుడు అనుభవము చేస్తారు. మీకు నిద్ర రాదు. మనస్సు భారము కాదు, తేలికగా ఉండి బాబా వద్దకు ఎగిరిపోతారు, మీ ఇంటికి వెళ్లిపోతారు. ఇంటిని మర్చిపోతే బాబాను మర్చిపోయినట్లే ఇది బాబాను కలుసుకునే సంగమ యుగము. సందేశ పుత్రికలు తపస్సు చేసేవారి పేర్ల పట్టీని తీసుకొచ్చేవారు. ఫలానా ఫలానావారు అఖండ తపస్సు చేయాలని సందేశము వచ్చేది. మేము నిదురించేవారము కూడా కాదు, రాత్రి రెండు గంటలు మాత్రమే నిదురించి మళ్లీ తపస్సులో కూర్చునేవారము. నిద్రను ఎలా జయించాలో బాబా మాకు అభ్యాసము చేయించేవారు. బాబా, మాకు నిద్రాజీత్ పిల్లలారా! - ఎక్కువగా నిద్రించుట తమోగుణీ లక్షణము కనుక చాలా సేపు నిద్రించకండి అని చెప్పేవారు. బాబా మాకు తేలికగా తినమని, 2 గంటలు మాత్రమే నిద్రించమని ప్రోగ్రాము ఇచ్చారు. ఎవరికి తపస్సు చేసేందుకు ప్రోగ్రాము లభించేదో వారికి ఒక పెద్ద గది ఇవ్వబడేది. సందేశ పుత్రికలు మా టీచర్లగా అయ్యేవారు. వారు ప్రోగ్రామంతా వ్రాసి బాబాకు ఇచ్చేవారు. ఉదయము పూట పాలు, రాత్రి పూట పాలు, పగలు తెల్ల భోజనము ఇచ్చేవారు. జీలకర వేసిన ఉర్లగడ్డ, తెల్లని అన్నము, పెసరపప్పు ఇంత మాత్రమే మా భోజనము. ఇందులో కారము గాని, మసాలాల వంటి వస్తువేదీ ఉండేది కాదు. ఎందుకంటే మనసు పై అన్న ప్రభావము పడుతుంది. అందువలన సాధారణ సాత్విక భోజనము(అన్నము) స్వీకరించు అవసరము చాలా ఉంటుంది. కారము, మసాలాలు తమోగుణానికి చెందినవి. వీటి చెడు ప్రభావము మనసు పై చాలా పడుతుంది.

మనము మనస్సును పరివర్తన చేసుకోవాలంటే, బుద్ధిని పరివర్తన చేసుకోవాలంటే భోజనము కూడా పవిత్రమైనది, మన చేతులతో తయారు చేసుకున్నది, యోగుల చేత చేయబడిన, ఆత్మిక ప్రేమతో తయారు చేయబడిన భోజనము కావాలి. బ్రాహ్మణుల చేతితో చాలా ప్రీతిగా తయారు చేయబడిన భోజనము కావాలి. నేను కూడా యజ్ఞములో త్వరగా సమర్పితమయ్యాను. బాబా జ్ఞానములోకి వచ్చిన సంవత్సరము లోపలే మా ఇంటి వారందరము జ్ఞానములోకి వచ్చేశాము. ఈ మధ్యలోనే బాబా పిల్లల కొరకు హాస్టల్(వసతి గృహము) తెరిచారు. బాబా పిల్లల పాలన ఎలా చేయించారో చిత్రాలలో మీరు




హాస్టల్‌లో ఉన్న పిల్లలను చదివిస్తున్న దాదీ చంద్రమణిగారు

చూసి ఉంటారు. 5 నుండి 12 లోపు వయస్సు గలవారు హాస్టలులో ఉంటారు. వారి ఖర్చు వారి తల్లిదండ్రులు భరించే అవసరం లేదు అని బాబా చెప్పారు. బ్రహ్మాబాబా మాతల కమిటీని తయారు చేసి తమ సర్వస్వాన్ని సమర్పణ చేశారు, ఖర్చంతా దాని నుండే నడిచేది. మాకందరికీ ఎవ్వరూ ఏమీ ఇవ్వరాదని, అందరి పాలన శివబాబా యజ్ఞము నుండి జరుగుతుందని తెలిపారు. రుద్ర యజ్ఞంలో అందరికంటే ముందు బ్రహ్మాదంతా స్వాహా అవుతుంది, సేవలో ఈ బ్రహ్మాదే ఉపయోగపడ్తుంది. ఆ యజ్ఞ అన్నము మరియు పాలన మమ్ములనందరిని స్థిరంగా, చలించకుండా తయారు చేసింది. ఆ సమయంలో ఎన్ని విఘ్నాలు వచ్చాయి! మా వారి నుండే, మా సమాజంలోని వారి నుండే అనేక పరీక్షలు వచ్చాయి. ఇవి విఘ్నాలా, మాయనా! అనేదే మాకు తెలియలేదు. ఈ రోజు మాయ ఎలా జనుల మనస్సులో తుఫాను రూపంలో వస్తుందో అలా మాకు కూడా వచ్చి ఉండవచ్చు, కాని మాకు తెలియనే లేదు. ఎందుకంటే మా ఎదుట చాలా గొప్ప శక్తి అయిన బ్రహ్మాబాబా ఉండినారు. వారిలో బాప్‌దాదా కలిసి ఉండేవారు.

## తపస్సు అనగా మీ జతలోనే కూర్చుంటాను, మీతోనే మాట్లాడ్తాను

మేము కరాచీకి వచ్చినప్పుడు బాప్‌దాదా మా జత జతలోనే(అంగ్ సంగ్) ఉండేవారు. మేము బాబాను గుర్తించిన కొలది వారి జత జతలో తపస్సు చేయసాగాము. మీ జతలోనే కూర్చుంటాను, మీతోనే మాట్లాడ్తాను, ఇది సాకారంలో ప్రాక్టికల్‌గా ఉండేది. ఉదయము నుండి రాత్రి వరకు మేము బాప్‌దాదా జతలోనే ఉండేవారము. మా దృష్టిలో సదా బాబా ఇమిడి ఉండేవారు. కూరగాయలు తరుగునప్పుడు కూడా బాబా మా జతలోనే ఉండేవారు. కరాచీలో ఉదయము పరుగెత్తేవారము. అక్కడ కూడా బాప్‌దాదా మా జతలోనే ఉండేవారు. మా దినచర్య పూర్తిగా బాప్‌దాదా జతలోనే ఉండేది. కనుక మేము వారిని ఎలా మరువగలము! బాబా మా కనులలో ఇమిడిపోయారు. ఆ సమయము ఇముడ్చుకునే విషయానికి చెందినది. బ్రహ్మాబాబా తమ తనువు, మనసు, ధనములను కూడా శివబాబా సేవలో, పిల్లల సేవలో ఉపయోగించారు. ఇది ప్రేమే కదా. శివబాబాకు ప్రేమతో సమర్పణైపోయారు. సాకార బాబా ఏదైతే సేవ చేశారో, అది ఈ రోజుకు కూడా మమ్ములను ఆకర్షిస్తుంది(లాగుతూ ఉంది). వారు భికారిగా అయ్యారు. తమ వద్ద ఏమీ ఉంచుకోలేదు. సర్వస్వాన్ని బాబాకు ఇచ్చేశారు. స్వయం(ఖుద్) ఖాళీ చేతులతో ఉండినారు. సర్వస్వాన్ని భగవంతునికి(ఖుదాకు) అర్పణ చేసేశారు. ప్రపంచంలో మేము ఇటువంటి వారినెవ్వరినీ చూడలేదు. మనుష్యులు తమ కొరకు ఏదో కొంత ఉంచుకుంటారు. జబ్బు చేసినప్పుడు గానీ, పేదరికము వచ్చినా ఎప్పుడో ఒకప్పుడు ఆపత్కాలము వచ్చినా ఎంతో కొంత బ్యాంకులో తమ కొరకు ఉండాలని అనుకుంటారు. బాబా తన మొత్తము ఆస్తిని, ధనమును, సంపదను, ఇంటిని, పరివారాన్ని సర్వస్వాన్ని శివబాబాకు అర్పణ చేసేశారు. భికారిగా అవ్వకుంటే రాకుమారునిగా అవ్వలేరు. బాబా మురళీయే భికారి నుండి రాకుమారుడు అను విషయం పైననే నడిచేది. నాది-నాది అను మోహమంతా సమాప్తమైపోయింది. నాదంటూ ఏమీ లేదు. నాను బాబావారిని, బాబా నావారు అంతే, ఇంకెవ్వరూ లేరు. మా ఆధారము కూడా వారే. మాకు ఇంకేమీ కనిపించేదే కాదు. ప్రపంచమంతటినీ మర్చిపోయాము. మాకు ఒకసారి 15 రోజులు, ఒకసారి 1 మాసానికి, ఒకసారి 2 మాసాలకు, ఒకసారి 3 మాసాలకు తపస్సు చేసేందుకు



ప్రోగ్రాము వచ్చేది. సందేశ పుత్రికలు వతనము నుండి ప్రోగ్రాము తీసుకొచ్చేవారు. ఒకసారి బాబా, అందరూ కలిసి తపస్సు చేయమని చెప్పారు. వ్యక్తిగత తపస్సు అయితే గదిలోనే కూర్చుని చేసేవారము. ఇది కాక అందరినీ కలిపి ఒకసారి తపస్సు చేయించారు. మౌనంగా కూడా ఉండమన్నారు. అందరి పనులు మానిపించి(బంద్ చేయించి) మౌనాన్ని ధారణ చేయించారు. చాలామంది సోదరీ-సోదరులము ఉండినాము. దాదీలందరికీ వారి వారి డిపార్టుమెంట్లు ఉండేవి. బాబా అన్నారు - ఏమీ పర్వాలేదు బాబా కూర్చుని ఉన్నారు, మీరు మౌనంగా ఉండి తపస్సు చేయండి. కార్య వ్యవహారాలు చిన్న చిన్న పిల్లలకు అప్పగించారు. పిల్లలు కూడా చాలా బాగా నేర్చుకొని కార్య వ్యవహారాలన్నీ నడిపించారు! ఇది కూడా ఆశ్చర్యకరమైన విషయమే కదా.

## తపస్సు అనగా స్వయం అనాది స్వరూపంలో ఉంటూ ప్రతీ ఆత్మను అనాది స్వరూపంలో చూడడం

తపస్సు చేసే విధానము కూడా బాబా మాకు నేర్పించారు. ఒకే విధంగా కూర్చుని తపస్సు చేయండి, ఎలా అంటే అలా కూర్చోరాదు అని మాకు కూర్చోవడం కూడా నేర్పించారు. బుద్ధి ఏకాగ్రంగా ఉంచుకోండి అని చెప్పారు. అవయవాలన్నీ కూడా ఏకాగ్రముగా ఉండాలి. ప్రతీ అంగము శుద్ధముగా ఉండాలి. బహుశా దాదీలు తపస్సు చేసే ఫోజును మీరు చూసి ఉండవచ్చు. పూర్తి నిటారుగా కూర్చునేవారు. రెండవ నియమము - ఆత్మగా తయారై ఆత్మను చూడడం. అలా చూస్తూ ఇరువురి బుద్ధి యోగము బాబాతో జోడింపబడి ఉండాలి. ఒకరు మరొకరి అనాది సంస్కారాలను, స్వరూపాన్ని చూస్తూ బాబా పిల్లలమని భావించాలి. శుద్ధమైన ఆత్మ, ప్రేమ స్వరూప ఆత్మ రూపంలో దృష్టితో దృష్టి కలిపి దృష్టి ఇవ్వవలసి వచ్చేది. కనులు మూసుకోరాదని బాబా చెప్పేవారు. ఇది కర్మయోగము. కర్మయోగములో కనులు మూసుకోరు. తెరవబడి ఉంటాయి. బాబా తెరవబడిన కనులతో అభ్యాసము చేయించారు. ఆత్మ జ్ఞానమును అంతరికములో ఆలోచిస్తూ జ్ఞాన యుక్త దృష్టితో ఎదుట ఉన్న ఆత్మను చూడండి. ఈ ఆత్మ ఎంత ప్రియమైనది! ఈ ఆత్మ శివబాబా సంతానము. మేమంతా ఒకే తండ్రి పిల్లలము. ఒకే ఈశ్వరీయ పరివారానికి చెందినవారము - ఇలా లోలోపల

ఆలోచిస్తూ ఇతరులను ఆత్మగా చూసే అభ్యాసము చేయించారు.

ఒకరి ముందు ఒకరు కూర్చుని ఆత్మాభిమాని స్థితిని అభ్యాసము చేయండి అని బాబా చెప్పేవారు. రాత్రి నిదురించేందుకు ముందు, ఉదయము నిద్ర లేచునప్పుడు, పగలు కర్మలు చేసే సమయంలో ఏ ఏ సంకల్పాలు చేయాలో కూడా బాబా మాకు అభ్యాసం చేయించారు. మేము విజయీ పిల్లలమని, రాజా పిల్లలమని, మీరు ఇలా కూర్చోవాలని బాబా మాకు చెప్పేవారు. బాబా కూర్చుని చూపించి మమ్ములను అలా కూర్చోబెట్టేవారు. పగలు 10 నుండి 11 గంటల వరకు అందరము కలసి యోగము చేసేవారము. మేము కూరలు తరుగుతున్నా, ధాన్యము శభ్రము చేస్తున్నా, అప్పడాలు వత్తుతున్నా, బట్టలు ఉతుకుతున్నా బాబా మా జతలోనే ఉండేవారు. బాబా జత మాకు చాలా సహజంగా, సదా కాలము ఉండేది. బయట ప్రపంచ స్మృతి మాకు లేనే లేదు.

## తపస్సు అనగా వాయుమండలమును పరివర్తన చేయడం


ఈ రోజు ఫలానావారు వస్తారని బాబా మాకు ముందే చెప్పేవారు. బాబా, ఆ ఆత్మలను వారు రాకముందే ఆహ్వానించేవారు, సకాశ్ ఇచ్చేవారు. ఇప్పుడు కూడా బాబాయే అవ్యక్త రూపంలో సేవ చేస్తున్నారు. మీకు కూడా బాబా పట్ల అపారమైన ప్రేమ ఉంది. అందుకే కదా మీరు ఇక్కడకు వచ్చి బాబాకు సమర్పితమైపోయారు. బాబా సేవయే మీ బుద్ధిని బాబాలో ఏకాగ్రము చేసి మీలో శక్తి నింపింది. మేము బాబావారము, బాబా మా వారు అని ఈశ్వరీయ సేవయే అనుభవము చేయించింది. బాబా మావారు అనే శబ్ధము విశ్వమంతటా వ్యాపిస్తోంది, విశ్వమంతటా మారుమ్రోగుతోంది. మా సంకల్పాలు, మాటలు, కర్మలలో జాగృతి వచ్చింది, ఆత్మీయత వచ్చింది. దీని వలన సృష్టిలోని వాయుమండలము పరివర్తనవుతూ ఉంది. విశ్వమంతటా ఈశ్వరీయ ప్రకంపనాలు వ్యాపించే సమయము కూడా వస్తుంది. దీనినే బాబా జయ జయ ధ్వనులు వినిపిస్తాయని అంటారు. బాబా పట్ల మనకెంత ప్రేమ పూర్వక సంకల్పాలు శక్తిశాలిగా ఉంటాయో, బాబా పట్ల మనకెంత త్యాగముంటుందో అంత సంఘటనా బలము ద్వారా విశ్వములో 'నా బాబా(మేరా బాబా)' అను శబ్ధము ప్రతిధ్వనిస్తుంది. మీ తనువు-మనసు-ధనముల ద్వారా అందరి సేవ



జరుగుతోంది.

## తపస్సు అనగా వతనవాసులుగా అయిపోవడం

ఇప్పుడు బాబా వతనవాసులుగా అవ్వండి అని చెప్తున్నారు. నేను వతనములోకి చేరిపోయాను. నేను మిమ్ములను నా వెంట తీసుకెళ్లాలి. కనుక మీదంతా సర్దుకోండి ఎందుకంటే ఇప్పుడు ఇంటికి వెళ్లాలి. సర్దుకునే శక్తిని అభ్యసించండి, ధారణ చేయండి. ఇది తపస్సు ద్వారా వీలవుతుంది. ఇంకా ఎవరెవరిలో ఏమేమి మిగిలి ఉన్నాయో దేహము, దేహ సంబంధాలు, దేహ పదార్థాలు, దేహము పట్ల ఆకర్షణ లొంగుబాటు(లగావ్-ఝుకావ్) వాటన్నిటిని వదిలి వచ్చేయండి. మీ దేహము పై కూడా మీకు మోహముండరాదు. దేహము నుండి వేరై వతనానికి వచ్చేయండి. నా వద్దకు వచ్చి కూర్చోండి. మనము తపస్సు చేసి ఈ వైబ్రేషన్లు(ప్రకంపనాలు) ఇవ్వాలి. ఈ దేహము నుండి వేరై బాబా వద్దకు వతనములోకి చేరుకున్నట్లు పూర్తి అశరీరులుగా అవ్వండి.



కూరగాయలను తరుగుతున్న బాబా

జతలో దాది మనోహర్ ఇంద్ర, దాది జానకీ, దాది నిర్మల్ శాంత, సోదరి హర్‌దేవ్

ఎవరు తపస్సు చేస్తారో వారికి ముఖ్యముగా మూడు లక్షణాలుంటాయి. ఒకటి - వారు పూర్తిగా సైలెన్స్(శాంతి)లో ఉంటారు. మాటలు తగ్గిపోతాయి, కనులు శీతలంగా ఉంటాయి. మాటల భాష తగ్గిపోయి, సైలెన్స్(శాంతి) భాష ఎక్కువవుతుంది. మాకు కూడా బాబా సూచననిచ్చారు - ఇప్పుడు మాట్లాడేవారు చాలామంది తయారయ్యారు, మీరు సైలెన్స్‌గా మాట్లాడండి. మీరు మార్గదర్శులుగా అవ్వండి, వెన్నెముక(ఆధారము)గా అవ్వండి. వతనములో కూర్చొని శక్తినిస్తూ ఉండండి. ఇది మహాదానులుగా, వరదానులుగా అయ్యే సమయము. ఎప్పుడైతే వతనవాసులుగా అవుతారో అప్పుడు మహాదానులుగా, వరదానులుగా అవుతారు. వతనములో బాబా వద్ద కూర్చొని సేవ చేయుట ద్వారా విశ్వమంతటికీ  సేవ జరుగుతుంది. జీవితములో బ్యాలన్స్(సమత్స్యులత) ఉంచండి. నేను శాంతి వలయములో కూర్చొని ఉన్నానని అనుభవము చేయండి. ఇక్కడ కూర్చుని ఉన్నా నేను లైట్‌లో కూర్చొని ఉన్నాను అని అనుభవం చేయండి. అలా ఉండేందుకు ఇంకేమీ చేయవలసిన అవసరం లేదు, కేవలము నడుస్తూ, తిరుగుతూ కనులలో బాబానే ఉంచుకోండి. వేరెవ్వరూ ఉండరాదు. ఒకటి - కనుల భాష నేర్చుకోండి. సైగతోనే అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి. రెండవది - కనులలో బాబాను ఇముడ్చుకోండి. మూడవది - సదా ఇతడు నా సోదరుడు, ఈమె నా సోదరి అను శ్రేష్ఠ భావనను ఉంచుకోండి. మనమంతా ఒకే తండ్రి సంతానము, ఒకే పరివారానికి చెందినవారము. మన పరివారము పవిత్రమైనది, మనము పవిత్రమైన బ్రాహ్మణులము. నాల్గవది - మనము బ్రాహ్మణుల నుండి ఫరిస్తాలము. మీలో ఎంతెంత సైలెన్స్ శక్తి లేక ఆధ్యాత్మిక శక్తి వస్తుందో అంత త్వరగా పరివర్తనైపోతుంది.



## ధారణ చేయు వారే ధనవంతులు

పాటలో ఏమి విన్నారు? చాలామంది బాబాను తమ ముందు చూస్తున్నట్లు, మందహాసము చేస్తూ బాబాతో “బాబా, మిమ్ములను చూస్తూ చూస్తూ నా మనస్సు హర్షితమౌతుందని, ఆత్మిక సంభాషణ చేస్తూ ఆత్మిక నషాలో కూర్చొని ఉన్నారు. ఇది కూడా బాబాతో ఆత్మిక సంభాషణే, బాబా స్మృతే. ఎవరికైతే బాబా పై ప్రేమ ఉంటుందో, వారు మనసుతో ఆత్మిక సంభాషణ చేస్తారు అనగా వార్తాలాపము చేస్తారు. ఈ పాటలు చాలా బాగున్నాయి. వీటి అర్థ స్వరూపములో ఉంటే మనమే ఆ పాటలు పాడినట్లు ఉంటుంది. బాబా మన ముందు కూర్చున్నట్లు, మనము వారితో మాట్లాడినట్లు ఉంటుంది. అప్పుడు మనము కూర్చున్నంత సేపూ ఆత్మీయంగా ఉంటుంది. మనమూ ఆత్మలమే, బాబా కూడా ఆత్మయే. దీనినే ఆత్మిక ప్రేమ అని అంటారు. బాబా కూడా ఆత్మయే కాని వారు పరమ(సుప్రీమ్, అత్యంత శ్రేష్ఠమైన) ఆత్మ. ఆత్మ ఆ పరమాత్మతో మాట్లాడుతుంది. దీనినే ఆత్మిక సంభాషణ అని అంటారు. ఈ సోదరి చాలా మంచిది, ఈమెలో ఆత్మీయతా సుగంధము చాలా ఉంది అని అంటారు కదా. పుష్పాలలో సుగంధము చాలా ఉంటుంది. అనేక ప్రకారాలైన పుష్పాలున్నాయి. గులాబీలు, మల్లెపూలే కాక జిల్లేడు పూలు కూడా ఉన్నాయి. జిల్లేడు పూలు కూడా కొన్ని చోట్ల పనికొస్తాయి, లాభము కలుగజేస్తాయి. అదేమో విషమే, కాని విషము విషాన్ని విరిచేస్తుంది. జిల్లేడు పూలైనా బాబా ముందు సమర్పితమైపోయారు కదా! వారిలోని విషము సమాప్తమైపోతుంది. జిల్లేడు పూల నుండి గులాబీ పుష్పాలుగా అయ్యారు. ఇప్పుడు వారు కూడా బాబాతో ఆత్మిక సంభాషణ చేస్తున్నారు కదా!

## బాబా నా కొరకే శిక్షణలనిస్తున్నారని సదా అనుభవము చేయండి

ఎప్పుడు పాట వినిపించినా, ఎప్పుడు మురళి వింటున్నా బాబా నాతోనే మాట్లాడుతున్నారు అని అనుభవము చేయండి. నేను విద్యార్థిని, బాబా నాకు టీచరై నా ముందు కూర్చొని ఉన్నారు, నా కొరకే శిక్షణలనిస్తున్నారు(చదువు చెప్తున్నారు) అని భావించిడి. అంతేగాని ఫలానా అక్కయ్య మురళి వినిపిస్తోందని భావించకండి. ఇవి బాబా మహావాక్యాలు. బాబా మహావాక్యాలను విద్యార్థి, టీచరు

సంబంధములో వినండి. అప్పుడు టీచరు గుర్తుకొస్తారు లేకుంటే టీచరు గుర్తు రాదు. ఆంతరికము నుండి హృదయపూర్వకమైన, అత్యంత సన్నిహితమైన స్మృతి ఉండాలి. బాబా స్మృతి సతాయించాలి. బాబా ఏ శిక్షణలను ఇచ్చారో వాటిని ధారణ చేసినప్పుడే ప్రాప్తి జరుగుతుంది. ఆ ప్రాప్తి వలననే ఆంతరికము నుండి వారి స్మృతి సతాయిస్తుంది. బాబా నాకిది ఇచ్చారు, బాబా ఈ మాటలు చెప్పినందునే నాలో ఈ పరివర్తన వచ్చింది అని గుర్తుకొస్తుంది. బాబా చెప్పిన ఎటువంటి మహావాక్యాలు నేను విన్నానంటే ఏదైనా ఒక బాణము తగిలినట్లు నాలో ముద్ర ఏర్పడి పోయింది. బాణము తగుల్తే తెలివి తప్పిపోతారు, మరణిస్తారు. బాణములో అంత శక్తి ఉంటుంది. బాబా మాటలను బాగా కూర్చొని శ్రద్ధగా వింటే అవి బాణాల వలె ఉంటాయి. సుప్రీమ్ టీచరు ముందు ఈశ్వరీయ విద్యార్థులై కూర్చోండి, వెంటనే బాణము తగుల్తుంది. దేహాభిమానము లేక పాత సంస్కారాలు మన పై దాడి చేస్తే ఆత్మలోని శక్తి సమాప్తమైపోతుంది. మనము బాబా మహావాక్యాలను శ్రద్ధగా విని ధారణ చేస్తే ఆ శబ్దాలు పాత సంస్కారాలను, మాయావి సంస్కారాలను బలహీనపరుస్తాయి.

బాబా మహావాక్యాలు హృదయములో కూర్చుంటే మనసులో శక్తిశాలి సంకల్పాలు కలగడం ప్రారంభమైపోతుంది. ఆంతరికములో అదే మనన చింతన నడుస్తూ ఉంటుంది. ఆ మాటలే ప్రియమనిపించడం మొదలవుతుంది. అప్పటి నుండే లోపల పరివర్తన మొదలవుతుంది. హృదయము నుండి " బాబా, మీరు చెప్పిందే సత్యము" అనే మాటలు ఆంతరికము నుండి వెలువడ్తాయి. ఇవి (లోపాలు) నాలో ఉన్నాయి, నేను వాటిని పెకిలించి వేస్తాను.

బాబా మహావాక్యాలు వింటూ వింటూ, ఇది నా తప్పు అని అనుభవమవుతుంది. బాబా ఎంత ఉన్నతమైన వాక్యాలు వినిపించారో చూడండి! వింటూ వింటూ అనుభూతి చేస్తూ ఉన్నాను. అనుభూతి వలననే పరివర్తన వచ్చేస్తుంది. నిన్నటివరకు ఎంత కోపము చేసుకునేవాడు, ఇప్పుడెలా శాంతిగా అయిపోయాడో చూడమని ఇతరులకు అనిపిస్తుంది. ఎంత పెద్ద మార్పు జరిగింది! ఎదుటివాడు అంత కోపగించుకున్నా, ఎంతగా నిందించినా, అతను విన్నా తిరిగి కోపగించుకోలేదు. శాంతిగా ఉండినాడు, నవ్వుతూ ఉండినాడు! ఇంత సహనశీల గుణము ఇతనిలో ఎక్కడ నుండి వచ్చింది? నిన్నటివరకు



ఇతనిలో కొద్దిగా కూడా సహన శక్తి లేదు. ఒక్క రోజులో ఇంత తేడా ఎలా వచ్చింది! అని ఆశ్చర్యపడ్తారు. కనుక ప్రతి ఒక్కరు బాబా చెప్పిన ఏ మహావాక్యము బాణము వలె తగిలిందో, ఎలా పరివర్తన వచ్చిందో - తమ అనుభవాన్ని వినిపించాలి.

## ఏకాంతములో కూర్చొని రెండవసారి 'మురళీ'ని చదవండి లేక పాయింట్లు రిపీట్ చేయండి

మన జీవితము డైరెక్టు బాబా ద్వారా తయారు చేయబడింది కదా! నాకైతే క్షణ క్షణము బాబాయే గుర్తుకొస్తారు. నేను మీకు సత్యము వినిపిస్తున్నాను. ప్రతీ మాటలో బాబాయే గుర్తుకొస్తారు. నాకు అదే మనన చింతన జరుగుతుంది. నా సంకల్పాలు కూడా బాబా పట్లనే నడుస్తున్నాయి. నేను ఎప్పుడూ ఏకాంతములో కూర్చొని రెండవసారి వాణి చదువుతాను. ఏకాంతములో చదువుకుంటే మనసు పై ముద్ర ఏర్పడుతుంది. పదే పదే మననము జరుగుతుంది. కొంతమంది నాకు మొత్తం వాణి అంతా గుర్తుంది అని అంటారు. వారు వాణిలోని ప్రతి మాటను ఉన్నదున్నట్లు రిపీట్ చేస్తారు. నాకైతే బాబా చెప్పిన మొత్తము వాణి అంతా గుర్తుండదు. ఉన్నదున్నట్లుగా బాబా శబ్దాలు గుర్తు చేసుకోలేను. కాని బాబా మహావాక్యాల రహస్యము నాకు గుర్తుంటుంది. అది ఎప్పటికీ మర్చిపోను. అది నా అనుభవములోకి వచ్చేస్తుంది. పిల్లలైన మన నుండి బాబా ఏమి కోరుకుంటున్నారో, మన పట్ల వారికి ఏ భావముందో నా ఆంతరికములో అనుభవము అవుతుంది. బాబా కోరికను పిల్లలైన మనము కాక మరెవ్వరు పూర్తి చేస్తారు? వీరు సహాయకారి పిల్లలని బాబా మనలను ఎన్నుకున్నారు. సహాయకారి పిల్లలైన మన నుండి బాబా ఏ సహాయాన్ని కోరుతున్నారు? ఈ ఆలోచనతో నేను మురళి వింటాను, అదే భావముతో చదువుతాను. ఇలా వింటే మన హృదయానికి బాణము తగులుతుంది.

అప్పుడప్పుడు బాబా మాటలు విని కనులు చెమ్మగిల్లుతాయి. పిల్లలైన మనలను బాబా ఎంత మహిమ చేస్తారు! మురళి వినునప్పుడు, ఇక్కడ నుండి లేచిన వెంటనే బాబా చెప్పిన దానిని చేసేస్తాను అని దృఢ సంకల్పము చేస్తాము. బాబా మహావాక్యాలు వింటూ వింటూ ఇలా అనిపిస్తుంది. ఎందుకంటే ఈ

మహావాక్యాలు ఎవరు వినిపిస్తారో మనకు తెలుసు. ఇవి ఏ దేహధారి మనుష్యుల మాటలైతే కావు. ఈ మాటలు మళ్లీ కల్పము తర్వాతనే వింటాము. సత్యయుగములో కూడా దేహధారులైన దేవీ-దేవతల మాటలు వింటాము. కలియుగములో ఉండేది వికారి దేహధారులు. కల్పములో ఒక్కసారి మాత్రమే కళ్యాణకారి అయిన తండ్రి మాటలు వింటాము, వారి శిక్షణలు పొందుతాము. వారు మన టీచరే కాక సద్గురువు కూడా. ఈ విధంగా లోలోపల మననము జరుగుతుంది. ఈ భావము హృదయము లోపలి నుండి కలుగుతుంది. లౌకికములో చదువుకున్న బుద్ధి జీవులు చాలా మంది కూర్చొని ఉన్నారు. ఏవైనా మాటలు విన్నా, చదివినా వాటిని ఉన్నదున్నట్లుగా రిపీట్ చేస్తారు. కాని వారికి బుద్ధి అభిమానము కూడా చాలా ఉంటుంది. బుద్ధి ఎంత చురుకుగా ఉంటుందో అంత బుద్ధి యొక్క అభిమానము ఉంటుంది. ఇటువంటివారికి తమ బుద్ధిని సమర్పణ చేసేందులో కష్టమనిపిస్తుంది. బుద్ధిని భగవంతుని ముందు సమర్పణ చేసి భగవంతుని బుద్ధి అనుసారము నడుచుకోవడం, "బుద్ధివంతుల కంటే బుద్ధివంతుని(బుద్ధివానోం సే బుద్ధివాన్)" బుద్ధి ప్రకారము నడుచుకోవడం చిన్న విషయమేమీ కాదు. తండ్రిని గుర్తించడం, వారిని బుద్ధి ద్వారా తెలుసుకోవడం చిన్న విషయమేమీ కాదు. సర్వ సంబంధాలను అనుభవము చేసిన తర్వాతనే ఎవరైనా స్వయాన్ని భగవంతునికి అర్పణ చేసుకుంటారు. కొంతమంది కొద్దిగా గుర్తిస్తారు, కొంతమంది అసంపూర్ణముగా గుర్తిస్తారు. దీని వలన నంబరువారుగా అవుతారు. తండ్రిని ఎంత గుర్తిస్తారో, ఎంత అర్థము చేసుకుంటారో అంత మాత్రమే శ్రీమతమును అనుసరిస్తారు. ఇచ్చట బుద్ధిని తండ్రికి సమర్పణ చేయవలసి ఉంటుంది.

### జ్ఞానము కేవలము వినడమే కాదు, బుద్ధిలో ధారణ కూడా చేయండి

తండ్రిని టీచరు రూపములో గుర్తించి, మనము విద్యార్థులమని భావించి బాబా మహావాక్యాలు వింటున్నాము, చదువుతున్నాము, నేర్చుకుంటున్నాము. ప్రతి మాటను, ప్రతి వాక్యాన్ని అతి స్నేహముతో, గమనముతో చదువుతున్నాము ఎందుకంటే మనలను చదివించేదెవరో మనకు తెలుసు. మనము ఎప్పుడైతే ఈ విధంగా వింటామో అప్పుడే మనము పరివర్తనవుతాము,



మన సంస్కారాలు మారిపోతాయి. చాలా మంది మేము మురళి అంతా రిపీట్ చేస్తాము కాని యోగమే కుదరడం లేదని అంటారు. వారు యోగములో వెనుకబడి ఉంటారు. వారు యోగములో కూర్చుంటే యుద్ధము జరుగుతుంది లేక తూగు వస్తుంది. అప్పుడు యోగము చేయడం కంటే ఏదైనా చదువుకుంటే మంచిదనిపిస్తుంది. జ్ఞానము ఉన్నదున్నట్లు రిపీట్ చేసినప్పుడు యోగములో రుచి(రస్) ఎందుకు కలగదు? వారు జ్ఞానము గుర్తుంచుకున్నారు కాని అది బుద్ధిలోకి వెళ్లలేదు. కేవలం స్మృతి వరకే ఉండిపోయింది, లోపలికి వెళ్లలేదు, ధారణ అవ్వలేదు. జ్ఞానమంటే ప్రకాశము. ప్రకాశము ద్వారా అంధకారము దూరమైపోతుంది కదా అనగా వారి బుద్ధి జ్ఞానాన్ని ధారణ చేయడం లేదని అర్థమవుతుంది. బుద్ధి పనే గ్రహించడం. జ్ఞానాన్ని గ్రహించడం లేదంటే ఏదో కారణముందని అర్థము.

ఇందుకు మరొక కారణము కూడా ఉండవచ్చు - జ్ఞానముతో పాటు ఇతరములు కూడా వింటూ ఉంటారు. యోగము కుదరకుండా చేయు ఇతర విషయాలెన్నో ఉన్నాయి. యోగమెందుకు కుదరదు? బాబా మనలను చదివిస్తున్నారు, శిక్షణనిస్తున్నారు. ఇది ఆంతరికములో ఎందుకు అనుభూతి అవ్వదు? బాబా చదువు వలన ఎగరడం ప్రారంభించాలి, ఫలిస్తాలుగా అవ్వడం ప్రారంభించాలి. చాలా మంది చాలా బుద్ధివంతులుగా, జ్ఞానులుగా ఉంటారు కాని మాకు యోగము కుదరడం లేదని, శక్తి లేదని అంటారు. మా సంస్కారాలు మారడం లేదు, ఇది మా స్వభావము, ఏమి చేయాలి? అని అంటారు. బాబా ఎంతగా అర్థం చేయిస్తున్నారు! ఉదాహరణానికి ఎప్పుడూ ఏడ్వరాదని బాబా చెప్పారు. ఏడ్వడం అనగా విధవలుగా అవ్వడం, ఏడ్వడం అనగా అనాథలుగా అవ్వడం. ఎవరి కంటి నుండి అయినా దుఃఖముతో ఒక్క కన్నీటి చుక్క వచ్చినా, వారు విధవ అని అర్థము. వారు పతులకు పతిని చంపేశారని భావించండి. యోగము తెగిపోయింది కదా! సంబంధము సమాప్తమైపోయింది కదా. అందుకే దుఃఖము కలిగింది. దుఃఖము కలుగుతే కన్నీరు వస్తుంది. వారితో సంబంధముంటే దుఃఖము రానే రాదు. బాబా మన పతి, మన భాగ్యము, మన సౌభాగ్యము. సౌభాగ్యవతి ఎప్పుడూ దుఃఖపడదు, కన్నీరు కార్చదు. ఆమెకు నేను సౌభాగ్యవతిని అనే నశా ఉంటుంది. ఆమెకు విధవ పట్ల పాపం ఈమె

పతి మరణించారని జాలి కలుగుతుంది.

యజ్ఞములో కూడా ఎవరైనా ఏడుస్తూ ఉంటే బాబా వారి ముఖమే చూచేవారు కాదు. 350-375 మంది యజ్ఞవత్సలుండేవారు. పరస్పరములో ఏదో ఒకటి జరుగుతూ ఉండేది. ఎవరో ఏదో అనేవారు, ఎవరో ఒకరు ఏడ్చేవారు. వారిని చూచి బాబా ముఖము తిప్పుకునేవారు. ఎందుకంటే వారు తమ పతిని చంపేశారు. ఎవరి పతి మరణిస్తారో వారి ముఖాన్ని చూచేందుకు ఎవ్వరూ ఇష్టపడరు. బాబా ఇంత కఠినమైన శబ్దాలను పలికేవారు. ఏడ్చినందువలన బాబా స్నేహ సంబంధాలలో తేడా ఏర్పడిపోయింది కదా అనగా ఏడ్చేవారు బాబాను గుర్తించలేదని అర్థము. బాబా చెప్పిన మాటల గొప్పదనాన్ని తెలుసుకోలేదు కదా! భగవంతుని మహావాక్యాల మహత్యము తెలుసుకోలేదు కదా! అరే ఇవి భగవంతుని మహావాక్యాలు. వీటిని నేను శిరోధార్యము చేసి అమలు పరచాలి. ఒకవేళ ఎవరైనా బాబా నాకేమి చెప్పారో, నాకేమిచ్చారో అని గుర్తించకపోతే వారికి వ్యర్థ సంకల్పాలు వస్తాయి. అప్పుడు నాకు దుఃఖము కలిగి ఏడుస్తూ ఉంటే, బాబా నా వైపు కనీసము చూడలేదు, ఏమైంది బిడ్డా అని అడగనే లేదు, కొద్దిగానైనా ప్రీతినివ్వలేదు అని వ్యర్థ సంకల్పాలు వస్తాయి. నాకు సఖి ఉంటే ఎందుకు ఏడుస్తున్నావ్, ఏమయ్యింది? అని అడిగేది. కాని బాబా అడగడం కాదు కనీసం నా వైపు చూడను కూడా చూడలేదు అని అనుకుంటారు. దీని వలన సంశయమూ కలుగవచ్చు, బాబా పట్ల నిశ్చయము, ప్రేమ కూడా పెరగవచ్చు. సూక్ష్మబుద్ధి గలవారైతే బాబా మాటలను, బాబా సూచనలలోని సూక్ష్మతను అర్థము చేసుకుంటారు, వాటిని అమలు పరుస్తారు. సూక్ష్మ బుద్ధిగలవారు ప్రతి దాని నుండి శక్తిని తీసుకుంటారు. మొదట బాబా నుండి శక్తి తీసుకుంటారు. ఎందుకంటే వారు సర్వశక్తివంతులు. బాబా నాకు నేర్పించేందుకు ఎంత చేస్తున్నారో చూడు! నా అనేక జన్మల కఠిన సంస్కారాలను ఒక్క జన్మలో సమాప్తము చేస్తారు, బాబాకు పిల్లలమైన మన పై ఎంత శ్రద్ధ! వజ్రము వంటి నా పిల్లలు ఈ రోజు గవ్వ సమానంగా అయిపోయారు! అని బాబాకు మన పై ఎంతో జాలి కలుగుతుంది. ఎవరి బుద్ధిలో అయితే ఇటువంటి శ్రేష్ఠ సంకల్పాలు నడుస్తాయో, బాబా ప్రతి మాటను మననము, చింతన చేస్తారో వారిలో శక్తి నిండుతూ పోతుంది. ఇటువంటి ఆత్మకు యోగము కుదరదనే



మాటే ఉండదు, శక్తి రాదనేదే ఉండదు. మననము చేయకుండా ఉండడం వారి స్వంత బలహీనత. మనము మనలను చెక్ చేసుకోలేదు. మనము మననము చేయలేదు. అందుకే మనలో శక్తి నిండలేదు అని అర్థం చేసుకుంటారు.

చదివించేవారు అందరినీ ఒకే విధంగా చదివిస్తారు. ఆ చదువు ద్వారా కొంతమంది విద్యార్థులలో శక్తి నిండుతుంది, కొంతమంది కచ్చాగా ఉండిపోతారు. ఎందుకు? ఎందుకలా అవుతుంది? తేడా ఏమిటి? టీచరు పై ఎందుకు దోషం వేయాలి? మనము మనలకు చెక్ చేసుకోలేదు, కనుక కారణం తెలుసుకోలేదు. చాలామందికి సమస్యను గురించే తెలియకుంటే కారణమెలా తెలుసుకుంటారు? నాకు యోగము కుదరడం లేదని మీరే చెప్తున్నారు. ఎందుకు కుదరడం లేదో మీరే తెలుసుకోవాలి కదా. మాకు తెలియదని అంటారు. తెలియకపోతే తెలుసుకోవాలి కదా. కారణము వెతకాలి కదా! మీ పై మీకు గమనము లేదు. బాహ్యముఖతలో ఉన్నారు. ఇతరుల మాటలు వినడంలో, పరచింతనలో, పరదర్శనలో నిమగ్నమై ఉంటారు. ఇతరులను చెక్ చేయడంలో బిజీగా ఉంటారు - "ఇలా జరిగి ఉండరాదు, ఇలా చేయరాదు" మొదలైన వ్యర్థ సంకల్పాలు చేస్తూ ఉంటారు. బుద్ధిలో ఇతరుల మురికి నిండి ఉంటే వారికి యోగమెలా కుదురుతుంది?

## బాహ్య విషయాలు వినకండి - చదవకండి

నాకు బాగా గుర్తుంది - పాకిస్తాన్ విభజన జరగబోతుందనగా కరాచీలో తుపాకీ కాల్పులు జరిగాయి. జనులు మరణిస్తూ ఉండినారు. హాహాకారాలు వినపించేవి. బాబా ప్రతిరోజు 5-6 మంది కన్యలను వతనానికి పిలుచుకునేవారు. వారు వచ్చి వతనంలోని సమాచారము వినిపించేవారు. మేము ఆ సమాచారము వింటూ ఆ అనుభవములోనే మునిగిపోయేవారము. బయట ప్రపంచంలో ఏమి జరిగేదో మాకు తెలిసేదే కాదు. ఇదంతా పిల్లలైన మాకు బాహ్య విషయాలేవీ తెలియకూడదని బాబా ఆడించిన ఆట. ప్రాపంచిక వ్యవహారాలన్నిటి నుండి మమ్ములను రక్షించి ఈ పాప ప్రపంచానికి దూరంగా ఉంచారు. కాని ఈ రోజు నేను చూస్తున్నాను - చాలా మంది మన సోదరీ -

సోదరులే వార్తాపత్రికలు చదువుతున్నారు! నేనైతే పంజాబు సెంటరులోని సోదరీలను వార్తాపత్రిక చదవకుండా నిషేధించాను. ఏ టీచరూ బాహ్యేములోని వార్తాపత్రికలు చదవరాదు ఎందుకంటే ఆ వార్తల పై తప్పకుండా సంకల్పాలు నడుస్తాయి. చదవినా సంకల్పాలు నడవనంత శక్తి లేదు. సమాచారాలు చదివి భయపడే సంస్కారము, క్రోధ సంస్కారము, లోభ సంస్కారము వచ్చేస్తాయేమో ఎవరికి తెలుసు? పేపరు చదవుతూ చదువుతూ లోపల బలహీన సంస్కారాలు వస్తాయేమో ఎవరికి తెలుసు? పేపర్లో ఏముంటాయి? వారు చనిపోయారు, అది జరిగింది, ఇది జరిగింది......... ఇవే కదా. ప్రతి రోజు ఇటువంటి సమాచారము చదువుతూ ఉంటే ఒకానొక రోజు మనసు తప్పకుండా బలహీనమైపోతుంది. కనుక బాహ్యేములోని ఇటువంటి విషయాలను అసలు మనమెందుకు వినాలి ? చదువుతే ప్రతి రోజు చదవడం మొదలవుతుంది. చదివితే తప్పకుండా చింతన జరుగుతుంది. బాబా మమ్ములను ఎలా రక్షించి ఉంచారో నాకు గుర్తొస్తుంది. బాబా ఏమి చేశారో అదే మనము కూడా చేయాలి. మనము మన్మతమెందుకు ఉపయోగించాలి? నేను ఏ కన్యకూ వార్తాపత్రికలు చదివేందుకు అనుమతి ఇవ్వను. చాలామంది నన్ను అనుమతి ఇవ్వమని అడుగుతారు. వార్తాపత్రికలు చదవడం బాహర్ముఖిత అని నేను భావిస్తాను. మా తపస్సు బాగుండాలని బాబా మమ్ములను దీని నుండి కూడా రక్షించారు. మొదట ఈ రోజు మీకు లభిస్తున్నంత జ్ఞానము అప్పట్లో మాకు లేదు. ఇప్పుడు మీ ఎదుట ఎంత సేవ ఉంది! మీ ముందు ఉదయము నుండి రాత్రి వరకు సేవ ఉంది. అప్పుడు మాకింత సేవ ఎక్కడిది? బయట సేవ మాకు అప్పుడు లేనే లేదు. కోర్సు ఇచ్చే పని లేదు, ఉపన్యసించే పని అసలే లేదు. జిజ్ఞాసువుల కొరకు సమయమిచ్చే పని కూడా లేదు. కేవలం స్థూల సేవ చేసేవారము. పాత్రలు శుభ్రము చేయడం, కసువు తోయడం, అలకడం మాత్రమే చేసేవారము. అయినా మాకెంత నషా ఉండేది! స్థూల సేవ చేయడం వలన మాకు యజ్ఞము పై చాలా ప్రేమ ఏర్పడింది. ఒకటి - యజ్ఞమంటే ప్రేమ ఏర్పడింది, రెండవది తపస్సు బాగా జరిగేది.

## తక్కువ తినండి - తక్కువ నిదురించండి

యోగంలో నిద్ర రాకూడదు. నిద్ర అంటే మాయ, నిద్ర అంటే



తమోగుణము. మనము శాంతిగా కూర్చున్నప్పుడు, యోగంలో కూర్చున్నప్పుడే మాయ నిద్ర రూపంలో వచ్చేస్తుంది. శాంతి అంటే నిద్రావస్థ కాదు. శాంతి మన శక్తి. అందులో బాబా ఇచ్చే ఆనందముంటుంది, అనుభవ రసముంటుంది. ఆ రసంలో ఎవరికైనా నిద్ర వస్తుందా? ఒకవేళ ఏదైనా నాటకము జరుగుతూ ఉంటే, అది చూస్తూ చూస్తూ రాత్రి 12 గంటలు కూడా అయిపోతుంది. అయినా ఎవరికైనా నిద్ర వస్తుందా ? రాదు, ఎందుకంటే అందులో చూడాలనే ఇష్టం ఉంటుంది. ఎవరిలో సైలెన్స్ శక్తిని అనుభవం చేయాలనే అభిరుచి ఉంటుందో, బాబా అంటే ఇష్టముంటుందో వారికి నిద్ర రాదు. యోగికి నిద్ర తగ్గిపోతుంది. వారి భోజనము తగ్గిపోతుంది. యోగంలో శరీరము నుండి వేరైపోతాము కదా. కనుక వారు భోజనము కూడా ఎక్కువగా తినరు. దేహాభిమానములో ఉండేవారు ఎక్కువగా తింటారు. యోగుల శరీరము కూడా తేలికగా ఉంటుంది. వారి భోజనము కూడా తేలికగా ఉంటుంది, నిద్ర కూడా తేలికగానే ఉంటుంది. అన్ని విషయాలలో వారు తేలికగా ఉంటారు. యోగులు అనగా ఆత్మాభిమానులు. ఆత్మ తేలికగా ఉండుట వలన యోగులు అన్నిటిలో తేలికగా ఉంటారు.

జ్యోతి లేక లైటు అని దేనినంటారు? తేలికగా ఉండుదానిని అంటారు. కర్మబంధనాలలో కూడా తేలికగా ఉంటారు. యోగులను ఏ బంధనమూ ఆకర్షించదు. ఏ స్వభావానికి వశమవ్వరు. అందులో కూడా లైటుగా(తేలికగా) ఉంటారు. వారు పాత సంస్కారాలకు కూడా దాసులుగా అవ్వరు. సదా స్వతంత్రులుగా ఉంటారు. దేహ సంబంధాల నుండి దేహ పదార్థాల నుండి అన్నిటి నుండి లైట్‌గా ఉంటారు. సదా జ్యోతి స్వరూపంగా లైట్‌గా ఉంటారు. దీనినే లైట్ అని అంటారు. ఆత్మ లైట్‌గా తయారై జ్యోతి రూపాన్ని ధరిస్తే నిద్ర ఎలా వస్తుంది? ఫరిస్తా స్థితిలో స్థితమౌతే భారమెలా ఉంటుంది? నిద్ర ఎలా వస్తుంది? మన లక్ష్యము - ఫరిస్తాగా అవ్వడం కదా! దేవతలుగా అయితే తర్వాత అవుతారు. ఇప్పుడైతే ఫరిస్తా రూపము అందరికీ సాక్షాత్కారమవ్వాలి. బాబాతో పాటు పిల్లలు కూడా ఫరిస్తాలుగా అయినప్పుడు భక్తులకు సాక్షాత్కారము జరుగుతుంది. తేలికగానే అవ్వకుంటే సాక్షాత్కారమెలా చేయిస్తారు ?

ఏదైనా తినేందుకు మంచి వస్తువు కనిపిస్తే ముఖము వికసిస్తుంది,

ఏదైనా రుచి లేని పదార్థము లభిస్తే ముఖము ముడుచుకొని చిన్నదైపోతుంది. కాని యోగులకు దేని పైనా ఆకర్షణ ఉండదు. భోజనము రుచిగా ఉండనీ, లేకపోనీ వారికి ఏ తేడా కనిపించదు. వారు భోజనాన్ని భగవంతుని ప్రసాదంగా భావించి, శరీరము కొరకు స్వీకరించేందుకు నిమిత్తంగా ఉండి స్వీకరిస్తారు. యోగులకు కర్మేంద్రియాలు వశములో ఉంటాయి. భోజనము చేయునప్పుడు బాబా గుర్తు రాకుండా, భోజనము రుచి మాత్రమే గుర్తుంటే వారు యోగులు కారు. యోగులుగా అవ్వకుంటే బాబా వారి జతలో, ఎలా తింటాడు? బాబా కూడా వీరికి నా యజ్ఞ భోజనమే బాగుండకపోతే నేను వారి జతలో ఎలా తింటాను? భలే " బాబా మీరు నా జతలో భోంచేయండి " అని స్మృతి చేసినా వారి జతలో తింటారా? బాబా మన జతలో భుజించారంటే దాని అర్థమేమి? బాబా మన జతలో భుజించుట అనగా శక్తి అనుభవమగుట. బ్రహ్మాభోజనము ద్వారా మాకు శక్తి అనుభవమవుతోందని తెలుస్తుంది. శాంతిగా ఉండి, బాబా స్మృతిలో భోంచేయడం వలన మనలో శక్తి వస్తుంది. బాబా నా జతలో తింటున్నారనే ఫీలింగు వస్తుంది. శక్తి కూడా ఉంది, బాబా ఉపస్థితమై ఉన్నారనే అనుభవము కూడా అవుతుంది. ఇవన్నీ చెక్ చేసుకునే చాలా సూక్ష్మమైన విషయాలు. ఇటువంటి విషయాలను ఇతరులెవ్వరూ చెక్ చేయలేరు. ఇది ప్రతి ఒక్కరు తమంతకు తాము చెక్ చేసుకోండి. నేను భోంచేయునప్పుడు ఏ మూడ్‌తో(భావముతో) తింటున్నాను? ఏ పద్ధతిలో తింటున్నాను? తమాషాలు చేసుకుంటూ, జోకులు వేసుకుంటూ, అలాంటి ఇలాంటి మాటలు మాట్లాడుతూ తింటున్నానా? భోజనము బాగా లేకుంటే పై పైన కొద్దిగా తిని లేచిపోతారు. కొంత తిని, కొంత తినక అలాగే విడిచిపెడ్తారు. పళ్లెములో భోజనము మిగిలించి, యజ్ఞ భోజనాన్ని పారేస్తారు. ఇలా చేస్తే వారికి యజ్ఞము పై, బాబా పై ప్రేమ ఉన్నట్లా ? తింటూ, త్రాగుతూ కూడా స్వయాన్ని చెక్ చేసుకోవాలి. తండ్రిని స్మృతి చేస్తూ ఉండాలి. దీనినే నిరంతర స్మృతి అని అంటారు. సాకారంలో బాబా తమ ఉదాహరణ ఇచ్చేవారు - స్నానము చేయునప్పుడు శివబాబా రథము పై ఎలా నీరు పోస్తున్నానో గమనిస్తాను. నేను హుస్సేన్ గుర్రమును ఎలా స్నానము చేయిస్తున్నానో గమనిస్తాను. ఇది నా శరీరము కాదు, శివబాబా రథమని భావించేవారు. ఇంత ప్రీతితో, గౌరవంతో ఆ రథానికి స్నానము చేయించేవారు.



ఆత్మ స్వచ్ఛతతో పాటు శరీరం కూడా శుద్ధంగా ఉండాలని చెప్పేవారు. ఎందుకంటే సంగమ యుగములో ఈ శరీరము పురుషార్థము చేసేందుకు శివబాబా నుండి లభించిన తాకట్టు.

## ఎప్పుడూ మూడ్ – ఆఫ్ అవ్వరాదు (మానసిక స్థితి చెడిపోరాదు)

మనిషి 3 విధాలుగా ఏడుస్తాడని బాబా చెప్పేవారు. మొదటిది - కనుల ద్వారా ఏడ్వడం. మనసులో దు:ఖము కలిగే సంకల్పాలు నడవడం వలన మనసుకు దెబ్బ తగులుతుంది. అప్పుడు కనుల నుండి కన్నీరు ప్రవహిస్తుంది. రెండవది నోటి ద్వారా ఏడ్వడం. మూడవది - నడవడిక ద్వారా ఏడ్వడం. నోటితో ఏడ్వడం అనగా దు:ఖితులై లేక కుపితులై కటువచనాలు మాట్లాడడం. మనసుకు ఎప్పుడు దెబ్బ తగులుతుందో అప్పుడు ముఖమే మారిపోతుంది, నోటి ద్వారా ఎలాంటి శబ్ధాలు వెలువడ్తాయంటే దానినే మూడ్ - ఆఫ్ అని అంటారు. తల వాలిపోతుంది, ముఖము ఉదాసీనమైపోతుంది. వీరి మూడ్ బాగలేదని ఎదుటివారికి కనిపిస్తుంది. రాజయోగుల ముఖము, తపస్వీల ముఖము సదా వికసించి ఉంటుంది. రాజయోగుల నోటి ద్వారా ఇతరులకు దు:ఖమునిచ్చే కటు వచనాలు ఎప్పటికీ వెలువడవు.

మూడ్(మానసిక స్థితి) చెడిపేసుకొని భోజనము చేయకుండా ఉండడం, క్లాసుకు రాకుండా ఉండడం - ఇవన్నీ మహాపాపాలు. మూడ్ ఆఫ్ అవ్వడం అన్నిటికంటే మొదటి పాపము, క్లాసుకు రాకపోవడం రెండవ పాపము, బ్రహ్మాభోజనము తినకపోవడం మూడవ మహాపాపము. భగవంతుని యజ్ఞ భోజనాన్ని తిరస్కరించుట, చిన్న పాపమా? ఇలా చేయడం పాపము పై పాపము పెంచుకోవడం. మనము భగవంతుని ఇంటికి ఎందుకు వచ్చాము ? పాపాలు సమాప్తము చేసుకునేందుకు వచ్చాము కాని పెంచుకునేందుకు కాదు. పాపకటేశ్వరుడైన బాబా మనకు పాప-పుణ్యాల జ్ఞానమునిచ్చినప్పుడు మనమెందుకు పాపము పెంచుకునే పని చేయాలి? బ్రహ్మా భోజనాన్ని తిరస్కరించడం వలన, తినకపోవడం వలన పాపము తయారవుతుంది. ఇటువంటి సూక్ష్మ పాపాలు మన ద్వారా ఏవైనా జరుగుతున్నాయా? అని చెక్ చేసుకోవాలి. అలా జరుగుతుంటే వాటిని సమాప్తము చేయాలి. మానసిక స్థితి

(మూడ్) ఎందుకు పాడవుతుంది? మననశక్తి లోపము వలన. నేను మురళి ఇతరులకు కూడా వినిపిస్తాను. అంతేకాక మళ్లీ ప్రత్యేకంగా కూడా చదువుతాను. మురళి కేవలం విని వదిలేయరాదు. మురళి విని, పగటి పూట టైమ్ తీసుకొని ఒంటరిగా కూర్చొని రెండవసారి చదవాలి, అధ్యయనము చేయాలి.

## అమృతవేళ యోగము చేసి నిద్రపోకండి

చాలామంది అమృతవేళలో యోగము చేసిన తర్వాత మళ్లీ నిద్రపోతారు. యోగము చేసి సంపాదించినదంతా నిదురించినందున పోగొట్టుకుంటారు. ఎప్పుడూ యోగము చేసిన తర్వాత నిద్రపోరాదు. యోగశక్తి పగటిపూట లభించదు. యోగము చేసేందుకు 15 నిముషాల ముందు ఒక పాయింటు పై ఆత్మిక సంభాషణ చేయండి. మీతో మీరే మాట్లాడుకోండి లేక మురళి చదివి, దాని పై మనన చింతన చేయండి. ఆ చింతన స్మృతిలో, బాబా ప్రేమలో కూర్చొని మీరు స్మృతిలో కూర్చుంటే బాబా నుండి కూడా చాలా ప్రేమను పొందుతారు. మీరు కూడా బాబాగారి లగ్నములో మగ్నమైపోతారు. బాబాతో మాట్లాడుకుంటూ ఉంటారు. మిలనము చేసిన సంతోషంలో ఊగుతూ ఉంటారు. మురళి చదువుకొని యోగములో కూర్చోండి. సాకారంలో కూడా బాబా అలా చేసేవారు. ఒక సోదరి బ్రహ్మాబాబాను ఇలా అడిగింది - " బాబా, నేను మురళి విన్నప్పుడు చాలా చరుకుగా ఉంటాను. కాని యోగంలో కూర్చున్నప్పుడు నిద్ర వచ్చేస్తుంది. ఎంత ప్రయత్నించినా నిద్ర వచ్చేస్తుంది. నాకు ఏదైనా యుక్తి చెప్పండి". మామూలుగా ఆమె బాగా చురుకుగానే ఉంటుంది. పాని పాటలు చేయునప్పుడు కూడా బాగుండేది. కాని యోగము చేసేందుకు కూర్చున్నప్పుడు వెంటనే ఆమె తల క్రిందికి వాలిపోయేది. బాబా ఆమెకు - " బిడ్డా! వాణి చదివి మననము చెయ్యి, నిద్ర రాకుండా నోట్లో ఏమైనా వేసుకో" అని చెప్పారు.

నా అనుభవమనుసారము, అమృతవేళలో నిద్ర వచ్చేందుకు అనేక కారణాలున్నాయి. రాత్రి పూట బరువైన భోజనము లేక ఎక్కువగా తిని ఉంటే నిద్ర వస్తుంది. మీకు గ్యాస్ట్రిక్ ట్రబుల్(గ్యాస్ సమస్య) ఉండినా యోగంలో నిద్ర వస్తుంది. దాని వైద్యము చేసుకోండి. శరీరము ఆరోగ్యంగా ఉండడం చాలా



అవసరము. మనము శరీరము కాదు, ఆత్మ అనేది వాస్తవమే కాని ఆత్మకు సేవ చేసేందుకు, పురుషార్థము చేసేందుకు శరీరము బాగుండాలి కదా. కనుక శరీరాన్ని  కూడా ఆరోగ్యంగా ఉంచుకోండి. శరీరాన్ని కాపాడుకోండి. అయితే మోహముతో కాక సాక్షిగా సంభాళించుకోండి. ఇది ఈశ్వరుని ద్వారా లభించిన గుర్రము. దీనికి తినిపించండి, త్రాపించండి, మాలిష్ చేయించండి. కాని శరీరము పై మోహముండరాదు. ఈశ్వరుని నుండి లభించిన వస్తువును ఈశ్వరీయ సేవలో ఉపయోగించి మీ భాగ్యాన్ని తయారు చేసుకోండి.

## ఎప్పుడూ బ్రాహ్మణుల పై రోబ్(దర్పము) చూపకండి

కలియుగాన్ని పరివర్తన చేసి సత్యయుగాన్ని తీసుకొచ్చేందుకు బాబా వచ్చారు. కనుక మీరు కూడా స్వయాన్ని చెక్ చేసుకోండి - " నాలో కలియుగ స్వభావ-సంస్కారాలు పరివర్తనై సత్యయుగ స్వభావ-సంస్కారాలు ధారణ అవుతూ ఉన్నాయా ? సత్యయుగీ సతో గుణ సంస్కారాలు వస్తున్నాయా? " మనము మారితే ప్రపంచము మారిపోతుంది కదా! మనము ఇతరులను ఎందుకు చెక్ చేయాలి? మనము స్వయాన్ని చెక్ చేసుకోవాలి. స్వయం పై భీకర రూపాన్ని ధరించండి, బ్రాహ్మణుల పై కాదు అని బాబా అంటారు. ఏ బ్రాహ్మణుని పైనా మీ ప్రతాపము చూపరాదు, కోపగించుకోరాదు. బ్రాహ్మణుల పై కోపగించుకోవడం చాలా పెద్ద పాపము. ఇది చిన్నదని భావించకండి. మీలోని చెడు పై, మీకు గల అవగుణాల పై క్రోధము చూపి వాటిని తొలగించుకోండి. ఎవరైనా మీ మాట వింటే మంచిదే. వినకపోతే, పోనీ అది వారి పాత్ర, వారి పై మీ కోపము, ప్రతాపము ఎందుకు చూపుతారు? ఎందుకు కన్నెర్ర చేస్తారు ? అందరి పాత్రలు వేరు వేరుగా ఉన్నాయి కదా? రాజధానిని గురించి అయితే మీకు తెలిసిపోయింది. రాజధానిలో రాజా, రాణి, దాస-దాసీలు, ఛండాలురు మొదలైనవారంతా ఉంటారు కదా. మన కర్తవ్యము అర్థం చేయించడం. ఎవరైనా అర్థం చేసుకోకుంటే మనమేం చేస్తాము! ఇప్పుడు అర్థం చేసుకునేందుకు కూడా ఎవ్వరూ ఇష్టపడని సమయం వచ్చేసింది. ఎందుకంటే  దేహ భావము వదిలిపోదు. కనుక " నేను ఎటువంటి కర్మ చేస్తానో, నన్ను చూచి అందరూ చేస్తారు", ఈ స్లోగన్ మనము పక్కా చేసుకోవాలి. మొదట మనము మన కర్మల ద్వారా చూపించిన తర్వాత అర్థం

చేయించాలి. అందరూ మన సంకల్పాలను కూడా అర్థము చేసుకుంటున్నారు, మన మాటలు కూడా అందరూ వింటున్నారు, మనము చేయు కర్మలు కూడా అందరూ చూస్తున్నారు అని గమనముంచుకొని నడుచుకోండి. నేను ఎవ్వరికీ దు:ఖమివ్వను, ఎవరి నుండి దు:ఖము తీసుకోను అని ప్రతిజ్ఞ చేయండి. భగవంతుడు నన్ను ఎన్నుకున్నారు. భగవంతుడే నన్ను తమ సహాయకారిగా ఉండేందుకు పిలిచారు. కనుక నేను ఇతరులకు దు:ఖమెందుకివ్వాలి? అందరికీ సుఖమునిచ్చేందుకు సుఖదాత అయిన నన్ను పిలిచారు.

## అందరి జతలో ఉండండి, జతలో నడవండి, అందరికీ సహయోగమివ్వండి, అందరితో కలసి సేవ చేయండి.

ఈశ్వరీయ ప్రేమ, ప్రభువు ప్రేమ ఎటువంటిదనగా - ఎవరినైనా సమర్పణ చేయిస్తుంది. అందరినీ ప్రేమించండి, అందరికీ ప్రేమను ఇవ్వండి. ప్రభు పసందుగా, లోక పసందుగా అవ్వండి. అందరూ స్వయాన్ని(తమను తాము) ఇష్టపడతారు. లోకపసంద్ అనగా లౌకికమువారు కాదు, ప్రపంచములోని వారు కాదు, బ్రాహ్మణ పరివారము ఇష్టపడాలి. చాలామంది బాబా లభిస్తే ఇక ఏమీ వద్దు, ఎవ్వరూ వద్దు అని భావిస్తారు. కాని అలా కాదు. ఇది సమూహము. ఇచ్చట అందరితో కలసి-మెలసి నడవాలి. మనము బాబా పిల్లలము, బాబాకు సమర్పితమయ్యాము, ఏ విషయానికి భయపడాలి? అందరి జతలో ఉండండి, అందరి జతలో నడవండి, అందరికీ సహయోగమివ్వండి, అందరితో కలిసి సేవ చేయండి. అందరి మధ్య ఉన్నప్పుడే కదా నా ద్వారా బాబా ప్రత్యక్షత జరుగుతుంది. కనుక భయపడకండి, మైదానములోకి రండి, అందరితో కలిసి ముందుకు వెళ్లండి. యోధునిగా అయ్యి యుద్ధము చేయండి. విజయము పొందాలి. విజయము మన జన్మ సిద్ధ అధికారము. మనము బాబాగారి విజయీ పిల్లలము. మనము మాలలోని మణులము. మీ సంకల్పాలు శ్రేష్ఠంగా చేసుకోండి. స్వమానాన్ని ధారణ చేయండి, భగవంతుని మీ జతలో ఉంచుకుంటే అసంభవమైన విషయాలు కూడా సంభవమైపోతాయి. ఈ యుగమే అటువంటిది. మనన చింతన, రైటుగా పాజిటివ్‌గా చేయండి. అప్పుడు శక్తి నిండుతుందో లేదో చూడండి. శక్తి నింపుకోవడం లేక బలహీనపడడం మీ



పైనే ఉంది. శక్తిశాలి సంకల్పాలు, శ్రేష్ఠ సంకల్పాలు చేస్తే శక్తిశాలిగా అవుతారు. బలహీన సంకల్పాలు, నెగటివ్ సంకల్పాలు చేస్తే బలహీనంగా, పిరికివారుగా అవుతారు. నెగటివ్‌ను కూడా పాజిటివ్‌గా మార్చుకుంటే మీ యోగము కూడా ఎంత బాగా కుదురుతుందో చేసి చూడండి. కేవలం ఒక సెకండు విషయమే. పాజిటివ్ సంకల్పాలు చేస్తూనే బుద్ధి దివ్యంగా, శ్రేష్ఠంగా తయారవుతుంది.



## ఓ కుమారులారా, మేల్కోండి ఇతరులను మేల్కొల్పండి

బాబా, ఎన్నో ప్రకారాల బంధనాలున్నాయి, మేము వాటి నుండి బంధనముక్తులుగా అయిపోయాము అని పిల్లలంటారు. బంధనమంటే ఏమిటో కూడా తెలియనివారు ఉండవచ్చు. పిల్లలు మేము బంధనముక్తులుగా అయిపోయాము అని భావించినా, బంధనముక్తులుగా అవ్వకుండా ఉండడం మంచిది కాదు కదా! బంధనముక్తులుగా అయినప్పుడే తండ్రి తమ జతలో తీసుకెళ్తారు. బంధనముక్తులుగా అయినప్పుడే సంపన్నంగా అవుతారు, సంపూర్ణంగా అవుతారు. ఏదైనా బంధనముంటే ఆ బంధనము ఆకర్షిస్తుంది. బుద్ధిని తనవైపుకు ఆకర్షిస్తుంది. యోగము కొరకు బంధనముక్త బుద్ధి అవసరము. ఎక్కడా ఏ బంధనమూ ఆకర్షించరాదు. అప్పుడు బుద్ధి సహజంగా ఏకాగ్రమవుతుంది. ఒక్కరితోనే సర్వ సంబంధాలు జోడింపబడాలి. బంధనముక్తులుగా అవ్వకుంటే కష్టమవుతుంది. ఈ జ్ఞానము కష్టమైనది కాదు, శ్రమ చేయునది కాదు, సహజమైనది. ఇది సహజ జ్ఞానము, సహజ యోగము. సహజ యోగమనగా మిలనము. మిలనము చేయుటలో ఆనందముంటుంది. తండ్రి పిల్లలతో మిలనము చేస్తే ఆనందమే ఆనందము. తప్పిపోయిన పిల్లలు కల్పములో ఒక్కసారి కలుస్తారు. తండ్రితో కలుసుకునేందుకు పిల్లలకు ఎంత సంతోషముంటుంది! కనుక యోగమనగా మిలనము. సంబంధము ద్వారా కలుసుకోవడం చాలా సులభము. మనుష్యులు హఠయోగము చేస్తారు, కష్టపడ్తారు. అందులో శ్రమ ఉంది. భగవంతునితో కలుసుకునేందుకు వారు కష్టపడ్తారు, శ్రమ చేస్తారు, హఠయోగము చేస్తారు. కొంతమంది ప్రాణాయామము చేస్తారు, కొంతమంది జపము చేస్తారు, కొంతమంది కర్మకాండ చేస్తారు, కొంతమంది యాత్రలు చేస్తారు. వాటిలో కష్టముంది, ధనము కూడా ఖర్చు అవుతుంది. సమయము కూడా చాలా పడ్తుంది, సంకల్పాలు కూడా చాలా జరుగుతాయి. అయినా ఎల్లప్పుడూ దూరముగానే ఉంటారు.

బంధనమంటే ఏమిటో తెలిస్తే దానిని సమాప్తము చేసుకునే పురుషార్థము చేస్తారు కదా! కనుక ఏ ఏ బంధనాలున్నాయో ప్రతి ఒక్కరూ చూసుకోండి. మన చిత్రమును ఒకదానిని చూశారు కదా - ఒక గృహస్థుడు ఎన్ని తాళ్లతో బంధింపబడి ఉన్నాడు! కుమారులు ఎన్ని బంధనాలలో బంధింపబడి



ఉన్నారు? మీరైతే గృహస్థులు కాదు, కుమారులు. కుమారులు అనగా స్వతంత్ర పక్షులు.

### సంగమ యుగములో తండ్రి తన ఎదుట కూర్చుని ఉన్న పిల్లలకు బంధనాల నుండి ముక్తులుగా అయ్యే శిక్షణను (ట్రైనింగ్) ఇస్తారు.

ఈ పురుషోత్తమ సంగమ యుగములో మన తండ్రి అయిన పరమాత్ముడే స్వయంగా మన సన్ముఖములోకి వస్తారు. తండ్రి - పిల్లల మిలనము సన్ముఖములో జరుగుతుంది. నవ్వడం, ఆహ్లాదంగా ఉండడం, తినడం, తాగడం ఈ సంగమ యుగములో జరుగుతుంది. వాహ్! భగవంతునితో మిలనము



దాదీ చంద్రమణిగారు దాదీ ప్రకాశ్ మణిగారి జతలో జగీష్ అన్నయ్యగారు, దాదీ మనోహర్ ఇంద్రగారు, దాదా ఆనంద్ కిశోర్‌గారు, బృజ్‌మోహన్ అన్నయ్యగారు, నిర్వైర్ అన్నయ్యగారు మరియు మధువనములోని అనేకమంది అక్కయ్యలు-అన్నయ్యలు

చేయడం ఇప్పుడు ఎంత సహజమైపోయింది! భగవంతునితో కలవడం చాలా కష్టమని మనుష్యులు భావిస్తారు. ఎందుకంటే వారు వేలాది సూర్యుల కంటే తేజోమయమైన వారని భావిస్తారు. వారితో ఎలా కలుసుకుంటారు! అందువలన పాపం మనుష్యులు చాలా శ్రమ చేస్తున్నారు, కష్టపడుతున్నారు. అక్కడ అరుస్తూ, పిలుస్తూనే ఉన్నారు. ఇక్కడ సమక్షములో కూర్చొని సంతోషిస్తున్నారు. మనకు అరుపులు, పిలుపులు లేవు. అవన్నీ సమాప్తమైపోయాయి.

ఈ పురుషోత్తమ యుగము చాలా విలువైనది. ఇందులో సంకల్పాలు, మాటలు, కర్మలలో ఉన్నతమయ్యే కళ ఉంది. అందుకే మీరు ఉన్నతి అవుతే మీ ద్వారా సర్వులకు మేలు జరుగుతుంది అని అంటారు. బాబా పిల్లలైన మనదేమీ వ్యర్థము కాకుండా ఉండేందుకు మనకు ట్రైనింగ్ ఇస్తున్నారు. సూక్ష్మాతి సూక్ష్మమైన చదువును చదివిస్తున్నారు. ఎంతో కాలము నుండి తగ్గిపోయిన ఆధ్యాత్మిక శక్తిని ఈ కొద్ది సమయములో మళ్లీ ప్రాప్తి చేసుకోగలము. బాబా ఈ చదువునంతటినీ ఎంతో సహజ రూపంలో చదివించారు. నవ్వుతూ, ఎగురుతూ ఏ శ్రమా లేకుండా, ఒంటరిగా కాక పరివారమంతటి జతలో కూర్చొని, తండ్రి వద్ద చదువుకుంటున్నాము. వారు మన ఎదుట స్వయంగా కూర్చొని చదివిస్తున్నారు, మిలనము కూడా చేస్తున్నారు. తండ్రి ఎంత ప్రియమనిపిస్తారో, పరివారము కూడా అంత ప్రియమనిపిస్తే మిలనము జరిగిపోతుంది. దూరమైన తండ్రి నుండి, దూరమైన పరివారము నుండి కూడా ఈ సంగమ యుగములోనే మిలనము చేస్తాము. కనుక ఈ సమయము, ఈ యుగము ఆనందమే ఆనందమైనది కదా! ఎప్పుడూ ఉదాసీనత రాకూడదు. ఎవరైనా ఉదాసీనముగా ఉంటే దానికి కారణము - వారి స్వంత సంస్కారాలకు వశమవ్వడం, నెగెటివ్‌గా ఆలోచించడం. నెగెటివ్‌ను పాసిటివ్‌గా మార్చుకునే ట్రైనింగ్ ఈ సమయములో బాబా ఇస్తారు. దీని వలన మనము బంధనముక్తులుగా అయిపోతాము. అంత సులభముగా ఎవ్వరూ బంధనముక్తులుగా అవ్వలేరు, దాని కొరకు చాలా మంచి ట్రైనింగు అవసరము.

## కంఠస్థము చేయకండి, అర్థ సహితముగా స్వరూపములో స్థితమవ్వండి

జ్ఞానములోకి వచ్చిన తర్వాత అజ్ఞాన కాలములోని సంస్కారాలు, భక్తి కాలములోని అనేక సూక్ష్మ సంస్కారాలు త్వరగా పోవు. ఆ సంస్కారాలు మనలను



బంధనములో పడవేస్తాయి. భక్తికి ఫలితము జ్ఞానము. భక్తికి అంతము జ్ఞానము. అయినా భక్తి సంస్కారము మనలో ఉంటే అది లోపల నుండి పని చేస్తూ ఉంటుంది. మనము జన్మ-జన్మాంతరాలుగా భక్తి చేసి ఉన్నట్లయితే మనము నోటి ద్వారా శివబాబా-శివబాబా అని అంటూ ఉంటాము. శివబాబా నాకు సహాయము చేయండి, శివబాబా నాకు ఇది చేయండి, అది చేయండి అని అంటూ ఉంటారు. ఎలాగైతే వారు నోటి ద్వారా రామ-రామ, ఓం నమ: శివాయ, శివ-శివ అని మాటి మాటికి పలుకుతూ ఉంటారో, అలా ఇక్కడ కూడా శివబాబా - శివబాబా అని అంటూ ఉంటారు. ఇక్కడ నోటితో వల్లె వేయరాదు. కేవలం నోటితో ఓం అని చెప్పడం కాదు. ఓం అర్థములో స్థితమై చెప్పాలి. పిల్లలూ, ఓం అనగా అర్థమేమి అని బాబా అడుగుతారు కదా. ఈ భక్తి సంస్కారము నుండి బాబా మనలను ఎలా పరివర్తన చేసేశారు! మనమందరమూ ఆ సంస్కారములోనే ఉండేవారము. మనము కూడా నోటి ద్వారా వల్లె వేయు సంస్కారము నుండి ముక్తులుగా లేము. చాలా విషయాలలో బాబా మమ్ములను మీరు భక్తులు అని అనేవారు. బాబా తమ మంచి-మంచి పిల్లలను కూడా మీరు భక్తులు అని అనేవారు. మనలోని సూక్ష్మ సంస్కారాలను గమనిస్తూనే బాబా ఈ బిడ్డ ఇంకా భక్తుడుగానే ఉన్నాడు అని చెప్పేవారు. ఇంకా ఆ సంస్కారము పోలేదు అని చెప్పేవారు. బాబా ఏమో స్వయం జ్ఞాన పూర్ణులు, సర్వజ్ఞులు, అన్నీ తెలిసినవారు. బాబా ఎక్కడ! మనము ఎక్కడ! ఇప్పుడు మనము సంపన్నంగా అవ్వాలి, తండ్రి సమానంగా అవ్వాలి అని తెలిసిపోయింది. కాని ప్రారంభంలో వారికి మనకు రాత్రికి-పగలుకు ఉన్నంత వ్యత్యాసముండేది కదా.

నాకు(చంద్రమణిదాదిగారు) బాగా గుర్తుంది. ఒకసారి నేను బాబాతో - బాబా, కలుసుకునేందుకు వచ్చిన పిల్లలు మీతో కలిసి ఒక ఫోటో తీయించుకోవాలని అనుకుంటున్నారు అని చెప్పాను. అప్పుడు బాబా భక్తులు వచ్చారు, భక్తులు అని అన్నారు. బాబా నన్ను కూడా భక్తులలో కలిపేశారు. అందుకు నేను బాబా ఈ మాట అన్నది నేను కాదు, వచ్చిన పిల్లలు అంటున్నారు అని అన్నాను. అందుకు బాబా వారూ భక్తులే, నీవు కూడా భక్తురాలివే అని అన్నారు. బాబా, మనలను ఎలా చెక్ చేస్తారో గమనించండి. మనలోని ఎన్నో సూక్ష్మ సంస్కారాలు వారికి తెలుసు. బాబా మనలను దూరముగా బేహద్‌లోకి

తీసుకెళ్తారు. ఎంత దూరము తీసుకెళ్తున్నారంటే మనము ఎక్కడ నుండి వచ్చామో ఆ మన ప్రపంచానికి తీసుకెళ్తున్నారు. మనకు మనము ఎక్కడ నివసించేవారమో, మన ప్రపంచము గురించే తెలియకుండా ఉండేది, అంతేకాక మన తండ్రి ఎవరో కూడా తెలియకుండా ఉండేది. మనము అశరీరులమని, మన ప్రపంచము చంద్రుడు, నక్షత్రాల కంటే ఉపరిభాగాన ఉందని కూడా మనకు తెలియదు. బాబా తెలిపినంత వరకు మనము సాకార విషయాలే మాట్లాడేవారము, మనలను సాకార శరీరముగానే భావించేవారము.

శివబాబా ఏ రథములో వచ్చారో ఆ రథాన్ని సదా ఈ కనులతో చూస్తూ ఉండాలనే ఆశ ఉండేది. అరే, తండ్రి ఒక్కసారి మాత్రమే సాకారములో, సన్ముఖములో వస్తారు. సాకారములో సన్ముఖముగా వచ్చి పిల్లలతో కలవడం, మాట్లాడడం చిన్న విషయమా? భాగ్యవిధాత మన సమక్షములో సన్ముఖములో వచ్చి కలుసుకొను చిత్రము కూడా అనుభవమవుతుంది. ఆ చిత్రమును ముందుంచుకుంటే అలా చూస్తూనే ఉండిపోవాలని మనసు కోరుకుంటుంది. బాబా చెప్పారు - పిల్లలైన మీరందరూ వానప్రస్థ అవస్థలో ఉన్నారు. శబ్దానికి దూరముగా ఉండేవారు. బాబా ఏ స్థితిని ధారణ చేయమంటారో దానిని ధారణ చేస్తే మన బంధనాలు సమాప్తమైపోతాయి. బాబా తెలిపిన స్థితిలో మనముంటే భక్తి సంస్కారమేదీ ఉదాహరణకు మూఢనమ్మకాలు, ప్రార్థన చేయడం, వేడుకోవడం మొదలైనవన్నీ సమాప్తమైపోతాయి. ప్రపంచానికి నా పిల్లలు సాక్షాత్కారము కావాలని బాబా కోరుకుంటారు. కనుక ఓం యొక్క అర్థ స్వరూపములో స్థితులై ఉండండి. నేను, నా తండ్రి ఇరువురమూ ప్రకాశములో ఉండేవారము. పూర్తిగా ఉపరిభాగాన ఉండు స్థితిలో స్థితమై ఉండండి. ఈ నిరాకార స్థితి ద్వారా మనలోని ఎటువంటి కఠిన సంస్కారాలైనా సమాప్తమైపోతాయి, బంధనాలు కూడా తెగిపోతాయి. మనము బంధనములో తగుల్కొని ఉన్నామనే అనుభూతే లేకుంటే వాటి నుండి ముక్తులుగా ఎలా అవుతారు?



## బాబా మీ ఎదురుగా ఉన్నప్పుడు, ఎదురుగానే ఆనందాన్ని అనుభవించండి, మిగిలిన సమయములో పరంధామములో స్మృతి చేయండి

బాబా చాలా సార్లు చెప్తారు - నిరాకారమును సాకారములో చూడండి. అప్పుడప్పుడు నిరాకారులుగా తయారై నిరాకారుని నిరాకార ప్రపంచములో చూడండి. అవ్యక్తమై అవ్యక్త వతనములోకి వచ్చేయండి, నాతో మిలనము చేయండి అని అంటారు. మరోసారి బిందు స్థితిలో కూర్చోండి అని అంటారు. ఒకప్పుడు పరంధామములో బీజరూప స్థితిలో స్థితమవ్వండి అని అంటారు. బీజరూప స్థితిలో మీ కర్మబంధనాలు తెగిపోతాయి, వికర్మలు దగ్ధమైపోతాయి. ఎటువంటి కఠిన సంస్కారాలైనా సమాప్తమైపోతాయి, మీరు వాటి నుండి ముక్తమైపోతారు. ఒకసారి నేను పార్టీ తీసుకొని బాబా వద్దకెళ్లాను. బాబా వారితో - పిల్లలూ, మీరు బాబాను ఎక్కడ స్మృతి చేస్తారు? అని అడిగారు. అందుకు పిల్లలు - "బాబా, మేము పరంధామములో స్మృతి చేస్తాము అని చెప్పారు. బాబా వారిని మీరు ఫెయిల్ అయ్యారని చెప్తూ, పిల్లలూ! మీ ముందే తండ్రి కూర్చుని ఉన్నారు కదా. వారే కదా మిమ్ములను అడుగుతూ ఉండేది అని అన్నారు. పరంధామములోని తండ్రి మీ ముందు కూర్చుని మీతో మాట్లాడుచున్నారు, మీరు వారిని పరంధామములో స్మృతి చేస్తే వారితో ఆనందమునెలా అనుభవిస్తారు ? బాబా సూక్ష్మమైన విషయాలను ఎలా ట్రైనింగ్(శిక్షణ) ఇస్తారో గమనించండి. అప్పుడప్పుడు నేను ఆలోచిస్తాను - చాలా సాధారణ(చిన్న) విషయమే. కాని సాధారణ విషయాన్ని కూడా బాబా ఎలా చెప్తారంటే నిజంగా ఆ పిల్లలు లోతైన రహస్యములోకి వెళ్లి అర్థము చేసుకునే రీతిగా తెలుపుతారు. అరే, బాబా ఎదురులో నిల్చొని ఉన్నారు. వారిని వదిలేసి మనము బుద్ధిని పరంధామములో జోడిస్తే బాబా ఏదైతే ఇస్తున్నారో, దానిని ఎలా ప్రాప్తి చేసుకోగలము ? బాబా అయితే మన ఎదుటనే ఉన్నారు.

## సాకార బాబా పురుషార్థము చేసిన విధానాన్ని మీ ముందుంచుకోండి

పాత సోదరీలు బాబాతో పాటు 14 సంవత్సరాలు తపస్సు చేశారని మీరు చెప్పారు కదా. అయితే మేము ఏ తపస్సు చేశాము? మేము బాబాను పైన

పరంధామములో స్మృతి చేయలేదు. బాబా ప్రతి సమయములో మా జతలో ఉండేవారు. నిద్ర లేచినప్పటి నుండే మా దినచర్య బాబా జతలో ప్రారంభమయ్యేది. మేము కూర్చున్నా, తిరిగినా, కర్మణా సేవ చేసినా, యోగము చేసినా, క్లాసు విన్నా అన్నీ బాబా జతలోనే జరిగేవి. కనుక మేము ప్రపంచమునెందుకు మర్చిపోము? ప్రపంచాన్ని మర్చిపోయేందుకు మేము ఏ పురుషార్థము చేయలేదు. మా పాత సంస్కారాలు ఎలా మారిపోయాయో మాకు తెలియనే తెలియదు. ఈ రోజు నేను హృదయపూర్వకముగా మీకు తెలుపుతున్నాను - బాబాలో ఎంత ఆకర్షణ ఉండేదంటే మేము సర్వమూ మర్చిపోయాము. మనము ఆయస్కాంతమైన బాబాను పూర్తిగా ఎప్పుడు గుర్తిస్తామో అప్పుడు వారి పట్ల ఆసక్తి ఏర్పడుతుంది, ఆత్మలో ఏర్పడిన తృప్తి, మలినాలు వదిలిపోతాయి. బాబా ఒక సాధారణ వ్యక్తి వలె పిల్లలతో కలిసి కూర్చుని పిడకలు చేసేవారు, కూరగాయలు తరిగేవారు. బాబా, ఎవరైనా మీతో కలిసేందుకు వచ్చిన జిజ్ఞాసువులు మిమ్ములను ఇలా చూస్తే ఏమనుకుంటారు? అని అడిగేవారము. మీరు ఇంత చిన్న పని చేస్తూ ఉంటే వారు ఏమనుకుంటారు? అని మేము అడిగేవారము. అందుకు బాబా, నేను పిడకలు చేసేది వారికి కనిపించనే కనిపించదు. వారికి ఈ పేడ గోళాలలో మూడు లోకాలు కనిపిస్తాయి. బాబా సాధారణ కర్మ చేస్తున్నా ఏ స్థితిలో నిల్చొని ఉన్నారో, ఏ స్థితిలో ఉండి కర్మ చేస్తున్నారో గమనించారా! అని మమ్ములను అడిగేవారు. బాబాలోని ఆ భావము, ఆ నషా, ఆ లక్ష్యము చూడదగింది, గమనించదగింది. మేము ప్రాక్టికల్‌గా చూశాము - అటువంటి సమయములో బాబా వద్దకు ఏ జిజ్ఞాసువులు వచ్చినా, బాబా ద్వారా సాక్షాత్కారము పొంది పోయేవారు. అలా పిల్లలైన మేము కూడా సాధారణమే, కాని తపస్వీ పిల్లలము. తపస్వీలనగా బాబాతో మిలనము చేయువారు. తపస్సు ద్వారా బంధనాలు తెగుతూ పోతాయి.

## కుమారులారా, స్వయాన్ని గోపికలుగా భావించండి

చాలామంది కుమారీలు బంధనములో ఉండేవారు. వారికి చాలా బంధనాలుండేవి. బాబా ఇక్కడ ఉంటున్నా ఆ పిల్లలను గుర్తు చేసుకునేవారు, వారికి శక్తినిచ్చేవారు. మా వద్దకు ఒక సోదరి వస్తూ ఉండేది. ఆమె పాటలు పాడేది. పాడేటప్పుడు ఆమె కనుల నుండి అశ్రువులు(కన్నీరు) ఎలా వచ్చేవంటే,



ఒక చిన్న డబ్బీలో పడ్తే, అది నిండిపోయేది. ఆ డబ్బీని బాబా వద్దకు పంపించాము. డబ్బీతో పాటు - చూడండి బాబా! మీ గోపిక మిమ్ములను ఎంతగా స్మృతి చేస్తున్నదో! అని ఒక చిన్న చీటి కూడా వ్రాశాము. ఆ రోజు దాదీ కూడా మీకు చెప్పినారు కదా - "ఓ కుమారులారా, మీరు స్వయాన్ని కుమారులుగా భావించకండి, గోపికలుగా భావించండి. గోపికలుగా భావిస్తే బాబా ప్రేమలో, బాబాగారి లగ్నములో దీపము పై దీపపు పురుగులు సమర్పణైపోయినట్లు సమర్పణైపోతారు. ఒకవేళ స్వయాన్ని కుమారులుగా భావిస్తే మీరు అంతగా లగ్నమవ్వలేరు. మీ స్థితి రసహీనంగా అయిపోతుంది. భాగవతములో గోపికల ప్రేమను గురించిన గాయనముంది. ఉద్ధవుని జ్ఞానిగా తెలిపారు, అయితే రసహీనమైన ఉద్ధవునిగా చూపించారు. బాబాను గుర్తించడం, ప్రేమలో, స్నేహములో సమర్పణవ్వడం, బాబాగారి ప్రతి సంకల్పాన్ని తెలుసుకోవడం చాలా అవసరం. బాబా ప్రేమసాగరులు, జ్ఞానసాగరులు. ప్రారంభము నుండి ఈ రోజు వరకు ప్రతి రోజు మురళి వినిపించి మనకు ఎంత జ్ఞాన ధనము ఇచ్చారు! కొద్దిగా ఆలోచించండి, మనమేమి సంపాదించుకున్నాము? సూక్ష్మమైన అవినాశి సంపదను ప్రోగు చేసుకున్నామా? మనమంత ధనవంతులుగా ఉన్నామా? బాబా మనకు ప్రేమ కూడా ఎంత గొప్పగా ఇచ్చారు! మనమెన్ని తప్పులు చేశాము! జన్మ-జన్మాంతరాలుగా తప్పులు చేస్తూనే వచ్చాము. దేహధారుల పై ఆకర్షణ ఏర్పడింది, వారికి లొంగిపోయాము. దేహధారులతో సంబంధము జోడించి బంధింపబడ్డాము. లౌకికములో ఎలా చిక్కుకొని ఉండినామో! ఈ రోజు బాబా మనలను ఆ బంధనాలన్నిటి నుండి ఎలా విడిపిస్తున్నారో పిల్లలైన మనకు తెలియను కూడా తెలియడం లేదు. తల్లిగా, తండ్రిగా, ప్రేమతో పాలన చేసి మనలను ఆ మాయావి ప్రపంచము నుండి ఎలా విడిపించారు, సమర్పణ చేసుకున్నారు! ప్రేమసాగరులు మన తప్పులన్నిటిని క్షమించారు కదా! వారు ప్రాక్టికల్‌గా వాస్తవమైన ప్రేమసాగరులు! మన పై ఎంత జాలి చూపించారు! మనకు ఎన్ని ఆశీర్వాదాలిచ్చారు! యోగములో మనము వారితో కలుస్తున్నాము. ప్రతి క్షణము మేము బాబాతో కలుస్తున్నామని భావించాలి.

## ప్రతి క్షణము మిలనములోని ఆనందాన్ని అనుభవించండి

పాట విన్నప్పుడు, ఆ పాట మనమే పాడుతున్నామని అనుభవము

చేస్తున్నారు కదా. అలా భావిస్తే బాబా మన ముందే ఉన్నట్లు, వారితో ఆత్మిక సంభాషణ చేస్తున్నట్లు అనుభవమవుతుంది. ఇటువంటి ఆత్మిక సంభాషణ చేస్తే మన కర్మ బంధనాలెందుకు తెగిపోవు? తండ్రితో బుద్ధియోగము ఎందుకు జోడింపబడదు? బాబా పాటలు పాడడం, బాబాతో ఆత్మిక సంభాషణ చేయడం, బాబా డ్రామానే అభినయిస్తూ ఉంటే పాత ప్రపంచము ఎందుకు గుర్తుకొస్తుంది ? అది గుర్తుకే రాదు. మనము బాబాను అర్థము చేసుకొని, అర్థము తెలుసుకొని పాట పాడినా, ఆత్మిక సంభాషణ చేసినా అనుభవమవుతుంది. పాట వినపడుతూ ఉంటే, నేనే పాట పాడుతున్నానని భావించాలి. ఈ పాటలెందుకు వేస్తారు? బాబాతో మిలనము చేసేందుకు. ఎర్ర లైటు ఎందుకు వెలిగిస్తారు, తెల్ల లైటు ఎందుకు వెలిగించరు? బాబాతో మనము మిలనము చేసేది ఇక్కడ తెల్లని కాంతిలో కాదు. ఎర్రని కాంతిలో అనగా అక్కడ పరంధామములో మిలనము చేస్తాము. శరీరము ఇక్కడ ఉంది కాని ఆత్మ అక్కడ ఎర్రని కాంతిలో బాబాతో కలుస్తుంది. యోగములో ఆత్మ పరమాత్మతో కలుస్తుంది. దీనినే మిలనములో ఆనందమును అనుభవించుట అని అంటారు.

మన ఒక్కొక్క సెకండు చాలా విలువైనది. వాణి(మురళి) వినే సమయంలో ఏ ఇతర సంకల్పమూ రాకూడదు. బాబా నాతో మాట్లాడుతున్నారని భావించండి. వాణి వినే సమయంలో భగవంతుడు వచ్చి నాతో కలుస్తున్నారని, టీచరై నన్ను చదివిస్తున్నారని భావించండి. నేను వారి విద్యార్థిని. మనము తప్ప ఇతరులెవరైనా భగవంతుని విద్యార్థులుగా అయ్యారా? మనలను చదివించేదెవరు! ఈ సంకల్పముతో ఎవరు చదువుకుంటారో వారు ఎప్పుడూ మురళిని మిస్ చేయరు. వారి బుద్ధి శుద్ధమవుతూ పోతుంది, దివ్యముగా తయారవుతూ పోతుంది. బుద్ధి దివ్యముగా అవ్వకుంటే జ్ఞానరత్నాలు బుద్ధిలో నిలువవు. బుద్ధిలో జ్ఞానము లేకుంటే బుద్ధి ఇటు-అటు తిరుగుతూ ఉంటుంది. దీని ద్వారానే నంబరువారుగా అవుతూ పోతారు. కొంతమంది మొదటి నంబరులో, కొంతమంది రెండవ నంబరులో, కొంతమంది మూడవ నంబరులోకి వచ్చేస్తారు, కొంతమంది ఫెయిల్ కూడా అవుతారు.

## బాబాను కూడా వేడుకోకండి - బాబా చెప్పినట్లు చేయండి

మాయ ఎందుకు వస్తుంది? మన దృష్టి-వృత్తి ఎందుకు



చంచలమవుతుంది? ఇటువంటి మురికి(అపవిత్ర) దృశ్యాలను చూచినా, మురికి పుస్తకాలను కొద్దిగా చదివినా దృష్టి-వృత్తి చంచలమవుతుంది. ఒకటేమో అనేక జన్మల నుండి ముందే ఉన్న వికారీ సంస్కారాలు, రెండవది - ఇప్పుడు కొత్తగా బాహ్యము నుండి వేస్తున్నారు. అందువలన ఆత్మలో భూతమొచ్చి కూర్చుంటుంది. నేను భూతానికి(వికారానికి) వశమవ్వాలని ఎవరైనా కోరుకుంటారా? ఎవ్వరూ కోరుకోరు. భూతాలను పారద్రోలేందుకు యోగము చాలా చేయాలి. చాలాకాలపు యోగాభ్యాసము కావాలి. బాబా చెప్తారు - పిల్లలూ! మీ యోగము తెగకుండా ఉండునట్లు మీ దినచర్యను తయారు చేసుకోండి. కర్మలు చేస్తున్నా యోగములో ఉండాలి. సదా బాబాతో మిలనమే మిలనముండాలి. యోగము యోగముగా ఉండరాదు, మిలనముగా ఉండాలి. యోగమనే శబ్ధము భక్తిమార్గములోనిది. ఇంకా మనలో భక్తి సంస్కారముంది. అందుకే మాయ వస్తుంది. అందువలన మనము బాబాను పిలుస్తాము - బాబా, మీరు మమ్ములను మాయ నుండి విడిపించకపోతే ఇంకెవరు విడిపిస్తారు? బాబా వచ్చిందే మాయ నుండి విడిపించేందుకు. అయితే బాబా దారి చూపుతారు. చూపిస్తున్నారు కూడా. కాని బాబా ఏ దారిలో నడవమంటున్నారో ఆ దారిలో నేను నడుస్తున్నానా? దాని పై నాకు గమనముందా? అని పరిశీలించుకోవడం పిల్లల కర్తవ్యము. బాబాను వేడుకోవడం భక్తి సంస్కారము. వేడుకునేవారు(అడుక్కునేవారు) బాబాతో మిలనము చేయడం లేదు, లోలోపల వెతుకుతూ ఉంటారు, తిరుగుతూ ఉంటారు. బాబా నుండి దూరముగా ఉంటారు, బాబా నుండి మిలనము చేయుటలోని ఆనందాన్ని తీసుకోలేరు.

బాబా నుండి ఎందుకు దూరంగా ఉన్నారు? లోపల వికారాలున్నాయి. వికారాలకు వశీభూతమై ఉన్నారు. యోగము లేనందున వారిలో యోగశక్తి ఉండదు. యోగశక్తి లేనందున వారిని వికారాలు బంధించాయి. వికారాలనే తాడుతో బంధింపబడి ఉన్నారు. బంధనము నుండి ముక్తులుగా అవ్వాలనుకుంటారు కాని వికారాలు వారిని వెలుపలకు పోనివ్వవు. యుద్ధము జరుగుతుంది. వారి సమయమంతా యుద్ధములోనే పోతుంది. కనుక బాబా అంటారు - పిల్లలు లోపల అనేక బంధనాలలో బంధింపబడి ఉన్నారు. పిల్లలలో ఇప్పటివరకు కోరికలున్నాయి. కామనలను పరివర్తన చేసుకోమని బాబా

అంటున్నారు. కొన్ని చెడు కామనలూ ఉంటాయి, కొన్ని మంచి కామనలు కూడా ఉంటాయి. కామనలు ఆత్మలో ఉంటాయి. ఆ కామన(కోరిక)ను శ్రేష్ఠముగా, శుభ కామనగా పరివర్తన చేసుకోండి. పరమాత్మను పొందుకునేందుకు, వారిని సన్ముఖములో కలుసుకునేందుకు ఏ కోరికైతే ఉండేదో దానిని పూర్తి చేసేశారు. ఇప్పుడు వారు మనలను చదివిస్తున్నారు. మిలనమేమో చేశారు. మిలనము చేయు సమయము ఇదే. ఇప్పుడు భగవంతుడు మనలను తమ పుత్రులుగా చేసుకున్నారు. ఇంకేం కావాలి ? ఎక్కడో నేను మురికి గంపలో పడి ఉండినాను. అక్కడ నుండి నన్ను తెచ్చి బాబా తమ ఇంటిలో శరణు(రక్షణ) ఇచ్చారు. దత్తత చేసుకొని తమ పుత్రునిగా చేసుకున్నారు. ఇదేమైనా చిన్న విషయమా? భగవంతుని పిల్లలమైన మనము, మన తండ్రి అయిన భగవంతుని మర్చిపోయాము. మన ఇంటిని మర్చిపోయి, మురికి గంపలో పడి ఉండినాము. అటువంటి మనలను పరమపిత పరమాత్మ ఎత్తుకొని, హృదయానికి హత్తుకొని, శిక్షణనిచ్చి, అపురూపమైన పిల్లలూ, ప్రియమైన పిల్లలూ ! అంటూ ప్రేమించడం ఇదేమైనా తక్కువ విషయమా ? తండ్రి కూర్చొని ఎలా చదివిస్తున్నారో చూడండి. నమస్కరిస్తారు, ప్రియమైన పిల్లలూ! అని పిలుస్తారు. ఇటువంటి తండ్రి మహావాక్యాలను మర్చిపోవడం, వారి శ్రీమతమును మర్చిపోవడం - సాధ్యమా? మనము ఎంతెంత వారి శ్రీమతమును ఉల్లంఘిస్తామో, అంత వియోగములో ఉంటాము.

## కుమారులారా, మీ శ్రేష్ఠ ధారణల ద్వారా, శ్రేష్ఠమైన జీవితము ద్వారా తండ్రిని ప్రత్యక్షము చేయండి

బాబా శ్రీమతము పాటించమని ఎందుకు ఒత్తిడి చేస్తారు? బాబా నుండి లభించు ఒక్కొక్క శ్రీమతమును మనము ప్రాక్టికల్‌గా అనుసరించినప్పుడు మన కర్మబంధనాలు తెగిపోతాయి. బుద్ధి దివ్యంగా తయారవుతుంది. బుద్ధి దివ్యంగా అయినప్పుడే మనము శ్రేష్ఠ కర్మలు అనగా సత్కర్మలు చేస్తాము. మనము శ్రేష్ఠ కర్మలు చేయకుంటే బంధనాలు కూడా తెగిపోవు. యజ్ఞములోకి అనేకమంది కుమారీలు వచ్చారు. ఒకసారి పెద్దదాదీ ఈ క్లాసులో బంధనములో ఉన్న కుమారులు ఎంతమంది ఉన్నారో వారు లేచి నిలబడండి అని అన్నారు.



చాలామంది కుమారులు లేచి నిలబడ్డారు. బంధనములో ఉన్న కుమారీలను చూశాము, కాని ఆ రోజు నేను బంధనములో ఉన్న కుమారులను మొదటిసారి చూశాను. అరే! మీరు కుమారులు కష్టపడ్తారు, సంపాదిస్తారు, తల్లిదండ్రులకు ధనము కూడా ఇస్తారు, యజ్ఞ సేవ కూడా చేస్తారు. పవిత్ర జీవితమును గడుపుతారు. మీ స్థితి నిరాకారి-నిరహంకారిగా ఉంటుంది. కనుక మీరు బంధన కుమారులు ఎలా అవుతారు? బంధనములో ఉన్నామని మీరంటే మీకింకా నిరాకారి-నిరహంకారి స్థితి రాలేదని తెలుస్తుంది. ఎంత చెప్పినా పిల్లల వైబ్రేషన్లు తల్లిదండ్రులకు తెలుస్తాయి(వెళ్తాయి). అరే! మీ జీవితాన్ని చూసి నా కుమారుడు ఉన్నతమైనవాడని, అతని జీవితము ఉన్నతమైనదని వారికి తెలియదా? ఎవరి వ్యవహారములో ఆత్మీయత ఉందో, ఎవరి మాటలలో మధురత ఉందో, ఎవరి జీవితములో సరళత ఉందో వారిని ఎవరైనా బంధనములో బంధించగలరా ? వారు తల్లిదండ్రులేనా! అలా ఉండేందుకు వీలు లేదు. ఎందుకంటే ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లల శ్రేష్ఠ జీవితాన్ని చూసి సంతోషిస్తారు. వారు సదా నా కొడుకు ఉన్నతంగా అవ్వాలని, నా కొడుకు శ్రేష్ఠంగా అవ్వాలనే కోరుకుంటారు. కనుక కుమారులైన మీరు మీ పవిత్ర జీవితము ద్వారా, సహనశీలత ద్వారా, ఆత్మీయత ద్వారా, గౌరవప్రదమైన వ్యవహారము ద్వారా ఆజ్ఞాకారులుగా ఉంటూ తల్లిదండ్రుల హృదయము ద్రవింపజేయండి. మేము సాధారణ కుమారులము కాము, దివ్య కుమారులమని, సనత్ కుమారులమని వారికి అనుభవము చేయించండి. ఇటువంటి జీవితము ద్వారానే మీరు బాబాను ప్రపంచము ముందు ప్రత్యక్షము చేయగలరు. తండ్రిని ప్రత్యక్షము చేసేది పిల్లలే కదా. ప్రపంచము ముందు పిల్లలైన మనలను బాబా ప్రత్యక్షము చేస్తున్నారు. తండ్రిని ప్రత్యక్షము చేయుట పిల్లలైన మన కర్తవ్యము. బాబా పిల్లలైన మనలను ముందు పెడ్తున్నారు. పిల్లలైన మనము బాబాను ముందుంచాలి. మనము బాబాను ఎంతెంత ప్రత్యక్షము చేస్తామో, బాబా శ్రీమతమును అనుసరిస్తామో అంత మన బంధనాలు తెగిపోతాయి.

## సదా స్వయాన్ని తపస్వీ కుమారులుగా, శ్రేష్ఠ కుమారులుగా భావించండి

తండ్రితో ఎవరు మిలనము చేయగలరు? ఎవరు బంధనాల నుండి ముక్తులుగా అవుతారో వారు మిలనము చేయగలరు. ఒకవేళ ఏవైనా బంధనాలుంటే, బుద్ధిని ఆ బంధనాలు లాగుతాయి. యోగము చేయనివ్వవు.

మన యోగము తక్కువైనది కాదు. ఈ యోగములో మన మిలనము భగవంతునితో జరుగుతుంది. ప్రపంచములో ఋషులు, మునులు తపస్సు చేసి ఎక్కడకు వెళ్లిపోయారు! మన తపస్సు పరమాత్మను కలుసుకునేది. ఆనందమును ఇచ్చేది. మన సంకల్పములో కూడా తపస్సే, మన మాటలలో కూడా తపసే, మన కర్మలలో కూడా తపస్సే ఉంది. అన్నింటిలోనూ మనది తపస్సే. సంగమ యుగములో మనము సదా తండ్రితో, పరివారముతో ఆనందముగా గడుపుతున్నాము. ఈ ఈశ్వరీయ పరివారము దైవీ పరివారము ఎంత శ్రేష్ఠమైనదంటే ఈ పరివారములో ఎవరైనా కొత్తవారు వస్తే వారికి శుద్ధమైన ప్రేమ, నిస్వార్థ ప్రేమ యొక్క వైబ్రేషన్లు లభిస్తాయి. మధువనములోకి వస్తూనే ప్రజల పై ఇంత ప్రభావము ఎందుకు పడుతుంది? ఎందుకంటే ఇక్కడి ఆత్మలు పవిత్రమైనవారు, హృదయపూర్వకంగా సేవ చేస్తారు. ఈ పరివారాన్ని ఎవరు చూసినా లేక సంబంధ-సంపర్కములోకి వచ్చినా, వారికి భగవంతునితో సంబంధాన్ని జోడించేందుకు కోరిక కలుగుతుంది. ఈ పరివారములోకి రావాలని కోరిక కలుగుతుంది.

## మొదట ఈ రహస్యమును అర్థము చేసుకోండి

ఎవరిలోనైనా మీకు బలహీనతలు, లోపాలు కనిపిస్తే, వారి విశేషతలు కనిపించడం లేదంటే మీరు యోగములో లేరని, మీలో నకారాత్మక సంకల్పాలు నడుస్తున్నాయని అర్థము. ఎక్కడకు వెళ్లినా నకారాత్మక సంకల్పాలు(నెగటివ్ సంకల్పాలు) వస్తున్నాయంటే, యోగము తెగిపోయిందని అర్థము. అవి మీ లోపలకు వెళ్లి కర్మబంధనాలను ఇంకా దృఢముగా చేస్తాయి. మిమ్ములను బంధనముక్తులుగా కానివ్వవు. మనము ఇతరుల గురించి ఎంతగా సంకల్పాలు చేస్తామో, వారి బలహీనతల గురించి, లోపాల గురించి ఆలోచిస్తామో అంత మన కర్మబంధనాలు పెరుగుతూ పోతాయి, దృఢమవుతూపోతాయి. అందువలన ఎవరితో, ఎక్కడ మన కర్మబంధనాలు తయారవుతున్నాయో ఆ రహస్యాన్ని అర్థం చేసుకోవాలి. మనము బాబా స్మృతిలో ఎంతగా ఉంటామో, బేహద్ పరివారములో ఉంటామో, అంత మన కర్మ బంధనాలు తెగిపోతాయి. (- / మైనస్)(+/ ప్లస్ )ల గురించి మనము అర్థము చేసుకోవాలి. చాలామందికి భక్తి మార్గములోని పుస్తకాలు చదివే ఆసక్తి, గొప్ప-గొప్ప రచయితల పుస్తకాలు



చదివే ఆసక్తి ఉంటుంది. ఆ పుస్తకాలలో భాషా శైలి, విషయాన్ని స్పష్టముగా చేసే పద్ధతి చాలా బాగుంటుంది, ఒకవేళ వారి శైలిని మనము పట్టుకుంటే ఈశ్వరీయ సేవలో సహాయము లభిస్తుందని అంటారు. మనము కూడా ఆ రచయితల వలె వ్యాసాలు వ్రాస్తాము, ఆత్మను గురించిన విషయాలు నిరూపిస్తామని అంటారు. కాని మీరు వ్రాసిన వ్యాసము చదివి జనులు వాహ్! వాహ్! అని అంటారు, మీ ఉపన్యాసము విని సంతోషిస్తారు, మిమ్ములను మహిమ చేస్తారు, మీ శైలి చాలా బాగుందని అంటారు కాని అందులో శక్తి ఉండదు. ఎందుకంటే మీరు వారిని కాపీ చేశారు. జ్ఞానము ఈశ్వరుడు ఇచ్చినది, కాని దానిని నిరూపించేందుకు, అర్థం చేయించేందుకు మీరు ఆధారంగా ఆ వ్యక్తి శైలిని తీసుకున్నారు. పరమాత్మ జ్ఞానమును స్పష్టము చేసేందుకు ఆత్మ శైలిని ఆధారంగా తీసుకుంటున్నారా? మనలను చదివించేవారు భగవంతుడు. మనము మురళీని ఎంతగా అధ్యయనము చేస్తామో అంత తండ్రి స్మృతిలో ఉంటారు. తండ్రి వాణీలో ఉన్న శక్తి ఇక ఏ ఇతర వాణిలోగాని, జ్ఞానములో గాని లేదు. తండ్రిని స్మృతి చేసినందున, వారి వాణిని అధ్యయనము చేసినందున ఆత్మలో ఆధ్యాత్మిక శక్తి వస్తుంది. రకరకాల శైలిని, యుక్తులను, ఆధారాలను, కళలను ఉపయోగించి మాట్లాడకండి. నేరుగా చెప్పండి. ఆ మాటలు విని " వీరి మాటలు సరళంగా, నిష్కపటంగా ఉన్నాయి, వీరి బుద్ధి స్వచ్ఛముగా, స్పష్టముగా ఉంది, వీరి వాణిలో ఏదో శక్తి ఉంది, వీరిలో ఏదో ఆధ్యాత్మిక శక్తి ఉందని ఇతరులకు అనిపిస్తుంది".

బాబా నాకు ఏ జ్ఞానమునిచ్చారో, బాబా ఏ మాటలు మాట్లాడారో బాబా స్మృతిలో ఉండి వాటినే మనము ఇతరులకు ఇవ్వాలి. ఏ ఇతర ఆత్మనూ స్మృతి చేయరాదు. జ్ఞానములో ఎంత శక్తి ఉందో గమనించండి. వారసులుగా అవుతే దీని ద్వారానే అవుతారు. బాణము తగులుతే దీని ద్వారానే తగులుతుంది. పరివర్తన అవుతే దీని ద్వారానే పరివర్తన అవుతారు. దీనినే స్మృతి అని అంటారు. బాబా స్మృతిలో మిమ్ములను మీరు మర్చిపోయి ఉండండి. వారితోనే వినండి. వారితో విన్నదే ఇతరులకు వినిపిస్తాను - ఈ నషా, ఈ ఆత్మీయత మన కనులలో ఎప్పుడూ కనిపిస్తూ ఉండాలి. బాబాతో ఈ విధంగా జోడింపబడి ఉంటే మన సంస్కారము ఎందుకు పరివర్తన చెందదు? ఒకవేళ మీరు ఇతర వక్తలను, రచయితలను ఆధారంగా తీసుకొని జ్ఞానము వినిపిస్తే లేక జ్ఞానము వ్రాస్తే వాటిని విని లేక

చదివి జనులు ఇతర ఉపన్యాసకులు లేక రచయితలను మీరు చాలా బాగా మాట్లాడ్తారు, చాలా బాగా వ్రాశారని ఎలా అంటారో అలా మిమ్ములను కూడా పొగుడుతారు. అంతేకాని వారిలో పరివర్తన జరగదు. వారిలో పరమాత్మతో మిలనము చేయాలనే కోరిక జన్మించదు. బాబా పిల్లలకు మరియు భక్తులకు ప్రతి విషయములో ఎంత వ్యత్యాసముందో చూడండి.

కనుక లోపల చెక్ చేసుకొని నన్ను బాబా నుండి దూరము చేసే సంస్కారాలు లేక కర్మ బంధనములో బంధించే సంస్కారాలు లేవు కదా ? అని చూసుకోవాలి. మన తండ్రి సర్వశక్తివంతులు, జనన-మరణ రహితులు. ఇతర ఆత్మలెవ్వరూ సర్వశక్తివంతులు కారు. భలే ధర్మాత్మలు మొదట పై నుండి వచ్చినా, తర్వాత వారు కూడా జనన-మరణ చక్రములో వస్తారు కదా? తండ్రి అయితే ఎప్పుడూ ఈ చక్రములోకి రారు. ఇటువంటి అత్యంత ఉన్నతమైన పరమాత్మ మనలను చదివిస్తున్నారు, మనకు జ్ఞానమునిస్తున్నారు. ఇదేమైనా చిన్న విషయమా? ఉన్నతమైన తండ్రి చెప్పే చదువు చాలా ఉన్నతమైనది కనుక వారి ద్వారా మన కర్మబంధనాలు ఎందుకు తెగిపోవు? మన పాత సంస్కారాలు ఎందుకు నశించవు? ఒక్కసారిగా తండ్రికి సమర్పణ అయిపోవాలి.

## జిద్దు చేసేవారిగా అవ్వకండి (హఠము చేయకండి)

అక్కడక్కడ కొంతమంది కుమారులు చాలా మొండిగా ఉంటారు. వారు చెప్పినట్లే జరగాలని హఠము చేస్తారు. నేను కూడా అప్పుడప్పుడు భక్తి సంస్కారములోకి వచ్చి భావనతో బాబాకు బాబా, వీరికి మీ మంచి మతమునివ్వండి, సద్బుద్ధినివ్వండి అని చెప్తాను. చాలామంది దాదీకి కూడా తమ సలహాలు వ్రాసి పంపుతారు. దాదీని ఒక సాధారణ హెడ్‌గా భావిస్తారు. అటువంటి విషయమేదైనా ఉంటే పెద్దవారికి తెలపండి, దాదీకి తెలపండి. బాబా కూడా - ఏదైనా అటువంటి విషయాన్ని చూస్తే నిమిత్తముగా ఉండే పెద్దవారికి తెలపండి అని చెప్తారు. వారికి తెలిపి తేలికైపోండి, అంతే. దానితో మీ పని పూర్తి అయిపోతుంది. అంతేకాని వారి వెనుక పడకండి. నేను చెప్పిందే జరగాలి లేకుంటే నేనిలా చేస్తాను, అలా చేస్తాను,.......... అని అనకండి. చట్టము చేతిలోకి తీసుకోకండి. జిద్దు చేయు సంస్కారము పాత ఆసురీ సంస్కారము కదా! కుమారులు అలాంటి సంస్కారాలను వదిలేయండి. జిద్దు చేస్తే నంబరు వెనుక పడిపోతుంది. పెద్దవారి



హృదయాలలో, తండ్రి హృదయములో మీకు స్థానముండదు. జిద్దు అనగా ఏమిటి? సూక్ష్మమైన దేహాభిమానము, దేహ అహంకారము. మన మూల సంస్కారము సరళచిత్తులుగా ఉండడం. బాబా అంటున్నారు - మాలికులై సలహానివ్వండి. సలహా ఇవ్వడమే మీ పని. అది అంగీకరించినా, అంగీకరించకపోయినా, చేసినా, చేయకపోయినా అది వారి పని. మనమెందుకు వారి పనిలో జోక్యము చేసుకోవాలి? ధర్మరాజు కూర్చుని ఉన్నారు. ఎవరికి ఏమి శిక్ష ఇవ్వాలో , నిర్ణయించడం వారి పని. మనము మన చేతిలోకి చట్టము ఎందుకు తీసుకోవాలి? ఎవరు చేస్తారో, వారు పొందుతారు. సుప్రీమ్ జడ్జి కూర్చుని ఉన్నారు. మనము ఇతరుల పనిలో, ఇతరుల కర్మబంధనంలో భాగస్థులుగా ఎందుకు అవ్వాలి ? ఎవరు ఎవరిని గురించి ఆలోచిస్తారో వారు వారి కర్మబంధనములోకి వచ్చేస్తారు. పదే పదే వారి స్మృతే వస్తూ ఉంటుంది. మనసులో వారు ఇలా చేస్తూ ఉంటారు, అలా చేస్తూ ఉంటారు అని వస్తూ ఉంటుంది. బంధనము వృద్ధి చెందుతూ పోతుంది. యోగము కుదరదు, మిలనములో ఆనందముండదు. లోలోపల ఖాళీ అవుతూ పోతారు. అలా జరగరాదు. ఎల్లప్పుడూ తేలికగా ఉండాలని నేను భావిస్తాను. సరళత బాబా గుణమే కాక మన గుణము కూడా. ఉదారత, ధైర్యము, క్షమ ఇవన్నీ ఈశ్వరీయ గుణాలు. జిద్దు(హఠము, మొండిపట్టుదల) రావణుని గుణము. రావణుడు అభిమానము గలవాడని గాయనము చేయబడింది కదా. అతడిని చాలా గొప్ప విద్వాంసుడని వర్ణిస్తారు కదా. తనను ఎవ్వరూ చంపకుండా ఉండునట్లు వరము లభించిందని అంటారు కదా. వరదానము తీసుకున్నాడు, ఇది మంచిదే కాని అతనిలో వరదానము లభించిందని అభిమానముండేది.

అలాగే మనకు కూడా నా బుద్ధి గొప్పదనే సూక్ష్మ అభిమానము వస్తుంది. దానిని సమాప్తము చేయాలి. కుమారులు చాలా మంచివారు, చాలా మంచి సేవాధారులు. ఒక్క మాట ధారణ చేస్తే చాలు. అదేమిటంటే స్వయాన్ని గోపికగా భావించండి. సమర్పణై బాబా ప్రేమలో ఇమిడిపోండి. తండ్రి తప్ప ఇతరులెవ్వరూ బుద్ధిలోకి రానే రాకూడదు. ఎవరిని చూసినా, చూడనట్లు ఉండండి, ఏమి వింటున్నా విననట్లు ఉండండి. మనము ఒక్కరినే చూడాలి, ఒక్కరి ద్వారానే వినాలి అప్పుడు బంధనాలు ఎలా తెగిపోతాయో చూడండి. మిమ్ములను

లాగేవారు, ఆకర్షించేవారు ఎవ్వరూ ఉండరు. బాబా తప్ప ఇతరులెవ్వరూ మీ బుద్ధిని లాగలేరు. ఎవరితో ఏ సంబంధము మిగిలి ఉన్నా అది మిమ్ములను లాగుతూ ఉంటుంది.

## తండ్రితో మిలనము చేయు రసమును త్రాగండి - త్రాపించండి

కుమార్లు ఎప్పుడూ, మా దృష్టి, వృత్తులు సరిగ్గా లేవని, అప్పుడప్పుడు చంచలత వస్తుందని అనరాదు. బాబా మన దృష్టిని, వృత్తిని పరివర్తన చేసి, మన మూడవ నేత్రాన్ని తెరిచారు. కనుక ఈ చంచలత ఎలా వస్తుంది? సదా మూడవ నేత్రముతో చూస్తూ ఉంటే దృష్టి, వృత్తిలో చంచలత ఎలా ఉంటుంది? బాబాను చూచే దృష్టి దేహాన్ని ఎలా చూస్తుంది? ఎంతవరకు దృష్టి-వృత్తి పవిత్రముగా ఉండదో అంతవరకు బాబాతో ఆనందాన్ని ఎలా అనుభవిస్తారు? ఆ రసమును అనుభవమే చేయలేరు. నియమానుసారము మిలనము చేయండి. నడుస్తూ-తిరుగుతూ బాబాతో మిలనము చేస్తూ ఉండండి. మనది కర్మయోగము కదా. యోగములోనే మనకు అన్ని పరీక్షలు వస్తాయి. ఎందుకంటే వ్యర్థ సంకల్పాలు కూడా యోగములోనే వస్తాయి. యోగములో దేహము, దేహ సంబంధాలు కూడా గురుకొస్తాయి. గతించిన విషయాలు కూడా యోగంలో గుర్తుకొస్తాయి. వీటితో యుద్ధం చేయడంలోనే మనము యోగము చేసే సమయము అయిపోతుంది. కనుక బాబా జతలో సంబంధాల రసము ఎలా వస్తుంది? మనము స్వయం తండ్రి నుండి రసమును అనుభవము చేస్తేనే ఇతరులకు చేయించగలము. స్వయంలో ఏముంటుందో దానినే ఇతరులకు కూడా ఇవ్వగలరు కదా. ఆ ఖజానాలతో నిండుగా ఉన్నప్పుడే వాటిని ఇతరులకు ఇవ్వగలరు. కనుక తండ్రితో మిలనము చేయు రసము త్రాగండి, ఇతరులకు కూడా త్రాపించండి. బాబా ఎలాగైతే ప్రేమసాగరులో, వారితో సంబంధాన్ని జోడించువారు ఆ ప్రేమ రసమును పానము చేయువారు కూడా ప్రేమ స్వరూపులుగా అయిపోతారు. జ్ఞానసాగరులైన తండ్రితో మిలనము చేయు ఆనందాన్ని అనుభవించువారు స్వయం జ్ఞాన స్వరూపులైపోతారు. ఆనంద స్వరూపులుగా అయిపోతారు. కనుక తండ్రితో మిలనము చేయండి. సంబంధాల రసమును పొందుకోండి. దీని తర్వాత ఆత్మిక సంభాషణ చేసి చూడండి - ఆనందమే ఆనందమును అనుభవిస్తారు.



## లౌకిక ఉద్యోగాన్ని లేక వ్యాపారాన్ని సేవా సాధనంగా చేసుకోండి

ఒకటేమో మీ సంస్కారాల బంధనము, రెండవది కర్మలు లేక ఉద్యోగ బంధనము. కొంతమంది ఫ్యాక్టరీలో పని చేయవలసి వస్తుంది, కొంతమంది ఆఫీసులో పని చేయవలసి వస్తుంది, కొంతమంది వ్యాపారము చేయవలసి వస్తుంది. పిల్లలైన మనము లౌకిక తల్లిదండ్రుల పాలన తీసుకున్నాము కనుక వారి సేవ కూడా చేయాలి. వారి కొరకు ఉద్యోగము లేక ఏదైనా వ్యాపారము చేసే తీరాలి. నౌకరి లేక లౌకిక సేవ చేస్తున్నా, లోపల వృత్తిలో ఏముండాలి? వృత్తిని సకారాత్మకంగా(పాజిటివ్‌గా) చేసుకోండి. కర్మ చేయునప్పుడు మీ సంకల్పాలను శ్రేష్ఠంగా(పాజిటివ్‌గా) చేసుకుంటే అది బంధనమనిపించదు. నిజంగా బంధనముండినా అది మెల్ల మెల్లగా తెగిపోతుంది. 8 గంటలు నౌకరి చేయాలి. లౌకికము వారి వైబ్రేషన్లలో ఉండవలసి వస్తుంది. అచ్చట రకరకాల మనుష్యులు కలుస్తారు, ఏమేమో మాట్లాడ్తారు, ఏమేమో చేస్తారు! ఇది నాకు బంధనమని అనుకోకండి, వారి ప్రభావములోకి రాకండి. నేను సేవ కొరకు వెళ్తున్నానని భావించండి. 8 గంటలు సేవ చేయమని బాబా చెప్పారు. ఇక్కడ కూడా జ్ఞానసరోవరము తయారౌతున్నప్పుడు ఎంతమంది బాబా పిల్లలు సేవ చేసేందుకు వచ్చారు! సేవ చేసే సమయములో కొంతమంది క్రిందపడ్డారు, కొంతమందికి కాళ్లు విరిగాయి, కొంతమందికి చేతులు విరిగాయి, కాని అందరూ నవ్వుతూ, నవ్వుతూ సహించారు. ఎందుకు? ఎందుకంటే కాలు విరిగితే బాగైపోతుంది, ఇప్పుడేమయ్యింది? అని భావించారు. నేను బాబా సేవ చేసి నా భాగ్యాన్ని తయారు చేసుకున్నాను అని ఖుషీ ఖుషీగా సహించారు. ఒక సోదరుడు ఒంటరిగా సేవ చేస్తూ ఉండినాడు, క్రిందపడ్డాడు అప్పుడు అతనిని లేపేవారు కూడా ఎవ్వరూ లేరు. రక్తము కారిపోతూ ఉంది. కొంత సమయము తర్వాత తనంతకు తానే లేచి పైకి వచ్చాడు. అతనికిచ్చిన సేవ పూర్తి కాలేదని గమనించి మళ్లీ పని చేయడం ప్రారంభించాడు. తన పని పూర్తి అయిన తర్వాత మందు తీసుకొని చికిత్స చేయించుకున్నాడు. అతడు పడకలో ఉన్నప్పుడు, నేను బాబా సేవ పూర్తి చేశానని చాలా సంతోషంగా ఉండినాడు. ఇది సేవ యందు ఆసక్తి కలిగి ఉండడం. సేవా లగ్నములో ఉండడం కూడా తక్కువైన విషయమా? మధువన సేవ ఉంది, సేవాకేంద్రము సేవ ఉంది, ఆ సేవ చేయడం వలన

మన భాగ్యము తయారవుతుంది. సంపాదన జమ అవుతుంది. ఉద్యోగం చేసేదుంకు వెళ్ళునప్పుడు కూడా నేను ఈశ్వరీయ సేవార్థము పోతున్నానని భావించండి. ఎందుకంటే మీరు సంపాదించే దానిలో కొంత భాగం బాబా ఇంటికి ఇస్తారు కదా! ఈశ్వరీయ సేవలో ఉపయోగిస్తారు కదా! మీరు బయటకు వెళ్లినప్పుడు అక్కడ చాలామంది మీ సంబంధములోకి వస్తారు. మీ సాంగత్యములో వారు కూడా మంచివారుగా అయిపోతారు. కనుక ఎంత గొప్ప సేవ జరుగుతుంది! వారు కూడా బాబా పిల్లలుగా అవుతారు. వారి జన్మ సిద్ధ అధికారాన్ని ప్రాప్తి చేసుకుంటారు. మీరు అక్కడ 8 గంటలు గడపడం వ్యర్థము కాదు, అది కర్మ బంధనము కూడా కాదు. కనుక మేము సేవ కొరకు వెళ్తున్నామని భావించండి. నేను సేవ కొరకు వెళ్తున్నాననే భావముతో వెళ్లండి, అప్పుడు సేవ జరుగుతుందో లేదో చూడండి. సేవగా భావించి కర్మలాచరించడం వలన మీలో అది కళ రూపములో వికసిస్తుంది. మీరు అందులో ముందుకెళ్లి ఈశ్వరీయ కార్యములో ఉపయోగిస్తూ ఉంటారు. మీరక్కడకు వెళ్లడం సేవ అవుతుంది.

## మీరెక్కడ ఉండినా, ఎల్లప్పుడూ స్వయాన్ని మధువన వాసులుగా భావించండి

మీరు మధువనములో ఉండండి, దూరంగా ఉండండి, కాని మీ బుద్ధి మధువనములో ఉండాలి. శరీరముతో సమర్పితమైనవారే సమర్పితులని భావించకండి. మీరెక్కడ ఉండినా ఎల్లప్పుడు స్వయాన్ని మధువన వాసులుగా భావించి సేవలో ఉండండి. మన జీవన విధానమే సేవ చేయాలి. మన జీవితమే సమర్పిత జీవితముగా ఉండాలి. మిమ్ములను చూచి జనులు వీరు తపస్వీ రాకుమారులని భావించాలి. మీ జీవితాన్ని చూచి వారు ఆశ్చర్యపడాలి. మీ జీవితాన్ని, మీ ధారణలను చూచి తండ్రి ప్రత్యక్షమవుతారు. ఇదేమైనా తక్కువ సేవనా? కుమార్లు తనువు-మనసు-ధనముల ద్వారా సెంటర్లో సేవ చేస్తారు. వారి తల్లిదండ్రులను, సోదరీ - సోదరులనందరినీ సంతోషపెడ్తారు. మీరెక్కడ ఉండినా, మీ వృత్తి మారకూడదు. మనము మన ఈశ్వరీయ వృత్తిలో ఉండాలి, కర్మ యోగములో ఉండాలి. ఎప్పుడూ మీ వృత్తి నెగటివ్‌గా(నకారాత్మకముగా)



అవ్వరాదు. ఈశ్వరీయ వృత్తిలో శక్తి ఉంది. మీ ధారణలను చూచి లౌకికములోని వారు కూడా ఒకానొక రోజు అలౌకికమైనవారుగా అవుతారు. మీ బంధనాలన్నీ సమాప్తమైపోతాయి. మీ ఇంటిలో, సేవాస్థానములో సదా సంతోషంగా ఉండండి. ఎప్పుడూ ఎవ్వరితోనూ ఉదాసీనంగా ఉండకండి.

## మంత్రమిస్తూ ఉండండి – దానము చేస్తూ ఉండండి

చాలా మందికి గురువుల బంధనము కూడా ఉంటుంది. మీలో కూడా కొంతమంది చిన్నతనములోనే గురువులను ఆశ్రయించి ఉండవచ్చు. అలాంటివారు చేతులెత్తండి. మంచిది. ఇంతమంది కుమారులు గురువులను ఆశ్రయించారా? కుమారులు గురువుల వద్దకు వెళ్లరని, వృద్ధులే గురువులను ఆశ్రయిస్తారని అనుకున్నాను. కాని ఇక్కడ చాలా మంది కుమారులు గురువులను ఆశ్రయించారు. గురువులందరూ దేహధారులే, సద్గురువు ఒక్క నిరాకారులు మాత్రమే. ఇప్పుడు ఆ సద్గురువును తెలుసుకున్నారు, గుర్తించారు. ఇప్పుడెవ్వరి స్మృతీ రాదు కదా. చాలా మంది దేహధారులలో కూడా చాలా విశేషతలుంటాయి. ఆ విశేషతలు గుర్తు వస్తూ ఉంటాయి. గుర్తొస్తాయా? బాబా అంటారు - ఏ ఆత్మలో ఏ విశేషత ఉండినా, ఆ విశేషత ఈ ఆత్మకు తండ్రి నుండి లభించిందని భావించండి. ఇలా భావించినందున ఆ ఆత్మను చూస్తున్నా బాబా గుర్తుకు వస్తారు. కుమారులారా! అర్థమయ్యిందా?

మంత్రమిచ్చునప్పుడు, ఈ మంత్రము ఎవ్వరికీ చెప్పకండి అని ఎందుకు చెప్తారు. తెలిపితే వారి శక్తి తగ్గిపోతుందని అంటారు. అరే, మంత్రమనగా భగవంతుని మహిమ, భగవంతుని గాయనము. భగవంతుని గాయనము అందరూ చేయాల్సిందే. ఆ పద్ధతిని అందరికీ తెలపాలి. మనలో ఏదైనా మంచి ఉందంటే, దానిని గురించి అందరికీ తెలుపుతాము కదా. ఏదైనా చెడ్డది ఉంటే దానిని గురించి ఎవ్వరికీ తెలపము. ఎందుకంటే మన చెడు వారికి తెలియకూడదని భావిస్తాము. ఇక్కడ బాబా ఏమి చేస్తున్నారో చూడండి." ఈ సందేశము అందరికీ ఇవ్వండి, అందరికీ యోగము నేర్పించండి, అందరికీ మన్మనాభవ, మధ్యాజీభవ అను మంత్రమివ్వండి " అని చెప్తున్నారు. మనము ఇతరులకు ఎంత జ్ఞానమునిస్తామో అంత ధారణ అవుతూ పోతుంది. జ్ఞాన ధనమునివ్వండి, ధనము తరగదు(ధన్ దియే ధన్ నా కూటే).

## ఓ మాతలారా, లేవండి – అందరినీ ఉద్ధరించండి

ఈ సభలో కూర్చొని మిమ్ములను చూస్తుంటే, మాతలంతా విద్యార్థులుగా అయినట్లు నాకు అనుభవమవుతూ ఉంది. ఇంతమంది మాతలు మంచి పద్ధతిలో(సువ్యవస్థిత) నియమానుసారము కూర్చొని ఉన్నారు. ఇటువంటి దృశ్యాన్ని నేను ఎప్పుడూ చూడలేదు. కూర్చునేందుకు కూడా ఒక పద్ధతి ఉంటుంది కదా. బాబా ఎల్లప్పుడూ మాకు నేర్పిస్తూ ఉండేవారు. స్మృతిలో కూర్చున్నపుడు, పరస్పరము కలసి కూర్చోకండి అని చెప్పేవారు. ఎందుకంటే శ్వాస, సంకల్పము అందరివీ వేరు వేరుగా ఉంటాయి. యోగములో కూర్చున్నపుడు, ఒకరికొకరు వీలైనంత దూరంగా కూర్చోండి. ఈ రోజు మీరు అలాగే నియమానుసారము కూర్చొని ఉన్నారు. ఇది చూచి నాకు చాలా సంతోషము కలుగుతూ ఉంది. యోగములో కూర్చున్నపుడు ఒకరికొకరి మధ్య జాగా ఉండాలి. ఒకరి అవయవాలు ఒకరికి తగలరాదు. ఎవరైనా సభలో ముందు కూర్చోవాలనుకుంటే ముందు వచ్చి కూర్చోండి. ఆలస్యంగా వచ్చి ముందు కూర్చోకండి. అందరూ యోగము చేస్తూ ఉంటారు. మీరు వచ్చి ముందు కూర్చునేందుకు, వారిని జరగమని అడుగుతూ ఉంటే వారిని కష్టపెట్టినట్లు అవుతుంది కదా. కనుక ముందు కూర్చునేవారు, ముందే వచ్చి కూర్చోండి, ఇతరులను కదిలించకండి. వారు బాబాతో ఏ ఆత్మిక సంభాషణ చేస్తున్నారో, బాబాను ఏ సంబంధముతో కలుస్తూ ఉన్నారో, ఏ ఊయలలో ఊగుతున్నారో తెలియదు కదా. ప్రేమ ఊయలలో, జ్ఞాన ఊయలలో, ఆనందడోలికలో ఉన్నవారిని కదిలించుట వలన వారు క్రిందకు వచ్చేస్తారు. ఎప్పుడు కూర్చున్నా, ఒకరికొకరు కొంచెము దూరంగా కూర్చోండి. ఇక్కడ ఇతర సత్సంగాలలో కథలు వినేందుకు కూర్చున్నట్లు కూర్చోరాదు. అక్కడ కథలు విని వెళ్ళిపోతారు. ఈ స్థానమే ఎలా ఉందంటే ఇది చదువు అని, చాలా పెద్ద చదువని అనిపించేటట్లు ఉంది. ఇది ఒక పెద్ద యూనివర్సిటీ వలె ఉంది. ఈ హాలు ఈశ్వరీయ విద్యార్థులు కూర్చునేందుకు నిర్మించబడింది. ఈ హాలులో కూర్చుంటూనే మాత రూపమును మర్చిపోయి నేను విద్యార్థినని, నేను ఈశ్వరీయ చదువు చదువుకుంటున్నానని అనుభవమవుతుంది. చదువుకునే సమయంలో నన్ను భగవంతుడే చదివిస్తున్నారనే స్మృతిలో ఉండండి. నా తండ్రే నాకు టీచరు, వారే నా సద్గురువు



కూడా అయ్యారు. మేము వారి చదువును చదువుకుంటున్నాము.

## రేపటి రోజు పై ఎప్పుడూ నమ్మకముంచకండి

ఇప్పుడు పాటలో ఏమి విన్నారు? ఇటువంటి ప్రేమను ఎవరు ఇవ్వగలరు? ఇటువంటి శృంగారాన్ని ఎవరు చేయగలరు? ఇటువంటి ప్రేమను ఆత్మిక తండ్రి మాత్రమే ఇవ్వగలరు. ఇటువంటి శృంగారాన్ని ఆత్మిక తండ్రి మాత్రమే చేయగలరు. ఇది మన ఆత్మిక విద్యార్థి జీవితము. ఇటువంటి చదువును చదివే వారి వద్ద పుస్తకము, పేనా(పెన్ను) ఉండాలి. భగవంతుని మహావాక్యాలు వ్రాయడంలో మీకు చాలా ఆనందము కలుగుతుంది. పాయింట్లు వ్రాస్తే గుర్తుంటాయి. ఏకాంతములో మేము రాజవిద్యను చదువుకునే రాకుమారులు రాకుమారీలమని అనిపిస్తుంది. లౌకిక విద్యార్థులు పరీక్షల సమయములో తోటలో కూర్చొని ఏకాంతముగా చదువుకుంటారు, మనన చింతన చేస్తారు, రివైజ్ చేసుకుంటారు. ఇది కూడా మనకు రివైజ్ కోర్సు. ఈ రోజు చాలా మంది పాత మాతలు - ఇకముందు మమ్ములను పిలుస్తారో పిలువరో తెలియదు, పోను పోను ఎటువంటి సమయము వస్తుందో ఎవరికి తెలుసు, ఇది బాబాగారి అంతిమ పిలుపు అని అనిపిస్తూ ఉంది, మాకు చాలా సంతోషంగా ఉంది అని అంటూ ఉండినారు. మేము చివర్లో వచ్చామని అనిపిస్తుంది. పోను పోను ఎటువంటి పరిస్థితులు వస్తాయో తెలియదు. చాలా పట్టుదలతో, చాలా ఉత్సాహముతో అందరూ పరుగెత్తుకొని వచ్చారు. రేపు ఏమవుతుందో ఎవరికి తెలుసు? రేపు ఏ దృశ్యము రానున్నదో, మర్నాడు ఏ దృశ్యము వస్తుందో తెలియదు. శుభ కార్యములో ఎప్పుడూ ఆలస్యము చేయరాదు. ఏదైనా శుభ సంకల్పము వస్తే దానిని ఊరకే వెళ్లిపోనివ్వరాదు. ఆ శుభ సంకల్పాన్ని తర్వాత చేస్తాములే అని అనుకోరాదు. ఒక సెకండు తర్వాత ఆ సంకల్పము మాయము కావచ్చు, పరిస్థితులు ఎలా వస్తాయో తెలియదు. కనుక ఎప్పుడూ శుభ కార్యము, శుభ ఘడియ, శుభ సంకల్పాలను తర్వాత చేస్తాములే, రేపు చేస్తాములే అని అనుకోరాదు. రేపటి పై ఎప్పుడూ వదలరాదు. వచ్చిన వెంటనే చేసేయాలి. మా మాతలందరూ ఈశ్వరీయ విద్యార్థులై వచ్చారు. చాలా ఉల్లాస-ఉత్సాహాలతో చదువుకునేందుకు వచ్చారు. భట్టీకి అర్థము చదువు. భట్టి అంటే ఏమిటి? భట్టిలో ఇటుకలు కాలి బయటకు వచ్చినప్పుడు నల్ల రంగు పోయి ఎర్రగా తయారై

వస్తాయి. ఇక్కడ కూడా అలా పరివర్తనవ్వాలి. ఏ ఆధారంతో పరివర్తనవ్వాలి? ఇది స్వ ఉన్నతి చేసుకునే సంవత్సరము. పరివర్తనయ్యే సమయము నడుస్తోంది. ప్రతీ ఆత్మ స్వయాన్ని పరివర్తన చేసుకునేందుకు వచ్చింది. నేను మారితే నా పరివారము మారుతుంది, సమాజము మారుతుంది, ఈ విశ్వమే మారుతుంది. కాని మొదట నేను పరివర్తనవ్వాలి. సమాజము మారాలి అని మనమంటే, అది పరచింతనవుతుంది. నా పరివారములో నా పతి మారాలి, పుత్రుడు మారాలి, మనవడు మారాలి, అత్త మారాలి, మామ మారాలి అనుకోవడం పరచింతన. మనము వారి గురించి చింతించరాదు. మొదట స్వ ఉన్నతిని గురించి ఆలోచించి నేను మారాలి అని భావించాలి.

## సర్వ గుణ సంపన్నులుగా అవ్వడమే మీ లక్ష్యము

బాబా చెప్తున్నారు - మీ లక్ష్యము సర్వగుణ సంపన్నులుగా అవ్వడం. ఒకవేళ ఒక్క గుణము తక్కువైనా లేక వ్యవహారములో ఒక్క గుణము తక్కువైనా, ఆ వ్యవహారము ఇతరులకు బాగుండదు. వ్యవహారంలో గుణాలు లేకుంటే, గుణహీన వ్యక్తులను ఎవ్వరూ ఇష్టపడరు. ఉదాహరణానికి మనలో సహనశీలతా గుణము లేకుంటే, ధైర్యము లేకుంటే, ఏదైనా అటువంటి పరిస్థితి వచ్చినప్పుడు, ఎవరైనా అటువంటి మాటలన్నప్పుడు, వారి పై కఠినమైన మాటల వర్షము కురిపిస్తాము. ఆ మాటల ద్వారా వారిని గాయపరుస్తాము. వ్యవహారములో ఓర్పు(సహనము) చాలా అవసరము. ఒకటి - స్థితి ధైర్యంగా ఉండాలి, రెండవది - సహనశీలతా గుణముండాలి. ప్రవృత్తిలో చాలా పరిస్థితులు, విఘ్నాలు వస్తాయి. ఆ సమయములో జ్ఞానము వలన మాకు ఈ పరిస్థితులు వచ్చాయని, ఈ విఘ్నాలు వచ్చాయని భావించకండి. వాస్తవానికి పరిస్థితులు గాని, విఘ్నాలు గాని వచ్చేందుకు మనమే నిమిత్తులము. ఏకాంతములో కూర్చొని మీ మనసనే సాగరము లోతుకు వెళ్లి గమనించండి. సాగరము పై భాగములో అనేక అలలు లేస్తూ ఉంటాయి. కాని లోతుకెళ్తే సంపూర్ణ శాంతి ఉంటుంది. అలాగే మనము ఎంతెంత అంతర్ముఖులుగా ఉంటామో, ఆంతరిక శాంతిలో ఉంటామో అంత మన లోపల చాలా ఉంటుంది. ప్రతీ పుత్రునికి బాబా అనేక ఖజానాలిచ్చారు. మన వద్ద అవినాశి ఖజానా ఉంది. ఖజానా అనగా శక్తి. కొంతమందికి శారీరిక శక్తి ఉంటుంది, కొంతమంది వద్ద ధనశక్తి ఉంటుంది. చాలా ధనము ఉంటుంది.



వారు నా వద్ద అన్నీ ఉన్నాయని భావిస్తారు. నా వద్ద ధనము కూడా బాగుంది, తనువు కూడా బాగుంది అని వారికి నశా(గర్వము) ఉంటుంది. కాని వారి మనసు బాగలేకుంటే, శరీరము-ధనము ఎందుకూ పనికి రావు. నేను బాగున్నానని వారు భావిస్తారు కాని మనసు ఏడుస్తూ ఉంటే, వారు బాగున్నారని ఎవ్వరూ అనరు. కనుక ఆధ్యాత్మిక శక్తి కొరకు మనసు బాగుండడం చాలా అవసరము. మనసు బాగైపోతే, శరీరము కూడా బాగైపోతుంది. ధనము కూడా వస్తూ ఉంటుంది. ఈ అవినాశి జ్ఞాన ధనము ఎలాంటిదంటే ఎంత పంచితే అంత వస్తుంది. వెనుక వెనుకనే వస్తుంది. దాని నుండి మీ వద్దకు సర్వమూ వచ్చేస్తుంది.

## బాబాకు మాతలైన మీ పై చాలా నమ్మకముంది

ప్రపంచములో ఉన్నామని, ప్రపంచముతో పాటు నడవాలని మీరు భావిస్తే, దాని అన్ని ఆచారాలు, పద్ధతులనుసారము మీరు తప్పకుండా నడవవలసి వస్తుంది. మీరు అవన్నీ చేయాల్సి వస్తుంది. మేము గృహస్థులమని భావించే వారికి ఈ సంకల్పము వస్తుంది. కాని బాబా మిమ్ములను గృహస్థులుగా చేయలేదు. మిమ్ములను మీరు గృహస్థులమని, ప్రవృత్తి వారమని భావించక ట్రస్టీలుగా భావించమని బాబా చెప్తారు. ట్రస్టీలనగా ఇతరుల సంపదను తమదిగా భావించక కాపాడేవారు. ఉదాహరణానికి ఎవరైనా ధనవంతులకు సంతానము లేకుంటే, వారు మరణించక ముందు తమ సంపదనంతా ఒక ట్రస్టు ఏర్పాటు చేసి ట్రస్టీలకు అప్పగిస్తారు. ట్రస్టీలు ఆ ధనాన్ని, సంపదను వారి స్వంతముగా భావించరు. దీని యజమాని ఫలానావారని, మేము కేవలం దానిని సంభాళన చేయువారమని, ఈ ధనాన్ని సమాజసేవకు సత్యంగా ఉపయోగించే ట్రస్టీలమని, నిమిత్తమని భావిస్తారు. మరణించిన వ్యక్తి ఏ ఏ పుణ్యకార్యాలు చేయమని కోరి ఉంటారో లేక వీలునామా వ్రాసి ఉంచారో అలా చేయడం వారి కర్తవ్యమని భావిస్తారు. అలాగే శివబాబా గృహస్థులైన తన పిల్లలను ట్రస్టీలుగా చేశారు. లౌకిక బంధనాలు లేనివారిని, బాధ్యతల నుండి ముక్తులుగా ఉన్నవారిని సెంటర్లలో ఉంచారు. కొడుకులు, కూతుర్లు ఉన్నవారిని ట్రస్టీలుగా చేసి ఇంటిలోనే ఉంచారు. ఇంటిలోనే ఎందుకుంచారు? మీరు ఇంట్లో ఉండకపోతే పిల్లలు మంచి మార్గములో నడవక చెడిపోతారు. పతికి మంచి సాంగత్యము, పిల్లలకు

మంచి సాంగత్యము, కోడలుకు మంచి సాంగత్యము లభించాలి. ఇది మీ కర్తవ్యము. ఈ కర్తవ్యాన్ని మాతలైన మీరు చేయగలరు. మీరు ఇంట్లో ఉంటే మీ ద్వారా వారికి చాలా శక్తి లభిస్తుంది. బాబా మాతలైన మీ పై చాలా నమ్మకముంచారు. ఈ పిల్లలే నాకు కుడిభుజాలు. వీరిని నేను ప్రవృత్తిలో ఉంచుతాను. ఎందుకంటే నేనంటే వీరికి చాలా ప్రేమ, స్నేహము ఉన్నాయి. వీరి మనసు నా పై ఉంది. పిల్లలు నా ఎదుట సమర్పణయ్యారు. ఎవరైతే సత్యమైన పిల్లలుగా ఉంటారో వీరు నాకు చాలా సహాయకారి పిల్లలని తండ్రికి వారి పై చాలా నమ్మకముంటుంది. ఎవరితో ఏ సహాయము తీసుకోవాలో బాబాకు తెలుసు. ఈ పిల్లలు ట్రస్టీలై ప్రవృత్తిని బాగా ఉంచగలరని బాబా భావించారు. అందుకే మిమ్ములను అక్కడనే ఉంచాలని అనుకున్నారు. ఈనాటికి కూడా చాలామంది మాతలు "బాబా, మమ్ములను మధువనములోనే ఉంచండి లేక మమ్ములను ఏదైనా సెంటర్లో పెట్టండి " అని అంటారు. అరే! మీ పిల్లలను ఎవరు సంభాళిస్తారు? రచనను రచించారు కనుక వారిని రచయితలే సంభాళిస్తారు కదా? మీరు లేకుంటే వారు ఎలా బాగుంటారు? మీ పట్టుదల చాలా బాగుంది. బాబా పై చాలా ప్రేమ ఉంది. కాని మన నియమానుసారము సన్యాసుల వలె ఇల్లు-వాకిలి వదిలి వెళ్లరాదు.

ఏ పనినైతే పురుషులు, సన్యాసులు చేయలేకపోయారో దానిని ఈ రోజు శక్తులైన మనము చేసి చూపించాలి. మాతలైన మీరు చేసి చూపించాలి. ఇప్పటివరకు కేవలం పురుషులు మాత్రమే సన్యాసులై పవిత్రతా వ్రతమును పాటిస్తూ వచ్చారు. మంచి మంచి సన్యాసులు పవిత్రంగా ఉండి ఈ భూమిని(ప్రపంచాన్ని) రక్షిస్తూ వచ్చారు. కాని వారి ద్వారా విశ్వము పరివర్తన అవ్వలేదు. పరమాత్మ వచ్చినప్పుడు వారు మాతలను ముందుంచారు. మాతలు ముందుకు వచ్చారు. మాతలు పవిత్రతా ప్రతిజ్ఞను చేశారు. మాతల వలన ప్రవృత్తి అంతా పవిత్రమైపోతుంది. నారి నరుని ఉద్ధరించింది అని అంటారు. నరుడు నారిని ఉద్ధరించాడని అనరు. వివాహములో పతి గురువు, పతి పరమేశ్వరుడు, పతి వెనుకే నడుచుకోవాలని చెప్పినా ఈ రోజు పత్ని అనుసరించేటంత శక్తి పతిలో లేదు. ఒకవేళ పతి తాగుబోతు అవుతే, తామసిక భోజనము తినేవాడుగా, జూదమాడే వాడుగా ఉంటే స్త్రీ అతనినెలా అనుసరిస్తుంది? ఒకవేళ అలా



అనుసరిస్తే ఆమె కూడా అలాగే అయిపోతుంది. ఎవరైతే అలా వెళ్లారో వారి ఇల్లు-వాకిలి నాశనమైపోయాయి. పతులకు తప్పకుండా కంపెనీ ఇవ్వాలని చాలా మంది భావిస్తారు. ఆమె కూడా మాంసము, మదిర సేవించి, పిల్లలతో కూడా చేయిస్తుంది. స్వయం సినిమా, టి.వి మొదలైనవి చూస్తూ పిల్లలను కూడా వెంట తీసుకెళ్తుంది. క్లబ్బుకు వెళ్తూ పిల్లలను కూడా తీసుకెళ్తుంది. దాని వలన చాలా సంసారాలు నాశనమైపోయాయి. పరివారాన్ని ఉద్ధరించడం లేక ముంచడం మాతల చేతుల్లో ఉంది. జీవితాన్ని రక్షించడం, జీవితాన్ని రక్షించకపోవడం, పాపకార్యము చేయడం, పుణ్యకార్యము చేయడం - మాతల చేతుల్లో ఉంది.

## మాతలు మేలుకుంటే ప్రపంచమంతా మేలుకుంటుంది

బాబా మాతలను చూచినప్పుడంతా, "మాతలు మేలుకుంటే, ప్రపంచమంతా మేలుకుంటుంది" అని చెప్పేవారు. ఎంతవరకు మాతలు మేలుకోరో అంతవరకు ప్రపంచము నిద్రిస్తూనే ఉంటుంది. మాతలలో చాలా గుణాలున్నాయి. ఎందుకంటే కొన్ని పనులు వీరి ద్వారానే జరుగుతాయి. అందరిలో ఏదో ఒక విశేషత ఉంటుంది. కాని మాతల విశేషతలు అందరికంటే భిన్నమైనవి. మనము గమనిస్తే మాతలలో 36 గుణాలుంటాయి. పురుషులలో 26 గుణాలే ఉంటాయి. నారి కంటే నరునిలో తక్కువ గుణాలు చూపిస్తారు. మాతలు తమలో దాగి ఉండు ఆ గుణాలను, ఆ విశేషతలను దివ్యగుణాలలోకి తీసుకొస్తే వారు విశ్వమంతటిని పరివర్తన చేయగలరు. మాతలు జ్ఞానాన్ని పూర్తిగా అర్థము చేసుకుంటే, వారు జ్ఞాన రూపాన్ని, శక్తి రూపాన్ని ధారణ చేస్తారు. పాపమంటే ఏమిటో, పుణ్యమంటే ఏమిటో అనుభవము చేయాలి. ఆధ్యాత్మిక శక్తికి పునాది జ్ఞానము, వివేకము. ఎంతవరకు అనుభవమవ్వదో అంతవరకు పాపకర్మలు వదిలిపోవు, జీవితములో పరివర్తన రాదు. కనుక బాబా ఉదయము, సాయంకాలము జ్ఞానాన్ని అర్థం చేయిస్తూ ఉంటారు. చాలామంది మాతలు రెగ్యులర్‌గా క్లాసుకు రాకపోవడం నేను చూచాను. మురళిధరుడైన బాబా పై మాకు చాలా ప్రేమ ఉందని భావిస్తారు. ప్రేమ ఉంది గాని శక్తి లేదు. ఎందుకంటే ప్రతి రోజు మురళి వినరు. మాతలు శక్తులు. కాని మీలో శివశక్తి ఉండాలి. రైటేదో

తప్పేదో తెలుసుకోవాలి. ప్రతి విషయాన్ని అనుభవము చేయాలి. అప్పుడే నిర్ణయ శక్తి వస్తుంది. మాతలు ఇంటిలో చాలా విషయాలు నిర్ణయించవలసి వస్తుంది. పిల్లల విషయంలో, సంబంధీకుల విషయంలో నిర్ణయము తీసుకోవలసి వస్తుంది. ఎందుకంటే మాత ఇంటికి రాణిగా, అధికారిగా ఉంటుంది. ఇంటిని నడిపించేందుకు తల్లి చాలా బాగుండాలి. ఇంటిని సంభాళించేందుకు, ఇంటిని నడిపించేందుకు మాతలే ఖర్చు చేస్తారు. ఈ రోజు వంట ఏమి చేయాలి? టిఫిన్ ఏమి చేయాలి? పిల్లలకు ఏమి తయారుచేసి పంపాలి, ఈ రోజు ఇంటికి బంధువులు వస్తున్నారు, వారికేమివ్వాలి, వారి కొరకు ఏమి తయారు చేయాలి, ఇవన్నీ మాతల చేతుల్లోనే ఉంటాయి.

## ఈ కర్మ జగత్తులో ఇచ్చి పుచ్చుకునే లెక్కాచారముంది కనుక ఆలోచించి అర్థము చేసుకొని ఇచ్చి పుచ్చుకోవాలి.

పురుషులు సంపాదించేందుకు బయటకు వెళ్ళి సంపాదించి స్త్రీ చేతికిస్తారు. కనుక మాతలు పాప పుణ్యాలను అర్థం చేసుకొని పని చేయవలసి వస్తుంది. ప్రాక్టికల్‌గా కర్మలు చేసేది మాతలే కదా. ఇందులో కర్మల ఖాతా ఉంది. సెకండు సెకండు కర్మల ఖాతా తయారవుతుంది. కర్మల రహస్యము చాలా నిగూఢమైనది. జరిగేదంతా కర్మల ఆటే. ప్రతి ఒక్కరు తమ భాగ్యాన్ని తయారు చేసుకునే వచ్చారని అంటారు కదా. ప్రతి ఒక్కరు తమ జతలో భాగ్యాన్ని తీసుకొనే వస్తారు. కొంతమంది మాతలకు గ్రుడ్డి, కుంటి, మూగి పిల్లలు జన్మిస్తారు. కొంతమందికి చాలా మంచి పిల్లలు జన్మిస్తారు. పాపం పిల్లలు ఈ ప్రపంచములోకేమో వచ్చారు కాని క్రితము జన్మలో చేసిన కర్మల అనుసారము, కొంతమందికి కనులుండవు, కొంతమందికి కాళ్ళుండవు, కొంతమందికి చేతులుండవు, కొంతమంది మాట్లాడలేరు, చూడలేరు. ఎవరైతే కనుల ద్వారా చెడు చూస్తారో, వారు గ్రుడ్డివారిగా అవుతారు. చెవులతో నిందలు వింటే చెవిటివారైపోతారు. నోటితో చెడు మాటలు మాట్లాడితే వచ్చే జన్మలో మూగవారుగా అయిపోతారు. ఎందుకంటే తమ కర్మల ద్వారా ఇతరులకు దుఃఖము కలిగిస్తారు కదా! ఎవరినైనా కటువుగా మాట్లాడితే వారికెంత దుఃఖము కలుగుతుంది, ఎన్ని సంకల్పాలు నడుస్తాయి! కటువచనాలు వినిపించి



దుఃఖము కలిగించారు. దెబ్బల కంటే కటువచనాలు చాలా దుఃఖాన్ని కలిగిస్తాయి. ఈ కర్మల రహస్యము వారిని ఇలా వికలాంగులుగా తయారు చేసింది. పాపం చిన్న పిల్లలు ఏ పాపము చేస్తారు? క్రితము జన్మలో దుఃఖము కలిగించి వచ్చారు కనుకనే బాల్యము నుండే దుఃఖము లభిస్తుంది. వారి లెక్కాచారము ఏ తల్లితో ఉంటుందో ఆ తల్లి గర్భములోకి వస్తారు. ఆ పిల్లల కారణంగా ఆ తల్లులు కూడా దుఃఖితులవుతారు. నేను ఏ పాపము చేశానో ఇటువంటి బిడ్డను కన్నానని అంటూ ఉంటారు. ఇది ఇచ్చి-పుచ్చుకునే లెక్కాచారము. అందుకే బాబా చెప్తారు - ఇచ్చి పుచ్చుకునేటప్పుడు ఆలోచించి చేయండి. సంకల్పాలు గాని, మాటలు గాని, కర్మలు గాని, శరీరము గాని, మనసు గాని, ధనము గాని ఏదైనా సఫలమవుతూ ఉన్నాయా లేక అసఫలమవుతున్నాయా అని గమనించండి. జ్ఞానమైతే లభించింది కాని కర్మలు చేయునప్పుడు చాలా వివేకముతో చేయాలి. నేను జ్ఞానాన్ని ప్రాక్టికల్‌గా ఎలా ఉపయోగిస్తున్నానని చెక్ చేసుకోవాలి. ఇందులో నా కర్మల గతి ఎలా నడుస్తుంది? మీరు బాబా వద్దకు 63 జన్మల కర్మబంధనాల నుండి విడుదల పొందేందుకు వచ్చారు లేక బంధనముక్తులుగా అయ్యేందుకు వచ్చారు. ఎందుకంటే ముక్తి-జీవన్ముక్తుల దాత ఒక్క పరమాత్మయే. ఏ దేహధారి మనిషీ ముక్తులుగా చేయలేడు. బంధనాల నుండి ముక్తులుగా చేయగలిగినవారు ఒక్క తండ్రి మాత్రమే. బాబా చెప్తున్నారు - నా మాతలు చాలా బంధనాలలో బంధింపబడి ఉన్నారు. వారికి విడుదల ఎలా లభిస్తుంది? శ్రీమతము ద్వారా. కాని శ్రీమతమును బాగా అర్థము చేసుకోవడం చాలా అవసరము. కనుక బాబా అంటారు - కర్మలు చేయునప్పుడు సంశయమొస్తే, ఏమి చేయాలో అర్థము కానప్పుడు బాబాను అడిగి చేస్తూ ఉండండి. మీ మతము(మన్మతము) ద్వారా పాపము చేసి కూర్చోకండి. బాబా చెప్తారు - మాతలైన మిమ్ములను నేను ట్రస్టీలుగా తయారు చేసి ఇంట్లో ఉంచాను. అర్థమయ్యిందా? ట్రస్టీలు ఏమి చేస్తారు? మాలికులు ఏమిచ్చారో, దానిని వారి స్వంతమని భావించరు. స్వంతమని భావిస్తే తాకట్టు ఉంచిన దానిలో మోసము చేసినట్లవుతుంది. ఇది పాపము కదా? నా పిల్లలైన మీరు ట్రస్టీలై ఇంటిలో ఉండమని బాబా సేవార్థంగా ఉంచారు. ఆ ఇల్లు నా స్వంతమని భావిస్తే, అక్కడున్న ధన సంపదనంతా నా

స్వంతమని భావిస్తే, అక్కడున్న సంబంధీకులను నా పతి, నా పిల్లలని భావిస్తే తాకట్టు ఉంచిన దానిని అపహరణ చేసినట్లవుతుంది. కనుక ఎప్పుడు పతిని చూసినా, కొడుకును, కూతురును చూసినా మీరు బాబా పిల్లలని భావించండి. వస్తువులన్నీ బాబావే. కేవలం సంభాళించేందుకు నాకు ఇవ్వబడినవని భావించండి.

## మాతలు గురువులు, కులానికి కళ్యాణము చేయువారు

చాలామంది మాతలు తమ చిన్న పిల్లలకు మీరు శివబాబా పిల్లలు, శివబాబా భండారము నుండి తింటున్నారని శిక్షణనివ్వడం నేను చూచాను. చాలామంది చిన్న చిన్న పిల్లలు మధువనానికి వస్తారు. శివబాబా ఎక్కడ ఉన్నారు? అని వారి తల్లి వారిని అడిగితే పైన పరంధామములో ఉన్నారని ఆ పిల్లలు చెప్తారు. అలాగే బ్రహ్మాబాబా ఎక్కడ ఉన్నారని అడిగితే వారి చిత్రాన్ని చూపిస్తారు. నీవు ఎక్కడ ఉన్నావని అడిగితే భ్రుకుటి మధ్య వ్రేలు పెట్టి చూపిస్తారు. ఇటువంటి మాతలే గురువులు. స్వయాన్ని ట్రస్టీలుగా భావించి పిల్లలకు బాల్యము నుండే ఈశ్వరీయ జ్ఞానాన్ని నేర్పిస్తారు. బిడ్డా, నీవు ఎవరి కొడుకువు ? అని తల్లి అడుగుతుంది. శివబాబా కొడుకును, బ్రహ్మాబాబా కొడుకును అని బాలుడు చెప్తాడు. నీవు బ్రహ్మాకుమారుడివా? అని అడిగితే ఆ బాలుడు నేను బ్రహ్మాకుమారుడనే అని అంటాడు. కూతురును నీవు బ్రహ్మాకుమారివా? అని అడిగితే ఆ బాలిక అవును నేను బ్రహ్మాకుమారినే అని చెప్తుంది. పిల్లలకు ఈశ్వరీయ శిక్షణనివ్వడం అనగా ఇదే. చాలామంది కన్యలు చదువుకునేందుకు కాలేజీకి, యూనివర్సిటీలకు వెళ్తారు. అక్కడ చాలా సమయము గడపవలసి వస్తుంది. అక్కడ ఉన్నంత సేపు దేహము, దేహ సంబంధమైన చదువు నేర్పబడుతుంది. ప్రతి రోజు 7-8 గంటలు బయటి చదువులోనే గడుపుతారు. ఇంటికి వచ్చి భోజనము చేస్తూనే మళ్ళీ ఆ పుస్తకాలు తీసుకొని కూర్చుంటారు. విశ్రాంతి తీసుకుంటారు, ఆడుకోవడంలో లగ్నమవుతారు. ఆ కన్య జీవితము ఎలా ఉంటుంది? ఆ కన్య కొరకు తల్లి ఏమి ఆలోచించినట్లు? కన్యాదానము మహాదానము అని అంటారు. ఈ రోజు కూడా నేపాల్‌లో కన్యకు వరునితో వివాహము జరిపించేందుకు ముందు శివునితో(పశుపతినాథుని మందిరంలో ఉంచబడిన పశుపతినాథుని మూర్తితో) వివాహము చేయిస్తారు. ఆ తర్వాత



వరునితో వివాహము చేయిస్తారు. అక్కడ మేము శివబాబాతో నిశ్చితార్థము చేయిస్తున్నామని, ఆ పతి కంటే ముందు పతులందరి పతితో వివాహము చేయిస్తున్నామనే జ్ఞానము వారికి లేదు. ఆత్మ ఏ విధంగా పరమాత్మతో మిలనము చేస్తుందని అమాయకులైన వారికి ఏమి తెలుసు? ఇక్కడ ప్రాక్టికల్‌గా ఆత్మల వివాహము, ఆత్మల మంగళ మిలనము పరమాత్మతో జరుగుతుంది. పరమాత్మతో ఆత్మలైన మన నిశ్చితార్థము కూడా జరిగింది. వివాహము కూడా జరిగింది. మన సర్వ సంబంధాలు బాబా ఒక్కరితోనే ఉన్నాయి. ప్రపంచములోని వారి బుద్ధి సంబంధీకుల వద్దకు పోతూ ఉంటుంది. దేహ సంబంధాలన్నీ తర్వాత ఏర్పడిన సంబంధాలు. ఎందుకంటే దేహము తర్వాత లభించింది. మొదట మనము ఆత్మలము. తర్వాత ఈ దేహము మనదిగా అయ్యింది. వాస్తవానికి ఆ పరమపిత పరమాత్మతో సర్వ సంబంధాలను జోడించాలి. దేహ సంబంధాల బంధనాలు బంధిస్తాయి. దేహ సంబంధాలతో చాలా ఫీలింగ్(బాధ) కలుగుతుంది. ఇంటిలో ఒక కుమారుడు చెడిపోయి బయట తిరుగుతాడనుకోండి, అతను చెడ్డ పనులు చేస్తాడని, ఆడ పిల్లలను విసిగిస్తాడని, కొట్లాడుతూ జగడాలాడుతూ ఉంటాడని తల్లి వింటే, తెలుసుకుంటే ఆ తల్లికి ఎంత దు:ఖము కలుగుతుంది! ఇటువంటి కొడుకుల వలన కులానికి చెడ్డ పేరు వస్తుందని భావిస్తుంది. ఎందుకంటే అన్నిటికంటే పెద్ద అవమానము కుల కళంకితులుగా అవ్వడం, అన్నిటికంటే పెద్ద పాపము కులాన్ని కళంకితం చేయడం. అతనికి త్వరగా వివాహము చేయాలని అనుకుంటుంది. ఈనాటి సమాజములో దేహాభిమానము, అహం భావము చాలా ఉంది. ఈనాటి ఆధునిక సమాజములో నవలలు చదవడం, సినిమాలు చూడడం, క్లబ్‌కు వెళ్లడం, అటువంటి స్నేహితులు, స్నేహితురాళ్లతో స్నేహము చేయడం చాలా సాధారణమైపోయింది.

పిల్లలను ఇంటికి శృంగారంగా ఎలా చేయాలనే చింత మాతలకు ఉంటుంది. చంచలంగా ఉండే సంతానాన్ని సరి చేయాలనే చింత ఉండడం పాపమేమీ కాదు. ఏ తల్లి అయితే సంపన్నంగా ఉంటుందో వివేకవంతముగా ఉంటుందో, ఆ తల్లియే పిల్లలను సరిచేయగలదు. మంచి మార్గములో నడిపించగలదు. స్వయం కూడా ఈశ్వరీయ జ్ఞానాన్ని అర్థం చేసుకొని పుణ్యాత్మగా అవుతుంది, తన పిల్లలను కూడా పుణ్యాత్ములుగా చేస్తుంది. తల్లి నోటితో

మాట్లాడదు కానీ ఆమె సంకల్పాలలో నా పిల్లలు యోగ్యులుగా అవ్వాలని, మంచి వారుగా అవ్వాలని తప్పకుండా ఉంటుంది. మాతలు తమ ఇంటిని ఎలా చేయాలంటే ఆమె పిల్లలు, పతి, బంధువులు ఇంటిలో నివసిస్తున్న వారు మా ఇల్లు సాధారణ గృహస్థుల ఇల్లు కాదని, ఈ ఇంటి వాతావరణమే వేరుగా ఉందని, అలౌకికంగా ఉందని భావించాలి. ఇతర గృహస్థుల ఇంటి వలె అనిపించరాదు. మేము మందిరములోకి వచ్చామని వారు అనుభవము చేయాలి. ఈ ఇల్లు ఒక దేవాలయము అని వారికి అనుభవమవ్వాలి.

## బాబాకు మీ ఇంటిలో స్థానమివ్వండి

చాలామంది మాతలు తమ ఇంటిలో బాబాకు గది కూడా ఇవ్వలేరు. వారి ఇండ్లలో బాబాకు ప్రత్యేక స్థానమే లేదు. తమ కొడుకులకు జాగా ఇచ్చారు, పౌత్రులకు జాగా ఇచ్చారు, కూతుర్లకు జాగా ఇచ్చారు. అందరికీ తమ ఇంటిలో జాగా ఇచ్చారు కాని బాబాకు ఒక చిన్న గది కూడా తయారు చేసి ఇవ్వలేరు. బాబాకు ఒక గదిని ప్రత్యేకించలేరు. అక్కడ స్వయం వారు కూడా యోగము చేసుకోవచ్చు, పరివారాన్ని కూడా కూర్చోబెట్టవచ్చు. అక్కడ కూర్చుని బాబా మహావాక్యాలను వినవచ్చు, వినిపించవచ్చు. అక్కడ కూర్చుని ఇంటి ప్రకంపనాలను శుభ్రపరచవచ్చు. ఎక్కడ బాబా లేరో, వారు ఉండేందుకు జాగానే లేదో అక్కడ ప్రకంపనాలు ఎలా పరివర్తనవుతాయి? వాయుమండలము ఎలా తయారవుతుంది? భక్తిమార్గములో కూడా భగవంతుని విగ్రహాలను ఉంచేందుకు, గ్రంథసాహెబ్ సిక్కు మత గ్రంథాలను ఉంచేందుకు, దేవీ దేవతల చిత్ర పటాలను ఉంచేందుకు ప్రత్యేకమైన పెద్ద పెద్ద గదులు కేటాయిస్తారు. దేవుని ఇల్లు అని కూర్చుని గ్రంథ సాహెబ్‌ను చదువుతారు. సుఖమణిని చదువుతారు. పిల్లలను కూర్చోబెట్టి గీతా మొదలైనవి చదువుతారు. నేను అటువంటి ఇళ్లను చిన్నతనములోనే చూచాను. నా లౌకిక తల్లిదండ్రులు చాలా భక్తి చేసేవారు. మా తల్లి 12 గంటల వరకు ఏమీ తినకుండా, త్రాగకుండా చదువుతూనే ఉండేది. భాగవతము, గీత, సుఖమణిని చదివినంత వరకు పూజ గది నుండి బయటకు వచ్చేది కాదు, నాశ్తా తినేది కాదు. ఆమెను చూచే నేను కూడా భక్తి చేయడం నేర్చుకున్నాను. తల్లిని చూసి పిల్లలు భక్తి చేయడం నేర్చుకున్నప్పుడు మనము జ్ఞాన యుక్త ఆత్మలము, యోగయుక్త ఆత్మలము, ఇంటిలో ఉన్నాము.



కనుక పూర్తి ఇంటిని యోగ్యముగా ఎందుకు చేయలేము? అరే! మన మనసును ఎవరితో జోడించాము? సర్వశక్తివంతుడైన తండ్రితో జోడించాము.

యోగమనగా తండ్రితో సర్వ సంబంధాలు జోడించడం. పవిత్ర యోగిని అయిన తల్లి(పవిత్ర స్త్రీ) ఇంటిలో ఉన్నప్పుడు ఆమె పిల్లలు అజ్ఞానులుగా ఉండడం ఎలా సాధ్యము? ప్రకంపనాలే వారికి పోలేదంటే, వాయుమండలమే తయారవ్వలేదంటే ఆమె తన ఇంటిని శుద్ధముగా చేసే పూర్తి ప్రయత్నము చేయలేదని అర్థము. ఇంటి వాతావరణము బాగుండాలని భక్తిలో ప్రయత్నము చేస్తారు. అరే! మీరు బాబా పిల్లలు, మీ ఇంటి వాతావరణాన్ని బాగు చేసేందుకు ఏమి చేశారు? పిల్లల కొరకు ఇల్లు కట్టుకున్నారు, పిల్లల కొరకు అన్ని సాధనాలను చేకూర్చుకున్నారు. ఇంటి వాయుమండలాన్ని తయారు చేసేందుకు ఏ సంకల్పము చేశారు? ప్రాక్టికల్‌గా ఏమి చేశారు? అమృతవేళ లేచి సెంటరుకు వస్తారు, ఇది బాగుంది. కాని ఇంటిని ఆశ్రమముగా తయారు చేశారా? మీ ఇంటిని ఆశ్రమముగా తయారు చేసుకోకుంటే, ట్రస్టీగా ఎక్కడ అయ్యారు? బాబా మిమ్ములను ఇంటిలో ఎందుకు ఉంచారు? ఇంటిని మందిరముగా, ఆశ్రమముగా చేసేందుకు ఉంచారు. బాబా ఈ పని కొరకే మిమ్ములను ఇంటిలో ఉంచారన్నప్పుడు బాబా శ్రీమతము మీ చెవులలో మారుమ్రోగడం లేదా?

ఇంటిలో బాబాను ఉంచుకున్నారా? అని నేను ఒక మాతను అడిగాను. ఆ సమయంలో ఆమె ఉంచలేదు అని చెప్పింది. మరోసారి అడిగినప్పుడు ఆమె "దాదీ, మీరు అడిగిన తర్వాత బాబా చిత్రాన్ని ఇంటిలో ఉంచాను" ఇప్పుడు ఇంటిలో చాలా మంచి వాయుమండలము తయారయ్యిందని" చెప్పింది. ఎంత సంతోషంగా ఉన్నామంటే మా ఇంటి వాతావరణమే మారిపోయిందని చెప్పింది. ఏ ఇంటిలో బాబా చెప్పిన వాతావరణాన్ని తయారు చేయలేదో, ఆ ఇంటి వాతావరణము ఎలా పరివర్తన అవుతుంది? జ్ఞానాన్ని అర్థము చేసుకొని, యోగిగా తయారై ఆ మాత ఇంటి కొరకు, పరివారము కొరకు ఏమి చేసినట్లు? ఇంటిలో సంబంధీకుల గ్రూపు ఫోటో ఉంది, సినిమా యాక్టర్ల ఫోటోలు ఉన్నాయి, నాట్యము చేసే వారి ఫోటోలు ఉన్నాయి, పెళ్లి ఫోటోలు ఉన్నాయి, కోడలి ఫోటోలు ఉన్నాయి. ఇంటిలోని వారు, ఇంటికి వచ్చేవారు ఆ ఫోటోలనే చూస్తూ ఉంటారు. ఈ చిత్రాలు, ఫోటోలు ఇంట్లో పెట్టుకోమని బాబా చెప్పారా? ఏ చిత్రాలు

పెట్టుకోవాలి? భక్తి మార్గములోని దేవీ దేవతల చిత్రాలు ఉంచుకుంటారు, గోడలకు తగిలిస్తారు. ఇంటిలో లౌకిక సంబంధీకుల ఫోటోలు తగిలించి ఉంటే, యోగము ఎలా కుదురుతుంది? వారి యోగము దేహ సంబంధీకులతో జోడింపబడి ఉంది, ఆ ఫోటోలను చూస్తూ సంతోషిస్తూ ఉంటారు. పిల్లల వివాహ ఫోటోలు చూస్తారు, అందులో కొడుకు ఇలా కూర్చుని ఉన్నాడు, కోడలు ఇలా కూర్చుని ఉంది, వారి వద్ద నేను ఇలా నిల్చుని ఉన్నాను అని ఆమె చూస్తూ ఇతరులకు కూడా చూపిస్తూ ఉంటే వారికి బాబా గుర్తుకొస్తారా?

## ప్రపంచానికి భయపడకండి, బలహీన సంకల్పాలు చేయకండి

నేను ఏమి చేస్తున్నాను? బాబా మతమును అనుసరిస్తున్నానా? పిల్లల మతమును అనుసరిస్తున్నానా? లేక మన్మతమును అనుసరిస్తున్నానా? సంబంధీకుల మతాన్ని అనుసరిస్తున్నానా? అని స్వయాన్ని ప్రశ్నించుకోండి. ఈమె బ్రహ్మాకుమారిగా అయిపోయింది, పిల్లలను కూడా తన వలె తయారు చేసి పాడు చేస్తోంది, పిల్లలు యుక్త వస్కులైపోయారు, వారికి వివాహం చేయడం లేదు, కూతురు కూడా వయసుకు వచ్చింది, ఆమెకు కూడా వివాహము చేయడం లేదు, తన వెంట ఆశ్రమానికి తీసుకుపోయి పిల్లల జీవితాలనే పాడు చేస్తోందని బంధువులు ఎక్కడ అంటారో అని వ్యర్థ సంకల్పాలైతే రావడం లేదు కదా? అటువంటి సంకల్పాలు వస్తున్నాయంటే మీ మనసు బలహీనంగా ఉందని అర్థము చేసుకోండి. ప్రపంచము ఏమైనా అంటుంది. అది అననిది ఏమైనా ఉందా? పాపం ప్రపంచములోని వారికి బుద్ధి ఎక్కడ ఉంది? మంచి చేసినా, చెడు చేసినా, ఏమి చేసినా ప్రపంచము ఏదో ఒకటి తప్పకుండా అంటుంది. రైటేదో, తప్పేదో, పుణ్యమేదో, పాపమేదో వారికి తెలియనే తెలియదు. పాపము ప్రపంచములోని వారు మాయలో చిక్కుకొని ఉన్నారు. వారి పై మీరు దయ చూపాలి. వారు మన పై జాలి చూపుతున్నారని అనుకుంటారు. కాని మీరు వారి పై దయ చూపి, వారికి జ్ఞానము వినిపించాలి, దారి చూపించాలి. బయటివారి మాటలు వింటే తమ ఇంటిని బాగు చేసుకోలేరు. ఎందుకంటే సంశయములోకి వచ్చేస్తారు కదా. వారి మాటలు విని ప్రపంచము మారుతుందో, లేదో, కొడుకు జ్ఞానములో ఉండగలడో, లేడో, జ్ఞానములో నడవలేకుంటే ఇటు అటు కాకుండా ఉండిపోయి, అతని జీవితం చెడిపోతుందేమోనని



సంశయపడతారు. ముందే చెడు సంకల్పాలు చేసి చెడును ఆహ్వానిస్తారు. స్వయం మీరే మాయను ఆహ్వానిస్తే అది మీ పై దాడి చేస్తుంది కదా. బలహీనుల పైననే ఎవరైనా దాడి చేస్తారు. మీరు మనసు ద్వారా ముందే బలహీనంగా అయిపోతే మాయ మీ పై తప్పకుండా దాడి చేస్తుంది. అది స్వాభావికమే కదా.

బాబా సదా తండ్రిని చూడండి(సీ ఫాదర్) అని చెప్పారు. అంతేకాని తోటి విద్యార్థులను చూడమని చెప్పారా? పాఠశాలలో చదివేటప్పుడు ఎప్పుడైనా విద్యార్థి ఇతర విద్యార్థులను చూస్తాడా? టీచరు ఏది చదివిస్తారో, అదే చదువుతాను అని అంటారు. అలాంటివారే చురుకైన విద్యార్థిగా, తెలివైన విద్యార్థిగా ఉంటాడు. ఇది అలౌకిక పరివారము, ఇది ఇల్లు, పాఠశాల, విశ్వ విద్యాలయము కూడా అని బాబా అంటారు. కనుక ఈ చదువు బాగా చదువుకోవాలి కదా! చదువు ద్వారానే ప్రాలబ్ధము తయారవుతుంది. మనము చదువుకుంటున్నామని ఈ జన్మలోనే అనుభవమవుతుంది. బాబా మనలను చదివిస్తున్నారు, మనము బాగా చదువుకుంటున్నాము. మన మనసు కూడా శాంతిగా అయిపోతోందని మనకు కూడా తెలుస్తుంది. ఇతరులు కూడా వీరు బాగా చదువుకుంటున్నారని అంటారు. ఒక మాత కూర్చుని వ్రాస్తూ ఉండడం జానకీ దాది చూశారు. ఈమె ఎవరు? అని నన్ను అడిగారు. ఈమె కర్నాల్ మాత అని చెప్పాను. నేను ఆమెను మర్చిపోయాను. ఆమె చేతిలో ఎప్పుడూ పెన్సిల్, పుస్తకము ఉంటుంది అని దాదీ అన్నారు. ఈమెకు చదువు పై చాలా గమనము ఉంది అని చెప్పారు. ఆమె క్లాసులో ముందే కూర్చుంటుంది. ఏ ఏ మాతలు బాబా చెప్పిన చదువును హృదయపూర్వకంగా, రెగ్యులర్‌గా చదువుకుంటారో అది తెలుసుకోవాలని నాకు కూడా మనసులో ఉంటుంది. నేను ఈ విధంగా తయారవ్వాలని, ఎవరెవరికి ఆసక్తి ఉంటుందో వారి పేర్లను నోట్ చేసుకోవాలని, అటువంటి మాతలను ఇంకా ముందుకు తీసుకు రావాలని కోరుకుంటారు.

## కుమార్తెను కసాయి వారి నుండి రక్షించండి, కొడుకును విషము నుండి రక్షించండి

కుమార్తె వివాహం చేసి కసాయి చేతిలో పెడ్తారని బాబా అంటారు.

పవిత్రమైన కన్యకు వివాహము చేసి నరకంలో తోసేస్తారు. ఇటువంటి పని చేసేందుకు సిగ్గుపడాలి అని కూడా బాబా అంటారు. బాబా చెప్పిన ఇటువంటి మాటలు నాకు గుర్తుకొస్తూ ఉంటాయి. ఎందుకంటే సాకార బాబా శబ్దాలు నేరుగా విన్నాము కదా? అటువంటి మాతలను చూచి నాకు చాలా దయ కలుగుతుంది. ముఖ్యంగా కుమారీలను, కుమారులను చూసి నాకు చాలా దయ కలుగుతుంది. ఎందుకంటే కుమారుల జీవితము, కుమారీల జీవితము చాలా మంచి జీవితము. అటువంటి వారిని నరకములోకి ఎందుకు తోస్తారు? ఇది అందరికీ అంతిమ సమయము. ప్రపంచమూ పాతదైపోయింది, జన్మ కూడా అంతిమ జన్మ. ఈ అంతిమ జన్మలో బాబాను స్మృతి చేస్తూ చేస్తూ శరీరాన్ని వదలండి. పవిత్రమై శరీరాన్ని వదిలితే పవిత్ర ప్రపంచములోకి వస్తారు. ఇంతకుముందు తెలియదు కనుక జన్మ-జన్మాంతరాలుగా పాపం చేస్తూ వచ్చారు. అపవిత్రులుగా అవుతూ వచ్చారు. బ్రహ్మచర్య వ్రతాన్ని అవలంభించలేదు. దానిని గురించి అసలే తెలియదు. ప్రవృత్తి అంటేనే ఇలా నడుస్తుందని భావిస్తూ వచ్చాము. ఇప్పుడు అపవిత్రత ద్వారానే, కామ వికారము ద్వారానే మన ఆది-మధ్య-అంతము క్రింద పడిపోయిందని, దు:ఖము ప్రారంభమయిందని తెలిసింది. దు:ఖము వీటి నుండే ప్రారంభమవుతుందని తెలిసినప్పుడు పాపం ఈ పిల్లలను రక్షించేందుకు మనము ప్రయత్నించాలి కదా. చిన్న పిల్లలకు తేలు కుట్టడం మీరు చూస్తే మీరేం చేస్తారు? ఆ పిల్లలను ఎత్తుకొని దూరంగా తీసుకెళ్తారు కదా. ఒకవేళ పిల్లలు రాకున్నా బలవంతంగానైనా ఎత్తుకొని దూరంగా తీసుకెళ్తారు కదా. ఎందుకంటే తేలు కుట్టే విషం ఎక్కుతుందని మీకు తెలుసు. ఆ విషంతో ఆ బాలుడు మరణించవచ్చు కూడా. ఆ బాలుడు మరణిస్తే మీకు దు:ఖం కలుగుతుంది. విషం వలన మీ పుత్రుడు మరణించరాదని దూరంగా తీసుకెళ్తారు. అలాగే ఈ వికారము విషము వంటిది. ఆది-మధ్య-అంతాలు దీని ద్వారానే దు:ఖమయమవుతాయి. అటువంటి విషములో మీరు మీ పిల్లలను ఎందుకు తోసేస్తారు? చాలామంది నాకు కోడలు వస్తుంది, ఇల్లు సంభాళిస్తుంది, నా బరువంతా తగ్గిపోతుంది, తేలికగా అయిపోతానని అనుకుంటారు. అనగా కుమారునికి వివాహము చేయాలని మీకు ఆసక్తి ఉందని అర్థమవుతుంది. అందులో మీ స్వార్థముంది. స్వార్థమున్నవారు ఎప్పుడూ సేవ చేయలేరు. సేవ



అనగా అచ్చట స్వార్థముండదు. నిస్వార్థ సేవ చేసేవారికే బాబా సహాయం లభిస్తుంది. ఎటువంటి స్వార్థము ఆంతరికంలో ఉన్నా వారు చేసే సేవ సఫలమవ్వదు. ఇతరులలో స్వార్థముంచుకోవడం చాలా పెద్ద బలహీనత. ప్రపంచంలో అన్నింటిలో స్వార్థముందని మనము కూడా అంటాము కదా. ఈ ప్రపంచమంతా స్వార్థపూరితమైనది. కుటుంబ పరివారము కూడా స్వార్థపరమైనదే. అందరూ స్వార్థపరులే. ఒక్క బాబా మాత్రమే నిస్వార్థమైన సేవ చేస్తారు. పిల్లలను శృంగారిస్తారు, పిల్లలకు సేవ చేస్తారు. బాబా పిల్లలైన బ్రాహ్మణులే నిస్వార్థమైన సేవ చేయగలరు. ఎందుకంటే వారికి ఒక్క బాబాయే అన్నిటిలో ఆధారము. సర్వ సంబంధాలు ఒక్క బాబాతోనే ఉన్నాయి. వారికి సర్వమూ ఒక్క బాబాయే. భక్తిమార్గంలో కూడా మీరొక్కరే ఆధారమని అంటారు. ఇప్పుడు ప్రాక్టికల్‌గా వారు వచ్చారు, మనందరినీ నిభాయిస్తున్నారు. ఎప్పుడైతే నిశ్చయముంటుందో అప్పుడు ఈ అనుభవమవుతుంది.

## ప్రపంచము మారిపోయినా తండ్రినుండి, తండ్రి శ్రీమతము నుండి ఎప్పుడూ దూరమవ్వరాదు

మీ పై మీకే నమ్మకం లేకుంటే బాబా ఎందుకు సహాయం చేస్తారు? మీ కొరకు మీరు ఏ నిశ్చయం చేసుకున్నారు? మొట్టమొదట మీరు నిశ్చయం చేసుకుంటే బాబా సహాయం చేస్తారు. పరీక్షలేమో వస్తాయి కాని మనము ఆ పరీక్షలో ఫెయిల్ అవ్వాలా? పరీక్షలైతే అన్ని వైపుల నుండి వస్తాయి. దేహము ద్వారా వస్తుంది, దేహ సంబంధాల ద్వారా కూడా వస్తుంది, దేహ పదార్థాల ద్వారా కూడా వస్తుంది. ఒకవేళ లెక్కాచారాలుంటే అశుద్ధ ఆత్మల(ఈవిల్ సోల్స్) ద్వారా కూడా వస్తుంది. వాటిని కూడా మనము ఉద్ధరించాలి అంతేగాని మనము వాటికి భయపడరాదు. బాబా లభించారు కనుక మనకు సర్వశక్తులు లభించాయి. వారు మనలను చదివించారు, అర్హులుగా చేశారు, సేవ చేయడం నేర్పించారు, మనలను విశ్వం ముందు ఉంచారు, ఎంతగా ప్రేమించారు! వారి ముందు మనము ఎంతగా సమర్పణైపోవాలి! మన కొరకు ఎంత శ్రీమతమునిచ్చారు! ప్రపంచం మారిపోనీ కానీ మనం తండ్రి నుండి, తండ్రి శ్రీమతం నుండి ఎప్పుడూ దూరంగా తొలగిపోరాదు. ఎవరైతే బాబా

మతమునుసరిస్తారో వారు ఎప్పుడూ ఇతరుల మతమును అనుసరించరు. ఒకవేళ ఇతరుల మతమును అనుసరిస్తున్నారంటే వారికి ఒక్కరి మతము పై నిశ్చయము లేదని, ఆ ఒక్కరితో అనుభవము లేదని అర్థము. ఈశ్వరీయ మతము ద్వారా వారు ఎటువంటి లాభమూ తీసుకోలేదు, వారికి ఎటువంటి ప్రాప్తి కలుగలేదు. వారు మనకు ఎన్నో ఖజానాలు ఇచ్చారు. వాటన్నిటిని ఒక చెవితో విని మరో చెవితో వదిలేశారు, ఎందుకు? ఎందుకంటే గృహస్థ వ్యవహారంలో ఉండినందున గృహస్థములోని మాటలే చెవులలో పడ్తాయి. వాటిని గురించే మనము మాట్లాడ్తాము. వాటిని గురించే చింతన చేస్తాము. అందువలన మన బుద్ధిలో బాబా ఖజానాలు నిలువవు(కూర్చోవు). లౌకిక సంకల్పాలు నడిచేందుకు కారణం ఆంతరికంలో శక్తి నిండలేదు, అనుభవం చేయలేదు కనుక ఖాళీ ఖాళీగా అనిపిస్తుంది. ఇక్కడి మాటలు, అక్కడి మాటలు, వ్యర్థ సంకల్పాలు బలహీనంగా చేస్తాయి.

## పవిత్ర సాంగత్యము, పవిత్ర ఆలోచనలు చేయండి

ప్రతి రోజు క్లాసుకు వస్తున్నా చాలామంది మాతలు బాహ్య విషయాలలోకి వచ్చేస్తారు. వాటి సాంగత్య ప్రభావములోకి వచ్చి సాంగత్య రంగులోకి వచ్చేస్తారు. కనుక మాతలారా! పవిత్ర సాంగత్యము చేయండి, పవిత్రమైన ఆలోచనలు చేయండి. సాంగత్య దోషము నుండి, అపవిత్రత నుండి రక్షింపబడాలంటే, ఆత్మను శక్తిశాలిగా చేసుకోవాలంటే పథ్యము ఉండండి. ఈ రోజుల్లో డాక్టరు ఈ జబ్బును సరి చేసుకోవాలంటే మీరు ఈ ఆహారము తీసుకోండి అని చెప్తారు. కేవలం ఆహారము తీసుకోవడం వలన వ్యాధి బాగవుతుందా? మందు కూడా తీసుకోవలసి వస్తుంది కదా! కేవలము జ్ఞానము వినుట వలన ఏమి జరుగుతుంది? దానిని ఆచరించాలి. అప్పుడే ఆత్మలో శక్తి నిండుతుంది. కేవలం మందు తిన్నందున జబ్బు నయము కాదు. దానితో పాటు తగిన భోజనము కూడా తీసుకోవాలి. ఎవరికైనా వాంతులవుతూ ఉండి, పాలు తాగుతూ ఉంటే ఏమవుతుంది? ఇంకా వాంతులెక్కువైతాయి కదా. పాలేమో శక్తిశాలి ఆహారమే కాని ఆ సమయములో పనికి రావు కదా! అలాగే బాబా మనకు ఇంటిలో ఎలా నడుచుకోవాలి, కుటుంబ సభ్యులతో ఎలా ఉండాలి, పిల్లలతో ఎలా మెలగాలి, పతితో ఎలా వ్యవహరించాలి మొదలైన అన్ని విషయాలు తెలిపిస్తారు. రోజంతా



లౌకిక విషయాలే ఆలోచిస్తూ ఉంటే లౌకికములో అలౌకికత ఎలా వస్తుంది? లౌకికమును కూడా అలౌకికముగా భావించండి. ఈ కుమారుడు కేవలము నాకే కాదు, బాబాకు కూడా పుత్రుడే, నా పతి కూడా బాబా కుమారుడే. కుమార్తె - పౌత్రులు కూడా బాబావారే. మధ్యలో బాబాను తప్పక ఉంచుకోండి. బాబాను మధ్యలో ఉంచుకోకుంటే మోహ పాశాలు మిమ్ములను కట్టివేస్తాయి. జన్మ-జన్మాంతరాల ఈ పాశాలను సమాప్తము చేయాలి. శరీరము కూడా ఎందుకు రోగగ్రస్థమౌతుంది? దానితో మనము ఏమేమో చేసేశాము. ఈ అంతిమ జన్మలోనే అన్ని బంధనాలను సమాప్తము చేయాలి.

## ఇముడ్చుకునే శక్తిని ధారణ చేయండి

ఇంటి వాతావరణము దేని వలన భారమైపోతుంది? ఎవరికైనా పదే పదే జబ్బు చేస్తే లేక ఒకరి తర్వాత మరొకరు జబ్బు పడ్తూ ఉంటే భారమైపోతుంది. మాకెందుకిలా జరుగుతూ ఉందని తల్లి చింతిస్తుంది. ఒకరు బాగవుతూనే మరొకరు జబ్బుపడ్డారు. వారు బాగవుతూనే మూడవవారు జబ్బుపడినందున వాయుమండలము బరువెక్కిపోతుంది. డాక్టరుగారు నీ చెవిలో చెప్పిన విషయము అందరికి చెప్పే అవసరమేముంది? ఎవరికి తెలపాలో వారికి తెలిపించండి. ఏ ఏర్పాట్లు చేయాలో అవి చేసుకోండి, సరిపోతుంది. అదే విషయాన్ని పదే పదే తలుచుకునే అవసరము గాని, ఇతరులకు తెలిపే అవసరము గాని ఏముంది? అలా చేసినందున మీ మనసు భారమై, ఇంటి వాతావరణము కూడా భారమైపోతుంది. నెమ్మదిగా దు:ఖము అనుభవమవుతుంది. ఈ దు:ఖానికి జన్మనిచ్చిందెవరు? మనమే కదా! వాయుమండలాన్ని భారము చేసుకునేందుకు బదులు దానిని తేలిక చేసెయ్యాలి. మీ కుమారునికి జబ్బు చేస్తే ఏమవుతుంది? జబ్బు అందరికీ వస్తుంది. జబ్బు ఎందుకు వచ్చిందని చింతించేందుకు బదులు దానికి వైద్యము చేయించండి. బాబాను స్మృతి చేయండి, యోగ దానమివ్వండి. పిల్లలకు ధైర్యము చెప్పండి. " జబ్బు ఏమి చేస్తుంది, బాగైపోతుంది, ఏమీ పర్వాలేదు, జబ్బులు అందరికీ వస్తాయి, దాని వలన కర్మ భోగము నశిస్తుంది" అని ఇటువంటి సకారాత్మక మాటలు మాట్లాడి ఇంటివారిని, ఇంటి వాతావరణాన్ని తేలిక పరచవచ్చు.

ఇంట్లో కోడలితో కొట్లాట జరుగుతుంది.ఆమె పెద్ద తోడి కోడలుకు, భర్తకు,

పిల్లలకు, పౌత్రులకు అందరికీ వినిపిస్తుంది. దీని వలన ఇంటి వాతావరణము భారమైపోతుంది. ఇంటి వాతావరణము చెడిపోతుంది, బిగుసుకుపోతుంది, టెన్షన్ ఏర్పడుతుంది. ఇముడ్చుకునే శక్తి లేనందున కోడలు అందరికీ చెప్పేస్తుంది. ఈ శక్తి లేనందు వలన ఇంట్లో శాంతి ఉండదు, ఇల్లు ఇల్లుగా ఉండదు. చెడిపోతూ పోతుంది. మన సంస్కారము వలన ఇంట్లో వాతావరణము బాగుండదు. మన పాత సంస్కారాలను పోషిస్తూ, ఇంటి వాతావరణాన్ని భారంగా చేయడం పాపమవుతుంది. మీరు ఇంటిని మందిరంగా తయారు చేసేందుకు బదులు పాప భాండాన్ని నింపుకుంటున్నారు. ఇంట్లో టెన్షన్ వాతావరణముండరాదు. ఎవరైనా ఏమైనా అంటే ఇముడ్చుకోండి. అదేమంత పెద్ద విషయము? ప్రతి ఒక్కరు తమ సంస్కారాలను, తమ భాగ్యాన్ని తమ వెంట తీసుకొచ్చారు. మనమెందుకు అందులో తల దూర్చాలి. దాని వలన మన స్థితి చెడిపోతుంది. మన సంస్కారము కూడా పాడైపోతుంది. బాబా అంటున్నారు - " పిల్లలూ, మీరు శివశక్తి సైన్యము. ఈ సైన్యమే అన్ని పనులు చేస్తుంది. లక్ష్మి, సీత అనేవి ఒక్కరి పేర్లు మాత్రమే కాదు. సైన్యమంతా లక్ష్మి-సీతలుగా అయ్యారు. భక్తిమార్గములో వైష్ణవి దేవి ఉంటే, మీరంతా వైష్ణవి దేవీలే. లక్ష్మి ఉంటే మీరంతా లక్ష్మి దేవీలే. ఇక్కడ కూర్చున్న వారంతా సైన్యమే. బాబా సైన్యమంతటిని శివశక్తి అవతారమని అనేశారు. అరే, మీరు ఇటువంటి శివశక్తులు, ఇంటి మహాలక్ష్ములు. ఇంట్లో అటువంటి వాతావరణాన్ని తయారు చేయండి. ఇతరులెవరైనా మీ ఇంటికి వస్తూనే నేను దేవతల ఇంటికి వచ్చానని అనుభవము చేయాలి. ఇక్కడ చైతన్య వైష్ణవి దేవీలు కూర్చొని ఉన్నారు, వారింటికి వచ్చాము, ఇక్కడ లక్ష్మి దేవి కూర్చొని ఉంది అని అనుభవము చేయాలి.

## ఇంటిని దేవాలయముగా తయారు చేసుకోండి

నేను లండన్‌కు పోయినప్పుడు, నన్ను ప్రవృత్తిలో గల మాతల ఇండ్లకు పంపించారు. ప్రతి రోజు సాయంకాలము వెళ్లేదానిని. అక్కడ క్లాసు జరుగుతూ ఉండేది. లండన్‌లో నేను నిజంగా అద్భుతము చూచాను. అందరి ప్రవృత్తి, పిల్లా-పాపల సహితము అందరూ పవిత్ర ఆశ్రమవాసులే. ఇంటిని వారు పవిత్ర గృహస్థ ఆశ్రమముగా తయారు చేశారు. పతి-పత్ని, కొడుకు-కోడలు, కూతురు-కొడుకులు అందరూ కలిసి సేవలో సాథీల వలె ఉన్నారు, వారు



పరస్పరములో వీరు బాబా బిడ్డ, వారు బాబా బిడ్డ అని చెప్తున్నారు. నిజంగా ఇది బాబా పరివారమనే ఫీలింగ్ నాకు కూడా కలిగింది. అందరూ అలౌకిక ప్రవృత్తిని అనుసరిస్తున్నారు. అందరికీ పెద్ద పెద్ద బంగ్లాలు ఉన్నాయి. తమ బంధు మిత్రులందరిని అక్కడకు పిలిచి సత్సంగము చేస్తారు. నేను ఒక్కొక్క ఇంటిని చూచేందుకు వెళ్ళాను. నియమానుసారము అందరి ఇళ్ళలో బాబా గది ఉంది. ఒక సోదరుని ఇల్లు పెద్దదిగా కాదు. అతడు తన పడక గదిని బాబా గదిగా చేసుకున్నాడు. అతడు సామాను ఉండే గదిలో నిదురిస్తాడు. అతని పత్ని మరో ధర్మానికి చెందినది. ఆమె కూడా పూర్తి బ్రహ్మాకుమారీగా మారిపోయింది. పిల్లలను ప్రతి రోజు బాబా గదిలో కూర్చోబెడ్తారు. ఇంత చిన్న ఇంటిలో ఎలా ఉంటున్నారు అని నేను అనుకున్నాను. వారు వారి సుఖాన్ని కూడా త్యాగము చేసి బాబా సేవ చేస్తున్నారు. త్యాగము, తపస్సు, సేవ. లండన్‌లో వారు ఇంటి ఇంటిని ఎలా మందిరముగా చేసుకున్నారో చూడండి! ఇక్కడ భారతవాసుల సంస్కృతి ఎంతో ఉన్నతమైనది, పవిత్రమైనది. భారతదేశము దేవీ దేవతల భూమి. ఇటువంటి స్థానములో గృహ కలహాలు జరగడం మంచిదా! పిల్లలను రక్షించుకోలేకున్నారు. బాబాకు గదిని ఇవ్వలేకున్నారు. ఇటువంటివారికి బాబా నుండి సహాయము ఎలా లభిస్తుంది? మీరు ఏమి త్యాగము చేశారు? ఎంత సమర్పణ అయ్యారు? ఇంటిలో ఇటువంటి పవిత్రమైన వాయుమండలాన్ని తయారు చేయండి. లౌకిక సంబంధీకులే గుర్తుకు వచ్చే చిత్రాలను గోడల నుండి తీసేయండి.

ఓంశాంతి భవనాన్ని చూడండి. అక్కడ నలువైపులా ఎలాగైతే స్లోగన్‌లు తగలించబడి ఉన్నాయో అలా మీ ఇళ్లలో కూడా మంచి మంచి స్లోగన్‌లు తగలించండి, జ్ఞాన చిత్రాలు తగలించండి. ఇంటిని ఆదర్శవంతముగా, అలౌకికముగా తయారు చేయండి. ఎవరైనా వస్తే వారికి ఈశ్వరీయ జ్ఞానము వినిపించగలగాలి. మనము బాబా పిల్లలము, బి.కె.లము, సేవ కొరకే ఉన్నాము కదా. సేవార్థము బాబా మనలను ఇంటిలో ఉంచారు. మీ సంకల్పముతో ఆ ఇంటిని గృహస్థముగా చేయకండి, సేవా స్థానముగా తయారు చేసుకోండి. బాబా మిమ్ములను అచ్చట సేవార్థముగా ఉంచారు. ప్రవృత్తి కొరకు కాదు, గృహస్థము కొరకు కాదు. ఒకవేళ ఇంటికి లౌకిక సంబంధీకులు, మనవలు,

మునిమనవలు వచ్చినా వారితో పాత సంబంధాలతో వ్యవహారము చేయకండి, లౌకిక మాటలు మాట్లాడకండి. బ్రాహ్మణులమైన మనము పరస్పరము ఆత్మీయతతో, అలౌకికతతో ఎలా కలుస్తామో అలా కలవాలి. వీరు మా లౌకిక సంబంధీకులు, బంధువులు అని ఎప్పుడూ మనసులోకి రాకూడదు. వీరు కూడా బాబా పిల్లలే, శ్రేష్ఠ ఆత్మలని మనసులోకి రావాలి. దీని వలన ఇంటి వాతావరణము అలౌకికముగా, శక్తిశాలిగా తయారైపోతుంది.

## సీ ఫాదర్, ఫోలో ఫాదర్ (తండ్రిని చూడండి, తండ్రిని అనుసరించండి)

ఇంట్లో వారిని కూడా బాబాకు అప్ప చెప్పండి. మీ వారిగా భావించకండి. మీ వారిగా భావిస్తే గృహస్థము కట్టి పడేస్తుంది. స్వయాన్ని కూడా పూర్తిగా సమర్పితమయ్యామని భావించండి. నేను బాబా వారిని, బ్రహ్మాకుమారీని, యోగ్యురాలినని భావించండి. మొదట మీ ఇంటిని ఇలా తయారు చేసుకుంటే ఇతరులకు సేవ చేయడంలో సఫలమౌతారు. ప్రపంచములో నలువైపులా ఏమి జరుగుతూ ఉందో మీకు తెలుసు. అన్నివైపులా లోపలా బయటా, కోట్లాటలు, యుద్ధాలు జరుగుతున్నాయి. కనుక మీ పాత స్వభావాలు సంస్కారాలు, సంబంధ - సంపర్కాలు సమాప్తము చేసుకొని కర్మాతీతులుగా అవ్వండి. బాబా కూడా మిమ్ములను ప్రేమించాలి. నా పిల్లలను చూడండి, వారు చేయలేని పని ఏదీ లేదని మిమ్ములను మహిమ చేయాలి. ఇంటిని మందిరముగా చేసుకున్నారు కనుక విశ్వానికి స్వర్గముగా తప్పకుండా చేస్తారు. స్వయం పై విశ్వాసముంచుకోండి. సాకార బాబా ఒంటరిగానే ఉండినారు కదా. ప్రారంభములో వారికెవరి సహాయముండినది? ఇంతమంది కన్యలు, మాతల పై దయతో నా పిల్లలు అపవిత్రము కారాదని రక్షించారు కదా. లౌకికములో బాబా ఏమేమో ఎదిరించవలసి వచ్చింది! సోదరులంతా ఎంత గలాటా (హంగామా) చేశారు! సమాజము ఎంతగా విరోధించింది! బాబా ఇంటికి నిప్పు కూడా అంటించారు. బాబా వద్దకు నగరములోని నాయకులంతా, పెద్దలంతా వచ్చేశారు. మీరు భలే నాలుగు వికారాలను వదిలించండి, కాని అయిదవ కామ వికారమును వద్దనకండి. వారితో బాబా, నేను కూడా గృహస్థుడనే కదా అని అన్నారు. కామ వికారము వద్దని చెప్పింది నేను కాదు. నన్నెవరు రక్షించారు? ఎవరు వద్దన్నారు? అపవిత్రము కండి అని నేనెలా చెప్తాను! ఇలా చెప్పింది



పైనున్నవారు. వారు పవిత్రంగా అవ్వండి అని చెప్పారు. నాకు చెప్పింది కూడా వారే కామము మహాశత్రువు - ఇది భగవంతుని మహావాక్యము. మనుష్యులెవ్వరూ కామము మహాశత్రువని చెప్పరు. వారు అందులో ఇరికిస్తారు(ముంచేస్తారు). నేను కూడా అందులో చిక్కుకున్నానని బ్రహ్మాబాబా చెప్పేవారు. భగవంతుడు వచ్చారు, కామము మహాశత్రువని వారు చెప్తున్నారు. భగవంతుని మహావాక్యాలను వినకండి అని నేనెలా చెప్తాను? భగవంతుడొకటి చెప్తే నేను మరొకటి చెయ్యాలా? అదెలా వీలవుతుంది? ఇలా బాబా అందరికీ నచ్చజెప్పారు కదా. సమాజానికేమైనా భయపడ్డారా? పిల్లలూ భయపడకండి, కామ వికారము కొరకు ఇంటింటిలో కొట్లాటలు జరుగుతాయని మీరు బంధనముక్తులుగా అయ్యే సమయమొస్తుందని పిల్లలను ఓదార్చారు. మీ పతులు మీ పై ఉమ్మేసినా దానిని తీసేయండి, కాని పవిత్రత కొరకు సహించండి. వారికి సేవ చేసేందుకు భయపడకండి కాని తప్పకుండా పవిత్రంగా ఉండండి. బాబా ఏమైనా తక్కువైనవారా? శివబాబా ఈ బాబాతో - నీవు ఇటువంటి పవిత్ర ప్రపంచాన్ని స్థాపన చేయాలి అని చెప్పారు. కనుక పవిత్ర ప్రపంచానికి పునాది పవిత్రతే కదా! బలహీన పునాది ఎలా వేయగలరు? పునాది వేయాలంటే ఎదిరించవలసి వస్తుంది, సహించవలసి వస్తుంది. పరీక్షలు వస్తాయని బాబా ముందే చెప్పారు. అందరూ పరీక్షలో పాసయ్యారు. కనుక తండ్రి ఏ మార్గములో నడిచారో మనము కూడా అదే మార్గములో నడుస్తాము. మనము బలహీనమెందుకవుతాము? తండ్రిని చూడండి, తండ్రిని అనుసరించండి. మనము బాబాను చూడాలి. బాబా ఏమి చెప్పారో అది చేయాలి. సత్యయుగములో కూడా సాకార బాబా జతలోనే ఉండాలి, అనగా శ్రీకృష్ణుని జతలో ఉండాలి. కల్పమంతా వారి జతలో తిరగాల్సిందే.

బాబా ఎలా నడుచుకున్నారో, ఎలా పురుషార్థము చేశారో అలా చేస్తే భవిష్యత్తులో కూడా వారి జతలో ఉంటారు కదా. మనము సాకార బాబాను అనుసరించకపోతే రాజధానిలో కూడా వారి నుండి దూరంగా ఉంటాము. ఈ మాటలు మాతలైన మీరు చాలా లోతుగా అర్థము చేసుకోండి. బాబా మన నుండి ఏమి కోరుతున్నారు? మన బాబా ఎంత దయాహృదయులు! మనలను ఎంత రక్షించాలని అనుకుంటున్నారు! అయినా మనము

మన్మతమును అనుసరించి బలహీనులై నడుచుకోవాలా? నారి స్వర్గానికి ద్వారము అందరికీ స్వర్గానికి దారి చూపిస్తుంది. భలే వారు నారి నరకానికి ద్వారమని అన్నా మన తండ్రి అయిన పరమాత్మ నారి స్వర్గానికి ద్వారమని చెప్తున్నారు. ఇప్పుడు పుణ్య ప్రపంచానికి దారి చూపమని తండ్రి చెప్తున్నారు. ఈ సేవ చేసేందుకు బాబా మనలను నిమిత్తులుగా చేశారు. ఇతరులకు పుణ్య ప్రపంచానికి దారి చూపేందుకు, వారిని పుణ్యాత్మలుగా తయారు చేసేందుకు మొదట మనము పుణ్యాత్మలుగా అవ్వాలి కదా! శక్తిశాలి ఆత్మలుగా అవ్వండి, ఆధ్యాత్మిక శక్తితో సంపన్నంగా అవ్వండి. ఈ శివ శక్తి సైన్యము ఆధ్యాత్మిక శక్తి గలది.

## ఏడ్చేవారు దు:ఖాన్ని పంచుతారు అనగా పాపము చేస్తారు

శరీరము అల్పకాలముదైనందున శారీరిక సంబంధీకులు కూడా అల్పకాలము వారే, అనగా అల్పకాల సుఖమునిచ్చేవారు. ఇంటిలో ఎవరైనా శరీరాన్ని వదిలితే ఎంత దు:ఖము కలుగుతుంది! ఎంతగా ఏడుస్తారు! మీరు మీ జీవితాన్ని ఏడ్చేదిగా ఎందుకు చేసుకున్నారు? బాబా చెప్తారు - "నా పిల్లలు దు:ఖముతో ఒక్క కన్నీటి చుక్క కార్చినా అది వారికి పెద్ద పాపమవుతుంది". బాబా చెప్పిన ఈ మాటలు చెవులలో మారుమ్రోగడం లేదా? భలే ప్రేమ భాష్పాలు రానీయండి కాని దుఃఖముతో కూడిన కన్నీరు రాకూడదు. బాబా వారిగా అయిన తర్వాత కూడా దుఃఖముతో కన్నీరు కారుస్తే మనము ఏమి మారినట్లు? మనలో జ్ఞానమేమున్నట్లు? ఎవరైనా శరీరము వదిలినప్పుడు మనము ఏడుస్తూ ఉంటే ఆత్మ జ్ఞానము ఎక్కడకు పోయింది? మనము ఇతరులకు ఏమి సేవ చేసినట్లు? ఇతరులకు మన ఆధ్యాత్మిక జీవితమేమి చూపినట్లు? ఏమీ చూపలేదు. అలా ఏడుస్తే మాకు చాలా మోహముంది(అటాచ్‌మెంట్), మేము జ్ఞానులై కూడా అజ్ఞానులమే అనే కదా అందరికీ చూపించాము? చాలా మంది మాతలు, మేము లోపల ఏడ్వము కాని సమాజములోని వారి కొరకు ఏడ్వవలసి వస్తుంది, ఏడ్వకుంటే పతి మరణించినా, కొడుకు మరణించినా, ఈమెకు దుఃఖమే లేదని అంటారు. ఈమె బ్రహ్మకుమారిగా తయారై ఏమి నేర్చుకున్నట్లు? ఈమెకు వారి పై ప్రేమే లేదు అని కూడా అంటారు. ఇలా భావిస్తే ప్రపంచ మతమును అనుసరించినట్లే కదా! మీరు దేహధారులను స్మృతి చేస్తూ ఉంటే



మీ మనసు ఎప్పుడూ శక్తిశాలిగా అవ్వలేదు, ఎందుకంటే దేహ సంబంధాలు, దేహము పై ప్రేమ బలహీనపరుస్తాయి. ఈ ప్రపంచమే దేహాభిమానులది. ప్రపంచము నన్ను "పిచ్చిదానివి"(పాగల్) అని అంటుంది. నేను ప్రపంచాన్ని " పిచ్చిది(పాగల్) " అని అంటాను. వారి మాటలు మీరెందుకు వింటారు? మీరు శక్తులై చూపించండి. వారికి అర్థము చేయించండి, నేర్పించండి. ఎవరైనా మరణిస్తే ఉపన్యసించేందుకు బ్రహ్మకుమారీలను పిలుస్తారు. మీరు కూడా బ్రహ్మకుమారీలే కదా. మీరు ఇంట్లో కూర్చొని ఏడుస్తూ ఉంటే మిమ్ములను ఎవరు పిలుస్తారు? మీరు శక్తి స్వరూపులై జ్ఞానము వినిపిస్తే వారు ప్రభావితులవుతారు. మొదట ఏమేమో మాట్లాడ్తారు. కాని మీ ధారణ, మీ ఆత్మీయత, మీ యోగి జీవితాలను చూచి చివరికి జీవితమంటే వీరిదే అని భావిస్తారు.

అమృతసర్‌లో ఒక మాత ఉండేది. ఆమెకు ఒకే ఒక కొడుకు. ఆమె పతికి సాధు-సత్పురుషులు, మహాత్మల పై చాలా నమ్మకము. ఆ మాత జ్ఞానములోకి వచ్చేసింది, కుమారుడు శరీరాన్ని వదిలేశాడు. ఆ మాత కంటి నుండి ఒక కన్నీటి చుక్క కూడా రాలేదు. కుమారుని మరణానికి తండ్రికి ఏడ్పు వచ్చింది. అతడు చాలా గురువుల వద్దకు వెళ్ళేవాడు, ప్రవచనాలు వినేవాడు, వారికి సేవ చేసేవాడు కాని ఈశ్వరీయ జ్ఞానము లేనందున కుమారుని మరణము వలన దుఃఖమును అనుభవిస్తూ ఉండినాడు. కాని అతని పత్ని వచ్చిన వారందరికి ఆత్మ జ్ఞానాన్ని వినిపించింది. ఆత్మకు మరణము లేదని, అది అమరమని, తమ కుమారుని ఆత్మ లెక్కాచారమెక్కడుంటుందో అక్కడ మరో జన్మ తీసుకుంటుందని అందరికీ ఈశ్వరీయ జ్ఞానము వినిపించింది. పతి మనస్సు గురువుల పై, పత్ని మనస్సు శివబాబా పై ఉండినది. భక్తికి, జ్ఞానానికి ఎంత వ్యత్యాసముందో గమనించండి. బాబా పిల్లలైన మనకు దుఃఖము కలగదు ఎందుకంటే ఆత్మ ఒక శరీరాన్ని వదలి మరొక శరీరాన్ని తీసుకుంటుందని మనకు తెలుసు. ఏ సమయములో ఏ ఆత్మలు ఎక్కడకు వెళ్లాలో అక్కడకు వెళ్తాయి మరి ఎందుకు ఏడ్వాలి? దుఃఖమెందుకు? బాబా పిల్లలమైన మనము సుఖాన్ని పంచాలి, దుఃఖాన్ని కాదు. ఎవరు ఏడుస్తారో, వారు దుఃఖాన్ని పంచుతారు, పాపము చేసినట్లవుతుంది. ఎవరైతే ఏడ్వకుండా, ఇతరులకు కూడా జ్ఞానము తెలుపుతారో వారు సుఖాన్ని పంచినట్లవుతుంది. సుఖదాత పిల్లలు సుఖాన్ని

పంచుతారా లేక దుఃఖాన్ని పంచుతారా? ఇప్పుడు చెప్పండి - సుఖాన్ని పంచాలా లేక దుఃఖాన్ని పంచాలా? ఆ మాత సంబంధీకులంతా ఈమె నిజంగా మీరాబాయి అని అనేవారు. ఒకే కుమారుడే అయినా ఆమె ఏడ్వలేదు, అంతేకాక మా ఏడ్పును కూడా మాన్పించింది. ఈమె ఎలాంటి తల్లి? ఒకే కొడుకు అయినా ఏడ్వలేదు అని అనరు, ఈమె దేవత అని అంటారు. ఇటువంటి ప్రభావము వస్తుంది. మనము దృఢంగా ఉండాలి. జ్ఞానము, ధారణలలో చలించక, స్థిరంగా ఉండాలి.

మమ్ములను భగవంతుడు చదివిస్తున్నారని చెప్తారు. స్వయం మీరే ఏడుస్తూ ఉంటే భగవంతుడు చదివించినట్లవుతుందా? అలా ఏడుస్తే మీరు భగవంతుని అవమానపరచినట్లు అవుతుంది. భగవంతుడు ఏడ్చేందుకు చదివిస్తారా? బాబా చెప్తారు - భలే ఇంటిలో ఉండండి, ప్రవృత్తిలో పనీ-పాటలన్నీ చేసుకోండి. మీ కర్తవ్యాన్ని నిర్వర్తించండి. కాని మీలోని పాత సంస్కారాలు, స్వభావాల వశము కాకండి. ఇప్పుడిక సమయము లేదు. మీ స్వ ఉన్నతి చేసుకోండి. లోక మర్యాదలు, కుల మర్యాదలు, భక్తురాలైన మీరాబాయి కూడా వదిలేసింది. ఆమె భక్తురాలు, మీరు బాబా పిల్లలు, బ్రాహ్మణ పిల్లలు.

## సదా స్వయాన్ని సేవాధారిగా లేక శివశక్తిగా భావించండి

సంగమ యుగములోని బ్రాహ్మణులు అందరికంటే శ్రేష్ఠమైనవారు. దేవతలు కూడా వారి కంటే తక్కువే. బ్రాహ్మణులే దేవతలుగా అవుతారు. బ్రాహ్మణుల పేరు ఎందుకు ప్రసిద్ధమయ్యింది? ఎందుకంటే బ్రాహ్మణులు సేవాధారులుగా ఉంటారు. మేము తక్కువని, గృహస్థులు ఎప్పుడూ భావించరాదు. మేము సేవాధారులమని, బ్రాహ్మణ కుల భూషణులమని, శివశక్తులమని సదా గుర్తుంచుకోండి. బాబా మమ్ములను సేవాధారులుగా చేసి ప్రవృత్తిలోకి పంపారని దృఢ సంకల్పము చేయండి. మనసా సేవ గాని, వాచా సేవ గాని, కర్మణా సేవ గాని ఏదైనా చేయండి. ఏ సేవ చేసినా నేను బాబా సేవ చేసేందుకు నిమిత్తమై వచ్చానని భావించండి. పుణ్యకర్మ చేసేందుకు ఈ ఇంటికి వచ్చానని, ఎప్పుడూ పాపకర్మలు చేయము అని దృఢ సంకల్పము చేయండి. యజ్ఞములో ఆహుతి వేసేందుకు, ఇతరుల చేత ఆహుతి వేయించేందుకు బ్రాహ్మణులు నిమిత్తముగా ఉంటారు. శివబాబా యజ్ఞాన్ని రచించారు. మనము ఆ యజ్ఞాన్ని సంభాళించు బ్రాహ్మణులము. పాత వస్తువులన్నీ యజ్ఞములో స్వాహా చేయాలి. ఇది అవినాశి



జ్ఞాన యజ్ఞము. శివబాబా రచించిన చాలా గొప్ప యజ్ఞము. ఇందులో మీ పాతదంతా స్వాహా చేయండి. తెలిసిందా? భట్టీ చేసేందుకు వచ్చారు కనుక ఈ మహాయజ్ఞములో స్వాహా చేసి వెళ్ళండి.

మీరు ఎవరు? నిమిత్తముగా ఉన్న సేవాధారులు, ట్రస్టీలు(నిమిత్తులు). సదా స్వయాన్ని సేవాధారులుగా భావించండి, మర్చిపోకండి. మధువనానికి సేవ చేసేందుకు వచ్చినప్పుడు స్వయాన్ని ఏమని భావిస్తారు? సేవాధారులమని భావిస్తారు కదా. సదా స్వయాన్ని నేను బాబా ఇంటికి సేవ చేసేందుకు వచ్చాను అని గుర్తుంటుందా? ఎన్ని రోజులు ఇక్కడ ఉంటారో, అన్నిటినీ మర్చిపోతారు. ఇంటి స్మృతి గాని, ఇంటిలోని పరివారము స్మృతి గాని ఉండదు. బుద్ధిలో కేవలం బాబా సేవ మాత్రమే గుర్తుంటుంది. ఈ విధంగా ఇంటిలో కూడా 'నేను సేవాధారిని ' అనే పక్కా స్మృతి ఉండాలి. బాబా సేవ చేసేందుకు ఇచ్చటికి వచ్చాను అని భావించండి. స్వయాన్ని సేవాధారిగా భావించినప్పుడు మీ జతలో ఉండేవారు, మీ వద్దకు వచ్చేవారు కూడా మిమ్ములను సాధారణ రూపములో చూడరు. మిమ్ములను దేవీలుగా, శక్తులుగా అంగీకరిస్తారు. తెలిసిందా? ఎవరైనా మీ



వద్దకు వస్తే వారికి కొన్ని మంచి మాటలు వినిపించి పంపండి, ఖాళీ చేతులతో పంపకండి. వ్యర్థమైన ప్రాపంచిక విషయాలు, పరదర్శన, పరచింతన మాటలు వినిపించకండి. బాబా ఇచ్చిన జ్ఞానరత్నాలను దానము చేసి పంపండి. మీ జీవితాలను చూసి మీ బంధువులందరూ ఈ జ్ఞానము మీకు ఎక్కడ నుండి లభించింది? మమ్ములను కూడా అక్కడకు తీసుకెళ్లండి అని అడగాలి. శ్రీమతము పై ప్రీతి ఉంటే మధువనము పై, జ్ఞానము పై, యోగము పై ప్రేమ ఉంటే ఈ ప్రేమను మీ బంధువుల పైన కూడా వేయండి, వారిని కూడా ఉద్ధరించండి. వారిని యోగ శిబిరానికి తీసుకు రండి. వారిని కూడా బాబాతో మిలనము చేయించండి. మీ కుటుంబ పరివారములోని వారందరి కళ్యాణాన్ని ఈశ్వరీయ జ్ఞానము ద్వారా చేయాలి. ఇదే మీరు పరివారానికి చేయు సత్యమైన సేవ. ఇదే స్త్రీల సత్యమైన ధర్మము.





## కర్మల గుహ్యగతిని (రహస్యాన్ని) అర్థము చేసుకొని కర్మాతీతులుగా అవ్వండి

తప్పిపోయి లభించిన బాబా పిల్లలు(అపురూపమైన పిల్లలు) నలువైపుల నుండి మధువనానికి వచ్చి బాబాను ఆహ్వానిస్తున్నారు. ఇప్పుడే మనము ఆహ్వాన గీతము విన్నాము. పిల్లలమంతా వేచి ఉన్నాము, త్వరగా వచ్చేయండి బాబా, త్వరగా వచ్చేయండి అనే పాట విన్నాము. ఓ బాబా! మీ పై సమర్పణవుతాను, సమర్పణవుతాను. అహో మా భాగ్యము! పిల్లలమైన మనందరి భాగ్యము ఎంత గొప్పది! ఈ కలయిక మధువనములో మాత్రమే జరుగుతుంది. పిల్లలను ఆహ్వానిస్తున్నారు. భక్తిమార్గములో మొట్టమొదట భక్తులుగా అయ్యి బాబాను ఆహ్వానించాము. ఆ నిరాకారులు, సాకార బ్రహ్మ మాధ్యమం ద్వారా మన వద్దకు వచ్చారు. సాకారంలో వచ్చి కలిశారు. వ్యక్తము నుండి బ్రహ్మాబాబా ఎలా అవ్యక్తమయ్యారో, ఆ కథ మీరు వినవనే విన్నారు. పిల్లల ప్రశ్నలన్నింటికి సమాధానమిచ్చి, సమాధాన పరచేందుకు స్వయం వారే గుల్జార్‌దాది రథములో చిన్న నంది గణములో విచ్చేశారు. గుల్జార్ దాది రథమే చిన్న నందిగణము. ఇప్పుడు శివబాబా నాతో ఉన్నారని, ఇప్పుడు శివబాబా మాట్లాడుతున్నారని, ఇప్పుడు శివబాబా వెళ్లిపోయారని, ఇప్పుడు వచ్చారని బ్రహ్మాబాబాకు తెలిసేది. సమాచారమంతా మాకు వినిపించేవారు. కాని గుల్జార్ బహన్ - నేను వెళ్తాను, కాని బాబా మీతో ఏమి మాట్లాడ్తారో నాకు తెలియనే తెలియదని అంటుంది. ఇదే వ్యత్యాసము. పిల్లలు ఆహ్వానిస్తారు, బాబా వస్తారు. భక్తుల రూపములో " ఓ భగవంతుడా! వచ్చేయండి " అని ఆహ్వానించినప్పుడు తండ్రి, పిల్లల సంబంధము లేదు. భక్తులను తమ పిల్లలుగా చేసుకునేందుకు, భక్తికి ఫలమునిచ్చేందుకు బాబా వచ్చారు, భక్తి ఫలమునిచ్చారు, తమ పిల్లలుగా చేసుకున్నారు. సాధారణ రథములో మన ముందుకు ఎలా వచ్చారో తమ పరిచయమునంతా ఇచ్చారు. సాధారణ రథమైనందున మూఢమతులు తెలుసుకోలేక నిందిస్తూ, తిడ్తూ ఉండినారు. పతితులను పావనంగా చేసేందుకు బాబా వచ్చారు. మనుష్యులు చాలా పతితులైనందున చాలా దు:ఖములో ఉన్నారు. ప్రపంచములో నలువైపులా ఎక్కడ చూచినా దు:ఖమే దు:ఖముంది. అందుకే భక్తులు భగవంతుని పిలిచారు. పిల్లలమైన మనకు పవిత్రతా వారసత్వమునిచ్చారు, జ్ఞాన ఖజానానిచ్చి

సంపన్నము చేశారు.

## కర్మాతీతులుగా అయ్యేందుకు కర్మల రహస్య జ్ఞానము అవసరము

నా పిల్లలు సంపన్నంగా అవ్వాలని బాబా కోరుకుంటున్నారు, కాని పిల్లలు ఇంకా సంపన్నంగా అవ్వలేదు. తండ్రి సమానము సంపూర్ణంగా, సంపన్నంగా ఒక్క బ్రహ్మాబాబా మాత్రమే అయ్యారు. కాని శివబాబా పిల్లలందరినీ కర్మాతీతులుగా తయారుచేసి తమ వెంట తీసుకెళ్లాలి. ఇప్పుడు కర్మల గుహ్యగతి అర్థం చేసుకొని కర్మాతీతులుగా తయారవ్వాలి. అందుకొరకు కర్మల గుహ్య జ్ఞానము కావాలి. ప్రపంచము నలుమూలలా చాలామంది క్రొత్త క్రొత్త పిల్లలున్నారని, వారందరినీ పిలిచి దత్తత తీసుకోవాలని బాబాకు తెలుసు. సర్వుల సహయోగము ద్వారా సుఖమయ ప్రపంచము వచ్చేస్తుంది. బాబా, గుల్జార్ బహన్ రథములో వచ్చి కర్మల నిగూఢ రహస్యాలను తెలిపించారు. మనుష్యులు కర్మల ఫలితాన్ని అనుభవిస్తారు. ఎవరైనా చాలా దు:ఖములో ఉన్నప్పుడు, అయ్యో నా కర్మ!(కర్మ్ కూట్నా) అని అంటారు. ధనవంతులు దివాలా తీస్తారు, వివాహము చేసుకున్న మరుసటి రోజే పతి శరీరాన్ని వదిలేస్తాడు. సుఖంగా ఉండాలని వివాహము చేసుకున్నారు. తల్లి-దండ్రులకున్న ఏకైక పుత్రుడు మరణిస్తే తల్లిదండ్రులకు చాలా దు:ఖము కలుగుతుంది. ఇలా ఇంటింటిలో అనేక ఆపదలు, అభిప్రాయ భేదాలు, వైషమ్యాలు ఎన్ని ఉన్నాయి! అనేక రకాలు ఉన్నాయి. ఒకరిదున్నట్లు ఇంకొకరిది ఉండదు. పిల్లలు తండ్రిని ఎందుకు గుర్తు చేయరు? పవిత్రత కారణంగా ఎంత సహించవలసి వస్తుంది! పిల్లలు అనేక బంధనాలలో బంధింపబడి ఉన్నారు. ఈ కర్మబంధనాల సంకెళ్ల నుండి త్వరగా విడుదలవ్వాలని అందరూ భావిస్తారు.

సత్య-త్రేతా యుగాలలో మనకే బంధనాలూ ఉండవు, సంబంధాలుంటాయి. ద్వాపర-కలియుగాలలో దేహాభిమానము వలన బంధనాలు ఏర్పడ్డాయి. మనమెంత దేహాభిమానులుగా ఉంటామో, అంత బంధనాలు వృద్ధి చెందుతూ పోతాయి. మనమెంత ఆత్మాభిమానులుగా అయ్యి బాబా స్మృతిలో ఉంటామో, అంత బంధనాలు తెగిపోతాయి. పాపమేదో, పుణ్యమేదో బాబా అర్థం చేయించారు. దేహాభిమానము ద్వారా అనగా స్వయాన్ని దేహమని భావించినప్పుడే ఏదైనా పాపం జరుగుతుంది. దేహీ-అభిమానులుగా అవుతే



పాపము సమాప్తమైపోతుంది. మనము స్వయాన్ని శివబాబా సంతానంగా భావించి వారితో పూర్తిగా సంబంధము జోడించినప్పుడే దేహాభిమానము, కర్మ బంధనాలు తెగిపోతాయి. అందుకు బాబా - " పిల్లలూ, నా శరణులోకి రండి " అని చెప్తున్నారు. అనగా మనసు-బుద్ధి ద్వారా నాకు సమర్పణవ్వండి. జన్మ - జన్మాంతరాల నుండి చేసిన మీ పాపాలన్నీ సమాప్తమైపోతాయి. తల పై పాప భారమున్నందున నా పిల్లలైన మీరు చాలా దు:ఖములో ఉన్నారు. భక్తులు ఒకవైపు దాన-పుణ్యాలు చేస్తున్నారు, మరోవైపు పాపాలు చేస్తున్నారు. దాన పుణ్యాల వలన లభించిన అల్పకాల సుఖము కూడా సమాప్తమైపోతుంది. సదా సుఖంగా ఉండాలని పిల్లలు కోరుకుంటారు. సదా ఆత్మలమైన మేము శాంతిగా ఉండాలని కోరుకుంటారు. సదా సత్యముగా ఉండాలని, మంచిగా ఉండాలని కోరుకుంటారు. ఇటువంటి ఆశలు పిల్లలకు చాలా ఉన్నాయి కాని అందుకు ఎలా నడుచుకోవాలో జ్ఞానము కావాలి. నలువైపులా ప్రదక్షిణలు చేసినా సదా దూరంగానే ఉండినారు. తండ్రి మరియు పిల్లల సంబంధములో, ఆత్మ మరియు తండ్రి అయిన పరమాత్మల సంబంధములో దూరమే ఉండేది. భక్తిమార్గములో భావన ఉంది కాని ఖజానాలు ఖాళీగానే ఉండినాయి. నిండలేదు. ఓ పరమాత్మా! దయ చూపమని ఆవేదనతో పిలుస్తారు. శక్తి ఉండదు కనుక అది కావాలి, ఇది కావాలి - కావాలి, కావాలి అను కోరిక ఉంటుంది. ఆత్మలోని సూక్ష్మ ఖజానాలన్నీ ఖాళీగానే ఉండినాయి. లౌకికములో ఏ ఖజానా అయినా లేకుంటే దు:ఖము కలుగుతుంది. ఇటు - అటు అన్ని వైపులా వెతుకుతారు, భ్రమిస్తారు. అలాగే బాబా పిల్లలు ఖాళీ అయిపోయారు. శక్తిశాలి ఆత్మ నిర్బలంగా అయిపోయింది. దేహాభిమానము వలన తండ్రి నుండి సంబంధము తెగిపోయింది. బ్యాటరీలో ఉన్న చార్జి డిస్‌చార్జి అయిపోయింది. అందువలన పిల్లలు బాబాను పిలుస్తారు. శాస్త్రాలలో విష్ణువు అవతరించినట్లు చూపిస్తారు. వాస్తవానికి అది శివుని అవతరణ. శివబాబా బ్రహ్మాబాబా రథములో అవతరిస్తారు. బాబా మనకు విష్ణువును సాక్షాత్కారములో చూపించారు. బ్రహ్మ నుండి శ్రీనారాయణగా అవుతాడు. విష్ణువు అంటే శ్రీలక్ష్మీ-శ్రీనారాయణుల సంయుక్త స్వరూపము. పరమాత్మ అవతరించారు కాని ఏ రథములో వచ్చారో జనులకు తెలియదు. గుప్తముగానే ఉండినారు. తెలుసుకున్నవారు, సంబంధము జోడించినవారు,

జతలో ఉండి తోడు నిభాయించినవారు చాలా కొద్దిమంది మాత్రమే ఉన్నారు. బాబా కూడా పిల్లల జతలో ఉండి, అర్థం చేయించి తర్వాత పిల్లలూ, ఇప్పుడు వెళ్లి సేవ చేయండి అని చెప్పారు.

## శరీరము వినాశి, కనుక శరీరము పై గల ప్రేమ కూడా వినాశి మరియు దుఃఖమునిచ్చేది

గుల్జార్ బహన్ శరీరములో బాప్-దాదా(తండ్రి, అన్న) ఇరువురు కలిసి వస్తారు. దాదా శరీరంలో శివబాబా ఒక్కరే వచ్చారు. కాని గుల్‌జార్ బహన్ రథములో బ్రహ్మబాబా, శివబాబా ఇరువురు కలిసి వచ్చారు. ఒకరినొకరు విడిచి పెట్టరు. ఎందులో విడిపోయారు? శరీరాలైతే నశిస్తాయి. మనుష్యులు దీనినే విడిపోవడం అని భావిస్తారు. ప్రేమించారు కాని విడిపోతారు. ఒకరికొకరు వియోగులైపోతారు. దుఃఖము కలుగుతుంది. ఎందుకంటే శరీరము నశిస్తుంది. శరీరము పై గల ప్రేమ వినాశి, దుఃఖము కలిగించేది. బాబా శరీర ప్రాముఖ్యత నుండి విడిపించారు. దీని వల్లనే పిల్లలు దుఃఖాన్ని అనుభవించారు. ఆత్మ అవినాశి, పరమాత్మ కూడా అవినాశే. వారితో కలుసుకోవాలి. ఒకరితో ఒకరు విడిపోరాదు. తెలిసిందా! శరీర విషయాలలోకి వస్తే దుఃఖపడ్తారు. అందుకే సాకార బాబా కూడా "పిల్లలూ! ఈ బ్రహ్మ కూడా దేహధారే, ఇతడు చంద్రుడు. శివబాబా నన్ను దత్తత చేసుకున్నారు. తండ్రి మరియు తల్లి. నేను కూడా సదా శివబాబానే స్మృతి చేస్తాను, వారి జతలోనే ఉన్నాను. తోడు అనగా శివబాబా సంకల్పాలే బ్రహ్మబాబా సంకల్పాలు. సంకల్పములో గాని, మాటలో గాని, కర్మలో గాని వ్యత్యాసము ఉండరాదు. ఇప్పుడు బాబా అవ్యక్తమయ్యారు. ఇప్పుడు పిల్లలు కూడా తండ్రి సమానంగా అవ్వాలి. సర్వశక్తివంతులైన తండ్రి ఎందుకు వచ్చారు? తమ వలె తయారు చేసేందుకు, తండ్రి సమానంగా చేసేందుకు వచ్చారు. టీచరుకు విద్యార్థులను తన సమానంగా టీచరుగా చేయాలని ఆశ ఉంటుంది. బాగా చదివించి వారిని మంచివారిగా, యోగ్యులుగా చేయాలని ఉంటుంది. పిల్లలను బాగా చదివించాలని, పిల్లలు కూడా బాగా చదివి, వివేకవంతులై ఉన్నత పదవి ప్రాప్తి చేసుకోవాలని కోరుకుంటాడు. తండ్రి కూడా నా పిల్లలు యోగ్యులుగా, సుపుత్రులుగా అవ్వాలని కోరుకుంటాడు. సద్గురువు కూడా నా శిష్యులు



ఆజ్ఞాకారులుగా అవ్వాలని, శ్రీమతమును అనుసరించాలని కోరుకుంటాడు. మన బాబా కూడా ముఖ్యంగా నా పిల్లలు సంపన్నంగా అవ్వాలని, సదా తనకు సమీపంగా ఉండాలని కోరుకుంటారు. మనము సప్త సముద్రాల ఆవల ఉన్నా, ముళ్ల అడవిలో ఉన్నా ఎక్కడున్నా, వజ్రము మట్టిలో ఉన్నా తప్పకుండా ప్రకాశిస్తూనే ఉంటుంది. మీరు నా వజ్రాల పిల్లలని బాబా మనకు స్మృతిని కలిగించారు. వాస్తవానికి నా పిల్లలలో ఏ వికారమూ, ఏ మచ్చా ఉండరాదు. నా పిల్లలు శుభ్రముగా, స్వచ్ఛముగా ఉండాలి. నేను ఎలాగైతే సర్వశక్తివంతుడనో, అలా నా పిల్లలైన మీరు(ఆత్మలు) కూడా మాస్టర్ సర్వ శక్తివంతులు. మనమందరము ఒకే ఇంటిలో ఉండేవారము. తండ్రి, పిల్లలు చాలా సమీపంగా ఉంటారు. లౌకికములో కూడా రాజు-రాకుమారుడు రాయల్‌గా ఉంటారు కదా. రాయల్ కుటుంబీకులు కూడా అలాగే రాయల్‌గా ఉంటారు. వారిని చూస్తూనే వీరు రాయల్ కుటుంబీకులు అని తెలిసిపోతుంది. వారి మాటలో-నడవడికలో, లేవడంలో-కూర్చోవడంలో రాజ ఠీవి కనిపిస్తుంది. గుణాలలో, వ్యవహారంలో కూడా అలాగే కనిపిస్తుంది.

## అందరు ప్రజాపిత బ్రహ్మ పిల్లలే కనుక అందరూ తమ తండ్రి ఇంటికి తప్పక వచ్చే తీరాలి

నేను మిమ్ములను స్వర్గములోకి పంపాను. మీరు రాజ కుటుంబీకులు, ఆది సనాతన దేవీ దేవతా ధర్మానికి చెందినవారు, సర్వ దైవీ గుణాలతో సంపన్నంగా ఉండేవారని, ఇప్పుడు పిల్లలైన మీలో ఆసురీ గుణాలు వచ్చాయని బాబా మనకు స్మృతినిప్పించారు. మదిర-మాంసాలు సేవించుట, వికారాల సాంగత్యము, వికారీ వ్యవహారాలలో మునిగి ఉన్నారు. విషయ వికారాలలో మునిగి ఓ ప్రభూ! నా విషయ వికారాలను నిర్మూలించండి అని అరుస్తూ, పిలుస్తూ ఉన్నారు. నేను విషయ వికారాలను నిర్మూలించేందుకు వచ్చాను, ఆ ఊబి నుండి మిమ్ములను వెలికి తీసేందుకు వచ్చాను కాని ఇప్పుడు మీరు ఈ సృష్టి ఇలాగే తయారయ్యింది, ఇలాగే కొనసాగుతూ వస్తోందని అంటున్నారు. వికారాలను వదిలిపెట్టరు. కొంతమంది మాత్రము వదిలేశారు. తండ్రి అయితే ప్రజాపిత బ్రహ్మ. బ్రహ్మ అనగా ప్రజలకు తండ్రి. అందరూ వారి పిల్లలే. వారు అందరినీ పిలుస్తారు. పిల్లలు తండ్రి

ఇంటికి రాకుంటే వారు పిల్లలెలా అవుతారు? అందువలన బాబా " పిల్లలూ, మీరు నన్ను జన్మ-జన్మాంతరాలుగా పిలుస్తూ వచ్చారు, ఇప్పుడు నేను వచ్చాను, నన్ను తెలుసుకోండి, గుర్తించండి" అని సందేశమిస్తున్నారు. బాబా పిల్లలైన మనందరినీ ఇంటింటికి వెళ్లి తండ్రి వచ్చారనే సందేశమివ్వండి అని చెప్తున్నారు. పతితపావనులైన తండ్రి, తన పిల్లలను పావనంగా చేసేందుకు కర్మాతీతులుగా చేసి వెంట తీసుకెళ్లేందుకు, బంధనముక్తులుగా చేసి వెంట తీసుకెళ్లేందుకు వచ్చారు. అందరికీ సందేశమిచ్చే ఈ సేవ మిగిలిపోయింది. మనము ఎన్ని మేళాలు చేసినా, వార్తాపత్రికలలో ప్రచురించినా అన్నిచోట్ల అన్ని ప్రకారాలైన సేవలు చేసినా, చిన్న చిన్న గ్రామాలు ఇంకా మిగిలి పోయాయి. ఎవ్వరికీ తెలియని చోట సందేశమివ్వాల్సి వస్తుంది. అందుకే బాబా - పిల్లలూ, మీరు ఇంటింటికి సందేశమునివ్వాలి అని మనకు చెప్తారు. మా బాబా వచ్చారు కాని బాబా పిల్లలు మాకు తెలుపలేదనే ఫిర్యాదు చేయరాదు. వారు అందరికీ తండ్రియే. తమ సోదరీ-సోదరుల పై దయ చూపి వారికి తెలిపించడం పిల్లల కర్తవ్యము. తెలుసుకోవలసిన సమయము వచ్చినప్పుడు వారు తప్పకుండా వస్తారు. అయితే మనము మన కర్తవ్యాన్ని తప్పకుండా నిర్వర్తించాలి. అందుకే నలువైపులా సేవ పాత్ర చాలా జరుగుతూ ఉంది, వృద్ధి కూడా అవుతూ ఉందని మీరు చూస్తున్నారు. బాప్‌దాదాను కలుసుకునేందుకు కొత్త కొత్త పిల్లలు కూడా చాలామంది వస్తున్నారు. ఆత్మ-పరమాత్మలు చాలా కాలము వేరుగా ఉండినారు, స్వయం సద్గురువు దళారిగా లభించినప్పుడు సుందరమైన కలయిక జరిగిందని గాయనముంది. 5000 సంవత్సరాల క్రితము విడిపోయిన పిల్లలు తండ్రితో కలిసినప్పుడు, తండ్రి దృష్టి వారి పై పడినప్పుడు వారి హృదయాలలో ఎటువంటి అలలు ఉత్పన్నమవుతాయి! ఆనంద బాష్పాలు ప్రవహిస్తాయి, ప్రేమ ముత్యాలు రాలుతాయి. మొదటిసారి నేను సాకార బాబాను కలిసినప్పుడు నా కనుల నుండి కన్నీరు ఆగకుండా ప్రవహిస్తూ ఉండినది. దూర-దూరము నుండి పరుగెత్తుకొని వచ్చిన కొత్త కొత్త పిల్లలు ఒక ఘడియ, అర్ధ ఘడియ, అర్ధములో అర్ధ ఘడియ బాబా నుండి దృష్టి తీసుకుంటామని అంటారు. బాబా మమ్ములను ఇంటికి పిలిచారు కదా! దీనికే పిల్లలు సంతోషించి, ప్రేమ ఎగిసి పడ్తూ ఉండగా, బాబా చెప్పినట్లు చేసేందుకు సిద్ధమని అంటారు. తండ్రి వచ్చి సద్గురువు రూపములో



ఆజ్ఞాపిస్తే మనము ఆ ఆజ్ఞను పాటించమా! గురువాజ్ఞ శిరోధార్యము! రాత్రింబవళ్లు వారి పై మనకు ప్రీతి ఉంది. ఎందుకంటే మనము తండ్రిని గుర్తించాము, తండ్రి మనలను గుర్తించారు.

ఏ పిల్లలైతే తండ్రిని గుర్తించారో, వారి గుర్తు ఏమి? వారు తండ్రి ఆజ్ఞను పాటిస్తారు, శ్రీమతమును అనుసరిస్తారు. తండ్రి మనకు కర్మల గుహ్యా గతిని తెలుపుతారు. దానిని అర్ధము చేసుకొని మన పాపాలను సమాప్తము చేసుకోవాలి. అందుకే బాబా " ఒక్క రోజు కూడా మురళి మిస్ చేయరాదని చెప్తారు." ఒక్క శ్రీమతమును కూడా మిస్ చేయరాదని బాబా తన పిల్లలను కోరుతారు. ప్రతి శ్రీమతానికి మహత్యముంది. శ్రీమతము ద్వారానే జీవితము స్వచ్ఛంగా తయారవుతుంది. శ్రీమతాన్ని బాగా పాటించి జ్ఞాన మనన-చింతన చేస్తే నా వలె, నా సమానంగా తయారవుతారని బాబా అంటారు. శ్రీమతము మురళీల ద్వారానే లభిస్తుంది.

## జ్ఞానములో కూడా సూక్ష్మ జ్ఞానాన్ని తెలుసుకోండి

మురళీలలో బాబా చాలా రహస్యాలను వినిపిస్తారు. సుఖంగా జీవితాన్ని గడిపేందుకు పనికి వచ్చే విషయాలను వినిపిస్తారు. "అందరికీ స్థూలమైన జ్ఞాన విషయాలైతే అర్ధమయ్యాయి. కాని జ్ఞానములో కూడా సూక్ష్మ జ్ఞానాన్ని తెలుసుకోండి" అని బాబా అంటారు. దేహాభిమానముతో చేయు కర్మలు వికర్మలుగా అవుతాయి. సత్య-త్రేతా యుగాలలో మన కర్మలు వికర్మలుగా అవ్వవు, అకర్మలుగా అవుతాయి. సంగమ యుగములో మనము సేవ చేస్తాము. కనుక మన కర్మలు సుకర్మలుగా అవుతాయి. ఈ విషయాల పై అందరికీ ధ్యాస ఉంది. కాని కర్మల రహస్య విధి పై అందరూ గమనమివ్వాలి. ఆత్మకు గల సూక్ష్మశక్తులు సంకల్పము, స్మృతుల పై కూడా చాలా గమనమివ్వాలి. ఈ శరీరాన్ని బాగు చేసేందుకు సర్జన్ ఉన్నట్లు మనసు, బుద్ధిని సరి చేసేందుకు సర్జన్ అయిన శివబాబా ఉన్నారు. వారు మనందరికి పెద్ద ఆపరేషన్ చేసేందుకు వచ్చారు. మేమంతా ఆపరేషన్ చేసుకున్నాము. బాబా పిల్లలైన మనందరికి పాపమేమిటో, పుణ్యమేమిటో తెలుపుతూ ఎంత ఖజానా ఇస్తున్నారంటే, నింపుతున్నారంటే వాటితో మనము కూడా జ్ఞాన సంపనులుగా అయిపోయాము. ఆ ఖజానాలను మీరు ఇతరులకు ఇస్తున్నారు. బాబా అవినాశి జ్ఞానదాత, దివ్యచక్షు విధాత. బాబా జ్ఞాన

ఖజానాను అందరికీ ఇస్తారు, ఎవ్వరి నుండి తీసుకోరు. దివ్యచక్షువు అనగా దివ్య బుద్ధినిచ్చేవారు. టీచరు విద్యార్థులకు సదా బుద్ధిని, వివేకమును ఇస్తారు. తమ పిల్లలు సంపన్నంగా అవ్వాలని బాబా వద్ద గల ఆస్తిని అనగా జ్ఞానము, ప్రేమ, ఆనందమును అందరికీ ఇస్తారు. మన బాబా దాత మరియు విధాత అయ్యారు. పిల్లలైన మనము కూడా వారి వలె దాతలుగా, విధాతలుగా అవ్వాలని బాబా కోరుకుంటారు. బాబా ద్వారా లభించిన జ్ఞాన రత్నాలను ఇతరులకు ఇస్తూ ఉన్నప్పుడే మనము దాతలుగా అవుతాము. మనము ఎవరిని కలిసినా, వారికి వాచా ద్వారా, సంకల్పాల ద్వారా ఇస్తూనే ఉంటాము. సేవ చేసి కర్మల ద్వారా కూడా ఇస్తాము. మనసా-వాచా-కర్మణా మూడింటి ద్వారా ఎవరు సేవ చేస్తారో, వారినే దాతలని అంటాము. ఈ మూడింటి ద్వారా ఇతరులకు మనమెంత సేవ చేస్తామో, అంత మన ద్వారా సుకర్మలు జరుగుతాయి.

## ఇందులో మీ నంబరు ఏది?

బాబా చెప్తున్నారు - పిలలు భండారాన్ని నింపుకుంటున్నారు. కాని ఇచ్చేందులో కొంతమంది పిసినార్లుగా ఉన్నారు. లౌకికములో కూడా చాలా మంది ధనవంతులుగా ఉంటారు. కాని ధన సంపదలను బీరువాల నుండి బయటకు తీసి దానము చేయరు. తమ కొరకు, తమ పిల్లల పోషణ కొరకు మాత్రమే ఖర్చు చేస్తారు. వారిని దాతలని, దానులని అంటారా? తమ స్వంతానికి సంపాదించుకునే వారిని, తమ కోసమే జీవించేవారిని దాతలని, దానులని అనరు. కొంతమంది దాన-పుణ్యాలు చాలా చేస్తారు. కాని స్వయం చాలా సాధారణంగా ఉంటారు. స్వయం కొరకు చాలా తక్కువగా ఖర్చు చేస్తారు. తమ పరివారము కొరకు తక్కువగా, ఈశ్వరార్థము ఎక్కువగా దాన-పుణ్య కర్మలు చేస్తూ ఉంటారు. అటువంటి వారికి అల్పకాలానికైనా చాలా ఫలితము లభిస్తుంది. వారు దాతలుగా ప్రసిద్ధి చెందుతారు. మూడు ప్రకారాల జనులు ఉంటారు. ఒకరేమో దానులు. మేమెంత సంపాదించాము, ఎంత దానము చేశామని లెక్క చూసుకుంటారు. దానమిచ్చేందుకు తమ వద్ద నిల్వ ఉంచుకుంటారు. రెండవ రకమువారు సంపాదించుకుంటారు, తినేస్తారు. వస్తుంది, పోతుంది. వారికి జల్సాగా ఖర్చు చేసే సంస్కారముంటుంది. అరే భవిష్యత్తు ఎవరు చూశారు! ఈ రోజు వచ్చింది, ఈ రోజే తినేసి మజా చేయండి, ఇప్పుడు సుఖంగా



గడిపేస్తామని అంటారు. ఇటువంటివారు దాన ధర్మాల కొరకు తమ ధనాన్ని కేటాయించరు. మూడవ రకము వారు - అప్పుచేసి అయినా ఖర్చు చేస్తారు (అప్పు చేసి పప్పు కూడు తినేవారు). అలా ఇక్కడ కూడా బాబా పిల్లలు 3 రకాలుగా ఉన్నారు. బుద్ధి బాబా జతలో ఉంటుంది, వారితో సంబంధాన్ని జోడిస్తారు, గుణాలను, శక్తులను నిల్వ ఉంచుకుంటారు. బాబా చెప్తారు - ఎవరైతే నాతో బుద్ధి యోగాన్ని జోడిస్తారో వారికి నా గుణాలు, శక్తులు లభిస్తాయి. వారు ఇవ్వడమే కాక నిల్వ కూడా ఉంచుకుంటారు. వారి బ్యాటరి చార్జ్ అవుతూ ఉంటుంది. వారు ఖజానాలతో నిండుగా ఉంటారు. రెండవ రకము వారు - వస్తారు, పోతారు. ఇక్కడకు వచ్చి వింటారు. అక్కడకు వెళ్లి ఇతరులకు వినిపిస్తారు, అంతే సమాప్తము చేస్తారు. నిల్వ ఉంచుకోరు. వాణి ద్వారా శక్తిని సమాప్తము చేస్తారు. ఆంతరికములో యోగ శక్తి ఆత్మిక శక్తి అనగా సంకల్ప శక్తిని స్థిరంగా ఉంచుకోరు. మీకు ఈ శక్తి చివర్లో ఉపయోగపడుతుందని బాబా చెప్తారు. వాచా సేవ సమాప్తమైపోతుంది. కాని నిల్వ ఉంచుకున్న శక్తుల ఖజానాల ద్వారా సేవ జరుగుతుంది. చివర్లో వచ్చే ఆత్మలు ప్రజలుగా అవుతారు. వారసులుగా అవ్వలేరు. ఎందుకంటే పురుషార్థము చేసేందుకు వారికి చాలినంత సమయముండదు కదా! అవి అంతిమ ఘడియలుగా ఉంటాయి. ఆ ఆత్మలు మనకు గల శక్తులతో నిల్చోగలరు. అందుకొరకు మన వద్ద ఇప్పటి నుండే గుణాలు, శక్తుల ఖజానాలు నిల్వ(స్టాక్) ఉండాలి. మీ వద్ద నిల్వ లేకుంటే మీరూ నిర్బలురుగానే ఉంటారు, వారు కూడా నిర్బలురుగానే అవుతారు. చివర్లో సమస్యలు కూడా చాలా వస్తాయి. అన్ని రకాల సమస్యలు వస్తాయి. అందుకే బాబా చెప్తారు - " పిల్లలూ, నిల్వ ఉంచుకోండి. చివర్లో మీ వద్దకు చాలామంది నిర్బల ఆత్మలు వస్తారు. వారు స్వ శక్తితో జ్ఞానము కూడా అర్థము చేసుకోలేరు. మీ శక్తిశాలి దృష్టితో, మీ శక్తితో వారు దృఢంగా నిలబడ్తారు".

బాబా చెప్తారు - ఎవరైతే ప్రతి రోజు బాబా వద్దకు వస్తారో వారికి ఖజానాలు లభిస్తాయి. వారు రోజు రోజుకు సంపన్నమవుతూ పోతారు. చాలా కాలము నుండి వచ్చేవారి భాగ్యాన్ని భాగ్యవిధాత అయిన తండ్రి తయారు చేస్తున్నారు. మా వద్ద చాలా ఉంది అని నిర్లక్ష్యము చేయరాదు. కొంతమంది విద్యార్థుల బుద్ధి చాలా తీక్షణంగా(చురుకుగా) ఉంటుంది. చదువంతా పూర్తిగా

గుర్తుంటుంది. కొంతమంది విద్యార్థులు సమయమంతా ఆటపాటలలోనే గడిపేసి పోగొట్టుకుంటారు. అటువంటి వారు పరీక్షలలో ఫెయిలైపోతారు. అలాగే ఇక్కడ కూడా కొంతమంది పిల్లలు చదువు పై పూర్తి గమనముంచుతారు, ఒక్క తండ్రి పైననే చాలా ప్రీతిని ఉంచుతారు. తండ్రి, టీచరు, సద్గురువు పై సర్వస్వము సమర్పణ చేస్తారు. వారికి తమదైన మనసు గాని, బుద్ధి గాని, శరీరము గాని ఉండదు. బాబా వారిదంతా బదిలీ చేసి తమదిగా చేసుకొని ఇస్తారు. ఇప్పుడు మన వద్ద ఉండేదంతా బాబాది, వారి ప్రసాదము, వారు ఇచ్చిందే.

## ఇంటిలో బాబా గదిని తప్పక ఏర్పాటు చేసుకోండి

ప్రతి ఒక్కరు తమ-తమ గృహాలలో బాబా గదిని తప్పకుండా తయారు చేసుకోండి. ఇల్లు చిన్నదిగా ఉంటే, ప్రత్యేకమైనది లేకుంటే మీ భండారము (వంటగది)లో బాబా చిత్రాన్ని తప్పకుండా ఉంచుకోండి. భోజనము తయారు చేయు సమయంలో బాబా స్మృతి ఉంటుంది. బాబాను చూస్తూ-చూస్తూ భోజనము తయారు చేస్తే ఆ భోజనము తినేవారికి కూడా శక్తి లభిస్తుంది. భోజనము తయారు చేయునప్పుడు, భోజనము వడ్డించునప్పుడు పూర్తి మౌనముగా ఉండండి. బాప్-దాదా ఇరువురు ఇక్కడే ఉన్నారనే అనుభవమవ్వాలి. ఆ భోజనములోకి శాంతి శక్తి వెళ్లాలి. మీరు వాచా ద్వారా ఇవ్వలేకుంటే ఇటువంటి సేవ చేయండి. చాలా ప్రీతితో నిండిన సంకల్పాల ద్వారా ఇవ్వండి. ఇచ్చేందుకు బాబా చాలా యుక్తులు మురళీల ద్వారా తెలుపుతారు.

పవిత్రమైన భోజనాన్ని తయారు చేసి ఇంటిలోని వారికి తినిపించడం కూడా చాలా గొప్ప సేవ. ఈనాటి దు:ఖపూరిత సృష్టిలో అందరికి ప్రేమ కావాలి. మీరు ప్రీతిగా భోజనము తయారు చేసి ప్రేమతో వారికి తినిపిస్తే వారు చాలా సంతోషిస్తారు. ఎవరైనా శరీరాన్ని ప్రేమించినారంటే దు:ఖముతో మరణిస్తారు. కొంతమంది విషము తాగి మరణిస్తారు, కొంతమంది ఆత్మహత్య చేసుకొని మరణిస్తారు, మిగిలిన వారంతా విషయ వికారాలలో మునకలు వేస్తూ-వేస్తూ మరణిస్తారు. కాని మీది ఈశ్వరీయ ప్రేమ అని, మీ ప్రేమ శారీరిక ప్రేమ కాదని బాబా చెప్పారు. మీది ఆత్మిక ప్రేమ. ఈ ప్రేమ ద్వారా ఆత్మలైన మీరు పరమాత్మతో మిలనము చేయిస్తారు. నేను ఆత్మను, బాబా వాడిని, నాదంటూ ఏమీ లేదు. ఇతర ఆత్మలను కూడా పరివారమని భావించి ఈ ఆత్మ కూడా మా వలె సుఖము



తీసుకోవాలి అని అనుకుంటారు. మీరు వారికి మనసు ద్వారా సేవ చేస్తారు.

## ఎప్పుడూ వ్యాకుల(దు:ఖ)పడరాదు

నేను ఇంత సేవ చేసినా నాకే ఫలితమూ లభించలేదు, ఇంకా నాకు తిట్లే లభిస్తున్నాయని కొంతమంది అనుకుంటారు. నా పతి నన్ను అర్థము చేసుకోడు, నా పత్ని నన్ను అర్థము చేసుకోదు, ఎంత శ్రమ చేసినా, వారు నన్ను తప్పులు పట్టడం మానడం లేదు కనుక వారికెందుకు చెప్పాలి అని వ్యాకులపడ్తారు. " పిల్లలూ, అటువంటి సంకల్పాలు ఎప్పుడూ చేయకండి. ఎప్పుడూ వ్యాకులపడరాదు. ఏదైనా విత్తనము నాటితే అది ఏదో ఒక రోజు తప్పకుండా ఫలిస్తుంది. బీజానికి ఫలము లభించక పోవడమనేది జరగని విషయము. కొన్ని విత్తనాలు త్వరగా ఫలిస్తాయి, కొన్ని విత్తనాలు కొన్ని సంవత్సరముల తర్వాత ఫలమునిస్తాయి. ఆలస్యంగా ఫలాలు లభించేందుకు చాలా కారణాలున్నాయి. బాబా అవినాశి, జ్ఞానము అవినాశి, స్మృతి కూడా అవినాశే. ఆత్మలమైన మనకు అవినాశి శుభ భావనలు, అవినాశి శుభ కామనలు ఉన్నాయి. ఆ బీజము వ్యర్థము కాదు, ఏదో ఒక రోజు తప్పకుండా మొలకెత్తుతుంది. అందుకే బాబా పిల్లలందరు ఒక రోజు తప్పకుండా నా ఇంటికి వస్తారని బాబా అంటారు. చివర్లో వచ్చేవారు పాపం ఏం పురుషార్థము చేస్తారు? దర్శించుకోవాలనే దప్పిక ఉంటుంది. నిర్బలురుగా ఉంటారు. అటువంటి వారికి శక్తినివ్వాలి. అందుకొరకు బాబా పిల్లలమైన మనమే భ్రమరము వలె భూ-భూ చేస్తూ ఉండాలి. అవినాశి జ్ఞానదాత, దివ్య చక్షు విధాత అయిన తండ్రి పిల్లలైన మనలను తమ సమానము అవినాశి జ్ఞాన దాతలుగా దివ్యచక్షు విధాతలుగా చేస్తున్నారు. తండ్రి తమ సమానంగా చేయాలని, తమ వారసులుగా చేయాలని కోరుకుంటారు. అందుకే తండ్రి ఎలా ఉంటారో, పిల్లలు కూడా అలా ఉంటారనే సామెత ఉంది. బాబా మనలను సుపుత్రులుగా చేయాలని ఆశిస్తున్నారు.

## ఎప్పుడూ ఎవ్వరి పైనా దయ చూపాలనే భ్రమలో పడి చిక్కుకోకండి

కొంతమంది బాబా పిల్లలు సేవ చేస్తూ చేస్తూ చాలా దయా గుణములోకి వచ్చేస్తారు. దయ చూపుతూ చూపుతూ జిజ్ఞాసువుల సంకల్పాలలో కలిసి పోతారు. కొంతమంది సంకల్పాలు నీచముగా కూడా ఉంటాయి. ఎవరైనా ఒక బాలిక నేనేం చేయమంటారు, జ్ఞానములో నడిచేందుకు నాకు అనుమతి

లభించడం లేదు అని అంటుంది. అలా అన్నప్పుడు ఎవరైనా ఒక యువకుడు అలాగైతే నన్ను వివాహము చేసుకో, ఇరువురము పవిత్రంగా ఉండి జ్ఞానములో నడుస్తామని అంటాడు. ఎప్పుడూ ఇలా చేయకండి, ఇటువంటి చిక్కులలో చిక్కుకోకండి. ఇరువురు బాబా పిల్లలే. బాబా పుత్రిక మరియు బాబా పుత్రునికి ఎప్పుడూ వివాహము జరగదు. వారు సోదరి-సోదరులు. లౌకికములో కూడా ఎవరైనా సోదరిని వివాహము చేసుకుంటారా? బాబా సొత్తును నీ దానిగా చేసుకోవడం ఏ విధంగా చూచినా అది మోసమే అవుతుంది. కర్మల లెక్కాచారాన్ని చుక్త చేసుకునేందుకు బాబా వద్దకు వచ్చారు. చాలా దయ చూపుట వలన లోలోపలే ఈ వికర్మను తయారు చేసుకుంటారు. మేము వికర్మలు చేస్తున్నామని వారికి తెలియనే తెలియదు. ఇటువంటి దయ చూపరాదు. స్వమానములో ఉండి దయ చూపండి. బాప్‌దాదాతో కలిసి, బాప్‌దాదా జతలో ఉంటూ ఎవరి పైన అయినా దయ చూపండి. ఎలాగైతే బాప్‌దాదా ఎవరికైనా దయతో శిక్షణనిస్తారో, అలా మీరు కూడా వారు బాబావారిగా అవ్వాలని దయ చూపండి. అంతేగాని నా వారిగా అవ్వాలని కాదు. వీరి లెక్కాచారము నేను చుక్త చేస్తానని అనుకోకండి. ఏ దేహధారి కూడా మన లెక్కాచారాన్ని చుక్త చేయలేరు. దేహధారులతో లెక్కాచారము తయారవుతుంది. మనుష్యాత్మలందరి లెక్కాచారాలు చుక్త చేయించేవారు, చేసేవారు ఒక్క బాబా మాత్రమే. దేహధారులతో చుక్త అవుతే ఇంత మంది ధర్మ స్థాపకులు(ధర్మపితలు) వచ్చారు కదా. వారి ద్వారా ఇప్పటికే ఈ ప్రపంచము స్వర్గముగా తయారై ఉండాలి. అందరూ పాపాల నుండి ముక్తమై ముక్తి-జీవన్ముక్తులకు పోయి ఉండాలి. పై నుండి వచ్చిన ధర్మస్థాపకులు, పవిత్ర ఆత్మలైన వారు కూడా విశ్వాన్ని పూర్తిగా పరివర్తన చేయలేక పోయారు. విశ్వకళ్యాణకారులు, విశ్వపరివర్తకులు ఒక్క తండ్రి మాత్రమే. కనుక వారిని పతిత పావనులని అంటారు. సంకల్పాలు, మాటలు, కర్మలను పవిత్రంగా చేసేది వారొక్కరే. అంతేకాదు పంచ తత్వాలను కూడా పవిత్రంగా చేస్తారు. మొత్తం సృష్టినంతటినీ పరివర్తన చేస్తారు. అందువలన బాబా చెప్తున్నారు - అర్థము కాకుంటే బాబాను అడగండి, బాబా ద్వారా నిమిత్తమైన సోదరీ-సోదరుల ద్వారా శ్రీమతాన్ని తీసుకోండి. ఎవరి పైన అయినా దయ చూపే భ్రమలో చిక్కుకోకండి.



మన్మతమును అనుసరిస్తే అనేక వికర్మలు చేసేస్తారు. దీని వలన కొంతమంది బాబా పిల్లలు శిక్షలను అనుభవిస్తారు. బాబా జతలో ధర్మరాజు కూడా ఉన్నారు కదా. అలా దయ చూపి చిక్కుకున్నందున వారి బుద్ధి బంద్ అయిపోతుంది. కనుక బాబాతో బుద్ధియోగము జోడింపబడదు. బుద్ధియోగము జోడింపనందున బాబా నుండి ఆత్మకు బలము లభించదు. అందువలన ఆ వ్యక్తి వెతుకుతూ, తిరుగుతూ ఉంటాడు.

## ప్రతి రోజు బాబా ముందు మీ లెక్కాచారముంచి శ్రీమతమును అనుసరిస్తూ వెళ్లండి

జ్ఞానములోకి వచ్చిన తర్వాత ఎలాంటి ఎలాంటి తప్పులు చేస్తూ ఉంటారో అలాంటి అలాంటి శిక్షలు అనుభవిస్తూ ఉంటారు. శరీరానికి కూడా ఎన్ని రకాల శిక్షలున్నాయి! అయ్యో-అయ్యో అని జనులు ఎంత విలపిస్తున్నారో ఆసుపత్రికి వెళ్లి చూడండి. బిగ్గరగా అరుస్తూ ఏడుస్తూ ఉంటారు! ఎన్ని రకాల వ్యాధుల పాలవుతున్నారో చూడండి. ఏ మానవుడూ కర్మభోగము నుండి, కర్మల లెక్కాచారము నుండి విడిపించలేడు. భర్త కూడా విడిపించలేడు, పుత్రుడు కూడా విడిపించలేడు. ఏ బంధువులూ దు:ఖము నుండి విడిపించలేరు. మీ దు:ఖము చూసి బంధువులకు దయ కలుగుతుంది. అయితే ఏమి చేయగలరు? ఎవరి కర్మ భోగము వారే అనుభవించాల్సి వస్తుంది. బాబా మనకు కర్మల రహస్యము తెలుపుతూ ఇది అంతిమ సమయమని చెప్తున్నారు. శివబాబా సుప్రీం, సదా పవిత్రులు, ముక్తి-జీవన్ముక్తిదాత, గతి-సద్గతిదాత కూడా వారే. ఈ కర్మ బంధన లెక్కాచారాలను వారే చుక్త చేయిస్తారు. కనుక మీరు మీ మన్మతమును మిక్స్ చేయకండి. ప్రతి కర్మ శ్రీమతమును అనుసరించే చేయండి. ఏ బిడ్డ కూడా ఈ విషయము నాకు తెలియదే అని అనకుండా శివబాబా అన్ని విషయాలు అర్థం చేయిస్తున్నారు. బాబా అన్నిటి గురించి తెలిపి, లెక్కాచారాలను చుక్తా చేసుకునేందుకు యుక్తులు కూడా తెలుపుతున్నారు. ఏ విషయాన్నీ వదలక అన్నిటి గురించి తెలిపించారు. అయితే వాటిని అమలుపరచేందుకు పిల్లలకు శక్తి తక్కువగా ఉంది. కనుక శక్తి నింపుకోవాలి. మనన-చింతన చేయండి, అంతర్ముఖత అను ప్రయోగశాలలో కూర్చోండి. ఉదయము నుండి నేనొక చిన్న

బాలుడను, బాబా ముందు కూర్చొని ఉన్నాను అని భావించండి. ఎలా తండ్రి - బిడ్డల, పత్ని - పతుల, స్నేహితుల సంభాషణ జరుగుతుందో, అలా శరీరము నుండి వేరై బాబాతో ఆత్మిక సంభాషణ చేయండి. ఇది మనకు బాబాతో గల పవిత్రమైన ప్రీతి. ఆత్మలైన మీరు ఆ పరమాత్మతో మధురాతి మధురముగా, మంచి మంచిగా ఆత్మిక వార్తాలాపన చేయండి. కర్మక్షేత్రములోకి వచ్చినప్పుడు సుకర్మలు, మంచి కర్మలు చేయండి. ఉదయము నుండి రాత్రి వరకు లెక్కాచారము వ్రాయండి. బాలకులై మాలికుల ముందు లెక్కాచారమంతా చూపండి. కాని పిల్లలు నిర్లక్ష్యముతో, సోమరులై అలా చేయరు. లెక్కాచారముంచినందున మీ కర్మల పై మీకు గమనముంటుంది. రాత్రి నిదురించునప్పుడు, పగలంతా ఏమి చేశారో, ఏమి జరిగిందో బాబాకు వినిపించండి. అలాగని నిన్న చేసిన తప్పు ఈ రోజు కూడా చేయమని కాదు. అలా చేయకండి అని బాబా చెప్తున్నారు. శివబాబా చెప్తున్నారు - ఈ రోజు చేసిన తప్పు రేపు చేయరాదు. దాని లెక్కాచారము ఈ రోజే సమాప్తము చేసుకోండి. భవిష్యత్తులో ఆ తప్పు మళ్లీ ఎప్పుడూ జరగరాదు. బాబా జ్ఞాన సంబంధమైన విషయాలు చాలా వినిపించారు. వాటి మనన చింతన చేసి లోపల శాంతచిత్తులై ఉండండి, ఎగిరే కళలో ఎగరుతూ ఉండండి.



## మాయాజీతుల నుండి జగత్‌జీతులుగా అవ్వండి

బాబా ప్రియమైన పిల్లలు బాబాను కలుసుకునేందుకు మధువనానికి వచ్చారు. బాబాతో అయితే కలుస్తారు, జత-జతలో తమ అలౌకిక పరివారాన్ని కూడా కలుసుకుంటారు. దీని వలన లాభమేమిటి? మొదట పరస్పరములో మన స్నేహము వృద్ధి చెందుతుంది. ఎంతెంత దైవీ పరివారములో, సమూహములో ఉంటామో, బాబాను కలుసుకునేందుకు మధువనానికి వస్తూ ఉంటామో, పరస్పరము తప్పకుండా అంత స్నేహము వృద్ధి చెందుతూ ఉంటుంది. రెండవ లాభము రిఫ్రెష్ అవుతారు. మనము బాబా మహావాక్యాలను విన్నప్పుడు రిఫ్రెష్ అవుతాము. ఇక్కడ నుండి నేను దృఢ సంకల్పము చేసి పోతున్నాను అని భావిస్తారు. బాబా చెప్పింది తప్పక చేస్తాను అని అనుకుంటారు. మాయ ద్వారా కొద్దిగా మూర్ఛిల్లి ఉండినా, బాబా మహావాక్యాలు వింటూనే స్పృహ వచ్చేస్తుంది. ఇచ్చటకు వచ్చినందున శక్తి లభిస్తుంది, రిఫ్రెష్ అవుతారు. మూడవ లాభము సేవ చేసేందుకు యుక్తులు లభిస్తాయి. మనము విశ్వకళ్యాణకారులము. ఇక్కడకు వచ్చి ఒకరి అనుభవాలు మరొకరు విన్నందున, సేవా సమాచారము విన్నందున మేము కూడా బాబా సేవ చేయాలని బుద్ధిలో మెదులుతూ ఉంటుంది. కేవలము బుద్ధిలో సేవ చేయాలని సంకల్పము జరగడమే కాక ధారణలు కూడా గట్టిపడతాయి. పరస్పరములో అలౌకిక స్నేహము, సంబంధము వృద్ధి చెందుతుంది. మధువనానికి రావడం వలన ఈ లాభాలన్నీ కలుగుతాయి. మధువనానికి వచ్చి ఇన్ని లాభాలు నేను తీసుకుంటున్నానా ? అని మీకు మీరే పరిశీలించుకోండి. చాలా మంది సేవాధారులు ముఖ్యముగా రిఫ్రెష్ అయ్యేందుకు మధువనములో సేవ చేసేందుకు వస్తారు, మాకు కూడా 15 - 20 రోజులు సేవ చేసేందుకు అవకాశము ఇవ్వండి అని అడుగుతారు.

పిల్లలకు మాయాజీతులుగా అవ్వాలని ఒక గొప్ప లక్ష్యముంది కాని మాయ కూడా తక్కువైనదేమీ కాదు. అందువలన మాయ కూడా శక్తివంతమైనదని బాబా చెప్తారు. శివబాబా సర్వశక్తివంతులే కాని పిల్లలైన మనము మాయా రాజ్యములో కూర్చుని ఉన్నాము. అందువలన బాబా పిల్లలందరూ మాయ నోటిలో పడి ఉన్నారు. మాయ నోటి నుండి వెలుపలికి తీసేందుకు బాబా వచ్చారు. సర్వశక్తివంతుని పిల్లలు మాయ నోటిలో

పడిపోయారు. ఇది మంచిది కాదు కదా? ఇది తండ్రిని అగౌరవపరచడం కదా. సర్వశక్తివంతులు, సుప్రీమ్ సోల్(పరమఆత్మ) అయిన శివబాబా మరియు సాకారములోని మనుష్యులందరి కంటే గొప్పవారైన బ్రహ్మాబాబా పిల్లలు మాయ నోట్లో పడిపోయారు, ఇది చాలా ఆశ్చర్యము కదా! బాబా, మీరు రండి అని దు:ఖితులై పిలుస్తూ ఉంటారు. ఎంతో భక్తి చేస్తారు, ఎంతగానో పిలుస్తారు. ఇప్పుడు బాబా వీటన్నిటి నుండి బయటకు తీసేందుకు వచ్చారు. వారు వచ్చి పిల్లలూ, మాయాజీతులుగా అవ్వండి అని చెప్తారు. మాయాజీతులుగా అయ్యేందుకు యుక్తులు కూడా బాబాయే తెలుపుతారు.

## మాయాజీతులుగా అవ్వడంలో సమర్పిత జీవితానికి చాలా మహత్యముంది

మాయ నోటి నుండి వెలుపలికి వచ్చేందుకు ముఖ్యమైన యుక్తి - మన జీవితాన్ని బాబా ముందు సమర్పితం చెయ్యాలి అనగా మనది సమర్పిత జీవితమైపోవాలి. ఈ జీవితానికి చాలా మహత్మముంది. మన జీవితము ఎవరి ముందు సమర్పించాము? మనుష్యులు మనుష్యులకు సమర్పణైపోతారు. ఉదాహరణానికి పత్ని పతి పై, పతి పత్ని పై సమర్పణవుతారు. దాని వలన వారికి అల్పకాల సుఖము లభిస్తుంది. తర్వాత మళ్లీ దు:ఖమే లభిస్తుంది. కాని మన తండ్రి అయిన ఈశ్వరుడు అవినాశిగా ఉన్నాడు, వారు పరమాత్మ. వారి పరిచయాన్ని వారే స్వయంగా వచ్చి ఇచ్చి, తెగిపోయిన సంబంధాన్ని ఎలా జోడించాలో ఆ యుక్తులన్నింటినీ తెలిపించారు. అందుకే మనము జీవితాలను అర్పించాము. సాకారబాబా శివబాబా ముందు తమ సర్వస్వాన్ని అర్పించారు. సమర్పణ చేసేందుకు కొంతమంది చాలా సమయము తీసుకుంటారు, ఆలోచిస్తూ ఉంటారు. అక్కడక్కడ కొంతమంది కర్మబంధనములు చాలా కఠినముగా ఉంటాయి. వాటిని త్రెంచి వేసేందుకు చాలా సమయము తీసుకుంటారు. బంధనాలను త్రెంచుకునేందుకు ఎక్కువ సమయము ఎవరికి పడుతుంది? బలహీనముగా ఉన్నవారికి. శరీరము బలహీనంగా ఉన్నవారికి పర్వతము పైకి ఎక్కేందుకు సమయము పడుతుంది. శరీరము శక్తిశాలిగా ఉన్నవారు త్వరగా ఎక్కిపోతారు. అలాగే శక్తిశాలీ ఆత్మలు కర్మబంధనాలను



తెంచుకునేందులో, సమర్పణయ్యేందులో ఆలస్యము చేయరు ఎందుకంటే వారిలో శక్తి ఉంటుంది.

## మాయాజీతులుగా అయ్యేందుకు స్వయాన్ని జగన్మాతగా భావించండి

ప్రారంభములో నేను బాబా వద్దకు వచ్చినప్పుడు బాబా నన్ను బిడ్డా, నీవు ఎవరు? అని అడిగారు. నీవు ఆత్మవు, ఒక శక్తివి అని కూడా నాకు చెప్పలేదు. ఇప్పుడైతే మనము అందరికీ నీవు ఆత్మవు, పరమాత్మని సంతానానివి, శుద్ధమైన పవిత్ర ఆత్మవు అని చెప్తాము కదా. నేను సాకార బాబా వద్దకు వచ్చినప్పుడు బాబా నాకు శక్తినిచ్చే రెండు మాటలు తెలిపించారు. ఏ స్మృతిని స్థిరంగా ఉంచుకుంటామో ఆ శక్తి సదా స్థిరంగా ఉంటుంది. కనుక వెంటనే సమర్పితమైపోతారు. ఆ రెండు మాటలు ఏవి? మొదటిది - నీవు జగన్మాతవు అని అన్నారు. ఆ సమయములో నేను చాలా చిన్న కుమారిని. కుమారినైన నాతో - నీవు జగన్మాతవు అని అన్నారు. ఓ మాతలారా! వింటున్నారా? ఒకవేళ మిమ్ములను జగన్మాతలు అని అంటే మీరు అవును మేము జగన్మాతలమే అని



బాబా జతలో దాదీ చంద్రమణి గారు మరియు అన్య దాదీలు

సంతోషిస్తారు. ప్రారంభములో మన పాటలు కూడా జగన్మాతలారా, మేలుకోండి, ఓ శివశక్తులారా, అందరినీ మేల్కొల్పండి అని ఉండినాయి. బాబా ఒకటేమో నన్ను జగన్మాత అని అన్నారు. రెండవది నీవు శివశక్తివి అని అన్నారు. అప్పుడు నేను శివశక్తి అను పదము బాగుంది, నాకు వరదానము లభించింది అని అనుకున్నాను. అయితే బాబా నన్ను జగన్మాత అని ఎందుకు అన్నారు? అని ఆలోచించసాగాను. నేను ఆత్మను, శివశక్తిగా అయితే అయ్యాను, శివునితో సంయుక్తముగా ఉన్నాను అని భావించాను.

జగన్మాత అను వరదానానికి అర్థమేమనగా జగత్తు లేక విశ్వకళ్యాణము మాతలైన మీ చేతిలో ఉంది. దీని వలన హద్దు తొలగిపోతుంది. అందరినీ పిల్లలుగానే భావిస్తారు. ఆత్మలందరి పట్ల వీరందరినీ తండ్రితో ఎలా కలపాలి? తండ్రి నుండి శక్తిని ఎలా ఇప్పించాలి? అని బుద్ధి పని చేస్తుంది. బుద్ధిలో సదా అనంతమైన చక్రము తిరుగుతుంది ఎందుకంటే మాతలకు జగన్మాత అను వరదానము లభించింది. ఇది కేవలం మాతలకే కాదు. ప్రతి ఆత్మకు బాబా వరదానాన్ని ఇస్తారు. ఆత్మ ఏమి కావాలనుకుంటుందో అది చేయగలదు. ఈ రోజు కుమారులకు కూడా స్వయాన్ని 5 సంవత్సరాల బాలునిగా భావించండి అను వరదానము లభించింది. ఈ వరదానము వలన నా దృష్టి-వృత్తి చంచలమవుతుంది, నాకు రాకూడని సంకల్పాల వస్తాయి............... అను ఫిర్యాదులు ఎప్పుడూ రావు. ఒకవేళ ఇవన్నీ వస్తూ ఉంటే మీరు స్వయాన్ని పెద్దవారిగా భావిస్తున్నారని అర్థమవుతుంది. బాబాకు నేను చిన్నబాలుడను అని భావించడం లేదని అర్థము. స్వయాన్ని చిన్న బాలునిగా, పవిత్ర ఆత్మగా భావించండి. వాస్తవానికి ప్రతీ ఆత్మ అనాది రూపములో పవిత్రంగానే ఉంటుంది. శరీర పరముగా కూడా నా దృష్టి-వృత్తి చెడిపోదు అని సంకల్పము చేయండి. స్మృతిని స్థిరంగా ఉంచుకోండి. ఇది స్మృతి - విస్మృతుల ఆట.

## మాయాజీతులుగా అయ్యేందుకు నేను ఆత్మను, శివశక్తిని అని సదా స్మృతిలో ఉంచుకోండి

ఆత్మ, శివబాబా సంతానమైనందున బుద్ధిలో శివబాబా స్మృతియే ఉంటుంది. ఇప్పుడు కూడా ఆ స్మృతి ఉంది, కల్పము తర్వాత కూడా మళ్లీ అదే



స్మృతి ఉంటుంది. ఇది మన కల్ప-కల్పము పాత్ర అని పక్కా అయ్యింది కనుక శక్తి వచ్చేసింది. బాబా కలిగించిన స్మృతి ద్వారా మనము సహజంగా వారికి సమర్పితమైపోయాము. స్మృతినిప్పించినవారు బాబాయే కనుక వారు గుర్తు ఎందుకు రారు? విస్మృతిలో ఉన్న ఒక పుత్రునికి గొప్ప స్మృతి లభించినప్పుడు స్మృతినిప్పించినవారు ఎంతగా గుర్తొస్తారు! నేను ఎవరి దానిని? అని స్మృతి వచ్చింది. నేను శివుని దానిని. నేను ఎవరిని? ఒక శక్తిని. ఈ స్మృతి ఉంటే శరీర భావము సమాప్తమైపోతుంది. శరీరములో శక్తి ఎక్కడుంటుంది? సోదరీల శరీరము బలహీనముగా ఉంటుంది. శరీరముతో అయితే మేము శక్తిశాలురమని భావించనే భావించలేము. కాని ఆత్మ ఒక శక్తి, అది శివునికి చెందినది. ఎవరి ఆత్మ కూడా బలహీనము కాదు. కుంటి, గుడ్డి, మూగవారైనా సరే. భలే వారు శరీర పరంగా నిర్బలురే కాని ఆత్మ శివుని శక్తి కనుక అది బలశాలి. బాబా పుత్రులెవ్వరూ నేను నిర్బలుడను, నేను బలహీనుడను అని చెప్పజాలరు. ఒకవేళ ఈ స్మృతిని తమదిగా చేసుకుంటే అనగా నేను శివశక్తిని అనే స్మృతిలో ఉంటే ఎప్పుడూ బలహీన సంకల్పాలు రావు. బలహీన సంకల్పాలు వస్తున్నాయంటే కారణము "విస్మృతి".

అజామిళుని వంటి పాపులను కూడా నేను ఉద్ధరించానని బాబా చెప్తున్నారు. వేశ్యలు, గణికలు, సాధువులందరి ఉద్ధారము కూడా నా ద్వారానే జరుగుతుంది. నేనే సుప్రీమ్‌ను, సర్వశక్తివంతుడను తెలుపుతున్నారు. పిల్లలైన మీరందరూ నా వారే అని ఆ సుప్రీమ్ తండ్రి అర్థం చేయిస్తున్నారు. తండ్రి ఎలా ఉంటారో పిల్లలు కూడా అలా ఉండాలి. ఆత్మ నిరాకారము కనుక పరమాత్మ అయిన తండ్రి కూడా నిరాకారులే. ఆత్మ ఒక శక్తి అయితే తండ్రి సర్వశక్తివంతులు. ఆత్మలో తండ్రి శక్తి ఉంది. ఇది నషాయే కాదు, లక్ష్యము కూడా ఇదే, వరదానము కూడా ఇదే. ఈ స్మృతి ద్వారా మొత్తం పురుషార్థమంతా చాలా చాలా సహజమైపోతుంది. ఈ స్మృతి ఎంత పక్కాగా అయిపోవాలంటే దీనిని ఎప్పుడూ మర్చిపోరాదు. ఒక్క క్షణములో సమర్పితమై తండ్రిని అనుసరించేటంత శక్తిశాలిగా ఉండాలి.

## మాయా జీతులుగా అయ్యేందుకు జీవిత నావను నావికునికి స్వాధీనము చేయండి

శరీరాలను చూస్తున్నా చూడకండి అని యుగల్స్‌కు కూడా బాబా తెలిపిస్తున్నారు. ఒకటేమో ఆ వస్తువు ఎదుట ఉండనే ఉండదు. ఎదుట లేకుంటే గుర్తు కూడా రాదు. కనుక సన్యాసులు ఇల్లు-వాకిళ్ళు వదిలేస్తే స్త్రీ గాని, పిల్లలు గాని గుర్తుకు రారని, పవిత్రంగా ఉండవచ్చని భావిస్తారు. వారి జీవితాలు ప్రభువుకు అంకితము కావు కదా. వారు పరమాత్మను తల్లి-తండ్రిగా భావించనే భావించరు. స్వయాన్నే జగద్గురువుగా భావిస్తారు. కొంతమంది లెక్కాచారాలు చాలా కఠినంగా ఉంటాయి. కనుక ఈ విషయములో కొంతమంది అక్కడక్కడా ఓడిపోతూ ఉంటారు. వారికి లోపల గుర్తు వస్తూ ఉంటారు, సంకల్పాలు నడుస్తూ ఉంటాయి. పాత లెక్కాచారాలు వారిని లాగుతాయి. పాత సంకల్పాలు, పాత స్మృతులు సతాయిస్తాయి. నేను ఎక్కడి వాడను, ఎవరిని, నాకు శ్రీమతమేది? అను విషయాలు వారికి తెలియనే తెలియవు. మనకైతే చాలా సులభము, ఎందుకంటే మనకు స్వయం బాబాయే తెలిపించారు. పిల్లలూ, మీరు ఇలా చేయండి, ఇలా చేయండి అని బాబాయే చెప్పారు. బాబా ఏమేమి ఆదేశించారో అది చేస్తూ పోవాలి. మనది సమర్పిత జీవితము. బాబా మన నావికుడు. మీ నావను నా చేతికిచ్చేయమని నావికుడు చెప్తున్నారు. నావ మీ చేతిలో ఉంచుకొని, దాటించమని చెప్తే ఆయనెందుకు దాటిస్తారు? శరీరాన్ని మాత్రము బాబాకిచ్చి, పాత స్వభావ సంస్కారాల అనుసారము నడుస్తూ ఉంటే మీరు సమర్పితులు కారు.

## మాయాజీతులుగా అయ్యేందుకు శరీరము నుండి వేరుగా ఉండు అభ్యాసము చేయండి

యజ్ఞములో ఉండి కూడా కొంతమంది బాబా పిల్లలు బయటకు వెళ్ళిపోతారు. సెంటరులో ఉండేవారు, మధువనములో ఉండేవారు అయినా వెళ్ళిపోయారు, ఎందుకు? మాయ తీసుకెళ్ళిపోయింది. పాత ప్రపంచములోని లెక్కాచారము లాక్కొని వెళ్ళిపోయింది. అయితే మాయ ఎవరిని ఆకర్షించలేదు? లాగలేదు? అందుకు బాబా మాకు ప్రారంభము నుండి పద్ధతి నేర్పించారు.



మొదట నుండి మనము అభ్యాసము ప్రారంభము చేస్తే మనలను ఎవ్వరూ లాగలేరు. భలే మాయ సర్వశక్తివంతమమైనది, భలే మనము దాని నోటిలో పడి ఉండినా, భలే మనము రావణ రాజ్యములో ఉండినా, మనము బాబా ఆజ్ఞానుసారము నడుస్తూ ఉంటే మాయ మనతో ఓడిపోతుంది. శరీరము నుండి స్వయాన్ని శరీరాన్ని భిన్నంగా ఉంచుకునేందుకు తపస్సు చేయమని బాబా చెప్తున్నారు. ఎవరైతే మొదట నుండి శరీరము నుండి వేరుగా ఉండు పురుషార్థము చేస్తారో, అశరీరులై తండ్రిని స్మృతి చేస్తారో వారి స్మృతి సరిగ్గా తండ్రికి చేరుతుంది. అంతర్ముఖులై శరీరము నుండి వేరుగా ఉండు అభ్యాసము చేయండి. దీని వలన ఆత్మకు తండ్రి నుండి కరెంటు లభిస్తుంది. ఆత్మకు శివబాబా నుండి కరెంటు కావాలి, లేకుంటే వికారుల కరెంటు ఆత్మలో ప్రవహిస్తుంది. ఎంత జ్ఞానము విన్నా తండ్రి నుండి కరెంటు తీసుకోలేదంటే వారి వృత్తి, దృష్టి సరిగ్గా ఉండదు. శరీరము కూడా వికారాల ద్వారా జన్మించింది. ఆత్మ తన పూర్వ జన్మల వికారి సంస్కారాలను తీసుకొని వచ్చింది. ఇప్పుడు ఆ సంస్కారాలను పరివర్తన చేయాలి. లౌకికతను అలౌకికతలోనికి మార్చాలి. లౌకిక దృష్టి అలౌకిక దృష్టిగా అవ్వాలి. లౌకిక మాట-మంతి మార్పు చెంది అలౌకికముగా ఉండాలి. మనము అలౌకికములోకి మార్చుకోలేకుంటే మనము సాధన చేయలేదని అర్థము. మనము సాధకులము. మనము సాధన చేస్తున్నాము. మనము 50 సంవత్సరాల నుండి సాధన చేస్తున్నాము, ఎవ్వరినీ లౌకిక దృష్టితో చూడరాదని, లౌకిక వృత్తి ఉంచుకోరాదని మన బుద్ధిలో లక్ష్యముంది. నేను అలౌకాన్ని. పరమాత్మ సంతానాన్ని. నేను పవిత్ర ఆత్మను, శివశక్తిని. నేను తండ్రితో సంయుక్తముగా ఉన్నాను, నా జతలో సర్వశక్తివంతులైన శివపరమాత్మ ఉన్నారు. శివుని నుండి నేను ఎప్పుడూ వేరు కాను. బుద్ధిలో ఎంత సమయము బాబా జతలో ఉంటారో, అంత కరెంటు వచ్చేస్తుంది, ఒకవేళ అది కట్ అయిపోతే, ఊడిపోతే మాయావి కరెంటు ప్రవేశిస్తుంది. తర్వాత ఇందులో వృత్తి-దృష్టి చెడిపోతుంది. ఎందుకంటే బుద్ధి శరీరము వైపుకు వెళ్ళిపోతుంది. వృత్తి బాహ్యముఖతలోకి అనగా వ్యక్తి, వైభవము, పదార్థాలలోకి వెళ్ళిపోతుంది. దేహము, దేహ సంబంధాల వైపుకు బుద్ధి వెళ్ళిపోతుంది. ఎవరెవరి పై, దేని పై మోహముండేదో, మళ్ళీ వాటి వైపుకే వెళ్ళిపోతుంది. అందుకే బాబా తపస్సు చేయమన్నారు.

## మాయాజీతులుగా అయ్యేందుకు దృష్టి- వృత్తి, సంబంధ- సంపర్కాలను అలౌకికముగా, శక్తిశాలిగా చేసుకోండి

తపస్సులో దృష్టి-వృత్తులు లౌకికము నుండి అలౌకికములోకి ఎంతవరకు పరివర్తనయ్యాయో మిమ్ములను మీరు చూసుకోండి. లౌకికములో ఉంటూ, మీ యుగల్ జతలో ఉంటూ, వారిని చూస్తూ కూడా చూడకుండా ఉన్నానా? నా దృష్టి, వృత్తి అలా ఉందా? అలౌకికముగా ఉందా? తినేటప్పుడు, త్రాగేటప్పుడు బాబాను స్మృతి చేస్తున్నానా? అని చెక్ చేసుకోండి. నడుస్తూ-తిరుగుతూ స్మృతి చెయ్యము, కాని కూర్చుని తప్పకుండా స్మృతి చేస్తాము. ఎందుకంటే కూర్చున్నప్పుడు స్మృతి బాగుంటుంది. కొంతమంది కూర్చుని ఉన్నప్పుడు కూడా యోగము సరిగ్గా కుదరదని అంటారు. కూర్చుని అభ్యాసము చేసినప్పుడే యోగము కుదరకుంటే, వారికి నడుస్తూ-తిరుగుతూ యోగమెలా కుదురుతుంది? వారిని మాయ లాగకుండా ఎలా ఉంటుంది? కూర్చుని యోగము చేయుటలో శక్తిశాలి స్థితి అనుభవము కాలేదంటే, వారికి యోగము చేయు అభ్యాసము లేదని అర్థము. ఎక్కడో ఒక చోట ఏదో ఒక ఆత్మ పట్ల ఆకర్షణ ఉంది, లొంగుబాటు ఉంది అందుకే యోగము కుదరదు. ఏదైనా మాయావి పదార్థము పట్ల లేక ఏదో ఒక దేహము లేక లౌకికత వైపు ఆకర్షణ, లొంగుబాటు ఉంది కనుకనే వారికి యోగము కష్టమనిపిస్తుంది. ఎక్కడైనా మనము వంగిపోయామంటే మనకు యోగము కష్టమైపోతుంది. ఎందుకంటే బుద్ధి అధికారిగా లేదు ఎక్కడో లొంగిపోయింది. సర్వ సంబంధాలు తండ్రితో జోడింపబడలేదు. తండ్రితో సర్వ సంబంధాలు జోడించినందున తండ్రి నుండి సర్వశక్తులు అధికార రూపంలో, వారసత్వ రూపములో లభిస్తాయి. శక్తి లేనందున ఆత్మ ఏదో ఒక సంబంధములో, పదార్థములో, లౌకిక మర్యాదలకు, కులమర్యాదలకు లొంగిపోయి ఉంటుంది. ఏదైనా ఒక వస్తువు లేక వ్యక్తికి లొంగి ఉండుట, ఆకర్షణ కలిగి ఉండుట మన బలహీనత. అత్యంత ఉన్నతులైన తండ్రి సంతానమైన మనము ఎవరైనా ఇతర దేహధారులకు లొంగడమా! " నేను ఎవరిని" అని బాబా కలుగజేసిన ఈ స్మృతిని విస్మృతి అయిపోతుంది. అందువలన ఏదో ఒక దేహధారి వైపు లొంగిపోతాము. సదా కాలము కొరకు బాబా ఇచ్చిన స్మృతి గుర్తుండదు. ఇప్పుడు సదాకాలము గుర్తుంచుకునే అభ్యాసము అవసరము. వ్యాపారము చేస్తూ



ఉండండి, ఆఫీసులో ఉండండి, ఏ పని చేసేందుకైనా ముందు మన స్మృతి పూర్తి శక్తిశాలిగా ఉండాలి. అలా లేకుంటే కర్మలు చేయునప్పుడు ఏదో ఒక అవగుణము వచ్చేస్తుంది, నష్టపోతాము. కర్మ చేయునప్పుడు సంపర్కములోకి వస్తాము. కోపము వలన నోటి ద్వారా కఠిన వాక్కులు వెలువడ్తాయి. దాని వలన సంబంధాలు తెగిపోతాయి. మనము సేవాధారులము. ఈశ్వరీయ సంబంధాలను తయారు చేయువారము. కాని కోపమనే ఒక్క అవగుణము వలన సంబంధాలు సమాప్తమైపోతాయి. మనము లౌకిక సంబంధాలను అలౌకికములోకి తీసుకురావాలి. ఇంటిలో ఉంటున్నా అలౌకిక రీతిలో మాట్లాడాలి, అలౌకిక దృష్టితో చూడాలి. కొన్నిసార్లు లౌకికములోని వారి లౌకిక మాటలు వింటూ సహించవలసి వస్తుంది. ఆ మాటలు మనకు బాగుండవు. అయినా శాంతిగా వినవలసి వస్తుంది. ఆ సమయములో మన స్థితి అశరీరిగా ఉంటే మనము సహనశీలురుగా అవుతాము, ధైర్యముగా ఉంటాము, ఉదారచిత్తులుగా కూడా అవుతాము. ఈ గుణాలన్నీ తండ్రి ద్వారా లభించిన వారసత్వము. ఆ సమయములో ఆ గుణాలు పని చేస్తాయి. లౌకికమువారితో మన సంబంధాలు బాగుంటాయి, అలౌకికముగా ఉంటాయి. ఎవ్వరి పై ఏహ్యా భావముండదు. వారు అజ్ఞానులు. వారు మనతో అలాగే వ్యవహరిస్తారు, ఏమేమో చేస్తారు, మనకు పరీక్ష కూడా పెడ్తారు. ఇది కూడా మీకు తెలుసు. ఎందుకంటే వారు దేహాభిమానులుగా ఉన్నారు. అన్ని వికారాలకు మూలము దేహాభిమానమే అని మీకు తెలుసు. కనుక వారు ఏమైనా చేస్తారు!

బాబా అంటున్నారు - లౌకికమును అలౌకికముగా చేయు సేవ చేయండి. మీరు ఎంత అలౌకికతలో ఉంటారో, అంత మీ సంబంధ సంపర్కములోకి వచ్చేవారు కూడా అలౌకికతలోకి వస్తారు. అలాగే మీరు ఎంత లౌకికముగా ఉంటారో, వారు అంతకంటే ఎక్కువ లౌకికములోకి వస్తారు. ఇది బాగా గుర్తుంచుకోండి. కనుక మీ మనసనే దర్పణములో నాలో ఎంత అలౌకికత ఉంది? నా బుద్ధియోగము సదా సర్వశక్తివంతులైన తండ్రి జతలో ఉందా? నేను సదా శివశక్తి స్వరూప స్మృతిలో ఉన్నానా? నా మాటలు కూడా శివశక్తుల వలె ఉన్నాయా? నా కర్మలు, సంకల్పాలు కూడా అలౌకికంగా ఉన్నాయా? నా సంస్కారాలు కూడా అలౌకికముగా ఉన్నాయా? అని మీ దర్పణంలో చూసుకోండి.

మీరు ఎంత అలౌకికంగా ఉంటారో, అంత మీ సంబంధాలు కూడా అలౌకికంగా అవుతాయి. సంకల్పాల ద్వారా వైబ్రేషన్లు తయారవుతాయి. వైబ్రేషన్ల ద్వారా వాయుమండలము తయారవుతుంది. చాలా మంది మాతలకిది అనుభవము ఉంటుంది - మొదట వారి పతి జ్ఞానములోకి రారు, ఇప్పుడు రావడం ప్రారంభిస్తారు. మొదట మా బంధువులు విరోధించేవారు. ఇప్పుడు వారు కూడా జ్ఞానములో వస్తున్నారని అంటారు. కొంతమంది మాతలంటారు - 15 సంవత్సరాల నుండి నా పతి నా ముఖము కూడా చూచేవారు కాదు, కాని ఇప్పుడు నా మాట వింటారు. ఇంకా కొంతమంది నా పతి మొదటసారి మధువనానికి వచ్చారు, నాకు చాలా సంతోషంగా ఉంది అని అంటారు. అలాగే ఎవరైనా జ్ఞానీ ఆత్మ పత్ని జ్ఞానములోకి రావడం ప్రారంభిస్తే నా యుగల్ కూడా జ్ఞానములోకి వచ్చింది అని ఆ పతి చాలా సంతోషిస్తాడు. మేమిరువురము సంతోషంగా జ్ఞానములో నడుస్తామని అంటారు. ఈ మార్పు ఎలా జరిగింది? మొదట ఇరువురు ఎందుకు కొట్లాడుకునేవారు? ఇప్పుడెందుకు జగడాలు లేవు? ఎందుకంటే అందరి స్థితి గమ్యానికి సమీపంగా వస్తోంది. లోలోపల అందరిలో సూక్ష్మ తపస్సు జరుగుతోంది. బాబా పిల్లలు ఎంతెంత అశరీరులుగా, అలౌకికంగా అవుతూ పోతారో, అంత వాయుమండలాన్ని తయారుచేస్తూ పోతున్నారు. ఇంతమంది బాబా పిల్లలు అశరీరులుగా అయ్యేందుకు, స్మృతి స్థిరంగా ఉండేందుకు తపస్సు చేస్తున్నప్పుడు వాయుమండలము ఎందుకు తయారవ్వదు? మన వైబ్రేషన్లు అనంతములోకి వెళ్ళి అన్నీ కలిసి వాయుమండలము అలౌకికంగా అయ్యేందుకు సహాయము చేస్తాయి. మన మానసిక శక్తి, మన స్మృతి పని చేస్తూ ఉంది. మనము అశరీరులుగా అయ్యి పని చేసి, సేవ చేసినప్పుడు ఆ వైబ్రేషన్లు ఇతరులను అలౌకికంగా చేస్తూ పోతున్నాయి. అందుకే ఎప్పుడూ నిరాశ చెందరాదని బాబా చెప్తారు. ఎవరెలా ఉన్నా, వీరు పరివర్తనయ్యేవారు కాదు, వీరికి అర్థము కాదు, బాగుపడరు అని ఎప్పుడూ అనరాదు.

మా ఇంటిలో బ్రాందీ తాగుతారని, టీ.వి చూస్తారని, చాలా లౌకికంగా ఉంటారని కొంతమంది కుమారులంటారు. వాతావరణము చాలా చెడుగా ఉంది. ఇంటిలో నేనొక్కడినే జ్ఞానములో నడుస్తున్నానని అంటారు. వారితో కలిసి



ఎలా తినాలి, ఎలా ఉండాలి? నాకు చాలా కష్టంగా ఉందని అంటారు. పాపం చాలామంది కుమారులు దుఃఖీలుగా అయిపోయారు. ఏమి చేయాలో వారికి అర్థము కాదు. నాతో - దీదీ, నన్ను మధువనములో సమర్పితము చేయండి, బాబా సేవ చేస్తూ, బాబా పిల్లలతో ఉంటానని అంటారు. అందుకు నేను వారితో మీరు ఇంకా అలౌకికంగా అవ్వలేదు లేక మీ స్థితి ఇంకా లౌకికములోనే ఉంది కనుకనే వారి వైబ్రేషన్లు మీ పై పడుతున్నాయని అంటాను. వారందరిని నేను పరివర్తన చేయాలని మీలో సంకల్పము కలగాలి. మనము మారి ఇతరులను మార్చినప్పుడే కదా విశ్వము పరివర్తనయ్యేది. మొదట మీరు మీ - మీ ఇంటిలోని వారిని మార్చండి. వారు ఎలా ఉండినా, వారి మధ్య యోగినైన నేను కూర్చుని ఉన్నాను. ఎవరు మీ ముందుకు వచ్చినా, వారు శుద్ధమైపోవునట్లు దృష్టినివ్వండి.

## ఈ విషయములో నా అనుభవాన్ని వినండి

నేను మీకు ఒకసారి జరిగిన సంఘటన వినిపిస్తాను. ప్రారంభంలో మేము ఆబూకు వచ్చినప్పుడు మా లౌకిక సంబంధీకులు, నా లౌకిక తల్లిదండ్రులను రమ్మని ఆహ్వానించారు. బాబా వారితో పాటు నన్ను కూడా వెళ్ళమన్నారు. నీవు వీరికి ఊతకర్రవు. ఆ సంబంధీకులంతా తినేవారు, త్రాగేవారు. ఇంట్లో పూర్తి విలాసిత(లక్జూరియస్) వాయుమండలముండేది. వారు వికారాలలో పూర్తిగా మునిగిపోయినవారు. అందుకు తోడు పూర్తి విరోధులు కూడా. కనుక బాబా నాతో మీ తల్లిదండ్రులకు ఆ వాతావరణాన్ని ఎదిరించి తట్టుకునేంత శక్తి లేదు. కనుక నీవు కూడా వారి వెంట వెళ్ళి వీరికి ఆధారంగా ఉండాలి అని చెప్పారు. అప్పుడు నాకు అచ్చటకు వెళ్ళి నేను వెలుగులో నిల్చొని వారందరినీ పరివర్తన చేయాలని అనిపించింది. నీవు వీరికి ఆధారము, ఊతకర్రవు అని బాబా నాకు వరదానమిచ్చినందున నషా కూడా ఎక్కింది. ఏ కొంచెము బలహీనంగా ఉండినా అటువంటి వాయుమండలములో మనము కూడా బలహీనమైపోతాము. నేను వారికి ఉత్తరము వ్రాశాను - మీరు ఆహ్వానము వ్రాసి పంపారు, మీ వద్దకు వచ్చేందుకు మాకు అనుమతి లభించింది. మా భోజనము మేమే తయారు చేసుకుంటాము అని మీకు తెలుసు పాత్ర సామాన్లు కొత్తదిగా ఉండాలి, శుభ్రముగా ఉండాలి, వంట గది కూడా వేరుగా ఉండాలి. మేము నివసించు గదులు కూడా ప్రత్యేకంగా

ఉండాలి. అప్పుడు మాత్రమే మేము రాగలము. ఏదో లౌకిక కార్యము కొరకు వారికి మా తల్లిదండ్రుల అవసరము ఉండినది. మేము బాబా కార్యము చేయవలసి ఉండినది అనగా వారికి సందేశం కూడా ఇవ్వాల్సి ఉంది. బాబా మమ్ములను అక్కడకు ఎందుకు పంపించారు? బాబాకు మా పై నమ్మకం ఉండినది కనుక ధైర్యము చేస్తే బాబా సహాయము చేస్తారు(హిమ్మతే బచ్చే, మదదే బాప్). అందుకు వారు, మీకు కావలసిన ఏర్పాట్లన్నీ చేస్తామని అంగీకరించారు. మేము వారి వద్దకు వెళ్ళిపోయాము. అక్కడ రెండు వంట గదులు ఉండినాయి. ఒకటి ఒకవైపు ఉంటే, రెండవది మరోవైపు ఉండినది. అందులో ఒకటి మాకిచ్చారు. సామానంతా కొత్తది తెప్పించారు. వారు పై గదులలో ఉండి మాకు క్రింద పూర్తిగా ఇచ్చేశారు. కాని వారి డైనింగ్ హాల్ మా పడక గదికి సమీపంగా ఉండేది. వారు మాంసము, గుడ్లు మొదలైనవి తినేవారు. మా ముందే ఈ వస్తువులన్నీ వచ్చేవి, మా ముందే తినేవారు. వారి వద్దకు వెళ్ళి వారి ముందు కూర్చొని అవి భుజించినందున వాటిల్లు నష్టము గురించి చెప్తామని నాకు సంకల్పము కలిగింది.

వారి వద్దకు వెళ్ళి ఇలా చెప్పాను - చూడండి, బ్రాందీ మంచిదే, కొంత సమయము సుఖాన్ని ఇస్తుంది, అన్నింటినీ మరపింపజేస్తుంది, కాని పేగులు కాలిపోతాయి, త్వరగా చనిపోతారు. మాంసము, గుడ్లు మొదలైనవి ఉష్ణ పదార్థాలు. వాటిని తింటే లోపల ఉష్ణము పెరిగి కోపము వస్తుంది. మీరు పరస్పరము ఎందుకు కొట్లాడుకుంటారంటే, ఇటువంటి పదార్థాలు భుజించినందున కోపము వస్తుంది. కోపానికి వశమై కొట్లాడుకుంటారు. మాంసము మొదలైనవి తింటే మీకు శాపాలు తగులుతాయి. చూడండి, మేకల తలలు నరుకుతే వాటికి దు:ఖము కలుగుతుంది. దు:ఖముతో విలవిలలాడుతూ మరణించిన జంతు మాంసమును తింటారు. కనుక దాని ప్రభావము మీ మనసు పై పడుతుంది, దాని శరీరములో గల జబ్బులు మొదలైనవి కూడా తినేవారిలోకి ప్రవేశిస్తాయి. మీరు పొట్టను శ్మశానముగా చేసుకుంటున్నారు. పొట్టలోకి శవాలు ప్రవేశించినట్లవుతుంది. ఎటువంటి ఆహారమో అటువంటి మనసు( జైసా అన్న్ వైసా మన్) తయారవుతుంది. జంతువులను తినేవారి బుద్ధి జంతువుల బుద్ధి వలె అయిపోతుంది. జంతువుల వలె వ్యవహరించడం ప్రారంభిస్తారు. ఒక కుక్క



మరో కుక్కను చూసి భౌ-భౌ అని ఎలా మొరుగుతుందో అలా మనము మనుష్యులమైనా ఇతర మనుష్యులను చూచి కోపగించుకోవడం, కొట్లాడటం ప్రారంభిస్తారు. మానవ జీవితము వజ్ర సమానంగా ఉన్నతమైనది. ఈ రోజు వారి జీవితము గవ్వ సమానంగా ఎందుకు తయారయ్యింది? ఎందుకంటే వారి ఆహారము అలా ఉంది. వారి శరీరములోకి ఎటువంటి ఆహారము పోతోంది? చనిపోయిన జంతువులు. ఇటువంటి ఆహార పానియాలు స్వీకరించినందున ఆత్మ కూడా పాపిగా, శరీరము కూడా పాపిగా అయిపోతుంది. ఇటువంటి మాటలు నేను వారి ముందు కూర్చొని చాలా దృఢంగా చెప్పాను. వారిలో ఒకరిద్దరి పై నా మాటలు చాలా ప్రభావము చూపాయి. వారు వైష్ణవులైపోయారు. ఒకేసారి అందరినీ బ్రాహ్మణులుగా చేయలేము కదా. ధైర్యము చేసినందున ఇరువురైనా జ్ఞానములోకి వచ్చారు.

ఈ విషయము నేనెందుకు వినిపిస్తున్నానంటే, మనలో ఎంతవరకు అలౌకికత ఉండదో, అంతవరకు మన ప్రభావము ఎవ్వరి పైనా పడదు. కనుక మొదట మనము అలౌకికంగా తయారవ్వాలి. మన సంకల్పాలు, మాటలు, సంబంధాలు, సంపర్కాలు, కర్మలు అన్నీ అలౌకికంగా అవ్వాలి. ఇంతవరకు కొంతమంది తమ లౌకిక కులాన్ని, జాతిని మర్చిపోలేదు. ఇంకా ఆ నషాలోనే ఉంటున్నారు. మేము గుప్తాలము, మేము శర్మలము, మేము మెహతాలము అని భావిస్తూ ఉంటారు. మన పేరు, ఊర్లనే మర్చిపోవునట్లు బాబా మనకు అలౌకిక పేర్లు ఇచ్చేశారు ఎందుకంటే మనది మరజీవ జన్మ. బాబాకు బ్రహ్మా అను పేరు ఎవరు పెట్టారు? తనంతకు తానే బ్రహ్మా అని పేరు పెట్టుకోలేదు. శివబాబా పెట్టారు. ఇతను ప్రజాపిత బ్రహ్మా, సృష్టికర్త, ప్రజలకు పిత అని శివబాబా అన్నారు. సాకార బాబాకు కూడా నేను ప్రజలకు తండ్రిని కనుక ప్రజలకు సేవ చేయాలని అనిపించింది. నేను ప్రజలందరికి పితను, నేను విశ్వమంతటికి సేవ చేయాలని బాబాకు ఎంత ఫోర్సు వచ్చింది! ఒక్కసారిగా సర్వస్వమూ స్వాహా చేసేశారు. బాబా ముందుకు ప్రపంచమంతా వచ్చేసింది - ఎలిజిబెత్ రాణికి ఉత్తరమెలా వ్రాయాలి, గాంధీకి ఎలా ఉత్తరం వ్రాయాలి...... అని ఆలోచించారు.

కొంతమంది వీరు నా బంధువులు, బ్రాందీ త్రాగుతారు, మాంసాహారులు, వీరంటే నాకు అసహ్యము, నేను వీరి జతలో ఉండను అని

అంటారు. వారు కూడా బ్రహ్మా సంతానమే కదా అని బాబా అంటారు. బ్రహ్మా అంటే ప్రజలందరికీ తండ్రి. వీరు నా కర్మ బంధనాలు అని ఎందుకు అనుకుంటారు? వారు కూడా బ్రహ్మా పిల్లలే, నా సోదరులే అని భావించండి. పిల్లలు రెండు రకాలుగా ఉంటారు. ఒకరు సుపుత్రులు, రెండవ వారు కుపుత్రులు. మీరు కుపుత్రులను సుపుత్రులుగా తయారుచేయాలి. నా పిల్లలందరూ కుపుత్రులై చెడిపోయారని బాబా కూడా అంటారు. నేను వారిని సుపుత్రులుగా చేసేందుకు వచ్చాను. చెడిపోయిన వారిని సరిచేయు(బిగడీకో బనానేవాలా) వారిప్పుడు మీ ముందున్నారు. అలాగే మీరు కూడా మా సోదరులు లేక మా పిల్లలు చెడిపోయారు, వారిని బాగు చేయాలని భావించండి. అంతేగాని మేము వారి జతలో ఉండము, ఉండలేము అని అనుకుంటే అది మీ బలహీనత. ప్రయత్నించండి, శక్తి నింపండి. వాయుమండలాన్ని తయారు చేయండి. మీ వృత్తి, దృష్టిని అలౌకికంగా చేసుకోండి. ఆత్మీయతను సాధన చేయండి. మీ ఆత్మీయతా ప్రభావము ఇతరుల పై పడాలి. నేను తయారవుతే ఇతరులలోకి అది వచ్చేస్తుంది, ప్రభావము పడ్తుంది. నేనే అలౌకికంగా కాలేదంటే ఇతరులలోకి ఎలా వస్తుంది? నేనెంతగా తయారవుతానో ఇతరుల పై అంత ప్రభావము పడుతుంది. ఈ సమయాన్ని బాబా మనకు తపస్సు సాధన చేసేందుకు ఇచ్చారు.

మన బుద్ధిలో కూర్చుని ఉన్న లౌకికతను తపస్సు ద్వారా పరివర్తన చేయాలి. ఇంత జ్ఞానము వారికి ఇవ్వలేకపోవచ్చు కాని లౌకికతను అలౌకికతలోకి తీసుకు రాగలరు కదా!  మీలో పరివర్తన అయితే తీసుకురాగలరు. బాబాను స్మృతి చేయగలరు కదా. ఉపన్యసించలేకపోవచ్చు, జ్ఞానము ఇవ్వలేక పోవచ్చు కాని బుద్ధియోగాన్ని తండ్రి జతలో ఉంచవచ్చు కదా. అప్పుడు మీ ప్రభావము, మీ అశరీరి స్థితి ప్రభావము మీ సంబంధీకుల పై పడగలదు. వీరు అతీతంగా అయిపోయారని వారికి అనుభవమవ్వాలి. కాని ఎందులో? ప్రపంచంలోని ఆచార వ్యవహారాల నుండి, పారివారిక కర్మల నుండి అతీతమవ్వడం కాదు. మనము దేహాభిమానము నుండి భిన్నముగా, వికర్మలు చేయడం నుండి భిన్నముగా, దేహ సంబంధాల నుండి భిన్నముగా అవ్వాలి. వీరు దేహ ప్రపంచము నుండి భిన్నముగా, ఫరిస్తాలుగా ఉన్నారని, వీరి మాటలు చాలా మధురంగా ఉన్నాయని, చాలా గౌరవంగా మాట్లాడ్తారని, వీరి నడవడిక ఫరిస్తాలది, వీరిది



ఈశ్వరీయ భాష, వీరి పాత భాష, పాత వ్యవహారాలన్నీ మారిపోయాయని వారికి అనుభవమవ్వాలి. వీరి శరీరము వృద్ధాప్యంలో ఉన్నా, వీరి నూతన ఈశ్వరీయ జన్మ చూశామని వారికి అనిపించాలి. వీరి ఆచార వ్యవహారాలు, మాటా-మంతి, కర్మలు, ధర్మము అన్నీ కొత్తవని అనిపించాలి. చిన్న బిడ్డ జన్మించినప్పుడు వారి సంస్కారాలన్నీ కొత్తవిగా ఉంటాయి కదా. అలా మన అన్ని సంస్కారాలు అలౌకికమై పోయాయి. అన్నీ  అలౌకికంగా అవుతే వాయుమండలము అలౌకికంగా ఎందుకు తయారవ్వదు? స్వయం పై కృషి చేయాలి. మనము అలౌకికంగా ఉన్నప్పుడు, మనము పరివర్తన అయినప్పుడు ఇతరులు కూడా పరివర్తనవుతారు. బాహ్యా సేవ ఇంకా ఎందుకు పూర్తి అవ్వడం లేదు, దానికి కారణమేమి? వీరిలా ఉన్నారు, అలా ఉన్నారని మనము అంటాము కదా, అలా అనరాదు. మనమంతా బాబా పిల్లలమే. బ్రహ్మా సంతానము. కాని మనము పూర్తి పక్కాగా అవ్వాలి. మన రంగు పక్కాగా ఉండాలి, అప్పుడు ఎవ్వరికీ మన వైపు వేలెత్తి చూపే శక్తి (దమ్ము) ఉండదు. మొదట మనము శక్తిశాలిగా ఉండాలి, మొదట మనము పరివర్తనవ్వాలి. మొదట నేను తయారవ్వాలని మనలో దృఢత్వముండాలి. పాత స్వభావ సంస్కారాలు మనకు పనికి రావు. వాటిని మనము వదిలేయలేమా?

## మాయా జీతులుగా అయ్యేందుకు సంకల్పము, మాట, కర్మ చేసేందుకు ముందే ఇవన్నీ శ్రీమతానుసారము ఉన్నాయా? అని చెక్ చేసుకోండి

కర్మలు చేసేందుకు ముందు మీ సంకల్పము, మాట, కర్మ శ్రీమతానుసారము ఉన్నాయా లేక లౌకికంగా ఉన్నాయా ? అని ఆలోచించండి. మనము శివబాబాకు మన జీవితాన్ని ఇచ్చేసినప్పుడు, సమర్పితమైనప్పుడు, జీవిత నౌకను నావికునికి ఇచ్చేసినప్పుడు మన స్వంత సంకల్పాలు ఎందుకు నడవాలి? ఎవరికి అర్పణ చేశామో వారి ఆజ్ఞానుసారము నడవాలి కదా! కనుక ప్రతి సంకల్పము, మాట, కర్మలు చేసేందుకు ముందు మొదట అవి అలౌకికంగా ఉన్నాయా లేక దేహధారుల వలె లౌకికంగా ఉన్నాయా? అని చెక్ చేసుకోండి. చెక్ చేసుకొని చేంజ్(పరివర్తన) చేసుకోండి. ఎక్కడైనా, ఏదైనా ఒక మూలలో దేహాభిమానము దాగి లేదు కదా? అని కూడా చెక్ చేసుకోండి. మనలో సాధన లేకుంటే లోపల దేహాభిమానము దాగి కూర్చొని ఉంటుంది. సమయము చూసి అది బయటకు వచ్చేస్తుంది. సంకల్పము, మాట, కర్మలలో బయటకు వచ్చేస్తుంది.

దేహాభిమానము, దేహ అహంకారము వలన పరస్పరము భేదాభిప్రాయాలు వచ్చేస్తాయి. సేవలో సఫలత లభించదు. దేహాభిమానము ఎందుకు వస్తుంది? మనము తపస్సు చేయనందున వస్తుంది. తపస్సు వలన జన్మించు అగ్ని దేహాభిమానాన్ని ఇంకా కాల్చి వేయలేదని అర్థమవుతుంది. మన తపస్సులో లోపముంది. సాధనలో లోపము, కర్మయోగములో లోపముందని తెలుసుకోవాలి. వీటన్నిటికి కారణము - నిర్లక్ష్యము, సోమరితనము. నిర్లక్ష్యముంటే మనలో దేహాభిమానము పక్కాగా ఉండిపోతుంది. కనుక కర్మలో కూడా మనము గమనముంచాలి. భోజనము చేయునప్పుడు వీరితో వారితో మాట్లాడితే, ఎగతాళిగా తమాషాలు చేస్తే స్మృతి ఎప్పుడు చేశాము? స్మృతిలో భోంచేస్తే లోపల ఇంకా శక్తిశాలురుగా అవుతారు.

## మాయాజీతులుగా అయ్యేందుకు మీ భోజనాన్ని మీరే తయారు చేసుకొని తినండి

చాలామంది దాదీ మేము బయట ఎక్కడా భోంచేయము, కాని 4-5 రోజులు నేను బయటకు వెళ్లవలసి వస్తుంది. నాకు జాబు వ్రాసి ఇస్తే సెంటరులో భోజన వసతి లభిస్తుంది అని అంటారు. అందుకు నేను "అలా వద్దు సోదరా, నేను అటువంటి జాబు వ్రాసి ఇవ్వను" అని చెప్తాను. ప్రారంభంలో విశ్వకిషోర్ భాయి యజ్ఞ సంబంధమైన కార్యవ్యవహారాలు చూచేందుకు, సంభాళించేందుకు నిమిత్తంగా ఉండేవారు. వారిని బాబా బయటకు పంపించేవారు. వారు యజ్ఞంలో మొత్తం సేవ అంతా చేసేవారు. వారు ఒక స్టవ్ ఉంచుకునేవారు. బయటకు వెళ్లవలసి వచ్చినప్పుడు ఒక సంచిలో స్టవ్, గోధుమపిండి, ఒక ప్లేటు ఉంచుకునేవారు. ఎక్కడికి వెళ్తే అక్కడ తాజా తాజాగా రొట్టెలు చేసుకొని తినేవారు. మీ చేతితో తయారు చేసుకొని తినడం అన్నిటికంటే మంచిది అని బాబా చెప్పేవారు. ఇంత పని చేస్తారు కదా! మీ భోజనాన్ని మీరు తయారు చేసుకోలేరా? అర్ధగంట చాలు. సోదరీలే తయారు చేసి తినిపించాలి అని ఎందుకు సంకల్పిస్తారు? సోదరీలు బాబా సేవ చేయాలా? లేక మీ సేవ చేయాలా? మీరు బ్రాహ్మణీల వద్ద సేవ ఎందుకు తీసుకుంటారు? అన్నయ్యలైన మీరు మధువనానికి వచ్చినప్పుడు మేము వంటగదిలో పూర్తి సేవ చేస్తాము అని అంటారు కదా.



అలాంటప్పుడు అక్కడ మీ భోజనము మీరు తయారు చేసుకోలేరా? ఫలానా చోట సెంటరుందని బుద్ధిలో ఉంది కదా. కనుక అక్కడ సులభంగా భోజనము లభిస్తుందని అనుకుంటారు. మీ టీచరుతో, 'బెహన్‌జీ నేను పాతవాడిని, జ్ఞానములో ఇన్ని సంవత్సరాల నుండి ఉన్నాను, నాకు ఒక లెటరు వ్రాసి ఇవ్వండి' అని అడుగుతారు. కాని నేనైతే వ్రాసి ఇవ్వను. మూడేసి రోజులు రైలులో ప్రయాణము చేసినప్పుడు సెంటరుకు వెళ్లి భోంచేస్తామా? చెడిపోకుండా ఉండే పదార్థాలు తయారు చేసుకొని వెంట తీసుకెళ్లి మూడు రోజులు తినడం లేదా? మీరు బయటకు వెళ్లినా తాజా భోజనము కావాలంటే మీ అంతకు మీరే తయారు చేసుకొని తినండి. అలా చేత కాకుంటే అన్ని రోజులు మీరు తినగలిగిన వస్తువులు తీసుకొని వెళ్లండి.

ఎంత సమయము ఆహారాన్ని భుజిస్తూ ఉంటారో, అంత సమయము బాబా స్మృతిలో ఉండండి. స్మృతిలో తింటే ఆత్మకు శక్తి లభిస్తుంది. అన్నము యొక్క ప్రభావము మనసు పై తప్పక పడుతుంది. ప్రారంభములో బాబా మమ్ములను ఇతరుల నుండి నీటిని కూడా త్రాగనిచ్చేవారు కాదు. కొంతమంది కన్యలు యజ్ఞములో ఉండినారు. కాని వారి తల్లిదండ్రులు జ్ఞానములో లేరు. ఆ కన్యలు వారి వద్దకు వెళ్లినప్పుడు, తల్లిదండ్రుల చేతితో భోజనము తినకండి, మీరు స్వయంగా తయారు చేసుకొని తినండి, వచ్చేటప్పుడు వారి గోధుమ పిండి మొదలగు పదార్థాలకు అయిన ఖర్చును ఇచ్చి రండి అని చెప్పేవారు. భోజనము తయారు చేసుకొని మీరు తినడమే కాకుండా వారికి కూడా మీ భోజనమే తినిపించండి. బాబా ఆహార పానీయాల పై చాలా కఠినంగా శిక్షణనిచ్చేవారు. ఎలాంటి అన్నమో అలాంటి మనస్సు (జైసా అన్న్ వైసా మన్), ఎలాంటి సాంగత్యమో అలాంటి రంగు(జైసా సంగ్ వైసా రంగ్). ఈ రెండు విషయాలను బాబా మాకు ప్రారంభం నుండి పక్కా చేశారు.

## మాయాజీతులుగా అయ్యేందుకు పవిత్రతను ధారణ చేయుటలో ఎప్పుడూ బలహీనంగా అవ్వకండి

మన సంస్థ, మన చదువు విశ్వకళ్యాణము కొరకు ఉపయోగపడేవి. విశ్వమంతా పవిత్రత, శాంతి, సుఖము(ప్యూరిటీ, పీస్, ప్రాస్పరిటి) కొరకు మన

వైపు చూస్తూ ఉంది. మనము విశ్వమనే స్టేజి పై ఉన్నాము. పవిత్రతలో ఫెయిల్ అవుతే ఆధ్యాత్మిక జీవితములో పరాజయము పొందుతారు. కుమారులు, కుమారీలు, జంటలు(యుగల్స్) అందరూ పవిత్రంగా ఉన్న సంస్థ ఇదొక్కటే. మన క్లాసంతా పవిత్రంగా ఉంది. పవిత్రతా మార్గములో నడిచే వారిని చూచి కొంతమంది సంతోషించి సహయోగము కూడా ఇస్తారు. కొంతమంది విఘ్నము కలిగించేవారు కూడా ఉన్నారు. కాని భూమి బ్రద్దలైనా ధర్మాన్ని వదలరాదు..... అనునది మన ధారణ, మన పునాది(ఫౌండేషన్). ఈ ధారణలో ఏ సడలింపూ లేదు. జనులు ఈ విషయాన్ని పరీక్షించేందుకు కూడా మన వద్దకు వస్తారు.

మీకు నేనొక ఉదాహరణ చెప్తాను. హాపుడ్‌లో జరిగిన గలాటాను గురించి మీకు తెలిసే ఉంటుంది. ఆ సమయంలో జనులు వీరు ఇలా ఉంటారని, అలా ఉంటారని ఇందిరా గాంధీకి తెలిపారు. కనుక ఇందిరాగాంధి గుప్త రూపంలో చెక్ చేసేందుకు తమ మనుష్యులను(సి.ఐ.డిలను) భారతదేశమంతటా పంపించారు. ఆ సమయంలో నేను అమృత్‌సర్‌లో ఉండినాను. అచ్చటికి కూడా ఒక డి.ఎస్.పి సాధారణ దుస్తులలో వచ్చి నేను కూడా రాజయోగము నేర్చుకుంటాను, నాకు మీరే కోర్సు చేయించండని చెప్పారు. అందుకు నేను సోదరా, నేను కోర్సు చేయించను. మీకు ఒక మాత కోర్సు ఇస్తుంది, ఫలానా సమయానికి రమ్మని అతనికి చెప్పాను. మొదటి రోజు చెప్పిన సమయానికి వచ్చాడు. మరుసటి రోజు వేరే సమయములో వచ్చాడు. మీకు ఉదయము సమమము ఫిక్స్ చేసిన తర్వాత ఆ సమయంలో ఎందుకు రాలేదు? అని అడిగాను. అందుకు అతడు, ఆ సమయానికి వారొచ్చారు, వీరొచ్చారు అని చెప్పాడు. అతడు కావాలనే పగటి పూట మేము ఏమి చేస్తున్నామో తెలుసుకునేందుకు వచ్చాడు. వీరు నిద్రపోతున్నారా, ఎవరితోనైనా మాట్లాడుతున్నారా, ఏమి చేస్తున్నారు? అని చెక్ చేసేందుకు వచ్చాడు. అతడు సి.ఐ.డి అని మాకేమి తెలుసు? పర్వాలేదు, వీరి ఇంటికి ఎవరైనా బంధువులు వచ్చి ఉండవచ్చు కోర్సు చేయిస్తాము అని చెప్పాను. మూడవ రోజు మరో సమయంలో వచ్చి ఇంకో సాకు చెప్పాడు. అలాగే నాలగవ రోజు మరో సమయంలో వచ్చి మరొక కారణము తెలిపాడు. ఈ జిజ్ఞాసువు సరిగ్గా లేడని నేను భావించాను. ఇతని మనసులో మరేమో ఉంది అని అనుకున్నాను. మీరు



రావాలంటే ఉదయమే రండి, లేకుంటే రాకండి, మా సమయము ఫిక్స్‌డ్‌గా ఉంటుంది. ఆ సమయాన్ని మేము మరొకరికి ఇవ్వము. కనుక మీరు రావాలంటే మీకిచ్చిన సమయంలో రండి, లేకుంటే రాకండి అని చెప్పాను. నా పైన అనుమానము కలిగిందని అతడు అర్థము చేసుకున్నాడు. కనుక అతడు నవ్వుతూ నవ్వుతూ పెద్దవారు, చిన్నవారిని చేతితో తాకుతారు కదా, అలా నా పై చేయి వేసేందుకు ప్రయత్నించి, సరే ఫర్వాలేదులే అన్నాడు. అప్పుడు నేను, అరే నీవు నన్నెందుకు తాకావు, మేమెవరో నీకు తెలియదు. మేము శివపరమాత్మునికి తనువు, మనసు, సర్వ సంబంధాలతో సమర్పితులము. ఇటువంటి సమర్పిత శరీరాన్ని నీవెందుకు తాకావు? నేను ఒక సోదరిని పిలిచి పోలీసును పిలవమని, ఫోన్ చేసి ఇతనిని పోలీసులకు అప్పగించమని చెప్పాను ఎందుకంటే ఇతడు ఒక స్త్రీ పై చేయి వేశాడు. ఇతడు దొంగ, ఇతని మనస్సులో కపటముంది. నేను అతని ముందే ఇలా చెప్తూ పోయాను. పాపం అతడు భయపడిపోయాడు. ఆ సోదరి పోలీసులకు ఫోన్ కూడా చేసింది. అతడు ఫోన్ కట్ చేయమని, సత్యము చెప్తానని చెప్పాడు. నన్ను ఇందిరా గాంధి గారు, మిమ్ములను పరీక్షించేందుకు పంపించారని చెప్పాడు. బ్రహ్మాకుమారీల చర్యలు మంచివి కావని, వారి కేంద్రాలను చెక్ చేయించమని ఇందిరా గాంధిగారి వద్దకు ఫిర్యాదులు వచ్చాయి. అందువలన ఇందిరా గాంధి అన్ని వైపులకు ఒకే సమయంలో సి.ఐ.డిలను పంపించారు. నేను ఇక్కడ అంతా పరిశీలించాను, నాకు అటువంటి విషయమేదీ లభించలేదు. నేను వెళ్లి సత్యమైన రిపోర్టు ఇస్తానని అతను సత్యము చెప్పాడు. ఈ విధంగా దేహము నుండి, దేహ సంబంధీకుల నుండి, సమాజము వారి నుండి, ప్రభుత్వము వారి నుండి, అందరి ద్వారా పరీక్షలు వస్తాయి, కాని మనము అధైర్యపడరాదు. వెనుకకు తగ్గరాదు. వెనుకకు తగ్గితే పరాజయము నిశ్చితము. ఏమి జరిగినా మనము మన ధారణలను వదిలి పెట్టరాదు. ఒక పేపరులో ఫెయిల్ అయినా భగవంతుని పై పూర్తి నిశ్చయము లేదని, మాయను మనము పూర్తిగా గుర్తించలేదని దానికి లోబడిపోయామని అర్థమవుతుంది. మనము సత్యముగా ఉన్నాము, నిర్భయులుగా ఉన్నాము, బాబా మన జతలోనే ఉన్నారు, మనమెందుకు ఫెయిల్ అవుతాము! మనము అలౌకికంగా ఉన్నాము, లౌకికంగా లేము కనుక మనమెందుకు భయపడాలి? మనము శివశక్తులము, మనము పాండవులము, మనము సత్యముగా ఉన్నాము, మనము రహస్యంగా

ఎలాంటి పాప కర్మలు గాని, పాప సంకల్పాలు గాని చేయడం లేదు. కనుక ఎందుకు భయపడాలి? మనలో పాపమే లేకుంటే ఎందుకు భయపడాలి? ఈ రోజులలో పాపము చేసినవారే భయపడకుంటే మనమెందుకు భయపడాలి? ప్రపంచంలో ఎన్ని పాపాలు జరుగుతున్నాయో చూడండి, కాని వారే నిర్భయంగా ఉన్నారు. మేము హింస చేసి ధర్మస్థాపన చేస్తున్నాము, కాని మరో రూపంలో చేస్తున్నామని అంటారు. మన పవిత్రత అయితే మనసులో ఉంది. మన ఈశ్వరీయ చట్టాలు, మన నియమాలు, మన మర్యాదలు ఏవైతే ఉన్నాయో వాటి అనుసారము మనము నడుచుకుంటున్నాము. మన నియమాలు చాలా కఠినమైనవి కాని లాభాన్వితమైనవి, అనివార్యమైనవి. మొదట మన మర్యాదలలో సరిగ్గా ఉంటే మనలను ఎవ్వరూ వేలెత్తి చూపరు. మనము నియమాలలో, మర్యాదలలో ఇంత పక్కాగా ఉంటే మనమెందుకు చలించాలి? భయపడాలి?

## మాయాజీతులుగా అయ్యేందుకు భయపడకండి, ప్రలోభాలకు లోబడకండి

సమాజములోని వారు మిమ్ములను ప్రలోభపెడ్తారు, భయపెడ్తారు, బెదిరిస్తారు. ఎలాగైతే సీతతో రావణుడు - "నీవు నాదానిగా అయితే నిన్ను లంకకు మహారాణిగా చేస్తాను", అని ప్రలోభపెట్టాడు, నీవు నా దానిగా అయిపో అని అన్నాడు కాని సీత చలించక స్థిరంగా ఉండి - "**నేను ఒక్క రాముని దాసనే** " అని చెప్పింది. అలా మనము ఒక్క శివబాబాకు చెందినవారము. సర్వశక్తివంతులైన భగవంతుడు మన తోడుగా ఉంటే మనమెందుకు భయపడాలి? చాలామంది కన్యలు తల్లిదండ్రులకు భయపడి వివాహము చేసుకుంటారు, తర్వాత జ్ఞానము కూడా వదిలేస్తారు. మీరు అలా ఎందుకు చేస్తారు? మీరు ఎందుకు భయపడ్తున్నారు? మీరు ఏ పాపము చేస్తున్నారని భయపడాలి? గాంధీగారితో పాటు దేశ సేవ చేసేందుకు ఎంతో మంది మాతలు, కన్యలు తమ ఇల్లు-వాకిళ్ళు వదిలేశారు. జన సేవ చేసేందుకు ఆ కన్యలు వివాహము చేసుకోలేదు. మీరు పరమపితకు సహాయకారులుగా అవుతారు. పవిత్రమై పూర్తి ప్రపంచాన్ని పవిత్రంగా చేయు సేవ చేస్తున్నారు. ఎందుకు భయపడాలి? మనమేదైనా చెడ్డ పని చేస్తున్నామా? మీరు మీ తల్లిదండ్రుల మాట విని వివాహము చేసుకొని



జ్ఞానము వదిలేస్తే, అది మీ బలహీనత. మీరు సత్యమైన జ్ఞానాన్ని మీ తల్లిదండ్రులకు అర్థము చేయించలేకున్నారు. రెండవది - పరమాత్మ పట్ల, పరమాత్మ జ్ఞానము పట్ల మీకే నమ్మకము లేదు. మూడవది - ఆంతరికములో మీకు కూడా వివాహము చేసుకోవాలనే కోరిక ఉంది. బాబాను కూడా చాలామంది మగ పిల్లలు, ఆడ పిల్లలు - "బాబా, లౌకిక తల్లిదండ్రులు వివాహము చేసుకోమని అంటున్నారు, చేసుకోమంటారా?" అని అడుగుతారు. వివాహము చేసుకొని నేను పవిత్రంగా ఉంటాను అని అంటారు. అందుకు బాబా "భలే చేసుకోండి" అని చెప్తారు. ఎందుకంటే వీరి మనసులో వివాహము చేసుకోవాలనే కోరిక ఉన్నందునే అడుగుతున్నారని బాబా అర్థం చేసుకుంటారు. ఒకవేళ నేను వద్దన్నా వీరు వెళ్ళి తప్పకుండా వివాహము చేసుకుంటారని బాబాకు తెలుసు. అందువలన బాబా చేసుకోమని చెప్తారు. " అరే, వివాహము చేసుకొని పవిత్రంగా ఉంటామని చెప్తున్నారు, వివాహము చేసుకుంటే పవిత్రంగా ఉండగలరా? వివాహము చేసుకొని అనేక నూతన సంబంధాలు(బాధ్యతలు) జోడిస్తున్నారు, కనుక పవిత్రముగా ఉండగలరా?" సర్వ దేహ సంబంధాలను మరచి నన్నొక్కరినే స్మృతి **చేయండని బాబా అంటారు.** ఇది మాయ. మీరు మాయను ఇంకా గుర్తించనే లేదు. నేను వివాహము చేసుకుంటానని అడగడమే బలహీనత. బాబా అనేక యుక్తులు తెలిపారు. వాటిని అనుసరించి నడుచుకుంటూ స్వయాన్ని రక్షించుకోండి. స్వయం మనమే మనలను రక్షించుకుంటాము. శ్రీమతమును అనుసరించి బాబాకు సమర్పణవుతే ఇతరులను కూడా మీ వలె పవిత్రంగా చేసి సమర్పితము చేయగలరు. మన జీవితము పవిత్రంగా, శ్రేష్ఠముగా తయారవుతే దాని ప్రభావము ఇతరుల పై కూడా పడుతుంది. ఇతరులు కూడా మన వలె తయారై బాబాకు వారసులుగా అవుతారు. శక్తిశాలి ఆత్మలను తయారు చేసేందుకు స్వయం శక్తిశాలిగా అవ్వాలి. కనుక మన నియమాలు, మర్యాదలు ఏవైతే ఉన్నాయో, తపస్సు ఉందో, సాధన ఉందో వాటిని మర్చిపోరాదు. వాటి అనుసారము నడుచుకుంటే మాయాజీతులుగా, జగత్‌జీతులుగా అవుతారు కదా. మాయను జయించినప్పుడే జగత్తుకు, విశ్వానికి అధికారులుగా అవుతారు. తినడం, త్రాగడం ఉండే పద్ధతులు అన్నీ శుద్ధంగా ఉండాలి. నింద-స్తుతి, జయము-పరాజయము అన్నింటిలో సమానంగా ఉండాలి. త్యాగము, తపస్సు

సేవలో నెంబరవన్ గా ఉండాలి. ఈ విధంగా మన ధారణలు ఎప్పుడైతే శక్తిశాలిగా ఉంటాయో, అప్పుడు మనము మాయాజీతులుగా, జగత్‌జీతులుగా అవుతాము

## సమర్పిత జీవితము

సమర్పిత జీవితమని దేనినంటారు? ఈ సభలో చాలామంది అటువంటి వారున్నారని భావిస్తున్నాను. వారి జీవితాలు ప్రాక్టికల్‌గా, సమర్పితంగా ఉన్నాయి. చాలామంది అనుభవీలుగా కూడా ఉన్నారు. కాని సమర్పిత జీవితమని దేనినంటారో వివరిస్తాను. సమర్పిత జీవితమంటే వారికి తెంచుట, మలుచుకొనుట, జోడించుట(తోడ్‌నా, మోడ్‌నా, జోడ్‌నా) వచ్చి ఉండాలి. ఎవరితో తెంచుకోవాలి, ఎవరితో మలుచుకోవాలి, ఎవరితో జోడించాలి? ఎవరికైతే దేహము, దేహ సంబంధాలు, దేహ పదార్థాలు మూడింటితోనూ మోహము తెగిపోయి ఉందో వారి జీవితాన్నే సమర్పిత జీవితమని అంటారు. ఆత్మకు ఈ మూడింటి పై మోహముంటుంది. ఆత్మ సదా శరీరముతో పూర్తిగా సంబంధాన్ని కలిగి ఉంటుంది.

## ఎవరికి తెంచడం వస్తుందో, వారికి మలుచుకోవడం, జోడించడం కూడా వస్తుంది

కారు ఉన్నప్పుడే డ్రైవరుకు, డ్రైవరున్నప్పుడే కారుకు విలువ ఉంటుంది. కారుకు, డ్రైవరుకు చాలా లోతైన సంబంధముంది. అలాగే ఆత్మ ఈ శరీరాన్ని నడిపించేది, శరీరములో ఆత్మ ఉన్నప్పుడే దానికి విలువ ఉంటుంది. అలాగే ఆత్మకు శరీరము లభించినప్పుడే విలువ ఉంటుంది. రెండు కలుస్తే పాత్ర నడుస్తుంది. దానిని మనము విలువైన పాత్ర అని అంటాము. వీరిది హీరో పాత్ర అని అంటారు కదా. అనేక జన్మల నుండి ఆత్మకు శరీరముతో లోతైన సంబంధముంది. కనుక శరీరము పట్ల ఆత్మకు మోహము పెరుగుతూ పోతుంది, పెరుగుతూ పోతుంది. శరీరాన్ని వదిలేందుకు అనగా మరణించేందుకు చాలా మంది భయపడ్తారు. ఎవరు ఎంత జబ్బుపడినా, జీవించేందుకు ప్రయత్నిస్తారు. ఎంత ఖర్చైనా బ్రతకాలని అనుకుంటారు. వృద్ధులుగా ఉండినా ఇంకా ఈ ప్రపంచంలో ఉండాలని కోరుకుంటారు. ఆత్మకు శరీరముతో చాలా లోతైన సంబంధముంది, మోహముంది. దేహ సంబంధీకులతో కూడా మోహముంటుంది. ఎందుకంటే





రక్త సంబంధముంటుంది. దేహము, దేహ సంబంధీకులు, దేహ పదార్థాల పై మోహముంటే శివబాబాతో యోగమెలా జోడింపబడుతుంది? కనుక బాబా అంటారు - పిల్లలూ, ఈ దేహము, దేహ సంబంధాలు, దేహ పదార్థాల పై గల మోహాన్ని తీసేయండి. లేకుంటే బుద్ధి సదా ఆ వైపు తిరుగుతూ ఉంటుంది. రాజయోగులుగా అవ్వలేరు. ఈ మోహ బంధనము సమాప్తమైపోవాలి. ఎందుకంటే నిశ్చయ బుద్ధి విజయంతి. ఒకసారి బాబా నా వారు, నేను బాబా దానిని, నేను తండ్రిని గుర్తించాను, తెలుసుకున్నానని నిశ్చయమయిందో అప్పుడు బుద్ధిలో, కనులలో బాబానే నివసిస్తారు కనుక దేహము, దేహ సంబంధాలను తెంచి వేయడం ఎవరికి వస్తుందో, వారు స్వయాన్ని మలుచుకుంటారు. వారి బుద్ధి, స్వభావము, సంస్కారము మలచబడ్తాయి. ఆ డ్రైవరు చాలా తెలివైనవాడని అంటే ఎందులో తెలివైనవారు? అతనికి కారును ఎలా కావాలంటే అలా నడపడం చాలా బాగా వచ్చు. కొండల పై పోవునప్పుడు తెలివైన హుషారైన డ్రైవరు కావాలని అంటారు కదా. ఎందుకంటే పర్వతాల పై చాలా మలుపులు వస్తాయి. తెలివైన డ్రైవరు ఆ మలుపులు చాలా సులభంగా తిప్పేస్తాడు. అలాగే ఎవరికైతే మల్చుకోవడం వచ్చో, వారు సులభంగా సమర్పిత జీవితాన్ని తయారు చేసుకోగలరు. పాత సంస్కారాలు, దేహాభిమానము - ఇవి ముఖ్యమైన మలుపులు. మీరు దేహము కాదు, దేహి(ఆత్మ) అని బాబా చెప్తారు. దేహాభిమానములో ఉంటే ఫెయిల్ అవుతారు. కనుక బుద్ధిని దేహాభిమానము నుండి దేహీ-అభిమానములోకి తిప్పుకోవాల్సి వస్తుంది. లేకుంటే బంధనాలు తెగిపోవు. బంధనాలు తెగకపోతే వివేకవంతులుగా అవ్వలేరు. కనుక బాబా టీచరు సంబంధములో ఎటువంటి చదువును చదివిస్తారంటే, ఆ చదువు వలన పిల్లలకు తమ కారును, పాత

సంస్కారాలను మల్చుకోవడము, మార్పు చేసుకోవడం వచ్చేస్తుంది. దీనినే స్వ పరివర్తన ద్వారా విశ్వపరివర్తన అని అంటారు. జీవితమనే యాత్రలో చాలా పెద్ద పెద్ద మలుపులు వస్తాయి.

## తెంచేందుకు, మలుపు తిప్పేందుకు ఆధారము – జోడించడం

బాబా కూడా అనేక పర్యాయాలు పిల్లలూ, " మీరు ఎంత ముందుకు వస్తారో, తెలివిగల వారుగా అవుతారో అంత మాయ ద్వారా అనేక మలుపులు వస్తాయి. అయితే భయపడరాదు. పరిస్థితులకు, మలుపులకు కూడా భయపడరాదు. చావుతోనూ భయపడరాదు, పరిస్థితులతోనూ భయపడరాదు. అనేక రకాలైన పరిస్థితులు వస్తాయి, మలుపులు వస్తాయి. తెంచేందుకు, మలుపు తిరిగేందుకు ఆధారము జోడించడం. శివబాబాతో మీ సంబంధమెంత జోడిస్తూ పోతారో, ఎంత వృద్ధి చెందుతుందో అంతగా బంధనాలు తెగిపోతూ వస్తాయి. ఇంతవరకు ఈ బంధనాలు తెగిపోలేదు, ఇంకా నా భావ - స్వభావాలు మారలేదు అని ఆలోచిస్తూ ఎప్పుడూ ఉదాసీనంగా అవ్వరాదు. ఇది చూచి అప్పుడప్పుడు ఉదాసీనత వచ్చేస్తుంది. ఇంత సమయము నుండి నేను జ్ఞానములో నడుస్తున్నాను, అయినా నా కర్మ బంధనాలేవీ పూర్తిగా తెగిపోలేదు, నా పాత భావ-స్వభావాలేవీ పరివర్తన అవ్వలేదు, జీవితము పూర్తిగా మలుపు తిరగలేదు అని నిరుత్సాహపడకండి. మీరు ఎంతగా జోడిస్తే అంత తెగిపోతాయని బాబా చెప్తారు. ఎంత చేస్తే అంత అని లెక్కాచారమే ఉంది. ఎప్పుడూ ఉదాసీనులుగా అవ్వరాదు. కేవలం చదువు పై గమనముంచండి. ఎంత గమనమిస్తారో, బుద్ధిని ఎంత ఆ పరమాత్మతో జోడిస్తారో అంత యోగులుగా అవుతారు. యోగుల బంధనాలు సులభంగా తెగిపోతాయి, తునిగిపోతాయి. చాలామంది మాకు పిల్లల బంధనముంది, స్త్రీ బంధనముంది, ఇంటి బంధనముందని అంటారు. అందుకు బాబా ఇచ్చే జవాబు ఏది? మీరు రచయితలు. మీ ద్వారానే రచింపబడిన రచనను బంధనమని ఎందుకు భావిస్తారు? వారైతే మీ రచనే. మీరు రచయితలు, మాలికులు. వారిని కూడా మీ వలె తయారుచేయండి. రచయితలైన మీరు స్వయాన్ని ఎలా మల్చుకున్నారో, జోడించుకున్నారో అలా మీ రచన యొక్క బుద్ధియోగాన్ని కూడా తండ్రితో జోడింపజేయండి. ఎంత సులభము! వారిని బాబా పిల్లలుగా చేస్తే మోహము తెగిపోతుంది. ఎందుకంటే



వీరు కూడా బాబా పిల్లలే అని బుద్ధిలో ఉంటుంది. సర్వమూ బాబాదే. ఎవరు బాబాతో జోడింపబడి ఉంటారో, వారు వారి రచనను కూడా బాబాతో జోడింపజేస్తారు. మధువనానికి కూడా ఎవరైనా పరివారము వస్తే, తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి అందరూ బాబావారిగా అయ్యి ఉంటే ఆ పరివారము ఎంత బాగుంటుంది. తల్లి గురువై పిల్లలను ఆధ్యాత్మిక మార్గములో నడిపిస్తూ ఉంది. భగవంతునితో పిల్లల సంబంధాన్ని జోడింపజేస్తుంది. ఎక్కడ నాది అనేది ఉంటుందో, ఎక్కడ ప్రేమ ఉంటుందో, అక్కడ నీది-నాది అనే వ్యత్యాసము కూడా సమాప్తమైపోతుంది అని అంటారు కదా. స్వయం నేనే వారికి సమర్పితమైనప్పుడు నా వస్తువు అనేది ఎలా ఉంటుంది? బాబాను తెలుసుకొని, గుర్తించి నన్ను నేను వారికి సమర్పితం చేశానో, మాతలైన మీరు మీ పిల్లలను, పతిని, పరివారాన్ని బాబా వద్దకు తీసుకొస్తారు కదా. కొంతమంది తమ కూతుర్లను తీసుకొస్తారు, కొంతమంది తమ కొడుకులను తీసుకొస్తారు, కొంతమంది తమ మరదులను తీసుకొస్తారు, కొంతమంది అల్లుళ్లను తీసుకొస్తారు. తీసుకొస్తారు కదా. ఎందుకు తీసుకొస్తారు? కొంతమంది మాతలు, పరివారమంతటిని తీసుకొస్తారు, ఎందుకు? ఎందుకంటే వీరు కూడా బాబావారిగా అవ్వనీ, నేను ఎలాగైతే సుఖము, శాంతిని అనుభవము చేస్తున్నానో అలా వారు కూడా చేయనీ, అని ఆ ఆత్మల సంబంధాన్ని కూడా బీజమైన బాబాతో జోడింపజేస్తారు.

బీజముతో యోగము జోడించినందున సర్వుల సహయోగము కూడా సహజంగా లభిస్తుంది. ఎవరైతే రాజయోగులుగా అవుతారో, వారు సర్వుల సహయోగులుగా కూడా అవుతారు. వారు ఏమవుతుందో, ఎలా అవుతుందో, సమాజములో ఎలా ఉంటారో అను,.......... సంకల్పము కూడా చేయనవసరమే ఉండదు. చాలామందికి ఇలాంటి వ్యర్థ సంకల్పాలు నడుస్తాయి. కాని ఎప్పుడైతే పరివారమంతా బాబావారిగా అవుతారో అప్పుడు వారందరి వ్యర్థ సంకల్పాలు సమాప్తమైపోతాయి. సంకల్పాలలో మలుపు వచ్చినందున జీవితములో కూడా మలుపు వచ్చేస్తుంది. వ్యర్థ సంకల్పాల స్థానములో వారికి సేవ కొరకు మంచి సంకల్పాలు వస్తూ ఉంటాయి. లౌకికములో కుమారుడు నా బాధ్యత నా తండ్రి పై ఉందని భావిస్తాడు. ఎందుకంటే తండ్రితో వారికటువంటి సంబంధముంది. తండ్రిని తనవారిగా భావించి కార్యవ్యవహారాలలో తండ్రికి సాక్షిగా అవుతాడు.

వ్యాపారంలో సహయోగిగా అవుతాడు. తండ్రికి ఆజ్ఞాకారిగా, నమ్మకస్థునిగా అవుతాడు. అలాగే ఇది కూడా అలౌకిక జీవితము. బాబా మనలను దత్తత తీసుకున్నారు. మనము దత్తత తీసుకోబడిన పిల్లలము. అచ్చట(లౌకికము) ఎవరైనా దత్తత తీసుకోబడితే, పాత ఇల్లు, పాత సంబంధాలు వదిలి కొత్త తల్లిదండ్రుల వద్ద ఉండవలసి వస్తుంది. కాని ఇక్కడ అలా కాదు. ఈ రోజు కూడా బాబా మురళిలో పిల్లలైన మీరు ఇల్లు-వాకిలి వదిలేయరు, కాని ఇంట్లో ఉంటున్నా తప్పకుండా సమర్పితులుగా అవుతారు అని చెప్పారు. సప్త సముద్రాలకు ఆవల కూర్చొని ఉన్నా బాబా నావారు అని అంటారు. బాబా కూడా నా కొడుకు, నా కూతురు అని అంటారు. తండ్రి కొడుకుల సంబంధముంటే మధ్యలో నాది అనే ఏ ఇతరము రాజాలదు. కొడుకు తండ్రికి తన జీవితాన్ని సమర్పణ చేసేశాడు. సమర్పితము చేయడం అనగా అతనివాడిగా అయ్యాడు. కనుక అతని ఆజ్ఞానుసారమే నడుచుకుంటాడు కదా. తన మనసును తిప్పుకుంటాడు. ఏ మనసైతే లౌకికంగా ఉండేదో, అనేక మతాలను అనుసరిస్తూ ఉండేదో అది మారిపోయి ఇప్పుడు శివబాబా శ్రేష్ఠ మతమును అనుసరిస్తుంది. వారిని ఆజ్ఞాకారి పుత్రుడని అంటారు. తండ్రిని గుర్తించారు కదా? అతని సంబంధంలో మలుపు వచ్చేసింది. కేవలము సంబంధములోనే కాదు, పాత స్వభావ సంస్కారాలలో కూడా మలుపు వచ్చేస్తుంది. ఈశ్వరీయ సంతానంగా అయినందున స్వభావము, సంస్కారము, స్మృతి, సంబంధము, సంపర్కము అన్నీ ఈశ్వరీయముగా అయిపోతాయి. కనుక వీటన్నిటిలో మలుపు వచ్చేసింది కదా.

## ఎవరు ఎంత యోగులుగా ఉంటారో, అంత వారి జీవితములో మలుపు వచ్చేస్తుంది

ఎవరు ఎంత యోగిగా ఉంటారో, వారి జీవితములో అంత మలుపు వచ్చేస్తుంది. బాబా అంటారు - ఇది పురాతన యోగము. ఈ యోగమును దేహధారులెవ్వరూ నేర్పించలేరు. నేనే సన్ముఖములో వచ్చి నేర్పిస్తాను. ఈ రాజయోగముతో మాత్రమే స్వ పరివర్తన జరుగుతుంది. స్వ పరివర్తనతో విశ్వ పరివర్తనవుతుంది. ఎందుకంటే విశ్వములో మలుపు వచ్చేస్తుంది. ప్రతి ఆత్మ



జీవితములో మలుపు తప్పకుండా వస్తుంది. ఈశ్వరీయ జీవితములోకి వచ్చినప్పుడు సంకల్పము, వృత్తి, దృష్టి, కర్మలో మలుపు వచ్చేస్తుంది. అన్నీ అలౌకికమైపోతాయి. ఇటువంటి వైబ్రేషన్ల ద్వారా తత్త్వాలు కూడా పరివర్తనవుతాయి. మెల్ల-మెల్లగా ఆ శక్తి అన్నిటిలో ప్రవేశిస్తుంది. మొదట మనుష్యులు మారాలి. ఇది మనుష్యాత్మల విషయము. అందువలన శివబాబా తన తప్పిపోయిన పిల్లలను మొదట తనవారిగా చేసుకున్నారు. ఇప్పుడు పిల్లలు స్వయాన్ని " దేహము, దేహ సంబంధాలతో నా బుద్ధి యోగము తెగిపోయిందా లేదా? " అని ప్రశ్నించుకోండి. ఇంకా వాటి పై నాకు మోహము లేదు కదా? నేనే బాబా దానిగా అయిపోయినప్పుడు ఈ శరీరము కూడా బాబాదే కదా! కనుక దీని పై నాకు మోహమెందుకు? ఈ శరీరాన్ని ఈశ్వరీయ సేవార్థము సమర్పణ చేశాను కనుక దీనితో సేవయే చేయాలి. మనము ఆత్మలము, శరీరముతో సహా బాబాకు సమర్పించాము. ఈ శరీరము పై బాబాకు పూర్తిగా అధికారముంది. నేను బాబా దానిని, బాబా మా వారు, నా సర్వస్వము బాబాదే. తండ్రికి పిల్లల పై అధికారముంటుంది. అలాగే పిల్లలకు తండ్రి పై అధికారముంటుంది. వారు ఎప్పుడూ అధీనులుగా అవ్వరు. బాబా నాకు ఈ శరీరాన్ని సేవ కొరకు ఇచ్చారు, ఇందులో ఎప్పుడు కూడా అహంకారము రాకూడదు. అహంకారమొచ్చిందంటే బుద్ధి దేహాభిమానిగా అయిపోతుంది. అప్పుడు దేహము, దేహ సంబంధాలు, దేహ పదార్థాల పై మోహము వచ్చేస్తుంది. అందువలన సదా ఈ దేహము బాబా నా వద్ద తాకట్టుగా ఉంచారు. సేవ కొరకు బాబా నన్ను నిమిత్తంగా చేశారని భావించాలి. ఉదాహరణానికి సాకారములో బాబా ఈ రథము శివబాబాది అని భావించేవారు. రథము పై సారథి సవారి అయ్యి ఉన్నారు. ఇది భాగ్య రథము, భాగ్యశాలి రథము. ఎలాగైతే బాబా త్వరగా శివబాబాకు సమర్పితమయ్యారో అలా తమ పరివారాన్ని కూడా సమర్పితము చేసేశారు. ఎవరైనా బాబాను గుర్తించకుంటే ఆ పుత్రుడు, పుత్రుడు కాదు కదా! శివబాబాను గుర్తించారంటే బాబా వారిగా అవ్వడం. మన ముందు బ్రహ్మాబాబా స్యాంపుల్‌గా ఉన్నారు. సీ ఫాదర్, ఫాలో ఫాదర్(తండ్రిని చూడండి, తండ్రిని అనుసరించండి) శివబాబా చెప్తున్నారు - తండ్రిని చూడండి. బ్రహ్మాబాబా చెప్తారు - నేను శివబాబాకు అపురూపమైన కొడుకును ఎందుకంటే శివబాబాను తెలుసుకున్నాను,

గుర్తించాను, వారి ముందు జీవితాన్ని పూర్తిగా సమర్పించాను. నేను శివబాబాకు ఆజ్ఞాకారి పుత్రుడనని అంటారు. శివబాబా ఇచ్చే శిక్షణలను నేను పూర్తిగా ధారణ చేస్తాను. వారి శ్రీమతాన్ని అనుసరిస్తాను. శివబాబా ఈ నోటితో మాట్లాడినప్పుడు అందరికంటే ముందు నేనే వింటాను. ఆ తర్వాత ఇతరులు వింటారు. నా బుద్ధి వారి శిక్షణలను ధారణ చేస్తుంది. ఈ విధంగా నేను ఆజ్ఞాకారి పుత్రుడను.

బుద్ధిలో బాబాను గుర్తించాను, వారి శ్రీమతమును అనుసరించాను. ఆ తర్వాత సమర్పణయ్యాను. సమర్పితమైన తర్వాత ఆత్మకు విల్ పవర్(సంకల్ప శక్తి) తప్పకుండా వస్తుంది. బాబా తమ జీవితాన్ని సమర్పణ చేయడాన్ని నేను నా కనులారా చూచాను. బాబాతో పాటు కొన్ని పరివారాలు కూడా తమ జీవితాలను సమర్పించారు. ఆ సమయంలో యజ్ఞ స్థాపన అవుతూ ఉండేది. అది ప్రారంభ సమయము. యజ్ఞములో బాబాతో పాటు పిల్లలు కూడా కావాలి, బ్రాహ్మణులు కూడా కావాలి. బాబా చాలా పెద్ద యజ్ఞాన్ని రచించారు. రాజస్వ అశ్వమేధ అవినాశి రుద్ర గీతా  జ్ఞాన యజ్ఞములో అందరూ సమర్పితమయ్యారు. ఆ స్థూల యజ్ఞములో స్థూల వస్తువులను సమర్పిస్తారు. ఈ జ్ఞాన-యజ్ఞములో అందరూ తమ జీవితాలను సమర్పణ చేశారు. బాబా దీనిని యజ్ఞమనే కాక విద్యాలయమని కూడా అన్నారు. ఎందుకంటే యజ్ఞ స్థాపన ద్వారా జన్మ కూడా జరిగింది, దానితో పాటు చదువు కూడా ప్రారంభమయ్యింది. మీకు నిశ్చయమైన వెంటనే మీ చదువు కూడా ప్రారంభమైపోతుంది. తండ్రి, టీచరు, సద్గురువు ఈ మూడు సంబంధాలు ఒకేసారి జోడింపబడతాయి. పరమాత్మయే మన సత్యమైన తండ్రి, సత్యమైన టీచరు, సత్యమైన గురువుగా అవుతారు. ఎవరైతే ఇది పూర్తిగా గుర్తిస్తారో వారు తమ జీవితాన్ని సమర్పణ చేయకుండా ఉండలేరు.

## ఎక్కడ ఉండినా బ్రాహ్మణ రూపము మరియు స్వరూపములోనే ఉండండి

నేను మారిషస్‌కు పోయినప్పుడు అక్కడ నేను కొంతమంది కుమారీలను చూచాను. సెంటర్లో ఉంటూ సర్వీసు కూడా(ఉద్యోగము) చేస్తున్నారు. నేను వారితో మీకు లౌకిక బంధనములేవీ  లేవు కదా, తల్లి, తండ్రి, సోదరుల బంధనమేమైనా ఉందా? అని అడిగాను. అందుకు వారు మాకు ఏ



బంధనాలు లేవని చెప్పారు. అప్పుడు నేను మీకు ఏ బంధనాలు లేవు, సెంటర్లోనే ఉన్నారు, మీ పూర్తి సమయాన్ని ఈశ్వరీయ సేవలో ఎందుకు ఇవ్వరాదు? అని అడిగాను. ఆఫీసుకు పోవునప్పుడు రంగు దుస్తులు ధరించి వెళ్లేవారు. మీరు ఆఫీసుకు రంగు దుస్తులు ధరించి పోయేందుకు బదులు తెలుపు వస్త్రాలు ధరించి ఎందుకెళ్లరాదు? ఈ తెల్ల వస్త్రాలతో మీకు చాలా గౌరవము లభిస్తుంది. శ్వేత వస్త్రాలు ధరించి ఆఫీసుకు వెళ్తే మీకు ఏమైనా నష్టమా? అని అడిగాను. అందుకు వారు శ్వేత వస్త్రాలు ధరిస్తే, బ్రహ్మాకుమారీలు వచ్చారు చూడండని హేళన చేస్తారు అని చెప్పారు. మనలో నిశ్చయ లోపముంటే ఆఫీసులోని వారు ఏమంటారో అని భయమేస్తుంది అని అన్నాను. అరే, ఒకవేళ మనలో ఈశ్వరీయ నశా, అలౌకిక నశా, మేము మానవ సృష్టికి పితామహులైన ప్రజాపిత బ్రహ్మా పిల్లలమనే నిశ్చయముంటే వారికి హేళన చేసే ధైర్యమెక్కడుంటుంది. వారికి వీరు దేవీలు, ఫరిస్తాలు అని సాక్షాత్కారమవుతుంది. మనమే బలహీన సంకల్పాలు చేస్తూ ఉంటే మన సేవ సఫలమెలా అవుతుంది? మీరు ముందే బలహీన సంకల్పాలను ఆహ్వానము చేయకండి. బాబా ఇచ్చిన సంకల్పాలను ధారణ చేయండి. బాబా ఏ సంకల్పాలనిచ్చారు? మీరు ఎవరు? పిల్లలూ, మీరు ఎవరు? ఎవరి సంతానము? సర్వశక్తివంతుల సంతానము. ప్రజాపిత బ్రహ్మా కొడుకులు, కూతుర్లు. ఆదిదేవుని ఆది రచన, ఫరిస్తాలు. మనము ఈ నశాలో, స్మృతిలో ఉంటే మనలను ఎవ్వరూ, ఏమీ అనలేరు. ఈ మాటలు విని ఆ కుమారీలు మేము తెల్ల దుస్తులు ధరిస్తామని చెప్పారు. తర్వాత నేను మధువనానికి వచ్చేశాను. తర్వాత వారు ఆఫీసుకు తెల్ల దుస్తులు ధరించి వెళ్తున్నారా లేదా, అలా పోతూ ఉంటే దాని రిజల్టు ఏమిటి అని అడగడం జరిగింది. తెల్ల దుస్తులు ధరించినందున ఆఫీసులో వారిని చాలా గౌరవంగా చూడసాగారని చెప్పారు. మా పట్ల అందరూ చాలా మధురంగా, స్నేహ పూర్వకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అరే మన శరీరముండేదే సేవార్థము. మనము ఉద్యోగము చేసేదెందుకు? సేవ కొరకు. మనము సమర్పితమవుతే మన శరీరము కూడా సమర్పితమే. మనము ఎక్కడకెళ్లినా సేవార్థమే పోతాము కదా. ఎక్కడున్నా సేవార్థమే ఉంటాము కదా. మనము ఎక్కడ అడుగు పెట్టినా సేవ కొరకే కదా. కనుక మనము మన డ్రస్సు వదిలి కలియుగ డ్రస్సు ఎందుకు ధరించాలి ?

మనము ధనము కొరకు ఉద్యోగము చేస్తున్నామా? ఈశ్వరీయ సేవ కొరకు నౌకరి చేస్తున్నామనే భావముంటే సేవ జరుగుతుంది, సఫలత కూడా లభిస్తుంది. దీని వలన మీ జీవితము ద్వారా ఇతరుల జీవితాలు కూడా బాగుపడ్తాయి.

మనము ఆఫీసుకు గాని, వృత్తి వ్యాపారాలలోకి గాని, ఎక్కడకు వెళ్లినా మన వృత్తిలో ఏముండాలి? మన వృత్తి ఎలా ఉంటుందో, దృష్టి అలా ఉంటుంది. మన కొరకు సృష్టి కూడా అలాగే ఉంటుంది. మన వృత్తి -దృష్టి పరివర్తన చెందాలి. ఎందుకంటే మనము సమర్పణైనవారము. భలే మనము ఇంటిలో కూర్చుని ఉండినా, మన వృత్తి(భావము)లో ఏముంటుంది? ఈ ఇల్లు బాబాది, ఈ గది బాబాది. ఇంటికి ఎవరు వచ్చినా, బాబా చిత్రాలు చూచి జ్ఞానము అర్థం చేసుకుంటారు. బాబా గదిలో కూర్చుని బాబాను స్మృతి చేస్తారు. దీని వలన ఏమి జరిగింది? సేవ జరిగింది కదా! దీని వలన ఇంటి వాతావరణము మారిపోయింది కదా! మీ వృత్తి-దృష్టి పరివర్తనైనందున మీ ఇల్లే మారిపోయింది. వాయుమండలమే మారిపోయింది. దీనినే గృహస్థాశ్రమమని అంటారు. బాబా కూడా అన్నారు - జ్ఞానములో ఇటువంటి కమలపుష్ప సమానంగా, న్యారా-ప్యారాగా, పవిత్రంగా సమర్పితమైన పరివారాలు కూడా ఉన్నాయి. ఈ పరివారాలను కర్మ బంధన పరివారాలని అనరు, సమర్పిత పరివారాలని అంటారు. ఎందుకంటే వీరు తమ సర్వస్వాన్ని బాబా ముందు సమర్పితము చేసేశారు. ఇటువంటి పరివారాన్ని నేను లండన్‌లో చూచాను, అక్కడ అందరూ తమ ఇళ్లలో బాబా గదిని తయారుచేసుకొని ఉన్నారు. ప్రతి రోజూ సాయంకాలము ఇంటిలోని వారందరూ బాబా గదికి వెళ్లి యోగము చేస్తారు. ఇదేమైనా సామాన్య విషయమా? పరివారము, పరివారమే బాబా వారిగా అయ్యారు. వారు ప్రవృత్తిలో ఉంటున్నా, నౌకరి, వృత్తి - వ్యాపారాదులు చేస్తున్నా ఇదంతా బాబాదే అని భావిస్తారు. మేమందరమూ బాబావారమే, మా పిల్లలు కూడా బాబా వారే, మా వ్యాపారము కూడా బాబాదే అని భావిస్తారు. ఇటువంటి భావన ఉన్నప్పుడు వారిని గృహస్థులని అంటామా? ట్రస్టీలు కదా! సమర్పితులు కదా! ఇటువంటి బాబా పిల్లలకు కర్మ బంధనాలు ఎక్కడుంటాయి? వారు నిర్బంధన, సమర్పిత పిల్లలు కదా! దీనినే తెంచి వేయడం అని అంటారు.

ఇది తెంచడం, మల్చడం కూడా అయ్యింది. అదే పరివారమే, అదే



వ్యాపారమే కాని లౌకిక సంబంధాలను తెంచేశారు, అలౌకిక సంబంధాన్ని జోడించారు. పరివారమేమో అదే కాని అందరి దృష్టి-వృత్తి-వ్యవహారాలు మొదలైనవి మారిపోయాయి కదా! లౌకికత నుండి అలౌకికతలోకి వచ్చేశారు కదా! బాబా ఎలా చేశారో పిల్లలు కూడా అలాగే చేశారు. నేను మొదట లౌకికములో కూడా బాబా ఇంటికి వెళ్లేదానిని. బాబా మొత్తం ఇంటినే మార్చేశారు. అందరికంటే ముందు బాబా తమ పరివారమునే మార్చేశారు కదా. 'నాది' అను దానిని 'నీది' లోకి మార్చేశారు. బాబాలో ఎంత విల్-పవర్ ఉందో చూడండి. బాబా(బ్రహ్మ) తనదంతా తెంచుకొని బాబా(శివబాబా)తో జోడించారు, కనుకనే సహస్ర భుజాల బ్రహ్మగా అయ్యారు! విశ్వ పరివర్తన సేవలో పిల్లలంతా బాబాకు కుడిభుజాలుగా ఉన్నారు. శరీరము-మనసు-ధనము అన్నీ సేవలో సమర్పితము చేస్తున్నారు. ఎవరైతే స్వయాన్ని పరివర్తన చేసుకుంటారో, వారే అందరినీ పరివర్తన చేయగలరు. వారి శ్రేష్ఠ సంకల్పాలు, వారి శ్రేష్ఠ వృత్తి, కర్మల వైబ్రేషన్లు విశ్వమంతటా వ్యాపిస్తున్నాయి. వారు ఇతరులను కూడా పరివర్తన చేస్తున్నారు. ఇదే సమర్పిత జీవితానికి గల మహత్యము.

## మీరు చేయు కర్మలకు మీరే బాధ్యులు, ఇతరులు కాదు

కొంతమంది మాతలు, కన్యలు బాబా వద్దకు వచ్చి బాబా, మా లౌకిక పరివారమువారు 'మాకు సహయోగమివ్వడం లేదు" అని చెప్తారు. మీ లౌకికము వారు మీకు సహయోగమివ్వడం లేదంటే అది మీ బలహీనత. మీరు బలహీనంగా ఉన్నారు, శక్తిశాలిగా లేరని అర్థము. కొంతమంది కుమారులు కూడా వచ్చి " బాబా మా లౌకిక తండ్రి నాకు వివాహము చేయాలనుకుంటున్నాడు, నేనేమి చేయాలి? " అని అడుగుతారు. అరే, వివాహము నీకా ? మీ తండ్రికా? చేసుకునేది నీవైతే చేసుకోవాలా లేదా అనునది నీకు తెలియదా? నీకు జ్ఞానము లేదా? నీ ఇష్టము. పెళ్లి చేసుకోవడం మానేయడంలో లాభముందని నీవనుకుంటే ఆ లాభము గురించి మీ తండ్రికి తెలుపు. బాబాను, దాదీలను అడుగుతున్నావంటే నీవు బలహీనంగా ఉన్నావని అర్థము. అదే ఎవరైనా కన్యలు వచ్చి నా తల్లిదండ్రులు నాకు వివాహము చేయాలనుకుంటున్నారని అడిగితే, ఆ కుమారీలకు ఏమేం చేయాలో నేను వారికి చాలా యుక్తులు తెలిపించాను.

జీవితము నీదా? వారిదా? భ్రష్ట కర్మలెవరు చేస్తారో వారే అనుభవించాలి కదా. శ్రేష్ఠ కర్మలు చేయువారే దాని ఫలితాన్ని ప్రాప్తి చేసుకుంటారు. ఈ కర్మల రహస్యాన్ని అర్థము చేసుకున్నావంటే మరి శ్రేష్ఠ కర్మలే చేయాలి కదా. నీవు చేయు కర్మలకు బాధ్యత నీవే కదా. కనుక ఇతరుల మాటలు విని చెడు కర్మలకు మనమెందుకు భాగస్థులుగా అవ్వాలి? ఇప్పుడు మనకు శ్రేష్ఠ కర్మలు చేసే జ్ఞానము తెలిసింది. కనుక మనము శ్రేష్ఠ కర్మలే చేయాలి. మేకలుగా అవ్వరాదు, పులులుగా అవ్వాలి.

## బ్రహ్మాబాబా ఎలా చేశారో, అలా చేస్తూ పోండి

అలాగే ప్రవృత్తి మార్గములోని వారు కూడా - లోకమర్యాదలు, కులమర్యాదలకు భయపడి బాబా వద్దకు వచ్చి “ నేనేమి చేయాలి? ” బాబా అని అడుగుతారు. అరే, సోదరా ! ఏమి చేయాలో నీకు బాగా తెలుసు కదా. ఈ సమాజాన్ని నీవే బాగు చేయాలని బాబా చెప్తారు కదా. సమాజాన్ని బాగు చేసేందుకు ముందు మిమ్ములను మీరు, మీ పరివారాన్ని బాగు చేసుకోవాలి. మంచిగా ఎలా తయారు చేయాలి? ఇది కూడా బాబా తెలిపించారు. ఆ సమాజంలో ఏ విషయాల ద్వారా నష్టం జరుగుతూ ఉందో దానిని మీరు చూస్తూ ఉన్నారు. మళ్లీ నేనేం చేయాలి అని అడుగుతున్నావు. ఒకవేళ అలాగే చేస్తూ పోతే సమాజాన్ని బాగు చేస్తున్నట్లా, ఇంకా చెడగొడుతున్నట్లా? బాబా ముందు కూడా సామాజిక, సంబంధాల, పిల్లల సమస్యలు వచ్చాయి కదా! బాబా నిశ్చయ బుద్ధితో, తమ సమర్థ జీవితముతో, దృఢ సంకల్పముతో అందరినీ పరివర్తన చేసేశారు. నిశ్చలంగా, స్తబ్ధముగా, ఏకరస స్థితిలో ఉండినారు. బాబా స్మృతిలో సదా నేను ఎవరివాడను? అనేదే ఉండేది. ఈ విశ్వ పరివర్తన కార్యము ఎవరిది? సంకల్పమెవరిది? ఈ స్మృతి ఎవరు ఇప్పించారు? నాదంటూ ఏమీ లేదు. నేను నా సర్వస్వాన్ని శివబాబాకు అర్పణ చేసేశాను. కనుక నేను శివబాబా సంకల్పాలను, మాటలను మరియు కర్మలనే అమలుపరచాలి. ఏవైతే శివబాబావియో నావి కూడా అవే.

శివబాబా సంకల్పమేదో వారి చదువు ద్వారా తెలుస్తుంది. శివబాబా బ్రహ్మాబాబాకు ఏ జ్ఞానమునిస్తున్నారో, నాకు కూడా దానినే ఇస్తున్నారు. ఎందుకంటే నేను కూడా బ్రహ్మాబాబా వలె శివబాబా సన్ముఖములో సమర్పితమయ్యాను.



శివబాబా సంకల్పమే నా సంకల్పము. నాకు వేరే సంకల్పము ఉండనే ఉండరాదు. నాకు వేరే స్మృతి కూడా ఉండరాదు. శివబాబా కలిగించిన స్మృతియే నా స్మృతి. బ్రహ్మాబాబా సంకల్పము, స్మృతియే నా సంకల్పము, నా స్మృతి. సాకార బాబా సంకల్పమేది? తండ్రి-దాదా(బాప్-దాదా) సదా కంబైండుగా ఉన్నారు. మనము కూడా శివశక్తులము, సదా కంబైండ్‌గా ఉండాలి. మనము కూడా తక్కువేమీ కాదు. వారిరువురు ఎప్పుడూ విడిపోరు, మరి మనమెందుకు విడిపోవాలి? శివశక్తుల స్మృతి-చిహ్నము కూడా ఉంది. కాళిక ఎవరు? దుర్గ ఎవరు? వీరంతా శివశక్తులే కదా. శివుని జతలో కంబైండుగా ఉన్న శక్తులు. అందుకే గాయన, పూజా యోగ్యులుగా అయ్యారు.

## సదా నేను చేసే తీరాలి, నేను పరివర్తనయ్యే తీరాలి అను లక్ష్యముంచుకోండి

లౌకిక భక్తిమార్గములో ఇరువురి ముందు బలి ఇస్తారు. ఒకటి శివునికి, రెండవది కాళికా దేవికి. ఆత్మలు ఎప్పుడైతే యోగయుక్తంగా అవుతారో అప్పుడు ఆ ఆత్మలు స్వయం వారసులై, ఇతరులను కూడా వారసులుగా చేసేస్తారు. కాళికా దేవి తన సర్వస్వము శివునికి బలి ఇచ్చేసింది అందువలన అందరూ ఆమె ముందు బలి ఇస్తారు. ఎప్పుడైతే మనము మన సర్వస్వము బాబాకు బలి ఇస్తామో అప్పుడే భక్తులు మన ముందు బలి ఇస్తారు. అందువలన మొదట మనము చేయాలి, మనము పరివర్తనవ్వాలి. బాబా ముందు మనము “ నేను - నేను నాది- నాది” రూపములోని దేహాభిమానమనే మేకను బలి ఇవ్వాలి. అప్పుడే భక్తిమార్గంలో మన స్మృతి-చిహ్నము తయారవుతుంది. అందుకే బాబా పిల్లలైన మీరందరూ శివశక్తులు అని చెప్తారు. శివశక్తులనగా కేవలం సోదరీలే కాదు. శక్తి అనగా ఆత్మ. ఏ ఆత్మ అయితే శివబాబాతో సంబంధము జోడించి శక్తి తీసుకుంటుందో, ఆ ఆత్మయే శివశక్తి. కనుక సోదరుడు కాని, సోదరి కాని అందరూ శివశక్తులే. ఏ ఆత్మ అయితే స్వయాన్ని శివశక్తిగా భావిస్తుందో ఆ ఆత్మ తన కర్మబంధనాలను తెంచుకుంటుంది. తనను తాను మలుచుకుంటుంది. స్వయాన్ని పరివర్తన చేసుకొని మలుచుకున్నప్పుడే ప్రపంచము పరివర్తనైపోతుంది.

## అవ్యక్త స్థితి

మీరందరూ శివరాత్రి పండుగను బాబా జతలో జరుపుకున్నారు. మనసుతో, శరీరముతో కూడా జరుపుకున్నారు. ఎందుకంటే బాబాతో పిల్లలైన మన సంబంధము గాఢమైనది. బాబా సత్యమైనవారు, సుందరమైనవారు, సుప్రీమ్ పవర్. అందుకే వారిని సత్యం-శివం-సుందురం అని అంటారు. వారి సంబంధము ద్వారా ఆత్మలైన మనము కూడా వారి వంటి పిల్లలుగా అయిపోతాము. బాబా మన జతలో జెండా ఎగురవేశారు. ఆత్మిక సంభాషణ చేశారు. బాబాతో మనకు చాలా సమీప సంబంధముందని అనిపించింది. బాబాతో ఎంత గాఢమైన సంబంధముంటుందో అంత మన బుద్ధి దివ్యంగా అవుతుంది. ఎందుకంటే బుద్ధి సదా బాబాతో జోడింపబడి ఉంటుంది. దివ్యబుద్ధి ద్వారానే శ్రేష్ఠ స్మృతి, శ్రేష్ఠ కర్మలు జరుగుతాయి. ఆత్మిక స్థితి స్థిరంగా ఉంటుంది. బాబాతో మన సంబంధము ఎంత గాఢమైనదంటే వారి నుండి మనము పూర్తి వారసత్వాన్ని తీసుకుంటాము. బాబా అవ్యక్తముగా ఉన్నారు. మనము పాత్ర చేసేందుకు వ్యక్తములోకి వచ్చాము. మనము కూడా అవ్యక్తమే. బాబా కూడా జ్యోతిర్బిందు స్వరూపమే. ఆత్మలైన మనము కూడా జ్యోతిర్బిందు స్వరూపులమే. ఇరువురు అవ్యక్తమే కదా. కాని పాత్ర చేస్తూ - చేస్తూ మనము వ్యక్త భావములోకి వచ్చేశాము. బాబా వచ్చి పిల్లలైన మనము వారి నుండి ఎంత దూరమైపోయామో స్మృతినిప్పించారు. అవ్యక్తమెక్కడ? వ్యక్తమెక్కడ? నా పిల్లల బుద్ధి నా నుండి ఎంత దూరమైపోయిందంటే నాతో జోడింపబడలేకున్నది. మనలను స్మృతి స్వరూపులుగా చేసేందుకు తండ్రి రావలసి వచ్చింది. అందుకే మనము శివరాత్రి పండుగను ఆచరిస్తాము. బాబా వచ్చి మనలను తమ వలె చేస్తున్నారు అనగా మన జీవితాలను కూడా అవ్యక్తంగా చేసేందుకు బాబా వచ్చారు, అవతరించారు. ఇప్పుడు బాబా చెప్తున్నారు - నా వలె మీరు కూడా అవతరించండి.

### మన జన్మ దివ్యమైన అవ్యక్త భావ జన్మ

నాతో పాటు ఈ రోజు మీ అందరి అలౌకిక జన్మదినము అని బాబా చెప్పారు. బాబాతో పాటు మనకు నూతన అలౌకిక జన్మ జరిగింది. ఎప్పుడైతే మనము బాబాను తెలుసుకున్నామో, గుర్తించామో అప్పుడది మనకు అలౌకిక



జన్మ అయ్యింది. ఎలా నాది అలౌకిక దివ్యజన్మ అని బాబా చెప్తారో అలా పిల్లలైన మన జన్మ కూడా అలౌకికమైన మరియు దివ్యమైనది. ఇది మన పవిత్రమైన జన్మ, వ్యక్త భావ జన్మ కాదు. బాబాను తెలుసుకున్నాము, గుర్తించాము, తర్వాత మన జీవితము బాబాకు సమర్పితం చేశాము. అయితే ఇప్పుడు బాబా ముందు మనం ఏమేమి సమర్పించాము? అనే ప్రశ్న వస్తుంది. ఇంతవరకు బాబా మనతో ప్రతిజ్ఞ చేయిస్తున్నారు, దృఢ నిశ్చయము చేయిస్తున్నారు - పిల్లలూ, ఇది చేయండి, ఇలా చేయండి అంటే ఇంకా మనము సమర్పణ కాలేదని అర్థమవుతుంది. ఎంతవరకు మనము బాబా ముందు మన సర్వస్వాన్ని సమర్పణ చెయ్యలేదో అంతవరకు అవ్యక్త స్థితి తయారవ్వదు.

బాబా కూడా - తానెవరో, ఎలా ఉన్నారో ఏ రూపము కలిగి ఉన్నానో స్వయంగా చెప్తున్నారు. బాబా తమ వాస్తవ స్వరూపాన్ని స్వయంగా తెలియచేస్తున్నారు. బాబా, తాను జ్ఞాన సాగరులని, ప్రేమ సాగరులని, ఆనంద సాగరులని, జ్యోతిర్బిందువని తన పరిచయాన్ని స్వయంగా ఇస్తున్నారు. బాబాను మనము కూడా తెలుసుకున్నాము, గుర్తించాము. బాబా నా వారని గ్రహించాము. మన బుద్ధి బాబా వైపుకు వెళ్ళిపోయింది. మన బ్యాటరి ఛార్జి కావడం మొదలయింది. నేను ఎవరో, ఎలా ఉన్నానో అలా నేను నా పరిచయమునిచ్చాను. అలా మీరు కూడా ఎలా ఉన్నారో మిమ్ములను గురించి పూర్తిగా తెలుసుకోండి. మీరు కూడా మీ అసలు స్వరూపాన్ని అనగా నేను ఎవరు? అనునది తెలుసుకోండి. ఎప్పుడైతే స్వయాన్ని తెలుసుకుంటామో, బాబాను తెలుసుకుంటామో అప్పుడే బాబాతో మనకు గాఢమైన సంబంధము ఏర్పడుతుంది. ఒకటి నా బాబా అని నోటితో చెప్పడం, రెండవది మనస్ఫూర్తిగా మనస్సుతో నా బాబా అని అనుభవము చేయడం. బాబాను నావారిగా చేసుకుంటే ఇక అక్కడ నా వారెవ్వరూ లేరు. నాకు ఉండేది ఒక్కరే, ఇతరులెవ్వరూ లేరు. ఇప్పుడు ప్రాక్టికల్‌గా ఇటువంటి సంబంధము జోడించామా ? తెలపండి. మనము స్వయాన్ని మరియు బాబాను పూర్తిగా, యదార్థముగా తెలుసుకున్నప్పుడే ఇటువంటి సంబంధాన్ని జోడించగలము.

### మన తండ్రి ఎలా ఉన్నారో పిల్లలమైన మనము కూడా అలాగే ఉన్నాము

మొదట, మాకు మనశ్శాంతి కావాలని అనేవారము. ఇప్పుడు శాంతి

సాగరులే మన సాథీ(జతగాడి)గా అయ్యారు. నేను కూడా శాంతిగా ఉన్నాను, నా మనసు కూడా శాంతిగా ఉంది. ఎవరి జతలో మనమంతా సంబంధము జోడించాము! ఎవరి సాంగత్యములో ఉంటామో అటువంటి రంగు లభిస్తుంది. మన తండ్రి అనంతమైనవారు. మనమంతా వారి జతలో సంబంధాన్ని జోడించాము. మొదట స్వయాన్ని ప్రశ్నించుకోండి "తండ్రి సంస్కారాలు నా సంస్కారాలుగా అవుతున్నాయా? మన సంబంధము ఎంత లోతుగా ఉంటుందో అంత మన సంస్కారము తండ్రి సమానంగా అవుతూ పోతుంది. ఇది స్వయానికి కూడా అనుభవమవుతుంది, ఇతరులకు కూడా కనిపిస్తుంది. మనము ప్రభువుకు, లోకులకు కూడా ఇష్టులుగా(ప్రభుపసంద్, లోక్‌పసంద్) అవుతాము. భగవంతునితో మనకు తండ్రీ-పిల్లల సంబంధము ఏర్పడింది. కొంతమంది ఈ కొడుకు తండ్రిని మించిపోయాడని అంటారు కదా.

మన తండ్రి బేహద్ తండ్రి. కనుక మనలో కూడా బేహద్ సంస్కారాలు రావడం ప్రారంభమయ్యాయా? అని గమనించుకోవాలి. హద్దు సంస్కారాలు ఎంతవరకు తెగిపోతున్నాయి? మొట్టమొదట బాబాతో మనకు సాథీ సంబంధముంది. ఎవరు సాథీగా ఉంటారో, వారు స్వభావములో, సంకల్పములో, సంస్కారములో అన్నిటిలో సాథీలుగానే ఉంటారు. బాబా మనకు సత్యమైన సాథీ. శరీర సంబంధము వ్యక్త భావానిది. కాని బాబాకు శరీరమే లేదు. కనుక మనము వ్యక్త భావము నుండి వేరై అవ్యక్త భావము ద్వారా బాబాతో సంబంధాన్ని జోడించాలి. ఎలాగైతే బాబా అవ్యక్తంగా, అనంతంగా ఉన్నారో, అలా మనలో కూడా ఎంతవరకు అవ్యక్త భావము, అనంత భావము వచ్చింది? బాబా సదా "ఫాలో ఫాదర్" అని చెప్తారు. బాబా అయితే నిరాకారుడు. కనుక వారు సాకారములో స్యాంపుల్(నమూనా)గా బ్రహ్మబాబాను ఇచ్చారు. మనము ఎవరిని చూచి అనుసరించాలి? మన ఎదుట ఉదాహరణముండాలి. తండ్రి సమానంగా అయ్యేందుకు తండ్రి మన ఎదుటనే ఉండాలి. వారే బ్రహ్మబాబా. వారిని ప్రజాపిత అని అంటారు. ఆత్మల తండ్రి శివబాబా. సాకారములో పాత్ర చేసేందుకు బ్రహ్మబాబాలో వచ్చారు. బ్రహ్మబాబా సెకెండులో శివబాబాను గుర్తించి సర్వస్వాన్ని శివబాబాకు ఎలా సమర్పణ చేశారో మేము చూశాము. లౌకికములో కూడా మేము బ్రహ్మబాబా ఇంటికి వెళ్లేవారము. వారు మాకు లౌకిక బంధువులు కూడా.



శివబాబావారిగా అయిన తర్వాత బ్రహ్మబాబాలో మేము ఎప్పుడూ లౌకికతను చూడనే లేదు.

## బాబా చాలా నిరహంకారులుగా ఉండేవారు

శివబాబా చెప్తున్నారు - నేను పతిత ప్రపంచములో, పతిత శరీరములో ప్రవేశించాను. కాని మాకు బ్రహ్మబాబా శరీరము పతితమైనదని అనుభవమే అవ్వలేదు. అంతేకాక సాధారణ శరీరమని కూడా అనిపించలేదు. జ్ఞానములోకి వచ్చిన తర్వాత మేము కూడా పరివర్తనౌతూ ఉన్నాము, కాని నెమ్మది నెమ్మదిగా అవుతున్నాము. బాబా ఒక్క సెకండులో పరివర్తనైపోయారు కాని మేము నెమ్మది నెమ్మదిగా పరివర్తనవుతూ ఉన్నాము. బాబాలోని ఏ విశేషతను చూచి మేము కూడా ధారణ చేయాలని మాకు అనిపించింది? బాబా సర్వ సమర్పితమవ్వడం మేము ప్రాక్టికల్‌గా చూశాము. మొదటిది సమర్పణమవ్వడం, రెండవది సర్వ(సంపూర్ణ) సమర్పణమవ్వడం. బాబా తమ కొరకు ఏమీ ఉంచుకోలేదు. బాబా కేవలం శరీరంతో సమర్పణ కాలేదు, శరీరముతో పాటు శివబాబాకు ఆజ్ఞాకారిగా, విశ్వాసపాత్రునిగా, నమ్మకస్థునిగా తయారై నడుచుకున్నారు. శివబాబా బాబా(బ్రహ్మ) తల పై నీవు విశ్వ పరివర్తన చేయాలి, ఆది సనాతన దేవీదేవతా ధర్మస్థాపన చేయాలి అనే చాలా గొప్ప బాధ్యతను ఉంచారు. కాని సాకారబాబా విశ్వసేవాధారి(వరల్డ్ సర్వంట్) పాత్రను చేశారు. తమ శరీరాన్ని సర్వశక్తివంతులకు సమర్పించినా వారిలో ఏ మాత్రము అహంకారము గాని, అభిమానము గాని రాలేదు. సదా స్వయాన్ని విశ్వసేవాధారిగా భావించారు. తమతో పాటు తమ పిల్లలను, పత్నిని అందరినీ శివబాబాకు సమర్పణ చేసేశారు. విశ్వ సేవలో నిమగ్నమైనప్పుడు తమ స్వభావ - సంస్కారాలన్నింటిని ఒక్కసారిగా సమర్పణ చేసేశారు. మాకు మరియు బాబాకు ఈ వ్యత్యాసము కనిపించింది. మేము చదువుకుంటూ ఉన్నాము, ఈ రోజు వరకు పరివర్తన అవుతూనే ఉన్నాము. కాని పరివర్తనయ్యేందుకు బాబాకు సమయము పట్టలేదు. అన్ని హద్దులను ఒక్కసారిగా సమాప్తము చేసేశారు. పరివారములోని హద్దులను కూడా సమాప్తము చేసేశారు. స్వంత శరీరము పై ఆసక్తిని కూడా పూర్తిగా సమాప్తం చేసేశారు. శరీరము పై మమకారాన్ని అనుభవము చేస్తే మనకు లౌకికత అనుభవమౌతుంది. స్వయం శరీరము నుండి వేరై పాత శరీరాన్ని పూర్తిగా

మర్చిపోయారు. శివబాబాను గుర్తిస్తూనే పూర్తిగా ఆజ్ఞాకారి పాత్రను అభినయించారు. బాబా ఏమి ఆజ్ఞాపించినా నిశ్చయముతో, నిర్భయంగా దానిని పాలించారు. ఒక నమ్మకమైన పత్ని వలె సాకారబాబా శివబాబాకు నమ్మకముగా, ఆజ్ఞాకారిగా ఉండినారు. బాబా స్వయాన్ని శివబాబాకు కొడుకుగా, పత్ని(వన్నీ)గా భావించారు. అంతేకాక విద్యార్థిగా కూడా భావించారు. స్వయం నిమిత్తమని కూడా భావించారు. మాతలకు వారు చేయని సహాయమంటూ లేదు. మా లౌకిక తల్లి చాలా దు:ఖములో ఉండేది. ఆమెకు ఒకే కొడుకు, ఆ కొడుకు శరీరము వదిలేశాడు. అందువలన మా తల్లి చాలా దు:ఖములో ఉందని మేము బాబాకు తెలిపాము. వెంటనే బాబా, నేను కూడా నీతో వస్తాను పద అని బయలుదేరారు. ఎంతో నిరహంకారముగా మాతో వచ్చి మా తల్లి వద్ద కూర్చుని ఆమెను ఓదార్చి జ్ఞానమిచ్చారు.

వారిలో ఎవరున్నారో చూడండి, ఎవరు పాత్ర చేస్తున్నారు?! ఆ శరీరములో శివబాబా కూర్చుని ఉన్నారు. ఎంత నిరహంకారులో చూడండి, ఇంటికి వచ్చి మాతల సేవ చేశారు. వారు సుఖదాత అయినందున సుఖమునిస్తారు. నా వలన అందరికీ సుఖము లభించాలి, అందరి దు:ఖము, బాధలు సమాప్తమైపోవాలని వారి మనసులో సదా ఉంటుంది. శివబాబా నన్ను సుఖమయ ప్రపంచాన్ని తయారు చేసేందుకు నిమిత్తము చేశారని సదా భావించేవారు. మనుష్యులే సుఖంగా లేకుంటే సుఖమయ ప్రపంచము ఎలా తయారౌతుంది? బ్రహ్మాబాబా పూర్తి నిరహంకారతతో సేవా పాత్రను అభినయించారు. కేవలం నిరహంకారతే కాదు అధికారముతో కూడా సేవ చేశారు. నూతన జ్ఞానాన్ని అధికారముతో అర్థము చేయించారు, నిశ్చయముతో అర్థం చేయించారు, అనుభవముతో అర్థం చేయించారు. ఈ జ్ఞానము ఇతరులెవ్వరిలోనూ లేదనే నషా బాబాలో ఉండేది. బాబా లౌకికములో, భక్తిలో, వ్యాపారములో కూడా చాలా అనుభవీలు. బాబా నూతన జ్ఞానమునిచ్చి అందరినీ పరివర్తన చేసేశారు. కేవలం ఆత్మ అనే నిశ్చయముంటే ఆత్మలో నిర్భయతా శక్తి వచ్చేస్తుంది. మనము ఆత్మను మర్చిపోయాము కదా. బాబా ప్రతిరోజూ ఓంధ్వని రూపంలో దీనినే గర్జన చేసి గట్టి చేశారు. 'ఓం' అర్థమేమిటో తెలుసా? అని అడిగేవారు. నేను ఆత్మను, శాంతి స్వరూపాన్ని, ప్రేమ స్వరూపాన్ని, ఆనంద



స్వరూపాన్ని అని వివరించేవారు. ప్రారంభములో ప్రతి రోజు ఆత్మ పాఠము చదివించారు కాని ఈ రోజు వరకు కూడా అదే పాఠాన్ని చదివిస్తున్నారు. ఇదే శ్రేష్ఠ స్మృతి అని, దీని ద్వారానే విశ్వములో పరివర్తన వస్తుందని బాబా చెప్పేవారు. బాబాలో నిరహంకారతతో పాటు నేను విశ్వ సేవకు నిమిత్తమయ్యాననే నషా కూడా ఉండేది. శివబాబా ఆజ్ఞాపించారు, మేము కాకుంటే ఇంకెవరౌతారు అనే నిశ్చయము కూడా ఉండేది. **"స్వ పరివర్తన ద్వారా విశ్వ పరివర్తన"** అను మాట బాబా హృదయంలో నాటుకొని పోయింది. అందుకే బాబా తమ పరివారమును అంతటిని సమర్పణ చేసేశారు. జ్ఞానములోకి ఎవరు రాలేదో వారిని గురించి తండ్రి మాట వినని కొడుకు కొడుకే కాదు, కూతురు కూతురే కాదు అని చెప్పేవారు. బాబా సత్యమును నిర్భయంగా చెప్పి చేసి చూపించారు.

## బాబా ఫస్ట్‌గా ఎందుకు అయ్యారు ?

బాబా ఓపన్‌గా - మీరేమో శాంతి శాంతి అని అంటూ ఉంటారు కాని ఆ శాంతి, సుఖము కొరకు పవిత్రత తప్పనిసరి అని చెప్పేవారు. ఎంతవరకు ఆత్మ పవిత్రమవ్వదో అంతవరకు ఎవ్వరికీ సుఖ-శాంతులు లభించనే లభించవు. మొదటిది ప్యూరిటీ(పవిత్రత) అని చెప్పేవారు. మనస్సు, మాట, కర్మ, అన్నము, సంబంధ-సంపర్కాలలో కూడా పవిత్రత అవసరము. ఇదే ప్రాక్టికల్ పవిత్రత. ఆత్మలైన మీరు అనాదిలో శుద్ధమైనవారు, పవిత్రమైనవారు, అవినాశి అని పక్కాగా స్మృతినిప్పించారు. బాబా స్వయాన్ని ఎంత పక్కాగా చేసుకున్నారో, అంత మమ్ములను కూడా తమ అనుభవాన్ని వినిపించి పక్కాగా తయారు చేస్తూ వచ్చారు. బాబా బాత్‌రూమ్‌కు వెళ్లినప్పుడు కూడా స్వయాన్ని ఆత్మగా భావిస్తానని మాకు చెప్పేవాడు. ఈ శరీరము శివబాబా రథము, వారికి సమర్పణ చేశానని, దీనికి నేను స్నానము చేయిస్తున్నానని భావించేవారు. నేను భోజనము చేయునప్పుడు బాబాను జతలో ఉంచుకుంటానని చెప్పేవారు. వారు నా జతగాడు కదా, పతి కదా, మొదట వారికి తినిపించి తర్వాత వారి జతలో నేను తింటాను. ఎలా వారిలో ఏ ఏ సంకల్పాలు వచ్చేవో అలా చేస్తూ పోయేవారు. అవన్నీ మాకు కూడా అలాగే తెలుపుతూ పోయారు. మేము విన్నప్పుడు మాలో కూడా ఉత్సాహము కలిగి మేము కూడా అలాగే చేస్తూ పోయాము. బాబా తమ అనుభవము వినిపించారు కదా! ఆత్మకు అనుభవము కావాలి. ఉపన్యాసమివ్వడం సులభమే.

కాని అనుభవము చేయాలి. బాబా స్వయం అనుభవము చేసి మాకు వినిపించేవారు. అందువలన బాబాతో పాటు అనేక పరివారాలు కూడా ఆ రోజులలో యజ్ఞములో సమర్పితమయ్యారు.

అది స్థూల సమర్పణ, కాని ఈ రోజు వరకు కూడా అందరూ తమ తమ స్వభావ సంస్కారాలను పరివర్తన చేసుకొనుటలోనే నిమగ్నమై ఉన్నారు. సదా చలించని స్థిరమైన ఏకరస స్థితిలో ఉండేందుకు పురుషార్థము చేస్తున్నారు. కేవలం స్థూలంగా సమర్పితమైనందున ఈ స్థితులన్నీ తయారు కావు. సూక్ష్మ సమర్పణ కూడా కావాలి. మనసు-బుద్ధి-సంస్కారాలను కూడా బాబాకు సమర్పితము చేయాలి. ఎవరైతే దేహాభిమానులుగా, దేహాభిమాన బుద్ధి కలిగినవారుగా ఉండి, నేను చాలా చదువుకున్నాను, గొప్ప పండితుడను, నాది చాలా ప్లానింగ్(ప్రణాళికలను తయారు చేయు) బుద్ధి అను ఇటువంటి(అహం) భావనలు కలిగి ఉంటారో వారు వీటిని కూడా సమర్పణ చేయాలి. స్వంత మతము కొద్దిగా కూడా ఉండరాదు. అడుగడుగులో తండ్రి శ్రీమతమును అనుసరించాలి. కాని ఈ రోజు వరకు మన సంకల్పాలలో, కర్మలలో శ్రీమతముతో పాటు మన్మతము కూడా మిక్స్ అవుతూ ఉంది అని నేను గమనిస్తున్నాను. అందుకే మనము వెనుకబడి ఉన్నాము, సంపూర్ణంగా అవ్వలేకున్నాము. బాబా మొదటివారిగా(ప్రథమశ్రేణి) ఎందుకయ్యారు? ఎందుకంటే హద్దు విషయాలన్నిటిని క్షణమాత్రములో సమాప్తము చేసేశారు. ప్రతి అడుగు శ్రీమతము ప్రకారమే నడుచుకున్నారు. ఎవరైతే నెమ్మది నెమ్మదిగా సమర్పణ అవుతారో వారి నంబరు వెనుక వస్తుంది. హద్దులో ఉంటూ బేహద్‌లో తక్కువగా ఉంటే చిన్న పదవి పొందుతారు. మీరు ఇంటిలో ఉండినా, సెంటర్లో ఉండినా ఎప్పుడూ ఏ సంకల్పము, మాట, కర్మ, సంబంధ-సంపర్కాలలో దేహాభిమానము మిక్స్ అవ్వరాదు. ఎంత దేహాభిమానములో ఉంటారో అంత కామ భూతము, క్రోధ భూతము, లోభ భూతము ప్రవేశిస్తాయి. బ్రహ్మాబాబాను చూచినవారంతా, వీరు మా పెద్దవారు(పూర్వీకులు), మా తండ్రి అని అనుభవము చేసేవారు. బాబా ఎవరికి దృష్టినిచ్చినా, ఎదురుగా వచ్చిన ఆ వ్యక్తులు తేలికై ఎగిరిపోయేవారు, అశరీరులైపోయేవారు. తమ శరీరము నుండి వేరుగా అనుభవము చేసేవారు. బాబాలో డబల్ పవర్ ఉండేది. బాబాకు తమ స్వంతమేదీ



ఉండేది కాదు. తమ మనస్సు, బుద్ధిని కూడా స్వంతమని భావించేవారు కాదు. సర్వస్వాన్ని శివబాబాకు సమర్పితము చేసేశారు. వారికి 'నాది' అనేది ఏ మాత్రమూ లేదు. బాబా మనసే నా మనసు. బాబా మనసులో ఏముందో నా మనసులో కూడా అదే ఉంది. బాబా ఇంత సమర్పణ బుద్ధిగలవారుగా ఉండేవారు. ఇదే విధంగా మన సర్వస్వమంతా బేహద్‌లోకి పరివర్తనవ్వాలి. బాబా ముందు కష్టాలు రాలేదా? అన్ని రకాల పరీక్షలూ వచ్చాయి. వ్యతిరేకించారు, వారి భవనానికి నిప్పు పెట్టాలని ప్రయత్నించారు, ఇంతమంది గోపికలను ఎత్తుకెళ్లారని నిందించారు, కరాచి నుండి భారతదేశానికి వచ్చునప్పుడు స్టీమరు ఊగసాగింది, భారతదేశానికి వచ్చిన తర్వాత భికారి(బెగ్గరి) పాత్ర వచ్చింది - ఇంకా అనేక ఆటంకాలు వచ్చాయి. అయినా బాబా చలించక, స్థిరంగా ఏకరస స్థితిలో ఉండినారు. ఎల్లప్పుడూ సత్యంగా, స్థిరంగా ఉండినారు. అన్ని పరీక్షలను నవ్వుతూ నవ్వుతూ దాటుకున్నారు. సదా బేహద్‌లో ఉండినారు. నాదంటూ ఏమీ లేదు, అంతా వారిదే, వారే కాపాడుకుంటారు. నేను కేవలం నిమిత్తంగా ఉన్న సేవాధారిని. బాబా మొదట నుండి బేహద్ సేవలో నిమగ్నమై ఉండేవారు. బాబా భారతదేశములో ఉంటున్నా విశ్వములోని ఆత్మలందరిని చూచేవారు. ఒకప్పుడు ధర్మపితలను, ఒకప్పుడు డబుల్ విదేశీయులను, జపాన్‌లోని వారిని, సింగపూర్‌లో ఉండేవారిని, ఒకప్పుడు మహామండలేశ్వరులను గుర్తు చేసుకునేవారు. గొప్పవారి కొరకు చాలా మంచి - మంచి సందేశాలను, పుస్తకాలను అచ్చు వేయించారు. ఒకసారి ఎలిజబెత్ రాణికి, ఒకసారి రాజులకు సందేశమివ్వాలని చెప్పేవారు. వారి కొరకు వేరు వేరు పుస్తకాలు, వేరు వేరు సందేశాల కార్డులను ప్రింటు చేయించారు. వాటన్నింటిని ఎంతో ప్రీతిగా తయారు చేయించారు. ఆ కార్డులను బంగారు(రంగు) తీగలతో శృంగారించి బాబా అద్భుతం చేసేవారు. బాబాకు ఆంతరికములో అందరి పట్ల చాలా గౌరవము, ప్రేమ ఉండేవి.

## పురుషార్థములో, సేవలో సఫలత పొందేందుకు హృదయపూర్వక ప్రేమ కావాలి

ప్రేమ ఎటువంటిదనగా దాని కొరకు మానవుడు ప్రాణాలైనా అర్పిస్తాడు. హృదయపూర్వక ప్రేమ ఉండాలి. శరీర ప్రేమ అయితే అందరూ చేస్తున్నారు కాని

దానితో ఏమి లభించింది ? దు:ఖమే లభించింది. హృదయపూర్వకంగా ప్రేమించి, వారి కొరకు ఏదైనా చేయించి, పిల్లలకు మీరు కూడా హృదయపూర్వకంగా స్మృతి చేయండి అని చెప్పడం ఏమైనా చిన్న విషయమా! మనస్ఫూర్తిగా స్మృతి చేసేందుకు కూడా యుక్తి కావాలి కదా! బాబా వారి కొరకు ఏ వస్తువు చేయించేవారో, వాటిని పిల్లలతోనే చేయించేవారు. ఎందుకంటే పిల్లలు బాబా స్మృతిలో ఆ వస్తువులను తయారు చేస్తారు. పిల్లలకు కూడా మేము ఈ వస్తువులను వారికి బాబా సందేశమిచ్చేందుకు తయారు చేస్తున్నామని గుర్తుంటుంది. ఎలిజబెత్ రాణికి సందేశము పంపునప్పుడు దానిని పిల్లలు కూడా చదివేవారు కదా. అందువలన ఎవరు తయారు చేస్తారో, వారి మనసులో మేము కూడా ఇటువంటి గొప్ప వ్యక్తులకు సేవ చేస్తున్నామనే ఉమంగ-ఉత్సాహాలుంటాయి కదా. మనసులో ఇటువంటి భావాలు కలుగుతాయి.

ఒకవేళ మన పై ఎవరైనా నిందలు మోపితే మనకు దు:ఖము కలుగుతుంది. ఆ వ్యక్తి పై ప్రతీకార భావన ఉత్పన్నమవుతుంది. ఈ వ్యక్తి నా పై ఎందుకు నిందలు మోపాడు? అని ఆలోచిస్తారు. కాని బాబా పై ప్రపంచము నిందలు మోపింది. అయినా బాబా అందరి పట్ల కళ్యాణభావనను ఉంచారు. వారు అమాయకులని భావించి క్షమించారు. అమెరికాలోని వార్తాపత్రికలలో బాబాను గురించి వ్రాశారు. " బాబా, మేము వారికి జవాబు వ్రాస్తామని మేము అన్నాము. అందుకు బాబా - పిల్లలూ, సైలెన్స్‌గా ఉండండి, శాంతిగా ఉండి బాబాను స్మృతి చేయండి " అని చెప్పారు. మీరు ఈ విషయాలలోకి పోకండి. బాబా ఏమి చేయమన్నారో, అందులోనే మగ్నమవ్వండి. బాబాలో ఎంత సహనశక్తి ఉండినదో, ఎంత నిర్భయులుగా ఉండినారో గమనించండి. ఈ గుణాలన్నీ బాబాలో ప్రత్యక్షంగా కనిపించేవి.

## ఆలస్యంగా వచ్చేవారు కూడా వారసులుగా అవ్వగలరు

డబల్ విదేశీయులు జ్ఞానములోకి ఆలస్యంగా వచ్చారు. కాని వారిది కుశాగ్ర బుద్ధి. వారికి బాబా నుండి స్పెషల్ కానుక లభిస్తుంది. వారు బాబాను హృదయపూర్వకంగా తమవారిగా చేసుకున్నారు, స్మృతి చేశారు. అందువలన వారికి అనుభవాలు కూడా సులభంగా అవుతాయి. అవి మంచి అనుభవాలుగా కూడా ఉంటాయి. నిన్న రష్యా వారికి బాబా ఏమి చెప్పారు? రష్యా భారతదేశానికి



సమీపంగా ఉంది కనుక అక్కడ దేవతల రాజ్యముంటుందని చెప్పారు. ఇది తప్పకుండా జరుగుతుందని చెప్పారు. రష్యా ఎక్కడ, అక్కడి భాష ఏది? మీరు రష్యావారిని చూడండి, వారికి బాబా పట్ల, యజ్ఞము పట్ల ఎంత స్నేహముందో చూడండి. వారు మనవారని అనిపిస్తుంది. నేను ఒకసారి పోయి వచ్చాను. ఒక్కసారి మాత్రమే వారిని కలిశాను. కాని వారిని చూచి మనవారని ఎంతగా అనుభవమయిందో అడగద్దు. వారి భాషలో మాట్లాడలేము. వారు నాతో మాట్లడలేదు, నేను వారితో మాట్లాడలేదు కాని నన్ను చూసి వారికి, వారిని చూచి నాకు మనవారనే అనుభవమయింది. ఎందుకు? ఎందుకంటే మనసులో స్నేహముంది. వెనుక వచ్చేవారికి కూడా వరదానము ఎలా లభిస్తుందో నేను ఆలోచించాను. వీరు దేవతా కులము వారని నాకు కూడా అనిపించింది. చూడండి, అక్కడ భగవంతుని పేరు కూడా తీసుకోనివ్వలేదు కదా!


ఒకసారి నేను ఒక కాన్ఫరెన్స్‌కు బొంబాయికి వెళ్లాను. అక్కడ ఒక రాష్యా గ్రూపు వచ్చింది. వారితో మాట్లాడునప్పుడు భగవంతుని గురించి మాట్లాడవద్దని, ఎందుకంటే వారు భగవంతుని అంగీకరించరని అందరూ చెప్పారు. యుక్తిగా వారిని మధువనానికి ఆహ్వానించాము. అదే రష్యాలో ఈ రోజు ఆత్మలు భగవంతుని కొరకు తపిస్తున్నారు. వారి స్నేహము, తపన చూచి అక్కడ కూడా దేవతా రాజ్యముంటుందని బాబా వరదానమిచ్చారు. ఈ విధంగా వెనుక వచ్చేవారు కూడా చాలా ముందుకు వెళ్తున్నారు, చాలా సేవ చేస్తున్నారు. భారతవాసులలో కూడా కొంతమంది ప్రవృత్తిలో ఉంటూ తమ తనువు-మనసు-ధనములను పూర్తిగా సమర్పణ చేసిన వారిని నేను చూశాను. వారి బుద్ధిలో సదా బాబాయే ఉన్నారు. వారు ఇది కూడా బాబాదే, అది కూడా బాబాదే, నాదేమీ లేదని అంటారు. సదా ఈ లగ్నములోనే మగ్నమై ఉంటారు. ఇటువంటి సమర్పిత బుద్ధి గలవారు వారసులుగా ఎందుకు అవ్వరు! వారి స్వంతమంటూ ఏమీ లేనివారు, సర్వము బాబా ఇచ్చినదే, బాబాదే అని భావించువారు ఉన్నత పదవిని ఎందుకు పొందలేరు! సాకార బాబా కూడా నాదేమీ లేదు, అంతా బాబాదే అని ఇదే పని చేశారు కదా. బాబా నంబరువన్‌గా అయినప్పుడు బాబాను అనుసరించి అలాగే చేయు మనము కూడా నంబరువన్‌గా అవ్వగలము కదా!

బాబా 'నాది' అనే దానినంతా సమాప్తము చేసేశారు. విశ్వకిశోర్ భాయి యజ్ఞములోని కార్యవ్యవహారాలన్నీ నిర్వహించేవారు. యజ్ఞము కొరకు ఏ వస్తువులు కావాలన్నా వారే కొనుగోలు చేసేవారు. బాబాకు కుడిచేయి వంటివారు. హిస్టరీ హాలులో వారి ఫోటోను చూచి ఉంటారు. మధ్యలో బాబా, ఒకవైపు రమేష్ భాయి, మరోవైపు విశ్వకిశోర్ భాయి ఉన్నారు. విశ్వకిశోర్ భాయి కూడా తన పరివార సహితంగా యజ్ఞములోనే ఉండినాడు. బాబా తన కార్య వ్యవహారమునంతా సర్దుకున్నారు, వెంటనే శివబాబాకు సర్వమూ సమర్పితము చేసేశారు. బాబాకు ఇండ్లు మొదలైన స్థిరాస్తులు ఏవైతే ఉన్నాయో వాటిని ఎంతకు వీలైతే అంతకు అమ్మేయమని విశ్వ కిశోర్ భాయికి అప్పగించారు. ఆలస్యము చేయకుండా త్వరగా చేయమని చెప్పారు. ఎందుకంటే రేపటి రోజును ఎవరు చూచారు? దీని ధర తక్కువ ఏం చేయాలి అని ఆలోచిస్తూ సమయము పోగొట్టవద్దు అని చెప్పారు. విశ్వ కిశోర్ భాయి అలాగే చేసి వచ్చాడు. బాబా సమయానికి చాలా విలువనిచ్చేవారు. ఒక్కొక్క సెకండుకు, విలువనిచ్చారు.

వెనుక వచ్చే డబల్ విదేశీయులు కూడా బాబా వలె వెంటనే సమర్పితమవుతున్నారు. భారతవాసులు విదేశీయుల నుండి ఫ్యాషన్లు నేర్చుకున్నారు. విదేశీయులు జ్ఞానములోకి వస్తూనే వెంటనే సాధారణ జీవితాన్ని అవలంభించారు. ఎంత సాధారణ దుస్తులు ధరిస్తున్నారు! ఎంత నిరహంకారులు! యజ్ఞము పట్ల వారి ప్రేమను చూడండి, పరివారము పట్ల వారి స్నేహము చూడండి, వారి నిరాడంబరతను చూడండి! ఈరోజు దాదీ అందరినీ ఎవరెవరు సిగరెట్లు వదిలేశారు, బ్రాందీ కూడా వదిలేశారు, ఫ్యాషన్లు కూడా వదిలేశారు, మాంసము కూడా వదిలేశారు అని అడిగినప్పుడు అందరూ చేతులెత్తారు. వీరి త్యాగాన్ని చూడండి. వెంటనే అన్నింటిని వదిలేశారు. ఇదే ప్రాక్టికల్ జీవితము. ప్రాక్టికల్‌గా జీవితాన్ని తయారు చేసుకున్నవారిని బాబా ఎందుకు ప్రేమించరు? వీరు త్వర త్వరగా ముందుకెళ్తున్నారు. లాస్ట్‌లో వచ్చినవారు ఫాస్ట్‌గా వెళ్తారని బాబా చెప్పారు కదా. వీరిని చూసి వీరు ఫాస్ట్‌గా వెళ్తున్నారని అనిపిస్తూ ఉంది. బాబా పై గల ప్రేమయే వీరి జీవితాలను మార్చిందని నేను భావిస్తున్నాను. వీరు కూడా తమ దేశవాసుల నుండి, తమ ధర్మము వారి నుండి కష్టాలు



సహించవలసి ఉంటుంది! వీరిలో నిర్భయత ఉంది, సత్యత ఉంది అందుకే అన్నిటినీ ఎదుర్కొంటున్నారు, సహిస్తున్నారు. డబల్ విదేశీయులు బాబాను అనుసరిస్తున్నారు. బాబా ఎలాగైతే సర్వస్వాన్ని సమర్పణ చేశారో, తమ తనువు-మనసు-ధనములను ఈశ్వరీయ సేవలో ఉపయోగించారో, అలా వీరు కూడా చేస్తున్నారని మనము చూస్తున్నాము.



విశ్వ కిశోర్ భావు, బాబా మరియు రమేశ్ అన్నయ్య

ఈ రోజు వరకు కూడా చాలామంది పిల్లలు తమ కర్మబంధనాల నుండి ముక్తులుగా అవ్వలేదని బాబా చెప్తున్నారు. ముక్తి-జీవన్ముక్తులు మీ వర్తమాన జీవితాలకు ప్రత్యక్ష ఫలమని బాబా చెప్తున్నారు. సత్యయుగములో మీరు ముక్తులు - జీవన్ముక్తులుగానే ఉంటారు. అది భవిష్యత్తులో లభించే ఫలము. కాని వాస్తవంగా స్వర్గమని దేనినంటారు? శాంతి, పవిత్రత, ఆనందాలు ఎక్కడ ఉంటాయో అదే స్వర్గము. ఏ పిల్లలైతే బాబాను గుర్తిస్తారో, వారి పట్ల నమ్మకస్థులుగా, ఆజ్ఞాకారులుగా, విశ్వాసపాత్రులుగా అవుతారో, సదా వారి శ్రీమతమును అనుసరిస్తూ ఉంటారో, వారు ప్రత్యక్ష ఫల రూపంలో వర్తమాన సమయములోనే ముక్తులుగా-జీవన్ముక్తులుగా ఉంటారు.

## నా పిల్లలు సదా ఆత్మిక భావములో, అవ్యక్త స్థితిలో ఉండాలని బాబా కోరుకుంటున్నారు

మొట్టమొదట బాబా ఆత్మిక స్మృతిని అభ్యాసము చేయించారు. ఎవరితో మాట్లాడుతున్నా, ఎవరికి జాబులు వ్రాస్తున్నా మొదట నేను నిజ ఆత్మను అని వ్రాయమనేవారు. నిజ ఆత్మ అనగా ఒరిజినల్‌గా నేను ఆత్మను అని అర్థము. అనాది రూపంలో నేను ఆత్మ, అవినాశిని. ఆత్మిక భావము ఉన్న చోట సుఖమే సుఖముంటుంది. దేహ భావము ఉన్న చోట దు:ఖమే దు:ఖముంటుంది. నా పిల్లలు నేను ఆత్మననే విషయమే మర్చిపోయారు అని బాబా అనేవారు. అందువలన దేహ భావములోకి వచ్చి చాలా దు:ఖాన్ని అనుభవిస్తున్నారు. అందువలన ఎలాగైనా అందరికీ మీరు దేహము కాదు ఆత్మలు, పవిత్రత-సుఖము-శాంతి మీ స్వధర్మమని సందేశమివ్వడం మన కర్తవ్యము. ఎప్పుడైతే ప్రతి వ్యక్తి ఇది అర్థము చేసుకుంటాడో అప్పుడు శ్రేష్ఠ కర్మలు ఆచరించడం ప్రారంభిస్తారు. స్వయాన్ని ఆత్మగా భావించకుంటే శ్రేష్ఠ కర్మలు చేయలేరు. ఎవరైనా దేహ భావముతో మాట్లాడితే వారి మాటలు దు:ఖముచ్చేవిగా ఉంటాయి. వారి కర్మలు కూడా దు:ఖమునే ఇస్తాయి. వారి వృత్తి, దృష్టి శారీరకరముగా ఉంటుంది, కర్మలు పాతవిగానే ఉంటాయి. పాత సంబంధీకులు గుర్తుకొస్తారు. ఎందుకంటే ఆత్మ అనే నిశ్చయము తక్కువగా ఉంటుంది. ఇంకా వారు స్వయాన్ని దేహమని భావించి నడుచుకుంటూ ఉంటారు. దేహము, దేహ ధర్మాలను ఎంతవరకు వదిలిపెట్టరో అంతవరకు సుఖము-శాంతి-పవిత్రత అనుభవము చేయలేరని బాబా చెప్తారు. అందువలన సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకమ్ శరణమ్ వ్రజ(అన్ని ధర్మాలను పరిత్యజించి నన్నొక్కరినే శరణుజొచ్చండి) అని అన్నారు.

మనము మన మహిమను వినాలని కోరుకుంటాము, ఎందుకు? ఎందుకంటే ఇంతవరకు మనలో దేహ భావముంది. మహిమను వింటున్న కొలది ఇంకా వినాలనే కోరిక పెరుగుతూ పోతుంది. మహిమ వినాలనే కోరిక ఎంత పెరుగుతూ పోతుందో అంత దేహాభిమానము పెరుగుతూ పోతుంది. మహిమను వింటే సంతోషిస్తారు, గ్లాని విన్నప్పుడు అవమానాన్ని ఫీల్ చేస్తారు. అవమానింపబడినప్పుడు దు:ఖపడతారు లేక ప్రతీకారము తీర్చుకోవాలని



ఆలోచిస్తారు. కనుక కీర్తి ప్రతిష్ఠలు కావాలనే కోరిక ఉంచుకోకండి అని బాబా చెప్తారు. స్వయం బాబాయే మనలను ఇంత మహిమ చేయునప్పుడు ఈ ప్రపంచములోని వారి నుండి మహిమ వినాలనే కోరిక ఎందుకు ఉంచుకోవాలి? మనకు మహిమ లభించకుంటే, హోదా లభించకుంటే, గౌరవము లభించకుంటే మనము విచలితమవుతాము. వీటన్నిటినీ వదిలి నేను ఆత్మను, అవ్యక్తమును అని స్మృతిలో ఉంచుకోమని బాబా చెప్తున్నారు. బాబా అవ్యక్తము కనుక పిల్లలైన మనము కూడా అవ్యక్తమే. ఎవరెవరు అవ్యక్త స్థితిలో బాప్‌దాదాతో కలిశారో వారికి తప్పకుండా మంచి అనుభవాలు అయ్యాయి. అవ్యక్తులు అవ్యక్తముతో కలుస్తారు. అవ్యక్త మిలనము సుఖమునిచ్చే మిలనము. అవ్యక్త స్థితిలో ఉండి అవ్యక్త బాబాతో మిలనము చేసేవారికి అవ్యక్త గుణాలు, శక్తులు ప్రాప్తిస్తాయి. అవ్యక్త స్థితిలోనే మనలోకి బాప్‌దాదా గుణాలు, శక్తులు ప్రవేశిస్తాయి. ఈ మిలనమే అటువంటిది. ఇది ప్రాపంచిక వ్యక్త మిలనము కాదు. ఇది అవ్యక్త మంగళ మిలనము. మన పరివారమే అవ్యక్త పరివారము, మన భాష అవ్యక్త భాష, మన ఇచ్చి-పుచ్చుకోవడం కూడా అవ్యక్తము, మన కార్యవ్యవహారాలు కూడా అవ్యక్తమే. మనము బాబావారిగా అయినప్పటి నుండి మనవన్నీ అవ్యక్తంగా అయిపోయాయి.

నా పిల్లలందరూ వ్యక్త భావము నుండి దూరమై అవ్యక్త భావములో ఉండాలని బాబా కోరుకుంటున్నారు. పిలల్లందరినీ అవ్యక్త వతనములోకి ఆహ్వానిస్తున్నారు. పిల్లలూ, నా సమానంగా అయ్యి నా వద్దకు రండి అని అంటున్నారు. ఏకాగ్రమై ఏకాంతములో కూర్చోండి. వ్యర్థాన్ని సమాప్తము చేయండి. సదా ఆత్మిక స్థితిలో ఉండండి అని చెప్తున్నారు. నేను అవ్యక్తము కనుక అవ్యక్తముతో అవ్యక్తులు మాత్రమే కలుసుకోగలరు. అందువలన మీరు కూడా అవ్యక్తంగా అవ్వండి, అవ్యక్త స్థితిలో ఉండండి. అప్పుడు సదా నా తోడును అనుభవము చేస్తారని బాబా చెప్తున్నారు. మీరు వ్యక్తములో ఉండి నేను అవ్యక్తములో ఉంటే మిలనమెలా జరుగుతుంది? నా సూచనలను అర్థము చేసుకోలేకుంటే జ్ఞానాన్ని అర్థము చేసుకోలేరు. మన కార్య వ్యవహారమంతా అవ్యక్తమైనదే. బాబా మనలో వీటన్నిటినీ చూడాలని అనుకుంటున్నారు. అందుకే సూక్ష్మ వతనాన్ని ఇక్కడకు తీసుకు రండి అని బాబా చెప్తున్నారు. మన చివరి

ఘడియల పాత్ర సూక్ష్మవతన స్థితిలోనే నడుస్తుంది. ఎవరైతే రాజధానిలో వచ్చేవారుగా ఉంటారో వారు వ్యక్త భావములో ఉండరు. ఈ సమయంలో ఎవరు అవ్యక్తముగా ఉంటారో వారికే తండ్రి నుండి వారసత్వము లభిస్తుంది. సదా బుద్ధిలో బాబా మాత్రమే ఉంటే మీలో బాబా శక్తులు అనగా ఆధ్యాత్మిక శక్తులు ప్రవేశిస్తాయి, వృద్ధి చెందుతాయి.





## అంతర్ముఖతా శక్తి

ఇది మన దివ్య జన్మ. అందువలన మనము దివ్యగుణాలను ధారణ చేయాలి. అందుకు ముఖ్యంగా అంతర్ముఖత కావాలి. పరివర్తనయ్యేందుకు మొట్ట మొదటి గుణము ఇదే. మేము అంతర్ముఖులై ఉండాలని దృఢ సంకల్పము చేస్తే మనలో తప్పకుండా పరివర్తన వస్తుంది. అంతర్ముఖులనగా ఏమి? లోపల ఆత్మ ఉంది, అది భ్రూ మధ్య స్థానములో నివసిస్తుంది. అది పవిత్రమైనది, శుద్ధమైనది. శుద్ధ ఆత్మనైన నేను ఈ శరీరంలో నివసిస్తాను. ఆత్మ మాట్లాడేందుకు ఈ శరీరములో నోరు లభించింది. ఎవరెలా ఉంటారో అలా మాట్లాడ్తారు. ఆత్మ పవిత్రమైనది, శాంతి, ప్రేమ, ఆనంద స్వరూపము. ఇది ఆత్మ మూల స్వరూపము. ఈ స్మృతిలో మనము ఈ శరీరములో ఉంటే నోటి ద్వారా చాలా మధురమైన మాటలు వస్తాయి. పవిత్రమైన శబ్దాలు వెలువడ్తాయి. అన్ని గుణాలు ప్రవేశిస్తాయి. సహనశీలత, సంతుష్టత, ధైర్యము, మధురంగా మాట్లాడుట - ఈ గుణాలన్నీ జీవితములో లేక వ్యవహారములో అంతర్ముఖత ఆధారంగానే వస్తాయి. వీటిని దివ్య గుణాలని అంటారు. ఈ గుణాలను ధారణ చేయడం వలన ఆత్మలో దివ్యత వస్తుంది. మన స్వరూపము దివ్యంగా తయారవుతుంది. ఎందుకంటే నేను పవిత్రమైన ఆత్మననే స్మృతి ఉంటుంది.

## స్మృతి ద్వారానే అంతర్ముఖులుగా ఉండగలరు

పవిత్రతలో ఎలాంటి నల్లమచ్చ(అపవిత్రత) రాదు. పాలలో ఏదైనా నలుపుంటే స్పష్టంగా కనిపిస్తుంది. పాలు తెలుపు, అందులోని మచ్చ నలుపు. ఏదైనా వికారాల మచ్చ ఉంటే, మైపన్(నాది) ఉంటే ఆ వ్యక్తి చూడడం, మాట్లాడడం, చేయడం అన్నీ దేహాభిమానములో ఉంటాయి. వృత్తి పవిత్రంగా ఉండదు. దృష్టి కూడా పవిత్రంగా ఉండదు. మాటలూ పవిత్రంగా ఉండవు. కర్మలూ పవిత్రంగా ఉండవు. ముఖ్యమైనది స్మృతి. స్మృతి ద్వారానే ఆత్మలమైన మనము అంతర్ముఖులుగా ఉండగలము. కనుక మనమంతా కలిసి ఈ అభ్యాసము చేస్తున్నాము. దీని ద్వారానే మనము ఈశ్వరీయ నియమాలను కూడా పూర్తిగా పాటించగలము. ఆత్మలో శ్రేష్ఠ సంకల్ప శక్తి, పవిత్ర స్మృతి ఉండి, బుద్ధి శుద్ధముగా ఉండి భ్రమించకుండా, ఏకాగ్రచిత్తముగా ఉంటే వివేకముతో చేయు నిర్ణయము

సరిగ్గా ఉంటుంది. ఎందుకంటే ఆత్మలో జ్ఞానముంది. ఆ జ్ఞానాన్ని జ్ఞానసాగరుల వద్ద తీసుకుంది. పాప-పుణ్యాల జ్ఞానము, తప్పొప్పుల జ్ఞానము ఉన్నందున, దాని ఆధారంతో ఆత్మ బుద్ధి పవిత్రంగా, శుద్ధమైపోయింది. కనుక మంచి నిర్ణయమునిస్తుంది. స్వయాన్ని తెలుసుకొని భగవంతుని తెలుసుకుంటుంది. అంతేకాక ఇతరులకు కూడా అనుభవం చేయించగలదు. శివబాబా అనగా స్వయానికి ఏ భావముందో, ఇతరులకు ఏ భావముందో దీని అనుభూతి ఆత్మలో సహజంగా వచ్చేస్తుంది. ఎంత అనుభవం చేస్తుందో, ఆత్మలో అంత పరివర్తన వస్తుంది. చూస్తూ చూస్తుండగానే మనిషి మారిపోతాడు. ఈ రోజు క్రోధులుగా ఉన్నవారు, రేపు అతి మధురంగా అవ్వగలరు. చాలా కాలము నుండి వికారులుగా ఉన్నవారు పరివర్తన చెంది అయ్యి దివ్య స్వరూపము ద్వారా ఫరిస్తాలుగా కూడా అవ్వగలరు.

## అంతర్ముఖులుగా ఉన్నవారే శ్రీమతమును అనుసరించగలరు

మానవుడు పరివర్తన చెందాలి అయితే ఏ ఆధారంతో? జ్ఞాన ఆధారముతో. జ్ఞానము ఒక శక్తి అని అన్నారు. బాబా మనకు ఇచ్చే జ్ఞానము సత్యమైనది, శక్తివంతమైనది. ఈ జ్ఞానము ఆధారంతో మనము చాలా అనుభవము చేయగలము. బాబా నుండి ఏ శ్రీమతము లభించిందో అందులోని ప్రతి విషయాన్ని, ప్రతి శ్రీమతాన్ని జీవితములో పాటించేందుకు అభ్యాసము చేయాలి. మనము ఎంతవరకు అంతర్ముఖతను ధారణ చేయమో అంతవరకు బాబా ఇచ్చే జ్ఞానము, బాబా మాటలు, బాబా శ్రీమతమును ఒక చెవితో విని మరో చెవితో వదిలేస్తాము. అలా వదిలేస్తే మనము పాపానికి భాగస్థులుగా అవుతాము. పాప కర్మలు వృద్ధి అవుతాయి. ఎందుకు? మనకు సేవ చేసేదెవరు? గాడ్ ఫాదర్. పారలౌకిక తండ్రి పిల్లలైన మనకు సేవ చేసేందుకు వచ్చారు. అందుకు మనము రిటర్న్ ఏమిస్తున్నాము? రిటర్న్ ఇచ్చామా? లేక ఇంకా బరువే తీసుకున్నామా? బాబా మాటలు వినకుంటే ఇక మనమేమి చేసినట్లు? పాపమే చేశాము కదా. బాబా చెప్పిన దానిని మనము ఆచరించకపోతే పాప కర్మలు వృద్ధి చెందుతాయి. అందువలన మన పూర్తి ధ్యాసంతా శ్రీమతము పై ఉంటుంది. అంతిమ క్షణము వరకు శ్రీమతాన్ని అనుసరిస్తాము. అంతర్ముఖులుగా ఉన్న వారే శ్రీమతమును అనుసరిస్తారు అనగా



ఆత్మ మూల స్వరూపములో స్థితమై ఉండాలి. ప్రపంచములోని వారు నోటి ద్వారా ఏమి మాట్లాడ్తారు? కనులతో ఏమి చూస్తారు? శరీరాన్నే చూస్తారు, శరీర సంబంధమైన విషయాలే మాటాడ్తారు. కనులు శరీర సంబంధమైనవి కనుక వారి ధ్యాస శరీరము పైకే వెళ్తుంది. కాని నేను శరీరము కాదు, కంటిని కాదు, నేను ఆంతరిక ఆత్మను, నా స్వరూపము శుద్ధమైనది, పవిత్రమైనది, నేను జ్యోతిర్బిందువును, ప్రకాశాన్ని(లైటును). కనులతో నేను లైటును చూస్తున్నాను, జ్యోతిర్బిందు ఆత్మలను చూస్తున్నాను. ఆత్మలన్నీ మూల స్వరూపములో పవిత్రమైనవి. అందువలన వృత్తి, దృష్టి, కర్మలన్నీ శ్రేష్ఠంగా అయిపోతాయి. ఇది ఆత్మ చింతన. ఈ చింతనలో ఉండేవారు ఎప్పుడూ ఇతర చింతన చేయరు. చింత ద్వారా జబ్బులొస్తాయి, అనేక సమస్యలు చుట్టుముట్తాయి. అందువలన మనిషి దాసుడైపోతాడు, నిర్బలుడవుతాడు. కాని అంతర్ముఖత అన్ని గుణాలకు పునాది. కనుక ఈ రోజు మనము ఒక వారము రోజులు పూర్తిగా యోగము చేస్తాము, అంతర్ముఖతా గుహలో ఉంటాము, బాహ్యాముఖతలోకి వెళ్లాము, ప్రతి మాట అంతర్ముఖత ద్వారానే మాట్లాడ్తామని ప్రతిజ్ఞ చేస్తాము.

ఎవరైనా ఇల్లు కడ్తూ ఉంటే, బాబా ఇల్లు తయారు చేస్తున్నామని భావించండి. ఇంట్లో బాబాను కూర్చోబెట్టాలి. మన ఇల్లు పరంధామము. అక్కడ మనము, బాబా ఉంటాము, పవిత్రాత్మలుంటాయి. అలాగే ఈ ఇంటిలో నివసించే ఆత్మలైన మేము పవిత్రంగా ఉంటాము, మా జతలో బాబాను కూడా ఉంచుకుంటాము. పిల్లలెక్కడుంటారో బాబా కూడా అక్కడే ఉంటారు. ఈ ఇల్లు నాది, ఈ గదిలో కుమారుడుంటాడు, ఈ గదిలో కూతురుంటుంది, ఇటువంటి ఆసక్తి ఉండరాదు. ఈ బాహ్యాముఖతా సంస్కారంలో ఎవరైనా ఇల్లు కడ్తే కర్మబంధనాలు తెగిపోవు. దేహధారుల స్మృతిలో చేస్తే, దేహధారుల కొరకు చేస్తే, కర్మ బంధనాలను తయారు చేసుకుంటారు. కర్మ బంధనాలను విడిపించేవారు ఒక్క శివబాబా మాత్రమే.

## మనలో గాని, ఇతరులలో గాని శరీర అనుభూతి కలుగకుండా ఉండునట్లు అభ్యాసము చేయండి

ఈ సమయంలో నేనూ పరివర్తనవ్వాలి, విశ్వమూ పరివర్తనవ్వాలి..

స్వయాన్ని పరివర్తన చేసుకునేందుకు మన స్మృతులు పరివర్తన అవ్వాలి. ఏ సంకల్పమూ దేహధారుల కొరకు చేయరాదు, ఒక్క బాబా కొరకే చేయాలి అప్పుడు మనము లోపల పరివర్తనవుతూ పోతాము, మన కర్మ బంధనాలు తెగిపోతూ వస్తాయి. కర్మలు చేయునప్పుడు మన సంకల్పాలు, స్మృతులు అనంతమైన తండ్రి వైపు, అనంతమైన ఇంటి వైపు, అనంతమైన రాజధాని వైపు జోడించబడి ఉన్నప్పుడే పరివర్తన అవ్వగలము. ఇందుకొరకు అంతర్ముఖత కావాలి. పరివర్తనయ్యేందుకు మననము చేయాలి, చింతన చేయాలి. సమయము పూర్తయ్యింది, ఇప్పుడు అంతర్ముఖులుగా అవ్వకుంటే ఇంకెప్పుడవుతారు? మనము పాత ప్రపంచము నుండి అదృశ్యంగా ఉండాలి. చూస్తూ కూడా చూడనట్లుండాలి. మనము కూడా ఇతరులకు కనిపించరాదు. శరీరమేమో కనిపిస్తుంది కాని మనము ఆత్మలము, ఆత్మిక స్థితిలో ఉండాలి. ఆఫీసుకు వెళ్ళినా, ఇంటిలో ఉన్నా, మీ పిల్లలు కావచ్చు, బంధువులు కావచ్చు, ఆఫీసు వారు కావచ్చు ముఖ్యమైన మనుష్యులు కావచ్చు వారెవ్వరూ మన శరీరాన్ని చూడరాదు అనగా వారికి మన శరీరమే కనిపించరాదు. మనము శరీరమే కాకుంటే వారికి శరీరమెలా కనిపిస్తుంది అనగా మనలను చూచి వారి శరీర భావమే సమాప్తమైపోవాలి, మన పై దేహ దృష్టియే పడరాదు. నేను లైటును అని మన స్మృతిలో ఉంటే ఎదుటి వారికి కూడా మనము లైటుగానే కనిపిస్తాము. మనకు గాని, ఇతరులకు గాని దేహానుభూతి కలుగకుండా ఉండునట్లు అభ్యాసము చేయాలి.

చివరి సమయంలో వికారాలు భయంకర రూపాన్ని ధరిస్తాయి. బాబా చెప్తారు - చివరిలో వికారాల ఫోర్సు ఎంత ఉంటుందంటే మనుష్యులు వికారాలకు వశమైపోతారు. ఎందుకంటే మనుష్యులు వికారాలను కలిగించు సాధనాలనే తయారుచేశారు కదా. టి.వీ, సినిమా, నవలలు, ఆహార-పానీయాలు మొదలైనవన్నీ వికారాలను రెచ్చగొట్టునవే. అవి బుద్ధిని ఎలా చేస్తాయంటే, మనుష్యులు వికారాలలోకి వెళ్ళేందుకు సమయాన్ని చూడరు, రోజును చూడరు, పురుషుని చూడరు, స్త్రీని చూడరు. వికారాలు వారినెలా సతాయిస్తాయంటే వాటికి పూర్తి దాసులుగా అయిపోతారు. చాలా చెడ్డ పరిస్థితులు వస్తాయి. మనము వికారాలను సమాప్తము చేసుకునేందుకు యోగములో కూర్చున్నామని కాదు. అలా ఊరకే వికారాలు సమాప్తమవ్వవు. మనవి సమాప్తము కావచ్చు,



మన పరివారము వారివి సమాప్తము కావచ్చు. కాని అజ్ఞానులైన ఈనాటి మనుష్యులకు భగవంతుడంటే భయము లేదు. వారి పాప కర్మలు పెరుగుతూనే ఉన్నాయి, వారి వికారాలు సమాప్తమవ్వవు. మాతలు గాని, కన్యలు గాని, సోదరులు గాని ఎవరైతే దేహాభిమానములో ఉంటారో వారు వికారాలలో చిక్కుకుపోతారు. వికారాలకు కూడా శక్తి ఉంది. రావణుని శక్తి ఏమైనా తక్కువైనదా? చివర్లో రావణుడు కాలిపోతాడు. యోగాగ్నిలో రావణుని కాల్చేయాలి. అందుకే శక్తులు అసురులను నాశనము చేయడం మన స్మృతి చిహ్నము. జంతువులను పెంచుకొని కూడా వాటితో వికారాలను తీర్చుకునే సమయము వస్తుంది. అతివికారాల వాయుమండలము తయారవుతుంది. జనులు వికారాల వశమై తప్పొప్పులను గురించి ఆలోచించలేరు. మానవుల సంకల్పాలు ప్రకృతిలోకి వ్యాపిస్తున్నాయి. ప్రకృతి మానవుల రచన. మానవుడు రచయిత. మానవుల దూషిత(చెడు) సంకల్పాల వలన ప్రకృతి కూడా దూషితమైపోయింది.

## అన్ని జబ్బులకు కారణము వికారాలే

ప్రపంచములో ఇన్ని రకాల జబ్బులు ఎందుకు వస్తున్నాయి? ఎందుకంటే మానవులు భ్రష్టకర్మలు చేశారు. ప్రకృతి కూడా దు:ఖమిస్తోంది. బాబా చెప్తారు - "చివర్లో వచ్చు జబ్బుల వలన మానవులు గ్రుడ్డివారవుతారు, శరీరము జబ్బుపడుతుంది, నడవలేరు". వీటన్నిటికి కారణము వికారాలు. మనుష్యులు వికారులుగా అయినప్పుడు వారి ప్రభావము ప్రకృతి పై కూడా చాలా పడ్తుంది. ఎందుకంటే మన సంకల్పాలు(తరంగాలు) వాయుమండలములో భ్రమిస్తూ ఉంటాయి. ఇంతకాలము వికారులుగా ఉన్నందున మనము మొత్తం ప్రకృతినంతా దూషితము చేసేశాము. ఇప్పుడు మనమెంత యోగము చేస్తామో అంత శ్రేష్ఠ సంకల్పాలు ప్రకృతిలోకి వ్యాపిస్తాయి. ప్రకృతి కూడా శుద్ధమవ్వాలని మనము శుద్ధ సంకల్పాలు చేస్తాము. ప్రకృతి అంటే మనకు ప్రేమ ఉంది. ఆత్మలూ శుద్ధంగా ఉండాలని, ప్రకృతీ శుద్ధమైపోవాలని మనము యోగము చేస్తాము.

ఈ యోగము ద్వారా చేసిన పాపాలు దగ్ధమవ్వక ఇంకా మిగిలి ఉంటే, చివరిలో మన పై కూడా వికారాలు దాడి చేస్తాయి. కనుక ఎలాగైనా

మనము యోగాగ్నిని ప్రజ్వలితము చేయాలి. ప్రకృతి మనకు దు:ఖమివ్వరాదు, వికారాలు దు:ఖమివ్వరాదు. సమాజములో ఎవరైనా ఖూనీ చేస్తే వారికి జైలు శిక్ష పడ్తుంది. మానవుడు ప్రకృతిని పూర్తిగా చెడిపేస్తున్నాడు. అందువలన ప్రకృతి వైపు నుండి భూకంపాలు, వరదలు వస్తాయి. నలువైపులా అగ్ని అంటుకుంటుంది. ఎవరికైనా కోపము వస్తే ఊరకే నిలబడి చూస్తూ ఉంటారా? వారిలో ప్రతీకార భావనలు జాగృతమౌతాయి కదా! వికారాల ఫోర్సు వచ్చినప్పుడు శత్రువును చంపేస్తారు. ఈ విధంగా చివరిలో ప్రకృతి కూడా చాలా దూషితమైపోతుంది. కనుక తన భయంకర రూపాన్ని చూపిస్తుంది. కాని మనము దీని నుండి రక్షింపబడాలి. మనము అన్నింటి నుండి, ప్రపంచము నుండి భిన్నముగా ఉన్నాము. మన పై ఎవ్వరూ కోపగించుకోరాదు. వికారాలనే అసురులు మన వెంట పడరాదు. వికారులకు మన శరీరము కనిపించరాదు. మనకు అశరీరి అవస్థలో అంతర్ముఖత గుహలో ఉండు అభ్యాసముంటే మనకు ఇతరుల శరీరము కనిపించదు. వారికి మన నలువైపులా 'లైటే లైటు' కనిపిస్తుంది.

## నివసించే స్థానము యొక్క వాయుమండలాన్ని శక్తిశాలిగా చేసుకోండి

భోపాలులో అగ్ని అంటుకోవడం మీకు తెలిసే ఉంటుంది. మరెక్కడో భూకంపము కూడా జరిగింది కాని మన సోదరీలు(టీచర్లు) రక్షింపబడ్డారు. జపాన్‌లో కూడా భూకంపం వలన చాలా ఇళ్లు కూలిపోయాయి. కాని అక్కడ కూడా సోదరీలు సురక్షితంగా ఉన్నారు. ఎందుకంటే వారి స్థితి యోగయుక్తముగా ఉంటుంది. వారు నివసించు స్థానములో వాయుమండలము శక్తిశాలిగా ఉంటుంది. సెంటర్లో మొత్తం సమయమంతా యోగము లేక సేవను గురించిన సంకల్పాలు, వైబ్రేషన్లు ఉంటాయి. మన సోదరీలు పాత ప్రపంచములోనే ఉన్నారు కాని వారికి ఆ ప్రపంచము నుండి ఏమీ అవసరం లేదు. పాత వస్తువులు అనగా కాలిపోయిన, కుళ్లిపోయిన వస్తువులు. వాటిని చేతితో తాకితే అవి మనలను కాలుస్తాయి. పాత ప్రపంచములో మనకు ఏ ఆసక్తీ లేదు. పాత ప్రపంచము పై ఎవరికైతే ఏ కోరికా లేదో, ఏ ఆసక్తి లేదో వారి కర్మేంద్రియాలు చంచలంగా అవ్వవు. వారు రక్షింపబడ్తారు. వారు అంతర్ముఖులై యోగములో ఉంటారు. దీనినే చూస్తున్నా చూడకుండా ఉండుట, వింటున్నా వినకుండా ఉండుట అంటారు. బాహ్య విషయాలు మన చెవులలో పడినా వాటిని గురించి



మన మనసులో చింతన జరగరాదు.

మనము డ్రామా పట్టాల పై అలాగే నిలబడి ఉండాలి. ఒక సెకండులో ఏదైనా ఘటన జరిగితే, అది మళ్లీ 5000 సంవత్సరాల తర్వాతనే జరుగుతుంది. దానిని గురించి వ్యర్థ సంకల్పాలు నడవనే వడవరాదు. అలా ఉంటే సంకల్పాల శక్తి జమ అవుతుంది. డ్రామా ఢాలు మనకు చాలా అవసరము. డ్రామా పాయింటును మనము చాలా పక్కాగా ధారణ చేయాలి. దీని వలన మనకు శక్తి లభిస్తుంది. మన స్థితి స్థిరంగా, అచలంగా తయారవుతుంది. నడుస్తూ - తిరుగుతూ, వ్యవహారములో ఎవరికైతే డ్రామా స్మృతి ఉంటుందో వారు స్థిరంగా, నిశ్చింతగా ఉంటారు. ఇటువంటి స్థితి తయారవుతుంది. ఎలాగైనా ఒక్కొక్క వారము మనము అంతర్ముఖతను అభ్యాసము చేస్తూ ఉండాలి.



## సత్యమైన బ్రాహ్మణులు

బాబా పిల్లలు బాప్‌దాదాతో మిలనము చేసేందుకు కాచుకొని కూర్చుని ఉన్నారు కదా. బాప్‌దాదాను మనము ఎలా గుర్తిస్తాము, బాప్‌దాదా మనలను ఎలా గుర్తిస్తారు - ఈ స్మృతిలో కూర్చుని ఉన్నారు కదా! సాకారము గాని, నిరాకారము గాని, ఆకారము గాని, ఎవరిదైనా గుర్తింపు అవసరము. ఎవరైనా గాని గుర్తింపు అవసరము. అనుభూతి చాలా అవసరం. బాబా పిల్లలైన బ్రాహ్మణులు దేవతల కంటే ఉన్నతమైనవారు. మొత్తం కల్పంలో బ్రహ్మా ముఖవంశావళి బ్రహ్మాకుమార్-కుమారీల కంటే ఉన్నతమైన, సత్యమైన బ్రాహ్మణులు ఎవ్వరూ లేరు. శివశక్తులు, పాండవులు వీరి స్మృతి-చిహ్నమే. ఎందుకు? బాబా తన పిల్లలకు నిశ్చయబుద్ధిని ఇచ్చారు, మూడవ నేత్రాన్ని ఇచ్చారు. అందువలన చిత్రాలలో, మందిరాలలో శివశక్తులకు మూడవ నేత్రాన్ని చూపిస్తారు. బ్రాహ్మణులు సదా మూడవ నేత్రాన్ని చూస్తారు. ఈ భౌతికమైన రెండు నేత్రాలు ఉన్నా, వాటిని చూడరు. శరీరాలను అయితే చూడనే రాదు. చూస్తున్నా చూడరాదు. ఎందుకంటే ఈ శరీరము వికారీ బీజాలతో జన్మించినది. ఇందులో వికారాల కరెంటు ఉంది. అందువలన దీని పై చాలా ధ్యాస ఉంది. బాబా మనకు దివ్య బుద్ధిని ఇచ్చారు, దివ్య నేత్రమునిచ్చారు. ఆ నేత్రముతో చూస్తే భాయీ - భాయీ(ఆత్మ) కనిపిస్తుంది. సోదరులను సత్యముగా ప్రేమించగలరు, ఈశ్వరీయ ప్రేమను ఇవ్వగలరు.

## సత్యమైన బ్రాహ్మణులనగా అహింసా పరమో ధర్మమును అవలంభించువారు

ఈనాటి ప్రపంచంలో మనుష్యులకు ఏం కావాలి? సత్యమైన ప్రేమ. ప్రేమ అయితే చాలా ఉంది. కాని సత్యమైన ప్రేమ ఎవ్వరూ ఇవ్వడం లేదు, ఎవ్వరూ పొందడం లేదు. జనులు సినిమాలను చూసి ప్రేమించడం నేర్చుకుంటున్నారు. దీని ద్వారా ఇంకా అజ్ఞానము, అంధకారము పెరుగుతూ పోతోంది. ఆ ప్రేమ వికారాల ప్రేమ కదా! అది శారీరిక ప్రేమ. ఈ రోజుల్లో ప్రేమించడం ఒక ఫ్యాషన్ అయిపోయింది. కాని బ్రాహ్మణులైన మనకు బాబా ఏ ప్రేమ నేర్పించారు? జ్ఞాన మూడవ నేత్రమునిచ్చి ఒకే తండ్రి సంతానం అయిన ఆత్మలమంతా సోదరులమని



భావించి పరస్పరము ఒకరినొకరు ఆత్మిక ప్రేమను ఇవ్వడం నేర్పించారు. ఇది శారీరిక ప్రేమ కాదు, ఈశ్వరీయ ప్రేమ. బాబా పిల్లలైన బ్రాహ్మణులు త్రినేత్రులే కాక త్రికాలదర్శులుగా కూడా ఉన్నారు. పిల్లలైన మనకు బాబా మూడుకాలాల జ్ఞానమునిచ్చారు. అందువలన మనము స్వదర్శన చక్రధారులము. బుద్ధిలో అనంతమైన చక్రము తిరుగుతూ ఉంటుంది. ఎవరి స్వదర్శనచక్రము తిరుగుతూ ఉంటుందో వారు మాయ గొంతును కోసేస్తారు. ఇది హింస కాదు. మనము అహింసా పరమో ధర్మాన్ని పాటించువారము. జ్ఞాన సాగరులైన బాబా మనకు ఏ జ్ఞానము ఇచ్చారో, ఆ జ్ఞాన చక్రాన్ని తిప్పుతూ మనము వికారాలనే మాయా రావణుని సంహరిస్తాము, రావణుని గొంతు కోసేస్తాము. సత్యమైన బ్రాహ్మణులను బాబా సన్ముఖంలో కలుస్తారు. వారు జన్మతోనే పవిత్రంగా ఉంటారు. ఎందుకంటే ముఖవంశావళి కదా. కనుక బ్రాహ్మణులు దేవతల కంటే శ్రేష్ఠమైన వారుగా అయిపోయారు కదా.

## సత్యమైన బ్రాహ్మణులనగా విశ్వ సేవాధారులు, శ్రేష్ఠ స్వమానధారులు

బ్రాహ్మణులైన మనము విశ్వ సేవ చేస్తాము, మనము సేవాధారులము. ఈ సేవ ద్వారా బ్రాహ్మణులకు ఉన్నతమయ్యే కళ వస్తుంది. అంతేకాక తమ భవిష్యత్తును ఉజ్వలంగా చేసుకుంటారు. బ్రాహ్మణ జన్మ చాలా శ్రేష్ఠమైన కార్యము కొరకు లభించింది. ఈ ఒక్క జన్మలోనే సుకర్మలు చేయగలము, శ్రేష్ఠ కర్మలు చేయగలము. మిగిలిన జన్మలన్నింటిలో మనము ఏదో కొంత కిందికి దిగుతూ వచ్చాము. ఎందుకంటే దేహము జతలో ఉంది కనుక దేహ ధర్మము దు:ఖమునిస్తుంది. మెల్ల మెల్లగా కళలు తగ్గుతూ తగ్గుతూ తమ దేహములోనూ, ఇతరుల దేహములోనూ చిక్కుకుంటూ, చిక్కుకుంటూ కలియుగ అంత్యములో కళాహీనంగా అయిపోయాము. ఇప్పుడు మిగిలి ఉన్న సమయంలో అత్యంత మంచి కర్మలు ఏవైతే ఉన్నాయో, వాటిని చేయండి. బ్రాహ్మణుల కర్మల కథలు ఉన్నాయి. బ్రాహ్మణులు ఏ కర్మలు చేయాలి, ఏ కర్మలు చేయరాదు అనే జ్ఞానము బాబా ఇచ్చారు. ఈ జ్ఞానము బ్రాహ్మణుల కొరకే బాబా ఇచ్చారు. పాపమని దేనినంటారో, పుణ్యమని దేనినంటారో బాబా అర్థం చేయించారు. బాబా ముఖ్యంగా బ్రాహ్మణులకు కర్మల గుహ్య గతిని తెలిపించారు. అందువలన పశ్చాత్తాపపడే కర్మలు ఏవియూ బ్రాహ్మణులు చేయరాదు. అక్కడక్కడ అప్పుడప్పుడు

బ్రాహ్మణుల ద్వారా తప్పులు జరిగితే పశ్చాత్తాపంలో ఏడ్పు వస్తుంది. నేను బాబా వద్దకు వచ్చి ఇంత పాపం చేశాను, నాకేమైపోయింది? అనే ఏడుస్తారు. బాబా మనలను దేవతల కంటే శ్రేష్ఠంగా తయారు చేశారు, దివ్య బుద్ధినిచ్చారు, అయినా నాకేమైపోయింది, నేను తల ఎత్తి చూడలేను. బ్రాహ్మణ పరివారంలోకి వచ్చి నేను పాపం చేశాను అని రోధిస్తారు. ఎప్పుడు యోగంలో కూర్చున్నా పదే పదే ఈ సంకల్పాలే వారిని తింటూ ఉంటాయి. అందువలన కర్మలు చేసేందుకు ముందే ఆలోచించమని బాబా చెప్తారు. కాని పిల్లలు మేము చేయరాదని అనుకుంటాము కాని చేసేస్తాము అని అంటారు. ఎందుకు? ఎందుకంటే శక్తి లేదు. శక్తికొరకు చాలా సమయం యోగం చేయమని, బాబాతో సంబంధం జోడించే అభ్యాసం చేయమని బాబా అంటారు. అర్థమయ్యిందా? అటువంటి కర్మలేవియయూ బ్రాహ్మణులు చేయరాదు. చూస్తూ చూస్తూ కనులు నేరపూరితమైపోతాయి(క్రిమినల్). దృష్టి వికారీ దృష్టిగా అవుతుంది అందువలన వృత్తి కూడా చెడిపోతుంది. దీని వలన ఎంతో పెద్ద శిక్ష లభిస్తుంది. బ్రాహ్మణులకైతే 100 రెట్ల దండన లభిస్తుంది. అజ్ఞానులకు అంతకు అంత మాత్రమే దండన. బ్రాహ్మణులకైతే 100 రెట్లు దండన. ఇంత తేడా వచ్చేస్తుంది. ఎందుకంటే బ్రహ్మముఖవంశావళి బ్రాహ్మణులు నూతన ప్రపంచాన్ని స్థాపన చేసేవారు. వీరి ద్వారా ఏదైనా పాప కర్మ జరిగితే చాలా భోగించవలసి వస్తుంది. మొట్టమొదట ఎలాంటి దండన లభిస్తుంది? కనులు మోసం చేశాయంటే అందుకు దండన ఏదో తెలుసా? అప్పుడప్పుడు కర్మల గుహ్య గతిని గురించి బాబా తన పిల్లలకు వినిపిస్తారు. శత్రువు ఎప్పుడైనా దాడి చేస్తే అందుకు ఒక ప్లాను ఉంటుంది. మొట్టమొదట సంబంధాలు తొలగిస్తాడు. టెలిఫెన్ కనెక్షన్‌ను తీసేస్తాడు, కరెంటు కనెక్షన్, నీటి కనెక్షన్ అన్నీ తీసేస్తాడు. ఎక్కడెక్కడ నుండి సౌకర్యాలు లభిస్తున్నాయో వాటన్నిటి కనెక్షన్ తొలగిస్తాడు.

ద్వాపరం నుండి ఇంతవరకు మాయకు దాసులై ఉండినారు. ఇప్పుడు భగవంతుని పిల్లలుగా అయ్యారు. కనుక మాయ మనలను సులభంగా వదులుతుందా? చివరి వరకు దాడి చేస్తూనే ఉంటుంది. ఇంత కాలం మనము దాని రాజ్యంలో ఉండినాము. అది మన పై రాజ్యం చేసింది. ఏ శక్తి అయినా వదలాలనుకుంటుందా? వదలదు. అలా మాయ కూడా చివరి వరకు వీరి



బుద్ధియోగం ఏదైతే పరమాత్మునితో జోడింపబడిందో దానిని ఎలాగైనా తెంచేయాలని ప్రయత్నిస్తుంది. ఎవరైతే స్వయాన్ని శరీరం కంటే వేరుగా ఉండే ఆత్మనని భావిస్తారో అలా అనుభవం చేస్తారో వారి బుద్ధియోగం పరమాత్మతో జోడింపబడే ఉంటుంది. వారి బుద్ధిలో తండ్రి అయిన పరమాత్ముని స్మృతి, వారి సేవను గుంచిన స్మృతియే ఉంటుంది. ఈ స్మృతి ద్వారా ఏ కర్మ చేస్తారో అది సేవగా అవుతుంది. వారి ప్రతీ కర్మ కర్మయోగముగా ఉంటుంది. మన కర్మలో యోగం ఎలా ఉండాలో బాబా మనకు నేర్పించారు. వీరి కళ ఉన్నతంగా అవుతూ ఉందని మాయ గమనిస్తుంది. రోజంతా బాబా, బాబా అని అంటూ ఉంటారు, రాత్రింబవళ్లు సేవ చేస్తూ ఉంటారు అని గమనిస్తుంది. వీరికి యోగములోనూ బాబాయే, సేవలోనూ బాబాయే, తినడము, తాగడంలోనూ బాబాయే, వీరికి ఎల్లప్పుడూ అన్నిటిలోనూ బాబాయే బాబా అని గమనించి మాయ మీ కనెక్షన్‌ను తెంచేందుకు బలంగా ప్రయత్నిస్తుంది. ఎందుకంటే అది మీ శత్రువు కదా? మన బుద్ధియోగము బాబా నుండి తెంచేందుకు చాలా ఒత్తిడి ఉపయోగిస్తుంది. బాబా చెప్పే అనేక విషయాలలో, బ్రాహ్మణ పరివారంలో, బ్రాహ్మణ ఆచార పద్ధతులలో సంశయాన్ని ఉత్పత్తి చేస్తుంది. సంశయబుద్ధి వినశ్యంతి అని అంటారు కదా.

## సత్యమైన బ్రాహ్మణులనగా మహారథులు

బుద్ధియోగము తెగిపోయినప్పుడు సంశయము ఉత్పన్నమౌతుంది. సంశయము కలిగినప్పుడు బుద్ధి మాయ ఆకర్షణల వైపుకు వెళ్లిపోతుంది. ఆత్మ బలహీనమౌతుంది, దేహాభిమానము వచ్చేస్తుంది, దేహ ఆకర్షణలలో చిక్కుకుంటారు. బుద్ధి యోగము దేహాలతో జోడింపబడుతుంది. మొదటిది, బుద్ధి యోగము బాబా నుండి తొలగిపోతుంది. రెండవది, దేహాలతో సంబంధము జోడింపబడుతుంది. కనుక ఆత్మకు శక్తి ఎలా వస్తుంది. శక్తి లేనప్పుడు మాయతో ఓడిపోతూ ఉంటుంది, పరమాత్మ నుండి దూరమవుతూ పోతుంది. బుద్ధి బాబాతో జోడింపబడి ఉంటే మాయ దాడి చేసినా, ఎదిరించి గెలుపొందుతారు. ఎందుకంటే బుద్ధి బాబాతో జోడింపబడి ఉండడం వలన ఆత్మకు బాబా నుండి శక్తి లభిస్తూ ఉంటుంది. అందువలన మాయ పై విజయము పొందుతారు. ఆత్మ ధైర్యము చేస్తే బాబా సహాయము కూడా చేస్తారు. యోగమే తెగిపోయి

దేహాభిమానము వచ్చేస్తే అది వికారాలలో చిక్కుకునేలా చేస్తుంది. ఒకటి తర్వాత రెండవది, రెండవ దాని వెనుక మూడవది ఇలా అనేక తప్పులు చేయిస్తుంది. ఆ ఆత్మ ద్వారా అనేక వికర్మలు జరిగిపోతాయి. అందువలన బాబా అంటారు - పిల్లలూ, విధి ద్వారా సిద్ధి స్వరూపులుగా అవ్వండి. మాయ మీ సంబంధాన్ని తెంచలేని పద్ధతిని బాబా నేర్పించారు. దాని పై మీరు గమనముంచండి. బాబా పిల్లలైన మీరందరూ మహారథులు. మహాత్ములైన మీరందరూ మీ మీ రథం పై సవారీ అయ్యి ఉన్నారు. నేను మహారథినని సదా గుర్తుంచుకోండి. మహారథులు సదా విజయము పొందుతారు. మాయతో ఓడిపోయారంటే మహారథులు ఎలా అవుతారు? మహారథులై ఓడిపోయారంటే అటువంటి శిక్ష మరెవ్వరికీ లభించదు.

మొట్టమొదటి కర్మభోగము బాధపడడం, విలవిలలాడడం, పశ్చాత్తాపపడడం. ఎంత ప్రయత్నించినా బుద్ధి బాబాతో లగ్నమవ్వదు. దీనినే బుద్ధి తాళము మూసుకుపోవడం అని బాబా అంటారు. ఆధారము కొరకు, సహాయము కొరకు వెతుకుతారు. నాకు సహాయం చేయువారు ఎవరైనా ఉన్నారా అని వెతుకుతూ ఉంటారు " నాకు మీరొక్కరే ఆధారము " అనే మాట మర్చిపోతారు. ఎందుకంటే ఆ ఒక్కరితో సంబంధము తెగిపోయింది. అప్పుడు దేహధారుల ఆధారము తీసుకోవాలని ప్రయత్నిస్తారు. కాని దేహధారుల ఆధారము అల్పకాలము మాత్రమే ఉంటుందనే నియమముంది. ఎవరి వద్ద ఏ వస్తువు ఉంటుందో వారు దానిని మాత్రమే ఇవ్వగలరు. స్వయం వారే దేహములో చిక్కుకొని ఉండువారు ఇతరులకు ఏమివ్వగలరు? అందువలన మహారథులు సదా తమ లెక్కాచారాన్ని చూసుకుంటూ ఉండాలి. ఇంతకు ముందు బాబా "మీ లెక్కాచారము చూసుకోండి, ఎవ్వరినీ నేను కఠినంగా మాట్లాడలేదు కదా? స్వప్నములో ఎలాంటి వికల్పాలు రాలేదు కదా?" అని చెప్పారు. కాని ఇప్పుడు బాబా చెప్తున్నారు - " మీరు మహారథి పిల్లలు". ఇంకా అలాగే లెక్క చూసుకుంటూ ఉంటారా? ఇప్పుడు మహారథి పిల్లలైన మీరు బాబా ఇచ్చిన స్మృతులను బుద్ధిలో ఉంచుకొని కర్మలు ఆచరిస్తున్నానా? నేను సదా కర్మయోగిగా ఉంటున్నానా? అని పరిశీలించుకుంటూ ఉండాలి.

కొంతమంది బాబాను - "బాబా, మేము 9-10 గంటలు సేవ చేస్తాము, అయినా మాకు యోగము కుదరదు. ఎందుకు?" అని అడుగుతారు. రోజంతా



స్థూల కర్మలలో, స్థూల విషయాలలో ఉండినందున యోగము కుదరదు. అలసట వలన యోగములో నిద్ర వస్తుంది. స్థూల సేవ వలన యోగములో నిద్ర వస్తే సేవ పట్ల వైరాగ్యము కలుగుతుంది. అలా వైరాగ్యము కలగకుండుటకై బాబా ఒక మంచి యుక్తి తెలిపించారు. సేవ వలన మంచి భవిష్యత్తు లభిస్తుంది. ఎంత ఎక్కువ సేవ చేస్తారో, వారి భవిష్యత్తు అంత ఉన్నతంగా అవుతుంది. ఎందుకంటే మనము ఎవరి సేవ చేస్తాము? యజ్ఞ సేవ. యజ్ఞ సేవ అంటే అదంతా బాబా కర్తవ్యమే. బ్రహ్మాబాబా ఇంత సేవ చేశారు, యజ్ఞవత్సలు ఇంత సేవ చేశారు, వారు ఏమైనా సేవ చేస్తూ చేస్తూ ఢీలా పడిపోయారా? లేదు. వారికి సేవ వలన బలము లభించింది. మీరు ప్రాక్టికల్‌గా చూస్తున్నారు, అనుభవము చేస్తున్నారు. ఎవరు ఎంత సేవ చేస్తారో అంత శక్తి లభిస్తుంది, తగ్గిపోదు. కర్మలు ఆచరిస్తున్నా, సేవ చేస్తున్నా పిల్లలు - " నేను నెగటివ్ సంకల్పాలు చేయడం లేదు కదా అని లెక్క చూసుకుంటూ ఉండాలి". సంకల్పాలు ఒక గొప్ప శక్తి. సమర్థులైన బాబా పిల్లలు సమర్థ సంకల్పాలు మాత్రమే చేస్తారు కదా. మనము ఎవరి పిల్లలమో గుర్తుంటుంది కదా. సర్వశక్తివంతుని పిల్లలమైన మనము శక్తులము, పాండవులము.

## సత్యమైన బ్రాహ్మణులనగా మాస్టర్ సర్వశక్తివంతులు

మనము మాస్టర్ సర్వశక్తివంతులమైతే మనలో బలహీన సంకల్పాలు ఎందుకు నడవాలి? సంకల్పమనగా బీజము. బీజమును బట్టే ఫలము వస్తుంది. ఒక్క నెగటివ్ సంకల్పము వచ్చినా దాని ఫలితము ఎలా ఉంటుంది? నెగటివ్‌గానే ఉంటుంది కదా. కనుక మహారథి పిల్లలు తమ సంకల్పాల వైపు, స్మృతి వైపు గమనముంచాలి. నా మనస్సు, నా బుద్ధి అని అంటారు కదా. ఇది నాది అని చెప్పేది ఆత్మ కదా. బాబా అడుగుతారు " ఓ నా అధికారి పిల్లలూ, మీరు మీ దాని పై అధికారము ఉంచలేరా? మీ సంకల్పాల పై మీకు అధికారము లేకుంటే పరిస్థితులు వచ్చినప్పుడు శ్రేష్ఠ సంకల్పాలు చేయలేరు. బాబా ఇచ్చిన శ్రీమతమును స్మృతిలో ఉంచుకోకుంటే బాబా నుండి విశ్వ రాజ్యాధికారము ఎలా తీసుకోగలరు? మొదట శక్తివంతమైన ఫలము లభించగలిగే అధికారాన్ని ఉంచుకోండి. సంకల్పము శ్రేష్ఠముగా, స్మృతి శ్రేష్ఠముగా ఉంటే కర్మలు కూడా శ్రేష్ఠమైనవే చేస్తారు, అవి సుకర్మలుగా ఉంటాయి. సంకల్పము బలహీనంగా

ఉంటే సుకర్మలు జరగవు. కనుక మహారథులైన మీరు, "నేను ఈ రోజు బలహీన సంకల్పము చేయలేదు కదా?" అని లెక్కాచారము చూసుకోండి అని బాబా చెప్తారు.

మీరు బలహీన సాంగత్యములో ఉంటే బలహీన మాటలే మాట్లాడుకుంటారు. బలహీనుల సాంగత్యము చేస్తూ చేస్తూ మీ సంకల్పాలు కూడా బలహీనమౌతూపోతాయి. సాంగత్య దోషము అంటుకుంటుంది. మొదట సంకల్పాల పై రంగు ఏర్పడ్తుంది. తర్వాత స్మృతి పై కూడా ఆ రంగు ఏర్పడ్తుంది. బలహీన మాటల ప్రభావము స్మృతిలో ఏర్పడి అది బుద్ధి పైకి కూడా వచ్చేస్తుంది. కనుక నేను ఎవరైనా పరచింతన వినిపించు బలహీన ఆత్మతో స్నేహము చేయలేదు కదా అని గమనముంచాలి. పరచింతన పతనానికి మూలము. అది మిమ్ములను పతనము వైపుకు తీసుకెళ్తుంది. ఉదాహరణానికి సినిమా చూసి వచ్చేవారి బుద్ధిలో ఆ పాటలు, ఆ పాత్రధారులు, ఆ మాటలే మెదులుతూ ఉంటాయి. ఇంట్లో టి.వి ఉంటే గమనము టి.వి పై, దానిలో నటించే నటీ నటుల పై, పాటల పై ఉంటుంది. దైహిక ప్రేమ గల దృశ్యము చూస్తే వారి కనుల ముందు ఆ దృశ్యాలే తిరుగుతూ ఉంటాయి. ఇటువంటి ఆత్మ శక్తిశాలిగా ఉంటుందా? బలహీనముగా ఉంటుందా? మనము ఎటువంటి దృశ్యాలు చూస్తే మన సంకల్పాలు, స్మృతి శక్తివంతమౌతాయి?

## సత్యమైన బ్రాహ్మణులనగా స్వరాజ్యాధికారులు, బేహద్ వైరాగులు

మీరు మధువనానికి వచ్చారంటే రాజయోగుల సాంగత్యంలో ఉంటారు. ప్రతీ క్లాసులో మీకు శక్తివంతమైన విషయాలు తెలిపిస్తారు. అవి మీ బుద్ధిలో తిరుగుతూ ఉంటాయి. ఈ మాటలు నాకు చాలా బాగున్నాయని, నాకు ఈ విషయము రియలైజ్(అనుభూతి) అయ్యిందని, ఈ మాట నాకు బాణము వలె తగిలిందని అంటూ ఉంటారు. పదే పదే అదే చింతన నడుస్తుంది. కనుక ఎటువంటి సాంగత్యము లభిస్తే అటువంటి రంగు తప్పకుండా ఏర్పడుతుంది. ఎందుకంటే అదే దృశ్యము మీ ఎదుట తిరుగుతూ ఉంటుంది. ఎవరిదైనా బలహీనతను చూస్తే గమనము దాని వైపే పోతుంది. ఎందుకంటే అటువంటి వ్యర్థమైన మాటలు, దృశ్యాలు చూస్తున్నా చూడకుండా, వింటున్నా వినకుండా ఉండునంత శక్తి లేదు. చూచే కనులు, మాట్లాడే నోరు, వినే చెవి - ఇవే ఆత్మను



బలహీనంగా గానీ, శక్తిశాలిగా గానీ చేసే ముఖ్యమైన కర్మేంద్రియాలు. ఈ మూడు కర్మేంద్రియాల ద్వారా ఏదైనా బలహీనత వస్తే తప్పకుండా భోగించవలసి వస్తుంది. ధర్మరాజు ద్వారా లభించు శిక్షలు వీటి వలననే లభిస్తాయి. కర్మేంద్రియాలతో ఎలాంటి వికర్మలు జరగరాదు. ఇంతకు ముందు కర్మేంద్రియాలతో ఏ వికర్మలు జరగరాదని బాబా చెప్పేవారు. ఇప్పుడు మనము ఇంటికి వెళ్లాలి కనుక బుద్ధిలో బేహద్ వైరాగ్యముండాలి. అన్నీ ఇక్కడే వదిలిపోతాయి. మనము ఇక్కడ కేవలం సేవార్థము కొంతకాలము మాత్రమే ఉంటాము. బాబా ఎలాగైతే ఇతరుల శరీరములో మనలను కలుసుకునేందుకు వచ్చినప్పుడు నేను అతిథినని, మధువనంలో పిల్లలను కలుసుకునేందుకు వెళ్తున్నానని వారిని కలిసి మళ్లీ వాపసు రావాలని భావిస్తారు. బాబా ఈ రథాన్ని అప్పుగా, ఆధారంగా తీసుకుంటారు. పిల్లలను కలిసి వారికి ఇవ్వాలని భావిస్తారు. బాబా తన వద్ద ఉండేదంతా పిల్లలకిచ్చేస్తారు. పిల్లలైన మనము బాబా నుండి తీసుకుంటాము. అలాగే మనము కూడా ఈ శరీరాన్ని అప్పుగా తీసుకున్నామని అనుభవం చేయాలి. ఎందుకంటే ఇది మనకు మరజీవా జన్మ. మన జీవితము పవిత్రమైనది. ఎందుకంటే మనము నోటి ద్వారా జన్మిస్తాము. మనము బ్రహ్మ ముఖవంశావళి బ్రాహ్మణులము.

## సత్యమైన బ్రాహ్మణులనగా అతిథులు మరియు నిమిత్తులు (ట్రస్టీలు)

శివబాబా మనకు వినిపించిన శబ్దాల ద్వారా మనకు కొత్త జన్మ లభించిందని అనుభవం చేసి నిశ్చయం చేసుకున్నాము. నిశ్చయబుద్ధి గలవారు విజయులుగా అవుతారు. ఇప్పుడు మనము బాబా పిల్లలుగా అయ్యాము, పక్కా బ్రాహ్మణులము, సత్యమైన బ్రాహ్మణులుగా అయిపోయాము. కనుక మనము కూడా స్వయాన్ని అతిథిగా భావించాలి. ఈ శరీరములో కూడా అతిథులమే. ఈ ప్రపంచములో మనమెలాగైనా అతిథులమే. బాబా మనలను తీసుకెళ్లేందుకు వచ్చారు. శరీరములో కూడా మనము అతిథులుగానే ఉండాలి. ఇది రెండు ఘడియల ఆట. కూర్చొని ఉండే మనిషి వెళ్లిపోతాడు. ఇది పాత ప్రపంచం సమాప్తమయ్యే సమయము. ఈ శరీరము కూడా సేవ కొరకు బాబా నుండి లభించింది. ఎందుకంటే మనము ఈ శరీరాన్ని బాబాకు సమర్పించాము. ఇప్పుడు మనము నిమిత్తంగా ఉండి దీనిని సేవ కొరకు సంభాళిస్తున్నాము, ఇందులో ఉంటున్నాము. మనము బాబాకు సమర్పిత పిల్లలము. సమర్పణమైన

పిల్లలకు స్వంతమేదీ ఉండదు. నాదంటూ ఏదీ లేదు. మీరు చూస్తున్న శరీరము, చేస్తున్న సంకల్పాలు, స్మృతి అవన్నీ బాబా ద్వారా లభించినవే. బాబా ప్రతి రోజు మురళిలలో వినిపించి వినిపించి దివ్య బుద్ధినిస్తున్నారు. ఇక నా బుద్ధి, నా సంకల్పము ఎలా ఉంటాయి? నాకు 'నాది' అనేది ఏదైనా ఉందా? మీకు మీదంటూ ఏదైనా ఉందా? లేదు. ఎందుకంటే దేహ సహితము సర్వస్వము బాబాకు సమర్పణ చేసేశారు, స్వాహా చేసేశారు.

ఈ అవినాశి జ్ఞాన యజ్ఞాన్ని బాబా జతలో బ్రాహ్మణులు కూడా స్వాహా చేసేందుకు రచించారు. ఈ శరీరాన్ని, సంకల్పాలను యజ్ఞములో స్వాహా చేయబడ్డాయి. ఏ ఆత్మలైతే అయితే శరీరాన్ని, సంకల్పాలను తనవని భావిస్తారో, వారు మాయను ఎప్పుడూ జయించలేరు. ఇది పక్కాగా అర్థం చేసుకోండి. కాని ఎవరు నిమిత్తులుగా ఉంటారో, సర్వస్వము బాబాదే అని భావిస్తారో వారి ముందు మాయ మోకరిల్లుతూ పోతుంది. లౌకిక కుటుంబంలో ఉండినా, యజ్ఞములో ఉండినా వారు మాయతో ఓడిపోరు. ఎక్కడ ఉండినా ట్రస్టీలుగా, నిమిత్తులుగా ఉండాలి. బ్రహ్మకుమార - కుమారీలనగా ట్రస్టీలు. ఇంట్లో ఉండేవారు ఎప్పుడూ వీరు నా పిల్లలు, ఈమె నా కోడలు అని భావించరాదు. ఎవరైనా అకస్మాత్తుగా శరీరాన్ని వదిలేస్తే దు:ఖపడకండి. అయ్యో నా కొడుకు ఉన్నట్లుండి పోయాడు! నా భర్త అకస్మాత్తుగా పోయాడు! ఎంత సుఖమిచ్చేవాడు, డబ్బులిచ్చేవాడు! మా ఇల్లు చాలా బాగా జరుగుతూ ఉండేది, ఈ రోజు ఏమైపోయింది! ఇవన్నీ నెగటివ్ సంకల్పాలు. ఎందుకంటే 'నాది' అని భావించారు కదా. ఎవరిలో 'నాది' అను ఆకర్షణ ఉంటుందో వారు దు:ఖపడుతూ ఉంటారు. కనుక నాది అనేది ఏమియు లేదు, నేను కేవలం ట్రస్టీని, నా పతి కూడా బాబా సంతానమైన ఆత్మ, కోడలు కూడా బాబా కూతురైన ఆత్మ, కొడుకు కూడా బాబా సంతానమైన ఆత్మ. అన్నీ బాబావే అయినప్పుడు ఇది నాది, వీరు నా వారు అని ఎందుకు మోసం చేయాలి? వాస్తవానికి ఇవన్నీ బాబావే. గృహస్థములో ఉంటూ కమల పుష్ప సమానంగా ఉండే ట్రస్టీని. 'నాది'(మేరాపన్) అనేది తొలగి, శ్రీమతమును అనుసరిస్తూ ఉంటే విజయీ పిల్లలుగా అవుతారు. వారు 12 గంటలు పని చేసినా, సేవ చేసినా వారి ద్వారా ఎలాంటి వికర్మలు జరగవు. కొంతమంది బాబా పిల్లలు మేము మధువనంలోనే సేవ చేస్తాము,



రాత్రింబవళ్లు సేవ చేస్తామని అంటారు. ఇక్కడ సేవ చేయడం మాకు బాగుంటుంది. యజ్ఞ సేవతో పాటు బాబా ప్రేరణలు లభిస్తాయి, ఆత్మకు శక్తి లభిస్తుంది, ఇక్కడ మాకు అలసట కలగదు అని అంటారు. ఎందుకు? ఎందుకంటే సేవ ద్వారా వారికి ఆశీర్వాదాలు లభిస్తాయి. బాబా శ్రీమతానుసారము సేవ చేసినందున బాబా నుండి శక్తి లభిస్తుంది. బాబా సుప్రీమ్ శక్తి, ఆజ్ఞాకారి పిల్లలకు కరెంటు ఇస్తారు.

ఇంత పెద్ద సమూహములో సమర్పణవ్వడం చిన్న మాట కాదు. ఒక్కొక్కరి ఆలోచనలు ఒక్కొక్క విధంగా ఉంటాయి. కొంతమంది కూర్చోమంటారు, కొంతమంది కూర్చోవద్దంటారు. కొంతమంది ఆ పని చేయమంటారు, కొంతమంది ఆ పని వద్దంటారు. ఇటువంటి సంఘటనలో మనము ఎలా నడుచుకోవాలి? ఒకే సంకల్పముతో, ఐకమత్యంగా నడుచుకోవాలి. ఇందుకు కూడా బాబా జ్ఞానమునిస్తున్నారు. మధువనములో సమర్పితమయ్యేందుకు స్థితి చాలా శ్రేష్ఠంగా ఉండాలి. ఎవరు నిమిత్తంగా ఉంటారో, వారు ఆజ్ఞాకారులుగా అవ్వాల్సి వస్తుంది. బాబా కూడా, ఎవరు ఆజ్ఞాకారులుగా, నమ్మకస్థులుగా, విశ్వాస పాత్రులుగా ఉంటారో ఆ పిల్లలు నాకు చాలా ప్రియమైనవారు అని అంటారు. చాలామంది పిల్లలలో పెద్దవారిని ఆకర్షించే విశేషతలున్నాయి. దాదీని ఆకర్షిస్తారు. అప్పుడే వారిని దాది సమర్పణ చేయిస్తారు. హృదయము స్వచ్ఛముగా, సత్యముగా ఉంటుంది. ఏదీ దాచిపెట్టరు. పూర్తి ట్రస్టీలుగా ఉంటారు. వారి పూర్తి లెక్కాచారము పెద్దవారి ముందు ఉంటుంది. ఎప్పుడూ అసత్యము చెప్పరు. దొంగతనము చేయరు. ఎప్పుడూ నోటితో కఠినంగా మాట్లాడరు. చాలా మధురంగా మాట్లాడ్తారు. అందరితో గౌరవపూర్వకంగా వ్యవహరిస్తారు. వారు తమ మాటల ద్వారా, వ్యవహారము ద్వారా అందరి హృదయాలను చూరగొంటారు. ఇటువంటి గుణాలను కర్మలలో ఉపయోగిస్తే వారి భవిష్యత్తు ఎంత ఉజ్వలంగా ఉంటుంది! ఒకటేమో వారు బాబా సేవలో లగ్నమై ఉన్నారు, రెండవది - బాబా సేవ చేస్తూ చేస్తూ వారిలో పరివర్తన వచ్చేస్తుంది. అందరితో వారి వ్యవహారము బాగుంటుంది. కనుక ఇంత పెద్ద సంఘటన నుండి వారికి ఆశీర్వాదాలు లభిస్తాయి. ఇంతమంది బ్రాహ్మణుల ఆశీర్వాదాలు లభించినప్పుడు వారు ఒక ఫరిస్తా వలె అవుతారు. మనము యజ్ఞములో ఉంటూ, బాబా పిల్లలమై

నమ్మకస్థులుగా, విశ్వాసపాత్రులుగా లేకుంటే అది చాలా పెద్ద పాపము. చాలా పెద్ద శిక్షలు అనుభవిస్తారు. చాలా పశ్చాత్తాపపడ్తారు. అందువలన బాబా చెప్తారు - నేను ఇచ్చిన శ్రీమతానుసారము మీ విశేషతల ద్వారా కర్మలు చేయండి, సేవ చేయండి. భలే సేవ బాగా చేయండి, రాత్రింబవళ్లు చేయండి, వద్దనరు కాని శ్రీమతమును అనుసరించి చేయండి. సేవలలో ఎప్పుడూ నెగటివ్ సంకల్పాలు రాకూడదు. సదా పాజిటివ్ సంకల్పాలు చేయాలి. ఎందుకు? ఏమి? అను ప్రశ్నలే రాకూడదు. బాబా అన్ని ప్రశ్నలకు జవాబులిచ్చేశారు.

## సత్యమైన బ్రాహ్మణులనగా ఒక్క బాబానే తోడుగా, ఆధారముగా ఉంచుకునేవారు

అప్పుడప్పుడు చివరిలో వచ్చే సోదరీ-సోదరులు పాతవారి కంటే ముందుకెళ్లిపోతారు. నేనిక్కడ ఒక ఉదాహరణ కూడా చూశాను. కొద్ది సమయములోనే ఆ ఆత్మ తన తనువు, మనసు, ధనములన్నింటిని సమర్పణ చేసేశాడు. స్వభావము చాలా మంచిగా, మధురంగా ఉంటుంది. కనుక భగవంతుని హృదయాన్ని అధిరోహించాడు. దానితో పాటు బ్రాహ్మణ పరివారమంతటి హృదయాన్ని కూడా అధిరోహించాడు. పాతవారు ఇంకా అలా అవ్వలేదు. ఈ కొత్త ఆత్మ బాబా హృదయాన్ని అధిరోహించాడు. బాబా మాకు ప్రారంభములోనే ఇలా చెప్పేవారు - పిల్లలూ, చివర్లో రెడీమేడ్ పిల్లలొస్తారు. కర్మ బంధనాలు తెంచుకునేందుకు మీకు కొంత సమయము పట్టింది. యుద్ధము చేయవలసి వచ్చింది, కొంతమందికి వారి కుటుంబ సభ్యుల నుండి అనుమతి లభించలేదు. చాలా గలాటా జరిగింది, అదంతా సహించారు. సేవ ప్రారంభమైనప్పుడు కూడా చాలా చోట్ల జనము చాలా తిట్టి నిందించారు. చాలామంది విఘ్నాలు కలిగించారు. మేము చాలా సహించి ముందుకు వచ్చాము.

చివర్లో వచ్చేవారికి ఏ బంధనాలూ ఉండవు. కాని వారిలో పాతవారికున్నంత సహనశక్తి ఉండదు. మేము బాబా ప్రేమలో ఎంతైనా సహించాము, కాని సహించినట్లు కూడా తెలియలేదు. చివర్లో కుటుంబాలు కుటుంబాలే వచ్చేస్తారు అని బాబా చెప్పారు. వారి పిల్లలు కూడా వస్తారు, పత్ని



కూడా వచ్చేస్తుంది. మా సమయములో పతి వస్తే, పత్ని, పిల్లలు వచ్చేవారు కాదు. పత్ని వచ్చి మమ్ములను చాలా తిట్టిపోసేది. కొన్ని కుటుంబాల్లో పత్ని వస్తే పతి వచ్చేవాడు కాదు. అతడు వచ్చి మమ్ములను చాలా తిట్టేవాడు. కొన్ని కుటుంబాలలో తల్లిదండ్రులు వచ్చేవారు కాదు. పిల్లలు వచ్చేవారు. తల్లిదండ్రులు వచ్చి మమ్ములను తిట్టేవారు. మేము ఏమీ మాట్లాడకుండా మౌనముగా ఉంటూ వారికి దృష్టినిచ్చేవారము. బాబా, వీరిని శాంతపరచండి, వీరికి సద్బుద్ధినివ్వండి అని యోగము చేసేవారు. మేము ఎవరికైనా పవిత్రులుగా ఉండకండి అని ఎలా చెప్పగలము. ఈ విషయములోనే చాలా కొట్లాటలు జరిగాయి. క్లాసుకు వచ్చేవారు కూడా తిట్లు తిన్నారు. వారి కారణంగా మేము కూడా తిట్లు తిన్నాము. కొత్తవారు సేవలోకి వచ్చేశారు. సేవ హృదయపూర్వకంగా చేసేవారు. బాబా చెప్పినట్లు పవిత్రత గురించి మేము నేరుగా చెప్పేవారము.

ఒకసారి నేను మీరట్‌కు వెళ్లాను, సేవకు నేను పూర్తిగా కొత్తదానిని. ఒక సోదరునికి బాబా నా ద్వారా సాక్షాత్కారము చేయించారు. అతడు వచ్చి "ఓ దేవి, నన్ను బలి తీసుకోండి. నేను మీకు బలి అవుతాను, మీకు అర్పణ అవుతాను, దేవి బలి కోరింది, నేను బలి అవుతాను" అని అన్నాడు. ఇతడు నేను బలి అవుతాను, మీకు బలి అవుతాను అని ఎందుకంటున్నాడని నేను ఆలోచించసాగాను. నేను అతనిని చూస్తూ ఉండినాను. అతడు కన్నీరు కారుస్తూ అలాగే ఉండిపోయాడు. నేను యోగము చేస్తూ లైట్‌లో కూర్చుండిపోయాను. నెమ్మది నెమ్మదిగా అతడు శాంతించాడు. బాబా అతనికి అనుభవము చేయించాడు. నేను వచ్చి పని చేస్తాను, సేవ చేస్తాను అని బాబా అంటాడు కదా. తర్వాత నేను అతడిని ఏమి జరిగిందని ప్రశ్నించాను. బలి అని ఎందుకన్నావు, దేవి ముందు మేకను బలి ఇస్తారు, మీరేమైనా మేకనా? అని అతనిని అడిగాను. నేను మేకను కాకుంటే ఎవరిని? నేను మేకనని నాకు అనుభవమయింది. బాబా జ్ఞానము విని నాకు లోపలి నుండి ఏడ్పు వచ్చింది. నేను చాలా పాపము చేశాను. ఎన్నో పతిత కర్మలు చేశాను, నాలో 'నేను' అను అభిమానము చాలా ఉండినది. బహుశా అందుకే బాబా నాకు మేకను అనుభవము చేయించారు అని చెప్పాడు. అతనికి దేవి కూర్చొని ఉందని అనిపించి ఉండవచ్చు. అతడు మళ్లీ ఇలా చెప్పాడు - నాలో చాలా చెడు చేరి ఉంది. ఈ

రోజు దానినంతా అర్పణ చేస్తున్నాను అని చెప్పాడు. తర్వాత నేను అతనికి ఇదంతా స్థూలమైన విషయము కాదని అర్థం చేయించాను. మనస్ఫూర్తిగా బాబా ముందు సమర్పితమైపో, బాబాకు నీలోని చెడునంతా దానమిచ్చేయి, నీకు పట్టిన గ్రహణము వదిలిపోతుంది అని చెప్పాను. దాని తర్వాత ఆ సోదరుడు చాలా మంచిగా మారిపోయాడు. పశ్చాత్తాపము బలహీనంగా కూడా చేస్తుంది. దానితో పాటు సమర్థ సంకల్పాలు, దృఢ సంకల్పము కూడా చేయాలి. ఇచ్చిన దానమును వాపస్ తీసుకోకుంటే వారు ముందుకు పోగలరు. ఉన్నత పదవి పొందగలరు. కనుక మాతలు గాని, కుమార-కుమారీలు గాని, పిల్లలు గాని ప్రారంభము నుండి పునాది గట్టిగా ఉంచుకోండి. ఎటువంటి పరిస్థితిలోనైనా శ్రీమతమును అనుసరించండి. తోడుగా, ఆధారంగా ఒక్క తండ్రిని మాత్రమే ఉంచుకోండి. మన సర్వ సంబంధాలు ఒక్క తండ్రితోనే. మన ఆశలన్నీ ఒక్క బాబా పైననే ఉన్నాయి. బాబాలో ఎంత నిశ్చయబుద్ధి ఉంటుందో, బుద్ధియోగము బాబాతో ఎంతగా జోడింపబడి ఉంటుందో అంత మాయతో ఓడిపోరు. అంతేకాక మీకు చాలా శక్తి లభిస్తుంది, చాలా ధైర్యవంతులుగా అవుతారు.

గృహస్థములో ఉండువారికి పరీక్షలు, పరిస్థితులు వస్తాయి. ఒకరి విచారాలు మరొకరితో కలవకుండా ఉండవచ్చు. మీ మాట ఇతరులు వినకపోవచ్చు. కాని మీరు ఎప్పుడూ  కోపగించుకోరాదు. వారికి జ్ఞానము తెలిపి, బాబా సందేశము ఇవ్వడం మీ కర్తవ్యము. అందరికీ జ్ఞానాన్ని అర్థం చేయించండి. వింటే మంచిదే లేకుంటే వదిలేయండి. వారితో ప్రీతిగా వ్యవహరించండి. మధ్య-మధ్యలో వారికి మధురమైన జ్ఞాన మాత్రలు తినిపిస్తూ ఉండండి. వారి పట్ల శుభ భావన, శ్రేష్ఠ భావనలు ఉంచండి. డ్రామాలో పాత్ర ఉంటే తప్పకుండా వస్తారు. ఎప్పుడూ నెగటివ్‌గా ఆలోచించకండి, నెగటివ్ భావము ఉంచుకోకండి. వీరు కూడా బాబా పిల్లలే అని సదా ఉన్నతమైన శుభ భావన ఉంచండి. కోపగించుకోవడం కూడా హింసే. చిన్న పిల్లలను కూడా ఎప్పుడూ కోపగించుకోరాదు. నేను కోపగించుకోను అని పక్కాగా దృఢ సంకల్పము చేసుకోండి. ఒక్క కోపము పై విజయము పొందుట ద్వారా మీరు చాలా మధురాతి మధురంగా తయారైపోతారు. మీఠే మీఠే బచ్చే అని బాబా అంటారు కదా. మీ వృత్తి ద్వారా ఇంటిలో మంచి వాతావరణము తయారవుతుంది.



దానము ఇంటి నుండే మొదలవుతుంది. సమయము చూసి వారికి జ్ఞాన యోగాల పాలననివ్వండి. చివర్లో పశ్చాత్తాపపడే కర్మలేవీ చేయకండి. ఇటువంటి వ్యక్తులే సత్యమైన బ్రాహ్మణులు.



## సత్యమైన ప్రేమ

బాబా పిల్లలందరు, బాబా ప్రేమలో తమను తాము మర్చిపోయి ఉన్నారు ఎందుకంటే పిల్లలకు బాబా ప్రేమ లభించింది. ఇంత కాలము లభించని ప్రేమ ఇప్పుడు లభించింది. సంగమ యుగము బాబాతో మిలనము చేయు సమయము. ప్రేమ చూడాలనుకుంటే బాబా పిల్లలలో చూడండి. కొంతమంది ప్రేమ అంటే ఏమిటో దాని అనుభూతి ఎలా ఉంటుందో చెప్పమని అడుగుతారు. నేను బాబా పిల్లల ప్రాక్టికల్ జీవితాన్ని చూస్తే ప్రేమ అంటే ఏమిటో అర్థమవుతుందని చెప్తాను. ప్రేమ చాలా గొప్ప గుణమే కాక ఒక గొప్ప శక్తి కూడా. వికారి ప్రేమ కూడా ఉంటుంది, నామ-రూపాల ప్రేమ కూడా ఉంటుంది. ఈశ్వరుని పై కూడా ప్రేమ ఉంటుంది. పేరేమో ప్రేమ, కాని సత్యమైన ప్రేమ అంటే ఏమిటో బాబా తెలిపించారు. ఈ ప్రపంచములో అన్నీ చూశాము కాని సత్యము చూడలేదని అందరూ అంటారు. కల్తీ కాలము వచ్చేసింది. అన్నిటిలోనూ కల్తీ కనిపిస్తుంది. కేవలం పదార్థాలలోనే కాదు, మనుష్యులలో కూడా కల్తీ చూస్తున్నాము. సత్యము మచ్చుకైనా లేదు. పూర్తి అసత్య ఖండమైపోయింది. అసత్య మాయ, అసత్య శరీరము, ప్రపంచమంతటా అసత్యమే. సత్యము లభించనే లేదు అని అంటారు. అందుకే విలవిలలాడుతున్న ఆత్మలకు సత్యమైన దారి చూపమని బాబా చెప్తున్నారు. ఏ పిల్లలకైతే నేను లభించానో, ప్రాక్టికల్‌గా ఎవరైతే నాతో మిలనము చేస్తున్నారో వారు ఇతరులను కూడా నాతో కలిపించండి. మీరు ఏ సత్యమైన ప్రేమనైతే అనుభవము చేశారో, ఆ అనుభవముతో ఇతరులను కూడా అనుభవీలుగా చేయండి. సత్యమైన ప్రేమను చూడాలనుకుంటే బాబా పిల్లలలో చూడమని చెప్పగలము. సత్యమైన ప్రేమకు గుర్తులేవి? వీరు సత్యమైన ప్రేమను అనుభవము చేశారని తెలుసుకునేందుకు మనమేమి చూడాలి? బాబా పిల్లలలో అటువంటి గుర్తులేమున్నాయి? ఎందుకంటే ఎవరి పై ప్రేమ ఉంటుందో వారు చివరికి ఇతరులను కూడా తమ సమానంగా చేస్తారు.

### మాతా – పితల ప్రేమయే సత్యమైన ప్రేమ

స్నేహితులతో సాంగత్యము ఏర్పడుతుంది, ప్రేమ ఉంటుంది, స్నేహముంటుంది, ఒకరి ఆలోచనలు మరొకరితో కలుస్తాయి. అలా కలుస్తూ



కలుస్తూ ఒక్కటిగా అయిపోతారు. పరస్పరము కలుస్తూ కలుస్తూ మనసులోని మాటలు తెలుపుకుంటూ ఇరువురూ ఒకటైపోతారు. స్నేహితులతో మనసు విప్పి మాట్లాడినట్లు తల్లిదండ్రులతో కూడా మాట్లాడలేరు. భగవంతుని ఖుదా-దోస్త్ అని అంటారు. స్నేహితుని చూడాలంటే భగవంతుని చూడండి. భగవంతునితో స్నేహమెవరు చేస్తారు? మనము భగవంతుని పిల్లలము కాని భగవంతుని మన స్నేహితునిగా కూడా చేసుకున్నాము. వారు తండ్రే కాక స్నేహమయమైన తల్లి కూడా అయ్యారు. వారు మాతా-పితల కంబైండ్ స్వరూపము. తల్లి ప్రేమకు మహిమ ఉంది. తల్లి తన పిల్లల కొరకు రాత్రింబవళ్లు మేలుకుంటుంది. పిల్లలను ప్రేమిస్తుంది. తండ్రి పిల్లలను అర్హులుగా చేస్తారు. తల్లి పిలల్లను ప్రేమిస్తుంది. మొదట పిల్లలకు తల్లి ప్రేమ కావాలి. పిల్లలను పెంచి పెద్ద చేసి అర్హులుగా చేసేందుకు తండ్రికి అప్పగిస్తుంది. ఇక్కడ ఇరువురు కంబైండ్‌గా ఉన్నారు. తల్లి సంబంధాన్ని అనుభవము చేశాము. తల్లి ప్రేమను, తల్లి పాలనను అనుభవము చేశారు. ఒకటేమో భౌతిక పాలన, రెండవది ఆత్మిక పాలన. ఈ మాతా-పితలు రెండిటిని ఇచ్చారు. ఈ రోజు వరకు ఇస్తూనే ఉన్నారు. తల్లిదండ్రుల నుండి ఏదైతే లభిస్తూ ఉందో దానిని ప్రతీ పుత్రుడు అనుభవము చేస్తున్నాడు. ఇప్పుడు మాతా-పితల పాత్ర ప్రాక్టికల్‌గా నడుస్తోంది.

### నిస్వార్థ ప్రేమయే సత్యమైన ప్రేమ

సత్యమైన ప్రేమ అనగా ఏమి? కాసంత కూడా స్వార్థముండరాదు. ఆ ప్రేమను మనము ప్రాక్టికల్‌గా మాత-పితలైన బాప్‌దాదా ద్వారా అనుభవము చేస్తున్నాము. ఒకవేళ ప్రేమలో స్వార్థము వచ్చిందంటే కల్తీ వచ్చేస్తుంది. మనుష్యాత్మల ప్రేమలో స్వార్థము కలిసి ఉంటుంది అనగా ప్రేమలో కల్తీ ఉంటుంది. అందుకే మనుష్యులకు మనుష్యుల నుండి లభించేది మోసమే. అందువలన ప్రేమ వలన మనుష్యులు దు:ఖితులుగా అయ్యారు. వారికి సత్యమైన ప్రేమ లభించడం లేదు. చాలా మోసగాళ్లు అని అంటారు కదా. ఎవరిని ప్రేమిస్తారో వారి నుండి మోసమే లభిస్తుంది. మోసము వలన మనుష్యులు దు:ఖితులుగా అవుతున్నారు. మనస్సు విరిగిపోతుంది, మనసు మారిపోతుంది. మనుష్యులు తికమకపడ్డారు. సత్యమైన ప్రేమ కొరకు నలువైపులా తిరుగుతారు, వెతుకుతారు. అసలు ఆ వస్తువే లేకుంటే ఎలా లభిస్తుంది? అందువలన ఈ సమయంలో

మనుష్యులందరు భ్రమ పడి ఉన్నారు. సత్యత లేనే లేదు. ప్రేమలో కల్తీ లేకుంటే, స్వార్థము లేకుంటే ఈ రోజు మనుష్యులలో అన్ని గుణాలు, అన్ని శక్తులు ఉండేవి. వారు అన్నిటితో సంపూర్ణముగా ఉండేవారు. కాని ఈ కల్తీ మనుష్యులను పూర్తిగా ఖాళీ చేసేసింది, బలహీనంగా చేసింది. మనిషి శక్తి విహీనంగా అయిపోయాడు. ఎందుకంటే ఈనాటి ప్రేమ వికారాలతో నిండి ఉంది. అది అల్పకాలిక ప్రేమ. దాని వలన లభించేది మోసమే. ఆ ప్రేమ ఈ రోజు ఉంటుంది, రేపు ఉండదు. ప్రపంచములో ఈ విషయము అందరికీ తెలుసు.

## ఆత్మిక ప్రేమయే సత్యమైన ప్రేమ

కుమారులు - కుమారీలు అంటేనే పవిత్రులు. పవిత్రత లేకుంటే వారిని కుమారులు-కుమారీలు అని అనరు. వారిలో పవిత్రతా శక్తి ఉంటుంది. ఈ రోజు సాధువులు - సత్పురుషులు - మహాత్ముల ముందు మనుష్యులు వంగి నమస్కరిస్తున్నారు, ఎందుకు? పవిత్రత వలన. వారి వేలాది శిష్యులు పవిత్రులుగా ఉండరు. వారొక్కరు మాత్రమే పవిత్రంగా ఉంటారు. ఈనాటి మనుష్యులు పవిత్రులుగా ఎక్కడున్నారు? సంకల్పములో గాని, మాటలో గాని, కర్మలో గాని పవిత్రులుగా లేనే లేరు. ఎందుకు? ఎందుకంటే సత్యమైన ప్రేమ లేదు. తండ్రి పై ప్రేమ లేదు. తండ్రిని ప్రేమిస్తే అందరిలో పవిత్రత వచ్చేస్తుంది. తండ్రిని ప్రేమించే వారి ద్వారా పాపము జరగనే జరగదు. మనుష్యులు రకరకాల పాటలను తయారు చేస్తారు. ప్రేమిస్తే భయమెందుకు (ప్యార్ కియాతో డర్‌నా క్యా) అని రకరకాల పాటలు తయారు చేశారు. అయితే ఇది ఏ ప్రేమ కొరకు చెప్పబడింది? మనుష్యుల మధ్య ఉండు ప్రేమ కొరకా? భౌతికమైన ప్రేమ కొరకా? కాదు. భౌతికమైన ప్రేమ కొరకు అని అనుకుంటే మోసపోతారు. ప్రేమించే వారిలో భయముండదని అంటారు. వారు అందులోనే సత్యత ఉందని భావిస్తారు. సత్యమైన ప్రేమ అంటే ఏమిటో ప్రపంచానికి తెలియదు. మనమేమి చెప్తాము? మనము దు:ఖమిచ్చే ప్రపంచాన్ని మర్చిపోయామని చెప్తాము. భయపడకుండా ఉండేందుకు ఎవరిని ప్రేమించాము. ఈ రోజు ప్రపంచము ప్రేమ విషయాలు వినాలని కోరుకుంటోంది. ఎందుకు? ఆత్మలో ప్రేమ ఉంది. ప్రేమ ఆత్మిక గుణము, ఆత్మిక ధర్మము. ఆత్మ అనాది సంస్కారము ద్వారా జ్ఞాన స్వరూపము, ప్రేమ స్వరూపము, ఆనంద స్వరూపము కూడా అయ్యింది. అయితే అలా తయారు



చేసిందెవరు? ఏ ప్రేమ ద్వారా మనము మళ్లీ ప్రేమ స్వరూపముగా అవ్వగలము? ఎవరిని ప్రేమించుట వలన మనలో ప్రేమ శక్తి వచ్చేస్తుంది?

## భగవంతునితో సర్వ సంబంధాలు జోడించుటే సత్యమైన ప్రేమ

మనుష్యులలో సత్యమైన జ్ఞానము గాని, సత్యమైన ప్రేమ గాని, సత్యమైన సంతోషము గాని లేవు. అసలు సత్యమే లేదు. కనుక ఎవరిని ప్రేమించాలి? పరమాత్మను ప్రేమిస్తే మోసపోరని కొంతమంది భావిస్తారు. అందువలన మందిరాలు, తీర్థస్థానాలు మొదలైన అన్ని చోట్లకు వెళ్తారు. నలువైపులా ప్రదక్షిణము చేశాము కాని దూరంగానే ఉండిపోయామని అంటారు కదా. తిరగడమైతే అందరూ తిరిగారు, అయినా ఎవరిని ప్రేమించాలనుకున్నారో వారి ప్రేమ లభించలేదు. భగవంతుడు స్వయంగా ఈ రథములో వచ్చినప్పుడే వారి ప్రేమ లభిస్తుంది. వారు వచ్చి స్వయంగా వారి పరిచయాన్ని వారే ఇస్తారు. మనము భగవంతుని చాలా ప్రేమించాము. అనేక జన్మల నుండి, రెండు యుగాల నుండి మనము ఆ ప్రేమను వెతుకుతూ ఉన్నాము. మనమందరము భగవంతుని ప్రేమించాము కాని కొంతమంది వారిని స్నేహితునిగా చేసుకున్నారు, కొంతమంది తల్లిగా చేసుకున్నారు, కొంతమంది తండ్రిగా చేసుకున్నారు, కొంతమంది సోదరునిగా చేసుకున్నారు, కొంతమంది టీచరుగా, కొంతమంది సద్గురువుగా, కొంతమంది దేవాది దేవునిగా కూడా చేసుకున్నారు. ఏదో ఒక సంబంధము చేసుకున్నారు కాని దానిని ముక్కలు ముక్కలుగా చేశారు. భగవంతుని ఏదో ఒక్క సంబంధంతో ప్రేమిస్తే మరో సంబంధములోని ప్రేమ కొరకు ఎవరెవరినో వెతుకుతారు. సంబంధమున్న చోటికి బుద్ధి తప్పక వెళుతుంది. ఇది నిశ్చితము. బాబాతో అన్ని సంబంధాలు జోడించి ఒక్క స్నేహితుని సంబంధము జోడించకుంటే మీ బుద్ధి దేహధారులైన స్నేహితుని వైపుకు తప్పకుండా వెళ్తుంది. వారితో మాట్లాడాలనే ఇష్టముంటుంది, వారిని కలవాలని ఇష్టముంటుంది. వారికి మనసులోని మాటలు వినిపిస్తారు. ఒకవేళ ఎవరి ప్రేమ అయినా స్నేహితునిలో తక్కువగా, పత్నిలో ఎక్కువగా ఉంటే వారి బుద్ధి పత్ని వైపుకు వెళ్తుంది. అటువంటప్పుడు పరమాత్మతో దేవాది దేవుని సంబంధము ఎలా ఉంటుంది? పిల్లల సంబంధాలు కూడా అక్కడక్కడ ఇతరులతో ఉంది కనుకనే వారి ప్రేమ కూడా ముక్కలు ముక్కలుగా అయిపోతుంది. ప్రేమ

పంచబడుతుంది. హృదయపూర్వకమైన ప్రేమ ఒక్కరితోనే లేదు కదా.

చాలాసార్లు పిల్లలతో, సంబంధీకులతో భయమేస్తుంది. బాబా, నా వద్దకు మాయను పంపకండి అని అంటారు. భయము కూడా ఒక మాయనే. ఎక్కడెక్కడ దేహ సంబంధమైన ప్రేమ ఉందో అక్కడకు మాయ తప్పక వస్తుంది. ఏ మనుష్యాత్మలతో మీ సంబంధము జోడింపబడి ఉందో వారి ద్వారా మాయ వచ్చేస్తుంది. నేనేమి చేయాలి అని బాబా  అంటారు. మీరు దేహధారులతో సంబంధము జోడించారు, అందువలన నేను వీరిని బాగా విసిగించు, బాగా పరీక్షించు అని మాయతో చెప్తాను. నేను వచ్చాను, నన్ను తెలుసుకొని కూడా ఇంకా దేహధారులతో దేహ సంబంధాలను ఉంచుకొని కూర్చున్నారు అనగా బాబాను ఇంకా పూర్తిగా తెలుసుకోలేదని అర్థమవుతుంది. ఇప్పటి వరకు వారి సంబంధాలు ఇటు అటు వ్యాపించి ఉన్నాయి. భక్తి మార్గములో భగవంతుడు వస్తే పూర్తిగా భగవంతుని వారిగా అవుతామని అనేవారు. వారు నావికులు, మన జీవితమనే నావను తీరానికి చేర్చువారు. నావను ఆ నావికుని చేతికి పూర్తిగా ఇవ్వకపోతే ఆ నావ మునిగిపోక ఏమి చేస్తుంది? వారిని మా నావికుడని అన్నారు కదా. నావను నడిపేవారెవరు? నావికుడా లేక అందులో కూర్చున్న ప్రయాణికులా లేక నావ దానంతకదే నడుస్తుందా? భవసాగరమును దాటించువారు, నావను తేల్చువారు వారే కదా.

అయితే వారి చేతికి నావనెలా ఇవ్వాలనే ప్రశ్న వస్తుంది. వారిని తెలుసుకొని, వారిని ప్రేమించి, వారితో సంబంధము జోడించి, జీవితమునంతా వారికెలా సమర్పించాలి? ముఖ్యంగా శ్వాస, సంకల్పాలు, స్మృతి అన్నీ నాకు అప్పజెప్పమని బాబా చెప్పారు. ఒక్కొక్క సెకండు, ఒక్కొక్క స్మృతి వారిదే అయ్యి ఉండాలి. సర్వ సంబంధాలు వారితో జోడింపబడి ఉంటే బాబా ప్రేమను మనము పూర్తిగా అనుభవము చేయగలము. అనగా ఈశ్వరానుభూతి చేయాలంటే సర్వ సంబంధాలు వారితో జోడించవలసి ఉంటుంది, పూర్తిగా నిభాయించవలసి ఉంటుంది. దీనినే బాబా రిటర్న్ అని అన్నారు. ఈ తండ్రి, తన పిల్లలను తమ సమానంగా చేస్తారు. మనము తండ్రినేమో  ప్రేమించాము కాని ప్రేమను గురించిన జ్ఞానమునిచ్చి బాబా పిల్లలతో సర్వ సంబంధాల ప్రేమను జోడింపజేస్తారు. దీని వలన పిల్లల మనసు ఏ దేహ సంబంధాల వైపు వెళ్లదు.



బాబా ప్రేమనిచ్చి పిల్లలను తమ సమానము ప్రేమ సాగరులుగా చేస్తారు. అందువలన సర్వ సంబంధాలు నాతో జోడించమని బాబా చెప్తారు. ఎవరైతే జ్ఞానాన్ని లోతుగా అర్థము చేసుకున్నారో, ఏకరసంగా, ఏకనామిగా ఉన్నారో, తండ్రిని పూర్తిగా గుర్తించారో వారే సర్వ సంబంధాలు జోడించగలరు. ఎవరికి బాబా పై ప్రేమ ఉంటుందో వారు వచ్చే పరిస్థితులను నవ్వుతూ, నవ్వుతూ దాటుకుంటారు. ఒకవేళ ఏ పిల్లలైనా ఆడుతూ, పాడుతూ పరీక్షలు దాటుకోలేకుంటే, వారి ప్రేమలో ఏదో గందరగోళము ఉందని భావించాలి. ఏదో పొరపాటు ఉందని, కల్తీ ఉందని వారి ప్రేమ మరెక్కడో చెదిరిపోయి ఉందని అర్థము. నది దాటుకునే ఒక కథను బాబా వినిపిస్తారు. ఒక గురువు ఒక భక్తునితో రామ నామము జపిస్తే నదిని దాటుకుంటావని చెప్తాడు. భక్తుడేమో దాటుకుంటాడు. కాని అది చెప్పిన గురువు నదిని దాటలేకపోయాడు. ఎందుకంటే ఆ మాట పై అతనికి నిశ్చయము లేదు. అనగా భగవంతుని పై అతనికి నిజమైన ప్రేమ లేదు. శిష్యునికి భగవంతుని పై పూర్తి నమ్మకము, ప్రేమ ఉండినది. కనుక శిష్యుడు దాటుకున్నాడు. భక్తి మార్గములో ఇటువంటి కథలు కూడా ఉన్నాయి. ఎవరిని ప్రేమించాలో, మనము ఎవరిని ప్రేమించామో మనకు తెలుసు. కనుక మనము భయపడరాదు.

## నిర్వికార ప్రేమయే సత్యమైన ప్రేమ

చాలామంది మేము పరివారములో ఉన్నాము, అందరితో కలిసి నడుచుకోవాలని అంటారు. అందువలన లౌకికములోని వారి చేతి భోజనము బాబా స్మృతిలో తినేస్తామని అంటారు. పవిత్రత కారణంగా ఇంట్లో జగడాలవుతాయి అందుకే కొద్ది రోజులు అపవిత్రమై, క్రిందపడి వారిని కూడా జ్ఞానములోకి తీసుకొచ్చిన తర్వాత పవిత్రంగా ఉంటామని అంటారు. అరే, క్రిందపడిన వ్యక్తి ఇతరులనెలా బాగు చేస్తాడు? పతిత వ్యక్తి ఇతరులనెలా పవిత్రంగా చేస్తాడు? ఇటువంటి వారు కూడా ఉన్నారు, విన్నారా! వారు ఎందుకు కింద పడతారు? ఇతరులను బాగు చేసేందుకు. నా పత్ని ఒప్పుకోదని పతి అంటాడు. కనుక ఆమెను సంతోషపెట్టి జ్ఞానము వినిపిస్తానని అంటాడు. అదే విధంగా పత్ని కూడా నా పతి ఒప్పుకోడు, చాలా కొట్లాడ్తాడు. అది నేను సహించలేను. ఇంటి వాతావరణము, వీధి వాతావరణము చెడిపోతుంది.

అందువలన కిందపడి, నెమ్మదిగా జ్ఞానములోకి తెస్తాను, నా పతి కూడా బాబా బిడ్డనే కదా అని పత్ని అంటుంది! ఇటువంటి వారు కూడా ఉన్నారు. అరే! కింద పడితే శక్తి అంతా సమాప్తమైపోతుంది కదా! పై నుండి కిందపడినవారు ముక్కలు ముక్కలైపోతారని బాబా అంటారు. వికారాలకు వశమయ్యేవారు ఆత్మిక శక్తిని పోగొట్టుకుంటారు.

రక్షించుకునేందుకు బాబా యుక్తులు తెలుపుతున్నారు - పిల్లలూ, రాత్రింబవళ్ళు నా స్మృతిలో ఉండి యోగశక్తి ద్వారా వారిని పరివర్తన చేయండి. ఎవరికైతే ఈశ్వరుని పై సత్యమైన ప్రేమ ఉందో, సర్వ సంబంధాలు ఒక్క భగవంతునితోనే ఉంటాయో, వారెప్పుడూ వికారాలకు వశమవ్వరు. బాబా స్మృతిలో లవ్‌లీనమై ఉంటే, మీ బంధనాలన్నీ ఎలా తెగిపోతాయో చూడండి. తయారైన బంధనాలు సులభంగా తెగిపోవు. వాటిని పద్ధతిగా తెంచవలసి వస్తుంది. జ్ఞాన-యోగాలనే అస్త్రాలతో తెంచాలి. ఎవరినైనా ఉద్ధరించేందుకు శ్రీమతమును ఉల్లంఘించడం నియయము కాదు. ఇది బాబా పై సత్యమైన ప్రేమ కాదు. ఇది మోసము. ఎవరినైనా ఉద్ధరించేందుకు స్వయం కిందదపడడం మిమ్ములను మీరు మోసగించుకోవడమే అవుతుంది. అటువంటి ఆలోచన కూడా రాకూడదు. ఎవరినైనా ఉద్ధరించాలంటే పవిత్రతా బలముతో ఉద్ధరించవచ్చు. పవిత్రతా బలము ముందు ఏ శక్తి కూడా పని చేయదు. శక్తిశాలి స్మృతి ద్వారా పవిత్రతా బలము వస్తుంది.

## భగవంతుని జీవితమంతా తోడుగా చేసుకోవడమే సత్యమైన ప్రేమ

సంగమ యుగములో పవిత్ర కుమారులు - కుమారీలుగా ఉండడం కూడా గొప్ప భాగ్యము. కొంతమంది కుమారులు - మాకు జబ్బు చేస్తే సహాయము చేసేందుకు ఎవరైనా కావాలి కదా, అందుకు మేము వివాహము చేసుకుంటాము, వికారాల కొరకు కాదు తోడుగా ఉండేందుకు వివాహము చేసుకుంటామని అంటారు. ఈ సంకల్పము చాలా తప్పు. సాక్షిగా బాబా ఉన్నారు కదా. ఆ సాక్షి(తోడు) పై మీకు నమ్మకము లేదు. అందుకే మరో తోడు కావాలని అనుకుంటారు. దీని వలన మీకు మరొకరితో సంబంధముందని తెలిసిపోతుంది. ఇతరులతో ఉంది కదా? మీ స్వార్థము కొరకు తోడు కావాలని అనుకుంటారు. మాది పవిత్ర ప్రేమ అని అంటారు. పవిత్ర ప్రేమ అను పేరుతో



వివాహము చేసుకుంటారు. కాని అందులో స్వార్థముంది. ఇంకా కొంతమంది - ప్రవృత్తిలో ఉండి, కమల పుష్ప సమానముగా ఉండండి, కలిసి ఉండి పవిత్రముగా ఉన్నామని ప్రపంచానికి చూపండి, ఇరువురు కలిసి సేవ చేయండి అని బాబా చెప్పారు కదా. బాబా ఆజ్ఞానుసారము మేము స్యాంపుల్‌గా అవ్వాలానుకుంటున్నామని అంటారు. ఇది రైటు కాదు. అవినాశి తోడును మర్చిపోయినందున ఇలా అంటారు. గృహస్థులుగా లేనివారిని గృహస్థులై స్యాంపుల్‌గా కమ్మని బాబా చెప్పలేదు. కర్మ లెక్కాచారమనుసారము ఎవరైతే గృహస్థులుగా ఉన్నారో వారి కొరకు అలా చెప్పారు. సర్వసంబంధాలు నాతో జోడించమని బాబా ఎందుకు చెప్తారు? ఎందుకంటే అలా జోడించకుంటే ఏదో ఒక రూపంలో ఆ ఆత్మలు గుర్తుకొస్తూ ఉంటారు. స్వార్థము వలననే దేహధారి ఆత్మలు గర్తుకొస్తారు. స్వార్థముంటే బాబా సహాయము లభించదు. స్వార్థము కొరకు వివాహము చేసుకుంటే క్రిందపడిపోతారు. బాబా సహాయము చేయరు. బాబా అయితే సాక్షిగా ఉన్నారు. వారి అనుమతితో, వారి శ్రీమతముతో చేసుకుంటే వారి సహాయము లభిస్తుంది. కాని మీ ఇష్టానుసారము చేసుకుంటే కిందపడిపోతారు. కొంతమంది - మాది పవిత్రమైన ప్రేమ, సేవ కొరకు వివాహము చేసుకున్నామని అంటారు. ఇది వారి స్వార్థము. కాని సేవ పేరు చెప్పుకుంటున్నారు. ఎవరితో మన సర్వ సంబంధాలున్నాయో వారు మనకు సహాయము చేయరా? పాండవులకు తోడు ఎవరు? భగవంతుడు కదా! పాండవులు ఈ విషయము మర్చిపోయినందున దేహధారులను తోడుగా చేసుకొని కూర్చున్నారు. శాస్త్రాలలో కూడా పాండవులకు అంత మంచి పేరు ఎందుకు వచ్చింది? ఎందుకంటే వారికి తోడుగా భగవంతుడు ఉండినారు. శివశక్తులకు ఎందుకు పూజలు జరుగుతున్నాయి? ఎందుకంటే శక్తి అష్ట భుజధారి. శివునితో కంబైండు స్వరూపము. శక్తికి ఏ దేహధారితోనూ సంబంధము లేదు. వారి సర్వ సంబంధాలు శివుడొక్కరే.

## ఆజ్ఞాకారులుగా అయ్యి మనస్ఫూర్తిగా శ్రీమతమును పాలన చేయడమే సత్యమైన ప్రేమ

ఎవరి సర్వసంబంధాలు ఒక్క శివబాబాతోనే ఉన్నాయో వారి ప్రేమను

సత్యమైన ప్రేమ అని అంటారు. వారి గుర్తులేవి? ఆ ఒక్కరి ప్రేమలోనే లీనమై ఉంటారు, లగ్నములో మగ్నమై ఉంటారు. రెండవ గుర్తు - వారికి రేపేమవుతుందో అను చింత ఉండదు, భవిష్యత్తును గురించిన చింత ఉండదు. బాబా ఇచ్చిన శ్రీమతానుసారము సేవ చేస్తూ పోతారు, ముందుకు పోతూ ఉంటారు. సత్యమైన ప్రేమకు ఇదే గుర్తు - బాబా ఏమి చెప్తారో దానికి వెంటనే హాజీ బాబా, జీ బాబా (సరే బాబా, అవును బాబా) అని అంటారు, ఇంక ఏ ఇతర సంకల్పము ఉండదు. మా తండ్రి కళ్యాణకారి, వారు మా కళ్యాణము కొరకే ఆలోచిస్తారు, కనుక నేనెందుకు వ్యర్థంగా ఆలోచించాలి అని అనుకుంటారు. మనసు జన్మ - జన్మాంతరాలు పాపిగా ఉంది. ఈ జన్మలో కూడా మనసుకు బానిసగా ఉంటే ఇక ఏ జన్మలో మనసుకు అధికారిగా అవుతాము? మాయాజీతులు జగత్‌జీతులని అన్నారు. పంచ వికారాలను ఇప్పుడు కాకుంటే మరెప్పుడు జయించాలి? ఇప్పుడు కూడా అడ్డగింపబడాలా(గుట్కా తినాలా)? బాబా లభించారు, వారిని గుర్తించాము. వారే మన శిక్షకులు, సద్గురువు. కనుక వారి శిక్షణలను అనుసరించాలి కదా! మన్మతాన్ని ఎందుకు అనుసరించాలి? బాబా ఏ సంకల్పమునిస్తారో, ఏ శ్రీమతమునిస్తారో దానిని అనుసరిస్తాము. బాబా సంకల్పమునెలా ఇస్తారు ? వారు అవ్యక్తము కదా అని అంటారు. అవ్యక్త స్థితిలో ఉండి బాబా మహావాక్యాలు వినండి. అప్పుడు బాబా నుండి మీకు సంకల్పమూ లభిస్తుంది, శ్రీమతమూ లభిస్తుంది. బాబా అవ్యక్తమైనా మన జతలోనే ఉన్నారు. అన్ని సమయాలలో తోడుగా ఉండేవారు వారొక్కరే. ఒక సోదరుడు జాబు ఇలా వ్రాశాడు -" పిల్లలందరూ నాతో మిలనము చేయరు, ప్రతీ పుత్రుడు నాతో అవ్యక్త మిలనము చేయగలడు, కాని చేయరు అని బాబా అంటారు కదా. అందువలన నేను బాబాతో మిలనము చేశానా లేదా అని నాకు ఆలోచన వచ్చింది". ఒకవేళ అతడు బాబాతో మిలనము చేసి ఉంటే మిలనము చేసినట్లు అతనికి అనుభవము అయ్యేది. ఒకవేళ ఆలోచిస్తున్నాడంటే అతడు మిలనము చేయలేదు. బాబా చెప్తారు - పిల్లలూ, మీరందరు నాతో సంబంధము జోడించి నా నుండి వారసత్వము తీసుకోండి. ఇది పురుషుల కాలేజి. ఆత్మలంతా సోదరులు, పురుషులు. ఇక్కడ ఆత్మలు చదువుకుంటారు. చదివించేవారు పరమాత్మ. స్వయాన్ని ఆత్మగా భావించనివారు, ఇంకా ఎవరు దేహాభిమానములో ఉన్నారో



వారు దేహధారులతో సంబంధము జోడించారు. ఎవరి ఆత్మిక స్మృతి పక్కాగా ఉంటుందో, వారు తమ సర్వ సంబంధాలను తండ్రి అయిన ఒక్క పరమాత్మతో జోడించారు. భక్తులు ఎలాగైతే ఓ భగవంతుడా, ఈ బంధనాల నుండి మాకు ముక్తి కలిగించండి అని పిలుస్తారో అలా బాబా పిల్లలైన తర్వాత కూడా దేహధారులతో ఎవరు సంబంధము జోడిస్తారో వారు కూడా ఓ బాబా, మాకు ఈ బంధనాలు తొలగించు అని పిలుస్తూ ఉంటారు. ఇంకా ఇంతవరకు బాబాను - ఇది ఇవ్వండి, అది ఇవ్వండి అని అడిగేవారు ఉన్నారు. బాబాను వేడుకుంటున్నారు. భికారుల వలె తండ్రిని అడుక్కుంటున్నారు. సర్వశక్తివంతులైన తండ్రి పిల్లలుగా అయి కూడా ఎందుకు వేడుకోవాలి? ఇందుకు కారణము - దేహాభిమానము, దేహాధారులతో దైహిక ప్రేమ, దైహిక సంబంధము. ఇప్పటివరకు దాసులకు దాసులుగా ఉన్నారని, బాబావారిగా అవ్వలేదని, స్వతంత్రులుగా అవ్వలేదని అర్థమవుతుంది.

## తండ్రి వారసత్వానికి అధికారులుగా అవ్వడమే సత్యమైన ప్రేమ

బాబా నుండి సహాయము పొందాలంటే సర్వసంబంధాలు బాబాతో జోడించండి. సత్యమైన ప్రేమను జోడిస్తే శక్తి, సామర్థ్యము లభిస్తుంది అప్పుడు వారిని గాని, మరెవ్వరిని గాని వేడుకునే అవసరం ఉండదు. నిన్న ఒక పార్టీ వారికి బాబాను సంబంధముతో స్మృతి చేయమని అవ్యక్త బాప్‌దాదా బాబా తెలుపుతూ ఉండినారు. అలా ఎందుకు చెప్పారు? బాబా వారిని పిల్లలూ, ఈ స్మృతి చాలా సులభము, అయితే మీకెందుకు కఠినమనిపిస్తుంది? అని అడుగుతూ ఉండినారు. నాతో సంబంధము జోడిస్తే చాలు, సంబంధము వలన ప్రాప్తి అవుతుంది. తండ్రి తన ఆస్తిని పిల్లలకిస్తారు కాని నౌకర్లకివ్వరు. భలే నౌకర్లు పిల్లలకంటే ఎక్కువ పని చేస్తారు, కాని వారికి జీతము లభిస్తుంది కాని ఆస్తి లభించదు. వారు జీతానికి అధికారులవుతారు, కాని పిల్లలు ఆస్తికి అధికారులవుతారు. ఎందుకంటే తండ్రి కొడుకుల సంబంధముంది. ఇక్కడ కూడా అంతే. సేవ చేస్తారు కాని బాబాతో సర్వ సంబంధాలు జోడించని వారికి, బాబాను స్మృతి చేయని వారికి, నౌకర్ల వలె చేసిన సేవకు ఫలితము లభిస్తుంది కాని తండ్రి నుండి జన్మ జన్మలకు సుఖము, శాంతి, పవిత్రతల ఆస్తికి అధికారులుగా కారు. సేవ రూపి కర్మలో బాబాతో సర్వ సంబంధాలు ఉంటే, ఆత్మీయత ఉంటే

వారు తండ్రి వారసత్వానికంతా అధికారులుగా అవుతారు. పవిత్రత, శాంతి, సుఖ-సంపదలకు యజమానులుగా అవుతారు. ఒక్క తండ్రితోనే సర్వ సంబంధాలుంటే వారి బుద్ధి ఎక్కడికీ వెళ్లదు. వారి దేహము పై కూడా వారికి ఆకర్షణ లేకుంటే, ఇతరుల దేహము వైపుకు వారి బుద్ధి ఎలా వెళ్తుంది? వారు తమ దేహము నుండి కూడా వేరుగా ఉంటారు. వారు ఎల్లప్పుడూ నేను ఆత్మను, పరమపిత పరమాత్మతోనే నా సర్వ సంబంధాలు, నా సర్వస్వము వారే, వారే నా ప్రపంచము అను స్మృతిలో ఉంటారు.

ఎవరైనా దేహధారిలో ఏదైనా ఒక విశేషత ఉందనుకోండి, అది కూడా తండ్రి ఇచ్చిందే కదా! బ్రాహ్మణులుగా అయ్యారంటే 1000 భుజాల తండ్రి మీకు సహయోగిగా అయ్యారు కదా! వారిని తమ సహయోగిగా చేసుకునేందుకు, వారిలో ఆ విశేషతను నింపింది తండ్రే కదా! కనుక ఆ దేహధారిలో ఏ గుణాలున్నాయో అవి వారికిచ్చిందెవరు? శివబాబాయే కదా! శివబాబా వారిని చదివించి ధారణా మూర్తులుగా చేసి బ్రహ్మకు సహయోగిగా చేశారు కదా! బ్రహ్మను కూడా 1000 భుజాల వారని అంటారు. ప్రతి ఒక్కరు తమ విశేషతల అనుసారము తండ్రికి సహయోగమిస్తున్నారు. సహయోగులుగా చేసింది వారే, విశేషతలు నింపింది వారే, కనుక నేనెందుకు ప్రభావితమవ్వాలి? వారు బాబా శ్రీమతమును అనుసరిస్తున్నారు, వారి ఆజ్ఞానుసారము సేవ చేస్తున్నారు. కనుక ప్రేమ అంటే ఏమిటో లోతుగా ఆలోచించండి. ఒక్క తండ్రితోటి ప్రేమయే సత్యమైన ప్రేమ.

## మొత్తం జీవితమంతటినీ తండ్రికి అప్పగించడమే సత్యమైన ప్రేమ

అంతయు సంబంధము పైననే ఆధారపడి ఉంటుంది. విశ్వానికి అధికారులుగా అవ్వడం కూడా సంబంధము ఆధారము పైననే జరుగుతుంది. విశ్వమంతా మనదే. ఆకాశము, భూమి కూడా మనవే. మన సర్వ సంబంధాలు బాబా ఒక్కరితోనే ఉంటే, బాబా మనలను వీటన్నిటికి అధికారులుగా చేస్తారు. ఈ సమయములో భాగ్యవిధాత నుండి మనకు భాగ్యము లభిస్తుంది. బాబా చెప్తున్నారు - నాతో సర్వ సంబంధాలు జోడించి ఎవరికి ఎంత భాగ్యము కావాలో అంతా తీసుకోవచ్చు. తపస్సు అంటే ఇదే.



తపస్సు అనగా దృఢత. సంకల్పము దృఢంగా ఉండాలి. సంకల్పము దృఢంగా లేకుంటే మనసు ఇటు అటు దేహధారుల వైపు పరిగెడుతుంది. నిశ్చయమనగా 100 శాతము నిశ్చయము. ఒక్క పాయింటు కూడా తక్కువ ఉండరాదు. బాబా, నేను నా జీవితమంతా మీకే ఇచ్చేశాను. నేనెవరో ఎలా ఉన్నానో మీ స్వాధీనమైపోయాను. నడిపించే వారు మీరు. మీరు ఎలా కావాలంటే అలా నడిపించండి. నా జీవిత నౌకను మీ స్వాధీనము చేస్తున్నాను. ఈ జీవిత నావను ఏ దేహధారికైనా ఎందుకివ్వాలి ? వారేమైనా దాటిస్తారా ? నావికుడని ఎవరినంటారు ? దేహధారినా, లేక పరమాత్మనా? నావనేమో నావికునికి ఇచ్చేశారు. కాని దేహధారులతో గల సంబంధాలనే తాళ్లను తెంచి వేయకుంటే మీ నావ ముందుకు సాగనే సాగదు. అందువలన నావను అప్పగించడంతో పాటు దేహధారులతో గల సంబంధాలనే తాళ్లను కూడా తెంచి వేయవలసి వస్తుంది. చాలామంది సోదరీ సోదరులు పురుషార్థములో అటు ముందుకూ పోరు, ఇటు వెనుకకూ రారు. ఎక్కడుండే వారు అక్కడే నిల్చొని ఉన్నారు. మనము అలౌకిక జీవితము గడుపునప్పుడు సెకెండు సెకెండు కొత్తదనము ఉండాలి. పురుషార్థములో ఉమంగ-ఉత్సాహాలుండాలి. ప్రతి సెకెండు ముందుకు వెళ్తూ ఉండాలి. అప్పుడప్పుడు అశరీరి స్థితి, అప్పుడప్పుడు ఫరిస్తా స్థితి, అప్పుడప్పుడు అవ్యక్త స్థితిలో రమిస్తూ ఉండాలి. అప్పుడప్పుడు బిందు రూపమైపోవాలి, అప్పుడప్పుడు మన రాజ్య భాగ్యాన్ని చూస్తూ ఉండాలి, అప్పుడప్పుడు దృష్టితో తృప్తి పరుస్తూ ఉండాలి. రోజురోజుకూ నాలో కొత్తదనము వస్తోందా అని స్వయాన్ని పరిశీలించుకుంటూ ఉండండి. ఎక్కడుండే వారము అక్కడే నిలబడిలేము కదా ? అని పరిశీలించుకోవాలి. అలా నిలబడి ఉంటే ఏదో తాడుతో స్వయాన్ని బంధించుకున్నామని అర్థము చేసుకోండి. నావ తీరాన్ని వదిలితే బాబా మీ నావను ఎలా దాటిస్తారో గమనించండి. రోజురోజుకూ మీ నావ ముందు ముందుకు సాగుతూ ఉంటుంది, ఎందుకంటే నావికుడు దానిని నడుపుతూ ఉన్నారు.

## పాత సంబంధ - సంస్కార - స్వభావాలను త్యాగము చేసి ఒక్క తండ్రిని మన ప్రపంచముగా చేసుకోవడమే సత్యమైన ప్రేమ

పాత సంస్కారాల తాడు గాని పాత ప్రపంచము పై ఆకర్షణ అను తాడు గాని ఉంటే పరమాత్మతో సత్యమైన ప్రేమ ఎలా ఉంటుంది? మీ ప్రేమ పాత సంస్కారాలకు వశీభూతమై ఉంటే పరమాత్మతో ప్రేమ ఎలా జోడింపబడ్తుంది? పాత స్వభావము, సంస్కారము, సంకల్పము, స్మృతి, వికారాలు సత్యమైన ప్రేమను తమ వశములో ఉంచుకొని కూర్చున్నాయి. ఇది బంధనమైపోయింది కదా! ఏదైనా పాతది మీలో ఉంటే, పదార్థము గాని, సంబంధము గాని మిమ్ములను ముందుకు వెళ్ళనివ్వవు. అందువలన మీ జీవితాన్ని మీ చేతిలో ఉంచుకోని కూర్చోకండి. తండ్రి స్వాధీనము చేసేయండి. సర్వ సంబంధాలు, సత్యమైన ప్రేమ వారొక్కరితోనే జోడించి చూడండి. అప్పుడు మీరు కల్పమంతా హీరో పాత్రధారులుగా ఉంటారు. త్వరగా తండ్రి సమానంగా అవ్వగలరు. తండ్రి సమానంగా అవ్వడం పెద్ద విషయమేమీ కాదు. సర్వశక్తివంతులైన తండ్రి మనలను తన సమానంగా చేస్తున్నప్పుడు, తయారయ్యేది కూడా మనమే అయినప్పుడు అదేమంత పెద్ద విషయము! పిల్లలను తమ సమానము కర్మాతీతముగా, సుప్రీమ్‌గా చేసేందుకే తండ్రి వచ్చారు కనుక మనము కాకుంటే మరెవరవుతారు? అలా అయ్యేందుకు లోపల-బయటా స్వచ్ఛముగా ఉండాలి, ఏ మలినమూ ఉండరాదు. జనులు స్వయాన్ని రక్షించుకునేందుకు ఎన్ని అసత్యాలు చెప్తారు! మాటలను ఎంతగా తారుమారు చేస్తారు. అలా చేసే అవసరమేముంది ? సాకార బాబాను చూశారు కదా! ఒక్క సెకెండులో సర్వ సంబంధాలు ఒక్క తండ్రితో జోడించారు. తమ సర్వస్వాన్ని బాబాకు సమర్పించారు. అందువలన ఇప్పుడు ఎంత ఫలము లభించింది! చూస్తున్నారు కదా! అప్పుడప్పుడు మనసులో వ్వాహ్ బాబా వ్వాహ్! అని ఆలోచిస్తూ ఉంటాను. మీది ఎంత పెద్ద తోట! మీ ఆత్మిక పుష్పాలు, ఫలాలు ఎంత బాగున్నాయి! బాబా తమ సర్వ సంబంధాలు శివబాబాతో జోడించారు. బాబా మాకు కూడా మీ సర్వ సంబంధాలు శివబాబాతోనే జోడించమని చెప్పేవారు.

నా లౌకిక తండ్రి సమర్పితమయ్యేందుకు బాబా వద్దకు వచ్చారు. అప్పుడు బాబా నా తండ్రితో ఇలా అన్నారు - నీవు నీ జీవితమును ఈశ్వరునికి దానము



చేస్తున్నావు, ఎక్కడా మోహము లేదు కదా? ఇప్పుడేమో సమర్పితమై తర్వాత ఇతరులు గుర్తు రాకూడదు. నా పిల్లలకు ధనమివ్వలేదే, వారు ఎలా ఉన్నారో, ఏమి చేస్తున్నారో? అను ఆలోచనలు రాకూడదు. లేశమంత మోహము కూడా అటువైపు వెళ్ళదు కదా? లౌకికము వారికి ఏమివ్వాలో అది ముందే ఇచ్చేయండి. సమర్పణ అయిన తర్వాత ఇక ఒక సంకల్పము కూడా రాకూడదు. సమర్పణ చేసిన తర్వాత వాపసు తీసుకుంటే అది చాలా పెద్ద పాపమౌతుంది. ధనము గాని, సంపద గాని, ఆస్తి గాని యజ్ఞములో ఇచ్చేందుకు ముందే ఎవరికి ఏమివ్వాలో, ఎంత ఇవ్వాలో ఇచ్చేయండి. యజ్ఞములో ఇచ్చిన తర్వాత వాపస్ తీసుకుంటే అది చాలా పెద్ద పాపమౌతుంది. దానమిచ్చిన వస్తువును వాపసు తీసుకునే నియమము లేదు. నీవు ఎంత ఇవ్వగలవో, ఎంత సమర్పణ చేయగలవో అంతే ఇవ్వమని బాబా వివరముగా తెలిపించారు. బాబా తనదంతా ఒక్క క్షణములో సమర్పణ చేసేశారు. మనము తండ్రిని చూడాలి. తండ్రి ఏమో తమ సర్వస్వాన్ని ఒక్క క్షణములో సమర్పణ చేసేశారు కాని పిల్లలైన మనకు అవకాశమిచ్చి, పిల్లలూ ఎంత ఇవ్వగలరో అంత మాత్రమే ఇవ్వండి, బంధుమిత్రులకు ఏమేమి ఇవ్వాలో, ఎంత ఇవ్వాలో ఇచ్చిన తర్వాత మీరు యజ్ఞములో సమర్పణవ్వండి అని చెప్తారు.

మన సర్వస్వము సమర్పణ చేసినప్పుడే మన జీవిత నావ తీరానికి చేరుతుంది. సమర్పణవ్వడం అనగా అంతా వదిలేసి మధువనములో వచ్చి కూర్చోవడం కాదు. మీరు ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా మనసు, బుద్ధి ద్వారా సర్వము బాబాకు అర్పించి మీ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉండాలి. ట్రస్టీలై న్యారా ప్యారాగా ఉండాలి. సమర్పితమనగా సమర్థులు, పవిత్రులు, సత్యముగా బాబాను ప్రేమించువారు, ఏ విషయములోనూ తమ స్వంత మతమును మిక్స్ చేయనివారు. సర్వసంబంధాలతో ఒక్క తండ్రి పై ఏ ప్రేమ అయితే ఉందో అదే సత్యమైన ప్రేమ, అసలైన ప్రేమ.

## నాకు పంజాబు సింహమని టైటిల్ ఎలా లభించింది

చాలామంది నన్ను బాబా మీకు పంజాబు సింహము అనే టైటిల్ ఎలా ఇచ్చారని అడుగుతారు. ఇదొక పెద్ద కథ. ఈ రోజు మీకు ఆ కథ వినిపిస్తాను. భక్తిమార్గములో వినేందుకు భాగవతమూ ఉంది, గీత కూడా ఉంది. భాగవతములో భగవంతుని లీలలు, చరిత్ర ఉన్నాయి. గీతలో జ్ఞానము, శిక్షణ ఉంది. ఈ రోజు నేను గీత వినిపించను. ఉదయము క్లాసులో గీత వినిపించాను. ఇప్పుడు భగవంతుని భాగవతము వినండి, చరిత్ర వినండి. భాగవతము వినాలని చాలా మందికి ఇష్టముంటుంది. గోపికలు ఏమి చేశారని దాని తర్వాత ఏమయింది, దాని తర్వాత ఏమైంది? అని మధ్య మధ్యలో అడుగుతూ ఉంటారు. ఇది లీల కదా? భగవంతుడు వస్తూనే వారి లీలలు ప్రారంభమయ్యాయి. లీలతో పాటు శిక్షణ కూడా ప్రారంభమయింది అనగా భాగవతముతో పాటు గీత కూడా మొదలై రెండూ కలిసి నడిచాయి. అందులో నా పాత్ర ఎలా ఉండినదో అది ఈ రోజు మీకు తెలుపుతాను.

## రాత్రులు కూర్చొని భగవంతునితో మాట్లాడుతూ ఉండేదానిని

సింధ్ హైదరాబాదులో లౌకికముగా మాది చాలా పెద్ద కుటుంబము. తల్లి-తండ్రి, 7 మంది అక్క చెల్లెండ్రు, ఒక సోదరుడు, వారి పిల్లలు ఉండేవారము. భక్తికి ఫలముగా జ్ఞానము లభిస్తుందని బాబా చెప్తారు. మా లౌకిక పరివారములో భక్తి చాలా ఉండేది. 12 గంటల వరకు భోజనము చేయకుండా మేము కూడా భాగవతము, గీత చదివేవారము. రాత్రి పూట కూర్చుని నేను భగవంతునితో ఇలా ప్రతి రోజూ మాట్లాడేదానిని - " మీరేమో నాకు తల్లిదండ్రులనిచ్చారు. కొంత మందికి తల్లిదండ్రులు లేనే లేరు, తల్లిదండ్రులు లేనివారికి చాలా దు:ఖము కలుగుతూ ఉంటుంది. తల్లిదండ్రులతో పాటు మా పరివారమంతా యజ్ఞములో సమర్పితమై ఉండేది. ఎవరైనా సమర్పితంగా లేకున్నా వారు తప్పకుండా యజ్ఞానికి సమీపముగా, సహయోగులుగా ఉండేవారు. ఇప్పుడు కూడా కొంతమంది బొంబాయిలో, కొంతమంది బెంగుళూరులో, కొంతమంది సింగపూరులో, కొంతమంది స్పెయిన్‌లో ఉన్నారు. అయితే అందరూ బాబా ఇంటికి మధువనానికి వస్తూ పోతూ ఉంటారు. 7 మంది సోదరీలలో నేను 6వ దానిని.



బాబా వచ్చినప్పుడు నా వయస్సు 13 సంవత్సరాలు. 9వ తరగతి చదువుతూ ఉండినాను. నేను 8 సంవత్సరాల వయస్సు నుండి భక్తి చేసేదానిని. దానికి కొంత కారణము కూడా ఉంది. 7 మందిలో ఈ 6వ కన్య 8 సంవత్సరాల వయస్సులో వెళ్ళిపోతుందని ఎవరో జ్యోతిష్కుడు చెప్పాడు. కనుక నన్ను నేను రక్షించుకునేందుకు జపము, వ్రతము మొదలైనవి చేసేదానిని. ప్రతి రోజూ మాతా-పితల సంబంధముతో పరమాత్మతో మాట్లాడుతూ ఉండేదానిని. ఇది చాలా ప్రియమనిపించేది. నేను ఎప్పుడు నీ యోగినిగా అవుతానని భగవంతుని అడిగేదానిని. యోగినిగా అవ్వాలని నాకు చాలా గాఢమైన కోరిక ఉండేది.

## విమానము వెళ్తూ ఉంది, విమానంలో ఎక్కు - ఎక్కు అని ఆమె అంటూ ఉంది

లౌకికములో నా సోదరుడొకరిని దత్తత ఇచ్చి ఉండినారు. మరో సోదరుడు నా కంటే 2 సంవత్సరాలు పెద్ద. అతను వివాహానికి ముందే అకస్మాత్తుగా శరీరాన్ని వదిలేశాడు. అందువలన మా లౌకిక తల్లి చాలా దు:ఖిస్తూ ఉండేది. ఆ తర్వాత మా అక్క భర్త కూడా శరీరాన్ని వదిలేశాడు. ఒక రోజు రాత్రి నేను కూర్చొని ఉన్నప్పుడు నాకు బాబా సాక్షాత్కారమయ్యారు. భూమి నుండి ఆకాశము వరకు దూది వలె తెల్లటి కాంతి స్వరూపములో మాతా-పితల కంబైండ్ స్వరూపాన్ని చూశాను. ఆ రూపము నాకు చాలా ప్రియమనిపించింది, అది నన్ను చాలా ఆకర్షించింది. రెండవ రోజు, మూడవ రోజు కూడా సాక్షాత్కారాలు అవుతూ వచ్చాయి. బాబాతో పాటు ఒకసారి కృష్ణుడు, ఒకసారి విష్ణువు సాక్షాత్కారమయ్యేవారు. నేను చాలా భక్తి చేసి ఉండినాను. ఒక సోదరికి నేను ఈ విషయాలు తెలిపాను. అప్పుడామె - బాబా ప్రతి రోజూ గీత వినిపిస్తారు, నేను అక్కడకు వెళ్తున్నాను, నిన్ను కూడా అక్కడకు తీసుకెళ్తాను, నీవు కూడా గీత విను అని నాకు చెప్పింది. నేను కూడా ఆమె వెంట బాబా వద్దకు వెళ్ళాను. బాబా గది ఇప్పుడు ఇంద్రప్రస్థములో నేనుంటున్న గది వలె చిన్న గది. బాబా తమ ఇంటిలో గీత వినిపిస్తూ ఉండినారు. 8-10 మంది సోదరీలు కూర్చుని ఉండినారు. నేను అక్కడకు వెళ్ళాను. ఒక సోదరికి సాక్షాత్కారము జరిగింది. ఆమె విమానము పోతూ ఉంది, త్వరగా ఎక్కండి, ఎక్కండి అని అంటూ ఉండినది. ఈ శబ్ధాలు నా చెవులో పడ్డాయి. అప్పుడు నాకు నేను వేరు, నా

శరీరము వేరు అని విమానములో ఎక్కి వెళ్తున్నానని అనుభవమయింది. నేను బాబా వద్దకు ఎలా వెళ్ళానో నాకు తెలియనే లేదు. అది రాత్రి 10 గంటల సమయము. నేను కనులు తెరుస్తూనే బాబా ఒడిలో ఉన్నట్లు గమనించాను. బిడ్డా, ఆలస్యమయింది రేపు రా, అని బాబా చెప్పారు. బాబా ఇల్లు వేరుగా ఉండేది. ఆ ఇంటిని యశోదా నివాస్ అని పిలిచేవారు. మరుసటి రోజు నేను మళ్లీ అక్కడికి వెళ్ళాను. నేనక్కడకు వెళ్లినప్పుడు నాకు సాక్షాత్కారమైన రూపంలో బాబా కనిపించారు. నేను ఏమి చూస్తున్నానని నా కనులు ఇటు అటు పరికిస్తూ ఉండినవి. నేను కూడా లైట్ స్వరూపంగా అవుతూ పోతున్నట్లు నాకు అనుభవమయింది. ఆకార రూపము తీసుకుంటూ వెళ్తూ ఉండినాను. నేను కూడా బాబా వలె ఉండినాను. చాలా నషా పెరిగి ఉండినది. 3వ రోజు నేను అక్కడకు వెళ్లినప్పుడు నేను మాతేశ్వరిని చూశాను. వారు ఇంగ్లీషు పీరియడ్ తీసుకుంటూ ఉండినారు. ఇంగ్లీష్‌లో ఒక పాట వ్రాసి బాబా వద్దకు తీసుకొచ్చారు. ఆ పాటలో చాలా మంచి మంచి శబ్దాలుండినాయి. అందులో బాబా వద్దకు వచ్చి నేనేమి చూశాను అని వ్రాయబడి ఉంది. నేను ఒక ఋషిని చూచాను అని వ్రాయబడి ఉంది. మాతేశ్వరి ఆ పాటను పాడి కూడా వినిపించారు. మాతేశ్వరి స్వరము చాలా మధురంగా ఉండేది.

## నీవు వీరందరిని ఉద్ధరిస్తావని బాబా నాకు వరదానమిచ్చారు

దాని తర్వాత బాబా మాకు 7 రోజుల కోర్సు చేయించారు. ఒక గుండ్రని చక్రముండేది. అందులో బాబా భగవంతుడు అర్జునునికి ఏమి తెలిపారో అర్థం చేయించారు. అది నిజమైన గీతా జ్ఞానము. నేను బాబాతో - బాబా, జ్ఞానము చాలా బాగుంది, చాలా సుఖమునిస్తోంది. కాని నేను ఇంటికి వెళ్లినప్పుడు నా లౌకిక తల్లి రోజంతా ఏడుస్తూ ఉంటుంది. ఆమెకు ఈ జ్ఞాన మార్గము తెలపండి. దాని ద్వారా ఆమె ఏడ్పు మాని సుఖంగా ఉంటుందని చెప్పాను. అందుకు బాబా - బచ్చే(బిడ్డా), నేను మాతల సేవకుడను. నేను మీ ఇంటికి వస్తాను పద అని అన్నారు. బాబా నా చేయి పట్టుకొని వెంటనే బయలుదేరారు. బాబా నిరాకారులు, నిరహంకారులు. మేము అడుగడుగునా బాబా చరిత్ర చూశాము. బాబాగారి ఆ లీలలు, ఆ చరిత్ర ఎప్పటికీ మరవలేను. ఇంత గొప్ప బాబా! కాని నేను మాతల సేవకుడనని అంటారు. మా జతలో రావడము, మా లౌకిక తల్లి



ముందు కూర్చుని తెలిపించడము - ఇవన్నీ ఎంత గొప్ప విషయాలు! బాబా నా లౌకిక తల్లితో - " బచ్చీ ఈ బట్టలు ధరిస్తే లౌకిక కుమారుడు గుర్తొస్తాడు, కనుక ఆ బట్టలు మార్చేయి అని చెప్పారు". బాబా ముందు నా తల్లి చాలా ఏడ్చింది. బాబా నాతో - బచ్చీ, ఈమెకు కొడుకు పై చాలా మోహముంది, జ్ఞానము వినదు, ఈమెను సత్సంగములోకి తీసుకు రా, అక్కడ ఆమె వస్త్రాలు మార్చాలని చెప్పారు. తర్వాత నేను ఆమెను అక్కడకు తీసుకెళ్లాను, ఆమె వస్త్రాలను మార్పించి ఆమెను బాబా ముందు కూర్చోబెట్టాను. బాబా ముందు కూర్చోబెట్టినప్పుడు కొడుకును గుర్తు తెచ్చుకోవద్దని, శ్రీ కృష్ణుని వంటి కొడుకు లభిస్తాడని బాబా ఆమెకు చెప్పారు. బాబా ఆమెకు " నీకు శ్రీ కృష్ణుని వంటి కొడుకు లభిస్తాడు, ఎందుకు ఏడుస్తావు" అని వరదానమిచ్చారు. నాకు 'నీవు శివశక్తి.' వీరందరిని ఉద్ధరించేందుకు నీవు నిమిత్తమవుతావు అని వరదానమిచ్చారు. బాబా నాకు ఈ వరదానాన్ని ముందే ఇచ్చారు.

నా లౌకిక తల్లి సత్సంగములో కూర్చున్నప్పుడు ఆమె ముందుకు శ్రీ కృష్ణుడొచ్చాడు. ఆమెతో కొడుకు రూపములో ఆడుకొనసాగాడు. అందరూ ఈ దృశ్యాన్ని చూస్తూ ఉండినారు. ఆ తర్వాత ఆమెకు లౌకిక కొడుకు పై మోహము అంతరించిపోయింది. ఆ కొడుకును మర్చిపోయింది. ఆ తర్వాత ఆమె జ్ఞానములో నడవసాగింది. బాబా పట్ల ఆమెకు ఎంత భావన ఏర్పడిందంటే ఆమె భోజనము తయారు చేయునపుడు మొదట బాబా తింటారు, తర్వాత మిగిలిన మనమంతా తింటాము అని అనేది. భోజనము బాబా వద్దకు తీసుకెళ్లు, మొదట బాబా తింటారు, తర్వాత మనము తింటామని చెప్పేది. లౌకిక తండ్రి చాలా భోగవిలాస జీవితాన్ని గడిపేవారు. మా తల్లి దు:ఖపడుట మానేసి సంతోషముగా ఉండడం చూసి, బాబా ఆహ్వానము పై వారు కూడా బాబా వద్దకు వచ్చారు. బాబా నాతో - ఇతడిని మొదట మమ్మాతో కలిపించు, తర్వాత బాబా కలుస్తారని చెప్పారు. మమ్మాను చూస్తూనే మా తండ్రికి లక్ష్మి సాక్షాత్కారమయింది. ప్రారంభములో చాలా వరకు అందరికీ సాక్షాత్కారాలయ్యాయి. ఎందుకంటే అప్పుడు మా ముందు ఎవ్వరూ స్యాంపుల్‌గా లేరు. ఇప్పుడు మీ ముందు చాలామంది ఉదాహరణమూర్తులుగా ఉన్నారు. మీ ముందు చాలామంది ప్రాక్టికల్‌గా కనిపిస్తున్నారు. మీకు సాక్షాత్కారాల అవసరము లేదు. ఒకరిని చూసి మరొకరు వచ్చారు. పరస్పర అనుభవాలు విని, అనుభవము చేసి వచ్చారు.

## నాకు ఏ బంధనాలు లేవు

ఆ సమయములో వచ్చిన కన్యలు, మాతలు అందరూ మంచి కుటుంబాలకు చెందినవారు. అది బ్రిటిష్ ప్రభుత్వము పాలించే రోజులు. చాలా వరకు అందరి పతులు వ్యాపారార్థము విదేశాలలో ఉండేవారు. మాతలకు జ్ఞానము లభించింది. వారి పతులు విదేశాలలో ఉండేవారు. అక్కడ కూర్చుని వారు భోగాలను ............ అనుభవిస్తూ తమ తమ వ్యాపారాలు చేసుకుంటూ ఉండేవారు. ఇక్కడకు వస్తే ఒకటి - రెండు మాసాలుండి అందరినీ కలిసి మళ్లీ వెళ్లిపోయేవారు. ఈసారి వారు వచ్చేసరికి వారి పత్నులందరు జ్ఞానములోకి వచ్చి ఉండినారు. వారు వారి పతులకు పవిత్రతను గురించి తెలుపసాగారు. వారికేమీ అర్థము కాలేదు. పవిత్రత విషయము గురించి వారి గృహాలలో గలాటాలు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో పవిత్రత కొరకు ఏమేమి జరిగిందో మీరు యజ్ఞ చరిత్రలో విన్నారు. బాబా హైదరాబాదులో కూడా ఉండేవారు, కరాచీకి కూడా వెళ్తూ ఉండేవారు. నేను స్కూలులో చదువుకుంటూ ఉండినాను. బాబాతో, నేను స్కూలు వదిలేస్తానని చెప్పాను. బాబా వద్దన్నారు. నీవు స్కూలుకు వెళ్లినందున చాలా మంది విద్యార్థులలో, టీచర్లలో జ్ఞానము జాగృతమవుతుంది. అందువలన స్కూలు వదలవద్దని చెప్పారు. నేను స్కూలుకు వెళ్లేదానిని కాని మనసంతా ఇటువైపే ఉండేది. పవిత్రత కారణంగా పాపం చాలామంది సోదరీలు బంధనములోకి వచ్చారు. వారిని ఇంటి నుండి బయటకు రానివ్వలేదు. లోలోపలే బాబాను స్మృతి చేస్తూ ఉండేవారు. బాబా, బాబా మేము జ్ఞానామృతము లేకుండా మేమెలా జీవించాలి? మేము మా ప్రాణాలు వదిలేస్తామని లోలోపలే బాబాను స్మృతి చేస్తూ ఉండేవారు. బాబాకు వారి మాటలు వినిపించేవి. బాబా హాస్టల్ తెరిచినప్పుడు నేను అందులోకి వచ్చేశాను. మీరు ఓంనివాస్ ఫోటో చూసి ఉంటారు. మా ఇంటిలోని వారంతా జ్ఞానములో ఉండేవారు. కనుక నాకు ఏ బంధనాలు లేవు.


## బాబా తమ యావదాస్తిని పిల్లల పేరుతో వీలునామా వ్రాసి పిల్లల కొరకు హాస్టల్ తెరిచారు

బాబా తమ ఆస్తినంతటిని పిల్లల పేరుతో విల్లు వ్రాసేశారు,



సమర్పించేశారు. ఆ ఇల్లు బాబాదే, అందులోనే హాస్టలు తెరవబడింది. అక్కడ పిల్లలకు రాజ విద్యతో పాటు ఆత్మిక విద్య కూడా లభించింది. ఈ పనులన్నిటికి బాబా తమ ధనమునే ఉపయోగించారు. హాస్టులులో ఉండే పిల్లల తల్లిదండ్రులు లేక బంధువులు వారంతకు వారే ధన సహాయము చేస్తామనన్నప్పటికీ బాబా ఈ పిల్లల చదువు కొరకు యజ్ఞ ధనమే ఉపయోగపడ్తుంది, ఇతరుల ధనము ఉపయోగించరని చెప్పారు. ఈ పిల్లలకు ఈశ్వరీయ పాలన లభించనీ, ఈశ్వరుని యజ్ఞము ద్వారా వీరి సంభాళన జరగనీ అని బాబా చెప్పేవారు. ఏ పిల్లలకైతే నేరుగా ఈశ్వరుని పాలన లభించిందో వారు ఎంత ఉన్నతంగా అవుతారు! అని బాబా అనేవారు. బాబా పిల్లల దినచర్యను తయారుచేశారు. మా ప్రిన్సిపాలు, ప్రొఫెసరు కూడా బాబాయే. ఎలాగైతే స్కూలులో గదులు, బెంచీలు, పీరియడ్లు, టీచర్లు, వార్డన్ మొదలైన వసతులుంటాయో అలా అన్ని వసతులను, వ్యవస్థను బాబా ఏర్పాటు చేశారు. ఉదయమే పిల్లలను నిద్ర లేపేవారు. స్నానము చేయించేవారు, చదివించేవారు, తోటలోకి తీసుకెళ్లేవారు. వీటన్నిటికి కావలసిన ఏర్పాట్లన్నీ చేశారు. వారికి తెల్ల యూనిఫారం కూడా తయారు చేయించారు. పిల్లల జీవితము పూర్తి రాయల్‌గా ఉండేది. అన్ని చోట్ల శుభ్రత ఉండేది. భోజనము కూడా చాలా మంచిగా తయారయ్యేది. అందరూ కలిసి భోంచేసేవారు. వారికి మాలిష్ కూడా జరిగేది. పిల్లలకు రాకుమారుల వంటి పాలన లభించేది. ముఖ్యంగా గణితము, ఇంగ్లీషు, హిందీ , హిస్టరి, జాగ్రఫీ బోధించేవారు. ఒక్కొక్క పీరియడ్ ఒక్కొక్కరుగా మేము నలుగురు సోదరీలు తీసుకునేవారము. మేమెలా చదివించేవారమో బాబా వచ్చి గమనించేవారు. ఏ రోజుకు ఆ రోజు రాత్రి దినచర్యనంతటినీ బాబాకు వినిపించేవారము. ప్రారంభము నుండి బాబా జతలో ఉండడం కూడా నా భాగ్యమే. హాస్టల్ తెరచినప్పుడు పవిత్రత విషయములో చాలా పెద్ద గలాటా జరుగుతూ ఉండినది. పట్టణములోని నాయకులందరు బాబా వద్దకు వచ్చారు. బాబా, మా మనసులోని మాట మీకు చెప్పమంటారా? అని అడిగారు. చెప్పండి అని బాబా అన్నారు. బాబా, నాలుగు వికారాలను విడిపిస్తున్నారు, చాలా బాగుంది. ఇక కామ వికారము గురించి మా గృహాలలో చాలా కొట్లాటలు, గలాటాలు జరుగుతున్నాయి. మీరు దానిని విడిపించకండి. మీరు ఇంత మంచి గొప్ప

సత్సంగాన్ని ప్రారంభించారు. కాని మీరు దయ చేసి కామ వికారాన్ని మాత్రము విడిపించకండి, మీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాము అని అన్నారు. అందుకు బాబా - చూడండి, నేను కూడా మీ వలె గృహస్థుడనే, పిల్లలు గలవాడినే. కామము మహాశత్రువని చెప్పేది నేనే అయితే నేనెందుకు పిల్లలను కంటాను. ఈ మాట చెప్పేది నేను కాదు, భగవంతుడు చెప్తున్నారు. పవిత్రమై పవిత్రంగా చేయమని నాకు చెప్పింది కూడా భగవంతుడే. గీతలో కూడా భగవంతుడు కామము మహాశత్రువని చెప్పారు. ఇది స్వయం భగవానువాచ. మనుష్యులెవ్వరూ ఈ మాటను - కామము మహాశత్రువని చెప్పలేరు. ఎందుకంటే మనుష్యులందరూ ఈ వికారానికి వశమై ఉన్నారు. స్వయం వికారాలకు వశమైనవారు ఇతరులను వాటి నుండి ఎలా విడిపించగలరు? భగవంతుడొక్కరే సుప్రీమ్. వారే పతితులను పావనంగా చేసేందుకు వచ్చారు. వికారాల నుండి వారే విడిపిస్తున్నారు. నేను ఈ మాట కూడా అనను. ఏమేమి చెప్తున్నారో అదంతా వారే చెప్తున్నారు. నన్ను మీరు చూస్తునే ఉన్నారు. నేను కూడా మీ వలె ఉన్నాను. నాకు కూడా వారే అర్థం చేయించారు.



క్లిఫ్టన్ తోటలో నిల్చుని ఉన్న హాస్టల్ పిల్లలు



## ఆ సమయములో బాబా నాకు శివశక్తి అను టైటిల్ ఇచ్చారు

ప్రపంచమంతా ఒకవైపు, బాబా ఒక్కరు ఒకవైపు. సమాజమంతా ఏకమై విరోధించారు కాని బాబా ఒకే బలము ఒకే నమ్మకము అని స్థిరమైన నిశ్చయములో ఉండినారు. ఈ మధ్యలో బాబా నాకు శివశక్తి అను టైటిల్‌నిచ్చారు. భగవంతుని ముఖ్య గుణమేది? గ్రంథ్ సాహెబ్(సిక్కుల మత గ్రంధము)లో కూడా భగవంతుడు నిర్భయులు, నిర్వైర్ అని చదువుతూ ఉండినాము. భగవంతుడు ముఖ్యంగా ఈ రెండు గుణాల ద్వారా గాయనము చేయబడ్తారు. భగవంతుడు నిర్భయులు, సత్యమైనవారు మరియు అకాలమూర్తి. ఎవరిలో సత్యముంటుందో వారు నిర్భయులుగా ఉండగలరు. వారు ఎవరితోనూ భయపడరు. వారు నిర్వైరులు. భగవంతునికి ఎవ్వరితోను శత్రుత్వము లేదు. ప్రపంచములోని వారు వైరముంచారు, విరోధించారు, తిట్టారు, భగవంతుని కార్యములో విఘ్నాలు కలిగించారు. బాబా ఇంటికి నిప్పు అంటించారు కాని బాబా ఎవ్వరితోనూ విరోధముంచుకోలేదు, సత్యాన్ని వదలలేదు. బాబా అన్నారు - నా పిల్లలు అమాయకులు, తండ్రి ఎవరో తెలియదు. పవిత్ర ప్రపంచాన్ని స్థాపించేందుకు శివబాబా బ్రహ్మాబాబాను మాధ్యమముగా చేసుకున్నారు. కనుక ఆ బ్రహ్మ భగవంతుని మార్గాన్ని ఎలా మార్చగలడు? కాని బాబా సత్యమే చెప్పారు, సత్య మార్గము పైననే నడిచారు. బ్రహ్మాబాబా కూడా పూర్తి నిర్భయంగా, నిర్వైరులుగా ఉండడం మేము చూశాము. ఎవరు ఎంత నిందించినా, తిట్టినా, అవమానపరచినా, గలాటా చేసినా ఎవ్వరితోనూ వైరముంచుకోలేదు. నిర్మలశాంత దాది అత్తగారు చాలా విరోధించారు. కాని వారి పట్ల కూడా బాబా ఎప్పుడూ విరోధ భావముంచుకోలేదు. వారిని కూడా తమవారిగానే భావిస్తూ వచ్చారు. బాబా వారికి ఇవ్వమని నాకు ఒక రికార్డు ఇచ్చారు.

పాప ప్రపంచము నుండి మరెక్కడికైనా దూరంగా తీసుకెళ్లు, చిత్తానికి సుఖము లబించే చోటుకు తీసుకెళ్లు.......... అనే పాట ఆ రికార్డులో ఉండేది. ఆ పాటను ప్రపంచములోని వారు తయారుచేశారు. బాబా - ఈ రికార్డును ముఖియాకిచ్చి రమ్మని నాకు చెప్పారు. ప్రపంచములోని వారు కూడా ఇది పాప ప్రపంచమని అంటున్నారు. మనము చెప్పింది కాదు. ఈ రికార్డు వారికిచ్చి దాని అర్థము తెలిపి రా అని చెప్పారు. నేను సరే బాబా అని అన్నాను. ఆ రికార్డు


తీసుకొని నేను ఆ ముఖియా వద్దకు వెళ్లాను. ఓంమండలి వారు ఇంద్రజాలము చేసే వస్తువేదో తీసుకొచ్చారని వారనుకున్నారు. ఎందుకంటే ఆ సమయములో మాయా మంత్రముల మాట చాలా ప్రచారములో ఉండేది. అప్పుడు చాలా సాక్షాత్కారాలవుతూ ఉండేవి కదా. కనుక దాదా గారడి చేస్తున్నాడని అందరూ భావించేవారు. దాదా కలకత్తా నుండి ఇంద్రాజాలము నేర్చుకొని వచ్చి ఇక్కడ అందరి పై ప్రయోగిస్తున్నారని అనేవారు. నన్ను చూస్తూనే ఆ ముఖియాకు ఎంత కోపమొచ్చిందంటే ఆ రికార్డును పగులగొట్టేశాడు. బాబా ఇంత మంచి వస్తువు పంపిస్తే వీరు కనీసము వినను కూడా వినలేదని నేను మనసులో అనుకున్నాను. నేను భాగవతము చదివాను. నాకు పూర్తి భాగవతమంతా గుర్తుకొచ్చింది. నేను వాపసు వచ్చి బాబాతో - బాబా, ఆ రికార్డును ‘ జాదు’ గా భావించి వారు వినసే లేదని చెప్పాను. అందుకు బాబా - పోనీలే బచ్చీ కల్పక్రితము కూడా ఇలాగే జరిగింది అని అన్నారు. ఇదేమంత పెద్ద విషయముగా బాబా భావించలేదు. బాబా దానిని గురించిన సమాచారము కూడా అడగలేదు. వారు తీసుకున్నారా, లేదా? తెలియజేశావా అని కూడా అడగలేదు. నేను ఇచ్చి వచ్చాను. అందుకే నాకు బాబా - ఈ బచ్చీ షేర్‌నీ శక్తి అని బిరుదునిచ్చారు. ఏదైనా కఠినమైన పని వచ్చిందంటే బాబా ఆ పనిని నాకు అప్పగించి - “ బచ్చీ నీవు పో ” అని అనేవారు. ఆ సమయంలో నా వయసు 14 సంవత్సరాలు కాని బాబాకు నాపై నమ్మకముండేది. బిడ్డా, నీలో సత్యతా శక్తి ఉంది కనుక నీకు ఏ భయమూ లేదు అని బాబా అనేవారు. బాబా సంస్కారాలేవైతే ఉన్నాయో అవి నాలో బాల్యము నుండే ఉండేవి. బాబా నాకు ఏ సేవ ఇచ్చినా నేను చాలా ఆసక్తితో, హృదయపూర్వకంగా చేసేదానిని.

## నాకు బాల్యము నుండే నిర్భయతా సంస్కారముండేది

ఓంనివాస్ అను పేరు గల ఒక పెద్ద బోర్డు చాలా పై భాగాన తగిలించబడి ఉండేది. అది పట్టణములో ఎక్కడ నుండి చూచినా కనిపిస్తూ ఉండేది. హాస్టలు పేరు ఓం నివాస్. బాబా సత్సంగము నడిచే భవనము పేరు ఓం మండలి అని పెట్టబడింది. అక్కడ అందరు ఓం ధ్వని చేస్తూ ఉండేవారు. ఓం ధ్వని చేస్తూ చేస్తూ అందరూ శాంతిగా కూర్చుండి పోయేవారు. కొంతమంది ధ్యానములోకి వెళ్లిపోయేవారు. ఎంతో సుఖము



లభిస్తున్నట్లు మాకు అనుభవమయ్యేది. ఇక్కడ ఏమి జరుగుతూ ఉందో ప్రపంచములోని వారికేమీ తెలిసేది కాదు. పాపం వారికి అనుభవము లేదు కదా. మేము ఎంత మస్త్ అయిపోయామంటే మేము ప్రపంచమంతా మారినా మేము మారము అని అనేవారము. ఎందుకంటే మేము అనుభవము చేస్తూ ఉండినాము కదా. ప్రపంచములోని వారు మమ్ములను మార్చాలని చాలా ప్రయత్నము చేశారు. ఆ తర్వాత వారు పరస్పరము కలుసుకొని పికెటింగ్ చేసేందుకు ప్లాను తయారు చేసుకున్నారు. ప్రతి రోజు ఉదయము బస్సులో చిన్న - చిన్న పిల్లలను తోటకు తీసుకెళ్లేవారు. అక్కడ నుండి వచ్చిన తర్వాత క్లాసుకు వెళ్లేవారు. ఒక రోజు మేము వాకింగ్ నుండి వచ్చేసరికి వారు ఎవ్వరినీ లోపలకు పోనివ్వకుండా అడ్డం నిలిచారు. పిల్లలు కూడా బయట నిలబడి పోయారు. ఎండ ముదిరే కొలది వేడి కూడా పెరగసాగింది. వారికి పిల్లల పై దయ కలిగింది. ఎందుకంటే ఆ పిల్లలు వారి పిల్లలే లేక వారి బంధువుల పిల్లలే. 5-7 సంవత్సరముల వయసు గల పిల్లలు ఎండలో



పికెటింగ్ చేయు వారి ఎదురులో ఓంమండలిలోని చిన్న చిన్న పిల్లలు
శివబాబా తలంపులో శాంతిలో నిల్చున్న దృశ్యము

నిలబడి ఉండినారు. వారు పిల్లలతో మీరంతా లోపలికి వెళ్లండి అని చెప్పారు. మా పెద్దవారు లోపలికి వెళ్లకుంటే మేము కూడా వెళ్లము, ఇక్కడే నిలబడి ఉంటామని ఆ చిన్న పిల్లలు చెప్పారు. వారు ఆ పిల్లలకు షర్బత్ తాపించేందుకు ప్రయత్నించారు. కాని పిల్లలు షర్బత్ గ్లాసును చేతిలోకి కూడా తీసుకోలేదు. మా దాదీలు ఆకలితో, దప్పికతో నిలబడి ఉన్నారు. మేము కూడా ఇలాగే నిలబడి ఉంటామని చెప్పారు. పికెటింగ్ చేసేవారిలో నా లౌకిక సోదరి పతి కూడా ఉన్నారు. నిర్మలశాంత దాది అత్త వైపువారు కూడా ఉన్నారు. వారిలో ఒకరు లోపలికి ఎవ్వరూ పోకుండా గేటుకు అడ్డంగా పడుకున్నారు. నేను లోపలికి తప్పని సరిగా వెళ్లవలసి ఉంది. ఏమి చేయాలని ఆలోచిస్తూ చివరికి నేను పడుకున్న వ్యక్తి పై నుండే నడిచి వెళ్లాను. అనగా నాలో నిర్భయతా సంస్కారము బాల్యము నుండే ఉంది. కాని బాబా సేవలో ఆ నిర్భయతా శక్తి విశేష రూపములో పనికి వచ్చింది. ఏ పిల్లలలో ఏ విశేషత ఉంటుందో ఆ విశేషత ద్వారా పని(సేవ) చేయిస్తానని బాబా అనేవారు. బాల్యములోని ఈ విశేషతలు - నిర్భయత, సత్యత జ్ఞానములో కూడా నాకు సహాయము చేయసాగాయి.

## బంధనములో ఆత్మలున్న చోటుకు బాబా నన్ను పంపేవారు

దాని తర్వాత బాబా నన్ను కరాచీకి పిలిపించారు. నేను అక్కడికి వెళ్లిపోయాను. హైదరాబాదులో ప్రతి రోజూ చాలా పెద్ద సత్సంగము జరిగేది. మాతలు, పిల్లలు చాలామంది వస్తూ ఉండేవారు. బాబా కరాచీకి వెళ్లిపోయారు. అచ్చటి మాతలు బాబా లేకుండా ఇక్కడ మేమెలా ఉండాలి, మాకు జ్ఞానామృతాన్ని ఎవరు తాపుతారని విలవిలలాడసాగారు. నాతో పాటు నా లౌకిక తల్లితండ్రులు కూడా వచ్చారు. హైదరాబాదులో మా లౌకిక ఇల్లు ఖాళీ అయ్యింది. ఆ మాతలు, కన్యలు ఆ ఇంటిలో సత్సంగము చేయసాగారు. బాబాకు ఈ విషయము తెలుస్తూనే బాబా నన్ను అక్కడకు పంపించారు. బాబా నాతో "బిడ్డా, నీవు అక్కడకు వెళ్లి వారి క్షేమ సమాచారము, స్థితి-గతులు తెలుసుకొని రా" అని చెప్పారు. శీల్ఇంద్రా దాదీ(బొంబాయిలో ఉండినారు) 16 తాళాలు వేసిన గదిలో బంధింపబడి ఉంది. వారి ఇల్లు చాలా పెద్దది. కేవలము శీల్ఇంద్రా దాదీ ఉంటున్న గదికే కాదు, దానికి



సమీపములో ఉన్న గదులన్నింటికి తాళాలు వేసి ఉండినారు. ఆమెకు బాబా పై చాలా ప్రేమ. బృజశాంత, లీలావతి, దీది వీరందరూ ఉండినారు. అయినా దాదీ ఎలాగో బయటకు వచ్చేసింది. శీల్ఇంద్రా దాదీ ఒంటరిగా ఉండిపోయింది. బాబా నాతో బిడ్డా, నాకు పిల్లల శబ్ధము వస్తూ ఉన్నది, నా పిల్లలు 'బాబా, బాబా' అని అంటున్నారు. ఇక్కడి నుండి వారి కొరకు ఎవరు వెళ్తారు, అక్కడకెళ్లి ఈ జాబు ఇచ్చి రావాలి అని అడిగారు. అందుకు నేను - ' బాబా నేను వెళ్తాను' అని చెప్పాను. బాబా జాబు వ్రాసి నా చేతికిచ్చారు. నేను వెళ్ళాను. ఇంటికి అన్నివైపులా తాళాలు వేసి ఉండినారు. నేను ఆ ఇంటి నలువైపులా తిరిగి ఎక్కడ నుండి పోతే శీల్ఇంద్రను కలవవచ్చు అని చూస్తూ ఉండినాను. అటువంటి చోటు ఏదియు కనిపించలేదు. తర్వాత నేను ఆ ఇంటి నుండి కొంచెము దూరమెళ్లి ఆలోచించసాగాను. "శీలు మిద్దె పైన కూర్చుని ఉండినది. ఆమె నన్ను చూచింది. కనెక్షన్ ఎలా లభిస్తుందో చూడండి. ఆమె లోపల బాబా, బాబా అని అంటూ ఉండినది. బాబా ఇక్కడ నుండి నన్ను పంపుతూ ఉండినారు. నాకు పోవాలనిపించింది. పై నుండి శీలూ నన్ను చూచి చాలా సంతోషించింది. అక్కడ నుండే చేతితో సైగ చేస్తూ, ఏమి తెచ్చావని అడిగింది. నేను ఆమెకు జాబు చూపించినాను. సైగలతోనే ఇదంతా జరుగుతూ ఉండినది. ఆమె ఒక దారము క్రిందికి వదిలి సైగలతో ఆ దారమునకు జాబు కట్టమని చెప్పింది. నేను అలాగే చేశాను. ఆమె ఆ జాబును పైకి లాక్కున్నది. ఆమెకు బాబా వ్రాసిన జాబు చేరింది. ఇలా ఎక్కడ బంధనములో ఆత్మలుండినా, అక్కడకు బాబా నన్ను పంపేవారు.

దాదీకి సతి అను ఒక సోదరి ఉండినది. పాట్నాలో ఉన్న కుంజ్ బహన్ యొక్క తల్లి. ఆమె కూడా బంధనములో ఉండినది. ఒకసారి ఆమె మా లౌకిక ఇంటికి వచ్చినది. "నేనేమి చెయ్యాలి" అని ఆమె మమ్ములనడిగింది. అందుకు నేను "నేనేం చెయ్యాలి" అని అడిగే అవసరమేముంది? నీవు నాతో రైలులో వచ్చేయి, నేను నిన్ను తీసుకెళ్తాను అని చెప్పాను. "కూతురుంది, ఆమె ఏమవుతుంది? ఇంట్లో గలాటా జరుగుతుంది, ఇంట్లోని వారు వెంటబడతారు" - అని కూడా ఆమె ఆలోచించలేదు. బంధనములోని

వారిని చూచి నాకు చాలా దయ కలిగేది. ఎందుకంటే మేము బాబా జతలో చాలా సంతోషముగా ఉండేవారము. పాపం మాతలు బాబాకు దురంగా ఉండి చాలా విలవిలలాడేవారు. గలాటా అవుతుందేమో అని నాకు భయము కూడా ఉండేది కాదు. జనులు బాబా పై కోపపడతారని సంకల్పము కూడా వచ్చేది కాదు. అలాగే ఏ గలాటా జరగలేదు.

లండన్‌లో ఉంటున్న జ్యోతి తల్లి చంద్రా, వయస్సు అప్పుడు 8 సం.లు. ఆమెకు చాలా లగన్ ఉండేది. ఆమె చాలా వరకు మాతోనే ఉంటూ ఉండేది. చిన్న వయసులోనే ఆమెకు చాలా ఆకర్షణ కలిగింది. " బాబా ఇక్కడి నుండి వెళ్ళిపోయారు, మీరందరు కూడా వెళ్ళిపోయారు, ఇక్కడ నేను ఒంటరిగా మిగిలిపోయాను, ఏమి చేయాలి, నేను ఇంట్లో ఉండలేను అని నాకు చెప్పింది". మా క్లాసు కరాచీలో ప్రారంభమై ఉండినది. హైదరాబాదులో ఉండిపోయిన వారు కరాచికి రాకుండా వారింట్లోని వారు అడ్డుకున్నారు. వారంతా కలుసుకొని స్టేషన్ మాస్టర్ వద్దకు వెళ్ళి ఆ పిల్లల ఫోటోలు ఇచ్చి ఇందులో ఎవరు వచ్చినా వారిని ఆపివేసి మాకు ఫోన్ చేయండి, మేము వచ్చి తీసుకెళ్తామని చెప్పారు. కరాచికి వారెవ్వరూ పోకుండా చాలా గట్టి ఏర్పాట్లు చేశారు. ఇదంతా తెలిసి బంధనములో ఉన్న వారంతా మేము పోలేకుండా, బాబాతో కలవలేకుండా ఉన్నాము, మేము ఇలాగే మరణిస్తామని ఏడ్వసాగారు. తర్వాత వారంతా స్టేషన్‌కు బురఖా వేసుకొని పోయి టికెట్ తీసుకొని కరాచికి రైలులో వెళ్తామని ప్లాను వేసుకున్నారు. వారు అలాగే బురఖా వేసుకొని కరాచికి చేరుకున్నారు. కాని చంద్ర, నేను చిన్నపిల్లను, నన్ను ఎవరు వద్దంటారు అని బురఖా వేసుకోకుండా అలాగే స్టేషన్‌కు వచ్చేసింది. స్టేషన్ మాస్టర్ వద్ద చంద్ర ఫోటో కూడా ఉండినది. చంద్రను గుర్తించి పట్టుకున్నారు. కనుక చంద్ర కరాచికి రాలేకపోయింది. ఆమెకు వివాహము కూడా చేసేశారు. వివాహము తర్వాత కూడా ఆమె బాబా యజ్ఞము నుండి దూరము కాలేదు. ఆమె తన కొడుకులు, కోడళ్లను అందరిని తీసుకొని వస్తుంది. చిన్నతనము నుండి బాబా పై గల స్నేహమును ఈనాటి వరకు ఆమె అలాగే కొనసాగిస్తూ ఉన్నది.

పారిపోయి వచ్చిన వారికి వారంటు వచ్చింది. మమ్మా తల్లి కూడా



జ్ఞానయుక్త ఆత్మనే. ఆమె పేరుతో వేరే వారు మమ్మాకు కూడా వారంటు ఇప్పించారు. మమ్మాకు ఏమీ జరగలేదు. మమ్మా తల్లి కోర్టులో ఇది నా సంతకము కాదు, నేను రిపోర్టు ఇవ్వలేదు, నేను నా కూతురుకు సంతోషంగా అనుమతినిచ్చానని చెప్పింది. మిగిలిన వారందరినీ వేరే బంగ్లాలో ఉంచారు. అక్కడ కుట్టు మిషన్ నేర్పిస్తూ ఉండినారు. ఎవరైనా వస్తే, వారు కుట్టుమిషన్‌ను నేర్చుకునేందుకు, నౌకరీ చేసేందుకు వచ్చారని, మా వద్ద లేరని చెప్పేవారు. బాబా వారిని పిలిపించుకోలేదు, వారు నౌకరి చేయుటకు వచ్చారని తెలిపేవారు. విరోధులంతా కలిసి, ఎంత ప్రయత్నించినా దాదా మనకు చిక్కడం లేదు, మన ఇంటి స్త్రీలు వెళ్లిపోతున్నారు, ఏం చేయాలి? అని ఆలోచించి వారు మరో ప్లాను తయారుచేశారు.

## బాబా నన్ను సాధు వాస్వాని వద్దకు పంపించారు

సాధు వాస్వాని చాలా పేరు ప్రతిష్ఠలు గల మహాత్మ, వారిని ఈ పికెటింగ్‌లోకి తెస్తే పని జరుగుతుందని ఆలోచించారు. ఈ విషయము బాబాకు తెలిసింది. బాబా నన్ను వాస్వాని వద్దకు పంపించారు. బాబా నాతో " బిడ్డా, వాస్వాని వద్దకు వెళ్ళి 7 రోజుల కొరకు వారిని ఆహ్వానించు" అని చెప్పారు. బాబా వారికి సందేశము పంపించారు - " మీరు చాలా మంచి వారు. మీ పై బాబాకు చాలా గౌరవముంది. వారి మాటలు విని మీరు కూడా వారు చేయు తప్పు పనికి సహయోగులు కారాదు " అని బాబా ఆశిస్తున్నారు. మీరు ఇక్కడకు వచ్చి చూడండి, మీకు మాలో ఏ చిన్న తప్పు కనిపించినా మీరు చెప్పినట్లు మేము చేస్తాము. చూడకుండా, తెలుసుకోకుండా లోకుల మాటలు విని ఇటువంటి పని చేయుట మీ లాంటి వారికి శోభించదు. " మీరు చాలా గొప్పవారు, ఇతరులకు నేర్పించేవారు". ఈ సందేశమునివ్వమని బాబా నన్ను వారి వద్దకు పంపారు.

నేను అక్కడకు వెళ్ళాను. వారి శిష్యులు నేను వారిని కలవకుండా అడ్డుకున్నారు. అప్పుడు నేను వారితో, ఇందులో మీకే సంబంధము లేదు, మీరు కేవలం సందేశమిచ్చేవారు. దాదా మీతో కలుసుకునేందుకు నన్ను పంపినారని వారికి సందేశమివ్వండి. వారిని కలవవద్దని మీరెలా

చెప్తున్నారు ? అని అన్నాను. ఈమె మా గురువు పై కూడా ఇంద్రజాలము చూపుతుందని వారు లోపల భయపడుతూ ఉండినారు. చివరికి వారు వాస్వాని వద్దకెళ్ళి ఈ విషయము చెప్పారు. వాస్వాని అంగీకరించారు. వారు గద్దె పై కూర్చొని ఉన్నారు. నేను వెళ్ళి వారితో " బాబా మీకు ఇలా చెప్పమన్నారు - మీరంటే బాబాకు చాలా గౌరవము. మాకు కూడా మీరంటే చాలా గౌరవముంది. మా బంధువులందరు మీ శిష్యులుగా ఉన్నారు. బాబాకు వ్యతిరేకంగా మీరు పికెటింగ్‌లో ఎలా పాల్గొంటారు? బాబా మిమ్ములను ఆహ్వానిస్తున్నారు. మీరు వచ్చి చూడండి" అని చెప్పాను. అందుకు వారు సరే పద నేను వచ్చి చూస్తాను అని క్రిందకు వచ్చి కారులో కూర్చున్నారు. వారి శిష్యులంతా కారు ముందుకు పోకుండా అడ్డముగా పడుకున్నారు. నేను తిరిగి వచ్చేశాను. జరిగిన విషయమంతా నేను బాబాకు చెప్పాను. రెండు, నాలుగు రోజుల తర్వాత పికెటింగ్ జరిగింది. అది బ్రిటిష్ వారు పాలించే కాలము. ముందే బాబా వారికి విషయము తెలియజేశారు. పికెటింగ్ చేయువారు వస్తూనే బాబా ఫోన్ చేయించారు. పోలీసు వారు వచ్చి అందరిని తరిమేశారు. కొంతమందిని జైలులో కూడా వేశారు. ఇదేమిలా జరిగిందే అని వారు ఆలోచించసాగారు. ఇది ప్రారంభములో జరిగిన విషయము

## సుందరీ బహన్‌గారి బాధ కలిగించే కథ

బాబాకు ఒక కుడి భుజము మమ్మా, రెండవవారు సుందరి బహన్. నేను హైదరాబాదుకు పోయి వస్తూ ఉండేదానిని. సుందరి బహన్ తల్లి నాతో " నా కూతురును ఒక వారము రోజులు ఇంటికి వాపసు పంపమని చెప్పండి, మేము మళ్ళీ ఆమెను వాపసు పంపుతామని చెప్పారు". నేను బాబాతో - సుందరి బహన్ మమ్మా వలె చాలా మంచి గుణవంతురాలని చెప్పాను. బాబా నాతో "ఆమె బాధ్యత నీవు తీసుకుంటావా", ఆమె వాపస్ వచ్చుటకు అనుమతి లభించకపోతే ఏం చేస్తావు ? అని అడిగారు. అందుకు నేను - బాబా, ఆమె తల్లి చాలా అమాయకురాలు, చాలా ఏడుస్తూ ఉంది. ఒకసారి కలుసుకోనివ్వండి అని అన్నాను. అందుకు బాబా "నీవు బాధ్యత తీసుకుంటావా" అని అడిగారు. అందుకు నేను " సరే బాబా, నేను ఆ బాధ్యత తీసుకుంటాను" అని చెప్పాను. నేను భగవంతునితో



మాట్లాడుతున్నాననే విషయము మర్చిపోయాను. నేను సుందరి బహన్‌ను వారింటికి తీసుకెళ్ళాను. ఇంటి లోపలికి వెళ్తూనే ఆమె తల్లి ఆమెను ఇంట్లో బంధించేసింది. ఎవ్వరినీ కలువనివ్వలేదు. బంధువులతో కూడా కలుసుకోనివ్వలేదు. సంకెళ్ళతో మంచానికి బంధించారు. ఆమె కనీసము లేవలేకుండినది. బాత్‌రూముకు కూడా ఆమెను సంకెళ్ళతో బంధించే తీసుకెళ్ళేవారు. పూర్తి ఖైదు చేశారు. ఇదేమిలా జరిగిందే అని ఆలోచించసాగాను. వాపస్ తెచ్చే బాధ్యత నాది అని చెప్పావు కదా, నీవే విడిపించు అని బాబా అంటారనిపించింది. ఆమెను విడిపించలేకపోతే ఎలా అని మనసు తినసాగింది. ఇప్పుడు ఫెయిల్ అవుతే కల్ప-కల్పము ఫెయిల్ అవుతానని ఆలోచించసాగాను. అందరము కలిసి ఆమెను విడిపించేందుకు వెళ్తామని సోదరీలన్నారు. వారి బంధువులు - మమ్ములనే కలుసుకోనివ్వకుంటే మీరెలా కలుసుకుంటారు, మీరు ఆమెను గురించి ఆలోచించకండి, ఆమె వెళ్ళిపోయినట్లే అని అనుకోండి అని అన్నారు. నేను మనసులో, నేను బాబా వద్ద ఆమె బాధ్యత తీసుకున్నాను కదా, ఇలా జరిగిందే, నేను ఎలాగైనా ఆమెను తెచ్చి బాబాకివ్వాల్సిందే అని ఆలోచించసాగాను. ఆమెను కలుసుకునేందుకు ఒక రోజు నేను కూడా వెళ్ళాను. కాని ఆమె తండ్రి నన్ను ఆమెతో కలుసుకోనివ్వలేదు. వారి కూతురుకు జ్ఞానమంటే చాలా ఇష్టమని, వీరు వస్తే ఆమెకు వైబ్రేషన్లు చేరి ఏడుస్తూ ఉంటుందని వారికి తెలుసు. సుందరిని బొంబాయికి తీసుకెళ్తే బాగుంటుందని, ఎందుకంటే అక్కడ ఎవ్వరూ లేరని ఆమె తండ్రి ఆలోచించారు. సుందరినీ బొంబాయికి తీసుకెళ్ళారు. కాని అక్కడ బృజశాంత బెహన్ ఉండినారు. సుందరిని బొంబాయికి తీసుకొచ్చినట్లు ఆమెకు తెలిసింది. సుందరీ బాబా కొరకు చాలా విలవిలలాడుతూ ఉంది. రాత్రింబవళ్ళు "బాబా, బాబా" అని అంటూ ఉండేది. ఈ కారణంగానే జబ్బు పడింది. చూసేవారికి ఆత్మ విలవిలలాడుతూ ఉందనిపించేది. ఒక రోజు సుందరి బహన్ శరీరము వదిలేసింది. "బాబా, బాబా" అంటూ ఆత్మ వెళ్ళిపోయింది. ఇటు బాబాతో కలవలేకపోయింది, అటు లౌకికము వారితో కలవలేకపోయింది.

## ఏ ఇంటి పై ‘ టు లెట్ ’ (బాడుగకివ్వబడును) అను బోర్డు ఉంటే అక్కడకు వెళ్లి విచారించేవారము

తర్వాత యజ్ఞము భారతదేశానికి వచ్చేసింది. ఒకసారి ఆపరేషన్ చేయించేందుకు బాబాను బొంబాయికి తీసుకెళ్లాము. అక్కడ బాబాను కలుసుకునేందుకు ఆసుపత్రికి వెళ్లాను. అప్పుడు బాబా “ బచ్ఛీ గాలి-నీరు మార్పు కొరకు కొన్ని రోజులు పూనాకు వెళ్లి ఉండమన్నారు.” అందువలన నీవు పూనాకు వెళ్లి బాబా కొన్ని రోజులు ఉండేందుకు ఇల్లు చూచి రా అని చెప్పారు. పూనాలో బృజశాంత ఇల్లు ఉంది. ఆమె లౌకిక తల్లిదండ్రులు అచ్చట ఉన్నారు. నేను పూనాకు వెళ్లాను. నా వెంట సోదరుడెవ్వరూ లేరు. అప్పుడక్కడ సెంటరు కూడా లేదు. నేను ఉదయము 5 గంటలకు ఇంటి నుండి బయల్దేరి ఏ ఇంటికి ‘ టు లెట్ ’ అని బోర్డు ఉండేదో అచ్చటకు వెళ్లి మా గాడ్‌ఫాదర్‌కు మంచి ఇల్లు కావాలి అని అడిగే దానిని. 4, 5 రోజులు నేను, బృజశాంత తిరుగుతూ ఉండినాము. మేము ఆశ వదులుకోలేదు. అరే! బాబా రథానికి ఇల్లు దొరకదు అను ప్రసక్తే లేదు. ఈ రోజు కాకుంటే రేపు తప్పక లభిస్తుంది. మేము శ్రమకోర్చి తిరిగాము. ఒక రోజు మేము దారిలో వెళ్తూ ఉండినాము. మా వెనుక ఒక కారు వస్తూ ఉంది. పోతూ-పోతూ నేను చేయి పైకెత్తాను. నేను నా ప్రయత్నముతో చేయి పైకెత్తలేదు. ఎవరో నా చేయి పట్టుకొని పైకెత్తినట్లనిపించింది. చేయి పైకెత్తుట అంటే కారు ఆపమని అడుగుట అని కూడా నాకు తెలియదు. కారు మా వద్దకు వచ్చి ఆగిపోయింది. ఆ కారును ఒక పర్శియన్ మహిళ నడుపుతూ ఉంది. ఆమె ఏమైనా సేవ అవసరమా? అని అడిగింది. అందుకు నేను మా గాడ్ ఫాదర్ కొరకు మేము ఒక ఇల్లు వెతుకుచున్నాము ఒక మంచి ఇల్లు కావాలి, మీకేమైనా తెలిసి ఉంటే చెప్పండి అని అడిగాము. ప్రారంభములో మేము ఎంత సాధారణంగా, అమాయకంగా ఉండినామో సేవ ఎలా చేస్తూ ఉండినామో చూడండి. నా కారులో కూర్చోండి, నేను మీకు చూపిస్తాను అని ఆ మహిళ చెప్పింది. నిజంగా ఆమె పూనాలో ఒక మంచి, అద్దాల మహలు వంటి ఇల్లు చూపించింది. విదేశాలలో ఉండు ఇల్లు వలె కనిపించింది. వేడి నీరు, ఫౌంటెన్ మొదలగు ఏర్పాట్లన్నీ ఉండినవి. తోట కూడా చాలా విశాలంగా ఉంది. మేము చాలా సంతోషించాము. వెంటనే వెళ్లి బాబాకు ఈ విషయము ఫోనులో తెలిపి



వెంటనే రమ్మని బాబాకు తెలిపాము. బాబా ఒక సోదరుని వెంట తీసుకొని అక్కడకు వచ్చేశారు. బాబాకు కూడా ఆ ఇల్లు బాగా నచ్చింది. ఆ రోజులలో సుందరి తల్లి అక్కడ ఉండేవారు. ఆమె బాబా వద్దకు వచ్చింది. బాబా ఆమెకు ధర్మరాజు రూపములో కనిపించారు. బాబా ఎదుట ఆమె వణకసాగింది. ఆమె బాబాతో - “ బాబా నన్ను క్షమించండి, నన్ను క్షమించండి, నేను మీ బిడ్డగా అయ్యాను కాని పక్కా బిడ్డగా కాలేదు. పక్కాగా అయిన నా బిడ్డను ఉండనివ్వలేదు, నేను చాలా పెద్ద నేరము చేశాను. సుందరి చనిపోయిన తర్వాత మా ధనమంతా మాయమైపోయింది, వ్యాపారమంతా సమాప్తమైపోయింది, నా పతి కూడా మరణించాడు. నా ఇల్లు నాశనమైపోయింది, ఖాళీ అయిపోయింది. బాబా నన్ను క్షమించండి, మా స్థితి చాలా చెడిపోయింది, అధ్వానమైపోయింది అని ఏడ్వసాగింది. అప్పుడు బాబా ఆమెతో - “ ఇది డ్రామా, జరగవలసింది జరిగిపోయింది అందుకు బాబా ఏం చేస్తారు!” బాబా ముందు ఆమె చాలా ఏడ్చింది, చాలా ఏడ్చింది. బాబా నేను చాలా పెద్ద తప్పు చేశాను, నేను నా బిడ్డను పిలిపించుకున్నాను, నా కారణంగానే ఆమె చనిపోయింది అని ఏడ్వసాగింది.

## బాబా నన్ను పంజాబుకు పంపించారు

నేను మీకు కొన్ని విషయాలు చెప్పాలి. బాబా వారిగా అయిన తర్వాత జ్ఞానములోకి వచ్చిన తర్వాత చాలా పరీక్షలొస్తాయి. కాని ధైర్యాన్ని, నిర్భయతను విడనాడరాదు. ఎవరు జ్ఞానములో నడుస్తూ ఉంటారో వారికి పరీక్షలు తప్పక వస్తాయి, కాని మనమెప్పుడూ భ్రమించరాదు. ఈ రోజు వరకు నేనెప్పుడూ కన్‌ఫ్యూజ్ అవ్వలేదు. భారతదేశానికి వచ్చినపుడు బాబా నాతో “నీవు పంజాబుకు వెళ్లాలి అని అన్నారు.” అక్కడ జానకి దాది ఉండినారు. అక్కడ ఒక సమ్మేళనము జరుగుతూ ఉంది. అందువలన నన్ను అక్కడకు పంపించారు. ఆ రోజులలో పుష్పాల్ బహన్ గలాటా జరుగుతూ ఉంది. ఆమె పిల్లలు కూడా జ్ఞానములో నడుస్తూ ఉండినారు. ఆమె పతి, అత్తవారింటివారు ‘ భలే నీవు వెళ్లు కాని పిల్లలను నీ వెంట తీసుకెళ్లకు ’ అని అనేవారు. పిల్లలు అందుకు ఒప్పుకోలేదు, మేము కూడా ఆశ్రమానికి వెళ్తాము అని అన్నారు, ఒక గురువు ఉండినారు, సుమారు 40 మంది ఆడపిల్లలు అతని వద్దకు వెళ్లేవారు, వారంతా మా వద్దకు రాసాగారు.

అందువలన ఆ గురువుకు కూడా మేమంటే చాలా కోపము. ఇటువంటి గలాటాలు జరిగే సమయములో బాబా నన్ను(అచ్చటకు) పంజాబుకు పంపారు. పంజాబులోని పరిస్థితి ఎలా ఉండేదో మీరు అర్థము చేసుకోగలరు. పంజాబువారు కత్తి లేకుండా కనిపించరు, మాట్లాడరు. మేము బాబా పిల్లలము, మా పై సదా బాబా ఛత్రఛాయ ఉంటుంది. వారు మాతో ఎప్పుడూ అలా మాట్లాడలేదు. తిట్టి, గలాటా చేశారు కాని ఎప్పుడూ బలప్రయోగము చేయలేదు.

## ఒకసారి సెంటరుకు ఒక ఉగ్రవాది వచ్చాడు

పంజాబులో ఉగ్రవాదుల గలాటా జరుగునప్పుడు కూడా మేము చాలా పద్ధతిగా ఆశ్రమాన్ని నడిపించాము. అమృతసర్‌లో మా మ్యూజియం దర్బారుకు సమీపములో ఉంది. మా సోదరీలు అక్కడకు ఒంటరిగానే వెళ్తూ ఉండినారు. అది చరిత్ర నిర్మాణానికి సంబంధించిన మ్యూజియం. అక్కడకు కూడా జనులు వచ్చేవారు. వారిని కూర్చోబెట్టి మేము చరిత్ర నిర్మాణము గురించిన జ్ఞానము వినిపించేవారము, మధ్యపానము వలన కలిగే నష్టాలు, పరమాత్మ అంటే ఎవరు, మొదలగు విషయాలన్నీ వారికి వినిపించేవారము. ఈశ్వరీయ జ్ఞానమును అర్థము చేసుకున్నవారు చాలా సంతోషించేవారు. స్వర్గ చిత్రాన్ని చూచినప్పుడు వారు ఈ చిత్రమును మార్చండి, దానిని తీసేయండి అని అనేవారు. పంజాబులో ఏ సెంటరుకు వెళ్లినా జ్ఞానము విని సంతోషించేవారు. ఏ ధార్మిక సంస్థలను మూయించాలని అనుకున్నారో వాటి లిస్టు ఒకటి తయారు చేయబడి భిండ్‌రా వారి వద్ద ఉండేది. అందులో మన సంస్థ పేరు కూడా ఉండేది. భిండరావారు తమ వారిని పిలిచి ఈ సంస్థ ఎలా ఉంది అని అడిగారు. అందుకు వారు చాలా బాగుంది, వీరి ఆలోచనలు చాలా బాగున్నాయి, మేమంతా చూస్తున్నాము, వారి మాటలు వింటున్నామని చెప్పారు. వారు కూడా ఈ భూమి ఫరిస్తాన్ పవిత్ర స్థానంగా చేయాలని కోరేవారు - ఈ మాటలు విని వారు చాలా సంతోషించారు. దర్బారులోకి వారెవ్వరినీ రానివ్వరు. ఆ రోజులలో దాదీగారు అమృతసర్‌కు వచ్చారు. దర్బారు చూపించేందుకు వారిని తీసుకెళ్లాము. మేమంతా చూచి వచ్చాము, వారు మమ్ములనేమీ అనలేదు. చాలా గౌరవంగా దర్బారంతా చూపించారు.



## హాపుడ్ గలాటాలో కూడా బాబాకు నేనే జ్ఞాపకమొచ్చాను

హాపుడ్‌లో గలాటా జరిగినప్పుడు అక్కడున్న జనులు " బ్రహ్మాకుమారీలు హాపుడ్ వదలి వెళ్లిపోండి" అని నినాదాలు చేశారు. ఆ సమయములో కూడా బాబాకు నేనే గుర్తుకు వచ్చాను. "చంద్రమణి నీవు అచ్చటకు వెళ్లు" అని బాబా అన్నారు. కాన్పూరు నుండి వకీలు సంత్‌రాం భాయి అక్కడకు వెళ్లాడు. అతని స్థితిని కూడా చెడగొట్టారు. ఆ సమయములో మమ్మా కర్నాల్‌లో ఉండినారు. నేను మమ్మాతో - " మమ్మా అక్కడకెళ్లి నేనేం చేస్తాను? నేనెందుకు వెళ్తాను? అది ఢిల్లి కనెక్షన్‌లో ఉంది అని అన్నాను. " అందుకు మమ్మా - అలా అనకు బాబా వెళ్లమ్మన్నారు, నీవు వెళ్లు". అక్కడ నీవు చేయాల్సిన పని ఏదో ఉంది నీవు అక్కడకెళ్లి అందరికి దృష్టి ఇవ్వాలని చెప్పారు. నీకెప్పుడూ యోగమంటే చాలా ఇష్టము. యోగము ద్వారా కూడా నిర్భయతా శక్తి ఇంకా పెరుగుతుంది. నిర్భయత నాకు ఒక ఆత్మిక శక్తిగా అయింది. నేను అక్కడకెళ్లి ప్రతి రోజు ట్యాంకు పై కూర్చొని పట్టణానికంతా సకాశ్ ఇస్తూ ఉండినాను. అశరీరినై దృష్టి ఇస్తూ ఉండినాను.

నేను వచ్చినట్లు వారికి తెలిసింది. ముఖ్యంగా చాలా గలాటా చేసేవారు 8 మంది ఉండినారు. వారిలో ఒకరు చాలా దుర్మార్గుడు ఖూనీకోరు, చాలా మందిని ఖూనీ చేసినవాడు, అతని క్రింద ఇంకా చాలా గుండాలుండినారు. గలాటా చేసింది వారే. అక్కడ రజ్జూ అను 60 సంవత్సరముల వయసు గల వృద్ధ మాత ఉండేది. ఆమె తన పతితో నేను పవిత్రంగా ఉంటానని చెప్పింది. ఆమె పతి ఆమెను కొట్టి ఇంటి నుండి తరిమేశాడు, ఆమె వద్ద 5 రూపాయలు మాత్రమే ఉంది, వాటిని తీసుకొని ఆమె ఢిల్లి కమలానగర్‌కు వచ్చేసింది. ఆమె వారితో "పాత్రలు తోమే మనిషిగా నన్ను ఇక్కడ ఉంచుకోండి" అని చెప్పింది. వారు సెంటరులోనే ఉంచుకున్నారు. ఆమె పతి " నా పత్ని ఇంటి నుండి బంగారు తీసుకొని బ్రహ్మాకుమారీల వద్దకు పారిపోయిందని పుకారు లేవదీశాడు." ఈ కారణంగానే అక్కడ గలాటా జరుగుతూ ఉండినది. నేను అచ్చటికి వెళ్లి వారికి నచ్చజెప్పాను. వారు అర్థము చేసుకోలేదు. నా మాటలు లెక్కపెట్టలేదు. వారు నాతో ఈ ఇంటిని వదలి వెళ్లమన్నారు. ఆ ఇంటి యజమానికి చెప్పి నీళ్లు, కరెంటు సప్లై కట్ చేయించారు. బాత్రూం శుభ్రము చేసే వారిని, పాలు కూరగాయలు తెచ్చి ఇచ్చేవారిని అందరినీ మాన్పించేశారు. కాని మేము బాబా పై

నిశ్చయముంచుకున్నాను. ఎవరైనా వేరేవారైతే భయపడేవారు. అన్ని వైపులా కట్ చేస్తే మేమేం తినాలి? కాని మేము భయపడలేదు, ఇది బాబా కార్యము, బాబా చూచుకుంటారు. అన్ని సరిపోతాయని మా నిశ్చయము. రెండు మూడు రోజులు మేమేమీ తినలేదు. అయినా మేము భయపడలేదు, లెక్కపెట్టలేదు, బాబా ఏం చేశారో చూడండి. మీరట్‌లో ఒక పోలీసు అన్నయ్య జిజ్ఞాసువుగా ఉండేవాడు. అతడు ప్రతి రోజు క్లాసుకు వెళ్లేవాడు. కమల సుందరి బహన్ ప్రతి రోజు అతనితో మాకు భోజనము పంపుతూ ఉండేది. పోలీసువారిని ఎవ్వరూ అడ్డగించలేరు. మేము ఆ భోజనము తినేవారము. అది తప్ప ఇక మాకు అక్కడ ఏవీ లభించేవి కాదు. వీరిని మనము ఆకలితో చంపాలనుకుంటే, వీరు ఎలా బ్రతికి ఉన్నారు! వీరు గాలినేమైనా భోంచేస్తారా? అని అనుకునేవారు. బాబా మాకు లోలోపల తినిపిస్తున్నారని వారికేం తెలుసు. పిల్లల రక్షకుడైన బాబా ఉన్నారు కదా! వారు ఎంత తిట్టినా మీరు నోరు తెరవకండి, కేవలం యోగయుక్తులై వారికి దృష్టినివ్వండి అని బాబా మాకు చెప్పారు. మేము అలాగే చేసేవారము. మాతో పాటు జయపూర్ బలదేవ్ భాయి కూడా ఉండినాడు. అతను ఎందుకో బజారుకెళితే అతని పై పామును పడేశారు. భోపాల్ భూపేంద్రభాయి కూడా అక్కడకు వెళ్లి ఉండినాడు, అతని బట్టలు విప్పించారు. వారు చాలా విసిగించారు. బాబా పిల్లలకు చాలా దు:ఖము కలిగించారు. అయితే ఎవ్వరూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వారు చేసినదంతా ప్రభుత్వానికి రిపోర్టు వ్రాసి పంపమన్నారు. మీరు ఏమైనా చేస్తే మీకు సహాయము లభించదు. ఎప్పుడూ చట్టము చేతికి తీసుకోకండి అని బాబా చెప్పారు.

## ఆ మనిషి నన్ను భయపెట్టాలని చాలా ప్రయత్నించాడు

ఒక రోజు ఆ మనిషి వచ్చి నా ముందు కూర్చొని - " ఇక్కడ నుండి వెళ్లిపో లేకుంటే ఇక్కడికి పులిని పంపుతాను, అది నిన్ను తినేస్తుంది. నా వద్ద అన్ని బలాలున్నాయి, నేను చాలా మందిని ఖూనీ చేశాను. ఇది నీవు పిల్లాటగా భావించకు, నన్ను తక్కువగా అంచనా వేయకు, చెప్పింది నేను చేసి చూపిస్తాను" అని బెదిరించాడు. అందుకు నేను పర్వాలేదు చేసి చూపించు అని అన్నాను. నా మాటలు విని అతడు భయపడిపోయాడు. అతడు ఇనుప ముక్కలను పొడరు చేసుకొని తెచ్చి ఉండినాడు. అతడు ఆ పొడరును త్రాగు



నీటి ట్యాంకులో వేశాడు. అది సీతా బహన్ చూచింది. ఆమె అతనిని ట్యాంకులో ఏమి వేశావని అడిగింది. ఏమీ వేయలేదని చెప్పాడు సీతా బహన్ ఇనుప పొడరు బయటకు తీసింది. ఇది చూచి ఆ మనిషి పారిపోయాడు. ఇంత జరిగినా వారు హాపుడ్ వదలి వెళ్లండి అని అంటూనే ఉండినారు. మొదట మేము ఏమి తప్పు చేశామో చెప్పండి అని మేమంటూ ఉండినాము. తర్వాత ఈ ఇల్లు వదిలేయండి ఇంతకంటే మంచి ఇల్లు చూపిస్తామని అనసాగారు. ఆ ఇంటి నుండి మా సామాను తీయవద్దని మాకు పోలీసు సైగ చేశాడు. సామాను మార్చే నెపముతో సామానంతా ఢిల్లీకి తీసుకెళ్లి వదిలేస్తామని వారి ప్లాను. మీరేమి మాట్లాడకుండా ఉండండి, సమయమొచ్చినపుడు మీకు సహాయము చేస్తామని పోలీసువారు మాకు చెప్పారు. ప్రభుత్వము నుండి బాబా ఎలా సహాయము చేయిస్తారో చూడండి. వారు చాలా ప్రయత్నించారు. వారు మాతో మీకు ట్రక్ ఇస్తాము, మీకు ఒక జీపు ఇస్తాము, మీ సామానంతా పెద్ద ఇంట్లోకి మారుస్తామని ప్రలోభము చూపించారు. వేరే ఇల్లు దొరకుతూనే మేమే ఖాళీ చేస్తామని చెప్పండని మాకు పోలీసులు చెప్పారు.

## వారు నన్ను చంపేందుకు వచ్చారు కాని నలువైపులా వారికి ప్రకాశమే ప్రకాశము కనిపించింది

తర్వాత ఒక రోజు మరో ఇల్లు దొరికింది. అక్కడికి మేము సామాను తీసుకొని పోతూ ఉండినాము, అది రాత్రి సమయము. మేము కూర్చొని వెళ్లేందుకు వారు రిక్షా పంపించారు. మాకు వద్దు, నడిచే వెళ్తామని మేము చెప్పాము. నేను బాబా స్మృతిలో నడిచి వెళ్తూ ఉండినాను. నా వెనుక పోలీసులు వస్తూ ఉండినారు, మీరు మాతో రండి అని నేను వారికి చెప్పలేదు. ఇది బాబా చేసిన అద్భుతము. మేము సామానులు మారుస్తున్నాము, వారు మమ్ములను చంపాలని ఉన్నారని కూడా పోలీసులకు తెలుసు. అందువలన వారు మా వెనుకనే వస్తూ ఉండినారు. నేను బాబా స్మృతిలో నడుస్తూ ఉండినాను. నన్ను చంపేందుకు వచ్చిన వారి గొంతు పూడుకు పోయింది. వారికి మాటలే పెగలక గొంతు పూడుకు పోయింది. వారికి నా నలువైపుల ప్రకాశమే ప్రకాశము కనిపించింది. నా నలువైపులా ప్రకాశమున్నట్లు నాకు అనుభవమవుతూ ఉండినది. నాకు కూడా అది ఒక కొత్త అనుభవము. వారు ఏమీ చేయలేక

పోయారు. శబ్దము చేయకుండా అలాగే చూస్తూ ఉండిపోయారు. మేము కొత్త ఇంటికి చేరుకునే లోపు మా తాళము పైన మరొక తాళము వేసి ఉండినారు. మేము వెళ్ళి వారితో ఇది భగవంతుని కార్యము, ఇలా చేయకండి అని చెప్పాము. ఈ ఇల్లు మేము తీసుకున్నాము, మాకు కావాలి అని వారన్నారు. ఎంత చెప్పినా వారు వినలేదు. నేను పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు చెప్పాను. పోలీసు వచ్చి తాళము పగులగొట్టించి మా సామానులు లోపల పెట్టించారు. ఈ విధంగా బాబా సహాయము ఎలా లభిస్తుందో, బాబా ఎలా రక్షిస్తారో చూడండి.

అది చాలా మంచి ఇల్లు, అన్ని వసతులు బాగుండినాయి. కాని అక్కడకు వదిలి పెట్టలేదు. అక్కడ మంత్రి కూడా ఆర్యసమాజానికి చెందినవాడు. జగదీష్ భాయి, సంత్‌రాం భాయి మొదలైనవారు చదువుకునేందుకు మీరట్ వస్తూ పోతూ ఉండేవారు. ఆ మంత్రిని సెంటరుకు ఆహ్వానించారు. వారి వైపు 8 మంది, మా వైపు 8 మంది ఉండినారు. దానిలో కాన్పూర్ బాబూజి, పాట్నా బాబూజి కూడా ఉండినారు. వారితో పాటు ఆ రజ్జూ మాతను కూడా తెలుసునేందుకు పిలిపించాము. **వారి ముందు రజ్జూ మాత తన కథనంతా వినిపించింది. అంతా విన్న తర్వాత అతడు ఇంత గలాటా చేసే అవసరమే లేదని వారు ఆశ్చర్యపడ్డారు. నేను జతలో ఉండాలని 5 రూపాయలు తీసుకొని పని చేసుకొని బతికేందుకు వీరి వద్దకు** వచ్చానని ఆ మాత చెప్పింది. దానికి ఇంత గలాటా చేసే పని ఏముంది! ఆ మంత్రి ఇదంతా విన్న తర్వాత ఆ 8 మందిని జైలుకు పంపమని చెప్పాడు. వారిని జైలులో వేశారు. తర్వాత కొంత సమయము శాంతిగా గడిచింది. తర్వాత వీరు కళ్లలో కళ్లుంచి పతి పత్నులను, సోదరి సోదరులుగా చేస్తారని ఫిర్యాదు చేశారు. ఈ విషయము ఇందిరాగాంధీ వరకు పోయింది. వీరిలా చేస్తున్నారా అని తెలుసుకునేందుకు సి.ఐ.డీ.లను పంపించారు. ఇది మరొక కథ. తెలిసిందా? ఇటువంటి ఘటనలు చాలా జరిగాయి. కాని బాబా చాలా సహాయము చేశారు.

ఈ రోజు బాబా తోట ఎంత పెద్దదైపోయిందో చూడండి! ఎన్ని రకాల పుష్పాలు వికసించాయి! బాబా నర-నరాలలో ఉన్నారు. మా కన్నులలో బాబా, మా రోమ-రోమములో బాబా స్మృతి ఇమిడిపోయింది. ఇటువంటి సమయాలలో బాబా మాకు ఎలా సహాయము చేస్తారో సేవలో సాథీగా ఉండి ఎలా తోడుంటారో మేము ఎలా మరచిపోతాము? మర్చిపోవాలన్నా మర్చిపోలేము. ఈ విధంగా



బాబా ఆజ్ఞానుసారము ఇటువంటి సేవలలో నేను నిర్భయంగా నడుస్తూ వచ్చాను. అందుకే బాబా నాకు(పంజాబ్ కా షేర్) అని పేరు పెట్టారు.



## వతనము వైపు...

యజ్ఞములోని ఆదిరత్నము, బ్రాహ్మణ కులభూషణులందరి స్నేహీ, సహయోగి, అందరి పట్ల సదా కళ్యాణకారి భావననుంచే, భాగ్యవిధాత భగవంతుని నుండియే షేర్ - ఎ - పంజాబ్(పంజాబ్ సింహము) అను బిరుదుతో అలంకరింపబడిన ఆదరణీయ చంద్రమణి దాదీగారు మార్చి 11, 1997లో రాత్రి 10.40నిముషాలకు బెంగళూరులో తమ భౌతిక శరీరాన్ని వదిలేశారు. వారు శరీరము వదులుతారన్న సంకల్పము ఎవ్వరి మనస్సులో గాని, చిత్తములో గాని లేనే లేదు. డ్రామాలో ముందే నిశ్చితమైయుండిన ఈ అకస్మాత్తు సంఘటన ఎలా జరిగింది, ఏమయింది అన్న వివరణను దాదీగారి సహయోగి, ప్రత్యక్షంగా చూచిన బి.కె.విజయ బహన్ ఈ విధంగా చెప్తున్నారు -

అది 1997 వ సంవత్సరము మార్చి 9వ తేది. మేము జ్ఞాన సరోవర్ నుండి బెంగళూరుకు వెళ్లవలసి ఉంది. మార్చి 7వ తేది శివరాత్రి. బాప్‌దాదా జతలో శివరాత్రిని జరుపుకున్నాము. శివరాత్రి రోజు దీదీగారి(చంద్రమణి దాదీ) పాత బంధువులు కూడా వచ్చారు. 9వ తేది ఉదయము నేను దీదీతో, ఈ రోజు మీరు క్లాసు చేయకండి ఉదయము ఉదయమే బయలుదేరుతాము అని చెప్పాను. కాని జానకీ దాది మీరు క్లాసు చేసి వెళ్లండని చెప్పారు. దీదీ ఉదయం మురళి క్లాసు వినిపించారు. తర్వాత జానకీదాది స్టేజి పైన బాగా మిలనము చేశారు. క్లాసులోనే అందరి నుండి శెలవు తీసుకున్నారు. తర్వాత దీదీ, నేను దాదీ(ప్రకాశమణి)తో కలవాలని అన్నారు. ఏవైనా డైరెక్షన్లు ఉన్నాయేమో అడుగుతాను అని అన్నారు. అయితే పాండవ భవనానికి వెళ్దామని చెప్పాను. తర్వాత పాండవ భవనానికి వెళ్లి పెద్దదాదీతో చాలా బాగా మిలనము చేసి దాదీ, మీరు నాకు టోలీ ఇవ్వరా?!!! అని అడిగారు. దాదీ టోలీ తినిపించారు. ఒకసారి దాదీజీ నాతో - చంద్రమణి దాదీ ఎప్పుడూ టోలీ ఇవ్వమని అడగలేదు కాని ఆ రోజు వీడ్కోలు తీసుకునే సమయంలో నన్ను టోలీ అడిగారని చెప్పారు. మధువనము నుండి బయలుదేరేందుకు ముందు దీదీ అందరికీ టోలీ తినిపించారు.

అహమ్మదాబాద్ నుండి సాయంకాలము విమానము ఉంది. మేము బెంగళూరుకు చేరుకున్నాము. రాత్రి బెంగుళూరులో అక్కయ్యలతో కలిశారు.



మరుసటి రోజు ఉదయము ఒక ధర్మశాలలో అందరికీ క్లాసు ఉంది. సాయంకాలము బెంగళూరులోని రాజయోగ భవనానికి వెళ్లాము. రాత్రికి అక్కడే ఉన్నాము. ఉదయము దీదీ క్లాసు చేసి ఒక్కొక్కరి పరిచయము తీసుకున్నారు. అందరితో చాలా బాగా కలిశారు. తర్వాత విశ్రాంతిగా అల్పాహారము తీసుకున్నారు. అంతలో కుమారా పార్కు సెంటరు నుండి సరళా బహన్ తమ టీచర్ అక్కయలతో అక్కడికి చేరుకున్నారు. దీది అందరికీ కర్బూజ పండు తినిపించారు. తర్వాత వారందరితో కలిసి భోజనం చేశారు. వారిని నవ్వించి ఆనందపరచారు. తర్వాత కిచన్‌లో ఒక రౌండు వేసి రూములోకి వచ్చి పడుకున్నారు. ఆ రోజు మార్చి 10వ తేది. 16వ తేదీన పెద్దదాదీగారు కూడా అక్కడికి రావలసి ఉంది.

నేను వారి కళ్లలో మందు చుక్కలు వేస్తూ ఉంటే వారు నాతో - విజయా ఎందుకో ఈ రోజు నా తలలో నరాలు చాలా లాగుతున్నాయి. చాలా తలనొప్పిగా ఉంది అని చెప్పారు. నేను గ్యాసు పైకెక్కిందా అని అడిగాను? సోడా తెప్పించేదా? అని అడిగాను. అందుకు వారు తెప్పించు అని అన్నారు. ఒక సోదరునితో నేను సోడా తెప్పించాను. సోడా తీసుకొని నేను వచ్చేటప్పటికి దీదీ బాత్‌రూమ్‌లో ఉన్నారు. బయటికి వచ్చినప్పుడు చాలా బలహీనముగా కనపడ్డారు. వారు నా భుజము పట్టుకొని నడుస్తూ వచ్చి సోఫాలో కూర్చున్నారు. ఇంత బలహీనత ఎలా వచ్చిందో నాకు కూడా అర్థము కాలేదు. దీదీ, సోడా తెప్పించాను త్రాగండి అని చెప్పాను. నేను లేవలేకపోతున్నానని దీదీ నాతో అన్నారు. మరొక రూములో సరళా బహన్ తమ టీచర్స్‌తో కలిసి దీది కొరకు ప్రోగ్రాము తయారు చేస్తూ ఉండినారు. నేను వారిని పిలిచాను. మేమిరువురము కలిసి దీదీని పైకి లేపినాము. వారు చాలా కొద్దిగా సోడా త్రాగి నాకు చాలా తలనొప్పిగా ఉందని చెప్పారు. తర్వాత నేను సూర్య నారాయణ అన్నయ్యతో డాక్టరును పిలుచుకొని రమ్మని చెప్పాను. అప్పుడు సమయము మధ్యాహ్నము సుమారు 3.30 గంటలయింది. అది భోజన విరామ సమయమైనందున ఆ ప్రదేశానికి దగ్గరలో ఏ డాక్టరూ దొరకలేదు. ఒక డాక్టరును వారి ఇంటి నుండి తీసుకొచ్చారు. అతడు ఖాళీ చేతులతో వచ్చాడు. మేము గ్యాస్ ప్రాబ్లమ్ ఉందని చెప్పడం వలన ఆ ఇంజెక్షన్ మాత్రమే తీసుకొచ్చి అదే ఇచ్చి వెళ్లిపోయాడు. తర్వాత నేను కొద్దిగా ఏమైనా మార్పు ఉందా? అని అడిగాను. అందుకు వారు తగ్గిపోతుందిలే అని

అన్నారు. మళ్లీ కొంత సమయము తర్వాత నేను దీదీతో ఇంకా నొప్పి ఉందా? అని అడిగాను. ఇంకా ఉందని చెప్పారు. నేను దీదితో మీరు మంచం పైన పడుకోండి అని చెప్పి వారిని మంచం పైన పడుకోబెట్టాను. ఈ విషయము తెలిసి కొంతమంది అక్కయ్యలు వచ్చి దీదీ తలను నొక్కసాగారు. ఏమి చేయాలో అర్థం కాక నేను కూర్చుండిపోయాను. నాకు కూడా నిద్ర వస్తూ ఉండినది. దీదీ నన్ను నిద్రపొమ్మని చెప్పారు. నేను నిద్రపోను అని చెప్పాను. తర్వాత సాయంకాలము నేను దీదీతో ఎలా ఉంది? కొద్దిగా ఏమైనా మార్పు ఉందా? అని అడిగాను. వారు కొద్దిగా అని చెప్పారు.

చీటకి పడుతూ ఉంది. ఒకవేళ రాత్రికి కష్టమైతే ఏమి చేయాలని ఆలోచించాను. ఇక్కడ ఎలాంటి వసతులు లేవు. సిటీలోని సెంటరుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాను. నేను జయనగర్ సెంటరులో దాదీల కొరకు రూము తయారుచేశారు, అక్కడకు వెళ్దామా? అని అడిగాను. దీదీ ఒప్పుకున్నారు. జయనగర్ సెంటరుకు ఫోన్ చేసి మేము వస్తున్నాము, రూము శుభ్రం చేయించమని చెప్పాము. కారు కూడా తెప్పించాము. దీదీని కారు వరకు నడిపించుకుంటూనే తీసుకెళ్లాము. దీదీగారికి హార్ట్ ఎటక్(గండె పోటు) వచ్చిందని మాకు ఆలోచనే రాలేదు, వారిని నడిపించకూడదని కూడా మాకు తెలియదు. వారిని నడిపించుకుంటూనే అక్కడి వరకు తీసుకెళ్లాము. అక్కడ కూడా గది పైన ఉంది. తాపలు ఎక్కించుకొని పైకి తీసుకెళ్లాము. దీదీ కుర్చీలో కూర్చుండిపోయారు. అప్పుడు సాయంకాలము 7.30 అయ్యింది. తర్వాత డాక్టరును తీసుకొచ్చాము. వారు రక్తప్పోటు(బి.పి) చెక్ చేశారు. పైది190, క్రిందిది 110 ఉంది. అంతకు ముందు వారి రక్తపోటు నార్మల్‌గా ఉండేది. కనుక చాలా రోజుల నుండి రక్తపోటు మాత్రలు తీసుకోవడం మానేశారు. డాక్టరు మాత్ర ఇచ్చి షుగర్ కూడా చెక్ చేయించమని చెప్పారు. షుగర్ చెక్ చేయిస్తే మామూలు కంటే కొంచెం ఎక్కువగా ఉంది. ఇప్పుడు ఏ మందు ఇస్తున్నారో అదే ఇచ్చి ఏదైనా కొంచెం తినిపించండి అని డాక్టరు చెప్పాడు. నేను మందు తినిపించి దీదీ, కొద్దిగా ఏదైనా తినండని చెప్పాను. నాకు తినాలని లేదు అని దీదీ అన్నారు. బొప్పాయి పండు కూడా తిననని అన్నారు. నేను ఆపిల్ అయినా తినమన్నాను. సదే కోసి తీసుకు రా అని చెప్పారు. ఇస్తే వారు తిని మాకు కూడా తినిపించారు.



అప్పటికి రాత్రి 9.30 గంటలయ్యింది. ఇక నేను నిద్రపోనా? అని దీదీ అడిగారు. నేను నిద్రపొమ్మని చెప్పాను. ఇంతలో డాక్టరు ఈ.సీ.జీ తీసేవారిని పంపించారు. ఈ.సీ.జీ రిపోర్టు చూసి డాక్టరు వీరికి చిన్నపాటి గుండెపోటు అయ్యింది, భయపడే విషయమేమీ లేదు, సాధ్యమైతే ఇప్పుడే తీసుకొని రండి లేకపోతే రేపు ఉదయము తీసుకొని రండి అని నాలుక క్రింద ఉంచుకునేందుకు ఒక మాత్ర ఇచ్చారు. ఇవన్నీ చేసేటప్పటికి రాత్రి 10 గంటలైపోయింది. దీదీ నాతో సరే నీవు నిద్రపో అని చెప్పారు. నిద్రపోయేటప్పటికి 10.30 అయ్యింది. నేను గాఢంగా నిద్రపోయాను.

ఆ సమయంలో కిచన్‌లో ఒక అక్కయ్య ఉదయము అల్పాహారము కొరకు తయారు చేస్తున్నారు. బహుశా ఆమెకు దీదీ నోటి నుండి వచ్చే శబ్ధాలు వినపడ్డాయేమో, ఆమె రూములోకి పరుగెత్తుకొని వచ్చి దీదీ, దీదీ అని దీదీని పిలువసాగింది. ఆమె పిలుపు విని నేను మేల్కొని ఏమయ్యింది అని అడిగాను. దీదీకి ఏమవుతూ ఉందో తెలియడం లేదని ఆమె అనింది. ఆ సమయములో దీదీ నోటి నుండి హా, హా అనే శబ్ధాలు వస్తూ ఉండినాయి. కళ్ళు మూసుకునే ఉన్నారు. నేను దీదీ బాగుందా, బాగుందా అని అడిగాను. వారేమో జవాబివ్వలేదు. పక్కకు తిరిగి నిద్రపోయారు. వారి నోరు తెరుచుకొని ఉంది. నోటిలో నీరు పోయమని చెప్పాను. నీరు లోపలికి వెళ్లాయి తర్వాత డాక్టరును పిలిపించాము. బి.పి చెక్ చేసిన డాక్టర్ వచ్చారు. డాక్టరు ఎదురుగానే దీదీ రెండుసార్లు హా, హా అని శబ్ధము చేసి తర్వాత శాంతిగా అయిపోయారు. దీదీకి హార్ట్ ఎటాక్ వచ్చిందని మాలో ఎవ్వరికీ అర్థము కాలేదు. డాక్టరు చెక్ చేసి సడన్‌గా హార్ట్ ఎటాక్ వచ్చిందని చెప్పారు. హార్ట్ ఎటాక్ ఎలా వస్తుంది? వారి గుండె చాలా గట్టిదని నేను చెప్పాను. ఇదెలా జరిగిందని నాకేమీ అర్థము కాలేదు. నేను అంబికా బహన్‌తో - అలా జరిగేందుకు వీలు లేదు మరొక డాక్టరును పిలిపించమని చెప్పాను. మరో డాక్టరును తీసుకొచ్చారు అతడు - వీరిక లేరు(షీ ఈజ్ నో మోర్) అని చెప్పారు. అప్పుడు సమయము రాత్రి 10.40 అయ్యింది. మార్చి 11,1997 రాత్రి10.40 నిముషాలకు వారు శరీరాన్ని వదిలేశారు.

ప్రశ్న - ఆ సమయములో మీ స్థితి ఎలా ఉంది?

సమా - నేను దృఢంగానే ఉన్నాను. కాని దీదీ శరీరము వదిలేశారనే విశ్వాసమే

కలుగలేదు. తర్వాత నేను ఢిల్లీ ద్వారా హాట్‌లైన్‌లో పెద్దదాదికి మెసేజ్ ఇవ్వమని జ్ఞానసరోవర్‌కు ఫోన్ చేశాను. తర్వాత ఈశూ దాదీ నుండి ఫోన్ వచ్చింది. ఫోన్‌లో పెద్దదాదీ ఇదంతా ఎలా జరిగింది చెప్పు అని అడిగారు. నేను దాదీకి అన్ని విషయాలు వినిపించాను. మరలా నిర్వైర్ భాయికి వినిపించమని దాదీ చెప్పారు. అన్నీ విన్న తర్వాత ఇదంతా మెడికల్ ఎయిడ్(ఉపచార) లోపము వల్ల జరిగింది అని నిర్వైర్ భాయి అన్నారు. భుజాలలో నొప్పి రావడం, మాటి మాటికి బాత్‌రూమ్‌కు వెళ్లాలనిపించడం ఇవన్నీ హార్ట్ ఎటాక్ లక్షణాలని మాకు తెలియదు. దాదీ గుండె చాలా గట్టిది అని మాత్రమే నాకు తెలుసు. అంతకుముందు ఎప్పుడూ ఇలా జరిగి ఉండలేదు.

పెద్దదాదీ నుండి ఫోన్ వచ్చింది - జగదీష్ భాయి, రమేష్ భాయి, నిర్వైర్ భాయి బాడీని తీసుకొచ్చేందుకు అక్కడకు వస్తారు, మీరు కూడా వారి జతలో వచ్చేయండి, మిగతా ప్రోగ్రామంతా మధువన్‌లో ఉంటుంది అని చెప్పారు. కాని జగదీష్ భాయి, నిర్వైర్ భాయి రాలేకపోయారు. అమీర్ చంద్ భాయి, రమేష్ భాయి వచ్చారు. బాడీని బెంగళూరు నుండి అహమ్మదాబాదుకు తీసుకొచ్చాము. అహమ్మదాబాద్ నుండి శాంతివనము మరియు జ్ఞాన సరోవరము మీదుగా పాండవ భవనము చేరుకున్నాము.





## దివ్య సందేశము

(మార్చి 11, 1997 లో చంద్రమణి దాదీగారు పాత శరీరాన్ని త్యాగం చేశారు, వారి నిమిత్తంగా విశేషమైన భోగ్ మరియు గుల్జార్ దాదీగారి వతనము యొక్క దివ్య సందేశము)



సదా మందహాసముతో అందరిలో ఉమంగ-ఉత్సాహములోకి తీసుకొచ్చే దాదీ చంద్రమణి

ఈ రోజు చంద్రమణి దాదీ కొరకు వతనములో వారిని కలుసుకునేందుకు వెళ్ళడం జరిగింది. నేను వతనములోకి వెళ్తూనే బాబా ఒంటరిగానే చూశాను. బాబా చాలా రహస్యయుక్తముగా, మధురంగా చిరునవ్వుతూ ఉన్నారు. దూరము నుండే నయనాలతో స్వాగతం చేస్తూ, రా బిడ్డా! రా, ఈ బేహద్ ఆటలో ఆటను చూస్తూ ఆలోచిస్తున్నావా? అని అడిగారు. బాబా, మీరు అద్భుతమైన డ్రామాను చూపించారు అని నేనన్నాను. ఏదైతే స్వప్నములో కూడా లేదో దానిని మీరు సాకారములో చూపించారు. బాబా చిరునవ్వుతో చెప్పారు - బిడ్డా, ఇప్పుడు సమయ ప్రమాణంగా ఏ దృశ్యాలు జరుగుతాయో అవి అకస్మాతుగా జరుగుతాయని బాబా 2-3 సార్లు సూచననిచ్చారు. సమయము అడిగి రాదు, సమాప్తము అడిగి రాదు. కనుక ఏవైతే దృశ్యాలు జరుగుతాయో సేవలో గాని, బ్రాహ్మణ పరివారంలో గాని అన్నీ అకస్మాత్తుగానే జరుగుతాయి. కనుక ఈ బిడ్డ పాత్ర ఏదైతే నడిచిందో అది రెండు విషయాలకు గుర్తు.

ఒకటి - ప్రతి ఆత్మ అకస్మాత్తుగా(అనుకోకుండా, అచానక్‌గా) జరిగేదానికి ఎలా ఎవరెడీ(సదా సంసిద్ధము)గా ఉండాలి. బాబా చెప్పారు - సేవలో కూడా ఢిల్లీ ప్రోగ్రామ్‌లో అకస్మాత్తుగానే సఫలత లభించింది మరియు

అప్పటి నుండి బాబా సూచనల అనుసారంగా ఏ విషయాలైతే జరుగుతున్నాయో అవన్నీ అకస్మాత్తుగానే జరుగుతున్నాయి, ఇక ముందు కూడా అలాగే అకస్మాత్తుగానే జరుగుతాయి. కనుక అచానక్ మరియు ఎవరెడీకి గుర్తుగా ఈ బిడ్డను చూశారు. అంతిమ సమయములో వారికి ఏ సేవ కూడా గుర్తుకు రాలేదు. వారు సేవాస్థానములోనే ఉన్నారు. పగలంతా సేవ చేశారు. సేవా సంస్కారం తీసుకెళ్లారు. కాని అంతిమ సమయములో తమ యోగబలము ద్వారా కొద్దిగా మిగిలి ఉన్న లెక్కాచారాన్ని పూర్తి చేసుకోవడంలో, స్మృతిలో, ఎవరెడీ పాత్రలో పాస్(ఉత్తీర్ణులు) అయిపోయారు. బాబా చెప్పారు - అచానక్ మరియు ఎవరెడీకి ఈ బిడ్డ ఒక గుర్తు మరియు అంతిమ సమయములో ఏ విషయమూ గుర్తు రాకుండా ఉండేందుకు ఒక ఎగ్జాంపుల్(ఉదాహరణ).

రెండవ విషయము - ఈ బిడ్డ యొక్క ఉదాహరణ సమయ సమీపతకు ఎర్ర జెండాను చూపుతోందని బాబా చెప్పారు. ఇప్పుడు సమయము సమీపముగానే ఉంది కాని అకస్మాత్తుగా వస్తుంది. కనుక ఒకటి - అచానక్ ఎవరెడీ, రెండవది - సమయము యొక్క సమీపతకు ఎర్ర జెండాను ఈ బిడ్డ చూపించింది. ఈ బిడ్డ మంచిగా, సహజంగా పాస్ అయ్యి నా వద్దకు వచ్చిందని కూడా బాబా తెలిపించారు. బాబా ఇలా మాట్లాడుతూ చంద్రమణి దాదీతో రా బిడ్డా! నీ సఖీ నిన్ను కలుసుకునేందుకు వచ్చింది, రా అని పిలిచారు. మొదట దాదీ బాబా జతలో లేరు కాని బాబా రా బిడ్డా నీ సఖి వచ్చిందని చెప్పిన వెంటనే దాదీని బాబా జతలో చూశాను. దాదీ చాలా చిరునవ్వుతో ఉన్నారు. సాకారములో కూడా దాదీ ముఖము చిరునవ్వుతోనే ఉండేది. వారి చిరునవ్వు ఎలా ఉండినదంటే శరీరము నుండి వేరై వచ్చినట్లు వారి ముఖములో కనిపించనేలేదు. ఏ విధంగా ఇక్కడ గుల్జార్ ఎలా ఉన్నావు! అని అడిగేవారో అలాగే మాట్లాడారు. నేను గంభీరముగా ఉన్నాను. వారు చిరునవ్వుతూ ఉన్నారు. దాదీ అన్నారు - ఈ గుల్జార్ వతనంలోకి ఎలా వెళ్తుంది, ప్రాక్టికల్‌గా బాబాతో ఎలా మిలనము చేస్తుంది అని నేను ఆలోచిస్తూ ఉండేదానిని. నేను కూడా యోగంలో వెళ్లేదానిని. కాని ఇప్పుడు నేను కూడా వతనములో అనుభవము చేస్తున్నాను. బాబా వచ్చేయ్ బిడ్డా! అని పిలిచారు, నేను వచ్చేశాను. నాకు చాలా మజా వస్తోంది. వారి మాటలు ఎలా ఉన్నాయంటే వారి



ముఖములో గానీ, బుద్ధిలోగాని నేను అడ్వాన్స్ పార్టీలోకి వచ్చాననే భావన కొద్దిగా కూడా లేదు. ఇదే రూపంతో దాదీ నన్ను కలిశారు. మేము పరస్పరములో ఆత్మిక సంభాషణ చేస్తుంటే, బాబా మా ఆత్మిక సంభాషణ వింటూ మందహాసము చేస్తున్నారు. ఇలా అకస్మాత్తుగా ఎందుకు పిలిచారు? అని నేను బాబాను అడిగాను. బాబా అన్నారు - బ్రహ్మాబాబాను పిలిచినప్పుడు లేక ఇతరులను పిలిచినప్పుడు చెప్పి పిలిచినా? అందరూ అకస్మాత్తుగానే వచ్చారు. ఇప్పుడు బాబా సూచన ఇస్తున్నారు - ఎంతెంత ముందుకు వెళ్తారో అంతంత అకస్మాత్తుగానే అసంభవాలన్నీ సంభవమవుతాయి. ఏదైతే ఆలోచనలో కూడా ఉండదో అది అకస్మాత్తుగా అవుతుంది.

దాదీ మిమ్మలను అందరూ గుర్తు చేసుకుంటున్నారని చెప్పాను. అందకు దాదీ నా స్మృతి కూడా అందరికీ ఇచ్చి నేను చాలా ఆనందంగా ఉన్నానని చెప్పు అని అన్నారు. నేను శరీరము వదిలి వచ్చాననే సంకల్పము కూడా దాదీలో లేకపోవుటను నేను గమనించాను. నీకు వతనంలో ఎందుకు మజా వస్తుందనేది ఇప్పుడు నేను అర్థం చేసుకున్నానని దాదీ నాతో మాటి మాటికి చెప్పారు. బాబా కూడా ఆమెకు విషయాన్ని గుర్తు చేయలేదు.

బాబా ఈ విధంగా మిలనము చేయించి అంత్యములో ఇలా చెప్పారు - చూడు బిడ్డా, పేపరు రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి - ప్రాక్టికల్ ఎగ్జాంపుల్‌గా తయారవ్వడం. రెండవ పేపరు - చూచుటలో, వినుటలో ఉంటుంది. ఇది ప్రాక్టికల్ పేపరు. కనుక ఈ బిడ్డ ప్రాక్టికల్ పేపరుకు ఉదాహరణము. ఉదాహరణంగా అయ్యేవారికి అదనపు మార్కులు లభిస్తాయి. కనుక ఈ బిడ్డకు ముందుగానే జమా ఖాతా చాలా ఉంది. అంతేకాక ఇప్పుడు ఎగ్జాంపుల్‌గా అవ్వడంలో మార్కులు అదనంగా కూడా తీసుకుంది. ఇలా చెప్తూ బాబా దాదీని తన ఒడిలోకి తీసుకున్నారు. బాబా దాదీని తన ఒడిలోకి తీసుకుంటూనే వారు మర్జ్ అయిపోయారు. నేను బాబా వద్ద శెలవు తీసుకొని వచ్చేశాను.

## పుష్పాంజలి

### పై వారికి (పరమాత్మని) కూడా మంచివారి అవసరముంటుంది



హే 'షేర్ ఎ పంజాబ్' దాదీజీ మీకు శత శత నమములు

మార్చి మాసములో అమృతవేళ టెలిఫోన్ గంట గణగణమని అకస్మాత్తుగా మ్రోగుతూనే ఎప్పటి వలెనే సుఖప్రదమైన సమాచారము వినేందుకు అలవాటు పడిన రెండు చెవులు దాదీ చంద్రమణిగారు ఇక ఈ ప్రపంచములో లేరు అను వార్త అకస్మాత్తుగా విని నమ్మలేక పోయాయి. దు:ఖము కలిగించిన ఈ క్షణాలు ఇది ఎందుకు జరిగింది, ఎప్పుడు జరిగింది అని నన్ను స్తబ్ధునిగా చేశాయి. ఎందుకిలా జరిగింది, ఎప్పుడు జరిగింది మొదలైన అసంఖ్యాకమైన ప్రశ్నలు మనసులో ఉత్పన్నమవుతూ ఉండినాయి. బహుశా మరొక ఫోన్ కాల్ వస్తుందేమో, ఇంతకుముందు వచ్చిన సమాచారము అసత్యమని, మధురమైన చంద్రమణి దాదీ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని తెలుపుతారని పదే పదే శుభ సంకల్పాలు మనసులో మెదులుతూ ఉండినాయి.

ఆదరణీయ చంద్రమణిదాదీగారి సంపూర్ణ ఆరోగ్యాన్ని గురించి తెలిసిన నేను, వారు ఈ విధంగా అకస్మాత్తుగా మమ్ములను విడిచిపోవడం సంభవమని కలలో కూడా అనుకోలేదు. ఇది ఆలోచనకు అందని విషయము. శరీరాన్ని విడుచునంతటి అనారోగ్యము ఆమెకు ఎప్పుడూ లేదు. ప్రాణప్రియమైన బాప్‌దాదా వారికి అకాడమి ఫార్ ఏ బెటర్ వరల్డ్ (జ్ఞానసరోవరము) బాధ్యత అప్పగించడమే కాక బెంగుళూరు, ఇండోర్, పంజాబ్, హర్యానా మొదలైన జోన్ల వ్యవహారము కూడా అప్పగించారు. ఇవన్నీ చూచి మేమందరము వారి



ఛత్రఛాయ, చివరి వరకు మా తల పైన ఉంటుందనే భావించాము. గౌరవనీయులైన చంద్రమణిదాదిగారి వ్యక్తిత్వము చాలా ప్రభావశాలిగా, తేజోవంతముగా, మహత్వపూర్వకంగా ఉండేది. దాదీగారు ప్రాక్టికల్‌గా శక్తిస్వరూపంగా ఉండేవారు. వారి మాటలు, వ్యవహారము, ఆచార-ఆలోచనలు, కార్యకలాపాలలో శక్తిస్వరూపము స్పష్టంగా కనిపిస్తూ ఉండేది. దాదీగారి హృదయపూర్వకమైన, ప్రేమపూర్వకమైన నవ్వు క్షణములో అందరినీ ఉల్లాస-ఉత్సాహాలతో నింపేది. వారికి సమీపంగా వారి సంపర్కములోకి వచ్చు ప్రతి ఆత్మలో ఒక నూతనమైన విద్యుత్ సంచరించేది. వారి నిశ్చలమైన ప్రేమ ఎవరినైనా తమవారిగా చేసుకునే శక్తిని కలిగి ఉండేది. వారు అత్యంత నిర్భయ, ధైర్య సాహసాలు గల మహిళ. ఈశ్వరీయ సేవలలో అనేక విపరీత పరిస్థితులను లెక్కచేయక సంపూర్ణ ఉల్లాస-ఉత్సాహాలతో ముందుకు పోతూ ఉండినందున సాకార బాబా వారికి షేర్-ఏ- పంజాబ్ (పంజాబు సింహము) అను టైటిల్ ఇచ్చి వారి వ్యక్తిత్వానికి అత్యంత సజీవమైన మూల్యాంకనము చేసి చిత్రీకరించారు.

చంద్రమణిదాదీగారు వారి అంతిమ యాత్రలో యజ్ఞవత్సలందరికీ ఒక ఉదాహరణమూర్తియై నిలిచారు. వారు తమను తాము, తమ సాకార శరీరము నుండి వెన్నలో నుండి వెంట్రుక తీసినంత సులభంగా(బాబా శబ్ధాలలో) వేరు చేసుకున్నారు. శరీరాన్ని త్యాగము చేశాను అని స్వయం వారికి కూడా తెలియదు. దాదీగారి స్థితి ఎంత అతీతంగా అయ్యి ఉండేదంటే చివరిలో వారికి తమ శరీరము కూడా గుర్తు రాలేదు! బాప్‌దాదా ఆదేశానుసారము వారు తమను తాము పూర్తిగా అంకితము చేసుకున్నారు. దాదీగారు వెళ్తూ వెళ్తూ కూడా సమయము ఎప్పుడూ, ఎవ్వరికీ చెప్పి రాదు అనే పాఠాన్ని చదివించి పోయారు. అందువలన సదా ఎవర్‌రెడీగా ఉండండి, ఇందులోనే కళ్యాణముంది.

చంద్రమణిదాదీగారు సాకారములో మన మధ్య లేనప్పటికీ వారి స్నేహము, వారి శిక్షణలు, వారి ద్వారా ఇవ్వబడిన పాలన, వారు ఇప్పటికీ ఇక్కడే ఎక్కడో ఉన్నారని అనుభవము చేయిస్తాయి. ఒకసారి బాబా వారితో, మిమ్ములను జనులు ఎంత ఇష్టపడ్తారో బాప్‌దాదాకు కూడా మీరంటే అంత ఇష్టము అని అన్నారు. బహుశా అందుకే బాప్‌దాదా వారిని తమ వద్దకు వతనానికి పిలిపించుకున్నారు.

చంద్రమణి దాదిగారి ఈ మహాప్రయాణము పైనున్న వారికి కూడా మంచివారి అవసరముంటుంది అనే విషయాన్ని దృఢపరుస్తుంది.

## సమయము చాలా తక్కువగా ఉంది..... తీవ్రగతిలో సేవ చేసేందుకు వెళ్తున్నాను......

## అని చెప్తూ ఉన్నట్లు అనిపిస్తుంది

మార్చి నెల 11వ తేది ఈ విశ్వములో మరొక నూతన దృశ్యము (పాత నుంచి క్రొత్త) కల్ప-కల్పము కొరకు డ్రామా రీలులో ప్రింట్ అయిపోయింది. సమయ ప్రతి సమయము డ్రామాలో కొన్ని దృశ్యాలు ఎటువంటివి వస్తాయంటే వాటి ద్వారా బ్రాహ్మణ పరివారము యొక్క పురుషార్థ వేగానికి ఒక నూతన దిశ లభించింది. ఇటువంటి వాటిలో ముఖ్యమైనవి - బెగ్గరీ పాత్ర, సాకార బాబా అవ్యక్తమగుట, వర్తమాన సమయములో అకస్మాత్తుగా గౌరవనీయులైన చంద్రమణి దాదిగారు వెళ్ళిపోవుట మొదలైనవి ఉన్నాయి. ఈ విశేష ఘటనలు పురుషార్థమనే బండి వేగాన్ని పెంచుటకై డ్రామాలో నిశ్చయింపబడ్డాయి. ఇందులోని వాస్తవికతను అర్థము చేసుకొని ముందుకు వెళ్లేవారు ఈ ఘటనల నుండి ప్రేరణ తీసుకొని ఇంకా ముందుకు వెళ్ళిపోయారు. ఎందుకు, ఏమి ? అని ప్రశ్నించువారి అడుగులు స్వతహాగా ఆగిపోయాయి. చేసి చేయించేవారికి(కరన్ కరావన్‌హార్) ఈ డ్రామా ఎంతో ప్రియమైనది. అందువలన మనకు కూడా ఈ డ్రామా అంతే ప్రియమైనది. వారి ప్లాను(ప్రణాళిక) ఏమిటి? వారు ఏమి చేయాలనుకుంటారు? ఈ విషయాలను అదే విధంగా అర్థము చేసుకొని ఈ కార్యములో వారికి గొప్ప సహయోగమివ్వాలి. బాప్‌దాదా సంకల్పాలు, మన సంకల్పాలు, భావాల సమానతే సఫలతకు సహజ సాధనము.

ఈ సమయములో సర్వ బ్రాహ్మణాత్మలు వ్యర్థము నుండి ముక్తులుగా ఉండినారు, మంచి స్థితిలో ఉండినారు. సమయము పట్ల విశేష గమనముండినది. చాలా హెచ్చరికగా కూడా ఉండినారు. అందరికీ సమయమనే ఎర్ర జెండా ప్రత్యక్షంగా కనిపిస్తూ ఉండినది. భలే కనులు చెమ్మగిల్లుతూ ఉండినవి. హృదయములో దు:ఖము అనుభవిస్తూ ఉండినారు,



ఎందుకంటే లక్షలాది ఆత్మలకు ఆ దివ్యశక్తి సంపన్నమైన మహోన్నత వ్యక్తి తల్లిగా అయ్యి పాలననిచ్చారు. వారి జీవిత మార్గాలలో ముళ్లను పుష్పాలుగా మార్చారు. సాధారణ ఆత్మలలో గుణాలు, శక్తులు నింపి వారిని ఎంత అసాధారణంగా చేశారంటే ఈరోజు వారు విశ్వకళ్యాణ కార్యములో ముఖ్య పాత్రధారులుగా అయిపోయారు. వేలాది కన్యలను, మాతలను, అబలల నుండి తమ సమానము సింహిణి శక్తిగా తయారు చేసి పంజాబులో, దేశములో విభిన్న స్థానాలకు పంపించారు. అక్కడ వారు ఆసురీతనమును వేర్లతో సహా పెకిళించి సమాప్తము చేయు సేవలో సఫలతాపూర్వకంగా తత్పరులై ఉన్నారు.

ఈ విధముగా ప్రతి ఆత్మకు తమదైన ఇతిహాసముంది. అది స్మృతులనే చలన చిత్రములో దృశ్యాలుగా అయ్యి వెలికి వస్తోంది. ఆ భావాలను ఆపుట అసంభవము కాదు కాని కష్టము. ఒకవేళ ఆ భావాలు కనుల ద్వారా కనిపించాయంటే ఆ స్థితి అపరిపక్వమని నేను అంగీకరించను. భావాలను అభివ్యక్తము చేయడం మానవుని సహజ స్వభావము మాత్రమే కాదు, వారి వాస్తవిక అధికారము కూడా. భావాల క్వాలిటీని బట్టి అభివ్యక్తము చేయు విధానము కూడా రకరకాలుగా ఉంటుంది.

ఆ మర్చిపోలేని రోజును మర్చిపోదామన్నా మర్చిపోలేము. మార్చి నెల 12వ తేది రాత్రి 10 గంటల సమయము. జ్ఞానసరోవరములో చీమ చిటుకుమనేటంత నిశ్శబ్ధము (పిన్‌డ్రాప్ సైలెన్స్). ప్రకృతిలో కూడా, దానికి ముందే సూచన లభించినట్లు ఒక విచిత్రమైన నిశ్శబ్ధము. జ్ఞానసరోవరము మెయిన్ గేటు నుండి దాదీ కాటేజి వరకు దారికి ఇరువైపులా జ్ఞాననక్షత్రాల పొడవాటి లైను నిలబడి ఉంది. హృదయాలలో శ్రద్ధ, చేతులలో పుష్పాలతో మెయిన్‌గేటు వైపు అందరి దృష్టి ఏకాగ్రమై ఉండినది. మరి కొన్ని లైట్లు అమర్చి దారిలోని కాంతి ఎక్కువ చేయబడి ఉండినది. టేపులో చాలా నాజూకు సమయము వస్తున్నది.............(సమయ్ ఆ రహా హై బహుత్ హీ నాజుక్...........). ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి...... ఈ శరీరము అనే తత్వాల పై మోహముంచుకోకండి...........................(యేతన్ తత్వ్ మోహ్ న కీజే రే..............) అను పాటలు వినిపిస్తూ ఉండినవి. ఇదేదో సమారోహానికి ఎవరో ఒక విశేష ఆత్మను ఆహ్వానించు దృశ్యము కాదు. ఇది యజ్ఞములోని ఆధార స్తంభము, అందరి హృదయాలలో నివసించు

జ్ఞానసరోవరానికి నిమిత్తమైన 'పంజాబ్ సింహము' దాది చంద్రమణి గారి పార్థివ శరీరము కొరకు వేచి ఉన్న దృశ్యము - బెంగుళూరు నుండి నేరుగా జ్ఞానసరోవరానికి కాసేపట్లో రానున్నది.

అనేక కార్లు వస్తూ పోతూ ఉండిన క్రమము తర్వాత ఆ మహారథి శరీరాన్ని తీసుకొని వస్తున్న రథము (అంబులెన్స్) కనిపించింది. గుండె చప్పుళ్ల వేగము పెరిగింది. అందరి కనుల నుండి కన్నీరు ప్రవహించసాగింది. అందరి మాస్టర్ రక్షక మహాత్మురాలి ఈ అద్భుత రథానికి దారి చూపుతూ వచ్చిన జ్ఞానసరోవరములోని సెక్యూరిటీ సోదరులు, ముగ్గురు-ముగ్గురు చొప్పున రెండు లైన్లలో అంబులెన్సు ముందు నడుస్తూ ఉండినారు. అప్పుడు 'శాంతి సందేశాన్ని తీసుకొని ఒక పక్షి వచ్చింది..........'(శాంతి కీ ఏక్ చిడియా ఆయీ లేకర్ ఏక్ సందేశ్ రే.........................) అని పాట వినిపిస్తూ ఉండినది. ఇది చాలా అద్భుతమైన దృశ్యము. అంబులెన్సు దగ్గరకు వస్తున్న కొలది గుండె చప్పుళ్ల వేగము పెరుగుతూ ఉండినది. జ్ఞానసరోవరములోని అన్నయ్యలు, అక్కయ్యలందరు మార్చి 9వ తేది బెంగుళూరుకు వెళ్లునపుడు ప్రేమపూర్వక వీడ్కోలు ఇచ్చింది కూడా ఈ మార్గము ద్వారానే. చందన తిలకము, గులాబి పుష్పాలతో బెంగుళూరు నుండి త్వరగా తిరిగి రావాలనే శుభ కామనలతో వీడ్కోలు ఇచ్చి ఉండినాము. త్వరగానే వచ్చేశారు. 16,17 తేదీలలో రావలసిన వారు 12వ తేదీకే వచ్చేశారు, కాని?

తమ మాస్టర్ పరిపాలన కర్తను చివరిసారిగా దర్శించేందుకు పొంగిపొరలుతున్న హృదయాల భావమును ఈ సాధారణ కలము ఎలా వ్యక్తీకరించగలదు ! మూగబోయిన ప్రకృతి కూడా తన యజమానురాలి అంతిమ దర్శనము కొరకు తన కదలికల ద్వారా వ్యాకులతను ప్రకటిస్తూ ఉండినది. దారికి ఇరువైపులా ఉన్న పొడవాటి పూలమొక్కలు వికసించిన పూలతో గాలికి వంగిపోతూ ఉండినవి. బహుశా తమ యజమానురాలి పావన ప్రకృతిని(దేహమును) స్పర్శించి కృతార్థము కావాలని వంగి ఉండవచ్చు. వీటి వెనుక ఉన్న ఒక గులాబి మొక్క ఈ అంతిమ సమయములో నా యజమానురాలు నా పుష్పాలనే స్వీకరించారు, నేను కోటిలో ఒక్కదానినని తన భాగ్యానికి గర్వపడుతూ ఉండినది. జ్ఞానసరోవరము ఉన్న ఎత్తైన పర్వతమాల అత్యధిక అచల స్థితిలో స్థితమై ఉండినది. ఇప్పుడవి జ్ఞానసరోవరమును విశేషంగా



రక్షించు బాధ్యతను స్వీకరించాయి. అందువలన పహారాగా నియమించబడిన ఈ మూగ ప్రహరి అది ఉన్న చోటు నుండే గాలితో 'నా కన్నీటి బొట్టును తీసుకెళ్లి నా యజమానురాలికి అర్పించు' అని చెప్తూ ఉండినట్లుంది. నిజంగానే గాలి అను వైర్‌లెస్ ఆజ్ఞాకారియై సేవ చేస్తూ ఉండినది. తర్వాత అందరూ తమ తమ శ్రద్ధా సుమాలను అశ్రుపూరిత నయనాలతో తమ అత్యంత ప్రియమైన దాదీగారికి వీడ్కోలిచ్చారు. వాహ్! దాదీజీ! ఈ జ్ఞానసరోవరములో మీ ప్రయాణము తుఫాను వలె ఎంత వేగంగా ఉండినది? విశ్వ సేవలో మీరు చాలా బిజీ(తలమునకలై)గా ఉండినారు. కొంత సమయము మాత్రమే జ్ఞానసరోవరములో గడిపారు. అంతిమ వీడ్కోలు సమయములో ప్రతి ఒక్కరి చెవిలో - **"సమయము చాలా తక్కువగా ఉంది......... తీవ్ర వేగముతో సేవ చేసేందుకు వెళ్తున్నాను......... బాబా ఆదేశము నాకు లభించింది"** అను సందేశాన్ని ఇచ్చారు.

## ఈ మహోన్నత దివ్య సింహిని శక్తి వ్యక్తిత్వము సాటిలేనిది

సర్వుల స్నేహి, సర్వుల సహయోగి మరియు సర్వులకు ప్రియమైన షేర్ -ఎ-పంజాబ్ దాదీ చంద్రమణిదాది గారి జతలో చాలా సంవత్సరాలు సమీప సంబంధములో ఉండినాను. చాలాసార్లు వారితో కలిసి ప్రయాణము చేశాను. అనేక విషయాలలో పరస్పరము విచారాలను పంచుకోవడం లేక వారితో సలహా తీసుకోవడం జరుగుతూ ఉండినది. అందువలన చాలా సమీపంగా ఆ మహాన్ అలౌకిక శక్తి, గుణాలను, శక్తులను చూసి అనుభవము చేయు మంచి అవకాశము నాకు లభించింది. ఈ మహోన్నత దివ్య శేర్‌నీ శక్తిగారి వ్యక్తిత్వము సాటిలేనిది. సదా నవ్వుతూ కనిపించే మొఖము, సరళ స్వభావము, విశాల స్వభావము, మృదువైన మాటలు కాని ఎవరైనా మర్యాదలను ఉల్లంఘించారని విన్నప్పుడు, శ్రీమతమును అవహేళన చేశారని తెలిసినప్పుడు. సంఘటనను కదిలించేందుకు ప్రయత్నించినప్పుడు కఠినమైన వజ్ర రూపము కూడా ధరించేవారు.

వారి జీవితమంతా సంఘటనను శక్తివంతముగా చేయడంలో, వ్యక్తిగత పారివారిక ధారణలను దృఢంగా, శ్రేష్ఠచార రూపంలో స్పష్టము చేయడంలో గడిచింది. స్థిరమైన నిశ్చయమనే స్తంభము, దృఢతకు ప్రతిమూర్తి అయిన ఆదరణీయ దాది చంద్రమణిగారు ఒక ప్రతిభాశాలి వ్యక్తిత్వానికి అథారిటీగా

ఉండినారు. ప్రతి పురుషార్థములో, విశేషంగా సూక్ష్మ పురుషార్థము అనగా మనోబలాన్ని ప్రయోగించడంలో ఈ ఆత్మ అత్యంత ఉత్తమ ప్రవీణురాలు. ఒకసారి వారు తమ అనుభవాన్ని వినిపించారు - సమీప సంబంధములో లేని ఒక ఆత్మ కొరకు వారు సూక్ష్మ పురుషార్థము చేసి తమ సమీపానికి తీసుకొచ్చారు. సంఘటనను శక్తివంతముగా చేయు కళ దాదిగారిలో అద్భుతంగా ఉండేది. తమ జతలో ఉండు విజయా బహన్‌తో వారు తరచుగా, ఏ సేవాకేంద్రాల నుండి జాబులు రాలేదో, ఏ సేవా సమాచారము లభించలేదో, వారికి జాబులు వ్రాసి స్నేహానికి గుర్తుగా టోలీ కూడా పంపమని చెప్పేవారు.

పెద్దవారికి దాదీగారు సదా ఆజ్ఞాకారిగా ఉండినారు. తమ సమానులతో ఆదరపూర్వక వ్యవహారము, తమకంటే చిన్నవారి పట్ల సత్యమైన ప్రేమ కలిగి ఉండినారు. వారికి ప్రతి ఒక్కరిని సదా ముందుకు తీసుకెళ్లాలను ఆకాంక్ష ఉండినది. ఏదైనా ఘటన గురించి సత్యమును తెలుసుకోవాలంటే మేము సదా వారి వద్దకు వెళ్లేవారము. సత్యమును విస్తారంగా తెలిపి తమ వారిగా అనుభవము చేయించేవారు. వారి మనసులో లేశమంత కూడా భేద భావముండేది కాదు, సమ దృష్టి కలిగి ఉండేవారు. వారి సంబంధ - సంపర్కములోకి ఎవరు వచ్చినా, ఉమంగ-ఉత్సాహాలను అనుభవము చేసేవారు. వారి ద్వారా ఒక నూతన దృష్టి కోణము లభిస్తూ ఉండినది. వారు ఎప్పుడూ ఎవ్వరి అవగుణము గాని, బలహీనతను గాని, మనసులో ఉంచుకునేవారు కాదు. వారు సదా ప్రతి ఒక్కరిని ఆది, అనాది స్వరూపములో చూసి ముందుకు తీసుకెళ్లేందుకు శక్తి కొలది పురుషార్థము చేసేవారు. ఈ విషయములో ఎప్పుడూ వ్యాకులపడేవారు కాదు. ప్రతి ఆత్మలో దివ్య పరివర్తనయ్యే శక్తి ఉందని వారి దృఢ నమ్మకము. ఫలితంగా వారు అనేకమంది జీవితాలలో మరలా విశ్వాసాన్ని, ఉమంగ-ఉత్సాహాలను జీవింపజేశారు.

యజ్ఞములో అనేక బాధ్యతలను సంభాళన చేస్తున్నా, వారు సదా తేలికగా ఉండేవారు. ఎవరు ఎప్పుడు కావాలన్నా, వారి నోటి నుండి " నేను నవ్వుతూ - నవ్వుతూ జీవితము గడిపేస్తాను,............ నేను ప్రతి క్షణము హరి గుణగానము చేస్తాను,......" అను వారి ప్రియమైన పాటను వినగలిగేవారు.

సేవాక్షేత్రములో వారు సదా అలసట లేకుండా తేలికగా కనిపించేవారు.



ఎవరితో మాట్లాడినా, వారికి పూర్తి వారసులుగా, అనగా సంపూర్ణ సూక్ష్మ శక్తిశాలిగా అయ్యే సంకల్పాన్ని కలిగించేవారు. సత్యమైన మనసుతో ఆత్మిక సేవ చేసేవారు. ఈ ఆత్మ తండ్రి సమానమై పెద్దల సమీపానికి రావాలి అని సంకల్పము చేసేవారు.

వారు ఎప్పుడూ ఈశ్వరీయ మాన్యతలకు, సిద్ధాంతాలకు, ధారణలకు విపరీతంగా ఏ పనినీ ఒప్పుకునే వారు కాదు. ఈ విషయములో స్థిరంగా ఉండినారు. సేవాకేంద్రాలకు వచ్చే ప్రతి విద్యార్థి సంపూర్ణంగా, సంపన్నంగా అవ్వాలని ఆపేక్షించేవారు. రాజయోగ అభ్యాసము చేయు ప్రతి ఒక్కరిలో పవిత్రతా పునాదిని దృఢంగా చూడాలని అనుకునేవారు. ఈ మహోన్నత ఆత్మకు పవిత్రతా శక్తి పై అద్భుతమైన విశ్వాముండేది. చాలా కాలము క్రింద జరిగిన ఒక ఘటన గుర్తుకొస్తోంది. పంజాబు కొత్త గవర్నరు ఛండీఘడ్‌కు వచ్చి ఉండినారు. వారితో కలిసేందుకు మొదటిసారి వెళ్తూ ఉండినారు. వీరు కొత్తవారు కనుక వారికి ఈశ్వరీయ సేవల గురించి పరిచయము చేస్తే, జ్ఞాన గుహ్య విషయాలు అనగా పవిత్రత మొదలైన వాటి గురించి మరొక సమయంలో చెప్తే బాగుంటుందని అనుకొని వెళ్లారు. మాట్లాడడం ప్రారంభమైనప్పుడు, సేవల గురించిన సమాచారమంతా వినిపించారు. వారు వింటూ ఉండినారు. కొంత సమయమైన తర్వాత మీ సంస్థలో నవీనత ఏముందో వినిపించమన్నారు. ఇంతవరకు వింటూ ఉన్న ఆదరణీయ చంద్రమణి దాది వెంటనే మనసా, వాచా, కర్మణాలో పవిత్రత - పారివారిక లేక ప్రవృత్తి మార్గములో ఉంటున్నా పవిత్రత - త్యాగ తపస్సుల జీవితము, శ్రేష్ఠాచార సమాజాన్ని పున: స్థాపన చేయడం అని శక్తిశాలి స్వరూపములో వినిపిస్తూ ఉండినారు. గవర్నరు తమ కంటి అద్దాలు తీసి మేజా పై ఉంచారు. వారి మనసు ఈశ్వరునిలో ఏకాగ్రమైనట్లు కుర్చీలో కూర్చుండిపోయారు. వారు చాలా సంతోషించారు. చండీఘడ్‌లో ఉన్నప్పుడు పదే పదే సేవాకేంద్రానికి వెళ్లాలని వారి మనసులో కోరుకునేవారు. సోదరీల పవిత్రతను హృదయపూర్వకంగా గౌరవించేవారు. వారి హృదయ పటలము పై దాదీగారి బాణము గాఢంగా నాటుకుంది.

చాలాసార్లు దాదిగారు నా పని - " రాజులుగా తయారు చేయడం " ప్రజలు తమంతకు తామే తయారవుతారు.

**చంద్రమణి దాది గారి పట్ల అచల్ దీది తమ శ్రద్ధాంజలిని ఈ విధంగా సమర్పిస్తున్నారు -**

**దాది చంద్రమణిగారిలో కన్యలు – మాతలను ఉద్ధరించు కళ చాలా శక్తిశాలిగా ఉండినది**

చంద్రమణి దాది చాలా విశేషతలు గల బాబాగారి ఒక అమూల్య రత్నము. నేను దాదీని మొట్ట మొదట పంజాబులో శ్రీ హర గోవిందపురము అను ఒక చిన్న గ్రామములో 1953 సంవత్సరములో కలిశాను. ప్రతి విషయములో వారు బాబా గుణగానము చేసేవారు. బాబా శ్రీమతమును పూర్తిగా ఇముడ్చుకున్న వారుగా కనిపించేవారు. నా జీవితాన్ని పూర్తిగా పరివర్తన చేసిన పుణ్యము దాదిగారిదే. లౌకిక పరివారమంటే నాకు చాలా ప్రేమ ఉండేది. జ్ఞానములో ప్రవేశించిన తర్వాత - దేహము, దేహ సంబంధాలను మర్చిపోవాలని బాబా చెప్పారని దాదీ నాకు తెలిపించారు. నేను రెండు వైపులా నిభాయిస్తూ వచ్చాను కాని నేను దాది కోరుకున్న స్టేజి వరకు రాలేకుండినాను. కాని ఆశ్చర్యమేమంటే - దాది సాంగత్యములో ఒక సంవత్సరము లోపే నాలో పరివర్తన రాసాగింది. వారు మా గ్రామములోనే ఉండినారు. నా ప్రతి సంస్కారాన్ని, ప్రతి స్వభావాన్ని, ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించేవారు. దాని అనుసారమే వారు నాకు శిక్షణనిచ్చేవారు.

ఒక రోజు వారు నాతో మీరు బాబాను కలవాలి. కాని బాబాను కలవాలంటే మీరు తప్పక నిర్మోహులుగా అవ్వాల్సి ఉంటుందని చెప్పారు. అంతేకాక ఈ స్థితికి చేరుకుంటే బాబా కూడా చాలా సంతోషిస్తారని తెలిపారు. అది నా జీవితానికి పరివర్తన సమయము. భక్తి సంస్కారము ముందే ఉండినది. కనుక భగవంతుని కలుసుకునేందుకు, అన్నీ మర్చిపోయేందుకు నా మనసు రెడీ అయింది. దాగి ఉన్న త్యాగ వృత్తి పని చేయసాగింది. ఏ వస్తువు గాని, ఏ సంబంధము గాని గుర్తు రాలేదు. యజ్ఞములో దాది బంధువులు చాలా మంది ఉన్నప్పటికీ వారికి ఎవ్వరి పైనా మోహము లేదు. వారు తమ జీవితములోని అనుభవాలను వినిపించి - వినిపించి నన్ను నిర్మోహిగా చేశారు. వారి తపస్వీ రూపము, యోగము పై గల రుచి, బాబా పై గల ప్రేమ నన్ను చాలా ఆకర్షించేవి. వారు గంటల కొద్ది కూర్చుని యోగము చేసేవారు. వారిని చూసి, నేను కూడా



అలా చేయాలని నాకు సంకల్పము కలిగేది. ఆ రోజులలో నేను ఉద్యోగము చేస్తూ ఉండేదానిని. శెలవు రోజులలో వారితో కూర్చుని రెండేసి గంటలు యోగములో ఆనందాన్ని అనుభవించే దానిని. వారి నుండి దృష్టి తీసుకుంటున్నప్పుడు వారి నుండి నాకు ఒక్కొక్కసారి దుర్గ, ఒక్కొక్కసారి వైష్ణవీ దేవి, ఒక్కొక్కసారి శక్తి సాక్షాత్కారమయ్యేవారు. వారి తపస్యా బలము నన్ను కూడా శక్తిశాలిగా చేస్తూ పోయింది. దాది గంటల పర్యంతము మాకు బాబా చరిత్ర, బాబా గుణగానము వినిపించేవారు. వారి మాటలు వింటూ, వింటూ వారి జతలో ఉంటూ ఉంటూ వారితో గాఢమైన అలౌకిక సంబంధము ఏర్పడింది.

బాబా శ్రీమతమును ఎప్పుడూ ఉల్లంఘించరాదని నాకు శిక్షణనిచ్చారు. శ్రీమతమును పాలన చేయడంలో ఆలస్యము చేయరాదని తెలిపారు. వారు మాకు శిక్షణనిచ్చి కూడా నేర్పించారు, స్వయం పాలన చేసి కూడా చూపించారు. నేను వారిని నా అలౌకిక జీవితానికి ఆదర్శముగా అంగీకరించాను. నేను వారి వలెనే నడుచుకుంటున్నాను. ఈ రోజు వరకు నేను కూడా బాబా ఇచ్చిన ఆజ్ఞను ఉల్లంఘించలేదు. శిరసా వహించి పాలన చేస్తూ ఉన్నాను. బాబా ఆజ్ఞలనండి లేక పెద్దవారి ఆజ్ఞలనండి లేక శ్రీమతమనండి, దానిని పాలన చేయు ధైర్యము, దృఢత చంద్రమణి దాదీ గారే నాలో నింపారు.

వారి జీవితములో నేను వారిని నిర్భయత, నిర్మల ప్రేమ స్వరూపంగా చూశాను. వారిలో నిర్భయతా గుణము ఎంత విశాలంగా ఉండినదంటే పెద్ద పెద్ద సమస్యలు ఎదురైనప్పుడు బాబా వారినే అక్కడకు పంపించేవారు. నాకు అంత నిర్భయతా గుణము లేదు కాని దాదీని చూస్తూ - చూస్తూ, వారి సాంగత్యములో ఉంటూ-ఉంటూ, వారి నుండి శిక్షణ పొందుకుంటూ - పొందుకుంటూ నాలో కూడా ఆ గుణము వచ్చేసింది.

హాపుడ్ ఘటన జరిగిన తర్వాత అమృత్‌సర్‌లో ఒక పెద్ద సమ్మేళనము ఏర్పాటు చేయబడింది. ఆ రోజులలో అమృతసర్‌లో క్లాసుకు వచ్చే మాతలలో ఎక్కువ మంది బంధనములో ఉండేవారు. వారి పతులు, బంధువులు బ్రహ్మకుమారీల పై ప్రతీకార భావనలో ఉండినారు. ఆ సమ్మేళన సందర్భములో మేము పట్టణములో శోభాయాత్ర జరపాలని అనుకున్నాము. అప్పుడు వారు బ్రహ్మకుమారీల ఊరేగింపు జరగనివ్వమని, వారి పై రాళ్ల రువ్వుతామని చెప్పారు.

దాదీలోని నిర్భయతా సంస్కారము వలన మనము భగవంతుని పిల్లలము, మన పై రాళ్ల వర్షము కాదు, పుష్ప వర్షము కురుస్తుంది, మనము ఈ ఊరేగింపు జరిపే తీరాలని వారు చెప్పారు. వారు తమ నిశ్చయము ద్వారా, శక్తిశాలి మాటల ద్వారా అందరిలో నిర్భయత, ఉమంగ-ఉత్సాహాలు నింపారు. దాది అచ్చటి డీ.సి.పి తో మేము శోభాయాత్ర చేయాలి అని చెప్పారు. మేము మీకు అన్ని విధాలా సహాయోగము చేస్తామని డి.సి.పి చెప్పారు. వారు పోలీసు బలమును, ఇతర అన్ని ప్రకారాల సహయోగాన్ని కూడా ఇచ్చారు. శోభాయాత్రలో అమృతసర్‌లో మొట్టమొదట జ్ఞానములో వచ్చిన సోదరీలే నిల్చొని ఉండినారు. మొదట మమ్ములను రాళ్లతో కొట్టిన తర్వాత ఇతరులను కొట్టనీ అన్ని అన్నాము. కాని మాకు స్థిరమైన నిశ్చయమేమంటే, ఎవరి రక్షకులు భగవంతుడో, వారిని గాలి వాన, తుఫానులు ఏమి చేస్తాయి(జిస్‌కే సాథ్ హై భగవాన్ ఉస్‌కో క్యా కరేగా ఆంధీ ఔర్ తుఫాన్)? చంద్రమణి దాదీ గారి భాష, గొంతు సవాలు(ఛాలెంజి) చేసినట్లే ఉంటుంది. వారు మాట్లాడుతూ ఉంటే, వారి శబ్ధము వింటూ ఉంటే నిర్బల ఆత్మలలో బలము నిండుతూ ఉండేది. బలహీన ఆత్మలకు కూడా మేము ఏదైనా చేసి చూపించాలనే ధైర్యము కలిగేది. మాకు విరుద్ధంగా ఎవరు సవాలు చేశారో, ఆ విరోధులుండే వీధిలోనే మా శోభాయాత్ర జరిగింది. కాని ఆశ్చర్యమేమంటే ఇంటి పై కప్పుల పై రాళ్లు రువ్వేవారు ఒక్కరు కూడా కనిపించలేదు. శోభాయాత్ర చూసి జనులు చాలా సంతోషించారు. దుకాణదారులు పుష్ప మాలలతో నిలబడి ఉండినారు. జనులు మా పై పుష్పాల వర్షము కురిపించారు. దాది జతలో మేము ఇంకా కొంతమంది బాబా స్మృతిలో మస్త్ స్థితిలో వెళ్తూ ఉండినాము. ఆ తర్వాత బజారు నుండి కొంత ముందుకు వెళ్తూనే విమానము నుండి పుష్ప వర్షము కురిసింది, కరపత్రాలు పడ్డాయి. ఇది మన వైపు నుండి జరిగింది. లోపల నిర్భయతా గుణము పని చేస్తూ ఉంటే సఫలత స్వతహాగా లభిస్తుందని మేము అనుభవము చేశాము.

దాదీలో చాలా త్యాగ భావన ఉండేది. వారిలో ఫలానా తినాలని - తాగాలని - ధరించాలని ఆసక్తి ఏ మాత్రమూ ఉండేది కాదు. మొట్ట మొదట బాబా వీరిని శ్రీహరి గోవిందపురము అను గ్రామములో సేవ చేసేందుకు పంపించారు. ఆ గ్రామములో నేను లౌకిక టీచరు ఉద్యోగము చేస్తూ



ఉండినాను. ఆ గ్రామములో సేవ చేసేందుకు ఆహ్వానము పంపింది నేనే. అక్కడ ఒక చిన్న గది ఉండేది. ఆ సమయములో చంద్రమణి దాదీతో పాటు జానకి దాది కూడా ఉండినారు. ఆ చిన్న గదిలోనే ఇరువురు ఉండేవారు. దాదీలు అక్కడకు వచ్చినప్పుడు వారిని చూచి గ్రామస్థులు మా గ్రామానికి దేవతలు వచ్చారని, దేవీలని చెప్పుకోసాగారు. శ్వేత వస్త్రాలు ధరించి, అల్లుకోని కురులతో దాదీలు, దేవీల వలె కనిపించారు. నేను పని చేసే పాఠశాలలోని వారు దాదీలను చాలా ప్రేమతో ఆహ్వానించి స్వాగతము పలికారు. మమ్మా కూడా ఆ గ్రామములో రెండు రోజులుండినారు.

చంద్రమణిదాదీ గారిలో అనేక విధాలుగా ప్రేరేపించి కన్యలను, మాతలను ఉద్ధరించు కళ చాలా గొప్పగా ఉండేది. కరాచీలో బాబా పాటలు వ్రాయునప్పుడు, ఆ పాటలు చంద్రమణి దాది పాడేవారు. గది చాలా చిన్నదిగా ఉండినందున క్లాసు కొరకు మేము ఒక లౌకిక సత్సంగ భవనానికి వెళ్లేవారము. మొదట వారి సత్సంగము జరిగేది. తర్వాత వారు ఇప్పుడు మీ గురువుగారిని రమ్మని చెప్పేవారు. వీరిని వారు గురువుగారు అని అనేవారు. దీది ఆ పాటలు మాకు కూడా నేర్పేవారు. సత్సంగములో దీది నన్ను పాడమనేవారు. మేము పాట పాడడం ప్రారంభించగానే మొదటి సత్సంగము పూర్తి చేసుకొని వెళ్లేవారు కూడా మా క్లాసులో కూర్చునేవారు. దీదీ వారితో కూడా చాలా ప్రేమగా మాట్లాడేవారు. మీరు కూడా మా వారితో కలిసి పాడండి అని చెప్పేవారు. మా జతలో పాడుతూ పాడుతూ, మా జతలో కూర్చుంటూ వారిలో కొంతమంది మాతలు జ్ఞానములోకి వచ్చేశారు. ఆ చిన్న గ్రామములో విద్యావంతులైన సుమారు 21 మంది కుమారీలు జ్ఞానములో వచ్చేశారు. వారికి దీది స్పెషల్ ట్రైనింగ్(విశేష శిక్షణను) ఇచ్చేవారు. ప్రారంభము నుండి సాకార బాబా 3-4 దాదీలకు కన్యలను తయారు చేయు డ్యూటీ(కర్తవ్యమును) ఇచ్చి ఉండినారు. పెద్ద దాదీ, మిఠ్ఠూ దాది, చంద్రమణి దాది మొదలైన ఇతర దాదీలకు ఈ డ్యూటీని అప్పగించారు. ఆ ట్రైనింగ్‌లో దాదీలు బాబా నుండి పొందిన పాలనా అనుభవాన్ని పూర్తిగా ప్రయోగించేవారు. ఇందులో కుమారీలు జ్ఞాన, యోగ, ధారణలలో పక్కాగా అయిపోయారు.

ఢిల్లీ తర్వాత అమృతసర్‌లో శాఖ తెరవబడింది, దాని తర్వాత శ్రీ

హరగోవిందపురములో శాఖలు తెరవబడ్డాయి. మమ్మా అక్కడకు వచ్చినప్పుడు వేలాది మంది గ్రామస్థులు కలిసి ఆహ్వానించారు. ఆ గ్రామములో లక్ష్మిదేవి వస్తోందని, తల్లి సరస్వతి దేవి వస్తోందని, అంబ వస్తోందనే శబ్ధము వ్యాపించింది. మమ్మా పట్ల చంద్రమణి దాదీకి చాలా ప్రేమ. మమ్మా వచ్చినప్పుడు వారి సంతోషము, వారి భావాలు చూడవలసినవే కాని మాటలలో, పదాలలో వర్ణించలేము. మేము బాబాగారు వచ్చే ప్రోగ్రాము కూడా తయారు చేశాము. బాబా వచ్చారు. బాబా ముందు కన్యలు - **మేము శివశక్తులము, కురుక్షేత్ర యుద్ధ మైదానములో ప్రవేశిస్తాము, నిశ్చయమనే పరీక్షలో పాస్ అవుతూ ముందుకు పోతాము........ అని పాట పాడారు.** ఆ సమయములో ఆ కన్యల బంధువులు కూడా కూర్చుని ఉండినారు. అందులో కొంతమంది సరిపోనివారు కూడా కూర్చుని ఉండినారు. వారి మనసులో ఇక్కడకు ఎవరో ఒక ముసాలయన వచ్చారు, మా కన్యలను ఎక్కడకైనా ఎత్తుకెళ్ళిపోతారేమో అని అనుమానము కలిగింది. వారు గలాటా చేయసాగారు. బాబా వాపస్ వెళ్లవలసి ఉండినది. వారు చెట్ల పై, ఇంటి వాకిట్లో కూర్చుని బాబా కొరకు వేచి ఉండినారు. కాని చంద్రమణి దీది గలాటా జరిగేందుకు ముందే వెనుక వాకిలి ద్వారా టాక్సీని పిలిపించి బాబాను ఆ గ్రామము నుండి పంపేశారు. అందరికీ వంట చేసేందుకు నేను ఇంటికి వెళ్లి ఉండినాను. గదిలో దీదీ ఒంటరిగా ఉండినారు. కాని దీది పరిస్థితులన్నింటినీ ధైర్యముగా యుక్తితో ఎదురించి దాటుకున్నారు. భావమేమంటే దీదీగారిలో నిర్భయత, సాహసము, బాబా పట్ల తరగని నిశ్చయము, స్వయం పట్ల శ్రేష్ఠ స్వమానము మొదలగు గుణాలన్నీ చాలా ఎక్కువగా ఉండేవి.

దీదీగారు పంజాబు జోనును ఏకతా సూత్రములో బంధించి ఉంచారు. బాబా పిల్లలందరికి మనస్సులో దీది ఏమి చెప్తే అది చేసే తీరాలని ఉండేది. ఉదాహరణానికి హరిద్వారములో కుంభమేళా ఉంది, సేవ కొరకు అందరూ ఇంత ఇవ్వాలి అని చెప్తే అందరూ సంతోషంగా ఇచ్చేవారు. అందరూ అక్కడకెళ్లి సేవ చేయాలని చెప్పినప్పుడు, అందరూ సంతోషంగా వెంటనే వెళ్లి సేవ చేసేవారు. సంఘటన శక్తిని చూడాలంటే పంజాబులో చూడండి అను వాక్యము ప్రసిద్ధి చెందింది.

వారిలోని మరో విశేషత ఏమంటే - వారు చాలా సింపుల్‌గా



(సాధారణము)ఉండేవారు. బాబా మహావాక్యాల పట్ల లేక ఈశ్వరీయ నియమాలు, మర్యాదల పట్ల చాలా ఖచ్చితంగా ఉండేవారు. వారిలో లోభము, పేరాశ మచ్చుకైనా లేవు. మీ వద్ద ఒక జత చెప్పులుంటే మరో జత కొనే అవసరము లేదు, ఎంతకాలము వాటితో పని జరుగుతుందో అంతకాలము ఉపయోగించండి అని చెప్పేవారు. వారు కేవలం ఇతరులకు చెప్పడమే కాదు స్వయం వారు కూడా అలాగే చేసేవారు. **వారు మాకు యజ్ఞములోని భికారి పాత్రను (బెగ్గరీ పార్టు) గురించి వినిపించి - 'మనది సమర్పిత జీవితము' బాబా ఏమి తినిపిస్తారో, ఎక్కడ కూర్చోబెడ్తారో, ఏమి ధరింపజేస్తారో వాటిని సంతోషంగా స్వీకరించాలి, అలాగే జీవితాన్ని గడపాలి అని చెప్పేవారు.** భికారి పాత్రలో బాబా మాకు 36 అతుకులున్న దుస్తులు ధరింపజేశారని, వాటినే సంతోషంగా ధరించామని చెప్పేవారు. ఎవ్వరిలో ఎటువంటి సంకల్పమూ నడవలేదు. వారి ప్రాక్టికల్ ధారణలు ఎంత దృఢంగా ఉండినాయంటే వారి శబ్దాలు మారుమ్రోగుతూ ఉండేవి. వారి మాటలు ఎవరు విన్నా మేము కూడా అలా అవ్వాలనే ప్రేరణ లభించేది. పంజాబు జోనులో ఈ విశేషత ఉండేది - అదేమిటంటే ఏ టీచరే కాదు ఏ విద్యార్థికీ శీతల పానీయాలు(కూల్ డ్రింక్స్) త్రాగే అలవాటు లేదు. ఈ రోజు వరకు మాలో ఈ అలవాటు లేదు, కాని విధి లేని పరిస్థితిలో, డాక్టరు చెప్తే మాత్రమే ఔషధము రూపంలో తీసుకునేవారు. అంతేగాని ఆసక్తికి, రుచికి వశమై త్రాగేవారు కాదు, త్రాగించేవారు కాదు. సాధారణతను, సంయమ నియమాలను వారు మాలో ఎంత పక్కాగా చేశారంటే, వాటిని ఉల్లంఘించే సంకల్పము కూడా మాకు రాదు. అంతేకాక వారిలోని పాలనా శక్తి కూడా అద్భుతమైనది. వారు ఎప్పుడూ ఇరువురి మధ్య అభిప్రాయ భేదము ఉండనిచ్చేవారు కాదు. ఒకవేళ బేధము ఏర్పడినా దానిని పొడిగించే అవకాశము ఇచ్చేవారు కాదు, వెంటనే దానిని నివారించేవారు. వారు మా టీచరు అక్కయ్యలకు మరియు క్లాసుకు వచ్చే సోదరి - సోదరులకు త్యాగము - తపస్సులు చేయడం నేర్పించారు. పరస్పరములో ప్రేమ గౌరవాలతో బ్రతకడం కూడా నేర్పించారు. టీచరు అక్కయ్యలకు విశేష సమయమునిచ్చేవారు. వారి అన్ని రకాల సమస్యలను, అవసరాలు మొదలైన వాటిని వెంటనే సమాధానపరచేవారు. ప్రతి ఆత్మను సంతుష్టపరిచే కళ అనండి, శక్తి అనండి వారిలో ఉండినది.

కుమారీలకు ట్రైనింగ్ ఇవ్వడంలో, వారిని సమర్పణము చేసేందులో నేర్పరితనము గలవారిగా ఉండేవారు. వారి నుండి పాలన తీసుకున్న సమర్పిత సోదరీలు భారతదేశమంతటా ఉన్నారు. వారు అనేకమంది జీవితాలను పరివర్తన చేసి చూపించిన మహోన్నత శక్తి. వారిలో నేనెలాగైనా సరే బాబాకు వారసులుగా తయారు చేయాలనే పట్టుదల ఉండేది. బాబా నేర్పించిన జ్ఞాన-యోగాలను నేర్పించడంలో వారికెంత అభిరుచి ఉండినదో, అంత మా సంస్కారాలను ఈశ్వరీయ సంస్కారాలుగా తయారు చేయడంలో కూడా అభిరుచి ఉండేది. ఆత్మల వ్యక్తిగత భావ - స్వభావాలను బాగా స్టడీ(అధ్యయనము) చేసి తమ వద్ద కూర్చోబెట్టుకొని చాలా ప్రీతిగా అలా చేయడం మంచిది కాదని, ఇలా చేస్తే బాగుంటుందని నచ్చజెప్పేవారు. మాకు తెలిపినట్లే , క్లాసుకు వచ్చే విద్యార్థులకు కూడా తెలిపేవారు.

చివర్లో నేనిదే చెప్తాను - వారు అడుగడుగునా మాకు మార్గదర్శకులై ఈశ్వరీయ మార్గములో మమ్ములను నడిపించారు. వారి ధారణలన్నిటిని మాలో కూడా నింపారు. ఇటువంటి మహోన్నతమైన అలౌకిక శక్తిని మర్చిపోలేము, వారు మాకు ఆదర్శము, ఆదరణీయులు, గౌరవనీయులు.

ప్రశ్న:- మీ పట్ల వారి భావనలెలా ఉండినాయి?

సమా:- నన్ను వారు చాలా స్నేహ దృష్టితో చూచేవారు. కారణమేమంటే బాబా వారితో బచ్చీ! సేవకు వెళ్లు నీకు రెడీమేడ్ కన్యలు లభిస్తారు, వారంతా బాబా సేవ చేస్తారు అని చెప్పారు. వారు సేవ కొరకు బయటకు వచ్చినప్పుడు అమృత్‌సర్ తర్వాత మొదటి ఆహ్వానము మాదే. ఆ భావనతోనే వారు నన్ను చాలా ప్రేమతో జ్ఞానమార్గములో నడిపించారు. లౌకికములో భక్తి సంస్కారము చాలా ఉన్నందున పెద్దలను గౌరవించడం, పెద్దల మాటలను అంగీకరించడం, వారితో నమ్రతతో వ్యవహరించడం ఈ గుణాలన్ని నాలో బాల్యము నుండే ఉండేవి. అందువలన వారు నా ద్వారా చాలా సేవ జరుగుతుందని గ్రహించారు. అందుకే వారు నన్ను ప్రేమతో, గౌరవముతో జ్ఞానములో ముందుకు నడిపించారు. వారు ఎక్కడకు వెళ్ళినా నన్ను తీసుకెళ్ళేవారు. వారు పోలేని చోటుకు కూడా నేను వెళ్ళగలగాలి అని వారికి లక్ష్యముండేది. వారికి ఏ సత్కారము, సన్మానము లభించినా అవి నాకు కూడా ఇప్పించారు. అన్ని ప్రకారాలుగా నన్ను తన



సమానంగా చేసే ప్రయత్నములో ఉండేవారు. వారు నన్ను ఎంత ప్రేమగా పాలన చేశారో, ఆ ప్రేమ ఈ రోజుకు కూడా నా హృదయాంతరాలలో ఇమిడి ఉంది. నేను సదా వారు చెప్పిన దానిని తూచా తప్పకుండా పాటించేదానిని. వారు హరగోవింద పురములో నా వద్ద మూడు సంవత్సరాలు ఉండినారు, మరి నేను వారికి ఎంత సమీపంగా ఉండినానో, ఎంత దగ్గరగా వారిని చూచి ఉంటానో మీరు అర్థము చేసుకోగలరు.

వారి నివాసము మధువనములో స్థిరపడనంత వరకు వారు పంజాబు జోనులో ప్రతి సేవాకేంద్రానికి వెళ్ళేవారు. అప్పుడు నన్ను తమ వెంట తీసుకెళ్ళేవారు. ప్రతి పనిలో నన్ను ముందుంచేవారు. వారెలాగైతే సత్యముగా, శుద్ధముగా ఉండినారో, అలా నాలో కూడా ఆ గుణాలు ఇమిడిపోయాయి. నేను ప్రతి విషయాన్ని యథార్థంగా, స్పష్టముగా వారి ఎదుట ఉంచేదానిని. వారికి నా పై పూర్తి విశ్వాసముండేది, ఈమె సత్యమైన బిడ్డ అని వారికి పక్కా నిశ్చయముండేది. వారు నన్ను మనసా-వాచా-కర్మణా అన్ని విధాలా పాలన చేశారు.

ప్రశ్న:- మీకు పంజాబు బాధ్యత ఎప్పుడు లభించింది?

సమా:- దీది పోయిన తర్వాత దాదీగారు నాకే బాధ్యతనిచ్చారు. ఆ సమయములో ఈ బాధ్యత తీసుకునేందుకు నేను తయారుగా లేను. నేను దాదీతో, దాదీ నాకు అంత యోగ్యత లేదు అని చెప్పాను. కాని దాదీగారు ప్రేమతో నీవు ఏమిటో నాకు తెలుసు అని చెప్పారు. చంద్రమణిదాది నాకు ప్రారంభము నుండే ఈ బాధ్యత ఇచ్చి ఉండినది. కాని వారు నన్ను ముందుంచి నిమిత్తముగా చేస్తున్నారని నాకు తెలియదు. దీదీ ఆజ్ఞాపించారు, సేవ ఇచ్చారు, నేను చేయాలి అని అనుకునేదానిని. దాదీ నాకు నేర్పిస్తున్నారని నాకెప్పుడూ అనుభవమయ్యేది కాదు. ప్రతి చోటికి నేను ఒంటరిగా పోలేను, నా జతలో నీవు కూడా రమ్మని నన్ను తీసుకెళ్ళేవారు. ఎవరితో ఎలా మాట్లాడాలో, ఎలా ఎవరిని ముందుంచాలో, సేవాకేంద్రము ఎలా ఉండాలో, ఎవరినైనా ఎలా పైకి తీసుకు రావాలో - ఈ విషయాలన్నీ నాకు తెలిపేవారు. నేను నీకు నేర్పిస్తున్నానని, నీ పై బాధ్యతనుంచుతున్నానని నాతో ఎప్పుడూ చెప్పలేదు. వారు నాతో, - చూడు అచల్ ఫలానా సెంటరుకు వెళ్లాలి, కాని నేను పోలేను, నీవు వెళ్ళి ఫలానా

విషయము మాట్లాడి రా అని చెప్పేవారు. వారు నేర్పించినట్లు నేను వెళ్ళి ఆ పని చేసుకుని వచ్చేదానిని, నాకు సఫలత లభిస్తూ ఉండేది.

ప్రశ్న :- వారు శరీరము వదిలారని విన్నప్పుడు మీ స్థితి ఎలా ఉండినది?

సమా:- ఆ సమయములో కొద్దిగా ఫీల్(బాధపడుట) అయ్యాను. నాకు అమృత్‌సర్ నుండి ఫోను వచ్చింది. ఆ సమయానికి నేను చండీఘడ్‌కు చేరుకున్నాను. ఒక రోజు ముందు బెంగుళూరుకు వెళ్తున్నానని నాకు ఫోనులో చెప్పారు. మరుసటి రోజు రాత్రి దీదీ శరీరము వదిలారని ఫోను వచ్చింది. నాకు నమ్మకము కలుగలేదు, కాని సత్యమును స్వీకరించాల్సి వస్తుంది కదా! సమాచారము విని దీది పోయిందా! అని కొంచెము షాక్ కలిగింది. కనులలో నీరు నిండినది. ఎవరైతే ఇంత ప్రేమతో పాలన చేశారో, జ్ఞానములో నిలబెట్టారో, వారి స్నేహములో స్నేహ ముత్యాలు రాలాయి. నేను పెద్ద దాది కౌగిలిలో కన్నీరు కార్చాను. తర్వాత మెల్ల మెల్లగా వారి శిక్షణలు, వారి ధారణలు, ముందుకు వస్తూ స్థితి మారిపోయింది. కాని సమాచారము విన్నప్పుడు ఫీల్ అయ్యాను. వారు నా కొరకు ఎక్కువగా శ్రమించారు. ఒక సాధారణ జీవితాన్ని అసాధారణంగా, అలౌకిక జీవితముగా పరివర్తన చేశారు. వారి సర్వ గుణాలను, కళలను నాలో నింపేశారు. ఈ ఉపకారానికి కృతజ్ఞతా భావము ప్రకటమౌతుంది కదా! ఇప్పుడు కూడా అనేక విషయాలలో, అనేక పరిస్థితులలో వారు ఇలా చేశారు, ఇటువంటి స్థితిలో వారు ఇలా చేశారు అని నాకు గుర్తు వస్తూ ఉంటుంది.

ప్రశ్న:- మీకు దీది లేని లోటు అనుభవమౌతుందా? నేను దీదితో కలిసే ఉన్నాను అని మీకు అనిపిస్తుందా?

సమా :- వారు లేని లోటు అనుభవమేమో కాదు, అలాగని వారిని మిస్ చేయలేదని కూడా కాదు. బాబా వారిని బేహద్ సేవ కొరకు పిలుచుకున్నారు. అందరికంటే సమీపంగా వారిని చూచే అదృష్టము నాకు మాత్రమే లభించింది. మా ఇల్లు, పరివారము అమృత్‌సర్‌లోనే ఉండేది. ఢిల్లీ తర్వాత అమృతసర్‌లోనే సేవ చేశారు. మమ్మా, బాబా, దీది అందరూ నా ఎదుటే శరీరము వదిలారు. నేను అన్ని పరిస్థితులను చూశాను, స్వయాన్ని సంభాళించుకున్నాను. బాబా కార్యము, బాబా చేయిస్తూ ఉంటారు – ఇది నిశ్చితము. కాని దీది ప్రారంభము నుండి నాతో ఉండినారు, నేను వారితో ఉండినాను. అందరికంటే ఎక్కువ పాలన



అనండి, ప్రేమ అనండి నాకే లభించింది. ఆ దృష్టితో దీదిగారి స్నేహము, సహానుభూతి నన్ను వారి వైపు ఆకర్షిస్తాయి, మోహ వశమై కాదు. స్నేహ వశము, సన్మాన వశము.

**బ్రహ్మాకుమార్ అమీర్‌చంద్‌గారు చాలా కాలము సేవాక్షేత్రములో దాది చంద్రమణిగారితో ఉండినారు, వారి విశేషతల అనుభవ యుక్త చిత్రమును ఈ విధముగా సాక్షాత్కారపరుస్తున్నారు :**

## చంద్రమణి దాది ఒక మహాజ్ఞాని, సాధకురాలు, పరిపాలనా దక్షత గలవారు

**చంద్రమణిదాదిగారి**ని నేను మొదటిసారి 1963లో కలిశాను. మొదటిసారి మేము లుథియానాలో ప్రదర్శిని ఏర్పాటు చేశాము, అక్కడ వారిని కలిశాను. ఆ తర్వాత మనోహర్ దాదీతో పాటు నేను మొదటిసారి అమృతసర్‌కు వెళ్ళాను. అక్కడ నాకు చంద్రమణిదాది గారి వ్యక్తిత్వాన్ని తెలుసుకునే అవకాశము లభించింది. ఆ రోజులలో సేవాకేంద్రాలు చాలా చిన్నవిగా ఉండేవి. అమృతసర్ సేవాకేంద్రము కూడా చిన్నదిగానే ఉండేది. ఒకరోజు ఉదయము క్లాసు సమయములో - చంద్రమణి దాది యోగము చేయిస్తూ ఉండినారు, యోగము చేయిస్తూ - చేస్తూ వారు రెండు సార్లు లేచి లోపలికి వెళ్ళి మళ్లీ వచ్చి మిలనము చేయించసాగారు. యోగము చేయించే సమయము పూర్తి అయింది, మురళి ప్రారంభించేందుకు ముందు క్లాసులో - ఈ రోజు నాకు యోగము కుదరలేదు, నేను రెండు సార్లు లేచి లోపలికి వెళ్లడం మీరు చూచే ఉంటారు, కారణమేమంటే నేను యోగము చేసేందుకు కూర్చున్నప్పుడు నా ధ్యానము ట్రైనింగ్ కొరకు వచ్చిన చిన్న సోదరీల వైపు వెళ్ళింది. వారు యోగ తరగతిలో యోగము చేయుటకు రాలేదు, కనుక నేను లేచి వారి గదికి వెళ్ళి వారిని లేపి త్వరగా తయారై క్లాసుకు రండి అని చెప్పి వచ్చాను. అయినా వారు క్లాసుకు రాకుంటే వారిని లేపేందుకు నేను రెండు సార్లు పోవలసి వచ్చింది. నేను కూడా క్లాసులో కూర్చొని ఉండినాను, వారి నోటి నుండి ఈ మాటలు విని నేను ఆశ్చర్యపోయాను, ఎందుకంటే ఒక పెద్ద బెహన్ తమ చిన్న సోదరీల గురించి క్లాసులో స్పష్టముగా విద్యార్థులకు వినిపించారు! ఈ ఘటన ద్వారా వారి వ్యక్తిత్వములో చాలా సత్యత,

శుద్ధత(సచ్ఛాయియా ఔర్ సఫాయియా) ఉందని తెలుసుకున్నాను. క్లాసుకు వచ్చేవారిని కూడా యజ్ఞములో చాలా సమీపంగా భావించేవారు. వారిలోని మరో విశేషత ఏమంటే అందరిని సమాన దృష్టితో చూచేవారు, మెలిగేవారు. సమర్పిత టీచర్లు గాని, క్లాసులో వచ్చే విద్యార్థులు గాని అందరినీ బాబా వారసత్వానికి సమాన హక్కుదారులుగా భావించేవారు. అందువలన వారు మనసులోని ఏ విషయమునైనా అందరితో పంచుకునేవారు. వారికి - " మేము కూడా యజ్ఞములోని వారమే, బాబాకు చాలా దగ్గరవారము" అని అనుభవము చేయించేవారు. సేవ కారణంగా నేను వారితో కలిసి ఉండినాను - కలిసి ప్రయాణము చేశాను. మాటలలో వారు ఇలా చెప్పేవారు - "నా లక్ష్యమేమంటే క్లాసుకు వచ్చే సోదరీ – సోదరులందరి స్థితిని బాబా కోరినంత ఉన్నత స్థితికి తీసుకెళ్ళాలి". వారి బుద్ధి సదా బేహద్(అనంతము)లో ఉండేది. ఈ విద్యార్థి అమృత్‌సర్ విద్యార్థి, ఇతని సేవ అమృత్‌సర్ లేక పంజాబు జోన్ వరకే ఉండాలి అని భావించేవారు కాదు. ఈ సోదరుడు లేక సోదరి మధువనములో కూడా సేవ చేయాలని, వీరి విశేషతలు విశ్వమంతటికి ఉపయోగపడాలని అనుకునేవారు. వారి సమయములో ఏ సోదరీలు ట్రైనింగ్ తీసుకున్నారో, వారు ఈ రోజు భారతదేశము మూల మూలలలో సేవ చేస్తున్నారు. నేపాల్‌లోని రాజ్ బెహన్, బురహాన్‌పూర్‌లోని సుధా బెహన్, ముజఫర్‌పూర్‌లోని రాణి బెహన్ మొదలైన వారందరూ పంజాబుకు చెందినవారే. మధువనములో, జ్ఞాన సరోవరములో, గ్లోబల్ ఆసుపత్రిలో, శాంతివనములో పంజాబు జోను నుండి వచ్చిన చాలా మంది సేవ చేస్తున్నారు. చంద్రమణిదాది దృష్టిలో హద్దులు లేనే లేవు. ఎవరిలోనైనా ఏదైనా విశేషత ఉంటే అది యజ్ఞములో పూర్తిగా ఉపయోగపడాలని అనుకునేవారు.

మేళా సేవ ప్రారంభమైనప్పుడు దానిని సంభాళించేందుకు పంజాబులోని సోదరులే నిమిత్తముగా ఉండినారు. దాదీ ఆ సోదరులకు మీరు మేళా కార్యమును సంభాళించమని చెప్పారు, వారు వెంటనే వచ్చేశారు.

పరిపాలనా క్షేత్రములో కూడా దాదీగారిలో చాలా స్పష్టత మరియు స్వచ్ఛత ఉండేవి. ఎవరి గురించి నిర్ణయము తీసుకోవాలో ఆ వ్యక్తితో వారు మొదట చర్చించేవారు. నేను ఇన్‌ఛార్జిని, నేను నిమిత్తము కనుక నేను చెప్పిందే



జరగాలి అని వారెప్పుడూ భావించేవారు కాదు. చిన్నవారిలో చిన్నగా ఉన్న సోదరీ అయినా, మొదట ఆమెతో మాట్లాడి, ఆమె సరే అన్న తర్వాత నిర్ణయము తీసుకునేవారు, ఉదాహరణకు ఎవరినైనా ఒక సేవాకేంద్రము నుండి మరో సేవాకేంద్రానికి బదిలీ చేయవలసి వస్తే, ఆ బెహన్‌తో "చూడు సోదరీ, నీవు ఆ స్థానములో సేవ చేయాలని అనుకుంటున్నాను దానిని గురించి నీ అభిప్రాయమేమి? " అని అడిగేవారు. వారిని మానసికంగా తయారు చేసి, అక్కడకు పంపేవారు. అంతేకాని ఎప్పుడూ నేను ఆజ్ఞాపిస్తున్నాను, నీవు ఫలానా చోటికి వెళ్ళు, అక్కడ సేవ చేయి అని చెప్పేవారు కాదు. మరో స్థానానికి వెళ్లేందుకు సంతోషంగా ఒప్పించి పంపేవారు.

ఇది చాలా సంవత్సరాల నాటి మాట. మేము ధర్మశాలకు వెళ్లాము. ధర్మశాల నుండి మేము హిమాచల్‌ప్రదేశ్‌లోని పాలన్‌పూర్‌కు వెళ్లాల్సి ఉండినది. ధర్మశాల నుండి పాలన్‌పూర్ వెళ్లేందుకు ఒక దగ్గర దారి కూడా ఉండినది. ఆ రోజులలో మాకు కారు లేదు. ట్యాక్సీ మాట్లాడుకున్నాము. నేను చంద్రమణిదాదితో, దాదీ దగ్గర దారిలో వెళ్తాము అని చెప్పాను. అందుకు దాదీ నేరుగా పాలన్‌పూర్ వెళ్లేందుకు బదులు మనము దూరమైనా కాంగ్‌డా ద్వారా వెళ్లే దారిలో వెళ్తామని అన్నారు. అందుకు నేను దాదీ, ట్యాక్సీ బాడుగ ఎక్కువ అవుతుందని చెప్పాను. అయినా పర్వాలేదని అన్నారు. వారి మనసులో మరో విషయముందని నాకు తర్వాత అర్థమయ్యింది. దారిలో దాది చెప్పారు - కాంగ్‌డాలో కొత్తగా సేవాకేంద్రాన్ని తెరిచారు, ఆ సెంటరు చూచి వెళ్తాము అని అన్నారు. అక్కడ ఇద్దరు అక్కయ్యలుండేవారు. అకస్మాత్తుగా వచ్చిన మమ్ములను చూచి వారు చాలా సంతోషించారు. 15-20 నిముషాలు అక్కడుండిన తర్వాత దాది ఇక వెళ్తామని అన్నారు. దారిలో నేను దాదీని - " దాదీ 15 నిముషాలలో ఏ పని జరిగింది?" అని అడిగాను. అక్కడున్న ఇద్దరు సోదరీలలో చిన్న సోదరి సెంటర్లో రెండు సంవత్సరాల నుండి ఉంది, ఆమెను మరో చోటికి బదిలీ చేయాల్సి ఉంది, కనుక మొదట ఆమెను కలిసిన తర్వాత ఆమెను అక్కడ నుండి ట్రాన్స్‌ఫర్ చేయాలనుకున్నాను అని చెప్పారు. ఆ కన్యతో మాట్లాడేందుకే అక్కడకు వెళ్లవలసి వచ్చింది. యజ్ఞములో ఇంత పెద్ద అథారిటీ, జోన్ ఇన్‌ఛార్జిగా ఉంటున్నా, చిన్నవారైనా పెద్దవారైనా వారి అనుమతి తీసుకునే వారికి సంబంధించిన పని

చేయాలను భావము వారిలో ఉండినది. అందరినీ సంతోషంగా ఉంచాలనుకునేవారు. బాబా సేవకు నిమిత్తమైనవారు సంతోషంగా ఉంటే సేవ కూడా బాగా జరుగుతుందని, సేవాకేంద్ర వాతావరణము బాగుంటుందని భావించేవారు.

వారిలో నేను ఇది కూడా గమనించాను - వారి జతలో ఎవరుండినా వారిని దాదీ అన్ని రకాలుగా సంతుష్టంగా ఉంచారు, వారిలో ఉమంగ-ఉత్సాహాలు నింపారు. వారికి ఎలాగైతే క్లాసుకు వచ్చేవారి పట్ల "వీరిని బాబాకు సమీపంగా తీసుకెళ్ళాలి," అనే శుభ భావన ఉండేదో అలా సంబంధ-సంపర్కములో ఉన్న వారి పట్ల కూడా - ' వీరు కూడా సమీపానికి వచ్చేయాలి, బాబా వారసులుగా అవ్వాలి' అనే శుభభావన ఉండేది.

ఇది 1997 వ సంవత్సరము ఫిబ్రవరిలో జరిగిన విషయము. దాది జానకిగారు పంజాబ్ టూర్‌కు వచ్చే ప్రోగ్రామ్ తయారై ఉండినది. అది ఇరువురు దాదీలు కలిసి ప్రయాణించిన మొదటి టూర్. అప్పుడు చంద్రమణి దాది జ్ఞానసరోవర్‌ను సంభాళిస్తూ ఉండేవారు. దాదీ మీరు నా వెంట వచ్చే అవసరమేముంది? అని జానకి దాది చంద్రమణి దాదీని అడిగారు. ప్రోగ్రామ్ తయారయ్యింది, నేను టూర్‌కు వెళ్ళి వస్తాను. మీరు జ్ఞానసరోవర్ సేవను వదిలి ఎందుకు వస్తున్నారు? అని అడిగారు. అందుకు చంద్రమణి దాది, జానకి దాదీతో - 'మిమ్ములను నా ముందు అభినందిస్తూ ఉంటే చూడాలని అనుకుంటున్నాను' అని అన్నారు. యజ్ఞములో ఒకప్పుడు చంద్రమణి దాదీని, జానకిదాది కంటే సీనియర్ అని గౌరవిస్తూ ఉండేవారు. ఒకసారి జానకి దాది స్వయంగా మాతో అన్నారు - చంద్రమణి దాదీకి బ్రాహ్మణిగా ఉండినాను, బాబా జానకి దాదీని అడిషనల్ చీఫ్‌గా చేశారు, చంద్రమణి దాదిని జాయింట్ చీఫ్‌గా చేశారు. అయినా చంద్రమణిదాదీకి ఎలాంటి ఫీలింగ్ రాలేదు. వారి మనసులో జానకిదాదీని అడిషనల్ చీఫ్‌గా, నన్ను జాయింట్‌గా ఎందుకు చేశారనే ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. బాబా జానకి దాదీని ముందుంచినప్పుడు వారిని గౌరవించడం నా కర్తవ్యమని అనేవారు. చివరివరకు జానకిదాదీని వారు దాదీ అనే పిలిచేవారు. పెద్దలు ఇలా చేశారంటే అందులో ఏదో రహస్యముందని భావించారు, వారిని గౌరవించడం మన కర్తవ్యము అని అనేవారు. ప్రతి చోట వారిని



అభినందింపజేసి, సంతోషించాలని నా కోరిక అని భావించారు, అందుకే నేను మీ వెంటనే ఉంటానని చెప్పారు. దీది(చంద్రమణిదాది) వారి వెంట వెళ్ళారు.

అమృతసర్‌లో జానకిదాదిగారి అభినందన జరిగింది. చాలా పెద్ద కార్యక్రమము జరిగింది. అక్కడి చాలా సంస్థలు దాదీలను అభినందించారు. నేను స్టేజ్ సెక్రెటరీగా ఉండినాను. అప్పుడు చంద్రమణిదాది నాతో - ఏ ఏ సంస్థలు ఈ రోజు దాదీని అభినందించాయో ఆ సంస్థల పెద్దలను రేపు సెంటర్లో అభినందిస్తాను. వారంతా రేపు మా ఆశ్రమానికి రావాలని అనౌన్స్ చేయమని చెప్పారు. నేను అలాగే అనౌన్స్ చేశాను. జానకి దాది అదే రాత్రి వెళ్ళిపోవలసి ఉండినది. నేను చంద్రమణి దాదితో - ''దాదీ వీరంతా మన సంబంధ-సంపర్కములో ఉండువారు, వారిని పిలిచి అభినందించే అవసరమేముంది? మీ మనసులో ఏముందో చెప్పండి అని అడిగాను. దీనికి జవాబు దాది వారి భాషణలో చెప్పారు. భలే వీరంతా మా సహయోగులు, మా సంబంధ-సంపర్కములో ఉన్నారు, కాని మేము బాబాను ఎంతగా తెలుసుకున్నామో, అర్థము చేసుకున్నామో, అంత వీరు కూడా తెలుసుకోవాలి, అర్థము చేసుకోవాలని మా కోరిక. వీరు కూడా బాబాకు సమీపంగా వచ్చి బాబాతో పూర్తి వారసత్వము తీసుకోవాలి. ఈ విధంగా ప్రతి ఒక్కరు బాబా నుండి వారి జన్మ సిద్ధ అధికారాన్ని తీసుకోవాలని వారికి సంకల్పముండేది.

ఎవరినైనా వారు దృఢంగా విశ్వసించేవారు. ఆ విశ్వాసమే నన్ను, బాబా పిల్లలందరినీ ముందుకు తీసుకెళ్ళడంలో సహాయము చేసింది. వారిలో నేను ఎప్పుడూ ద్వంద్వ వ్యక్తిత్వాన్ని చూడలేదు(లోపల ఒకటి, బయట ఒకటి) ఏ విషయమైనా స్పష్టముగా చెప్పేవారు. వారి పట్ల నాకెప్పుడూ - వారు ఏమి చేస్తారో, నా గురించి ఏమి ఆలోచిస్తారో అనే సంశయము, సందేహము కలుగలేదు. వారి వ్యక్తిత్వములో మేము సత్యత, స్వచ్ఛత, విశ్వాసము, స్పష్టతలను చూచాను.

చివరివరకు వారు ఎటువంటి పరిస్థితిలోనూ ఈశ్వరీయ నియమాలను, మర్యాదలను ఉల్లంఘించ లేదు. సమయాన్ని బట్టి ఎప్పుడూ నియమాలను దాటలేదు(కాంప్రమైజ్ కాలేదు అంటే నియమాలలో వదులుగా అవ్వలేదు). పరిస్థితులు, వ్యక్తులు, సమస్యల కారణంగా సంయమ -

నియమాలను మార్చుకొని రాజీ అవ్వలేదు. సేవ పెరిగినా, చిన్న అక్కయ్యల సంఖ్య పెరిగినా, పంజాబ్ జోన్‌ను ఈశ్వరీయ నియమాలలో ఢీలా(లూజ్, వదులుగా) కానివ్వలేదు. ఈ రోజు వరకు పంజాబ్ జోన్‌లో ఒక సోదరుడు, ఒక సోదరి కలిసి ఒకే రిక్షాలో ప్రయాణము చెయ్యరు. ఇప్పటివరకు పంజాబు జోనులోని ఏ అక్కయ్య కూడా అన్నయ్యల వెనుక కూర్చుని స్కూటర్‌లో ప్రయాణము చేయరు. అలాగని ధారణ విషయంలో కచ్చాగా ఉన్నారని కాదు. మేము జనులేమనుకుంటారని ఆలోచిస్తాము! మనము మంచివారమే, బాగున్నాము, కాని జనుల భావనలలో కూడా మనము బాగుండాలి. మనలను చూచి అజ్ఞానుల ఆలోచనలు విచలితము కారాదు - ఇది మా లక్ష్యము. లౌకికము వారు కూడా వీరి కొన్ని విశేష నియమాలు, మర్యాదలు ఇతర సంస్థల కంటే విభిన్నముగా ఉన్నాయని అర్థము చేసుకోవాలి. ఈ రోజు వరకు మా పెద్ద టీచర్ అక్కయ్యలు కూడా అన్నయ్యలతో కలిసి ఒకే టేబుల్ వద్ద కూర్చొని భోజనము చేయరు. భోజనము చేస్తూ పరస్పరము మాట్లాడుకోవడం చూచి క్లాసుకు వచ్చేవారు ఇది బాగలేదని సంకల్పము చేయరాదు. మనది అలౌకిక జీవితము, లౌకికము కంటే భిన్నమైన జీవితము. **చంద్రమణిదాది ఎల్లప్పుడూ నియమాలలో స్ట్రిక్ట్(ఖచ్చితము)గా, సమయములో పంక్చువల్ (వేళకు క్రమముగా వచ్చువారు)గా ఉండి ఇతరులను అలాగే నడిపించేవారు. ఈ రెండు విషయాలను వారు చాలా విశ్వసించేవారు.**

వారిలో దృఢత మరియు నిశ్చయము ఈ రెండు గుణాలు చాలా శక్తిశాలిగా ఉండడం నేను గమనించాను. ఏ విషయములోనైనా ఒకసారి నిర్ణయము తీసుకుంటే అది చేసే తీరాలి. వారు చిన్నవారి భావాలను, ఆలోచనలను చాలా గౌరవించేవారు. ఇది వారు శరీరము విడిచేందుకు 3-4 సంవత్సరాల ముందు జరిగిన విషయము. వారు పంజాబులో టూర్ చేయు ప్రోగ్రాము తయారవుతూ ఉండినది. ఆ సమయములో వారు ఫలానా సెంటరుకు కూడా పోవాలని అన్నారు. అప్పుడు నేను - **'దీదీ, వారి నుండి ఆహ్వానము రాలేదే'** అని అన్నాను. అందుకు వారు - కొంతకాలము క్రితము వారి నుండి నాకొక పోస్ట్‌కార్డు వచ్చింది, అందులో - **'దీదీ! మీరు ఇటువైపు వచ్చినపుడు మా వద్దకు కూడా రండి'** అని వ్రాశారు. అందువలన వారి వద్దకు వెళ్లాలి. మేము వస్తామని



వారికి తెలుపు అని అన్నారు, కనుక వారు ఒక పోస్టుకార్డుకు కూడా ఇంత గౌరవమిచ్చేవారు. చాలా చిన్న సేవాకేంద్రమైనా, చాలా చిన్న సోదరి అయినా కూడా వారు విలువనిచ్చేవారు.

సేవను గురించి వారికెంత ఉమంగ-ఉత్సాహాలుండినాయంటే ప్రతి 2-3 మాసాలకు ఒక్కసారి మీటింగ్‌కు పిలిచేవారు. నేను వారితో - దీదీ ఇప్పుడే కదా, 2-3 నెలల క్రితమే కదా మీటింగు జరిగింది అని అనేవాడిని. అయినా పిలవండి, మీటింగులో ఒకరి నుండి ఒకరు నేర్చుకునే, అర్థము చేసుకునే విషయాలు చాలా ఉంటాయి చిన్న చిన్న విషయాలకు సమాధానము లభిస్తుంది అని అనేవారు. వారు మీటింగుకు చాలా ప్రాముఖ్యతనిచ్చేవారు.

సేవ ఎక్కడ తగ్గిపోయినా, సేవ చాలా నెమ్మదిగా జరుగుతూ ఉండినా అక్కడకు వెళ్లేందుకు ప్రోగ్రాము తయారు చేయమని నాకు చెప్పేవారు. వారి ఆహ్వానము లేకపోయినా మనము వెళ్తాము. ఎందుకంటే మనము వస్తున్నామని వారికి తెలుస్తే అక్కడున్న సోదరీ-సోదరుల ఉమంగ-ఉత్సాహాలు పెరుగుతాయి. వారు ఆహ్వానించలేదే, మరి ఎలా వెళ్లేది? అని అనకు. మన సెంటర్లు, మనము తప్పక వెళ్తాము అని అనేవారు. వారు స్వయంగా అక్కడున్న సోదరీలకు ప్రేరణనిచ్చి వారిలో ఉమంగ-ఉత్సాహాలు నింపి కార్యక్రమము చేయించేవారు. వారి జీవనశైలిలో నాకు ఒక విశిష్టత, ప్రత్యేకత కనిపించింది.

వారి వ్యక్తిగత జీవితాన్ని నేను చాలా సమీపముగా గమనించాను. వారికి ఎవ్వరి పైనా మోహము (అటాచ్‌మెంట్) లేదు. వారి జతలో విజయా బహన్ ఉండేవారు. ఇప్పుడు వారు ఓ.ఆర్.సిలో (ఢిల్లీ)ఉన్నారు. మీటింగ్‌లో ఎవ్వరైనా టీచరు కొరకు అడిగితే, నీకు నిజంగా ఒక టీచరు అవసరమనుకుంటే నేను ఇప్పుడే విజయా బహన్‌ను కూడా మీకిస్తాను అని అనేవారు. విజయా బహన్ వారి పనులన్నీ చేసేవారు. తమ స్వంతానికి ఏ సాధనము పై గాని, సౌకర్యము పై గాని గమనముంచేవారు కాదు. వారు చాలా సార్లు తమ వ్యక్తిగత వస్తువులను కూడా టీచర్ అక్కయ్యలకిచ్చుట నేను చూచాను. అందరూ తృప్తిగా ఉండాలని వారి లక్ష్యము.

వారు ఎక్కడ ఉపన్యసించినా అందులో జ్ఞానాన్ని నిరూపించేవారు. మేము మా ఉపన్యాసాలలో ఏదో ఒక కథ గాని, ఏదైనా ఉదాహరణ గాని లేక

దేనికైనా పోల్చి చెప్పేవారము. మొదట భూమికను తయారు చేసి తర్వాత బాబా ఇచ్చిన జ్ఞానము వినిపించేవారము. కాని చంద్రమణిదాది వారి ఉపన్యాసము ప్రారంభము నుండే జ్ఞాన విషయాలు వినిపించి ఆత్మలో శక్తిని నింపేవారు. యోగము గురించి గాని, ధారణ గురించి గాని చాలా స్పష్టముగా, సరళంగా నిరూపించి తెలిపేవారు. దీని వలన విన్న వారికి ఈ మార్గము చాలా సులభమనిపించేది.

మనము ఉపన్యసిస్తే చాలా విషయాలు ఎక్కడెక్కడివో వినిపించి చివరిలో పరమాత్మ నిరాకారులని, వారు అందరికీ తండ్రి అని చెప్తాము. కాని కేవలం నిరాకారమని చెప్పినందున ఏమి లాభము? ఆ నిరాకారులు ఎవరి శరీరములో వస్తారు, ఎప్పుడు వస్తారు? ఎలా వస్తారు? వచ్చి ఏమి చేస్తారు - ఈ విషయాలన్నీ వారికి తెలపాలి కదా? మనము తెలిసినవారము. మనమే తెలపకుంటే వారికి ఇంకెవరు తెలుపుతారు? నిరాకారమును ప్రపంచమంతా ఒప్పుకుంటారు, గౌరవిస్తారు. కాని ఆ నిరాకారులు సంగమయుగములో బ్రహ్మా శరీరములో వస్తారు, వచ్చి అందరికి సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ఇస్తారు, వారి ద్వారా అందరికీ ముక్తి - జీవన్ముక్తి లభిస్తుంది, సృష్టి పరివర్తన అవుతుంది, ఇప్పుడు ఈ పని జరుగుతున్నదని చెప్పాలి. ఈ విషయము చెప్పకుంటే మరి ఇంకేమి చెప్పినట్లు? విషయాలను పూర్తిగా చెప్పకుంటే రేపు ప్రపంచము మాకు పూర్తి సందేశము లభించనే లేదని ఫిర్యాదు చేస్తుంది. ఇలా నవ్వుతూ-నవ్వుతూ, దృఢంగా, ప్రేమతో, అథారిటీతో చెప్పేవారు.

వారు ఎప్పుడూ వాతావరణముతో గాని, ఆత్మలతో గాని ప్రభావితమయ్యేవారు కారు. శ్రీమతము పై, ఈశ్వరీయ జ్ఞానము పై, ఈశ్వరీయ కర్తవ్యము పై వారు అచలంగా, నిశ్చలంగా, దృఢంగా ఉండేవారు. ఏ విషయమైనా వారికి నచ్చకుంటే, చాలా ప్రేమతో ఇదిలా ఉంది, నాకు నచ్చలేదని చెప్పేవారు. ఏ వ్యవహారమునైనా వారు వాయిదా వేసేవారు కాదు. మేము వారి వద్దకు ఏ సమస్యను తీసుకెళ్లినా దానిని మరుసటి రోజుకు గాని, కొంత సమయము తర్వాత అని గాని వాయిదా వేసేవారు కాదు. వెంటనే దానికి పరిష్కారము తెలిపేవారు. వారి నిర్ణయము చాలా ఖచ్చితముగా, త్వరగా, ఆచరణీయముగా ఉండేది.



ఒకసారి ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి - దీదీ! మీకు నేను సెంటరు విషయాలు, ఆ టీచరు విషయాలు వినిపిస్తాను, కాని నేను చేతులు జోడించి చెప్తున్నాను - ఈ విషయాలన్నీ నేను చెప్పినట్లు ఎవరికీ చెప్పకండి అని అన్నాడు. నేను కూడా అక్కడే కూర్చొని ఉన్నాను. దీదీగారు స్వభావ సిద్ధంగా, చాలా గట్టిగా నవ్వుతూ అటువంటి విషయాలు నాకు వినిపించకు, ఎందుకంటే మీ కొరకు నేను అసత్యము చెప్పను, నా అంతకు నేను చెప్పను, కాని ఎవరైనా దీదీ ఫలానా సోదరుడు మీ వద్దకు వచ్చి ఏమి చెప్పినాడు అని అడిగితే, నేను వారికి విషయమంతా చెప్పేస్తాను. నేను అసత్యము చెప్పను. కనుక నాకు చెప్పాలా? వద్దా? అనేది మీ ఇష్టమని చెప్పారు. మరొకసారి ఒక సోదరితో దీదీ - "చూడండి నేను దీదీ దగ్గర గాని, దాదీ దగ్గర గాని ఎవరైనా గాని, ఒకరి ముందు ఒక మాట, మరొకరి ముందు మరొక మాట చెప్పలేను. ఏదైనా విషయము గురించి నన్ను నలుగురు అడిగితే, నేను వారందరికీ ఒకే విధంగా వినిపిస్తాను, నా మాటలలో ఎక్కడా తేడా రాదు అని చెప్తూ ఉండినారు. వారిలో మాటలు మార్చడం గాని, మాటలు తిప్పే సంస్కారము గాని లేవు. ఏమి చెప్పినా, ఎవరి ముందు చెప్పినా, ఎంతమందికి చెప్పినా, ఒకే మాట, అదే మాట. రెండవ వ్యక్తిత్వమే లేదు. అందువలన వారి పై అందరికీ నమ్మకము, గౌరవము ఉండేవి.

ఏదైనా ఒక విషయము అందరికి వినిపించకూడనిదైతే స్పష్టముగా వారితోనే - **"ఈ పని నీవు చేయదగినది కాదు"** అని నేరుగా చెప్పేవారు. అటు-ఇటు తిప్పి అపరోక్షముగా చెప్పకుండా నేరుగా చెప్పేవారు. వారిలో నేను నిజమైన సత్యతను చూచాను. మేము రైలు ప్రయాణము చేయునపుడు నేను వారిలో చాలా దయాగుణాన్ని చూచాను. ఎదుటి వ్యక్తి ఎటువంటివారైనా వారికి దయ కలిగి - వీరికి బాబా పరిచయము ఇచ్చి, బాబా వచ్చారని సందేశమివ్వాలని, వారికి కూడా కళ్యాణము జరగాలని భావించేవారు. ఏదో ఒక విధంగా వారి ఎదురుగా కూర్చున్న వారికి బాబాను గురించి రెండు మాటలు వినిపించేవారు.

ఎవరికైనా సౌగాత్(కానుకలు) ఇస్తూ ఉంటే, దానిని గురించి తప్పకుండా తెలిపించేవారు. ఉదాహరణానికి శివబాబా చిత్రాన్ని కానుకగా ఇస్తూ ఉంటే, కనీసము 20 మందికైనా శివబాబా పరిచయాన్ని తప్పకుండా ఇచ్చేవారు.

ఒకరికి చెప్పినప్పుడు, ఇతరులు కూడా విని ఉంటారని అనుకొని, వారికి కూడా సౌగాత్‌నిస్తే సరిపోతుందని భావించకుండా ఒక్కొక్కరికి ప్రత్యేకముగా ఆ ఈశ్వరీయ కానుకలోని పరిచయాన్ని, మహత్యాన్ని తెలిపించేవారు.

ఒకసారి వారు అమృతసర్‌కు వెళ్లారు. ఉదయము నుండి సాయంకాలము వరకు ఒకే స్థానములో కూర్చొని, ఎవరు వచ్చినా వారితో కలుస్తూ ఉండినారు. అక్కడే నాస్తా, అక్కడే భోజనము కూడా చేశారు. రాజ్ బెహన్ వారితో - " దీదీ మీరు ఉదయము నుండి కూర్చునే ఉన్నారు, మీకు అలసటగా లేదా? మీతో పాటు కూర్చున్న నేను కూర్చుని కూర్చునే అలసిపోయాను" అని అన్నారు. అప్పుడు వారు అలాగైతే మీరు నన్నెందుకు పిలిచారు, నేను సేవ చేసేందుకు వచ్చాను, అది కూడా రెండు రోజులు మాత్రమే ఉంటాను. విశ్రాంతి తీసుకునేందుకు రాలేదు. ఎవరికైనా ఏ సమయములోనైనా మాట్లాడాలనుకుంటే పూర్తిగా అనుమతినిచ్చేవారు. భలే రండి, వెల్‌కమ్ అని అనేవారు.

ముఖ్యంగా వారు గృహస్థుల పై గమనముంచేవారు. విశేషంగా ఎవరి ఇంట్లో పిల్లలుంటారో వారి పై ఎక్కువ గమనముంచేవారు. వారి ఇంట్లోని వారందరు బాబా పుత్రులై మంచి పురుషార్థము చేయాలి, తల్లిదండ్రులతో పాటు వారి చిన్న - చిన్న పిల్లలను కూడా క్లాసుకు రమ్మని పిలిచేవారు. ' ఇంత పెద్ద దాది చిన్న - చిన్న పిల్లలతో ఇంత బాగా కలిసిపోతున్నారని ' నాకు చాలా ఆశ్చర్యము కలిగేది. దీదీ అమృత్‌సర్‌లో ఉన్నపుడు ప్రతి ఆదివారము ఈ రోజు వీరి పుట్టినరోజు, మరొకరోజు వారి పుట్టినరోజు అని ఉత్సవాలు జరిగేవి.

అమృతసర్‌లో వారానికి రెండుసార్లు బాబాకు భోగ్ సమర్పించేవారు. గురువారమే కాక ఆదివారము కూడా భోగ్ ఉండేది. ఆదివారము భోగ్ నాస్తా వలె ఉండేది. ఆ రోజు అందరూ వారి పిల్లలందరిని క్లాసుకు పిలుచుకొని రావలసి వచ్చేది. ఎవరు తీసుకు రాకుంటే వారు దీదీకి కారణము చెప్పవలసి వచ్చేది. ఆ రోజు ఒక గంట పిల్లలకు ప్రత్యేక కార్యక్రమము నడిపేవారు. దీదీగారు పాలన ఇచ్చిన చిన్న చిన్న పిల్లలు, ఈ రోజు పెద్ద పెద్ద సెంటర్లకు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.

ప్రశ్న:- వారి వ్యక్తిగత జీవితమెలా ఉండేది ?

సమా :- వారి వ్యక్తిగత జీవితము చాలా ఆక్యురేట్ (ఖచ్చితము)గా ఉండేది.



చివరి వరకు వారు అమృతవేళ యోగములో చురుకు(అలర్ట్)గా కూర్చునేవారు. సదా కనులు తెరచుకొని వైబ్రేషన్స్ ఇస్తూ ఉండేవారు. వారి అమృతవేళ యోగము ఎల్లప్పుడూ శక్తిశాలిగా ఉండేది. యోగములో ఆలస్యము కాని, సోమరితనము గాని నేను ఎన్నడూ చూడలేదు. అమృతవేళలోని యోగములో సెంటర్లోని సోదరీలను తన ముందు కూర్చోబెట్టుకొని దృష్టినిచ్చేవారు. వారి జీవితమంతా సదా చురుకుగా, ఆక్యురేట్‌గా ఉండడం నేను చూచాను. వారికి యోగమంటే చాలా ప్రేమ. ఎప్పుడు సమయము లభించినా వెళ్లి బాబా గదిలో కూర్చునేవారు లేక వారు ఎక్కడుంటే అక్కడే యోగములో కూర్చునేవారు. వారు కనిపించకుంటే, ఎవరైనా దాదీ ఎక్కడున్నారని అడుగుతే, యోగములోనైనా కూర్చుని ఉంటారు లేక బాబా గదిలో ఉంటారని చెప్పేటంతగా వారు యోగములో ప్రఖ్యాతి చెందారు. వారు సాయంకాల యోగానికి కూడా చాలా ప్రాముఖ్యతనిచ్చేవారు. జోనల్ మీటింగ్ ఎడతెరపి లేకుండా రెండు రోజులు నడిచేది. సాయంకాలము 6.30 లేక 7 గంటలవుతూనే ఇప్పుడు సాయంకాలమయింది అందరూ కలిసి అరగంట యోగము చేస్తాము, ఇప్పుడు మీటింగు సమాప్తము చేయండి అని మీటింగు వారందరికీ చెప్పేవారు. ఎక్కడున్నా ప్రాతః కాల యోగము మరియు క్లాసు ఉండనే ఉంటుంది, కాని సాయంకాలము కూడా అరగంట, గంట యోగము చేసే తీరాలని చెప్పేవారు. ప్రయాణాలలో కూడా వారు ఎప్పుడూ యోగము మరియు క్లాసు మిస్ చేయలేదు.

అధ్యయనము చేయడం వారికి చాలా ఇష్టము. 70-75 సంవత్సరాల వయసులో కూడా ఈశ్వరీయ చదువు పై వారికి ఎంత ఆసక్తి ఉండినదో చూడండి. జ్ఞానామృతము మొదలైనవి వస్తూనే ప్రారంభము నుండి చివరి వరకు చూచేవారు, చదివేవారు. చివర్లో వారికి వీపులో నొప్పి ఉండినా పడుకొని కూడా చదువుతూ ఉండేవారు. కాన్ఫరెన్సులు మొదలైనవి ఏవైనా జరిగినపుడు, ఇంగ్లీషులో ప్రింట్ అయిన ఫోల్డర్లు, కార్డులు మొదలైనవాటిని ఇంగ్లీషు తెలిసిన వారితో అనువాదము చేయించి వినేవారు. టాపిక్ అర్థము ఏమిటి అని అడిగి తెలుసుకునేవారు. వారిలోని విశేషత ఏమంటే వారు ఉపన్యసించేందుకు ఎక్కువగా తయారయ్యేవారు కాదు. ఉపన్యసించుటకు పోయే ముందు అరగంట - ముప్పావు గంట సేపు సైలెన్సులో తప్పకుండా కూర్చునేవారు. చాలాసార్లు,

ఎక్కడకైనా పబ్లిక్ ప్రోగ్రాముకు వెళ్లాలంటే ఒక గంట సేపు ఎవ్వరూ నాతో మాట్లాడకండి అని చెప్పేవారు. బాబా మనకు ఇంత గొప్ప జ్ఞాన ఖజానానిచ్చారు. దానిని సరియైన రీతిలో ఇచ్చేందుకుమన స్థితి ఉన్నతంగా ఉండాలని, కేవలం జ్ఞానము వినిపిస్తే ప్రభావము పడదని, ఆత్మిక స్థితిలో ఉండి వినిపిస్తే వినేవారి పై ప్రభావము పడ్తుందని చెప్పేవారు.

**చంద్రమణి దాదిగారికి సదా(అంగ-సంగములో) సమీపంగా ఉండిన విజయా బెహన్, వారి చారిత్రక విశేషతలను, గుణాలను, ఈశ్వరీయ ప్రాప్తులను ఈ విధంగా వ్రాస్తున్నారు :**

## దాది చందమ్రణిగారు స్నేహము, నిరహంకారము, నిర్భయము, సత్యము మొదలైన గుణాలకు ప్రతి రూపముగా ఉండేవారు

ఇది 1966వ సంవత్సరంలో జరిగిన విషయము. పంజాబులోని ఫిరోజ్‌పూర్ సిటీలో మా లౌకిక పరివారముతో పాటు ఉండేదానిని. ఫిరోజ్‌పూర్ కాంట్‌లో ఒక సెంటరు ఉంది, కాని బ్రహ్మాకుమారీలంటే ఎవరో జనులకు ఏ మాత్రము తెలియదు. రెండు - మూడు కుటుంబాలవారు మాత్రము జ్ఞానమార్గములో నడిచేవారు. వారికి నేను మరియు నా పరివారము వారు బాగా తెలుసు. వారు బ్రహ్మాకుమారీ సోదరీలతో - ఈ పరివారము సిటీలో చాలా మంచి పరివారము, పెద్ద కుటుంబము, భక్తి భావము గలవారు, వారికి జ్ఞానము వినిపిస్తే వారు సెంటరుకు రావచ్చు అని సూచించారు. ఒక రోజు ఒక బి.కె. సోదరి మా ఇంటికి వచ్చింది. మా తల్లిగారు చాలా భక్తి, పూజలు చేస్తూ ఉండేది, ఆమెకు ఈ జ్ఞానము చాలా బాగా నచ్చింది. మా తల్లి జ్ఞానము వినునపుడు నేను కూడా కూర్చొని వినేదానిని. అప్పుడు నేను 11వ తరగతి చదువుతూ ఉండేదానిని. నాకు జ్ఞానములో అంత రుచి దొరకలేదు ఎందుకంటే నాకప్పుడంతగా అర్థము కాలేదు. నేను భక్తి కూడా చేసేదానిని కాదు. పరమాత్మను గురించి తెలుసుకునేందుకు అంత పెద్ద ఇష్టము కూడా ఉండేది కాదు.

1966లో మొదటి సారి నేను దీదీ చంద్రమణిగారితో మా ఇంటిలోనే కలవడం జరిగింది. మా తల్లిదండ్రులు దీదీగారిని మా ఇంటిలో ప్రవచనమిచ్చేందుకు ఆహ్వానించారు. మా ఇంటిలో గీతాపాఠశాల నడుస్తూ



ఉండేది. అప్పటికి నేను కూడా జ్ఞానములో నడవడం మొదలు పెట్టాను. దీదీతోపాటు అచల్ బహన్ కూడా వచ్చారు. దీదీగారు మాట్లాడడం, నవ్వడం చాలా ప్రత్యేకంగా ఉంటుంది, సాటిలేనిదిగా ఉంటుంది. వారు నాతో ఒక స్నేహితురాలితో మాట్లాడినట్లు మాట్లాడసాగారు. తమ వద్దకు పిలిచి, క్షేమసమాచారాలు విచారించడం, చదువు గురించి అడగడం, ప్రేమనివ్వడం మొదలైన గుణాలు నాకు చాలా నచ్చాయి. వారిని చూస్తూనే నాకు ఒక విధమైన ఆకర్షణ కలిగేది. మా తల్లిగారు దీదీగారి ద్వారా ఎంత ప్రభావితమయ్యారంటే, దీదీ చెప్పింది తప్పకుండా చేసేవారు. ఆ రోజులలో సెంటర్లు చాలా తక్కువగా ఉండేవి. కనుక అన్ని సెంటర్లకు వారు ఎక్కువగా వచ్చి పోయేవారు. దీదీగారు ఫిరోజ్‌పూర్‌కు వచ్చినపుడు నేను వారితో కలిసేదానిని.

1969లో నా చదువు పూర్తి అయింది. ఆ తర్వాత నేను, నా తల్లిదండ్రులతో నేను బ్రహ్మాకుమారిగా అవుతానని చెప్పాను. మా తల్లిగారు జ్ఞానములో పూర్తిగా నడుస్తూ ఉండేది. మా తండ్రి సహయోగిగా ఉండేవారు. మా తండ్రి అంగీకరించలేదు, వద్దన్నారు కాని నేను పక్కాగా, ' నేను బ్రహ్మాకుమారీగానే అవ్వాలి ' అని నా ఇష్టాన్ని చెప్పాను. అప్పుడు మా తండ్రి మా బంధువులందరిని పిలిచారు. బంధువులు నాకు చాలా సేపు 'రాముడు కూడా వివాహము చేసుకున్నాడు, కృష్ణుడు మొదలైన వారందరూ చేసుకున్నారు' అని తెలిపించారు. నేను వారితో నేను ఈ మార్గములోనే నడుస్తానని చెప్పాను. చివరికి మా మేనత్త నాతో 'చూడమ్మా! ఈ దారి చాలా కఠినమైనది, మరొకసారి ఆలోచించు' అని చెప్పింది. నేను ఆమెతో నా నిర్ణయము మారదని చెప్పాను. అప్పుడామె బంధువులందరితో 'ఈమెకు ఆ జీవితమే ఇష్టమున్నపుడు వదిలేయండి......... ఈమెకు ఏ జీవితము ఇష్టమో అలాగే జీవించనీయండి' అని చెప్పింది. ఈ విధంగా నాకు బ్రహ్మాకుమారిగా అయ్యేందుకు అనుమతి లభించింది. తర్వాత ఒక సంవత్సరము వరకు నేను ఇంటిలోనే ఉండినాను. నా తల్లికి నన్ను చంద్రమణిదీదీ వద్దకు పంపాలని ఇష్టముండినది. నిన్ను దీదీ వద్దకు అమృతసర్‌కు పంపుతానని చెప్పేది. మొదటి రెండు సంవత్సరాలు నేను స్థానిక సేవా కేంద్రము ఫిరోజ్‌పూర్ క్యాంట్‌లో ఉండినాను. 1971లో నన్ను అమృతసర్‌లో చంద్రమణి దీదీ వద్ద విడిచి వచ్చేసింది. అచ్చట ఇంకా కొంతమంది కుమారీలు

ఉండినారు. వారికి దీదీ ట్రైనింగ్ ఇస్తూ ఉండినారు. సుమారు 16 మంది కుమారీలుండినారు.

చంద్రమణి దీదీ అమృతవేళకు చాలా మహత్యమిచ్చేవారు. అమృతవేళలో వచ్చి అందరినీ నిద్ర లేపి 'చూడండి, బాబా తిరుగుతున్నారు, మిమ్ములను చూస్తున్నారు, మీరింకా నిద్రపోతున్నారు త్వరగా లేవండి, నిద్రలేచి పదండి, బాబా పిలుస్తున్నారు, బాబా తిరుగుతున్నారు అని గదిలోకి వచ్చి నిద్ర లేపేవారు. దీదీ అంటే కన్యలందరికీ చాలా ప్రేమ. మాకు త్వరగా నిద్రలేచే అలవాటు లేదు. ప్రారంభములో అమృతవేళలో నిద్రలేచే నియమము లేదని మీకు తెలుసు. 6-00, 6-30కు నిద్రలేచి 5-10 నిముషాలు యోగము చేసి స్నానము చేసేందుకు వెళ్లేవారు. తర్వాత క్లాసు, కర్మణా సేవ మొదలైనవి చేసేవారు. తర్వాత అమృతవేళలో నాలుగు గంటలకు నిద్ర లేచి, సామూహిక యోగము చేయాలని మధువనము నుండి ఆదేశము లభించింది. అప్పటి నుండి అన్ని సెంటర్లలో అమృతవేళ యోగము ప్రారంభమయింది. మాలో ఎవ్వరికీ త్వరగా నిద్ర లేచే అలవాటు లేదు. కాని దీదీ పట్ల ప్రేమ ఉన్నందున మేము అమృతవేళలో నిద్ర లేవడం పెద్ద విషయమేమీ కాదని, దీదీ చెప్తే మేము ఆకాశములోని నక్షత్రాలను కూడా తెస్తామని అనేవారము. నేను అమృతసర్‌కు పోయినపుడు అక్కడ ఒక అక్కయ్య ఉండేది. అమెను చండీగర్‌కు బదిలీ చేశారు. ఆమె సేవ - దీదీ బట్టలను శుభ్రపరచడం, వారికి బట్టలివ్వడం, దీదీ ఎక్కడకైనా బయటకు వెళ్తే, అందుకు కావలసిన ఏర్పాట్లు చేయడం. ఈ సేవలన్నీ నాకు అప్పగించారు. నెమ్మది నెమ్మదిగా దీదీగారి పనులన్నీ నాకు అప్పగించారు. దీని వలన దీదీతో నా సంబంధము, స్నేహము వృద్ధి చెందింది. సమీపత పెరిగింది. మంచి శిక్షణను(ట్రైనింగ్) ఇస్తూ వారి చెప్పేవన్నీ వినేదానిని, ట్రైనింగ్ దినచర్య ఎలా తయారు చేసి ఉండినారంటే మాకు ఒక్క నిముషము కూడా బిడువు దొరికేది కాదు, ఉదయము నుండి రాత్రి వరకు తలమునకలై ఉండేవారము. ఆ రోజులలో ఉదయము టీ త్రాగే పద్ధతి కూడా లేదు. మేము టీ త్రాగేవారమే కాదు. దీదీనే రోజూ మురళిని వినిపించేవారు క్లాసు తర్వాత టిఫన్, తర్వాత కూరగాయలు కట్ చేయడం జరిగేది. కూరగాయలు కట్ చేసేందుకు దీదీగారు కూడా కుమారీలందరితో కూర్చునేవారు. ఒకవేళ ఏవైనా కూరగాయలు తరగడం,



చేయడం మాకు రాకుంటే దీదీ స్వయముగా చేసి చూపించేవారు. నాకు గుర్తుంది, సాయిభాజీ చేయడం నాకు వచ్చేది కాదు, ఎందుకంటే ఇది సింధీవారు చేయు రకము. వారు నాకు ఆలూ మరియు సాయిభాజీ చేయడం నేర్పించారు. ఈ విధంగా వారు జ్ఞాన-యోగాలతో పాటు స్థూల పనులు చేయడం కూడా మాకు నేర్పించేవారు. త్వరత్వరగా కర్మణా సేవను పూర్తి చేసి క్లాసులో చేరుకోండి . 10 గంటల లోపల అన్ని పనులు పూర్తి చేసి మేము క్లాసులోకి చేరుకునేవారము. ట్రైనింగ్‌లో ఇతర ప్రాంతాల సేవాకేంద్రాల నుండి అంటే బొంబాయి, ఢిల్లీ మొదలైన స్థానాల నుండి కుమారీలు వచ్చేవారు. 10 గంటల క్లాసులో మొట్టమొదట సంఘటనలో శక్తిశాలి యోగము జరిగేది. దాని తర్వాత ఈశ్వరీయ జీవితంలో ఎలాంటి ధారణలు ఉండాలి, నియమాలు ఎలా ఉండాలి అని నేర్పించేవారు. జడ వేసుకోవడం, చీర కట్టుకోవడం నుండి మాట్లాడే, నిద్రపోయే, కూర్చునే ఆత్మిక విధిని కూడా నేర్పించేవారు. వారు దాదీ, దీదీల విశేషతలను వర్ణించేవారు. ఒకప్పుడు గుల్జార్‌దాదీ, ఒకప్పుడు మనోహర్‌దాదీ, ఒకప్పుడు పెద్ద దాదీ, ఒకప్పుడు గంగేదాదీ విశేషతలను తెలుపుతూ ఉండేవారు. ఆ దాదీల విశేషతలను వినిపించి ఆ విశేషతలను ధారణ చేసేందుకు మాకు కూడా ప్రేరణను కలిగించేవారు. ప్రారంభంలో యజ్ఞచరిత్రను చాలా వినిపించేవారు. యజ్ఞములో ఎటువంటి విషమ, వికట పరిస్థితులొచ్చాయో, వాటిని బాబా ఎలా ఎదుర్కొన్నారో, ఎలా నిశ్చలంగా ఉండినారో మొదలైన విషయాలన్నీ తెలిపిస్తూ మనము కూడా అటువంటి పరిస్థితులలో స్థిరంగా ఉండాలని చెప్పేవారు. యజ్ఞము పట్ల, యజ్ఞములోని పాత సోదరీ - సోదరుల పట్ల వారికి చాలా గొప్ప భావము, గౌరవము ఉండేవి. వారిని కలిసేందుకు ఎవరు వచ్చినా - చిన్న పిల్లలు గాని, పెద్దవారు గాని, జ్ఞానులు గాని, అజ్ఞానులు గాని అందరినీ ఎంత ప్రీతిగా కలిసే వారంటే అందరికీ వీరు నా వారనే భావము కలిగేది.

1973 సంవత్సరము వరకు వారు ఏ మందూ తీసుకునేవారు కాదు. ఆ రోజులలో మా వద్ద ఎలాంటి కారు మొదలైన వాహనాలు లేవని మీకు తెలుసు. ఏ సెంటరుకైనా వెళ్లాలంటే దీదీ బస్సులో ఒంటరిగానే వెళ్లేవారు. సెంటరు నుండి బస్ స్టాండుకు గాని, రైలుస్టేషన్‌కు గాని రిక్షాలో వెళ్తూ ఉండేవారు.

ప్రశ్న:- వారి ఆహార-పానీయాలు ఎలా ఉండేవి ?

జవాబు :- వారి ఆహార-పానీయాలు, వారి దుస్తులు చాలా సాధారణమైనవి. మొదట వారు అన్నీ భుజించేవారు. పంజాబు వారి సాధారణ భోజనమే తినేవారు. ఉదయము దలియా, అప్పుడప్పుడు ఒక పరోటా కూడా తీసుకునేవారు. మధ్యాహ్నము పప్పు , సబ్జి(తాళింపు), రొట్టె కొద్దిగా అన్నము, రాత్రికి ఒక రొట్టె, పన్నీర్ సబ్జి తీసుకునేవారు. పన్నీరు సబ్జీ అంటే వారికి ఇష్టము. మొదట ఫలాలు, పండ్ల రసము మొదలైనవి తీసుకునేవారు కాదు. 1975 సంవత్సరంలో వారు డయాబిటీస్(షుగర్)కు గురి అయ్యారు. వీరికి షుగర్ ఉందని మాకు తెలియదు. మేము చెఱకురసము, పళ్లరసము త్రాపించేవారము. కాని షుగర్ ఎంత పెరిగిపోయిందంటే వారికి చక్కర్ రావడం(తల తిరగడము) కూడా మొదలయ్యింది. డాక్టరుకు చూపిస్తే వారికి కూడా షుగర్ ఉందని అని అనుమానము రాలేదు. డాక్టర్ ఏదైనా హిల్‌స్టేషన్‌కు తీసుకువెళ్లమని సలహా ఇచ్చారు. మేము వారిని సిమ్లాకు తీసుకెళ్ళే ప్రోగ్రాము తయారు చేశాము.

ఆ రోజులలో మధువనములో మీటింగుకు ఆహ్వానము కూడా వచ్చి ఉండినది. మీటింగులో చాలా సమయము కూర్చోవలసి వస్తుంది. వీరికి ఇంకా కష్టమవుతుంది కనుక సిమ్లా వెళ్లాలని అందరూ అనుకున్నారు. ఆ రోజు గురువారము. దీదీ యోగములో కూర్చొని ఉండినారు. యోగము తర్వాత దీదీ “ బాబా నాకు మూడుసార్లు కనిపించి బచ్చీ, ఇంటికి వచ్చేయ్ అని చెప్పారు, కనుక నేను సిమ్లాకు రాను, మధువనానికి వెళ్తాను” అని చెప్పారు. వారితో అచల్ బహన్, ఒక సోదరుడు, ఒక సోదరి సేవాధారులుగా వెళ్లారు. మొట్టమొదటిసారి వారు ఫస్ట్‌క్లాసులో మధువనానికి వెళ్లారు. వారికి పైల్స్ జబ్బు కూడా ఉండేది. మీటింగ్‌లో డాక్టర్ అనిలా(బొంబాయి రమేష్‌భాయ్ సోదరి) కూడా వచ్చి ఉండినారు. వారు దీదీని చూచి దీదీకి డయాబెటిస్ ఉందని అనిపిస్తా ఉంది అని చెప్పారు. దీదీని చెకింగ్ కొరకు బొంబాయి తీసుకెళ్లారు. పరీక్షలో షుగర్ 400 కంటే ఎక్కువగా ఉందని తేలింది. అక్కడ మందులతో షుగర్ తగ్గించి పైల్స్ ఆపరేషన్ కూడా చేశారు. ఆ తర్వాత దీదీ బొంబాయిలో చాలా సెంటర్లలో క్లాసులు చేశారు. అది వేసవికాలము. చాలా వేడిగా ఉండేది, దీదీ తల వేడెక్కింది. దాని వలన శరీరములోని నరాలు లాగుతూ ఉండేవి. ఎన్ని



మందులిచ్చినా వేడి తగ్గలేదు. అప్పుడు శీల్‌దాదీ బాబా వద్దకు సందేశము తీసుకెళ్లి చంద్రమణి దాదీకి చాలా కష్టముగా ఉందని చెప్పారు, అందుకు బాబా - బచ్చీ, ఆమెకు నేను వతనములో మందు తయారు చేస్తున్నాను అని చెప్పారు. తర్వాత పెద్ద దాదీ అక్కడకు వచ్చారు. అలోపతి, హోమియోపతి, ఆయుర్వేదిక్ - ముగ్గురు డాక్టర్లు అక్కడ కలిశారు. అందరూ ఒకరినొకరు సంప్రదించి మందులిచ్చారు. అప్పుడు వారి ఆరోగ్యము కుదుట పడసాగింది. అక్కడ నుండి వారు మొదటిసారి విమానములో అమృతసర్‌కు వచ్చారు. వారిని ఆహ్లాదపరచాలి, నవ్వించాలి, వారు ఎక్కువగా బుద్ధిని ఉపయోగించే పని చేయరాదు అని చెప్పారు. ఆ రోజుల్లో నేను వారికి పూర్తిగా సేవ చేయడం ప్రారంభించాను. అంతకుముందు మరొక సోదరి ఉండేది. ఆమెకు జబ్బు చేసినందున దీదీ సేవ చేసేందుకు నేను ఉండవలసి వచ్చింది. జనవరి 1976 నుండి నేను వారి వద్దనే సదా ఉండసాగాను. సుమారు 7 మాసాలు వారు ప్రతిరోజు మందులు తీసుకోవలసి వచ్చింది. ఆ తర్వాత వారు మామూలు ఆరోగ్యవంతులుగా అయ్యారు. కాని షుగర్ కొరకు మందు తీసుకోవలసి వచ్చేది. 1976 తర్వాత తీపి పదార్థాలు, అన్నము పూర్తిగా మానేశారు. వారికి తీపి అంటే చాలా ఇష్టము. వారు టీ కూడా చాలా తియ్యగా త్రాగేవారు. కాని డాక్టర్ వద్దన్న తర్వాత వారు తీపును చివరి వరకు పూర్తిగా మానేశారు. వారు పథ్యము చాలా స్ట్రిక్ట్‌గా పాటించేవారు.

దీదీ పంజాబు జోనును సంభాళించేవారు. దానితో పాటు ఇండోర్ జోనును, హృదయపుష్ప దాది శరీరము వదలిన తర్వాత కర్నాటక జోనును కూడా చూసేవారు. వీటితో పాటు జ్ఞాన సరోవరము కూడా సంభాళించేవారు. ఇన్ని బాధ్యతలున్నా దీదీకి అధ్యయనము చేయడం చాలా ఇష్టము. కొద్దిగా తీరిక లభించినా అవ్యక్త మురళీని స్టడీ చేసేవారు. మధువనములో ఉంటే నన్ను లిటరేచర్ కౌంటరుకు పంపి ఏదైనా క్రొత్త లిటరేచర్ ఉంటే తీసుకు రమ్మని చెప్పేవారు. దీదీ పుస్తకాలు చదివేవారు.

వారికి అందరి పట్ల చాలా శుభ భావనలుండేవి. ఎవరిని గురించి ఏదైనా విన్నా అది మనసులో ఉంచుకునేవారు కాదు. ఈ ఆత్మ ఇటువంటిదని తెలిసినా, వారిని ఆ దృష్టితో చూచేవారు కాదు. ఈ రోజు కాకుంటే రేపు

మారిపోతారని భావించేవారు. వారి భావన అనుసారమే వారు మారిపోయేవారు. ప్రతి వ్యక్తికీ పరివర్తనయ్యే సమయము తప్పక వస్తుందని అనేవారు. ఎవ్వరైనా వారి గదిలోకి సహజంగా వెళ్ళేవారు. వారు అందరి మనసులనూ జయించారు. ప్రతి ఒక్కరు దీదీని తమవారుగా భావించి, అధికారముతో వారిని కలిసేవారు.

పంజాబు జోనులో ఒకసారి ఒక కొత్త సెంటరు ప్రారంభోత్సవ కార్యక్రమము జరిగింది. పంజాబు వారంతా అక్కడ కలిశారు. చాలా బాగా రెడీ చేశారు. దీదీగారే ప్రారంభము చేయాల్సి ఉండినది. అప్పుడే పెద్ద దాదీ నుండి, దీదీని కటక్ వెళ్ళమని, విశేష సేవ ఉందని, ప్రారంభోత్సవము గుల్జార్ దాదీ చేస్తారని ఫోన్ వచ్చింది. సోదరీ-సోదరులందరూ దీదీతో - " దీదీ ప్రారంభోత్సవమైన తర్వాత వెళ్తానని దాదీకి చెప్పండి" అని చెప్పారు. అప్పుడు దీదీ, "దాదీ చెప్పారు కనుక నేను కటక్ వెళ్తాను, ఎందుకంటే ఇంత ప్రోగ్రాము ఉందని దాదీకి తెలిసి కూడా చెప్పారంటే ఏదో చాలా ముఖ్యమైన పని ఉందని అర్థము కనుక నేను అక్కడకే వెళ్తాను" అని చెప్పారు. ఈ విధంగా దాదీగారి ఆదేశాల పట్ల వారి మనసులో చాలా గౌరవముండేది. ఎక్కడైనా పరిస్థితి నాజూకుగా ఉండినా, ఏదైనా కఠిన పరిస్థితి ఎదురైనా సాకార బాబా కూడా వీరినే పంపేవారు. తర్వాత దాదీగారు కూడా వీరినే పంపేవారు.

దీదీలో తీర్పు చెప్పే శక్తి చాలా ఉండేది. వారి నిర్ణయము అందరికీ ఇష్టమయ్యేది. అందుకే పంజాబు జోన్‌లో సెంటర్ల సమస్యలు చాలా తక్కువ. ప్రతి జాబుకు వెంటనే జవాబు వ్రాసేవారు. ఎవరి జాబు వచ్చినా అందులో ముఖ్యమైన విషయమేదీ లేకున్నా వెంటనే " విజయా, వారికి జవాబు వ్రాయి లేకుంటే నా జాబు దీదీకి చేరిందో లేదో అని అనుకుంటారు, వారికి జవాబు లభిస్తే బలము లభిస్తుంది" అని అనేవారు. అలాగే జరిగేది. జోనునంతా మేము పోస్ట్ ద్వారానే సంభాళించేవారము. వారి జాబులోని మొదటి వాక్యము చదువుతూనే సోదరీలు సంతోషపడేవారు. వారికి శక్తి లభించేది.

ప్రశ్న:- జాబులు వ్రాయడం ఎలా ప్రారంభించేవారో కొన్ని శబ్దాలు తెలపండి.

జవాబు:- " బాప్‌దాదా గారి అతిప్రియమైన, మధురాతి మధురమైన, అతి స్నేహి, సేవాధారి అయిన ఫలానా సోదరీ, మరియు సేవలో సాథీలైన సోదరీ-సోదరులకు, మధువన తపోభూమి నుండి దాదీగారి సహితము దైవీ



సోదరి చంద్రమణి మధురస్మృతులు స్వీకరించండి.

తర్వాత సమాచారము ఏమంటే మీ ఉత్తరము లభించింది, సమాచారమంతా తెలిసింది, చాలా సంతోషము కలిగింది......" అని వ్రాయించేవారు.

చివర్లో "మీరు బాప్‌దాదాగారి ఆశలను పూర్తి చేస్తారని ఆశిస్తున్నాను. మీ దైవీ సోదరి చంద్రమణి" అని వ్రాయించేవారు. చాలాసార్లు నేను క్లాసులో కూర్చునే వ్రాయవలసి వచ్చేది. ఏదైనా వేరే కారణము వలననో, ఉత్తరాలు వ్రాయుట కొరకో క్లాసుకు పోకుంటే " విజయా, నీవు మురళి క్లాసుకు ఎందుకు రాలేదు?" అని అడిగేవారు. ఆ పని మీద ఉండిపోయానని చెప్పేదానిని. ఆ పని మురళి సమయములోనే చేయడం అవసరమా? కానే కాదు. మురళి సమయములో మురళి విను, సేవ సమయములో సేవ చెయ్యి అని చెప్పేవారు. జ్ఞాన-యోగాల విషయములో దీదీ చాలా స్ట్రిక్ట్‌గా ఉండేవారు.

ప్రశ్న:- ముఖ్యముగా మీరు ఏ సేవ చేసేవారు?

జవాబు:- నాకు దీదీగారి పోస్ట్ సేవ, దుస్తులు ఏర్పాటు చేసే సేవ, మందులిచ్చే సేవ, టూరు వెళ్ళినప్పుడు వారి జతలో ఉండు సేవ చేసేదానిని. చాలా సార్లు వారు తమ పళ్ళెమును వారే కడుక్కునేవారు. అల్మైరా నుండి దుస్తులు కూడా వారే తీసుకునేవారు.

దీది ఇలా చెప్పేవారు - భలే సేవ బాగా చెయ్యండి కాని చదువు పై కూడా అంత గమనము పెట్టండి. చదువు మరియు సేవ రెండిటి బ్యాలెన్స్ తప్పకుండా ఉంచాలి. ప్రతి ఒక్కరి పై వారికి చాలా గట్టి నమ్మకముండేది. నీ వద్ద ఎంత డబ్బు ఉంది? అని వారు నన్నెప్పుడూ అడగలేదు. కేవలం వారు అక్కడ ఇంత ఇవ్వాలి, ఇక్కడ ఇంత ఇవ్వాలి అని నాకు డైరక్షన్ ఇచ్చేవారు. 1983వ సంవత్సరంలో వారు జాయింట్ చీఫ్ అయినప్పటి నుండి, ఎక్కడ నుండి ఎంత వచ్చినా వెంటనే దాదీగారికి చూపించేవారు. మేము టూర్‌కు ఎక్కడకు వెళ్ళినా, బహుమతులు(సౌగాత్‌లు) చాలా లభించేవి. ఎన్ని లభిస్తే వాటన్నిటిని మధువనములో దాదీగారికి ఇవ్వమని చెప్పేవారు. స్వయం ఉపయోగించేవారు కాదు, దాదీగారికి అప్పజెప్పేవారు. యజ్ఞము పట్ల, తమ సేవా సాథీల పట్ల కూడా వారికి చాలా విశ్వాసముండేది.

ప్రశ్న:- ఒ. ఆర్.సి లో మీరు ఏ సేవ చేసేవారు?

జవాబు :- ఆశా బహన్‌కు సహయోగిని, భండారాన్ని సంభాళిస్తున్నాను.

## బ్రహ్మాకుమార్ జగదీష్‌చంద్ర గారు దాదీ చంద్రమణి గారి పట్ల తమ ప్రణామాలను, శ్రద్ధా పుష్పాలను ఈ విధంగా సమర్పిస్తున్నారు

దాదీ చంద్రమణిగారికి మరియు ఇతర దివ్యమైన అలౌకిక శక్తులు, దివ్య గుణాలు కలిగిన వ్యక్తులకు(మహాన్ విభూతి) మా ప్రణామాలు.

పరమపిత పరమాత్మ ప్రజాపిత బ్రహ్మా ద్వారా ఏదైతే అశ్వమేధ అవినాశి జ్ఞాన యజ్ఞాన్ని స్థాపన చేశారో అందులో చాలామంది ప్రభు ప్రేమి మరియు సాహసము గల ఆత్మలు తమ శరీరాన్ని, మనసును, ధనమును సర్వస్వాన్ని సమర్పించారు. వారు ప్రభువు ప్రేమలో అనేక కష్టాలను సహించారు. విరోధులను ఎదుర్కున్నారు. అశ్లీల అట్టహాసాలను(వికారీ నవ్వులను), కటువైన కామెంట్లను (వ్యాఖ్యలను) సహించారు. ఈశ్వరీయ చదువును అధ్యయనము చేసేందులో పూర్తి గమనముంచారు. కఠినమైన, కఠోరమైన సేవలను కూడ మనస్ఫూర్తిగా చేశారు. యోగీ జీవితములోని నియమాలను సంతోషంగా పాలన చేశారు. వారికి లభించిన ఈశ్వరాజ్ఞలను, ఎక్కడ ఎలాంటి సేవలనైనా, ఏ పరిస్థితిలోనైనా ఎటువంటి సాధనాలిచ్చి, ఎక్కడకు పంపినా, వారు వాటిని సత్యమైన హృదయముతో, సమర్పిత సేవా భావముతో సౌభాగ్యముగా భావించి ఆహ్వానించారు. వారు ఎవ్వరికీ సమస్యా రూపముగా అవ్వలేదు కాని సమాధాన పరచేవారుగా అయ్యారు. సాధారణ జీవితాన్ని జీవిస్తూ ఇతరులకు ప్రేరణ కలిగించేవారుగా, ఉదాహరణమూర్తులుగా ఉండినారు. ఇతరులకు దు:ఖము కలిగించే పనిని గాని, ఇతరులకు అకళ్యాణము జరిగే పనిని గాని, కోరికలకు, తృష్ణలకు వశమై ఇతరులతో ఈర్ష్య-ద్వేషాలు గల జీవితాన్ని గాని, ఇతరులకు సరిపోని జీవితాన్ని గాని జీవించలేదు. ఈశ్వరీయ విశ్వవిద్యాలయము యొక్క ఉజ్వల స్థితిని మసక పరిచే కర్మను చేశారని వారిని గురించి ఎవ్వరూ చెప్పలేరు. వారికి కీర్తి ప్రతిష్ఠలు కావాలనే వాంఛ గాని, కోరిక గాని లేదు. వారు సదా తమకంటే పెద్దవారిని గౌరవించారు, తోటివారితో కలిసి మెలిసి ఉండినారు, తమకంటే చిన్నవారిని వారి ప్రేమలో తడిపారు. వారికి ఎవ్వరి పట్ల ఆకర్షణ



లేదు, ఎవ్వరికీ తల వంచలేదు. భండారము నిండుగా ఉండినా వారి చేతులు ఖాళీగానే ఉండినాయి. వారు అందరినీ ముందుకు నడిపించి వారిని పెద్ద పెద్ద బాధ్యతలను నిభాయించేందుకు యోగ్యులుగా తయారుచేశారు. అందరినీ స్నేహ సూత్రములో కూర్చారు. సంఘటనను దృఢంగా చేసి అథక్ సేవ చేశారు.

ఈశ్వరీయ యజ్ఞములో ఇటువంటి దివ్యమైన అలౌకిక శక్తులు, దివ్యగుణాలు కలిగిన మహోన్నత వ్యక్తులలో 11 మార్చి 1997వ సంవత్సరములో భౌతిక దేహమును విసర్జించిన చంద్రమణి దాదిగారి పేరు కూడ గణనీయమైన వ్యక్తుల సూచికలో, యశో పట్టికలో (Board Of Honour) ఒక ఉన్నతమైన స్థానములో ఉంటుంది.

అలాగే సరళతకు నమూనా అయిన విశ్వకిశోర్ భాయి కూడా ఆ పట్టికలోకి వస్తారు. వారు త్యాగానికి చైతన్యమైన ప్రతిమూర్తిగా ఉండినారు. వారి సమర్పిత జీవితము, వారి నమ్రత, నిశ్చయము, సమర్పణా భావము అంధకారంలో ప్రకాశము ఇచ్చేదిగా ఉండినది.

మన్మోహినీ దీదీగారి విశేషతలు కూడా తక్కువైనవి కావు. ఏ కార్యము అయినా ప్రణాళిక అనుసారముగా చేసేవారు, పరిపాలనా దక్షులు, స్నేహ నియమాల(లవ్ అండ్ లా) సంతులన ఉంచేవారు, విద్యార్థి జీవితములో చురుకైనవారు, నియమ మర్యాదలను పాలించి పాలింప చేయడంలో సఫలమైనవారు, దూరదర్శకులు, నీతి నిపుణులు - ఇవన్నీ వారి విశేషతలు.

మాతేశ్వరి సరస్వతిగారు సర్వ గుణాలలో శిరోమణి, జగదంబ, దివ్యతా భండారముగా ఉండేవారు. వారి మాటలే వీణా నాదముగా ఉండేవి. వారి జ్ఞాన స్వరాలను వినేవారి పాపతాపాలను నిర్మూలించేవి. వారి శబ్ధాలు ఆంతరిక మనోద్వారాలను తెరిచేవిగా ఉండేవి. వారు విద్య రూపీ వరదానము ద్వారా నరుని నుండి నారాయణునిగా అయ్యే జ్ఞాపకాలను - బుద్ధిని కలుగజేసి భాగ్యశాలురుగా తయారుచేసేవిగా ఉండేవి.

బ్రిజేంద్రదాది, సంతరీదాది, హృదయపుష్ప దాది, గుల్‌జార్ మోహినీ దాది(మిట్టు దాది) మొదలైనవారు అనేక మహోన్నత గుణాలను కలిగి ఉండినారు. ఒకరు కర్ణాటకలో మరొకరు పంజాబ్, హర్యానాలో జనులను

జాగృతము చేసేందుకు అపారమైన సేవ చేశారు. వారు కూడా సదా హర్షితముగా ఉండు గుణమూర్తులుగా, సుగంధభరితమైన పుష్పాలుగా ఉండేవారు. యజ్ఞములో అటువంటి దివ్యశక్తులు, దివ్య గుణాలు కలిగిన మహోన్నతమైన వ్యక్తులు ఎందరో ఉన్నారు. అందరూ అగ్రగణ్యులుగా, ఈ భువికి శృంగారముగా ఉండినారు. బ్రిజేంద్ర దాది, సంతరీదాదీల పాత్రలు సాటిలేనివి. ఇరువురూ వారి స్థానాలలో అద్భుతమైనవారు. ఈ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి వీరు మరియు ఇతర అనేక మంది దివ్య అలౌకిక వ్యక్తులు మనందరి గౌరవానికి పునాది రాళ్లుగా ఉండినారు. ప్రపంచమంతటా వెతికినా ఇటువంటి యోగులు, తపస్వీలు, నిర్మలమైన వారు, స్నేహశీలురు, గుణవంతులు ఎక్కడా లభించరు. మనము వీరి వంశంలో ఉండడం మన పరమ సౌభాగ్యము. వీరు మన కుటుంబానికే చెందిన శిరోమణులు. వీరి స్మృతులు సదా మన మనసు పై చిత్రితమై ఉంటాయి.

మనము చూస్తుండగానే ఈ ఫరిస్తాలు ఒక్కొక్కరే ఎగిరి వెళ్ళిపోయారు. ఇంకా వెళ్లిపోతూ మరొక సేవలో తత్పరులౌతూ పోతున్నారు. ఈ వరదాని ఆత్మలు మనలను వదలి వెళ్లిపోతున్నారని అనిపించడం లేదా ? జీవితంలో ఏదో ఒక విశేషమైన, అమూల్యమైన ధనము నుండి మనము వంచితం అవుతున్నామని అనుభవం అవ్వడం లేదా? ఇప్పుడు మధువనానికి వెళ్తే ఈ కనులు వారిని వెతకవా? నిస్సందేహంగా. శివబాబా ఏమో మన జతలోనే ఉన్నారు, బ్రహ్మాబాబా చేయి కూడా మన పై ఉంది. అంతేకాక మహాదానులు, వరదానులు, కళ్యాణకారులైన కొంతమంది దాదీలు కూడా మన సంతోషానికి సాధనాలుగా ఉన్నారు. అయినప్పటికీ కొంత విచిత్రమైన శూన్యత(అభావము) కనిపించడం లేదా? ఏ నేత్రాలైతే ప్రజాపిత బ్రహ్మాగారి అద్వితీయమైన శోభను తదేకంగా చూచి సుఖము పొందుకున్నాయో, జగదంబ సరస్వతిగారిని రెప్ప వేయకుండా చూచాయో, ఈ యజ్ఞములోని ఇతర దివ్య శక్తులు, దివ్య గుణాలు గల మహోన్నత వ్యక్తుల మాటలు విని, కర్తవ్యమును చూచారో వారి సాంగత్య సుఖమును పొందుకున్నారో, నా వంటి బాలబుద్ధి గలవారు వీరంతా నన్ను ఒంటరిగా వదిలి వెళ్లిపోతున్నారని అనుభవము చేయడం లేదా ?

కాని నిరంతరము కదులుతూ ఉన్న విశ్వ నాటకములోని ఘటనా క్రమమును ఎవరు ఆపగలరు? మనకంటే పెద్దవారు, చాలా గొప్ప మహిమ



గల సోదరీ-సోదరులు ఇక్కడ తమ పాత్ర ముగించుకొని ఇతర సేవా క్షేత్రాలలో సేవ చేసేందుకు వెళ్తూ ఉన్నారు. మన వంతు కూడా వస్తుంది. ఇంటికి వెళ్లేందుకు టికెట్టు తీసుకునే లైనులో మనమంతా ఉన్నాము. పోను పోను అకస్మాత్తుగా ఏమవుతుందో చూడండి. ఇప్పుడు వెళ్లేందుకు ఎవర్‌రెడీ గంట మ్రోగుతూ ఉంది. కనుక లేవండి, సామాను సర్దుకోండి. ఇప్పుడు అన్ని జంజాటాలు వదిలేయండి. మనము వింటున్నామా లేక వినడం కూడా లేదా? పోవాలా లేక ఇక్కడే ఉండిపోవాలా? దాది చంద్రమణి గారేమో అక్కడికి చేరుకొని అక్కడ నుండి ఎవర్‌రెడీ(సదా సిద్ధంగా) అచానక్(అకస్మాత్తు)ల లైనును స్పష్టముగా ఇచ్చేశారు.

దాదీ చంద్రమణిగారు తమ వెంట ఏమి తీసుకెళ్ళారు, ఇక్కడ ఏమి వదిలి వెళ్ళారు? పార్థివ శరీరమైతే పంచ తత్వాలలో కలిసిపోయింది. అది తత్వాలను ప్రభావితం చేస్తుంది. వారు తమ వెనుక తమ మహోన్నత కార్యాల స్మృతి-చిహ్నమును వదిలి వెళ్ళారు. ఆ ఆకర్షణ కారణంగానే ఇంతమంది తాము ప్రయాణము చేయడంలో ఉన్న కష్టాలను కూడా ఆలోచించక ఏదో ఒక విధంగా వచ్చి చేరుకొని వారి గొప్పతనాన్ని వర్ణిస్తున్నారు. చంద్రమణిదాది గారు చేసిన సేవలు, అందరికీ వారిచ్చిన సుఖము ఎటువంటివనగా వారు రాకుండా ఉండలేకపోయారు, ఆకర్షింపబడి వచ్చేశారు. వారు తమ వెంట తమ శ్రేష్ఠ సంపాదనను తీసుకెళ్ళారు. వారు జమ చేసుకున్న గుణ రత్నాలను, చేసిన యోగ తపస్సులు అనే అమూల్యమైన ధనాన్ని తమ వెంట తీసుకెళ్ళారు. పోవునప్పుడు వారు సంతుష్టతా సర్టిఫికెట్‌ను కూడా తమ వెంట తీసుకెళ్ళారు. ఈ విధంగా దూరదేశానికి ప్రయాణము చేయు యాత్రికులకు ఇంతకంటే ఏమి కావాలి?

ఫలము పక్వము అవుతూనే అది వృక్షము నుండి దానంతట అదే వేరైపోతుంది. ఇతర సేవలలో ఉపయోగపడుతుంది. పుష్పాలలో పూర్తి నిర్మలత్వం వచ్చి అది పూర్తిగా వికసించి మందహాసం చేస్తుంటే తోటమాలి దానిని గమనించి ఆ పుష్పాన్ని వేరే పనికి ఉపయోగిస్తాడు. అదే విధంగా చంద్రమణి దాది మరియు ఇతర గొప్ప దైవీ గుణాలు కలిగిన వ్యక్తులు కూడ ఇతర సేవలకై వెళ్ళారు. ఈశ్వరీయ యజ్ఞములోని ఆ పుష్పాలకు, ఫలాలకు మా ప్రణామాలు. వారికే కాక ఇతర అలౌకిక దివ్య శక్తులు గల మహోన్నతమైన వ్యక్తులకు కూడా అనేక సార్లు మా ప్రణామాలు.